# రాజనీతి శాస్త్రం

## రాజనీతి సిద్ధాంతం - భావాలు

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

# కోర్సుటీము

**COURSE DEVELOPMENT TEAM**

**సంపాదకులు**

ప్రొఫెసర్ ఎ. ప్రసన్నకుమార్

**సహ సంపాదకులు**

డా. టి.యస్. మోహన

**రచయితలు**

డా. యమ్. సత్యనారాయణ రావు

డా. ఎస్. పోలినాయుడు

డా. ఐ. దోసగిరిరావు

పి.ఎల్.పి. రాజు

డా. బి.ఎస్.ఆర్. ఆంజనేయులు

**ముఖచిత్రం & గ్రాఫిక్స్**

చంద్ర

**COURSE REVISION TEAM**

**సంపాదకులు**

ప్రొఫెసర్ ఎ. ప్రసన్నకుమార్

**సహ సంపాదకులు**

డా. టి.యస్. మోహన

**రచయితలు**

డా॥ బి.యస్.ఆర్. ఆంజనేయులు

డా॥ యస్. పోలినాయుడు

డా॥ ఐ. దోసగిరి రావు

**ముఖచిత్రం & గ్రాఫిక్స్**

యం. రమేష్

114983
19-4-05
320
RAJ

**డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం**
**హైదరాబాద్.**

ప్రథమ ప్రచురణ - 1984
ద్వితీయ ప్రచురణ - 2002 ' **2004**

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 114983
Date 19/4/05
Call No. 320 RAJ

BRAOU

కాపీరైట్ © డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

అన్ని హక్కులూ విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలోని ఏ భాగమైనా ఉపయోగించ దలచుకుంటే విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఈ పాఠ్య ప్రణాళిక మొత్తం వివరాలు, ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు : డైరక్టర్ (అకాడమిక్) డా॥బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
రోడ్ నెం. 46, జూబ్లి హిల్స్, హైదరాబాదు - 500 033.

Lr. No.705/Dr. BRAOU/DMP/PTG/F.No.05/J.O.206/2004-2005 - Dt.14-7-04/No. of Copies 24,200

*Printed at : M/s. Mahalakshmi Graphics, Kukatpally, Hyderabad. Ph: 23077952*

# పీఠిక

ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయం వారిచే నొసంగబడు బి.ఎ. కోర్సు ద్వితీయ సంవత్సరం పాఠ్య ప్రణాళికలో పొందుపరచిన రాజనీతి సిద్ధాంతం - భావాలు అనే విషయాలను గూర్చి వివరిస్తుంది. సాధారణంగా ఈ విషయాలు త్రైవార్షిక డిగ్రీ కోర్సుకు సంబంధించిన ద్వితీయ సంవత్సరంలో అధ్యయనం చేసే రాజనీతిశాస్త్ర అంతర్విషయాలు గూర్చి వివరిస్తుంది. సౌలభ్యం కోసం పాఠ్యప్రణాళిక ఖండాలుగా, ఖండాలు భాగాలుగా విభజించబడినవి. ప్రతిఖండం సాధారణంగా ఒక ప్రత్యేక విషయాంశ చర్చకు ఉద్దేశించబడింది. విద్యార్థి భాగాలను చదివి అర్థం చేసుకోవడంలో ఎలాంటి కష్టం కలుగకుండా భాగాలకు నియమానుసారంగా ప్రత్యేక నిపుణులచే తయారు చేయబడ్డాయి. ప్రతిభాగం దాని లక్ష్యాలు, సార సంగ్రహంతో ప్రారంభించబడి విద్యార్థి విషయావగాహనను పరీక్షించే అభ్యాసాలతో ముగుస్తుంది.

రాజనీతి సిద్ధాంతం మరియు భావాల అధ్యయనానికి చాలా ప్రాముఖ్యం ఉంది. దీనికి గ్రీకు కాలం నుండి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. రాజకీయాలను క్రమబద్ధంగా అధ్యయనం చేసిన అరిస్టాటిల్, రాజనీతి శాస్త్ర పితామహుడుగా పిలవబడ్డాడు. అందువల్ల దీని అధ్యయనం పురాతనమైనది. దీని అభివృద్ధికి ఎంతోమంది తత్త్వవేత్తలు విశేషమైన కృషి జరిపారు. రాజనీతి సిద్ధాంతం గత రెండువందల సంవత్సరాలలో చెప్పుకోదగ్గవిధంగా విస్తరించింది. 18, 19వ శతాబ్దాలలో ఐరోపా మరియు ప్రపంచంలోని ఇతర ప్రదేశాలలో సంభవించిన విప్లవాత్మకమైన మార్పులు, 20వ శతాబ్దంలో సమస్త మానవాళిని కలచివేసిన రెండు ప్రపంచయుద్ధాలు గత యాభైఏడు సంవత్సరాల కాలంలో పరిణమించిన బ్రహ్మాండమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక మార్పులు అనేవి రాజనీతి సిద్ధాంతంపై తమ ప్రభావాన్ని కలుగచేసాయి. దీనిపై శాస్త్రీయ, సాంకేతిక ప్రగతి యొక్క ప్రభావం కూడా తక్కువేమీ లేదు. ఇవన్ని రాజనీతి సిద్ధాంత, భావాల అధ్యయనాన్ని సంక్లిష్టపరిచాయి.

ఈ భాగాల యొక్క ముఖ్యోద్దేశం, విజ్ఞాన సముదాయంలో ప్రత్యేకతను సంతరించుకున్న రాజనీతిశాస్త్ర పరిణామాన్ని, రాజకీయ సిద్ధాంతం, భావాల అధ్యయన ప్రాముఖ్యతను విద్యార్థి సులభంగా అవగాహన చేసుకునేటట్లు చూడటం.

విద్యార్థికి సౌలభ్యంగా ఉండే విధంగా ఈ అధ్యయనాన్ని ఐదు ప్రధాన ఖండాలుగా ఈ ఖండాలను 24 భాగాలుగా విభజించబడింది. ఇందులోని ప్రతిఖండం కూడా విషయం అధ్యయనంలోని అతిముఖ్యాంశాలను వివరిస్తుంది. ఇది రాజనీతి శాస్త్రాన్ని నిర్వచించడం మొదలుకొని న్యాయశాఖ విధుల వరకు గల రాజనీతిసిద్ధాంతం, భావాలకు సంబంధించిన వివిధ అంశాలను గురించి విపులంగా చర్చింబడింది.

ఇందులోని మొదటిఖండం రాజనీతిశాస్త్ర సూత్రాలను, దాని అధ్యయనానికి గల వివిధ దృక్పథాలను గూర్చి వివరిస్తుంది. ఇంతకు పూర్వమే పేర్కొన్నట్లు, ప్రాచీన గ్రీకు కాలంనాటి ప్లాటో, అరిస్టాటిల్ దృక్పథాలతో మొదలుకొని ఆ దృక్పథాలను, వాటి తరువాతి ఆధునిక దృక్పథాలతో సరిపోల్చుకొని మనం అధ్యయనం చేయవలసియుంటుంది.

రెండవ ఖండం రాజనీతిశాస్త్ర ఇతర ప్రాథమిక భావనలైన రాజ్యం - సమాజం, రాజ్యం-సార్వభౌమాధికారం (ఏకస్వామ్యం, బహుస్వామ్యం) రాజ్యావిర్భావం మొదలైన అంశాల గూర్చి వివరించడానికి ప్రయత్నిస్తుంది. ఇది అతి ప్రాముఖ్యం గల సిద్ధాంతాలైన దైవదత్తాధికారం, సామాజిక ఒడంబడిక, చారిత్రక

సిద్ధాంతాలను గూర్చి చర్చిస్తుంది. భారతీయ సిద్ధాంతాలను గూర్చి ముఖ్యంగా ఆధునిక భారత తత్త్వవేత్తలైన వివేకానంద, అరబిందో, గాంధీల విశిష్ఠసేవలను గూర్చి కూడ వివరించడమైంది. ఈ ఖండంలో వ్యక్తిశ్రేయోవాద, మార్క్సిస్టు, సంక్షేమ రాజ్య సిద్ధాంతాల్లాంటి రాజ్యం విధుల సిద్ధాంతాలను కూడా చర్చిండబడింది.

రాజనీతిశాస్త్రంలో ఇతర భావనలైన చట్టం, స్వేచ్ఛ, హక్కులు, న్యాయం, స్వేచ్ఛకు సంబంధించిన వివిధ అభిప్రాయాలను మూడవ ఖండంలో ప్రత్యేక దృష్టితో పరిశీలించబడినవి. ఇందులో వీటిని సమకాలీన దృష్టితో పరిశీలించబడినవి. ఈ ఖండం ఉద్దేశం విద్యార్థి వివిధ భావాలలో మరియు సిద్ధాంతాలలో యున్న అతిసూక్ష్మమైన వ్యత్యాసాలను అవగాహన చేసుకొనుటకు సహాయపడడమే.

నాలుగవ ఖండంలో ప్రభుత్వ స్వరూపాలను, సాంప్రదాయక ఆధునిక వర్గీకరణలు గూర్చి చర్చించబడినది. ఇందులో అధికారయుత మరియు ఏకపక్ష ప్రభుత్వ స్వరూపాల, పార్లమెంటరీ, అధ్యక్షతరహా పద్ధతి ప్రభుత్వాలకు గల భేదాన్ని తెలియచేయబడింది. ఈ ఖండంలో చర్చించబడిన ఇతరాంశాలలో సమాఖ్య రాజ్యస్వభావం, కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ముఖ్యమైనవి.

ఐదవఖండంలో మాంటెస్క్యూ అధికారాల విభజనతో మొదలుకొని ఏకసభ, ద్విసభలు ప్రభుత్వ మూడు అంగాలను గూర్చి వివరిస్తుంది. ఈ ఖండంలో శాసనసభ, ప్రాతినిధ్య పద్ధతులు ఎగువ దిగువసభల పాత్రలను మరియు కార్యనిర్వాహకవర్గం అధికారాలను గూర్చి కూడ వివరిస్తుంది. ఈ ఖండంలోని చివరభాగం న్యాయశాఖ ప్రాముఖ్యతను చర్చిస్తుంది.

ఈ విధంగా రాజనీతి సిద్ధాంతాల మరియు భావాల పరిణామాన్ని, ఆధునికయుగంలో వాటి ప్రాముఖ్యాన్ని గూర్చి ఈ అధ్యయనంలోని 24 భాగాలలో వివరించబడింది. విద్యార్థికి ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు గల రాజనీతిశాస్త్రాన్ని పాయలుగా చేసి అర్థంచేసుకోవడానికి సంగ్రహమైన వృక్షాన్ని కల్పించడమే దీని ఉద్దేశం.

ఈ పాఠ్యాంశాలు విద్యార్థికి రాజనీతిశాస్త్రంలోని ముఖ్యాంశాలతో పరిచయం ఏర్పరచి, సదవగాహన కల్గిస్తాయని, మా విశ్వవిద్యాలయం ఆశిస్తోంది.

B R A O U

# విషయసూచిక


| | | పుట నెం. |
|---|---|---|
| **ఖండం I** | మౌలికాంశాలు | 1 |
| భాగం-1 | రాజనీతి శాస్త్రం - నిర్వచనం పరిధి | 3 |
| భాగం-2 | రాజనీతి అధ్యయనం దృక్పథాలు - సాంప్రదాయ - ఆధునిక దృక్పథాలు | 9 |
| **ఖండం II** | రాజ్యం మరియు సమాజం | 15 |
| భాగం-3 | సమాజం మరియు రాజ్యం | 17 |
| భాగం-4 | సార్వభౌమాధికారం-రాజ్యలక్షణం-సార్వభౌమాధికారానికి సవాళ్ళు - ఏకత్వ, బహుత్వవాద సిద్ధాంతాలు | 22 |
| భాగం-5 | రాజ్యావతరణ సిద్ధాంతాలు - చారిత్రక, దైవదత్తాధికార, బలప్రయోగ, మాతృస్వామిక, పితృస్వామిక సిద్ధాంతాలు | 35 |
| భాగం-6 | రాజ్యావతరణ సిద్ధాంతాలు - సామాజిక ఒడంబడిక సిద్ధాంతం | 44 |
| భాగం-7 | రాజ్యావతరణ సిద్ధాంతాలు - భారతీయ సిద్ధాంతాలు | 56 |
| భాగం-8 | రాజ్యవిధుల సిద్ధాంతాలు | 64 |
| **ఖండం III** | ప్రాథమిక భావాలు | 75 |
| భాగం-9 | శాశనం | 77 |
| భాగం-10 | స్వేచ్ఛ మరియు సమానత్వం | 86 |
| భాగం-11 | వ్యక్తి శ్రేయోవాదుల, అధికారవాదుల, సామ్యవాదుల మరియు ఉదారవాదుల దృష్టిలో స్వేచ్ఛ | 99 |
| భాగం-12 | వ్యక్తి హక్కుల సిద్ధాంతాలు మరియు హక్కుల రకాలు | 105 |
| **ఖండం IV** | ప్రభుత్వ రకాలు | 113 |
| భాగం-13 | రాజ్యాంగాలు-రకాలు-సవరణ పద్ధతులు | 115 |
| భాగం-14 | ప్రభుత్వ రకాలు - రాజరిక్క, కులీన, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు | 127 |
| భాగం-15 | ఆధునిక ప్రభుత్వ రకాలు - సంపూర్ణ అధికారవాదం | 140 |




BRAOU

| | | |
|---|---|---|
| భాగం-16 | ఆధునిక ప్రభుత్వరూపాలు - ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామం | 151 |
| భాగం-17 | పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలు | 165 |
| భాగం-18 | సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వాలు | 176 |
| **ఖండం V** | ప్రభుత్వాంగాలు | 187 |
| భాగం-19 | అధికార పృథక్కరణ సిద్ధాంతం | 189 |
| భాగం-20 | శాశనసభ ప్రాతినిధ్య పద్ధతులు | 199 |
| భాగం-21 | ఏకశాశన సభ, ద్విశాసనసభ | 214 |
| భాగం-22 | శాసనసభ - విధులు | 225 |
| భాగం-23 | కార్యనిర్వాహక వర్గం | 238 |
| భాగం-24 | న్యాయశాఖ-విధులు | 251 |


BRAOU

# ఖండం:I

## మౌలికాంశాలు

BRAOU

BRAOU

# భాగం-1 : రాజనీతి శాస్త్రం - నిర్వచనం పరిధి

## విషయ సూచిక


1.0 లక్ష్యాలు

1.1 పరిచయం

1.2 రాజనీతి శాస్త్రం - స్వభావం, అర్థం, నిర్వచనం

1.3 రాజనీతి శాస్త్ర పరిధి

1.4 రాజనీతి శాస్త్ర ప్రాముఖ్యత

1.5 క్లుప్తంగా

1.6 చదువదగిన పుస్తకాలు

1.7 నమూనా ప్రశ్నలు


## 1.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- రాజనీతి / రాజకీయ జీవితం యొక్క స్థూల స్వభావాన్ని అర్థం చేసుకోగలరు.
- రాజనీతి స్వభావం, అర్థం, నిర్వచనాలను అవగాహన చేసుకొంటారు
- రాజనీతి శాస్త్ర పరిధి, ప్రాముఖ్యతలను గుర్తించగలరు.

BRAOU

## 1.1 పరిచయం

మానవుడు సంఘంలో (సమూహంలో) నివసిస్తాడు. అతను తన కుటుంబంతో, ఇరుగు పొరుగువారితో మిగిలిన మానవ సమూహాలతో కొన్ని సంబంధాలను కల్గి ఉంటాడు. ఏదో ఒక రూపంలో సామూహిక జీవనం (సమూహంలో జీవించడం) తప్పనిసరి అవుతుంది. ఇది వింతకాదు. అయితే అలా కలిసి జీవించడంలో ప్రయోజనాల స్పర్ధలు రావడం సహజం. అంతేకాక అవిధంగా మానవులు అనేక రకాలైన పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తుంది. సామూహిక జీవనం కొన్నిరకాలైన అవగాహనలను కోరుతుంది. సహకారం, సంఘర్షణ పరిష్కారం లేదా రాజీలాంటివి. మరోమాటలో చెప్పాలంటే, వారి సమస్యలను పరిష్కరించుకోవడానికి వారు తమను వ్యవస్థాపించుకోవాలి. అలా వ్యవస్థాపిత జీవిత విధానమే 'రాజ్యము' అని పిలువబడుతుంది. సమూహం మొత్తానికి (రాజ్యం) బదులుగా వ్యవహరించు సంస్థే ప్రభుత్వం. ఈ వ్యవస్థాపిత జీవన విధానం సక్రమంగా నడవడానికి ఉపయోగపడే నియమాలు, నిబంధనావళి, ప్రక్రియలనే శాసనాలని పిలుస్తాం. ఈ శాసనాల ధిక్కారం శిక్షార్హమౌతుంది. అలాంటి వ్యవస్థాపిత రాజనీతి/రాజకీయ జీవిత అధ్యయనం రాజనీతి శాస్త్రంగా పిలువబడుతుంది.

## 1.2 రాజనీతి శాస్త్రం - స్వభావం, అర్థం, నిర్వచనం

రాజనీతి శాస్త్ర స్వభావం, అర్థం, నిర్వచనాల్ని తెలుసుకొనే ముందు ఈ శాస్త్ర శీర్షిక గూర్చిన ప్రస్తావనను గమనించాలి. సాధారణంగా 'రాజనీతి/రాజకీయ' అనేపదం అటు సాంప్రదాయ యిటు వాస్తవిక అర్థాలలో వాడుకలో ఉంది. అయితే 'రాజనీతి', 'రాజనీతి శాస్త్రం'ల మధ్య తేడా ఏమిటి? సుప్రసిద్ధ బ్రిటిష్ చరిత్రకారుడు F.W. Maitland ఒకసారి యిలా అన్నాడు.

"రాజనీతి శాస్త్రం శీర్షిక క్రింద కొన్ని పరీక్షా ప్రశ్నలను చూసినప్పుడు నేను, ప్రశ్నలను చూసికాదు. వాటి శీర్షికను చూసి విచారిస్తాను. దీనిని బట్టి రాజనీతి శాస్త్రానికి ఆ పేరు ఆ తర్వాత కాలంలో వచ్చిందనీ, ఆపేరు సరిగాలేదని, అలాపేరు పెట్టడంలో కొందరు ఒకరకమైన అనుకరణను గూడా చూస్తారు. అలాగని రాజకీయానికి రాజనీతి శాస్త్రమనడంలో సమర్థనీయత లేదనికాదు.

Politics పదం ప్రాచీన గ్రీకు పదం - నగర రాజ్యమనే అర్థాన్నిచ్చే Polis అనేపదం నుంచీ, Polity అనేపదం ప్రభుత్వం లేదా రాజ్యాంగం అని అర్థాన్నిచ్చే Politica అన్న పదం నుంచీ వచ్చాయి. రాజనీతి/రాజకీయము, రాజ్యము మరియు ప్రభుత్వముల గూర్చి - రాజకీయతను పోషించులేక పాలించుటను గూర్చి అధ్యయనంగా పెంపొందెను. ప్రాచీన గ్రీకుల దృష్టిలో రాజనీతి అధ్యయనం అటు రాజ్యాన్ని గూర్చి సిద్ధాంతపరంగానే కాక యిటు వాస్తవిక విషయాలతో కూడా కలిసి ఉంటుంది. కాకపోతే రోమన్ పరిపాలన ప్రభావంతో ప్రభుత్వ పాత్ర ఎక్కువవడం మరియు ఆవిధంగా రాజనీతి అనగా ముఖ్యంగా ప్రభుత్వం గూర్చిన (రాజ్యమును గూర్చికూడా) అధ్యయనంగా ప్రసిద్ధి చెందింది.

విజ్ఞాన శాస్త్రాల ప్రభావం సాధారణంగా సాంఘిక శాస్త్రాలపైనా, ప్రత్యేకించి రాజనీతి శాస్త్రంపైన ఉండుట దృష్ట్యా, ఎప్పటి నుంచి రాజనీతి శాస్త్ర అధ్యయనంలో పరిశోధనా విధానపు ప్రశ్నలు వేయబడ్డాయో అప్పటి నుంచి రాజనీతి శాస్త్రం (Political Science) అనే నామకరణం ప్రసిద్ధి చెందింది. శాస్త్రీయ అధ్యయనపు వేళ్ళు/మూలాలు అరిస్టాటిల్ యొక్క తులనాత్మక పద్ధతిలో చూడబడ్డాయి. కొంత మంది Politics అనేపదాన్ని వాస్తవిక రాజకీయ విషయాలకు, సమస్యలకు సంబంధించి, Political Science అనే పదాన్ని రాజకీయ విషయ అధ్యయనానికి సంబంధించి వాడతారు. చాలమంది రాజనీతి శాస్త్రజ్ఞులు, విశ్లేషకులు 'రాజనీతి శాస్త్రం' అని పిలుచుటకే యిష్టపడతారు. మరో మాటల్లో చెప్పాలంటే Politics అంటే ఆచరణలోని రాజకీయము, Political Science అంటే సిద్ధాంత పరమైన రాజకీయము.

**రాజనీతి శాస్త్రం గూర్చి కొన్ని నిర్వచనాలు :**

"రాజ్యము యొక్క పునాదులను గూర్చి, ప్రభుత్వము యొక్క సూత్రముల గూర్చి అధ్యయనం చేయు సాంఘిక శాస్త్రంలోని భాగమే రాజనీతి శాస్త్రం" (Paul Janet)

"రాజనీతి శాస్త్రం గ్రీకులకు ఒక మునిసిపల్ శాస్త్రం, అయితే యీ విషయము సంఘంలోని కొందరు యిచ్చిన/చూపిన మార్గముకు, కొన్ని విషయాలలోనైనా విధేయులై ఉండుటను గూర్చి తెలుపుతుంది". (Sidgwick)

BRAOU

"రాజకీయము/రాజనీతి ఒక శాస్త్రంగా కన్న ఎక్కువగా ఒక కళగా ఉంటుంది మరియు అది రాజ్యము యొక్క వాస్తవిక పోకడలను లేక మార్గాలను గూర్చి తెలుపుతుంది. రాజనీతి శాస్త్రం, రాజ్యము పునాదుల గూర్చి, దాని ఆవశ్యక స్వభావం గూర్చి, దాని రూపాలు లేక వ్యక్తీకరణము (Manifestation) గూర్చి మరియు దీని అభివృద్ధి గూర్చి తెలుపుతుంది." (Bluntschli)

"రాజకీయ ఆర్థిక శాస్త్రం సంపద గూర్చి, జీవశాస్త్రం జీవము గూర్చి, బీజగణితము సంఖ్యల గూర్చి మరియు జామితి స్థానము (Space) మరియు ప్రవర్ధనము (Magnitude) ల గూర్చి తెల్పునట్లు, రాజనీతి శాస్త్రం ప్రభుత్వపు దృగ్విషయాల గూర్చి అన్వేషిస్తుంది". (Seeley)

పై నిర్వచనాలను సమన్వయ పరుస్తూ గార్నర్ ఇలా వ్రాస్తారు.

"రాజనీతి శాస్త్ర విషయం, వాటితో కలవనివి కాకపోయినప్పటికీ కుటుంబం, తెగ, జాతి మరియు ప్రైవేటు సంస్థల మరియు సమూహముల కన్న, ప్రత్యేకమైన/విశిష్టమైన భిన్న అంశాలు మరియు సంబంధాలు వున్న రాజ్యపు దృగ్విషయాల గూర్చి తెల్పుతుంది. క్లుప్తంగా, రాజనీతి శాస్త్రం రాజ్యంతో ప్రారంభమై రాజ్యంతో ముగుస్తుంది."

రాజకీయము రాజ్యము నడుపబడే విధానము గూర్చి, రాజనీతి శాస్త్రము, రాజ్యపు దృగ్విషయాల గూర్చి విశదీకరించు / వర్ణించు జ్ఞాన సముదాయము అని గూడా అతను అంటాడు. రాజకీయాలు / రాజకీయం వాస్తవిక రాజకీయ విషయాల నడకను తెల్పుతుంది. రాజకీయ/రాజనీతి శాస్త్రం ఒక వ్యవస్థాపక అధ్యయనము.

R.G. Gettel రాజనీతి శాస్త్రాన్ని "రాజ్యమును గూర్చిన శాస్త్రం"గా నిర్వచించారు. రాజ్యము ఒక వ్యవస్థీకరించబడిన రాజకీయ యూనిట్లను గూర్చి తెల్పుతుంది. అది వ్యవస్థీకరించబడిన సమాజముల భావనలు మరియు సంస్థల గూర్చి తెల్పుతుంది. E.C. Smith and A.J. Lurchar రాజనీతి శాస్త్రాన్ని "రాజ్యము మొత్తమును గూర్చిన సిద్ధాంతము, వ్యవస్థాపనము (Organisation) ప్రభుత్వము మరియు ఆచరణ గూర్చి తెల్పు సాంఘిక శాస్త్ర భాగము" అని నిర్వచించారు.

ఇప్పటి వరకు రాజనీతి శాస్త్రము, రాజ్యము మరియు ప్రభుత్వముల గూర్చిన అధ్యయనంగా తెలుపు నిర్వచనాలు పరీక్షించబడ్డాయి. కానీ 16వ శాతాబ్ది చివరి కాలం నుండి రాజనీతి శాస్త్రం క్రొత్త దృక్పధాన్ని తెచ్చుకొంది. ఈ విషయం, రాజనీతి శాస్త్ర ఆధునిక పోకడల గూర్చి చర్చించు, ముందు భాగంలో పరీక్షించబడుతుంది.

## 1.3 రాజనీతి శాస్త్ర పరిధి

రాజనీతి శాస్త్రము యొక్క పరిధిలను నిర్ణయించడం తేలిక కాదు. రాజకీయ ప్రక్రియ ఎంత గతిశీలమైనదో (Dynamic) దాని పరిధి కూడా అంతేగతిశీలమైనది. Willough by లాంటి రచయితలు రాజనీతి శాస్త్రము రాజ్యము - ప్రభుత్వము, శాసనాలుకు పరిమితమైనట్లు పరిగణిస్తారు. రాజనీతి శాస్త్ర పరిధిని అర్థం చేసుకోవడానికి అత్యుత్తమ మార్గం Gettel యొక్క మాటలు గుర్తుంచుకోవడం. అతను రాజనీతి శాస్త్రమును రాజ్యము గూర్చి అధ్యయనముగా నిర్వహించాడు. "రాజ్యమంటే (యిప్పటి వరకు) ఏమిటి అనే చారిత్రక అన్వేషణ, రాజ్యం (ప్రస్తుతం) ఏమిటి అనే విశ్లేషణాత్మక అధ్యయనం మరియు

BRAOU

రాజ్యమనేది ఎలా ఉండాలి అనే ఒక రాజనీతి (రాజకీయ మరియు నీతి సంబంధ) చర్చ". ఆవిధంగా రాజనీతి శాస్త్రం రాజకీయ జీవితపు సైద్ధాంతిక మరియు ఆచరణీయ అంశాల గూర్చిన అధ్యయనం, నిర్మితుల మరియు విధులకు సంబంధించిన పరిస్థితి గూర్చి, రాజకీయ సమాజంలోని యదార్థ ప్రక్రియల గూర్చి మరియు సమాజపు రాజకీయ, నీతిలకు సంబంధించిన లక్ష్యముల గూర్చి - అన్నింటిని గూర్చి తెల్పుతుంది. రాజనీతి శాస్త్ర అధ్యయనం సమగ్రమైనది మరియు అంతర విషయ (Interdisciplinary) మైనది గూడ.

20వ శతాబ్దిలో రాజనీతి శాస్త్రం రాజనీతి లేక భావాలలోకి వేళ్ళూనుకుంటున్న చాలా ముఖ్య మరియు క్రొత్త పోకడలను చూచింది. స్త్రీ (విమోచన) ఉద్యమం, మానవ హక్కుల ఉద్యమం, రాజకీయ వాస్తవాలను ఆధునికానంతర (Post Modern) పద్ధతిలో విశ్లేషించడం, క్రొత్తదైన మరియు పెరుగుతున్న ప్రభుత్వేతర సంస్థల పాత్ర మరియు అలాంటి యితర క్రొత్త పోకడలు, రాజనీతి శాస్త్రపరిధిని విస్తరింపజేశాయి.

స్థూలంగా చెప్పాలంటే రాజనీతి శాస్త్రం అధ్యయనం రెండు రకాలుగా/పాయలుగా అభివృద్ధి చెందింది. ఇవి ప్రామాణిక (Normative) మరియు అనుభవాత్మక (Empirical) ములైనవి. ఇవి ఖచ్చితమైన నమూనాలు కాకపోయినప్పటికీ, అధ్యయనంలో ఉన్న ప్రాముఖ్యత (Emphasis) ను బట్టి ఏరకానికి చెందినదో తెల్సుకోవచ్చు. రాజనీతి శాస్త్ర ప్రామాణిక అధ్యయనములలో ప్రధాన దృష్టి (Focus) రాజకీయ జీవిత మరియు ఆచరణ చర్యలకు సంబంధించిన ప్రమాణాలు (Norms) విలువలు మరియు లక్ష్యాలపై ఉంటుంది. స్వేచ్ఛ, సమానత్వము, న్యాయము (Justice) మరియు సాధికారత (Empowerment) లాంటి భావాల అధ్యయనాలు మరియు భావజాలముల (Ideologies) అధ్యయనాలు యీ కోవలోకే వస్తాయి. గుణాత్మక మరియు పరిమాణాత్మక అనుభవాత్మక అధ్యయనముల దృష్టిని వాస్తవాలపైన (Facts) మరియు వాస్తవ ప్రక్రియ లేక లక్ష్యాలను సాధించుటకుగల సాధనములపైన కేంద్రీకరిస్తుంది. ప్రభుత్వ మరియు యితర సంస్థల విధులు లేక పనిచేయు తీరు మరియు భిన్న హోదాలలో జరుగు మానవ పరస్పర చర్యలకు సంబంధించిన అధ్యయనాలు అనుభవాత్మక అధ్యయానాల క్రిందికే వస్తాయి.

## 1.4 రాజనీతి శాస్త్ర (అధ్యయన) ప్రాముఖ్యత

B R A O U

రాజనీతి శాస్త్రము యొక్క లేక దాని అధ్యయనము యొక్క ప్రాముఖ్యత తగ్గించుటకూడదు. అధ్యయన శాస్త్రీయత గూర్చిగాని, లేక విషయ (Subject) శాస్త్రీయతను గూర్చిగానీ ఎవరికైనా సంశయములుండవచ్చు. రాజనీతి భావాలు లేక ఆలోచనలు ఎంతవరకు వాస్తవ పరిస్థితులలో ప్రతిబింబిస్తా యన్న విషయం గూర్చి కూడా ఎవరికైనా సంశయాలుండవచ్చు. కానీ యీ విషయమును గూర్చి తెలుసుకొనే ఆవశ్యకత నిత్యజీవితంలో అనుభవిస్తుంటాము.

కొన్ని భావనలు, సిద్ధాంతాలు మానవ మనుగడకు దారి చూపిస్తాయి. రాజకీయ స్పృహ/చైతన్యం, మననశీల చింతనము (Reflective Thinking), చర్చ మరియు పర్యాలోచనము (Deliberation) ల ఫలితము. సాధారణాభిప్రాయం (Consensus), ప్రజాస్వామ్య మానవ పరస్పర చర్య పర్యవసానంగా వుండాలి మరియు అది మాత్రమే రాజనీతి వ్యవస్థ స్థిరత్వమునకు సాధనం (Stepping Stone) . ఒకవైపు ప్రఖ్యాత రాజనీతి తత్త్వవేత్తలు/మేధావులు చూపిన దారి, మరొకవైపు క్రియాశీల రాజకీయ దురంధరులు చూపిన మార్గం, ఇవి ఎటువైపు/ఎన్నుకున్న వైపు ఎలా వెళ్ళాలో ఒక మార్గాన్ని సూచిస్తాయి. ప్రజలకు హక్కులు, పౌరసత్వం

మరియు ప్రజా సమస్యలలో (Public Affairs) పాల్గొనటం మొదలైన విషయాలు నిత్యజీవితంలో ప్రాముఖ్యత కల్గినవి. వీటిని గూర్చి తెలియని అజ్ఞాని తగిన కష్టఫలితమును పొందవలసి ఉంటుంది. రాజకీయ జ్ఞానం కేవలం బ్రతకడానికి కాదు. మంచిగా/బాగా బ్రతుకటానికి. అది లక్ష్యం కానప్పుడు మానవ ప్రయత్నంతోగూడిన రాజకీయ చర్య (అంటూ ఏదీ) ఉండదు.

## 1.5 క్లుప్తంగా

రాజనీతి శాస్త్రానికి చాలా నిర్వచనాలున్నాయి. ఆధునిక కాలం వరకు రాజనీతి శాస్త్రము 'రాజ్యము మరియు ప్రభుత్వము' యొక్క అధ్యయనము. ప్రధాన దృష్టి రాజకీయ జీవితపు లక్ష్యాల మీద మరియు దాని వలన ప్రమాణాల స్వభావం గల్గిన ఆలోచన మరియు ఆచరణల మీద. అయితే క్రమేపీ అన్వేషణ పద్ధతులతో గూడిన అధ్యయనాల వల్ల, శాస్త్రీయ పద్ధతిని సాంఘిక రాజకీయ వాతావరణాలకు అన్వయించడంతో, యీ రాజనీతి విషయం, 'రాజనీతి శాస్త్రమ'నే పేరును తెచ్చుకున్నది. కేవలం పేరులోనేకాదు మార్పు, అధ్యయన దృష్టిలో గూడా మార్పు వచ్చింది. యీ విషయం తదుపరి పాఠంలో విశదమవుతుంది.

రాజనీతి శాస్త్ర అధ్యయనం రెండు పాయలలో అభివృద్ధి చెందింది. ప్రమాణిక మరియు అనుభవాత్మక రకాలు. మొదటి రకం అధ్యయనాల దృష్టి విలువలు లేక ప్రమాణాలు లేక 'ఏమిచెయ్యాలి' అన్న ప్రశ్నపై వుంటుంది. మరి రెండవ రకపు అధ్యయనాల దృష్టి యదార్ధాలు (Facts) మరియు వాటి సంబంధాలు మరియు 'ఇది ఏమిటి' (What is) అన్న ప్రశ్నపై ఉంటుంది. అంతర్విషయాలు (Interdisciplinary) పద్ధతి రాజనీతి శాస్త్ర పరిధిని మరియు ప్రాముఖ్యతను విభిన్న రీతులలో పెంచింది.

## 1.6 చదువదగిన పుస్తకాలు


A. Appadorai : Substance of Politics

J.W. Garner : Political Science and Governments

R.G. Gettel : Political Science

R.N. Gilchrist : Principles of Political Science


## 1.7 నమూనా ప్రశ్నలు

I. 30 పంక్తులలో జవాబు లిమ్ము

ఎ) రాజనీతి శాస్త్రమును నిర్వచింపుము మరియు దాని పరిధిని పేర్కొనుము.

బి) 'రాజనీతి' మరియు 'రాజనీతి శాస్త్రము'ల స్వభావం గూర్చి వ్రాయుము.

సి) రాజనీతి శాస్త్రం యొక్క ప్రాముఖ్యత ఏమి ?

BRAOU

II. **10 పంక్తులలో జవాబు లిమ్ము**

ఎ) రాజనీతి శాస్త్రము ఎందుకు 'శాస్త్రము' అనే పదాన్ని చివర తెచ్చుకుంది.

బి) 'సైద్ధాంతిక' మరియు 'అనుప్రయుక్త' (Applied) రాజనీతిల మధ్య భేదమును చూపుము.

**రచయిత : బి.ఎస్.ఆర్. ఆంజనేయులు**

BRAOU

# భాగం-2: రాజనీతి అధ్యయన దృక్పథాలు - సాంప్రదాయ - ఆధునిక దృక్పథాలు

విషయ సూచిక


2.0 లక్ష్యాలు

2.1 పరిచయం

2.2 దృక్పథం, పద్ధతి, మెళకువ (Technique) ల స్వభావం - అర్థం

2.3 సాంప్రదాయ దృక్పథాలు

2.3.1 తాత్త్విక దృక్పథం

2.3.2 చారిత్రక దృక్పథం

2.3.3 న్యాయపర లేదా చట్టబద్ధ దృక్పథం

2.3.4 సంస్థాగత దృక్పథం

2.4 ఆధునిక దృక్పథాలు

2.4.1 సామాజిక దృక్పథం

2.4.2 మానసిక దృక్పథం

2.4.3 ఆర్థిక దృక్పథం

2.4.4 ప్రవర్తనా వాద దృక్పథం

2.5 క్లుప్తంగా

2.6 చదువదగిన పుస్తకాలు

2.7 నమూనా ప్రశ్నలు


B R A O U

## 2.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- రాజనీతి శాస్త్ర అధ్యయనానికి గల దృక్పథం అంటే ఏమిటో విశదీకరించగలరు.
- సాంప్రదాయ, ఆధునిక దృక్పథాలు ఏమిటో విశదకరించగలరు, మరియు
- ఈ రెండు దృక్పథాల యోగ్యత, ప్రయోగతల గూర్చి విశ్లేషించగలరు.

## 2.1 పరిచయం

ప్రాచీన కాలం నుండి రాజనీతి తత్వవేత్తలు మరియు ఆధునిక కాలంలో రాజనీతి శాస్త్రజ్ఞులు అని పిలువబడుతున్నవారు, రాజకీయ విషయాలు / వాస్తవాలను పలువిధాలుగా వివరిస్తూ వచ్చారు. ప్రతివారు సబ్జెక్టు గురించి తమతమ దృక్పథాలు కలిగి ఉన్నారు. కానీ వివరణలలో పోలికలు మరియు భిన్నత్వములు చాలా ఉన్నప్పటికీ వారి దృక్పథం మాత్రం ముఖ్యమైనదే, కారణం, వారిచ్చే వివరణ దీనిపై ఆధారపడి ఉంటుంది. వివరణ యివ్వడంలో, దృక్పథంతో బాటు పద్ధతులు మరియు టెక్నిక్స్ ఉంటాయి. ఉదాహరణకు, అరిస్టాటిల్ అనుభవాత్మక పద్ధతిని, తన రాజ్యాంగ వర్గీకరణకు వాడాడు. ఇండియాలో గాంధీ ఉపవాసము లాంటి టెక్నిక్స్‌ను, తన అహింస మరియు సత్యాగ్రహమును సాంఘిక సమస్యలకు అన్వయించినప్పుడు వాడారు. మార్క్సిస్టులు తమ పాలనను (రాజ్యమును) స్థాపించడంలో భౌతికవాద దృక్పథాన్ని మరియు విప్లవాత్మక లేక హింసాత్మక పద్ధతిని ఆచరిస్తారు. ప్రజాస్వామ్యాలు, సమాజంలో మార్పులు, ప్రజాస్వామ్య మరియు క్రమబద్ధమైన ఆచరణలతో రావాలి అని వక్కాణిస్తాయి.

ఆవిధంగా సిద్ధాంతపరంగా మరియు ఆచరణపరంగా రాజనీతి శాస్త్ర అధ్యయన విద్యార్థి, ఉన్న పరిస్థితిని అర్థం చేసికొనుటకు వివరించుటకు లేక మార్పును తెచ్చుటకు కొన్ని దృక్పథాలు, పద్ధతులు మరియు టెక్నిక్స్‌ను తెలుసుకుంటాడు. అందువలననే యీ విషయాన్ని అర్థం చేసుకోవాలి.

## 2.2 దృక్పథం, పద్ధతి మరియు టెక్నిక్‌ల స్వభావము మరియు అర్థము

దృక్పథాన్ని ఒక విషయాన్ని గూర్చి వివరించే విధానము అని నిర్వచించవచ్చు. వివరించబడ్డ సమస్య మరియు వివరణ యొక్క విస్తరణ చిన్నదిగాని పెద్దదిగాని, Inclusive or Exclusive (అపవర్జక)గా వుండొచ్చు మరియు అంతర్విషయమైనదిగా కూడా ఉండొచ్చు. వివరణ ప్రామాణికమైనది లేక అనుభవాత్మకమైనది కావచ్చు. గుణాత్మకము లేక పరిమాణాత్మకము కావచ్చు. దృక్పథంలో ఉండే ప్రక్రియను గూర్చి V. Van Dyke యిలా అంటాడు.

"దృక్పథంలో ప్రమాణాల ఎంపిక ఉంటుంది.... ప్రమాణాలు సమస్యను ఎంచుకోవటానికి లేక పరిగణలోకి తీసుకోవాల్సిన ప్రశ్నలు ఎంచుకోవటానికి ఉంటాయి. అది (దృక్పథం) ప్రశ్నలు లేక dataను ఏది వుంచాలి లేక ఏది వదిలి వేయాలి అన్నదాన్ని గూర్చి కూడా తెల్పుతుంది".

పద్ధతి (Mehtod) దృక్పథం కన్నా ప్రవర్ధనము (Magnitude) లోనూ, వ్యాప్తి (Range) లోను చిన్నది. అది నిర్దిష్టము (Specific) మరియు ఒక ఉపపత్తి (Hypothesis) కు గానీ లేక సోపాధిక (Hypothetical) అభ్యుపగమము (Assumptions) లను గానీ ఋజువు లేక disprove చేయుటకు తగిన డాటాను సేకరించు విధానము. V. Van Dyke యిలా వ్రాస్తాడు. "క్లుప్తంగా, దృక్పథాలు సమస్యలను మరియు తగిన డాటాను ఎంచుకోటానికి గల ప్రమాణాలు (మరి) పద్ధతులు, సేకరించిన డాటాను ఉపయోగించుకునే సంవిధానములు (Proceedures)". టెక్నిక్ ఇంకా (పద్ధతి కన్నా) నిర్దిష్టము మరియు ఒక నిర్దిష్ట ప్రయోజనము/ ఉద్దేశ్యములో ఉపయోగింపబడేది. అది ఒక అధ్యయనంలో ఏకరూపంగా (Uniform) వుండనవసరం లేదు.

B R A O U

ఒక ప్రత్యేక చలనముల విన్యాసము (Self of Variables) యొక్క, వాస్తవ లేక వూహింపబడిన చర్యలను సంగ్రహపరుస్తూ ఒక సామాన్యకృత ప్రవచనం వుంది. దృక్పథం, సిద్ధాంతానికి నాంది (Precursor) మరియు దృక్పథం, ఎప్పుడైతే దాని విధి, ఒక విషయం గూర్చి దాని సమస్యను, డాటాను ఎంపిక చేసుకోవటాన్ని దాటి వెళ్తుందో అప్పుడు అది సిద్ధాంతంగా మార్చబడుతుంది". మరోలా చెప్పాలంటే సవిరణతో గూడిన దృక్పథం సిద్ధాంత మవుతుంది.

## 2.3 సాంప్రదాయ దృక్పథాలు

### ఈ క్రింది కొన్ని ప్రధాన సాంప్రదాయ దృక్పథాలు

### 1. తాత్త్విక దృక్పథం

వ్యూహాత్మక లేక అదిభౌతికాత్మక దృక్పథం అని పిలువబడే ఈ తాత్త్విక దృకథం ఒకరకంగా అతి పురాతన లేక మొట్టమొదటిది. అది వర్ణనాత్మకమైనది. మరియు అది వాస్తవాన్ని ప్రతిబింబించుతున్న వనుకుంటున్న మానవ లక్ష్యాలు లేక విలువలు లేక సూత్రములు మీద దృష్టిని ఎక్కువగా చూపుతుంది. అది ఆలోచన లేక భావాల గూర్చిన ఆలోచన కనుక దాన్ని తాత్త్విక దృక్పథం అని పిలువబడుతుంది.

ఈ దృక్పథంతో ఉన్న రాజకీయ అధ్యయనాన్ని రాజనీతి తత్త్వం / తత్త్వశాస్త్రం (Political Philosophy) అని పిలుస్తారు. దీనిలో చాలా అమూర్తీకరణ (Abstraction) వుంటుంది. గొప్ప మేధావులైన ప్లేటో నుండి రూసో, హెగెల్ మరియు ఆధునిక మేధావులు - లియోస్ట్రాస్ మరియు జాన్‌రాల్స్‌లాంటి వారు - యీ దృక్పథాన్ని అవలంభించారు. ఈ దృక్పథంపై ఆధారపడిన సిద్ధాంతాలు, ఆదర్శ పరిస్థితులు లక్ష్యంగా చూపుతాయి. అమూర్తీకరణము మరియు ఎక్కువ ఆదర్శ పరిస్థితిని లక్ష్యంగా చూపటం యీ దృక్పథానికి నష్టమైన లక్షణం (Disadvantage) వుంది.

### 2. చారిత్రక దృక్పథం

పేరుకు తగినట్లు, యీ దృక్పథం, అధ్యయన విషయాన్ని గూర్చి చరిత్రలో జరిగిన దాన్ని గూర్చి తెలుపుతుంది. సాధారణ మాటల్లో చెప్పాలంటే యీ దృక్పథంపై ఆధారపడిన సిద్ధాంతం ఏది, ఎందుకు, ఎలా జరిగిపోయిన కాలంలో జరిగిందో వివరిస్తుంది. భూతకాల పరిస్థితుల గూర్చిన జ్ఞానము, ప్రస్తుత సమస్యలను పరిష్కరించుకోటానికి లేదా తమ స్వంత గౌరవాన్ని / అభిమానాన్ని (Self Respecting) పోకడలను పొందడానికి లేక ఉన్న దురభిప్రాయాన్ని పోగొట్టుకొనుటకు, ఉపయోగపడుతుంది. వాస్తవాన్ని అర్థం చేసుకోవడంలో తన ఆలోచనలను సమర్థించుకోడానికి మేకియావెల్లి యీ దృక్పథాన్ని అవలంభించాడు. ఒకరకంగా ఎడ్మండ్ బర్క్ కూడా సమాజాలు ఆచార సంప్రదాయాలను పోషించుకుంటూ, మార్చుకుంటూ వచ్చాయో వివరించటానికి యీ దృక్పథాన్ని అవలంభించాడని చెప్పవచ్చు.

### 3. న్యాయ / చట్ట సంబంధ దృక్పథం

రాజకీయ వ్యవస్థాపనము (Organisation) / క్రమం (Order) ను పోషించుటకు రాజ్యము కొన్ని చట్ట సంస్థలను రూపొందించుతుంది. మరియు అవిధంగా రాజనీతి శాస్త్ర అధ్యయనము చట్ట ప్రక్రియలకు సంస్థలకు, సంబంధించనదిగా వున్నప్పుడు యీ దృక్పథాన్ని చట్ట (సంబంధ) దృక్పథం అంటారు. రాజకీయ వ్యవస్థాపనము చట్ట ప్రక్రియగా (లేక చట్ట సంబంధ మాటలలో) వుండడం, యీ దృక్పథంపై ఆధారపడ్డ సిద్ధాంతం / అధ్యయనం యొక్క సారము (Essence). ప్రాచీన కాలములో సిసిరో మరియు ఆధునిక

BRAOU

కాలంలో Dicey యీ దృక్పథాన్ని అవలంభించారు. Garner యిలా వ్రాస్తాడు.

ఈ దృక్పథం "వ్యవస్థాపిత సమాజమును సాంఘిక లేక రాజకీయ దృగ్విషయాలుగా (Phenomena) గా కాక సరియైన / స్వచ్ఛమైన తర్కము మరియు హేతువు మీద ఆధారపడిన ఒకసరియైన చట్టబద్ధ పాలనగా, పబ్లిక్ లా (Public Law) హక్కులు మరియు కరణీయముల (Obligations) కలయికగా చట్టబద్ధతను రాజకీయ విషయముకు జోడించడం లేక అన్వయించడం ప్రభావవంతమని ఊహించబడినది. ఉదాహరణకు, సమన్యాయపాలన (Rule of Law) లేనప్పుడు కన్న, అది వున్నప్పుడు రాజకీయ స్థిరత్వాన్ని కాపాడుతుంది. అలాగే శాసన సభలపైన, కార్య నిర్వాహకునిపై చట్టబద్ధ నిరోధాలు (Checks) గూడా ప్రభావంతమైన ప్రజాస్వామ్యముగా కాపాడుతుంది.

### 4. సంస్థాపర దృక్పథం

ఈ దృక్పథంలో, అధ్యయనం, రాజకీయ వ్యవస్థాపనమును, శాసన సభ, కార్య నిర్వాహక మరియు న్యాయముల కలయికగా లేక విడివిడిగాను దృష్టి సారిస్తుంది. Herman Finer లాంటి విశ్లేషకులు రాజకీయ పార్టీలను గూడా సంస్థలుగా పరిగణించి, వాటి అధ్యయనమును గూడా యీ దృక్పథంతో కూడిన అధ్యయనాల్లో, సంక్షేమ మరియు అలాంటి గణాలను (Interest and such other groups) గూడా కలుపుతారు. ఆవిధంగా యీ దృక్పథం లాంఛన ప్రాయమైన, లాంఛన ప్రాయంకాని సంస్థలను గూర్చి తెల్పుతుంది. చాలవరకు యిలాంటి సంస్థాపర దృక్పథం తులనాత్మకంగా గూడా వుంటుంది. G.A. Almond మరియు David Apter అభివృద్ధి చెందిన మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలలోని సంస్థల గూర్చి తులనాత్మక అధ్యయనంపై దృష్టి సారించారు. విభిన్న దేశాల పార్లమెంటరీ లేక న్యాయసంస్థల మధ్యనున్న పోలికలను తులనాత్మకంగా అధ్యయనం చేయడం, వారి సంస్థలను సంవర్థమైనవిగా చేయ్యాలనే దేశాలకు ఉపయోగకరంగా ఉంటుంది.

## 2.4 ఆధునిక దృక్పథాలు

ఈపైన చెప్పబడ్డ ప్రధాన సాంప్రదాయ దృక్పథాలు, ప్రమాణికమైనవి మరియు విలువలతో గూడినవి. అయితే అన్వేషణా ఫలితాలకు ఎక్కువ ప్రామాణికతను యివ్వడం కోసం, ఆధునిక కాలంలో అనుభవాత్మక దృక్పథాలు మరియు పద్ధతులు పెంపొందింపబడినవి. ఈక్రింద్ది కొన్ని ప్రధాన ఆధునిక దృక్పథాలు యివ్వబడ్డాయి.

### 1. సామాజిక దృక్పథం

దృగ్విషయాలన్నింటికి, ప్రత్యేకించి రాజకీయ విషయానికి, సమాజం పునాది ఉంటుంది. రక్తసంబంధం, జాతి/తెగ, మతం, భాష మున్నగు సమజాంలో ఉన్న కారకాలు / అంశాలు రాజకీయ నిర్మాణం, కార్యకలాపాలపై ఎక్కువ ప్రభావం కలిగి వుంటాయి. Almond, Lipset లాంటి గొప్ప సామాజిక శాస్త్రవేత్తలు, రాజకీయ విషయాలకు గల సామాజిక పునాదులు / వేళ్ళు గురించి నొక్కి చెబుతారు. ఈ విషయాలపై మాక్స్ వెబర్ మొదటిగా కృషి చేశాడు. రాజకీయ వ్యవస్థల బలము, బలహీనతను కొలవడానికి అనేక సామాజిక సిద్ధాంతాలు బలము, బలహీనతను కొలవడానికి అనేక సామాజిక సిద్ధాంతాలు అభివృద్ధి చేయబడ్డాయి. ఈ సందర్భంగా రాజకీయ ఆధునికీకరణ మరియు సామాజికీకరణలాంటి ప్రముఖ భావాలు పెంపొందింపబడ్డాయి.

BRAOU

## 2. మనోవైజ్ఞాన దృక్పథం

మనోవిజ్ఞాన / మానసిక శాస్త్రమునకు రాజకీయ విషయాలకు గల దగ్గర సంబంధం, ఆధునిక కాలంలోని Graham Wallas, Harold Lasswell, Robert Dahl ల కృషి వలన ప్రాముఖ్యత వహించింది. అప్పటికే గొప్ప మనో విజ్ఞాన శాస్త్రవేత్తలైన Froied, Jung మరియు MC Dougall లాంటివారు రాజకీయ ప్రవర్తనకు గల మానసిక సంబంధ పునాదులను వేశారు. రాజకీయ వ్యవస్థలో ఏ స్థాయిలోనైనా కార్యకలాపాలు సాగించేది మనుషులే కనుక, వారి మనస్తత్వం వారి రాజకీయ పాత్రలలో ప్రతిబింబిస్తుంది. రాజకీయ నాయకుల ప్రవర్తన, శాసన సభ్యుల ప్రవర్తన, కార్య నిర్వాహకుల ప్రవర్తన మొదలైన విషయాలు మానసిక శాస్త్ర దృక్పథంతో బాగా అర్థమవుతాయి. వ్యక్తుల మధ్యనున్న సంబంధాలు మానసిక కారకములచే ప్రభావితమౌతాయి మరియు అలాంటి సంబంధాలు సంస్థల ప్రభావ వంతమునకు కీలకమైనవి.

## 3. ఆర్థిక దృక్పథం

మామూలు మాటలలో చెప్పాలంటే రాజకీయం చాలా వరకు ఆర్థిక సంబంధమైనది, అనగా, రాజకీయానికి/లకు ఆర్థిక విషయాలే ప్రేరకం అంటారు. ఆర్థిక వుత్పత్తి శక్తులు మరియు సంబంధాలు, రాజకీయ, మత మరియు అన్ని యితర నమ్మకాలను నిర్ణయిస్తాయి అని, యీ దృక్పథంలోకి వచ్చు మార్క్సిస్టు దృకథం నొక్కి వక్కాణిస్తుంది. సామాన్య మనిషికి గూడా, మానవ మనుగడకు ఆర్థిక పునాది చాలా బాగా తెలుసు. ఒకజాతి మరియు అంతర్జాతీయ సంబంధాల రాజకీయ బలం జాతి/దేశ ఆర్థిక బలముపై ఆధారపడి ఉంటుంది. రాజకీయ స్థిరత్వం మరియు బలం, వ్యవసాయ, పరిశ్రమల, బ్యాంకింగ్ వ్యవస్థ మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది.

## 4. పరివర్తనా దృక్పథం

ఆధునిక అనుభవాత్మక దృక్పథాలు, స్థూలంగా పరివర్తనా వాదం లేక ప్రవర్తనా దృక్పథం క్రిందికి వస్తాయి. ఈ పోకడలు 1940లలో అభివృద్ధి చెంది 1960లలో తారాస్థాయికి చేరి, ఆ తర్వాత ప్రాముఖ్యతలో కొంత మార్పు తీసుకుంది. పరివర్తనా దృక్పథంలోని అసలు విషయమేమిటంటే, ఏ స్థాయిలోనైనా, ఏ పరిస్థితులలోనైనా మానవ పరివర్తనకు సంబంధించిన వాస్తవాలు అధ్యయనం ఎక్కువ ప్రమాణికత మరియు ఉపయోగకరమైన జ్ఞానం నిస్తుంది అని. సామాజిక శాస్త్రములు విషయములలో గూడ మానవ పరివర్తన ఉపయోగకరమైన సమాచారాన్నిస్తుంది. మరియు దాన్ని మాపనము (Measurement) చేయవచ్చు. మరియు ప్రస్తుత సమస్యలను పరిష్కరించుకోటానికి ఉపయోగకరమైన ప్రతిజ్ఞా వాక్యములను (Propositions) ప్రతిపాదించుకోవచ్చు. ఇక్కడొక ముఖ్య విషయమేమిటంటే పరివర్తనా దృక్పథంపై ఆధారపడ్డ అధ్యయనాలు కొన్ని కీలకమైన రాజకీయ భావనలను - శక్తి, ప్రభావం, ఒత్తిడిలాంటివి, విశ్లేషిస్తాయి. అవిధంగా దేశలేక విదేశసంబంధాల ప్రజాస్వామ్యీకరణపై దృష్టి సారిస్తుంది.

మరొక విషయం, మార్క్సిస్టు దృక్పథం అన్నది ఒక్కటే లేకపోయినప్పటికీ, అదృక్పథం చాలా ప్రాముఖ్యత చెందింది. కొంతమంది సమస్యను యిలా చూడొచ్చు. కావాలని, ప్రత్యేకంగా మార్క్సిస్టు దృక్పథంగా తయారు చేయ్యాలని తప్పిస్తే, సామాన్యంగా మార్క్సిస్టు దృక్పథం, ఆర్థిక దృక్పథం రెండూ అతి దగ్గరలో వుంటాయి. కానీ రెండింటికీ తేడా లేకపోలేదు. ఆర్థిక దృక్పథంలో సామ్యవాద లేక కమ్యూనిస్టు స్వభావం ఉండనక్కరలేదు. అంటే మార్క్సిస్టు కాని ఆర్థిక దృక్పథం వుండవచ్చు.

BRAOU

## 2.5 క్లుప్తంగా

మానవ మననం (Reflection) క్రమేపీ మరియు అవిరళంగా (Continuously) క్రొత్త రూపాలను, విశేషకము (Dimention) లను తీసుకుంటుంది. రాజకీయ వాస్తవాన్ని వివరించటంలో వాడిన దృక్పథాలు, పద్ధతులు (మరియు టెక్నిక్స్) క్రమేపి మెరుగుపరచబడతాయి. దృక్పథం, పద్ధతి కన్నా, పద్ధతి టెక్నిక్ కన్నా విశాలమైంది. సాంప్రదాయ దృక్పథాలు వర్ణనాత్మకము, తార్కికము మరియు ప్రామాణికము. ఆధునిక దృక్పథాలు.అనుభవాత్మకము, గుణాత్మకము మరియు పరిమాణాత్మకము. అనుభవాత్మక అధ్యయనాల్లో, సామాజిక మరియు రాజకీయ విషయాలకు శాస్త్రీయ పద్ధతులను అన్వయించటం, విషయానికి (Subject) శాస్త్రీయతను యిస్తుంది. ఆవిధంగా అది ప్రామాణిక జ్ఞాన మవుతుంది. అయితే అలాంటి జ్ఞానంలో తప్పులు / అభాసలు (Fallacies) వుండవని కాదు. క్రమేపి / తదుపరి వచ్చు అధ్యయనాలు పూర్వపు అధ్యయనాల్లోని అభాసలను సరిదిద్దుతాయి. కనుక (నే) అనుభవాత్మక అధ్యనాల్లో చాలా / ఎక్కువ దృష్టిని దృక్పథం లేక పద్ధతులకు సంబంధించిన సమస్యలపై దృష్టిని ముందుగా సారించి, ఆతర్వాతే అధ్యయన ఫలితాలపై దృష్టిని సారిస్తాయి.

## 2.6 చదువదగిన పుస్తకాలు

J.C. Johari : Foundations of Political Science

J.C. Johari : Contemporary Political Theory

## 2.7 నమూనా ప్రశ్నలు

**I. 30 పంక్తులలో జవాబు లిమ్ము**

1. దృక్పథం మరియు పద్ధతిల మధ్య వ్యత్యాసం చూపుము. అవి సిద్ధాంతమునకు ఎందుకు తప్పనిసరి ?
2. సాంప్రదాయ దృక్పథాలు ఏవి ?
3. ఆధునిక దృక్పథాలు ఏవి ?

**II. 10 పంక్తులలో జవాబు లిమ్ము**

1. దృక్పథానికి, పద్ధతికి గల వ్యత్యాస మేమి ?
2. సాంప్రదాయ అధ్యయనాల కన్నా, ఆధునిక అధ్యయనాలు ఏవిధంగా శాస్త్రీయమైనవి ?
3. పరివర్తనా వాదమేమి ?

**రచయిత : బి.ఎస్.ఆర్. ఆంజనేయులు**

B R A O U

## ఖండం:II

# రాజ్యం మరియు సమాజం

B R A O U

114983
320
RAJ

BRAOU

# భాగం-3 : సమాజం మరియు రాజ్యం

## విషయ సూచిక


3.0 లక్ష్యాలు

3.1 పరిచయం

3.2 సమాజం మరియు స్వచ్ఛంధ సంస్థలు

3.3 రాజ్యము మరియు వ్యక్తి

3.4 రాజ్యము మరియు సమాజం

3.5 క్లుప్తంగా

3.6 చదువదగిన పుస్తకాలు

3.7 నమూనా ప్రశ్నలు


## 3.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సమాజమనగా ఏమిటనియు మరియు సమాజమునకు స్వచ్ఛంద సంస్థలకు గల సంబంధమును అర్థం చేసుకోగలరు.
- రాజ్యమనగానేమి మరియు రాజ్యమునకు వ్యక్తికి గల సంబంధం గూర్చి తెలిసికొనగలరు.
- రాజ్యం మరియు సమాజం మధ్యగల సంబంధం గూర్చి తెలుసుకోగలరు.

BRAOU

## 3.1 పరిచయం

రాజనీతి శాస్త్ర విద్యార్థి, ప్రాధమికంగా మరియు సామాన్య విషయంగా, బాగా తెలిసినదేమిటంటే, మానవుడు సంఘ మరియు రాజకీయ జీవి అని. మానవుడు గుంపులో జీవిస్తాడు. తన కిష్టమైన విధంగా గానీ లేక అయిష్టతతో గాని, ఇతరులతో సంబంధాలను మాత్రం వదులుకోలేడు. అలాంటి సంబంధాలతో గూడిన విషయాలన్నింటిలోకి రెండు పెద్ద సంస్థలు / వ్యవస్థలు గూర్చి తెలుసుకోవల్సిన అవసరం వుంది. అవి సమాజము మరియు రాజ్యము. మానవ సంసర్గము (association)లోని ప్రాథమిక లేక ప్రధానభాగం కుటుంబం, పొరుగువారు, మత మరియు సాంస్కృతిక, విద్య, వృత్తిపర సమూహాలు తర్వాతవస్తాయి. ఆ విధంగా వ్యక్తి తన మనుగడకు తన రక్త సంబంధీకులతోను, మిగిలినవారితోను కలిసి జీవిస్తాడు. సంసర్గమైన జీవితం కొన్ని విషయాలలో స్వచ్ఛందమైనదిగానూ, కొన్ని విషయాలలో నిర్బంధముతో గూడినదిగా వుంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో నుంచుకొని సమాజము మరియు రాజ్యముల స్వభావము మరియు అర్థం గూర్చి తెలుసుకోవలసి యున్నది.

## 3.2 సమాజం మరియు స్వచ్ఛంద సంస్థలు

కేవలం మానవ సమూహం సమాజం కాదు. మానవులు స్వచ్ఛందంగా రక్త, మత, లేక మరేదైనా సంబంధిత సంబంధాలను నెలకొల్పినపుడే సమాజమేర్పడుతుంది. Appadorai సమాజాన్ని యిలా నిర్వచించాడు. "మానవ సంసర్గాన్ని తెలియజేస్తూ వున్న సమూహాల మరియు సంస్థల సంకీర్ణ (complicated) పరంపర (network)".

**Laski యీ విధంగా నిర్వచించాడు :**

"నా ఉద్దేశ్యంలో సమాజమనగా, తమ తమ కోర్కెలను తృప్తి పరచుకొనుటకు, మానవ సమూహము కలిసి జీవించటం మరియు కలిసి పనిచెయ్యటం. వారి కనీస కోర్కెలు ఆర్థిక సంబంధమైనవి. వారు బాగా జీవించడానికి ముందుగా వారు జీవనోపాధిని ఏర్పరచుకోవాలి. అయితే కనీస ఆర్థిక కోర్కెలే కాక మరొకరికమైన కోర్కెలు గూడ వుంటాయి. మత, సాంస్కృతిక, ఇంటి సంబంధిత కోర్కెలు - ఇవి తీరడం మానవుని సాంఘిక సహజాతము (Social instinct)పై ఆధారపడి వుంటుంది".

సమాజము ఒక రోజులో ఏర్పడేది కాదు. సహజాతము, కోర్కెలు మరియు సంబంధాలు సమాజం యొక్క స్వభావాన్ని మరియు ప్రయోజనాన్ని నిర్ణయిస్తాయి. కుటుంబం, పొరుగువారు, మరియు ఇతర స్వచ్ఛంద సంస్థలు సమాజాన్ని ఏర్పరుస్తాయి. ఒక్క కుటుంబ విషయంలో తప్ప, ఇతర స్వచ్ఛంద సంస్థలలో తమ సభ్యత్వాన్ని నిలుపుకోవచ్చు, వదులుకోవచ్చు. కుటుంబ విషయంలో అలా జరిగినా, చాలా ఆలస్యంగా మాత్రమే జరుగుతుంది. అదిగూడ, విడిపోయి మరో స్వంత కుటుంబాన్ని నెలకొల్పటానికే జరుగుతుంది. అందువల్ల కుటుంబ సభ్యత్వాన్ని కాదనుకోవడం క్రింద రాదు. అంటే కుటుంబం సభ్యత్వం మనిషికి దాదాపు నిర్బంధమైనదే. ఇతర స్వచ్ఛంద సంస్థలలో సభ్యత్వం వదులుకోవడం, మరో సంస్థలో చేరాలని లేదు.

సమాజంలో పొరుగుతనం, సహచర్యం అత్యంత ప్రాముఖ్యమైనది. అవి నిలవటానికి సాధారణంగా రక్త లేక మరొక సంబంధం కారణమవుతుంది.

BRAOU

## 3.3 రాజ్యం మరియు వ్యక్తి

రాజకీయ జీవితం మరియు కార్యకలాపాలలో మరొక కీలకమైన భావన/పదం - రాజ్యము. సమాజము ఎంత ప్రాముఖ్యతతో గూడినదో, రాజ్యము గూడా అంతే ప్రాముఖ్యతతో గూడినది. సమాజం రాజ్యము కన్న ముందు వచ్చినదనీ, (అయినప్పటికీ) రాజ్యముతో సహచర్యం తప్పదనీ అందరికీ తెలిసినదే. రాజ్యమనుగడలో సమాజం అంతర్ధానమయితే ఆ రాజ్యము సంపూర్ణాధికార రాజ్యమవుతుంది.

రాజ్యము మానవుల కృషి ఫలితము. దాని మనుగడ ప్రభుత్వం పని చెయ్యటం ద్వారా విదితమౌతుంది, మరియు ప్రభుత్వము శాసనముల ద్వారా పరిపాలిస్తుంది. అవిధేయత శిక్షార్హము. ఏ వ్యక్తీ రాజ్యమును తిరస్కరించటం లేక రాజ్యానికి అవిధేయత చూపటం చేయలేడు. సభ్యత్వం నిర్బంధమైనది.

రాజ్యము యొక్క లక్ష్యాలు చాలవరకు లిఖిత రాజ్యాంగాల ద్వారా విదితమవుతాయి. కానీ కొన్ని సందర్భాలలో అలిఖిత రాజ్యాంగములున్నచోట మరోలా విదితమవుతాయి. ఒక రాజ్యమును రద్దు చేయటం జరుగుతున్నదంటే, మరొక (రకమైన) రాజ్యస్థాపన ప్రయత్నమని భావించాలి. రాజ్యస్థితి ఏమైనప్పటికీ, వ్యక్తికి రాజ్యమునకు గల సంబంధం ఏదో విధంగా (లిఖిత లేక అలిఖిత రూపంలో) ప్రత్యేకంగా మరియు ప్రయోజన కారిగా వ్యక్తపరచబడుతుంది. ఇలాంటి సంబంధాల గూర్చి మరొక ప్రముఖభావన "పౌరసత్వం" క్రింద విశదీకరించబడుతుంది.

Bluntschli రాజ్యమును "ఒక ఖచ్చితమైన/నిర్దేశించిన భూభాగంలోని రాజకీయంగా వ్యవస్థాపకమైన ప్రజలు" అని నిర్వచించాడు. ఒక కేసువిషయంలో అమెరికన్ సుప్రీంకోర్టు రాజ్యమును యిలా నిర్వచించింది. "అందరి లాభం / ప్రయోజనం కొరకు, వారి స్వంతాన్ని వారు ప్రశాంతంగా అనుభవించటానికి, మరియు ఇతరులకు న్యాయం చేకూర్చటానికి స్వేచ్ఛాపరులు కలసికట్టుగా వున్న సమూహం." ఒక్కొక్కప్పుడు రాజ్యమును నిర్వచించటం కష్టమయినప్పుడు రాజ్య లక్షణాలను లేక రాజ్యభాగాలను వివరించటం జరుగుతుంది. అలాంటప్పుడు రాజ్యం, ప్రజలు, భూభాగం, ప్రభుత్వం, సార్వభౌమత్వం మరియు అంతర్జాతీయ గుర్తింపు కలయిక అని వివరించడం జరుగుతుంది. ఇంతకుమునుపు చెప్పినట్లు, రాజ్యము మానవ తయారీ, రాజ్యపుట్టుకను గూర్చి వివరిస్తూ చాలా సిద్ధాంతాలున్నాయి.

## 3.4 రాజ్యం మరియు సమాజము

ఈ రెంటి వ్యవస్థల గూర్చి, వాటి సంబంధాలు వగైరా విషయాల గూర్చి వివరంగా తెలుసుకోవాలి.

సమాజము స్వాభావికము, సరిహద్దులు లేవు. రాజ్యము మానవ కృషి ఫలితము, సరిహద్దులుంటాయి. సమాజంలో అన్ని రకాల సంబంధాలుంటాయి. రాజ్యములో నున్న సంబంధాలు స్పష్టంగా విశదీకరించబడతాయి. సమాజంలోని ప్రజలను కాపాడుటకు/పర్యవేక్షించుటకు ప్రత్యేకమైన యంత్రాంగం ఉండదు. రాజ్యములో ప్రజలను పాలించుటకు ప్రభుత్వమనే యంత్రాంగముంటుంది. ప్రాచీన కాలంలో రాజ్యము - సమాజము అనే తేడా స్పష్టంగా లేదు. సంపూర్ణాధికార రాజ్యముల (Totalitarian States)లో సమాజం అణగద్రొక్కబడుతుంది. 'శిక్ష' అన్న అంశం రాజ్యమును సమాజమును వేరువేరుగా చూపుతుంది. ఎందువలనంటే, అది సమాజములో వుండదు. కొన్ని ప్రత్యేక సమాజాల్లో నేరస్తులను శిక్షించే ఏర్పాట్లు వుండొచ్చు. (అలాగైతే రాజ్యము, అనగా శిక్ష అనే అంశముండేది, లేకుండా సమాజముంటుందా అనే వివాదం వుంది (Controversy). అసలు శిక్షించుటకు ఎటువంటి వీలుకాని సమాజమంటూ వూహించడం కష్టం. శిక్షకు ఏర్పాటు ఉంటే అది రాజ్యమునకు దగ్గరలో వుంటుంది. ఆ విధంగా కొన్ని సిద్ధాంతాలు చెప్పినట్లు, రాజ్యములేని సమాజం అనూహ్యం. ఈ క్రింది అభిప్రాయాలను పరిశీలించుము.

Mac Iver మరియు Charles Page యిలా వ్రాశారు

'వాడుకలు మరియు పద్ధతులు, అధికారము మరియు పరస్పర సహకారము/సహాయము, అనేక సమూహాలు మరియు చీలికలు, మానవ ప్రవర్తన నియంత్రణలు మరియు స్వేచ్ఛలు వున్న వ్యవస్థే సమాజము'.

సమాజములలో నియంత్రణగా యంత్రాంగం ఆచారాలు, సంప్రదాయాలు, మరి రాజ్యములో నియంత్రణలు, శాసనములు (Laws).

Laski రాజ్యము - సమాజము ఒకదానిని మరొకదాని మాటలలో నిర్వచిస్తాడు.

"నా ఉద్దేశ్యంలో రాజ్యమంటే, వత్తిడి నుపయోగించే అధికారము చేత, సమాజములోని భాగమైన వ్యక్తి లేక సమూహము. పై చట్టబద్ధ ఆధిపత్యము చేత సమీకృతం చేయబడ్డ సమాజము. ఏ జాతీయ సమాజమును పరీక్షించినను, కన్పించేది వ్యక్తులేకాక, మానవ సమూహాలు తమ మత, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ లక్ష్యాలను పెంపొందించుకొనుటకు కలసికట్టుగా వుండటం కన్పిస్తుంది. అలాంటి సమాజము వ్యక్తులు మరియు సంస్థలు/సంసర్గములు (associations) కలిగి వుండుట, చట్టబద్ధమైన వత్తిడి తీసుకురాగల అధికారము చేత అలా నిర్వహింపబడినప్పుడు అది (ఆ సమాజము) రాజ్యమౌతుంది."

J.W. Garner రాజ్యమును యిలా నిర్వచించాడు.

"స్వతంత్రమైన లేక దాదాపు బాహ్య నియంత్రణ లేని నిర్దిష్ట భూభాగాన్ని ఆక్రమించుకొన్న చాలామంది/ఎక్కువమంది మరియు అచటి నివాసులు ఆచారముగా వున్న విధేయతను చూపు వ్యవస్థాపనమైన ప్రభుత్వమును కల్గియుండిన మానవ సమూహం".

మానవ సామూహిక జీవన విధానాన్ని తెల్పుతూ మరికొన్ని పదాలు కలవు - కమ్యూనిటీ, జాతి, రిపబ్లిక్.

Bodin రిపబ్లిక్‌ను యిలా నిర్వచించాడు.

"ఒక అత్యున్నత శక్తి మరియు హేతువు చేత పాలింపబడు కుటుంబాల వారందరి సామాన్య ఆస్తుల సంసర్గము".

## 3.5 క్లుప్తంగా

రాజనీతి శాస్త్రంలో సమాజము మరియు రాజ్యము కీలకపదాలు. సమాజము సహజమైనది. మరియు కుటుంబంలాంటి సామూహిక జీవితాన్ని తెల్పేది సమాజం.

సమాజంలో అన్ని రకాల మానవ సంబంధాలు వుంటాయి. దానికి సరిహద్దులు లేవు. ప్రపంచమంతా ఒక సమాజము. ఆచారాలు, సాంప్రదాయాలు లేక మత సంబంధ నమ్మకాలు ప్రజలను నియంత్రించే యంత్రాంగం. అవిధేయత/ధిక్కారమునకు నిర్దిష్టశిక్ష ఉండదు. ప్రజలు తమలో తమకు గల బంధము (obligation) నీతి లేక నీతి నియమావళి రూపంలో వుంటూ, ప్రజల అంతరాత్మకు మాత్రమే సూచన లివ్వగలదు / బోధించగలదు.

రాజ్యము మానవ తయారీ, ప్రత్యేక / నిర్దిష్ట సరిహద్దులు కలవు. మరియు ప్రయోజనకారి; అనగా ప్రజల క్షేమం కోసం కొన్ని లక్ష్యాలు నిర్దేశించబడతాయి. ప్రజలు ఆ లక్ష్యసాధనకు తమ ప్రవర్తనను సరిచూసుకోవాలి. రాజ్యమునకు ప్రజలపై నియంత్రణ, శాసనముల ద్వారా కల్గి వుంటుంది. మరియు అవిధేయత/ధిక్కారము శిక్షార్హము. రాజ్యము సమాజపు పరిధిలో వ్యవహరించాలి. అలాకాక రాజ్యము సమాజాన్ని కబళించివేస్తే అది సంపూర్ణాధికార (Totalitarian State) రాజ్యమవుతుంది.

ఒకరకంగా చెప్పాలంటే, రాజ్యము మరియు సమాజము తమ తమ పాత్రలను ఔచిత్యముతో పోషించుకుంటూ సహజీవనం సాగించాలి. ఒకదాని మితిమీరిన పాత్ర/మనుగడ మరొకదాని పాత్ర/మనుగడను తగ్గిస్తుంది.

BRAOU

## 3.6 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| A. Appadorai | : | The Substance of Politics |
| J.W. Garner | : | Political Science and Governments |
| R.N. Gilchrist | : | Principles of Political Science |
| J.C. Johari | : | Foundations of Political Science |

## 3.7 నమూనా ప్రశ్నలు

### I. 30 పంక్తులలో జవాబులిమ్ము

1. సమాజమనగా నేమి ? మరియు దాని ముఖ్యలక్షణములను పేర్కొనుము.
2. రాజ్యమును నిర్వచించుము మరియు దాని లక్షణములను పరీక్షింపుము.
3. 'రాజ్యము' మరియు 'సమాజము'ల మధ్యనున్న సంబంధాలు ఏవి ?

### II. 10 పంక్తులలో జవాబు లిమ్ము

1. సమాజము రాజ్యము కన్నా ముందు అని ఎలా చెప్పబడింది.
2. రాజ్యము మానవ కల్పితమా ? మానవ తయారీయేనా ?
3. రాజ్యము మరియు సమాజముల మధ్య వ్యత్యాసమును పేర్కొనుము.

B R A O U

**రచయిత : టి.ఎస్.ఆర్. అంజనేయులు**

# భాగం-4 : సార్వభౌమాధికారం-రాజ్యలక్షణం-సార్వభౌమాధికారానికి సవాళ్ళు-ఏకత్వ, బహుత్వవాద సిద్ధాంతాలు

విషయ సూచిక


4.0 లక్ష్యాలు

4.1 పరిచయం

4.2 సార్వభౌమాధికారం - అర్థం - నిర్వచనం

4.2.1 సార్వభౌమాధికార అంశాలు

4.3 సార్వభౌమాధికార లక్షణాలు

4.4 సార్వభౌమాధికార రకాలు

4.4.1 శాసన, రాజకీయ సార్వభౌమాధికారాల మధ్య భేదాలు

4.4.2 శాసన సార్వభౌమాధికారం, రాజకీ సార్వభౌమాధికారం మధ్య సంబంధాలు

4.5 సార్వభౌమాధికారానికి సవాళ్ళు

4.6 ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం

4.7 బహుత్వవాద సార్వభౌమాధికార సిద్ధాంతం

4.8 క్లుప్తంగా

4.9 చదువదగిన పుస్తకాలు

4.10 నమూనా ప్రశ్నలు


BRAOU

## 4.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

i) సార్వభౌమాధికార అర్థాన్నీ, దాని లక్షణాలను అర్థం చేసుకోగలరు.

ii) సార్వభౌమాధికార రకాలను పేర్కొనగలరు.

iii) సార్వభౌమాధికారం ఎదుర్కొంటున్న సవాళ్ళను గుర్తించగలరు.

iv) ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని విమర్శనాత్మకంగా విశ్లేషించగలరు.

v) బహుత్వవాద సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని వివరించగలరు.

## 4.1 పరిచయం

న్యాయ రాజనీతి సిద్ధాంతాలలో సార్వభౌమాధికారం ఒక ముఖ్యమైన అంశం. ఆధునిక రాజ్యాన్ని సార్వభౌమాధికార 'జాతి రాజ్యమని' అందురు. దీనిని బట్టి సార్వభౌమాధికారం రాజ్యానికి ఒక ముఖ్య లక్షణమని తెలుస్తుంది. సార్వభౌమాధికారం లేనిదే రాజ్యం లేదు. ఈ లక్షణమే రాజ్యాన్ని ఇతర రాజకీయ సాంఘిక వ్యవస్థల నుండి వేరు చేస్తుంది. రాజ్య సరిహద్దులలో శాంతిభద్రతలను కాపాడటానికి ఆదేశాలను జారీచేయటంలో రాజ్యానికి సార్వభౌమాధికారం తోడ్పడుతుంది.

సార్వభౌమాధికారం ఒక నూతన భావన అయినప్పటికీ, అరిస్టాటిల్, రోమన్ న్యాయకోవిదుల రచనలలో కూడ దీని ప్రస్తావన వుంది. ఆధునిక యుగంలో 16వ శతాబ్దంలో జీన్‌బోడిన్ అను ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త సార్వభౌమాధికారం గురించి చెప్పిన వారిలో మొదటివాడు. బోడిన్ తరువాత గ్రోషియస్, హాబ్స్, లాక్, రూసో, హెగెల్, బెంథాం, ఆస్టిన్ ఇంకా అనేక మంది బహుతావాదులు సార్వభౌమాధికారాన్ని గురించి వివిధ కోణాల్లో వివరించారు.

ప్రస్తుతం రాజనీతి శాస్త్రజ్ఞులలో ఈ సార్వభౌమాధికారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ దీని ప్రయోజనం ఉంది. రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పేశక్తి దీనికి ఉంది. నేరస్తులను, తిరుగుబాటుదారులను, విధ్వంసకర శక్తులను అదుపులో వుంచుతుంది. రాజ్యానికి సార్వభౌమాధికారం లేని యెడల సమాజంలో అరాచకం ప్రబలుతుంది.

సార్వభౌమాధికార భావనను విశ్లేషించి అది ఎదుర్కొంటున్న సవాళ్ళను, దానికి సంబంధించిన ఏకత్వ, బహుత్వ సిద్ధాంతాలను ఈ భాగం చర్చిస్తుంది.

B R A O U

## 4.2 సార్వభౌమాధికారం - అర్థం - నిర్వచనం

సార్వభౌమాధికారాన్ని ఆంగ్లంలో "సొవరినిటీ" (Sovereignity) అంటారు. ఈ పదం "సూపరేనస్" (Superanus) అనే లాటిన్ పదం నుంచి రూపొందింది. "సూపరేనస్" అనగా అత్యున్నతమైనది అని అర్థం. కాబట్టి సార్వభౌమాధికారం రాజ్యానికున్న అత్యున్నతమైన శాసనాధికారం. దీనివలన రాజ్యం స్వేచ్ఛగా నిర్ణయాలను తీసుకోగలదు. సార్వభౌమాధికారం ఒక వ్యక్తి చేతిలో గానీ, కొద్దిమంది చేతులలో గానీ వుండవచ్చు. ఆధునిక కాలంలో జాతీయ ప్రభుత్వమే సార్వభౌమాధికారాన్ని చెలాయిస్తుంది.

16వ శతాబ్దికి చెందిన జీన్‌బోడిన్ అనే ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త "ది రిపబ్లిక్" (The Republic 1576) అనే గ్రంథంలో సార్వభౌమాధికారా స్వభావాన్ని గురించి సమగ్రంగా చర్చించాడు. ఈ గ్రంథంలో "పౌరులు, పాలితులపై రాజ్యానికి వున్న అత్యున్నతాధికారాన్ని" సార్వభౌమాధికారమని బోడిన్ నిర్వచించాడు.

అంతర సార్వభౌమాధికారాన్ని బోడిన్ స్పష్టంగా విశ్లేషించాడు. 17వ శతాబ్దంలో డచ్ న్యాయశాస్త్రవేత్త హ్యూగో గ్రోషియస్ బాహ్య సార్వభౌమాధికారాన్ని విపులీకరించాడు. ఒక వ్యక్తి చేతిలో వున్న అత్యున్నత రాజకీయ అధికారాన్ని సార్వభౌమాధికారమని గ్రోషియస్ చెప్పాడు. అటువంటి అధికారాన్ని వేరెవరూ ధిక్కరించడానికి వీలులేదు.

"పాలితులు, వారి సంస్థలపై వున్న నిరపేక్ష - అపరిమితమైన స్వతహాగా సంక్రమించే అధికారాన్ని సార్వభౌమాధికారమని" బర్జస్ అనే అమెరికా దేశానికి చెందిన రచయిత నిర్వచించాడు. రాజ్యానికున్న అంతిమ శాసన నిర్బంధ అధికారాన్ని సార్వభౌమాధికరమని ఆర్.హెచ్. సాల్టో అన్నాడు.

### 4.2.1 సార్వభౌమాధికార అంశాలు

సార్వభౌమాధికారంలో రెండు అంశాలున్నాయి. అవి అంతర, బాహ్య సార్వభౌమాధికారాలు.

**అంతర సార్వభౌమాధికారం :**

ఆంతరంగిక వ్యవహారాలకు సంబంధించిన అత్యున్నత రాజ్యాధికారాన్ని అంతర సార్వభౌమాధికారమని చెప్పవచ్చు. వ్యక్తులు, వారి సంస్థలకు సంబంధించిన శాసనాలు చేసి అమలు చేసే అధికారాన్ని అంతర సార్వభౌమాధికారమని చెప్పవచ్చు.

**బాహ్యసార్వభౌమాధికారం :**

ఒక రాజ్యానికి యితర రాజ్యాలతో వున్న సంబంధాన్ని తెలిపే అధికారాన్ని బాహ్య సార్వభౌమాధికార మనవచ్చు. ఈ అధికారం వలన రాజ్యం విదేశీవ్యవహారాలలో ఇతర రాజ్యాల జోక్యం వుండదు. కాని చిన్న, బీద రాజ్యాలు విదేశీ వ్యవహారాలలో స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితులు చాలా వరకు కనిపించడం లేదు. దీనికి కారణం అమెరికా వంటి అగ్రరాజ్యాలు వాటిపై ఆధిపత్యం చెలాయించడమేనని చెప్పవచ్చు.

## 4.3 సార్వభౌమాధికార లక్షణాలు

BRAOU

ఏకత్వ సిద్ధాంతాన్ని అనుసరించి సార్వభౌమాధికారాన్ని ఈ క్రింది లక్షణాలు వున్నాయి.

**1. నిరపేక్షత (Absoluteness) :**

రాజ్య సార్వభౌమాధికారం నిరపేక్ష, అపరిమితమైన అధికారం. దేశ, విదేశీ వ్యవహారాలలో రాజ్యాధికారానికి తిరుగులేదు. రాజ్యం దాని భూభాగంలో సర్వ స్వతంత్రంగా వ్యవహరించగలదు. రాజ్య సరిహద్దులలో దాని అధికారాన్ని దేశవిదేశాలలో ఎవరికీ ప్రశ్నించే హక్కు ఉండదు. వాస్తవ ప్రపంచంలో అటువంటి సర్వ స్వతంత్ర అధికారం ఏ రాజ్యానికీ వుండదు.

**2. సార్వజనీనత (Universality) :**

సార్వభౌమాధికారం సార్వజనీనమైనది. రాజ్యంలో వుండే వ్యక్తులకు, వారి సంస్థలకు, సంఘాలకు ఎటువంటి మినహాయింపులు లేక వర్తిస్తుంది. విదేశ దౌత్యప్రతినిధులు మాత్రం సార్వభౌమాధికార పరిధిలోకి రారు. అయినప్పటికీ, వారికిచ్చే ప్రత్యేకాధికారాలను రాజ్యం ఎప్పుడైనా తొలగించవచ్చు.

**3. శాశ్వతత్వం (Permanence) :**

సార్వభౌమాధికారం శాశ్వతమైనది. రాజ్యమున్నంతకాలం సార్వభౌమాధికారం వుంటుంది. రాజ్యం అంతరిస్తే దానితోపాటు సార్వభౌమాధికారం కూడా అంతరిస్తుంది. ప్రభుత్వంలో వచ్చే మార్పుల వలన

సార్వభౌమాధికారానికి భంగం వాటిల్లదు. దీనికి కారణం సార్వభౌమాధికార రాజ్యలక్షణం కాని ప్రభుత్వ లక్షణం కాదు.

4. **అవిభాజ్యత (Indivisibility) :**

సార్వభౌమాధికారం అవిభాజ్యం. రాజ్యంలో ఒకే సార్వభౌమాధికారి వుంటాడు. కాబట్టి సార్వభౌమాధికారాన్ని వ్యక్తుల మధ్య పంచడానికి వీలులేదు. సార్వభౌమాధికారాన్ని విభజిస్తే అది నశిస్తుందని 'గెటెల్' పండితుని అభిప్రాయం. కొందరు విమర్శకుల అభిప్రాయం ప్రకారం సమాఖ్య విధానంలో సార్వభౌమాధికారం కేంద్ర రాష్ట్రాల మధ్య విభజించడం జరుగుతుంది. కానీ ఈ వాదన సరైనది కాదు. ఎందుకనగా సమాఖ్య రాజ్యంలో కేంద్ర రాష్ట్రాల మధ్య ప్రభుత్వ అధికారాల విభజన మాత్రమే జరుగుతుంది. సార్వభౌమాధికారం విభజన జరగదు.

5. **అనన్య సంక్రమత్వం (Inalienbility) :**

రాజ్యంలో సార్వభౌమాధికారం సార్వభౌమునికి మాత్రమే చెందుతుంది. దానిని ఇతరులకు బదిలీ చేయడానికి వీలుపడదు. దానిని బదిలీచేస్తే అది నాశనమవుతుంది. రాజ్యపాలకుడు రాజ్యాన్ని త్యజించినప్పటికీ సార్వభౌమాధికారం రాజ్యానికే ఉంటుంది.

## 4.4 సార్వభౌమాధికారం - రకాలు (Kinds of Sovereignty)

ఉనికిని బట్టి సార్వభౌమాధికారాన్ని ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

**(ఎ) నామమాత్రపు సార్వభౌమాధికారం (Titular Sovereignty)**

నామమాత్రపు సార్వభౌమాధికారి పేరుకు మాత్రమే సార్వభౌముడు. వాస్తవానికి అతనికి ఏ అధికారం వుండదు. బ్రిటన్‌లో రెండవ ఎలిజబెత్ రాణి, భారతదేశంలో దేశాధ్యక్షుడు నామమాత్రపు సార్వభౌమాధికారులు మాత్రమే. ఈ రెండు దేశాలలో ఆచరణలో వారి పేరుతో అధికారాన్ని కేబినెట్ చెలాయిస్తుంది.

**(బి) న్యాయబద్ధ సార్వభౌమాధికారం (Legal Sovereignty)**

రాజ్యంలో శాసనాలను చేసే అధికారం వున్నవారిని న్యాయబద్ధ సార్వభౌములు అనవచ్చు.

బ్రిటన్‌లో రాణితో కూడిన పార్లమెంట్, భారతదేశంలో దేశాధ్యక్షునితో కూడిన పార్లమెంట్ న్యాయ సార్వభౌమాధికారానికి ఉదాహరణలు. న్యాయసార్వభౌమాధికారి చేసిన శాసనాలే రాజ్య ఆదేశాలుగా పరిగణించబడతాయి. వాటినే న్యాయస్థానాలు గుర్తిస్తాయి. అటువంటి ఆజ్ఞలను ధిక్కరించినవారు శిక్షార్హులు. న్యాయసార్వభౌమాధికారం నిరపేక్షం, సార్వజనీనమైనది. ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యంలో శాసన సభలకు మాత్రమే న్యాయసార్వభౌమాధికారం వుంటుంది.

**(సి) రాజకీయ సార్వభౌమాధికారం (Political Sovereignty)**

ఆధునిక ప్రజాస్వామ్య రాజ్యాలలో రాజకీయ సార్వభౌమాధికారానికి చాలా ప్రాముఖ్యముంది. అయినప్పటికీ దానిపై రాజనీతి శాస్త్రజ్ఞులలో ఏకాభిప్రాయం లేదు. ఓటుహక్కు ఉన్న పౌరులు మాత్రమే



BRAOU

రాజకీయ సార్వభౌములని కొందరన్నారు. ప్రజాభిప్రాయమే రాజకీయ సార్వభౌమాధికారమని, మరికొంతమంది చెప్పారు. ప్రజాశక్తే రాజకీయ సార్వభౌమాధికారమని ఇంకా కొంతమంది వర్ణించారు. న్యాయ సార్వభౌమాధికారం ఎవరి అభిప్రాయాలను మన్నిస్తుందో అటువంటి వారి ప్రభావాల మొత్తాన్ని రాజకీయ సార్వభౌమాధికారంపై భిన్నాభిప్రాయాలున్నప్పటికీ ప్రజాస్వామ్య రాజ్యాలలో దాని ప్రాముఖ్యతను గుర్తించారు, ఎందుకనగా ఇటువంటి ప్రజాస్వామ్య విధానంలో శాసనసభ శాసన సార్వభౌమాధికారి అయితే ఓటర్లు రాజకీయ సార్వభౌములవుతారు. ఈ రెండింటి అభీష్టాల మధ్య విభేదాలు వుండకూడదు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాసనసభ శాసనాలను చేసినట్లయితే ప్రభుత్వం పనిచేసే తీరుతెన్నులలో సామరస్యాన్ని చేకూర్చవచ్చు. నిజమైన ప్రజాస్వామ్యంలో శాసన సార్వభౌమాధికారి రాజకీయ సార్వభౌమాధికారి అభీష్టాన్ని మన్నించాలి. ప్రజాస్వామ్యంలో రాజకీయ సార్వభౌమాధికారం శాసన సార్వభౌమాధికారాన్ని అదుపులో వుంచుతుంది.

**(డి) ప్రజాసార్వభౌమాధికారం (Popular Sovereignty)**

ప్రజాసార్వభౌమాధికారం అనగా ప్రజలయొక్క అత్యున్నత అధికారమని చెప్పవచ్చు. రాజ్యాధికారానికి ప్రజలే మూలాధారమని దీని భావం. 16, 17వ శతాబ్దాలలో నిరంకుశ రాజరిక పాలనకు నిరసనగా ప్రజాసార్వ భౌమాధికారం అభివృద్ధి చెందింది. ఆ కాలంలో నిరంకుశ రాజరిక పాలనకు వ్యతిరేకంగా 'పాడువా'కు చెందిన 'మార్సీలియో', 'ఓఖామ్'కు చెందిన 'విలియమ్' మొదలగువారు ప్రజా సార్వభౌమాధికారాన్ని ప్రచారం చేశారు.

18వ శతాబ్దంలో ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త 'రూసో' ప్రజాసార్వభౌమాధికారాన్ని బలపర్చాడు. అతని అభిప్రాయంలో జనేచ్ఛ సార్వభౌమాధికారి. జనేచ్ఛ ప్రజాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రజాసార్వభౌమాధికారం ప్రజాస్వామ్యానికి మూలాధారం. ప్రజాస్వామ్యంలో పత్రికలు, ఉపన్యాసవేదికలు, మొదలైన వాటిద్వారా ప్రజలు వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు.

ప్రజాసార్వభౌమాధికారం కొంత విమర్శకు గురయింది. ఇది స్వీయ విరుద్ధమైనది. అనిశ్చితమైన, అవ్యవస్థితమైన ప్రజానీకాన్ని సార్వభౌమాధికారం అనరాదు. అంతేగాక, ఆధునిక ప్రజాస్వామ్యాలలో ఓటర్లు ప్రత్యక్షంగా పాలనాధికారాన్ని చెలాయించరు. రాజ్యంలో నివశించే ప్రజలందరకూ ఓటుహక్కు ఉండదు. పైచర్చ ననుసరించి ప్రజాసార్వభౌమాధికారం ఒక అస్పష్టభావన.

ప్రజాసార్వభౌమాధికారంలో కొన్ని బలహీనతలు ఉన్నప్పటికీ, దాని ప్రాముఖ్యత మాత్రం గుర్తించదగినది. ప్రభుత్వ ప్రజాశ్రేయస్సు కొరకు వుందనే భావన దీనిలో ఇమిడి ఉంది. ఇది ప్రజాస్వామ్య మూలాధారాలకు పటిష్టత చేకూరుస్తుంది.

**(ఇ) చట్టబద్ధమైన సార్వభౌమాధికారం - వాస్తవ సార్వభౌమాధికారం (De Jure and De factor Sovereignty)**

ఈ రెండు రకాల సార్వభౌమాధికారాల మధ్య భేదాలను కొందరు రచయితలు చెప్పారు. శాసనం గుర్తించిన సార్వభౌమాధికారాన్ని చట్టబద్ధమైన సార్వభౌమాధికారం అనవచ్చును. దీనికి మూలాధారం శాసనం. రాజ్యంలో అత్యున్నత ఆదేశాలను ఇచ్చే అధికారం దీనికి చట్టరీత్యా సంక్రమిస్తుంది. అటువంటి ఆదేశాలను ప్రజలు పాటించాలి.

వాస్తవంలో అధికారాన్ని చెలాయించేవారే వాస్తవ సార్వభౌమాధికారి. అతని ఆజ్ఞలకు అందరూ

బద్ధులై వుండాలి. బలప్రయోగం ద్వారా సార్వభౌమాధికారాన్ని చేజిక్కించుకొని వాస్తవంలో అధికారాన్ని చెలాయించేవాడే వాస్తవ సార్వభౌమాధికారి. అటువంటి అధికారాన్ని చట్టం గుర్తించదు. కానీ వాస్తవానికి వారి మాట చెల్లుతుంది. పై విధంగా అధికారంలోకి వచ్చినవారు సైనికాధికారులు కావచ్చు, నియంతలు కావచ్చు లేదా మతాధికారులు కావచ్చు. వాస్తవసార్వభౌమాధికారి కొన్నాళ్ళు అధికారంలో కొనసాగితే అతను చట్టబద్ధమైన సార్వభౌమాధికారి కావచ్చు. అటువంటప్పుడు అతను ప్రజల విధేయతను ఇతర రాజ్యాల గుర్తింపును పొందవచ్చు.

ఆస్టిన్ వంటి న్యాయశాస్త్రవేత్తలు చట్టబద్ధ, వాస్తవ సార్వభౌమాధికారాల మధ్య తేడాలను గుర్తించలేదు. సార్వభౌమాధికారం రాజ్యలక్షణమని వారి వాదన. అది చట్టబద్ధంగాగానీ, చట్టవిరుద్ధంగా గానీ వుండదు. కాబట్టి చట్టబద్ధ, వాస్తవ సార్వభౌమాధికారాల మధ్య తేడాలను ప్రభుత్వానికి మాత్రమే వర్తింపజేయడం సమంజసం.

### (ఎఫ్) జాతీయ సార్వభౌమాధికారి (National Sovereignty)

జాతిరాజ్యానికున్న సార్వభౌమాధికారాన్ని జాతీయ సార్వభౌమాధికారం అనవచ్చు. ఫ్రాన్సులో 1791లో విప్లవకారులు మానవహక్కుల ప్రకటన సందర్భంగా జాతీయ సార్వభౌమాధికార భావనను మొట్టమొదటి సారిగా వ్యక్తపరిచారు. ఒకే జాతి, ఒకే రాజ్యం అనే భావనను ఇది ప్రేరేపించింది. జాతీయ సార్వభౌమాధికార మద్దతుదారులను ఇది ఉత్తేజపర్చవచ్చు. కాని వాస్తవంలో దీనికి అంతప్రాముఖ్యత సంతరించకపోవచ్చు.

## 4.4.1 శాసన, రాజకీయ సార్వభౌమాధికారాల మధ్య భేదాలు :

## (Differences Between Legal and Political Sovereignty)

ఈ రెండు రకాల సార్వభౌమాధికారాల మధ్య భేదాలను ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

i) శాసన సార్వభౌమాధికారం స్పష్టమైనది. రాజకీయ సార్వభౌమాధికారం అస్పష్టమైనది.

ii) రాజకీయ సార్వభౌమాధికారం కంటే శాసన సార్వభౌమాధికారం క్రమబద్ధమైనది.

iii) రాజ్య అభీష్టాన్ని శాసనాల రూపంలో శాసన సార్వభౌమాధికారం వ్యక్తం చేయగలదు. ఇటువంటి అవకాశం రాజకీయ సార్వభౌమాధికారానికి లేదు.

కానీ ఈ రెండింటి మధ్య వైరుధ్యం ఏర్పడినప్పుడు రాజకీయ సార్వభౌమాధికారానిదే పై చేయి. ప్రజాస్వామ్యంలో శాసన సార్వభౌమాధికారం, రాజకీయ సార్వభౌమాధికారం అదుపులో వుంటుంది.

## 4.4.2 శాసన, రాజకీయ సార్వభౌమాధికారాల మధ్య సంబంధం

## (Relationship Between Legal and Political Sovereignty)

శాసన, రాజకీయ సార్వభౌమాధికారాల మధ్య తత్సంబంధాన్ని నెలకొల్పడమే ఉత్తమ ప్రభుత్వం యొక్క సమస్య అని గెటెల్ చెప్పాడు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో శాసన, రాజకీయ సార్వభౌమాధికారాల మధ్య తేడా లేదు. ఆ రెండూ ఒకటే. ఎందుకనగా పౌరుల అభీష్టాన్ని చట్టం వ్యక్తం చేస్తుంది. కాబట్టి ప్రత్యక్ష ప్రజాసామ్య విధానంలో ఈ రెండింటి మధ్య సంఘర్షణకు తావు లేదు.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో శాసన, రాజకీయ సార్వభౌమాధికారాల మధ్య సంబంధాలను ఏర్పరచడం ప్రాధాన్యత వహిస్తుంది.

## 4.5 సార్వభౌమాధికారానికి సవాళ్ళు (Challenges to Sovereignty)

సాంప్రదాయక సార్వభౌమాధికార భావన ఇటీవల కాలంలో కొన్ని సవాళ్ళను ఎదుర్కొంటుంది. వాటిని క్లుప్తంగా ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

i) బహుత్వవాదులనుండి సార్వభౌమాధికారం మొదటి సవాలును ఎదుర్కొంటుంది. వీరు సార్వభౌమాధికార ఏకత్వాన్ని అంగీకరించలేదు. వీరి వాదన అనుసరించి సార్వభౌమాధికారం రాజ్యానికి, ఇతర సంఘాలకు, సంస్థలకు మధ్య విభజింపబడుతుంది. హెచ్.జె.లాస్కీ, జి.డి.హెచ్.కోల్, బార్కర్, మాకైవర్, లిన్‌సే మొదలగువారు ఈ వాదనను బలపర్చారు.

ii) అంతర్జాతీయతావాదం రెండవ సవాలు. అంతర్జాతీయతావాదం అభివృద్ధి చెందడం వలన ప్రపంచ రాజ్యాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. దీనికి కారణం ఏ రాజ్యం కూడా స్వయం పోషకం కాదు. అలాగే స్వీయరక్షణ కూడా కలిగిలేదు. సాంప్రదాయక సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని అనుసరించి చిన్న, బడుగురాజ్యాల భద్రతకు అగ్రరాజ్యాలనుండి ముప్పు వాటిల్లే ప్రమాదం వుంటుంది. ఆధునిక ప్రపంచంలో వివిధ రాజ్యాల మధ్య సంబంధాలను అంతర్జాతీయ న్యాయం, అంతర్జాతీయ సాంప్ర దాయాలు నియతం చేస్తున్నాయి. ఈకారణం వలన ఏ రాజ్య సార్వభౌమాధికారానికి నిరపేక్షత ఉండదు.

iii) నేటి అంతర్జాతీయ సంబంధాలలో స్వతంత్ర రాజ్యాలు మాత్రమే పాత్రధారులు కావు. యు.ఎన్.ఓ. (UNO) వంటి అంతర్జాతీయ సంస్థలు, నాటో (NATO) వంటి సైనిక కూటములు, బహుళ జాతి సంస్థలు, మొదలగునవి కూడా అంతర్జాతీయ సంబంధాలలో ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి వీటి కార్యకలాపాలు జాతి రాజ్యాలకు సవాళ్ళుగా పరిణమించాయి.

iv) అల్ప సంఖ్యాకుల సమస్యలు, స్వార్థ ప్రయోజనాలతో కూడిన వర్గాలు, హింసాయుత కార్యకలాపాలు, ఉగ్రవాదం వంటి ఆంతరంగిక శక్తులు కూడ రాజ్య సార్వభౌమాధికారానికి సవాళ్ళుగా పరిణమించాయి.

v) ప్రపంచ ఆర్థికీకరణ, సమాచార సాధనాలలో వచ్చిన విప్లవాత్మకమార్పులు, పర్యావరణ సమస్యను ఎదుర్కోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారం వంటివి కూడా రాజ్య సార్వభౌమాధికారానికి సవాళ్ళుగా నిలిచాయి.

## 4.6 ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం

ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో జాన్ ఆస్టిన్ (1790-1859) ప్రముఖుడు. ఈ సిద్ధాంతాన్ని విశదీకరించి అభివృద్ధి చేసిన వారిలో ఆస్టిన్ ముఖ్యుడు. ఇతను సుప్రసిద్ధ ఆంగ్ల న్యాయ శాస్త్రవేత్త. "The province of Jurisprudence Determined" (1832) అనే గ్రంథంలో ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని ఆస్టిన్ వివరించాడు. హాబ్స్, బెంథాం, సిద్ధాంతాలపై అతని సిద్ధాంతం ఆధారపడి ఉంది.

BRAOU

చట్టానికిచ్చిన నిర్వచనాన్ని అనుసరించి, సార్వభౌమాధికారాన్ని ఆస్టిన్ నిర్వచించాడు. సార్వభౌముని ఆజ్ఞే చట్టమని అతను చెప్పాడు. చట్టానికి, నీతికి - చట్టానికి, ఆచారాలకు మధ్య తేడాలను అతను వివరించాడు. అతను వివరించిన శాసన స్వభావంపై అతను చెప్పిన సార్వభౌమాధికార సిద్ధాంతం ఆధారపడి ఉంది.

**సార్వభౌమాధికారం - నిర్వచనం**

ఆస్టిన్ ప్రకారం రాజ్యంలో ఒక నిర్ణీతమైన మానవాధికారి చేతిలో సార్వభౌమాధికారం ఉంటుంది. ఒక సమాజంలో ఇతరుల అధికారానికి విధేయుడై వుండక, అందరి విధేయతను పొందుతూ ఉన్న ఒక నిర్ణీత వ్యక్తి గాని, లేదా కొద్దిమంది వ్యక్తుల సముదాయాన్ని గాని సార్వభౌములనవచ్చునని ఆస్టిన్ చెప్పాడు. అటువంటి సమాజం రాజకీయంగా స్వతంత్రమైనది.

పై నిర్వచనాన్ని పరిశీలిస్తే ఆస్టిన్ న్యాయబద్ధ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని వివరించాడని తెలుస్తుంది. ఒక రాజ్యంలో ఒక సార్వభౌముడు మాత్రమే ఉంటాడు. అందువలన ఆస్టిన్ సిద్ధాంతాన్ని ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతమనవచ్చు.

**ఆస్టిన్ సిద్ధాంతం యొక్క ముఖ్యాంశాలు**

ఆస్టిన్ సిద్ధాంతంలో ఇమిడి ఉన్న ముఖ్యాంశాలను ఈ క్రింది విధంగా విశ్లేషించవచ్చు.

1. ప్రతి స్వతంత్ర రాజకీయ సమాజంలో ఒక నిర్ణీత మానవాధికారి సార్వభౌమాధికారాన్ని చెలాయిస్తాడు. సార్వభౌముడు ఏ యితర అధికారులకు విధేయుడై వుండడు.
2. పై అంశాన్ని అనుసరించి సార్వభౌమాధికారం అస్పష్టమైన ప్రజలలో గానీ, రూసో చెప్పిన జనేచ్ఛలో గాని ఉండదు.
3. సమాజంలో అధిక సంఖ్యాకులు అలవాటు ప్రకారం సార్వభౌమునికి విధేయులై ఉంటారు.
4. సార్వభౌముని అధికారం చట్టరీత్యా అపరిమితమైనది. అనగా నిరపేక్షమైనది.
5. సార్వభౌమాధికారం అవిభాజ్యమైనది. అది ఏకత్వాన్ని పొంది వుంటుంది.
6. శాసనాలకు మూలాధారం సార్వభౌముడు. అతని ఆజ్ఞే చట్టం. చట్టాన్ని ఉల్లంఘించినవారు శిక్షార్హులు.

**ఆస్టిన్ సిద్ధాంత విమర్శ**

చట్టబద్ధమైన సార్వభౌమాధికార స్వభావాన్ని ఆస్టిన్ సిద్ధాంతం స్పష్టంగా సక్రమపద్ధతిలో వివరించింది. సర్ హెన్రీమెయిన్, సిడ్జ్‌విక్, లాస్కీ మొదలగు రాజనీతి పండితులు ఆస్టిన్ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించారు. వీరి విమర్శలను ఇప్పుడు మనం పరిశీలిద్దాం.

1. హెన్రీమెయిన్ ప్రకారం నిరంకుశ రాజ్యాలలో సహితం ఆస్టిన్ చెప్పినటువంటి నిర్ణీత సార్వభౌమాధికారి వెదికినా కనిపించడు. 19వ శతాబ్దంలో పంజాబ్‌ను పాలించిన నిరంకుశ పాలకుడైన రంజిత్‌సింగ్‌ను ఈ సందర్భంలో మెయిన్ ఉదాహరణగా పేర్కొన్నాడు. ఆజ్ఞల ద్వారా అపరిమిత అధికారాన్ని

BRAOU

చెలాయించి రంజిత్‌సింగ్ తన ప్రజలను పాలించలేదని మెయిన్ చెప్పినాడు. నిరంకుశుడైనప్పటికీ, తన ప్రజల జీవన విధానాన్ని క్రమబద్ధం చేస్తున్న ప్రాచీన ఆచార సంప్రదాయాలను, మత నియమాలను శాసనాలు ద్వారా రంజింత్‌సింగ్ మార్చడానికి ప్రయత్నించలేదు. ఆస్టిన్ వర్ణించిన లక్షణాలతో సార్వభౌముడు మనకు చరిత్రలో కనిపించడు. అటువంటి సార్వభౌముడు అర్థరహితమని చెప్పవచ్చును.

2. ఆస్టిన్ సిద్ధాంతంలో రాజకీయ, ప్రజాసార్వభౌమాధికారులకు స్థానంలేదు. ఈ సిద్ధాంతం శాసన సార్వభౌమాధికారాన్ని మాత్రమే గుర్తించింది. ఆధునిక ప్రజాస్వామ్యాలలో నియోజకవర్గాలు, ప్రజాభిప్రాయం, నిర్బంధక సముదాయాలు మొదలుగా శక్తులు అధికార వినియోగాన్ని చక్కబరుస్తాయి. సార్వభౌమాధికారంపై ఇటువంటి శక్తులు ప్రభావాన్ని ఆస్టిన్ గుర్తించలేదు. నిజానికి ప్రజాస్వామ్య సమాజాలలో యదార్థ పాలకులను కనుగొనడం కష్టం.

3. ఆస్టిన్ చెప్పిన నిరపేక్ష సార్వభౌమాధికారం ఆచరణలో ఒక భ్రమ మాత్రమే. హెన్రీమెయిన్ చెప్పినట్లు పాలకులను ప్రజల ఆచార సాంప్రదాయాలు పరిమితం చేస్తాయి. ఇవిగాక రాజ్యాంగశాసనం, అంతర్జాతీయ న్యాయం రాజ్యసార్వభౌమాధికారాన్ని పరిమితం చేస్తాయి.

4. ఆస్టిన్ అభిప్రాయంలో సార్వభౌమాధికారం అవిభాజ్యం. ఈ అభిప్రాయంతో విమర్శకులు ఏకీభవించడం లేదు. అమెరికా, భారతదేశం వంటి సమాఖ్యరాజ్యాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాన్ని విభజించడం జరుగుతుంది. అంతేకాకుండా సమాఖ్య విధానంలో రాజ్యాంగ సవరణ ప్రక్రియలో కూడా నిర్ణీత సార్వభౌమాధికారి గోచరించడు. ఇందువలన సమాఖ్య రాజ్యాలలో సార్వభౌమాధికారం ఎక్కడుందో తెలుసుకోవడం కష్టమని లాస్కీ వాఖ్యానించాడు.

5. ఆస్టిన్ చెప్పిన ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని బహుతావాదులు తీవ్రంగా విమర్శించారు. సమాజంలో రాజ్యంతో పాటు వివిధరకాల సంఘాలు కూడా ఎన్నో రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నాయని బహుతావాదుల వాదన. వీరి అభిప్రాయంలో వ్యక్తి వికాసానికి రాజ్యమెంత అవసరమో, ఇతర సంఘాలు కూడా అంతే అవసరం. కాబట్టి రాజ్యానికి సార్వభౌమాధికారం ఏకస్వామ్యం కారాదు. సమాజ వ్యవస్థ సమాఖ్య విధానంలో ఉన్నప్పుడు అధికారపంపిణీ కూడా సమాఖ్య విధానంలో ఉండాలని లాస్కీ చెప్పాడు. కాబట్టి సార్వభౌమాధికారాన్ని రాజ్యం ఇతర సంఘాలతో పంచుకోవాలి.

6. శాసనాలకు మూలాధారం సార్వభౌమాధికారమని ఆస్టిన్ చెప్పాడు. ఈ అభిప్రాయంతో విమర్శకులు ఏకీభవించడం లేదు. ఆచారాలు, సాంప్రదాయాలు, మతం మొదలైనవి కూడా చట్టానికి మూలాధారాలు కాబట్టి సార్వభౌముని ఆజ్ఞనే చట్టమనడం సరైన వాదన కాదు. ఆస్టిన్ సిద్ధాంతంలో ఇంకొక లోపం వుంది. విధులను నిర్దేశించే చట్టాన్ని మాత్రమే గుర్తించి, హక్కుల నిచ్చే చట్టాన్ని ఆస్టిన్ అంగీకరించ లేదు.

విశాల న్యాయదృష్టితో పరిశీలిస్తే ఆస్టిన్ సిద్ధాంతం అసంపూర్ణమైనదని చెప్పవచ్చు. అయినప్పటికీ ఈ సిద్ధాంత విమర్శలు ఆధునిక రాజ్య సార్వభౌమాధికార సిద్ధాంతానికి దారి తీశాయని 'గిల్‌క్రిస్టు' చెప్పాడు.

BRAOU

## 4.7 బహుత్వసార్వభౌమాధికార సిద్ధాంతం

ఆస్టిన్ చెప్పిన చట్ట సమ్మతమైన నిరపేక్ష ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతానికి వ్యతిరేకంగా బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం అభివృద్ధి చెందింది. రాజనీతి శాస్త్రంలో బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం ఇటీవలి కాలంలో ప్రాచుర్యం పొందింది.

**బహుతావాదం - అర్థవివరణ**

సమాజానికి సంబంధించిన రాజకీయ, సామాజిక సిద్ధాంతాన్ని బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంత మనవచ్చు. బహుత్వ సార్వభౌమత్వ సిద్ధాంతం ప్రకారం సమాజంలో మత సంస్థలు, వ్యక్తి సంఘాలు, వర్తక సంఘాలు వంటి సంఘాలు, సమూహాలు ఎన్నో ఉన్నాయి. ఈ సంఘాలు ఒకదానిమీద ఒకటి ఆధారపడినప్పటికీ అవి స్వతంత్రంగా వ్యవహరిస్తాయి. అవి రాజ్యానికి లోబడి ఉండనక్కరలేదు. వాటిపై రాజ్యానికి సర్వహక్కులు ఉన్నాయని వాదించకూడదు. రాజ్యంపట్ల ఉన్న ఈ దృక్పథాన్నే బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతమని అనవచ్చును. సమాజంలో వివిధ సమూహాలు, సంస్థలు పనిచేసే పరిస్థితిని బహుతావాదమని చెప్పవచ్చు. నానాటికీ పెరుగుతున్న సంక్లిష్టమైన సమాజ వ్యవస్థను బహుతావాదులు సాంప్రదాయ సార్వభౌమాధికారానికి చేసిన విమర్శ సూచిస్తుంది.

**ముఖ్యాంశాలు**

బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని అనేకమంది రచయితలు అభివృద్ధి పరిచారు. జర్మనీకి చెందిన న్యాయశాస్త్రవేత్త అయిన గిర్కీ, ఆంగ్ల న్యాయశాస్త్ర చరిత్రకారుడైన మెయిట్‌లాండ్ రచనలలో బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం తొలిసారిగా కనిపిస్తుంది. హెచ్.జె.లాస్కీ, జె.ఎన్.ఫిగ్గిస్, జి.డి.హెచ్.కోల్, బార్కర్, ఎ.డి. లిండ్సే, మాకైవర్ మొదలగు ఆధునిక రచయితలు ప్రముఖ బహుతావాదులు. బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంత ముఖ్యలక్షణాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. బహుతావాదుల వాదన ననుసరించి సమాజంలోని అనేక సంఘాలలో రాజ్యమొకటి. రాజ్యం సమాజ సంక్షేమం కొరకు పాటుపడుతుంది. అంతమాత్రాన సార్వభౌమాధికారం ఒక్క రాజ్యానికే చెందుతుందనడం సమంజసం కాదు. వివిధ సంఘాలు కూడా సమాజానికి ఉపయోగకరమైన పనులు చేస్తాయి. ఇందువలన సార్వభౌమాధికారాన్ని రాజ్యానికి, వివిధ సంఘాలకు మధ్య పంచడమే సమంజసం. సార్వభౌమాధికారం అవిభాజ్యం కాదని బహుతావాదులు అంటారు.

2. సమాజంలోని వివిధ సంఘాలకు స్వతంత్రంగా వ్యవహరించే స్వేచ్ఛ ఉండాలి. ఆధునిక సమాజంలో బాగా అభివృద్ధి చెందిన అనేక సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంఘాలున్నాయి. వాటిలో అనేకమంది సభ్యులుగా ఉండి వాటి కార్యకలాపాలలో పాల్గొంటారు. వాటి మనుగడ రాజ్యం మీద ఆధారపడి ఉండదు. రాజ్యమెంత వాస్తవమో వివిధ సంఘాలు కూడా అంతే వాస్తవ మయినవి. ప్రతి సంఘానికీ ఒక వ్యక్తిత్వం, ఒక లక్ష్యం ఉంటాయి. సంఘాలు చేసే సేవలు వ్యక్తి వికాసానికి, నిర్వహించే కార్యకలాపాలు నిర్వహణకు కావలసిన స్వాతంత్ర్యం, సమస్యల పరిష్కారానికి అవసరమగు అధికారం వాటికి ఉండాలి. కాబట్టి వ్యక్తి ఒక్క రాజ్యానికే కాక ఇతర సంఘాలకు, సంస్థలకు విధేయుడై ఉండాలి.

BRAOU

3. రాజ్యంలో సార్వభౌమాధికారాన్ని ఒక నిర్ణీత వ్యక్తిలో కనుగొనడం కష్టమని బహుతావాదులు భావించారు. ఇది సమాఖ్య రాజ్యంలో ఇంకా కష్టమైనపని అని వారు చెప్పారు. ఎందుకనగా సమాఖ్య విధానంలో సార్వభౌమాధికారం కేంద్రరాష్ట్రాలమధ్య విభజింపబడుతుంది. ఈ కారణం వల్ల "సార్వభౌమాధికార భావనను వదలుకుంటే రాజనీతిశాస్త్రానికి శాశ్వతలాభం చేకూరుతుందని" లాస్కీ చెప్పాడు. ఇదే ధోరణిలో "రాజనీతి సిద్ధాంతం నుండి సార్వభౌమాధికారాన్ని తీసివేయడం మంచిదని" క్రేబ్ చెప్పాడు. రాజ్యంలో ఉన్న వివిధ సంఘాలు, వ్యక్తుల హక్కులు, అంతర్జాతీయన్యాయం సార్వభౌమాధికారాన్ని పరిమితం చేస్తాయి.

4. ప్రభుత్వ అధికారాన్ని వికేంద్రీకరణ చేయడం మంచిదని బహుతావాదుల వాదన. ఒక్క రాజ్యానికే సర్వాధికారాలు కట్టబెట్టడం వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు. వ్యక్తిస్వేచ్ఛకి భంగం కలుగుతుంది. పరిపాలన సామర్థ్యం తగ్గుతుంది. రాజకీయాధికారాన్ని అనేక సంస్థలు, వ్యవస్థలు ద్వారా పంపిణీ చేయడం మంచిది. వాటిలో ఏ ఒక్కటీ సార్వభౌమాధికారి కాకూడదు. విధి నిర్వాహక ప్రజాస్వామ్య పద్ధతి ద్వారా అధికారాల పంపిణీ జరగడం మంచిదని బహుతావాదులు భావించారు.

5. సార్వభౌముని ఆజ్ఞ శాసనం కాదని బహుతావాదులు భావించారు. సామాజిక సంఘీభావ పరిస్థితులే శాసనాలని డుగ్విట్ చెప్పాడు. సమాజంలో ఉన్న పరిస్థితుల ఫలితంగా శాసనాలు రూపొందుతాయని ఆధునిక సమాజశాస్త్రం నిరూపించింది. శాసనాలకు మూలాధారం సార్వభౌముడు కాదు. నీతి, న్యాయ భావన, ఆచార-సంప్రదాయాలు, సామాజిక ప్రయోజనాలు, శాసనాలకు మూలాధారాలని బహుతా వాదులు చెప్పారు. సమాజ మనుగడకు, శ్రేయస్సుకు శాసనాలు దోహదం చేస్తాయి కాబట్టి ప్రజలు వాటిని అనుసరిస్తారు.

6. బహుతావాదులు రాజ్యాన్ని పూర్తిగా తిరస్కరించలేదు. అది ఒక ముఖ్య రాజకీయ సంస్థ అని వారు అంగీకరించారు. వివిధ సంఘాలలో రాజ్యాన్ని ప్రథమ సంఘంగా వారు గుర్తించారు. రాజ్యమెంత ముఖ్యమో, రాజకీయేతర సంస్థలు కూడా అంతే ముఖ్యం. అవి కూడా సహజంగా ఏర్పడినవి.

7. అమెరికాకు చెందిన రాజనీతి శాస్త్రజ్ఞుడు రాబర్ట్ దాల్ బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని విశ్లేషించాడు. ఈ సిద్ధాంతాన్ని అనేక అధికార కేంద్రాలుగా పేర్కొన్నాడు. వాటిలో ఏ ఒక్కదానికి సంపూర్ణ సార్వభౌమాధికారం ఉండదు. అటువంటి అధికారం కేంద్రాలను స్థానిక స్థాయిలో బహుతావాదం ప్రోత్సహిస్తుందని దాల్ చెప్పాడు.

## విమర్శ

బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం కొన్ని విమర్శలకు గురయింది.

1. బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతంలో అంతర్గత పరస్పర వైరుధ్యం కనిపిస్తుంది. రాజ్య ఆధిక్యతను తిరస్కరిస్తూ సమాజంలో సమన్వయాన్ని చేకూర్చే బాధ్యతను ఇచ్చారు. వివిధ సంఘాలు, సమూహాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే అధికారాన్ని కూడా రాజ్యానికే ఇచ్చాడు. రాజ్యానికి అత్యున్నత స్థానాన్ని నిరాకరించడం వల్ల సమాజంలో అరాచకం ఏర్పడవచ్చు. అంతేకాకుండా చిన్న, బలహీన సమూహాలను, బలమైన పెద్ద సమూహాలు శాసించవచ్చు. కాబట్టి వివిధ సమూహాలు, హక్కులు విధేయతల మనుగడకు రాజ్యమనుగడ అవసరం.



BRAOU

2. బహుతావాదం సమూహాల సిద్ధాంతాన్ని అంగీకరిస్తుంది. ఇటువంటి సిద్ధాంతం రాజ్యాన్ని రద్దు చేయడానికి దారితీస్తుంది. ఇటువంటి అరాచకస్థితి రాజ్యానికి అధిక సార్వభౌమాధికారం ఉండవలసిన అవసరాన్ని సూచిస్తుంది.

3. రాజ్య స్వభావం, దాని విధులు సమాజంలో దానికున్న స్థానం గురించి బహుతావాదులలో ఏకాభిప్రాయం లేదు.

ఏకత్వ, బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాలు రెండూ పరస్పర విరుద్ధమైనవి. ఈ రెండింటిలో ఏ ఒక్క సిద్ధాంతం రాజ్యాధికార వాస్తవ పరిస్థితిని వివరించదు. ఈ రెండింటి మధ్యే మార్గం వాస్తవాలకు సన్నిహితంగా ఉంటుంది.

ప్రాముఖ్యత

బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతంలో కొన్ని లోపాలున్నప్పటికీ, రాజనీతి సిద్ధాంతానికి అదికొంత విలువైన సేవలను అందించింది.

1. అధిక శక్తివంతమైన రాజ్యం వల్ల ఏర్పడే ప్రమాదాలను ఈ సిద్ధాంతం సూచిస్తుంది.

2. కార్యనిర్వాహక అధికార వికేంద్రీకరణ ప్రయోజనాలను వివరించింది.

3. సమాజ జీవనంలో సమూహాల యొక్క ప్రాధాన్యతను తెలిపింది. సమూహాల అస్థిత్వమే సమాజం యొక్క రాజకీయ సారాంశం.

4. వివిధ మతాలు, జాతులు, కులాలు, భాషలు ఉన్న సమాజంలో అందరికి అనుకూలంగా వున్న నిర్ణయాలు మంచివని బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం చెబుతుంది.

## 4.8 క్లుప్తంగా

ఆధునిక రాజ్య ముఖ్య లక్షణం సార్వభౌమాధికారం. ఇది నిరపేక్ష చట్టబద్ధమైన రాజ్యాధికారం. ఇది ఒక్క రాజ్యానికి మాత్రమే ప్రత్యేక లక్షణం. ఆస్టిన్ సిద్ధాంతాన్ని అనుసరించి సార్వభౌమాధికారం నిరపేక్షమైనది, అవిభాజ్యమైనది, శాశ్వతమైనది. ఈ సిద్ధాంతానికి విభిన్నమైన సిద్ధాంతం బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతం. రాజ్యానికి - ఇతర సంఘాలకు మధ్య అధికారాన్ని పంపిణీ చేయాలని బహుతావాదుల వాదన. అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ సమాజం రాజ్య సార్వభౌమాధికారాన్ని పరిమితం చేస్తుంది. సార్వభౌమాధికారాన్ని వివిధ రాజ్యాలు పరస్పరంగా కోరుకొనే హక్కు వుందని గుర్తించడమే అంతర్జాతీయ సమాజానికి మూలాధారం.

## 4.9 చదువదగిన పుస్తకాలు


A.C. Kapoor : "Principles of Political Science" (S. Chand & Co; New Delhi.)

O.P. Gauba : "An Introduction to Political Theory" 3rd Ed. (Macmillan India Ltd., Delhi)


BRAOU

## 4.10 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులివ్వండి.**

1. ఏకత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.
2. బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని వివరించండి.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 10 పంక్తులలో జవాబు లివ్వండి.**

1. రాజకీయ సార్వభౌమాధికారం
2. శాసన రాజకీయ సార్వభౌమాధికార సిద్ధాంతాల మధ్య సంబంధాలు
3. ప్రజా సార్వభౌమాధికారం
4. బహుత్వ సార్వభౌమాధికారం

**రచయిత : ఎస్. పోలినాయుడు**

BRAOU

# భాగం-5: రాజ్యావతరణ సిద్ధాంతాలు - చారిత్రక, దైవ దత్తాధికార, బలప్రయోగ, మాతృ స్వామిక, పితృ స్వామిక సిద్ధాంతాలు

**విషయ సూచిక**

5.0 లక్ష్యాలు

5.1 పరిచయం

5.2 చారిత్రక సిద్ధాంతం

5.2.1 రాజ్య పరిణామానికి దారి తీసిన అంశాలు

5.3. దైవ దత్తాధికార సిద్ధాంతం

5.3.1 రాజుల దైవ హక్కు సిద్ధాంతం

5.5. బల ప్రయోగ సిద్ధాంతం

5.5.1 మాతృ స్వామిక సిద్ధాంతం

5.5.2 పితృ స్వామిక సిద్ధాంతం

5.6 క్లుప్తంగా

5.7 చదవదగిన పుస్తకాలు

5.8 నమూనా ప్రశ్నలు

## 5.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఎందుకు అనేక ఊహగాన రాజ్యావతరణ సిద్ధాంతాలు అభివృద్ధి చెందాయి - అనే విషయాన్ని అర్థం చేసుకొని వాటి గురించి వివరించగలరు.
- చారిత్రక సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని అది ఎందుకు అమోదయోగ్యమైన సిద్ధాంతమో వివరించగలరు.
- దైవదత్తాధికార, బలప్రయోగ, మాతృస్వామిక - పితృస్వామిక రాజ్యావతరణ సిద్ధాంతాలను చర్చించగలరు.
- పైన పేర్కొన్న రాజ్యావతరణ సిద్ధాంతాలను తులనాత్మకంగా పరిశీలించగలరు.

BRAOU

## 5.1 పరిచయం

రాజ్యం ఎప్పుడు ఏవిధంగా ఏర్పడింది - అనేది రాజనీతి సిద్ధాంతంలో ఒక ముఖ్య ప్రశ్న. ఈ ప్రశ్నకు సరైన సమాధానం లేదు. దీనికి కారణం చరిత్రకు పూర్వయుగం మానవుడు రాజ్యావతరణ గురించి తగినంత సమాచారాన్ని విడిచిపెట్టలేదు. రాజ్యావతరణ గురించి తగినన్ని చారిత్రక ఆధారాలు కూడా లేవు. ఈ కారణాల వలన రాజనీతి తాత్త్వికులు రకరకాల ఊహాజనిత సిద్ధాంతాలను చెప్పారు.

**వీటిలో ముఖ్యమైనవి :**

1. దైవ దత్తాధికార సిద్ధాంతం
2. బల ప్రయోగ సిద్ధాంతం
3. మాతృస్వామిక, పితృ స్వామిక సిద్ధాంతాలు
4. సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

పైన పేర్కొన్న నాలుగు సిద్ధాంతాలను ఊహాజనిత రాజ్యావతరణ సిద్ధాంతాలని అంటాం. వీటిలో చారిత్రక ఆధారాలు లేవు. రాజ్యంలో ఎందుకు మానవుడు నివసిస్తున్నాడు ? రాజ్యాధికారానికి ఎందుకు బద్ధుడై వున్నాడు? ఈ ప్రశ్నలకు పై నాలుగు ఊహాజనిత సిద్ధాంతాలు నాలుగు రకాల సమాధానాలను ఇచ్చాయి. ఈ సిద్ధాంతాలు ఊహాగానల మీద ఆధారపడినవి గనుక వీటికి ప్రస్తుతం రాజనీతి సిద్ధాంతంలో ప్రాముఖ్యత లేదు.

ఇటీవల కాలంలో చారిత్రక రాజ్యావతరణ సిద్ధాంతాన్ని రాజనీతి శాస్త్రజ్ఞులు అమోదయోగ్యమైన సిద్ధాంతంగా ప్రతిపాదించారు. ఈ భాగంలో చారిత్రక సిద్ధాంతం గురించి తెలుసుకుందాం.

BRAOU

## 5.2 చారిత్రక సిద్ధాంతం

చారిత్రక సిదాంతాన్ని పరిణామాత్మక సిద్ధాంతమని కూడా అంటారు. రాజ్యం క్రమక్రమంగా వివిధ చారిత్రక దశలలో అభివృద్ధి చెందిందని. ఈ సిద్ధాంతం యొక్క సారాంశం క్రమేణా జరిగిన సామాజిక అభివృద్ధి ప్రక్రియ ఫలితంగా రాజ్యం ఏర్పడింది. రాజ్యాభివృద్ధికి వివిధ దశలలో అనేక అంశాలు దోహదం చేసాయి. ఈ సిద్ధాంతం వలన రాజ్యం దైవ సృష్టికాదని తెలుస్తుంది. మానవుడు ఉద్దేశ్య పూర్వకంగా గాని, సామాజిక ఒడంబడిక ద్వారా గాని రాజ్యాన్ని ఏర్పరచలేదు. అతి సామాన్యమైన ప్రాచీన సామాజిక సంస్థల నుండి దీర్ఘ కాలంలో క్రమేణా అభివృద్ధి చెందింది. ఈవిధంగా రాజ్యం అభివృద్ధి చెందింది అనడానికి ఆధునిక కాలంలో శాస్త్రీయ, చారిత్రక, మానవ, సామాజిక శాస్త్రాల పరిశోధనల ఆధారం ఉంది. జె. డబ్ల్యూ. బర్జెస్, మాకయివర్, గార్నర్, గెటిల్ మొదలగువారు చారిత్రక సిద్ధాంతాన్ని సమర్ధించారు.

### 5.2.1 రాజ్య పరిణామానికి దోహదం చేసిన అంశాలు

ఇతర సామాజిక సంస్థలవలే రాజ్యం కూడా అనేక ఆధారాల నుండి వివిధ పరిస్థితులలో అస్పష్టంగా వికాసం చెందింది. రాజ్య వికాసానికి తోడ్పడిన అంశాలలో ముఖ్యమైనవి.

1. బంధుత్వం
2. మతం
3. వ్యక్తిగత ఆస్థి
4. యుద్ధం
5. రాజకీయ చైతన్యం

పై అంశాలను ఈక్రింది విధంగా క్లుప్తంగా వివరిద్దాం.

**1. బంధుత్వం (Kinship)**

బంధుత్వం అనగా రక్తసంబంధం. తొలి పౌర కర్తవ్యాన్ని అభివృద్ధి పరచడంలో బంధుత్వం మంచి పాత్ర పోషించింది. ప్రాచీన సమాజంలో బంధుత్వం మీద ఆధారపడిన కుటుంబ వ్యవస్థ ఒక ముఖ్య అంశం. కుటుంబ సభ్యులను బంధుత్వం ఏకం చేసింది. కుటుంబ యజమానిపట్ల, గౌరవాన్ని విధేయతను చూపేటట్లు కుటుంబ వ్యవస్థ కుటుంబ సభ్యులకు నేర్పింది. కుటుంబాల విస్తరణవల్ల వంశాలు, గోత్రాలు, తెగలు ఏర్పడ్డాయి. ఒకే మూల పురుషుని సంతతివారమునే నమ్మకం ఒక తెగవారి నందరినీ ఏకం చేసింది. ఈ నమ్మకం వలననే తెగ నాయకుని ఆదేశాలను పాటించి అతని అధికారం పట్ల, తెగ సభ్యులు విధేయతను చూపించేవారు. ఒక తెగవారు ఇతర తెగలవారిని శత్రువులుగా భావించేవారు. ప్రాచీన రాజ్యాలలో ప్రాదేశిక సంబంధాల కంటే వ్యక్తిగత సంబంధాలకే అధిక ప్రాధ్యానం ఉండేది. అంతేకాక ప్రాచీన కాలంలో ఒక నిర్ణీత ప్రదేశంలో నివసించే ప్రజలకే పాలకులమనే భావన పాలకులలో (రాజులు) ఉండేది. పై వివరణను అనుసరించి బంధుత్వం ప్రాచీన మానవ సమూహాలలో ఏకత్వాన్ని కలిగించి, రాజ్య నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించింది. మేకైవర్ అన్నట్లు "బంధుత్వం సమాజ వ్యవస్థకు దారి తీస్తే, సమాజ వ్యవస్థ రాజ్యవ్యవస్థకు దారి తీసింది". ఆజ్ఞ - విధేయత అనే ప్రభుత్వ మూల సూత్రాన్ని మొట్టమొదట కుటుంబ వ్యవస్థలోనే మానవుడు నేర్చుకున్నాడు.

BRAOU

**2. మతం (Religion)**

రాజ్య నిర్మాణంలో మతం ఇంకొక ముఖ్యాంశంగా పనిచేసింది. కుటుంబాలు క్రమేణా తెగలుగా విస్తరించడంతో బంధుత్వ సంబంధాలు క్రమంగా బలహీనపడ్డాయి. ఈ సమయంలో మతం రంగ ప్రవేశం చేసి ప్రజలలో బలహీనమౌతున్న ఏకత్వభావాన్ని బలపరిచింది. తొలిదశలో ఆది మానవుడు పితృదేవతారాధన చేసేవాడు. పితృదేవతల పూజా విధానం కుటుంబ సంఘాల సమైఖ్యతను బలపరిచింది.

పితృ దేవతారాధనతోపాటు ప్రకృతి శక్తులను ఆరాధించడం కూడా మొదలైంది. తుఫానులు, వరదలు, ఉరుములు, మెరుపులు మొదలగు ప్రకృతి రహస్యాలైన అద్భుతాలు ఆదిమ మానవుల అవగాహనకు అంతుపట్టలేదు. ఈ కారణం వలన ఆదిమ మానవుడు ప్రకృతి శక్తులను పూజించడం ప్రారంభించాడు. ఈదశలో మోసగాడైన మాంత్రికుడు ఆదిమ మానవులలో వంచనతో మూఢనమ్మకాలను కలిగించి వారిపై అధికారాన్ని చెలాయించడం ప్రారంభించాడు. మాంత్రికుల మోసాలు తెలసిన తరువాత ప్రజలు వారిపై అధికారానికి తెరపడింది. మాంత్రికులు తరువాత పురోహితులు నాయకులైనారు. ఆదిమ కాలంలో పాలకులను పురోహిత - రాజులని పిలిచేవారు. ఉత్సవాల నిర్వహణ, మత నియమ పాలన కూడా వారి కర్తవ్య పరిధిలో ఉండేవి.

బంధుత్వము, మతము ఒక నాణానికి రెండు వైపుల లాంటివి. పాలకుని అధికారానికి మతం మద్దతు లభించింది. అనాగరిక ఆదిమ వాసులలో అరాచక ప్రమాదాన్ని మతం తొలగించింది. అంతేకాక అధికారం పట్ల విధేయతను కూడా ఆదిమ మానవులకు మతం నేర్పింది. ఈనాడు కూడా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి రాజ్యాలలో ప్రభుత్వ పాలనపై మత ప్రభావం కనిపిస్తుంది.

### 3. ఆస్థి (Property)

ఆదిమ మానవుల ఆర్థిక కార్యకలాపాలు కూడా ఎన్నో విధాలుగా రాజ్యావతరణకు తోడ్పడ్డాయి. పశుపోషణ ఆదిమ మానవుని ఆర్థిక విధానంలో తొలిదశ. తరువాత వ్యక్తిగత ఆస్తి అభివృద్ధి చెందింది.

ఆర్థిక విధానంలో వచ్చిన ఈ మార్పులు సామాజిక వ్యవస్థల అభివృద్ధిలో ఒక మైలురాయి వంటివి. ఈ నూతన ఆర్థిక వ్యవస్థలు ఏర్పడడం వలన సామాజిక నియంత్రణ - నాయకత్వం అవసరమైనాయి.

తరువాత కొంతకాలానికి మానవుని ఆర్థిక విధానంలో వ్యవసాయిక దశ ప్రారంభమైంది. ఈదశలో సంపద పెరిగి వ్యక్తిగత ఆస్తికి ప్రాముఖ్యత లభించింది. ధనవంతులు - బీదవారి మధ్య వర్గ విభేదాలు అవతరించాయి. ఆస్తులకు సంబంధించిన వివాదాలు తలెత్తాయి. ఇటువంటి వివాదాల పరిష్కారానికి అవసరమగు శాసనాలను, నియమ నిబంధనలను తయారు చేసి అమలు చేసే అధికారులు అవసరమయ్యారు. వ్యవసాయిక దశలో మానవుడు ఒకే ప్రదేశంలో స్థిరనివాసి అయ్యాడు. ఈ కారణం వలన ప్రాదేశిక రాజ్యం ఏర్పడింది. స్థిరనివాసం వలన ఒక ప్రదేశంతో బంధుత్వ బంధాన్ని మరింత పటిష్టం చేసింది. ఈ విధంగా రాజ్య నిర్మాణంలో ఆర్థిక అంశాలు ప్రముఖ పాత్ర వహించాయి. కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం ఆర్థిక అవసరాలు తీర్చడానికి రాజ్యం ఏర్పడింది. అది ధనిక వర్గాల స్వార్థ ప్రయోజనాలను తీర్చడానికి ఉపయోగపడుతుందని సామ్యవాదుల భావన.

### 4. యుద్ధం (War)

యుద్ధం ద్వారా ఇతర రాజ్యాలను జయించాలనే కాంక్ష రాజ్య అవతరణకు దారి తీసింది. యుద్ధ సమయాలలో ఆత్మరక్షణకుగానీ, దురాక్రమణ చేయడానికి గానీ ఐక్య నాయకత్వం అడుగుజాడలలో సైనికులు నాయకుని అదుపు ఆజ్ఞలకు లోబడి నడుచుకోవల్సి వచ్చేది. యుద్ధంలో విజయాన్ని సాధించిన నాయకుని పాలకునిగా ప్రజలు గుర్తించేవారు. ఓడిన వారు గెలిచిన నాయకుని పట్ల విధేయతతో మెలిగేవారు. ఈ విధంగా యుద్ధం, బలప్రయోగం రాజ్య అవతరణకు తోడ్పడ్డాయి.

### 5. రాజకీయ చైతన్యం (Political Consciousness)

సమిష్టి లక్ష్య సాధనకు ఒక ప్రభుత్వం అవసరమనే భావనే రాజకీయ చైతన్యం. శాంతి భద్రతలు, దేశరక్షణ, ప్రజా సంక్షేమం మొదలగునవి సమిష్టి లక్ష్యాలకు ఉదాహరణలు. ఈ సమిష్టి లక్ష్యాల సాధనకు ప్రజల సాంఘిక సంబంధాలను క్రమపరచడానికి ఒక ప్రభుత్వ వ్యవస్థ అవసరమని అన్ని కాలాలలో ప్రజలు గుర్తించారు. ఇటువంటి గుర్తింపే రాజికయ సంస్థల స్థాపనకు దారి తీసింది.

పై చర్చననుసరించి రాజ్యావతరణకు ఏ ఒక్క అంశం కారణం కాదని తెలుస్తుంది. బంధుత్వం, మతం, వ్యక్తిగత ఆస్థి, బలప్రయోగం, రాజకీయ చైతన్యం మొదలగు అంశాలు వివిధ దశలలో రాజ్యవతరణకు, దాని పరిణామానికి దోహదం చేసాయి. రాజ్యాభివృద్ధి నిరాటంకంగా కూడా జరగలేదు.

BRAOU

## 5.3 దైవ దత్తాధికార సిద్ధాంతం

రాజ్యావతరణను వివరించే సిద్ధాంతాలలో దైవదత్తాధికార సిద్ధాంతం అతిప్రాచీనమైనది. రాజ్యాన్ని భగవంతుడు సృష్టించాడని, దాని నిర్వహణ భగవంతుని ప్రతినిధియైన రాజుకు అప్పగించడం జరిగిందని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. రాజు (పాలకుడు) భగవంతునికే బాధ్యుడు. ప్రజలు అతని ఆజ్ఞలను తప్పకుండా శిరసావహించాలి. రాజు దైవసమానుడు. అతని ఆజ్ఞలను ధిక్కరిస్తే భగవంతుని ధిక్కరించినట్లే. అటువంటి ధిక్కరణ పాపకార్యంగా పరిగణింపబడుతుంది. రాజుపై తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు లేదు. ప్రాచీన కాలంలో చాలా దేశాలలో దైవ దత్తాధికార సిద్ధాంతం ప్రచారంలో ఉండేది. రాజ్యం భగవంతుని సృష్టిఅని మన మహాభారతం ప్రస్తావించింది. రాజు అధికారాలకు మూలం భగవంతుడని ఓల్డు టెస్టమెంట్ (Old Testament) చెప్పింది. రాజు దైవ ప్రతినిధి అని ప్రాచీన హిబ్రూలు భావించారు. మధ్యయుగంలో దైవ దత్తాధికార సిద్ధాంతం బహుళ ప్రచారాంలో ఉండేది. ఆకాలంలో ఈ సిద్ధాంతం బాగా వ్యాప్తి చెందింది.

### 5.3.1 రాజుల దైవ హక్కు సిద్ధాంతం

క్రీ.శ. 16, 17 శతాబ్దాలలో దైవ దత్తాధికార సిద్ధాంతం రాజుల దైవహక్కు సిద్ధాంతంగా మారింది. ఈ సిద్ధాంతం ప్రకారం రాజుకు అధికారం ప్రత్యక్షంగా భగవంతుని నుండి సంక్రమించింది. కాబట్టి రాజు అధికారానికి భగవంతుని అనుమతి ఉంది. ఇంగ్లాండులో స్టువర్ట్ వంశానికి చెందిన మొదటి జేమ్సు, ఫ్రాన్సులో పధ్నాలుగో లూయీ తమ నిరంకుశ రాజ్యాధికారాన్ని బలపరచుకోడానికి ఈ సిద్ధాంతాన్ని సమర్థించారు. "భూమి మీద భగవంతుని సజీవ ప్రతినిధులే రాజుల"ని ఒకటవ జేమ్సు ప్రకటించాడు. కాబట్టి రాజుని ధిక్కరిస్తే భగవంతుని ధిక్కరించినట్లే. ఇంగ్లాండ్‌లో సర్ రాబర్ట్ ఫిల్మర్ (Sir Robert Filmer), ఫ్రాన్సులో బోస్సే (Bossuett) కూడా ఈ సిద్ధాంతాన్ని సమర్థించిన వారిలో ముఖ్యులు.

**ముఖ్యలక్షణాలు :**

దైవదత్తాధికార సిద్ధాంత ముఖ్య లక్షణాలను ఆచార్య జి.పి. గౌభ ఈవిధంగా పేర్కొన్నాడు.

1. రాజరికాన్ని (Monarchy) భగవంతుడే ఆజ్ఞాపించాడు.
2. రాజుల వంశపారంపర్య హక్కును ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదు.
3. రాజు భగవంతునికి మాత్రమే బాధ్యుడు.
4. న్యాయబద్ధమైన రాజు అధికారాన్ని ధిక్కరించే హక్కు ప్రజలకు లేదు. అంటే రాజుపై తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు లేదు.

**సిద్ధాంత పతనం :**

దైవ దత్తాధికార సిద్ధాంత పతనానికి దారితీసిన ముఖ్య కారణాలు (ఎ) సమ్మతి సూత్రాన్ని ఆధారం చేసుకొని ప్రచారంలోకి వచ్చిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం.

(బి) ప్రజాస్వామ్యం వృద్ధి చెందడం.

(సి) రాజ్యం నుండి చర్చి వేర్పాటవడం

(డి) నిరంకుశ రాజరికానికి వ్యతిరేకంగా సంభవించిన ప్రజా విప్లవాలు.

పై కారణాల వల్ల దైవదత్తాధికార సిద్ధాంతం అపఖ్యాతిపాలై పూర్తిగా పతనం చెందింది.

BRAOU

## విమర్శ

దైవ దత్తాధికార సిద్ధాంతం అనేక విమర్శలకు గురైంది.

1. ఇది మత విశ్వాసం మీద ఆధారపడిన సిద్ధాంతం. ఇది హేతుబద్ధమైన సిద్ధాంతం కాదు. రాజ్యాన్ని భగవంతుడు సృష్టించలేదని, మానవులే వారి అవసరాలను తీర్చుకోడానికి ఏర్పరచుకున్నారని మనందరికి తెలిసిన విషయమే.

2. ఈ సిద్ధాంతం ఒక్క రాజరికాన్నే గుర్తించింది. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనది. రాజు ప్రజలకు బాధ్యుడు కాదు. కాబట్టి నిరంకుశ రాజుల పాలనలో ప్రజలు హింసకు గురికావచ్చు.

## సుగుణాలు

పైన పేర్కొన్న లోపాలున్నప్పటికీ దైవదత్తాధికార సిద్ధాంతంలో కొన్ని సుగుణాలున్నాయి. రాజ్య క్రమాభివృద్ధిలో మతం పోషించిన పాత్రను ఈ సిద్ధాంతం వివరించింది. రాజ్యం దైవ నిర్మితమని వివరించడం బట్టి రాజ్యానికి నైతిక హోదాను కల్పించింది. అంధయుగాలుగా పేర్కొనబడిన మధ్యయుగంలో అరాచకాన్ని నిరోధించి, శాంతి భద్రతలను కాపాడడానికి ఈ సిద్ధాంతం తోడ్పడింది. రాజ్యాధికారానికి కొంత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ప్రజలు తమను తాము పాలించుకొనే స్థితిలో లేనప్పుడు వారికి రాజ్యబద్ధతను నేర్పింది రాజుల నైతిక బాధ్యతలను ఈ సిద్ధాంతం నొక్కి చెప్పింది.

## 5.4 బలప్రయోగ సిద్ధాంతం (Force Theory)

యుద్ధం కారణంగా రాజు అవతరించాడని ఒక ప్రాచీన సామెత చెప్పింది. ఈ సామెతపై బలప్రయోగ సిద్ధాంతం ఆధారపడిందని చెప్పవచ్చు. ప్రాచీన కాలంలో వివిధ తెగల మధ్య తరచు యుద్ధాలు జరిగేవి. యుద్ధంలో విజేతలు ఓడినవారి ఆస్తులను ఆక్రమించేవారు. ఆస్తిపాస్తులకు సంబంధించిన వివాదాలను విజేతలు పరిష్కరించవలసి వచ్చేది. వీటికి సంబంధించిన నియమ నిబంధనలను రూపొందించి అమలు పరచడానికి రాజ్యం - ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాడ్డాయి. డేవిడ్ హ్యూమ్, లీకాక్, జెంక్సు, ట్రైట్స్‌కి బలప్రయోగ సిద్ధాంతాన్ని సమర్థించిన వారిలో ముఖ్యులు.

ప్రాచీన ఆధునిక కాలంలో కొన్ని రాజవంశాలు, కొంతమంది నియంతలు బలప్రయోగ హింసాత్మక పద్ధతుల ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్నట్లు చరిత్ర చెబుతుంది. ప్రాచీన కాలంలో ఈజిప్టులో అనేక రాజవంశాలు పైన వివరించిన పద్ధతుల ద్వారా అధికారానికి వచ్చినట్లు చరిత్ర తెలుపుతుంది. 20వ శతాబ్దంలో రష్యా, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ దేశాలలో నియంతలు బలప్రయోగం ద్వారా అధికారంలోకి వచ్చారు.

ఈ సిద్ధాంతాన్ని వివిధ రచయితలు విభిన్న ప్రయోజనాల కొరకు ఉపయోగించారు. మధ్యయుగంలో మతాచార్యులు చర్చి రాజ్యం కంటే గొప్పదని నిరూపించడానికి, ఆధునిక యుగంలో వ్యక్తి స్వేచ్ఛావాదులు, అరాచకవాదులు వ్యక్తి స్వేచ్ఛను సమర్థించడానికి బలప్రయోగ సిద్ధాంతాన్ని ఉపయోగించారు. రాజ్యం ఒక దోపిడీ సంస్థ కాబట్టి దానిని సంస్కరించవలసిన అవసరముందని చెప్పడానికి సామ్యవాదులు ఈ సిద్ధాంతాన్ని ఉపయోగించారు.

బలప్రయోగ సిద్ధాంతంలో కొంత నిజముందని చెప్పవచ్చు. రాజ్యావతరణకు, దాని మనుగడకు సైనిక బలం అవసరమని చెప్పవచ్చు. కానీ రాజ్యావతరణకు, దాని అభివృద్ధికి సైనిక బలంతోపాటు, రక్తసంబంధం, మతం, వ్యక్తిగత ఆస్తి, రాజకీయ చైతన్యం మొదలగు అనేక అంశాలు తోడ్పడ్డాయి. ఏరాజ్యం కూడా ఒక్కబలం మీదే ఆధారపడి శాశ్వతంగా మనుగడ సాగించలేదు. దాని మనుగడకు ప్రజాసమ్మతి కూడా అవసరమే. "రాజ్యానికి మూలాధారం జనేచ్ఛేగాని, శక్తికాదని" టి.హెచ్. గ్రీన్ అన్నాడు. ఈ సిద్ధాంతం రాజ్యాధికారాన్ని ప్రతిఘటించే హక్కు ప్రజలకు ఇవ్వలేదు. ఇందులో వ్యక్తి స్వేచ్ఛకు కూడా స్థానం లేదు. ఈలోపాల వలన యీ సిద్ధాంతం అంత ఆమోద యోగ్యమైనది కాదు.

## 5.5 మాతృ స్వామిక, పితృ స్వామిక సిద్ధాంతాలు

### 5.5.1 మాతృ స్వామిక సిద్ధాంతం

మాతృ స్వామిక కుటుంబం రాజ్యావతరణకు మూలమని ఈ సిద్ధాంతం చెబుతుంది. జె.ఇ. మెక్లినాన్, ఎల్.హెచ్. మోర్గాన్, ఎడ్వర్డ్ జెంక్సు మాతృ స్వామిక సిద్ధాంతాన్ని సమర్థించిన వారిలో ముఖ్యులు. "Primitive Society" (1865) అనే పుస్తకంలో మెక్లినాన్, "Studies in Ancient Society" (1877) అనే గ్రంథంలో మోర్గాన్, "A History of Politics" (1900) అనే పుస్తకంలో జెంక్స్ మాతృ స్వామిక సిద్ధాంతంపై వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. వారి అభిప్రాయాల ననుసరించి ఈ సిద్ధాంతాన్ని ఈక్రింది విధంగా వివరించవచ్చు.

1. ప్రాచీనకాలంలో మాతృ స్వామిక కుటుంబ వ్యవస్థ మొట్టమొదట ఉండేది.
2. కుటుంబానికి తల్లి యజమానురాలు.
3. ఆస్తిపాస్తులకు వారసులు స్త్రీలే.
4. బహు భర్తృత్వ విధానం ప్రాచీన కాలంలో ఆచరణలో ఉండడంవల్ల వంశ నిర్ధారణ స్త్రీల ద్వారా జరిగేది.
5. అనేక దశలలో మాతృ స్వామిక కుటుంబాలు విస్తరించడం వల్ల రాజ్య మేర్పడిందని ఈ సిద్ధాంతం వివరిస్తుంది.

పైన పేర్కొన్న అంశాలు మాతృ స్వామిక సిద్ధాంతం యొక్క ముఖ్య లక్షణాలుగా చెప్పవచ్చు.

**విమర్శ**

ప్రాచీన కాలంలో మాతృ స్వామిక కుటుంబ వ్యవస్థ ఉన్నమాట నిజమే. కానీ ఆ కుటుంబ వ్యవస్థ సార్వజనీనమైనది కాదు. ఇదే అతి ప్రాచీన వ్యవస్థని కూడా చెప్పలేము. రాజ్యావతరణ వివరణ కంటే సామాజిక వ్యవస్థను ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఇది కుటుంబ వ్యవస్థ పుట్టు పూర్వోత్తరాలను ఎక్కువగా వివరిస్తుంది.

BRAOU

### 5.5.2 పితృ స్వామిక సిద్ధాంతం

వివాహ వ్యవస్థ ద్వారా కుటుంబాలు, కుటుంబాలు వంశాలుగా, వంశాలు తెగలుగా విస్తరించి వాటి కలయిక వల్ల ఏర్పడిన సంఘటిత వ్యవస్థే రాజ్యమని పితృ స్వామిక సిద్ధాంతం వివరిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని బలపర్చిన వారిలో అతి ముఖ్యుడు సర్. హెన్రీ మెయిన్. "Ancient Law" (1861), "Early Hisotry of Institutions" (1875) అనే రెండు గ్రంథాలలో యీ సిద్ధాంతాన్నిమెయిన్ వివరించాడు.

ఈ సిద్ధాంతం యొక్క ముఖ్యాంశాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. కుటుంబానికి యజమాని తండ్రి. అతనికి కుటుంబ సభ్యులపై సంపూర్ణాధికారం ఉండేది.
2. పురుషుని ద్వారా బంధుత్వం సంక్రమిస్తుంది.
3. శాశ్వత వివాహ వ్యవస్థ ఇంకొక లక్షణం.
4. అధికారం పితృ సంబంధమైనది

**విమర్శ**

మెక్లినాన్ ఈ సిద్ధాంతాన్ని విమర్శించిన వారిలో ముఖ్యుడు. ప్రాచీన కాలంలో పితృ స్వామిక కుటుంబం సార్వజనీనమైనది కాదని ఇతను చెప్పాడు. ఆదిమ మానవ సహజంలో మాతృస్వామిక కుటుంబ వ్యవస్థ ఆచరణలో ఉండేది. అంతేకాక ఆకాలంలో శాశ్వత వివాహ వ్యవస్థ లేదు. ఇది పురుషుని ద్వారా సంక్రమించే బంధుత్వానికి అధిక ప్రాధాన్యత నిచ్చింది. ఇది రాజ్యవతరణకు, దాని అభివృద్ధికి బంధుత్వం పాత్రను వివరించింది. అయినప్పటికీ, రాజ్యావతరణ సిద్ధాంతంగా దీనికి ప్రాధాన్యత లేదు.

## 5.6 క్లుప్తంగా

చారిత్రక, దైవదత్తాధికార, బలప్రయోగ, మాతృస్వామిక, పితృస్వామిక రాజ్యావతరణ సిద్ధాంతాలను ఈభాగంలో మనం చర్చించాం. 'ఒక్కొక్క సిద్ధాంతం ఒక్కొక్క విధంగా రాజ్యావతరణను వివరించాయి'. రాజ్యం దైవ సృష్టని దైవదత్తాధికార సిద్ధాంతం చెప్పింది. యుద్ధాలు రాజ్యావతరణకు దారితీసాయని బలప్రయోగ సిద్ధాంతం వివరిస్తుంది. జన్య సిద్ధాంతం (Genetic Theory) మాతృ పితృ స్వామిక సిద్ధాంతాలు - ప్రకారం కుటుంబాల విస్తరణవల్ల ఏర్పడింది. అయితే ఈ సిద్ధాంతాలన్నింటికీ ఆధారాలు లేనందున వీటిని ఎవరూ అంగీకరించడంలేదు. ప్రస్తుతం అందరికీ ఆమోదయోగ్యమైన సిద్ధాంతం చారిత్రక సిద్ధాంతం. మిగిలిన సిద్ధాంతాల అంశాలన్నీ ఈ సిద్ధాంతంలో యిమిడి ఉన్నాయి. రాజ్యం ఎన్నో కారణాలవల్ల క్రమక్రమంగా అభివృద్ధి చెందిందని చారిత్రక సిద్ధాంతం వివరిస్తుంది.

## 5.7 చదువదగిన పుస్తకాలు

Amal Ray and Mohit Bhattacharaya "Political Theory and Insitutions"

V.D. Mahajan, "Political Theory"

BRAOU

## 5.8 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబు లిమ్ము.**

(ఎ) రాజ్యావతరణకి సంబంధించిన ఊహాగాన సిద్ధాంతాలను సంక్షిప్తంగా వివరించుము.

(బి) చారిత్రక రాజ్యావతరణ సిద్ధాంతాన్ని పరిశీలింపుము.

**II. ఈ క్రింది వాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబు లిమ్ము**

(ఎ) దైవదత్తాధికార సిద్ధాంతాన్ని పరిశీలింపుము

(బి) బల ప్రయోగ సిద్ధాంతం గురించి సంక్షిప్త వివరణనిమ్ము

(సి) మాతృస్వామిక సిద్ధాంతాన్ని వివరింపుము

(డి) పితృస్వామిక సిద్ధాంతాన్ని వివరింపుము

**రచయిత : ఎస్. పోలినాయుడు**

BRAOU

# భాగం-6 : రాజ్యావతరణ సిద్ధాంతాలు - సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

విషయ సూచిక


6.0 లక్ష్యాలు

6.1 పరిచయం

6.2 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

6.2.1 హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

6.2.2. లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

6.2.3 రూసో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

6.2.4 హాబ్స్-లాక్-రూసోల సామాజిక ఒడంబడిక సిద్ధాంతాల తులనాత్మక పరిశీలన

6.2.5 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం - అంచనా

6.3. క్లుప్తంగా

6.4 చదువదగిన పుస్తకాలు

6.5 నమూనా ప్రశ్నలు


## 6.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఒక రాజ్యావతరణ సిద్ధాంతంగా సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని అర్థం చేసుకొని వివరించగలరు.
- హాబ్స్, లాక్, రూసోల సామాజిక ఒడంబడిక సిద్ధాంతాలు పూర్వరంగాలను దృష్టిలో వుంచుకొని వివరించగలరు.
- ప్రాకృతిక వ్యవస్థ, ఒడంబడికలపై హాబ్స్, లాక్, రూసోల భావాలను తులనాత్మకంగా పరిశీలించగలరు.
- సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించగలరు.

## 6.1 పరిచయం

రాజ్యావతరణకు సంబంధించిన ఊహాగాన సిద్ధాంతాలలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ఒకటి. కాగా దైవదత్తాధికార సిద్ధాంతం, బల ప్రయోగ సిద్ధాంతం కూడా ఈ కోవకు చెందినవే. ఊహాగాన సిద్ధాంతాలు అన్నింటికంటే సామాజిక ఒడంబడిక సిద్ధాంతం అతి ముఖ్యమైనది. అంతేకాక ప్రాచుర్యం పొందింది. సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ప్రకారం వ్యక్తులు ఒడంబడిక ద్వారా సామాజిక అవసరాలను తీర్చుకొనుటకు రాజ్యాన్ని



B R A O U

నిర్మించుకున్నారు. ఇది యాంత్రిక దృక్పథానికి చెందిన సిద్ధాంతం. ఎందుకనగా ఈ సిద్ధాంతం రాజ్యాన్ని ఒక కృత్రిమ సాధనంగా పరిగణించింది. ఈ సిద్ధాంతం ఉదారవాద భావాలను వెల్లడిస్తుంది. ఇది దైవదత్తాధికార సిద్ధాంతానికి విరుద్ధమైనది.

## 6.2 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : అర్థవివరణ

ప్రాకృతిక వ్యవస్థలో జీవించే ప్రజలు ఒప్పందం ద్వారా రాజ్యాన్ని నిర్మించుకున్నారని సామాజిక ఒడంబడిక సిద్ధాంతం చెపుతుంది. ఈ ఒప్పందం వల్ల సమాజం కూడా ఏర్పడింది. ఈ సిద్ధాంతంలో రెండు ముఖ్యాంశాలు ఇమిడి ఉన్నాయి. (1) ప్రాకృతిక వ్యవస్థ (2) ఒడంబడిక

రాజ్యావతరణకు ముందున్న పరిస్థితిని ప్రాకృతిక వ్యవస్థ అనవచ్చును. ప్రాకృతిక వ్యవస్థలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించుకోవడానికి ప్రజలు ఒక ఒప్పందాన్ని చేసుకున్నారు. దీనిద్వారా రాజకీయ సమాజం ఏర్పడింది. ఈ ఒప్పందం ద్వారా పౌర సమాజ ప్రయోజనాలను పొందడానికి ప్రజలు వారికి వున్నటువంటి కొన్ని సహజ హక్కులను వదులుకున్నారు. ఒప్పందం కారణంగా ప్రజలకు రాజ్యరక్షణ లభించింది. ప్రాకృతిక వ్యవస్థ, ఒడంబడికలపై హాబ్స్, లాక్, రూసోలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు.

**ఒడంబడిక సిద్ధాంత చరిత్ర**

రాజనీతి సిద్ధాంతం ఎంత పురాతనమైనదో, సామాజిక ఒడంబడిక భావన కూడా ఇంచుమించు అంత ప్రాచీనమైనదే. ప్రాక్పశ్చిమ దేశాల రాజనీతి తత్త్వవేత్తల రచనలో ఒడంబడిక సిద్ధాంతం యొక్క ప్రస్తావన వుంది. ప్రాచీన భారతదేశంలో కౌటిల్యుని అర్థశాస్త్రంలో, మహాభారతంలోని శాంతి పర్వంలోను ఈ సిద్ధాంత ప్రస్తావన కనిపిస్తుంది. ప్రాచీన గ్రీకు తత్త్వవేత్తలైన ప్లేటో, అరిస్టాటిల్‌లు కూడా ఈ సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. అయితేవారు ఈ సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. రోమన్ న్యాయ శాస్త్రంలో కూడ సమ్మతి సిద్ధాంతం వుంది. మధ్యయుగంలో భూస్వామ్య వ్యవస్థ ఈ సిద్ధాంతాన్ని సంపూర్ణంగా సమర్థించింది. 17,18 శతాబ్దాలలో ఐరోపాలో హాబ్స్, లాక్, రూసోల రచనల ద్వారా ఒడంబడిక సిద్ధాంతం అధిక ప్రాచుర్యాన్ని పొందింది.

B R A O U

**ఒడంబడిక సిద్ధాంత ప్రతిపాదకులు**

సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారిలో ముఖ్యులు ఆంగ్ల రాజనీతి తత్త్వవేత్తలు థామస్ హాబ్స్ (1588-1679), జాన్ లాక్ (1632-1704), ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త రూసో (1712-1772). ఒడంబడిక సిద్ధాంతం వీరి రచనలలో క్రమబద్ధంగా చర్చించబడింది. ఈ సిద్ధాంతానికి వీరు ఆధునిక రూపకల్పన చేశారు.

### 6.2.1. హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

థామస్ హాబ్స్ 1588లో జన్మించాడు. ఇంగ్లాండులో ఆనాటి రాజకీయ అస్థిర పరిస్థితుల ప్రభావం హాబ్స్ రచనల్లో కనిపిస్తుంది. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తిచేసి సంపన్న కుటుంబాల పిల్లలకు ఉపాధ్యాయునిగా పనిచేశాడు. ఇతని కాలంలో ఇంగ్లాండ్‌లో జరిగిన అంతర్యుద్ధంలో ప్రభువర్గ పక్షం వహించాడు. సామాజిక ఒడంబడిక భావన ఇతని నిరపేక్ష సార్వభౌమాధికార సిద్ధాంతానికి

మూలాధారమైంది. హాబ్స్ తన జీవిత కాలంలో ఎక్కువభాగం విదేశీ పర్యటనకు, గ్రంథరచనకు వినియోగించాడు. ఆ కాలంలో వైజ్ఞానిక రంగం, తత్వశాస్త్రం, నూతన విజ్ఞాన రంగాలలో వచ్చిన మార్పులు హాబ్స్ రాజనీతి సిద్ధాంతాన్ని ఎక్కువగా ప్రభావితం చేశాయి.

హాబ్స్ ముఖ్య రచనలు (1) డి. కార్పొరా పొలిటికో (De Corpore Poltico - 1640) (2) డి. సివి (De Cive - 1642) (3) లెవియాథాన్ (Leviathan - 1651) ఇతని రచనలలో ఈ గ్రంథమే పేర్కొన దగినది.

**ప్రాకృతిక వ్యవస్థపై హాబ్స్ అభిప్రాయం**

ప్రాకృతిక వ్యవస్థలో మానవ జీవనం విధాన వర్ణనతో హాబ్స్ సిద్ధాంతం ప్రారంభమైంది. సామాజిక, రాజకీయ జీవన విధానంలేని మానవుని స్థితిని హాబ్స్ ప్రాకృతిక వ్యవస్థగా వర్ణించాడు. ప్రాకృతిక వ్యవస్థను వివరించేముందు హాబ్స్ మానవ స్వభావాన్ని వర్ణించాడు. మానవుడు సహజంగా స్వార్థపరుడు, క్రూరుడు. ఎల్లప్పుడూ తన భద్రత గురించి, అధికారం గురించి మనిషి తాపత్రయ పడతాడు. మానవుడు సంఘ వ్యతిరేక జంతువని హాబ్స్ చెప్పాడు. మానవుని సహజ శక్తులే అతని సహజ స్వేచ్ఛ. మానవులందరికీ సమాన స్వేచ్ఛ, సమాన శక్తియుక్తులున్నాయి. ఒకరికి దేహబలం ఎక్కువగా ఉంటే, మరొకరికి బుద్ధిబలం ఎక్కువగా ఉంటుంది. మానవులందరూ ఇంచుమించుగా సమాన శక్తివంతులు.

మానవ స్వభావంలోనే సంఘర్షణకు ప్రధాన కారాణాలు వున్నాయని హాబ్స్ చెప్పాడు. పోటీతత్త్వం, అధికార దాహం, పిరికితనం, అధిక గౌరవ హోదాలకు ప్రాకులాట మొదలైనవి సంఘర్షణకు కారణాలుగా హాబ్స్ భావించాడు. వైరం, పరస్పర అపనమ్మకాలతో మానవుల మధ్య సంబంధాలు ఉంటాయి. ఈ కారణాల వల్ల ప్రాకృతిక వ్యవస్థలో మానవుల మధ్య నిరంతర యుద్ధ పరిస్థితి ఏర్పడింది. మానవుడు మృగప్రాయుడుగా జీవించేవాడు. ప్రాకృతిక వ్యవస్థలోని మానవుని జీవితం దుర్భరంగా ఉండేది. నాగరిక జీవనం లేదు. వ్యవసాయం - పరిశ్రమలు లేవు. సాహిత్యం - లలితకళలు వారికి తెలియవు. ప్రాణానికి, ఆస్తికి భద్రత లేదు. ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు "ఒంటరిగా, దారిద్ర్యంతో, పశుప్రాయంగా, అల్పాయువుతో జీవించేవాడని" హాబ్స్ చెప్పాడు.

**సామాజిక ఒడంబడిక - సార్వభౌముడు**

దుర్భరమైన ప్రాకృతిక వ్యవస్థ పరిస్థితి నుండి బయట పడడానికి ఒక ఒడంబడిక ద్వారా సార్వభౌముని ఏర్పరచుకొనడానికి ప్రజలు అంగీకరించారు. అటువంటి ఒప్పందం ప్రజల మధ్య జరిగింది. ప్రజలకు సార్వభౌమునికి మధ్య ఒప్పందం జరగలేదు. ఈ ఒప్పందాన్ని ప్రతి ఒక్కరూ అందిరితోనూ, అందరూ ప్రతి ఒక్కరితోనూ చేసుకున్నారు. దీని ఫలితంగా ఏర్పడిన సార్వభౌమునికి ప్రాణరక్షణ హక్కు మినహాయించి మిగిలిన హక్కులన్నింటిని అప్పగించారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రజల ప్రాణరక్షణ హక్కును కాపాడడమే సార్వభౌముని ముఖ్యవిధి.

పైన వివరించిన ఒప్పందం ఫలితంగా సార్వభౌముడు ఏర్పడ్డాడు. ఒప్పందంలోని షరతులు ఇతనికి వర్తించవు. అయినప్పటికి ఒప్పంద ఫలితంగా సార్వభౌమునికి అపరిమితమైన నిరపేక్షాధికారం సంక్రమించింది. ప్రజలకు సార్వభౌముని ధిక్కరించే అధికారం లేదు. సార్వభౌముడు అన్యాయం చేసే అవకాశం లేదు. ఎందుకనగా, ఇతనికి ఒప్పందం షరతులు వర్తించవు గనుక.

B R A O U

సార్వభౌముడు న్యాయాన్యాయాలను నిర్ణయిస్తాడు. అతని అజ్ఞలే శాసనాలు. అతని చర్యలను ప్రశ్నించే అధికారం ప్రజలకు లేదు. సార్వభౌముడు అనుమతించినదే స్వేచ్ఛ. సార్వభౌముడు ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించ లేనప్పుడు ప్రజలు అతనిపై తిరుగుబాటు చెయ్యచ్చు. ఈచర్య ననుసరించి హాబ్స్ సంపూర్ణాధికార వాదాన్ని సమర్థించాడని చెప్పలేము. ఎందుకనగా ప్రజల వ్యక్తిగత విషయాలలో సార్వభౌముడు అనవసరంగా జోక్యం చేసుకోకూడదని హాబ్స్ స్వేచ్ఛనిచ్చాడు. హాబ్స్ సిద్ధాంతాన్ని అధికారవాద సిద్ధాంతమని చెప్పవచ్చు. హాబ్స్ రాజారికాన్ని సమర్థించాడు.

**హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం కొన్ని విమర్శలకు గురైంది**

(1) హాబ్స్ వెలిబుచ్చిన ప్రాకృతిక వ్యవస్థ మానవ స్వభావాలను కొందరు విమర్శకులు తప్పుపట్టారు. హాబ్స్ ప్రకారం మానవుడు స్వార్థపరుడు, సంఘ వ్యతిరేకి. ప్రాకృతిక వ్యవస్థలో మృగప్రాయుడుగా ఉన్న మానవుడు ఒప్పందం ద్వారా పౌర సమాజాన్ని ఏర్పరచుకొని శాంతియుత జీవనం గడపాలనే భావన అకస్మికంగా ఎలా వస్తుందని విమర్శకుల అభిప్రాయం. మానవుడు సంఘజీవని హాబ్స్ గుర్తించలేదు.

(2) ప్రాకృతిక వ్యవస్థలో ప్రజలు ఒప్పందం చేసుకొనే అవకాశం లేదు. ఎందుకనగా ఆదశలో ఒప్పందాలను అమలుచేసే సార్వభౌముడు లేడు. కాబట్టి హాబ్స్ వివరించిన ఒడంబడికలో హేతుబద్ధత లేదు. ప్రాకృతిక వ్యవస్థలో మానవులు హక్కులను అనుభవించారని హాబ్స్ చెప్పాడు. వారికి బాధ్యతలు లేవు. బాధ్యతలు లేని హక్కులు ఏవిధంగా అనుభవించారో ఊహకందడం లేదు. అంతేకాకుండా హక్కులను అనుభవించడం రాజ్యవ్యవస్థలోనే సాధ్యపడుతుంది.

(3) హాబ్స్ వర్ణించిన విధంగా ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు నివశించాడని చెప్పడానికి చారిత్రక ఆధారాలు లేవు.

(4) హాబ్స్ సిద్ధాంతం పూర్తిగా ప్రజాస్వామ్య భావాలకు విరుద్ధమైంది.

(5) రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య తేడాలను హాబ్స్ గుర్తించలేదు. ప్రభుత్వం రాజ్యానికి ఒక లక్షణం మాత్రమే. పాలకుడు మరణించినంత మాత్రాన రాజ్యం అంతరించిపోదు.

(6) హాబ్స్ శాసన సార్వభౌమాధికారాన్ని మాత్రమే గుర్తించాడు. ప్రజాస్వామ్యానికి మూలాధారమైన రాజకీయ సార్వభౌమాధికారాన్ని గుర్తించలేదు.

పై లోపాలున్నప్పటికి, రాజనీతి తత్త్వ విచార చరిత్రలో హాబ్స్‌కి ఒక విశిష్ట స్థానమున్నదని చెప్పవచ్చు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడడానికి, బలమైన సార్వభౌమాధికారి ఉండాలని హాబ్స్ నొక్కి వక్కాణించాడు. హాబ్స్ తన సిద్ధాంతాన్ని చెప్పే విధానం సహేతుకంగా వుంటుంది. క్రమబద్ధమైన రాజనీతి సిద్ధాంతాన్ని చెప్పిన మొదటి ఆంగ్లేయుడు హాబ్స్.

## 6.2.2. లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

1688లో ఇంగ్లాండ్‌లో సంభవించిన రక్తపాత రహిత విప్లవాన్ని సమర్థించడం వలన, అమెరికా విప్లవానికి సైద్ధాంతికంగా పితామహుడని పేరుగాంచడం వలన లాక్ రాజనీతి తత్త్వ చరిత్రలో సుపరిచితుడు. 1632లో

జాన్ లాక్ జన్మించాడు. లాక్ తండ్రి చిన్న భూస్వామి. పార్లమెంట్ మద్దతుదారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విజ్ఞాన శాస్త్ర అధ్యయనంపై దృష్టి సారించాడు. 1667 నుండి 1668 వరకు ఆష్లీ ప్రభువుకు ఉపాధ్యాయునిగా, వైద్యునిగా పనిచేశాడు. లాక్ రచించిన ముఖ్య గ్రంథాలు :

(1) లెటర్ ఆన్ టోలెరేషన్ (Letter on Toleration - 1689)

(2) ఎస్సే కన్సర్నింగ్ హ్యూమన్ అండర్ స్టాండింగ్
(Essay Concerning Human Understanding - 1690)

(3) టూ ట్రీటైజెస్ ఆఫ్ గవర్నమెంట్ (Two Treatises of Government - 1690)

1688లో ఇంగ్లాండ్‌లో రక్తపాత రహిత విప్లవం సంభవించింది. దీని ద్వారా నిరంకుశుడైన రెండవ జేమ్సుకు ప్రజలు ఉద్వాసన పలికారు. హాలెండ్ నుంచి విలియంను, మేరీని తమ రాజు-రాణిగా తెచ్చుకొన్నారు. ఈ విప్లవం ద్వారా రాజ్యాంగబద్ధమైన రాచరికం ఏర్పడి పార్లమెంట్ అధికారం బలపడింది. ఈ విప్లవంలోని ప్రజల పాత్రను లాక్ తన Second Treatises on Civil Government అనే గ్రంథంలో సమర్థించారు. రాజు నిరంకుశంగా పాలించి ప్రజల హక్కులను కాలరాస్తే అటువంటి రాజును గద్దెదింపే అధికారం ప్రజలకుందని భావించాడు. ఈ గ్రంథంలో లాక్, అంతకు ముందు హాబ్స్ చెప్పిన అధికారవాద సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు. తన First Treatise అనే గ్రంథంలో రాజుల దైవ హక్కుల సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు.

## ప్రాకృతిక వ్యవస్థపై లాక్ అభిప్రాయం

హాబ్స్ చెప్పిన విధంగానే లాక్ కూడా తన సిద్ధాంతాన్ని ప్రాకృతిక వ్యవస్థ వర్ణనతో ప్రారంభించాడు. రాజ్యావతరణకు ముందు మానవుడు ప్రాకృతిక వ్యవస్థలో ఉండేవాడని లాక్ కూడా భావించాడు. కానీ లాక్ ఊహించిన ప్రాకృతిక వ్యవస్థ హాబ్స్ ఊహించిన దానికంటె భిన్నమైనది. లాక్ వాదన ప్రకారం ప్రాకృతిక వ్యవస్థలో రాజకీయ జీవనం లేదు. కానీ సామాజిక జీవనం ఉండేది. లాక్ ప్రకారం మానవుడు సంఘజీవి. మనిషి సహజంగా మంచివాడు. పరస్పర సహకారంతో ప్రజలు జీవించేవారు.

లాక్ అభిప్రాయంలో ప్రాకృతిక వ్యవస్థ అరాచకమైనదికాదు. మానవుల పరస్పర సంబంధాలను, ప్రవర్తనను క్రమబద్ధం చేయడానికి సహజన్యాయం ఉండేది. మానవునికున్న న్యాయాన్యాయ విచక్షణ జ్ఞానమే సహజ న్యాయం. దీనిని అనుసరించి ప్రతి ఒక్కరూ ఇతరుల హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రవర్తించేవారు. ప్రాకృతిక వ్యవస్థలో మానవులకు కొన్ని సహజ హక్కులుండేవి. అవి ప్రాణ రక్షణ హక్కు, స్వేచ్ఛ హక్కు, ఆస్తి హక్కు. ఈ మూడింటిలో ఆస్తి హక్కుకు లాక్ అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ఈ హక్కులను అందరూ సమానంగా అనుభవించే వారు. ప్రాకృతిక వ్యవస్థలో మానవుడు శాంతి, సద్భావన, పరస్పర సహకారం, సంరక్షణలతో జీవించేవాడు.

ప్రాకృతిక వ్యవస్థలో ప్రజలు శాంతియుత సహకార జీవనాన్ని గడిపినప్పటికీ, కొన్ని ఇబ్బందులను కూడా ఎదుర్కొన్నారు. ఆ దశలో సహజ న్యాయానికి అర్థ వివరణ చేసి దాన్ని అమలుచేసే హక్కు ప్రతివారికి ఉండేది. ఆకాలంలో సర్వజన సమ్మతమైన శాసనాలు లేవు. వాటిని పాక్షికంగా వివరించి అమలుజరిపే ప్రభుత్వ అధికారులు లేరు. ఈ కారణాల వలన ప్రజల హక్కులకు అప్పుడప్పుడు భంగం వాటిల్లేది. ప్రజల మధ్య సంఘర్షణ, అశాంతి ఏర్పడేది. ఈ ఇబ్బందుల నుండి బయటపడడానికి ఒక రాజ్య వ్యవస్థ అవసరమని ప్రజలు భావించారు.

BRAOU

లాక్ సిద్ధాంతంలో రెండు ఒడంబడికలు ఉన్నాయి. అవి (1) సామాజిక ఒడంబడిక (2) ప్రభుత్వ ఒడంబడిక ఈ రెండింటి గురించి కొంత విపులంగా తెలుసుకుందాం.

సామాజిక ఒడంబడిక ద్వారా వ్యవస్థీకృత పౌరసమాజం ఏర్పడింది. ఈ ఒడంబడికను ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరితో చేసుకున్నారు. శాంతియుత జీవనం గడుపుతూ, భద్రంగా సహజ హక్కులను అనుభవించే లక్ష్యంతో ఈ ఒడంబడికను చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా సహజ న్యాయాన్ని అమలు జరిపే హక్కును వదలుకున్నారు. సార్వభౌమాధికారం సమాజానికి అప్పగించారు. వారి హక్కుల రక్షణకు సహజన్యాయాన్ని అమలు చేసే అధికారం సమాజానికి అప్పజెప్పారు.

లాక్ సిద్ధాంతంలో ప్రభుత్వ ఒడంబడిక పౌర సమాజానికి పాలకునికి మధ్య జరిగింది. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రభుత్వ ఒడంబడిక షరతులు పాలకునికి వర్తిస్తాయి. ప్రజలకు ప్రభుత్వము ధర్మకర్తగా మాత్రమే వ్యవహరిస్తుంది. ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తే ఆప్రభుత్వాన్ని రద్దు చేసే హక్కు ప్రజలకు వుంది. ప్రభుత్వం రద్దయినంత మాత్రాన పౌరసమాజం రద్దుకాదు.

లాక్ సిద్ధాంతం ప్రకారం రాజ్యానికి పరిమిత అధికారాలు మాత్రమే ఉంటాయి. ఒప్పందంలో పేర్కొన్న విధుల నిర్వహణకు మాత్రమే రాజ్యానికి అధికారం ఉంటుంది. ప్రభుత్వ అధికారానికి మూలం ప్రజలు. ప్రజల సమ్మతిపైనే ప్రభుత్వం ఆధారపడి ఉంటుంది. శాసనం జనాభీష్టాన్ని వ్యక్తం చేస్తుంది. అది సార్వభౌముని ఆజ్ఞ మాత్రం కాదు. సహజ న్యాయానికి అనుగుణ్యంగా శాసనం ఉండాలి.

ప్రభుత్వం విధులను లాక్ మూడు రకాలుగా విభజించాడు. (1) శాసన నిర్మాణ కార్యకలాపాలు (2) కార్య నిర్వాహక కార్యకలాపాలు (3) విదేశ వ్యవహారాలకు సంబంధించిన కార్యకలాపాలు. ఇందులోనే న్యాయ నిర్వహణా కార్యకలాపాలు కూడా ఒక భాగమని లాక్ చెప్పాడు.

పైన పేర్కొన్న మూడు అధికారాలలో శాసన నిర్మాణ అధికారమే అత్యున్నతమైనది. కానీ దీనికి సార్వభౌమాధికారం లేదు. ఎందుకనగా సార్వభౌమాధికారం సామాజిక ఒడంబడికను అనుసరించి సమాజపరం చేయబడినది.

B R A O U

## విమర్శ

లాక్ సిద్ధాంతంలో కొన్ని లోపాలు ఉన్నాయి. సమాజంలో సామాజిక వ్యవస్థకీ, రాజకీయ వ్యవస్థకీ మధ్య భేదాన్ని వివరించలేక పోయాడు. సార్వభౌమాధికారం సమాజంలో ఉన్నా సామాజిక వ్యవస్థలో వుంటుందన్న విషయాన్ని మర్చిపోయాడు. లాక్ రాజకీయ సార్వభౌమాధికారాన్ని గుర్తించాడు. కానీ శాసన సార్వభౌమాధికారాన్ని గుర్తించలేదు.

లాక్ సిద్ధాంతంలో కొంత అస్పష్టత ఉంది. కొన్ని సందర్భాలలో సమాజమే సార్వభౌమాధికారని చెప్పాడు. మరికొన్ని సందర్భాలలో శాసన నిర్మాణ శాఖ సార్వభౌమాధికారి అన్నాడు. కార్య నిర్వాహక శాఖ నుండి న్యాయశాఖను లాక్ వేరు చేయలేదు.

రాజనీతి తత్త్వ చరిత్రలో లాక్ ప్రముఖ స్థానాన్ని ఆక్రమించాడు. జాన్‌లాక్ చెప్పిన సహజ హక్కుల సిద్ధాంతం రాజనీతి సిద్ధాంతంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకుంది. వ్యక్తి అభ్యున్నతికి ఈ హక్కులు తప్పనిసరి. సక్రమ ప్రభుత్వ నిర్వహణకు అతి ముఖ్యమైనవి. ప్రజాస్వామ్య సమాజానికి అవి పునాదులవంటివి.

రాజ్యం మానవుని సహజ హక్కుల పరిరక్షణ కొరకు ఏర్పడిందని లాక్ భావించాడు. రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య తేడాని లాక్ స్పష్టం చేశాడు. సహజ హక్కుల పరిరక్షణ కొరకున్న రాజ్యయంత్రం మాత్రమే ప్రభుత్వం.

లాక్ సమ్మత సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ప్రజల అనుమతి వున్నంతకాలం ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. ప్రభుత్వ అధికారాలన్నింటికీ మూలం ప్రజాసమ్మతే. రాజకీయ సార్వభౌమాధికారానికి లాక్ ప్రాముఖ్యం ఇచ్చాడు.

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం, శాంతి భద్రతలను కాపాడడం ప్రభుత్వం యొక్క ముఖ్య కర్తవ్యాలు. ప్రజలకు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే హక్కును ఇచ్చాడు. చట్టం సార్వభౌముడు ఆజ్ఞకాదు. చట్టం ప్రజాభీష్టాన్ని వ్యక్తం చేస్తుంది. పై చర్చను బట్టి లాక్ ఉదారవాదని తెలుస్తుంది.

సమాజానికి, వ్యక్తికి - రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య భేదాలను లాక్ గుర్తించాడు. వ్యక్తి స్వేచ్ఛా వాదానికి, ప్రజా సార్వభౌమాధికారానికి, రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వానికి సంబంధించిన క్రమబద్ధమైన, సహేతుకమైన, ఆచరణయోగ్యమైన సిద్ధాంతాన్ని లాక్ ప్రపంచానికి అందించాడు.

### 6.2.3. రూసో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

రూసో (1712-1778) 18వ శతాబ్దికి చెందిన ప్రముఖ ఫ్రెంచ్ రాజనీతి తత్త్వవేత్త రూసో భావాలకు మూలాధారం అతని అనుభవాలేనని చెప్పవచ్చు. రూసో 1712లో జనీవాలో జన్మించాడు. పుట్టిన కొన్ని రోజులకే అతని తల్లి మరణించింది. రూసో తండ్రి ఐజాక్ పేదవాడు. రూసోని సక్రమ పద్ధతిలో పెంచలేక పోయాడు. 16వ ఏట రూసో జనీవా విడిచిపెట్టి కొన్నళ్ళపాటు దేశదిమ్మరిగా ఐరోపాలో తిరిగాడు. బీదరికం వలన రూసో చిన్నచిన్న దొంగతనాలకు కూడా పాల్పడేవాడు. చివరికి 1744లో స్థిరపడ్డాడు, అక్కడే 1778లో మరణించాడు. తన ప్యారిస్ నివాసం అంతా మురుకివాడలలోనే గడిపాడు.

రూసో జన్మస్థలమైన జనీవా స్వయంపాలన గల నగర రాజ్యం. దీని ప్రభావం రూసో సిద్ధాంతం మీద కొంత వరకు కనబడుతుంది. దీని ప్రభావం వల్లనే రూసో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని మెచ్చుకున్నాడు. నానాటికీ పెరుగుతున్న దృఢ విశ్వాసం వలన రూసో సంఘ వ్యతిరేకిగా జీవించాడు.

రూసో అనేక వ్యాసాలను, గ్రంథాలను రచించాడు. వాటిలో "ద డిస్కోర్సెస్" (The Discourses), ది ఆరిజన్ ఆఫ్ ఇన్ ఈక్వాలిటీ (The Origin of Inequality), సోషల్ కాంట్రాక్ట్ (Social Contract), ఎమిలి (Emile) ముఖ్యమైనవని చెప్పవచ్చు. వీటిలో చివరి రెండు గ్రంథాలలో రూసో తన సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరించాడు. సోషల్ కాంట్రాక్ట్ అనే గ్రంథంలో రాజకీయ బద్ధత గురించి చర్చించాడు. 1789లో సంభవించిన ఫ్రెంచి విప్లవానికి ఇతని సిద్ధాంతాలు ఒక కారణమని చెప్పవచ్చు.

BRAOU

### ప్రాకృతిక వ్యవస్థ పై రూసో అభిప్రాయం

హాబ్స్, లాక్ వలే రూసో కూడా తన సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని ప్రాకృతిక వ్యవస్థతోనే ప్రారంభించాడు. కానీ ఆంగ్ల తత్త్వవేత్తలైన హాబ్స్, లాక్ చెప్పిన దానికి భిన్నంగా ప్రాకృతిక వ్యవస్థను, మానవ స్వభావాన్ని రూసో చిత్రీకరించాడు.

హాబ్స్ చెప్పినట్లు రూసో చెప్పిన ప్రాకృతిక వ్యవస్థ నిరంతర యుద్ధ స్థితి కాదు. రూసో ప్రకారం ప్రాచీన అనాగరిక మానవుడు స్వతహాగా మంచివాడు. ఆదిమ మానవుడు 'Noble Savage' అని రూసో వర్ణించాడు. అతను స్వర్గతుల్యమైన జీవితాన్ని గడిపాడు. అతను కరుణామయుడు, స్నేహశీలి, ఆరోగ్యవంతుడు. దొరికిన దానితో తృప్తిపడి సుఖంగా, హాయిగా సర్వ స్వతంత్రంగా జీవించేవాడు. న్యాయాన్యాయాలు, తప్పొప్పులు అతనికి తెలియవు. సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వాలను అనుభవిస్తూ ప్రశాంతమైన జీవితాన్ని ప్రాచీన అనాగరిక మానవులు గడిపేవారని రూసో భావించాడు.

కానీ అటువంటి స్వర్గతుల్యమైన జీవన స్థితి ఎంతోకాలం కొనసాగలేదు. సమాజంలో వచ్చిన కొన్ని మార్పులవలన మానవుని పతనం ప్రారంభమైంది. జనాభా పెరుగుదల, తార్కిక బుద్ధి, వ్యక్తిగత ఆస్తి పెరగడం వలన సమాజంలో అశాంతి ప్రబలింది. ( A thinking man is a "Depraved Animal) పైన చెప్పిన కారణాలు సమాజంలో అనేక అనర్థాలకు దారితీశాయి. హింస, నేరాలు, ఓర్వలేనితనం మొదలైనవి. సమాజంలో చోటు చేసుకున్నాయి. వీటితో పాటు అసమానతలు సంఘర్షణలు మొదలైనాయి. ఈ అనర్థాలన్నిటికీ వ్యక్తిగత ఆస్తి మూలకారణమని భావించాడు. హత్యలు, యుద్ధాలు సంభవించాయి. ఇటువంటి పరిస్థితి నుండి బయట పడడానికి ఒడంబడిక ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరచుకోవడం జరిగిందని రూసో చెప్పాడు.

### సామాజిక ఒడంబడిక

పౌర స్వేచ్ఛను పొందడానికి సామాజిక ఒడంబడిక అవసరమని రూసో చెప్పాడు. ఈ ఒడంబడిక ద్వారా వ్యక్తుల తమ సర్వహక్కులను సమాజానికి దారాదత్తం చేశారు. స్వేచ్ఛగా పుట్టిన మానవుడు సర్వత్రా సంకెళ్ళలో ఉన్నాడనే వాక్యంతో "సోషల్ కాంట్రాక్టు" అనే గ్రంథాన్ని రూసో ప్రారంభించాడు. రాజ్యం ఏర్పడడం వలన మానవుడు సహజ స్వేచ్ఛను కోల్పోయినా పౌర స్వేచ్ఛను పొందాడు. పౌరస్వేచ్ఛ రాజ్యం ఉండడం వలననే వీలవుతుంది. భద్రతతో కూడిన స్వేచ్ఛను అనుభవించడమే రూసో చెప్పిన ఒడంబడిక ముఖ్యలక్ష్యం.

BRAOU

రూసో సిద్ధాంతంలో ఒకే ఒప్పందం ఉంది. అది సామాజిక, రాజకీయ ఒప్పందాల రెండింటి లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ ఒప్పందాన్ని ప్రజలు తమలో తామే చేసుకున్నారు. అంటే ప్రతి ఒక్కరు మొత్తం సమాజంతో చేసుకున్న ఒప్పందం. ఈ ఒప్పందం వలన ప్రతివ్యక్తి పోగొట్టుకున్న సహజ హక్కులన్నిటినీ తిరిగి సమాజ సభ్యునిగా పొందాడు. ఈ ఒప్పందం వలన సమాజానికి సార్వభౌమత్వం సంక్రమించింది. ఈ సార్వభౌమత్వానికి సహజ ప్రతినిధిగా జనేచ్ఛ ఉంటుంది.

### జనేచ్ఛ

రూసో సిద్ధాంతములో జనేచ్ఛ సార్వభౌమాధికారి, ఇది సమాజానికి అంతటికీ ప్రతినిధి, ఇందులో సమాజ సభ్యులందరికీ సభ్యత్వం ఉంటుంది. ఈక్రింది విధంగా రూసో జనేచ్ఛను వివరించవచ్చు. ప్రతి

వ్యక్తికి "ఒక వ్యక్తిగత ఇచ్ఛ" ఒక "యదార్థ ఇచ్ఛ" అని రెండు ఉంటాయి. మొదటిది వ్యక్తి స్వలాభాన్ని కోరుతుంది. రెండోది సమాజ శ్రేయస్సును కోరుతుంది. సమాజంలోని ప్రజలందరి యదార్థ ఇచ్ఛల పూర్తి మొత్తాన్ని జనేచ్ఛ అని రూసో భావించాడు. జనేచ్ఛ సార్వభౌమాధికారి. దీనికి ముఖ్యమైన లక్షణాలు రెండు ఒకటి, ఇది ఎల్లప్పుడు సంఘ శ్రేయస్సునే కోరుతుంది. కాబట్టి జనేచ్ఛ ఆజ్ఞలను పాటించడమే నిజమైన స్వేచ్ఛను అనుభవించడమని రూసో చెప్పాడు. రెండు, జనేచ్ఛ ప్రజలందరి నుంచి జనించి, అది అందరికీ వర్తిస్తుంది. జనేచ్ఛ అధికారం నిరపేక్షమైనది, అవిభాజ్యమైనది, అన్యాక్రాంతం చేయడానికి వీలులేనిది. దీనికున్న మూడో లక్షణాన్ని అనుసరించి రూసో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్ధించాడని చెప్పవచ్చు.

రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య భేదాన్ని రూసో గుర్తించాడు. జనేచ్ఛ మీద ఆధారపడిన సమాజాన్ని రూసో రాజ్యమని చెప్పాడు. జనేచ్ఛ శాసనం ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పరుస్తుంది. సార్వభౌమునికి ప్రభుత్వం ఒక ఏజెంటుగా పనిచేస్తుంది. దీనికి దత్తతాధికారాలు మాత్రమే ఉంటాయి.

రూసో ప్రజా సార్వభౌమాధికారాన్ని బలపర్చాడు. ప్రభుత్వం సమిష్టి శ్రేయస్సుకు భంగకరంగా ప్రవర్తిస్తే తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు ఉంటుంది అన్నాడు. శాసనాధికారం సమిష్టిగా ప్రజలందరికీ ఉంటుంది. జనేచ్ఛ నిర్ణయాలను అమలు చేసేదే కార్య నిర్వాహక వర్గం. రూసో యాంత్రిక రాజ్య సిద్ధాంతాన్ని మార్పుచేసి, అంగిక రాజ్య సిద్ధాంతాన్ని పునరుద్ధరించాడు.

**విమర్శ**

రూసో సిద్ధాంతంలో రెండు విభిన్న సిద్ధాంతాల ధోరణులు కనిపిస్తున్నాయి. అతని జనేచ్ఛ సిద్ధాంతం, అంగిక రాజ్య సిద్ధాంతాన్ని ప్రతిబింబింపజేస్తుంది. అతని సామాజిక ఒడంబడిక యాంత్రిక రాజ్య దృక్పథాన్ని ప్రతిబింబింప జేస్తుంది. ఈ రెండు ధోరణులు పరస్పర విరుద్ధమైనవి.

అతని జనేచ్ఛ అస్పష్టమైనది. వ్యక్తి ఇచ్ఛను వ్యక్తిగత, యదార్థ ఇచ్ఛలకింద విభజించడం అసంభవం.

అతని ప్రజా సార్వభౌమాధికార భావన జనేచ్ఛ భావన ఈ రెండూ సంపూర్ణాధికార ప్రజాస్వామ్య రాజ్యానికి నాంది పలుకుతున్నాయి. చివరగా, సమాజానికి - రాజ్యానికి మధ్య భేదాన్ని రూసో వివరించ లేదు.

BRAOU

**రూసో సిద్ధాంత ప్రాధాన్యత**

రూసో మొట్టమొదటి గొప్ప ఆధునిక రాజనీతి తత్త్వవేత్త. ఆధునిక రాజనీతి తత్త్వానికి అతని సిద్ధాంతమే మూలం. అతను ప్రజా సార్వభౌమాధికారాన్ని ప్రజాస్వామ్య విలువలను, ఆదర్శాలను సమర్ధించాడు విప్లవాలను కూడా సమర్ధించాడు. అమెరికా, ఫ్రాన్సు రాజ్యాంగాలపై ఇతని సిద్ధాంత ప్రభావం బాగా వుంది. ఇతని సార్వభౌమాధికార సిద్ధాంతం అధికారానికీ, స్వేచ్ఛకు రాజీకుదిర్చింది. ఆధునిక రాజనీతి తత్త్వంలో కాల్పనిక సిద్ధాంతానికి ఇతను మూల పురుషుడు.

## 6.2.4. హాబ్స్, లాక్, రూసోల సిద్ధాంతాలు తులనాత్మక పరిశీలన

హాబ్స్ సిద్ధాంతంలో ప్రతిపాదనలను, లాక్ సిద్ధాంతంలో ముగింపును రూసో సిద్ధాంతం మిశ్రమం చేసింది. ముగ్గురు తత్త్వవేత్తలు సామాజిక ఒడంబడిక ద్వారా రాజ్యం ఏర్పడిందని అంగీకరించారు. కానీ

మానవ స్వభావం, ప్రాకృతిక వ్యవస్థ, ఒడంబడిక తత్ఫలితంగా ఏర్పడిన సార్వభౌమాధికారం వంటి వాటిపై ముగ్గురూ భిన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మానవ స్వభావంపై లాక్‌తో రూసో ఏకీభవించాడు. హాబ్స్ సిద్ధాంతం ప్రకారం ప్రాకృతిక వ్యవస్థలో మానవునికి సామాజిక జీవనం గానీ, రాజకీయ జీవనం గానీ లేవు. లాక్, రూసోల సిద్ధాంతాల ప్రకారం ప్రాకృతిక వ్యవస్థలో మానవునికి సామాజిక జీవనం ఉంది. కానీ రాజకీయ జీవనం లేదు.

హాబ్స్, రూసోల సిద్ధాంతాలలో ఒక్క సామాజిక ఒడంబడిక ప్రస్తావన మాత్రమే ఉంది. కానీ యీ ఒడంబడిక వలన ఏర్పడిన సార్వభౌమాధికార స్వరూప స్వభావాలు భిన్నంగా ఉన్నాయి. లాక్ సిద్ధాంతంలో రెండు ఒడంబడికలు వున్నాయి. 1) సామాజిక ఒడంబడిక 2) ప్రభుత్వ ఒడంబడిక.

హాబ్స్ సిద్ధాంతంలో సార్వభౌమాధికారం ఒక వ్యక్తి చేతిలోగానీ, కొద్దిమంది వ్యక్తుల చేతిలో గాని ఉంది. లాక్ సిద్ధాంతంలో సార్వభౌమాధికారం ప్రజలకు ఉంటుంది. రూసో సిద్ధాంతంలో జనేచ్ఛ సార్వభౌమాధికారి. సార్వభౌమాధికార సిద్ధాంతంలో హాబ్స్, రూసోల సిద్ధాంతాల మధ్య సామ్యం ఉంది. హాబ్స్ సార్వభౌమునిపై తిరుగుబాటు చేసే హక్కు ప్రజలకు ఇవ్వలేదు. లాక్, రూసోలు ఈ హక్కును ప్రజలకు ఇచ్చారు. రూసో సిద్ధాంతంలో హాబ్స్, లాక్ సిద్ధాంతాల ప్రభావం కనిపిస్తుంది.

### 6.2.5 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం : అంచనా !

సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ఈక్రింది విమర్శలకు లోనయ్యింది. ఈ సిద్ధాంతం కేవలం కల్పితమైనది. దీనికి ఎటువంటి చారిత్రక ఆధారాలు లేవు. ప్రాచీన కాలంలో మానవులు ప్రాకృతిక వ్యవస్థలో నివసించినట్లుగాని, అటువంటి వారు ఒక ఒప్పందం ద్వారా రాజ్యాన్ని ఏర్పరచుకున్నట్లు గాని మనకి చరిత్రలో ఎక్కడా కానరాదు. ఈ సిద్ధాంతాన్ని వివరించిన రచయితల ఊహాజత్తులో మాత్రమే మనకు ఈ సిద్ధాంతం కనిపిస్తుంది. 1620లో జరిగిన "మేఫ్లవర్" ఒడంబడికను వీరు ఉదాహరణగా చెబుతారు. ఈ ఒప్పందాన్ని మేఫ్లవర్ అనే ఓడలో అమెరికా వలసపోతున్న ఆంగ్లదేశ వాసులు చేసుకున్నారు. కానీ ఈ ఉదాహరణ సరైనది కాదు. ఎందుకనగా ఈ ఒప్పందాన్ని చేసుకున్నవారు 17వ శతాబ్దానికి చెందిన ఆంగ్లేయులు.వారికి రాజ్యం అంటే ఏమిటో, ప్రభుత్వం అంటే ఏమిటో తెలుసు.

వ్యక్తి భద్రత కొరకు రాజ్యం ఏర్పడిందని ఈ సిద్ధాంతం చెప్పుతుంది. అంటే ఈ సిద్ధాంతం వ్యక్తికి ప్రాధాన్యత ఇచ్చింది. కానీ ప్రాచీన శాసనాలు, ఆచార సంప్రదాయాలు వ్యక్తి కంటే సమాజానికే అధిక ప్రాధాన్యతను ఇచ్చాయి. ప్రాచీన కాలంలో కుటుంబం ఒక యూనిట్‌గా పరిగణింపబడేది. ఆస్తిపాస్తులు సమిష్టిగా ఉండేవి. అదిమ సమాజంలో ఒక వ్యక్తి హోదా అతని పుట్టుక మీద ఆధారపడి ఉండేది. ఒప్పందం అనేది సమాజానికి పూర్వస్థితి కాదు. బాగా అభివృద్ధి చెందిన సమాజంలో మాత్రమే ఒడంబడికలకు స్థానం ఉంటుంది.

ఒడంబడిక సిద్ధాంతం న్యాయ సంబంధమైన కారణాల వలన కూడా విమర్శలకు గురైంది. ఏ ఒప్పందానికైనా ముందు షరతుగా ఒప్పందాన్ని అమలు చేసే అధికారి, శాసనాలు ఉండాలి. కానీ సామాజిక ఒడంబడికను ప్రజలు చేసుకున్న సమయంలో రాజ్యంకానీ, ప్రభుత్వం కానీ లేవు. కాబట్టి అటువంటి ఒప్పందానికి విలువలేదు.



BRAOU

తాత్త్విక ఒడంబడిక సిద్ధాంతాన్ని పరిశీలిస్తే, కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. ఈ సిద్ధాంతం ప్రకారం వ్యక్తికి, రాజ్యానికి మధ్యనున్న సంబంధాలు ఇచ్ఛాపూర్వకమైనవి. ఈ భావన సరైనదికాదు. రాజ్యాన్ని మానవుడు కృత్రిమంగా ఏర్పాటు చేసుకున్నది కాదు. వ్యక్తి కుటుంబంలో ఎంత సహజమైన సభ్యుడో, రాజ్యంలో కూడా అంతే సహజమైన సభ్యుడు.

ప్రాకృతిక వ్యవస్థలో సహజ హక్కులు, సహజ స్వేచ్ఛ ఉండేవని ఈ సిద్ధాంతం చెపుతుంది. ఈవాదన సహేతుకమైనది కాదు. ఎందుకనగా స్వేచ్ఛ, హక్కులు రెండూ శాసనాలు లేని పరిస్థితులలో ఉండే అవకాశం లేదు.

మానవుడు ఒడంబడిక ద్వారా రాజ్యాన్ని ఒక నిర్దిష్ట కాలంలో ఏర్పాటు చేసుకున్నాడని ఈ సిద్ధాంతం చెపుతుంది. కానీ రాజ్యాన్ని ఏకకాలంలో మానవులు కానీ, భగవంతుడు కానీ స్థాపించలేదు. అదికాల క్రమేణ అనేక దశలలో, అనేక కారణాలవల్ల అభివృద్ధి చెందింది.

పైన పేర్కొన్న విమర్శలకు ఒడంబడిక సిద్ధాంతం గురైనప్పటికీ దానికి రాజనీతి సిద్ధాంతంలో చాలా ప్రాముఖ్యత ఉంది. నిరంకుశ రాజరికానికి, రాజుల దైవహక్కు సిద్ధాంతానికి ఇది అడ్డుకట్టు వేసింది. ప్రజల సమ్మతే రాజ్యానికి పునాదని ఈ సిద్ధాంతం చెప్పింది. ఇందువలన ఇది ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందడానికి దోహదం చేసింది. లౌకిక రాజ్య భావనను కూడా ఈ సిద్ధాంతం సమర్థించింది. లాక్ సిద్ధాంతం పరిమిత రాజరికాన్ని సమర్థించింది. 1789లో సంభవించిన ఫ్రెంచి విప్లవానికి రూసో సిద్ధాంతం ఒక కారణమైంది. సార్వభౌమాధికార సిద్ధాంతానికి కూడా ఇది దోహదం చేసింది. హాబ్స్ శాసన సార్వభౌమాధికారాన్ని, లాక్ రాజకీయ సార్వభౌమాధికారాన్ని రూసో ప్రజాసార్వభౌమాధికారాన్ని వివరించారు.

19వ శతాబ్దంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం పూర్తిగా పతనమయింది. దీని పతనానికి రాజనీతి శాస్త్ర అధ్యయనంలో చారిత్రక దృక్పథం అభివృద్ధి చెందడం, చారిత్రక రాజ్యావతరణ సిద్ధాంతం ఆమోదాన్ని పొందడం కారణాలయ్యాయి. వీటితోపాటు మార్క్సిస్టు రాజ్య సిద్ధాంతం కూడా ఒడంబడిక సిద్ధాంత పతనానికి ఒక కారణమైంది.

## 6.3 క్లుప్తంగా

ప్రాచీన రాజ్యావతరణ సిద్ధాంతాలలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం ఒకటి. ప్రాచీన భారతీయ, పాశ్చాత్య రాజనీతి తత్త్వంతో ఈ సిద్ధాంతం ప్రస్తావన ఉంది. 17, 18 శతాబ్దాలలో ఈ సిద్ధాంతాన్ని హాబ్స్, లాక్, రూసోలు క్రమబద్ధంగా వివరించారు. ఈ ముగ్గురి సిద్ధాంతాలపైన వారి సమకాలీన పరిస్థితుల ప్రభావం కనిపిస్తుంది. ఉదహరణకు హాబ్స్ సిద్ధాంతంపై తన కాలంలో ఇంగ్లాండులో జరిగిన అంతర్యుద్ధ ప్రభావం, లాక్ సిద్ధాంతంపై 1688లో జరిగిన రక్తపాత రహిత విప్లవ ప్రభావం, రూసో సిద్ధాంతంపై తన వ్యక్తిగత అనుభవాల ప్రభావం కనిపిస్తుంది. హాబ్స్ అధికారవాద రాజ్యాన్ని సమర్థించాడు. లాక్ పరిమిత రాజరికాన్ని సమర్ధించాడు. రూసో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్థించాడు. ఒడంబడిక సిద్ధాంతం ఆధునిక సార్వభౌమాధికార సిద్ధాంతానికి పునాదులు వేసింది.



BRAOU

## 6.4 చదువగదిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| V.D. Mahajan | : | "Political Theory" (S. Chand & Co., New Delhi) |
| O.P. Ganba | : | "An Introduction to Political Theory" 3rd Edn. |
| B.K. Gokhale | : | "Political Science - Theory and Governmental Machinery" (Himalaya Publishing House, Bombay) |
| P.G. Das | : | "Modern Political Theory" (New Central Book Agency (P) Ltd., Calcutta) |

## 6.5 నమూనా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులు వ్రాయండి.**

ఎ. సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని సంక్షిప్తంగా వివరించండి.

బి. హాబ్స్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వర్ణించండి.

సి. రూసో సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని పరిశీలించండి.

డి. లాక్ సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని విశదీకరించండి.

ఇ. సామాజిక ఒడంబడిక సిద్ధాంత సుగుణాలను, దోషాలను తెల్పండి.

**II. ఈక్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి పది పంక్తులలో సమాధానాలు వ్రాయండి.**

ఎ. హాబ్స్ సిద్ధాంత ప్రతిపాదనలను, లాక్ ముగింపు సూత్రాలను రుసో మిశ్రం చేసిన విధానాన్ని వివరించండి.

బి. హాబ్స్ వర్ణించిన ప్రాకృతిక వ్యవస్థ

సి. లాక్ సహజ హక్కుల సిద్ధాంతం

డి. రూసో జనేచ్ఛ

**రచయిత : ఎస్. పోలినాయుడు**

BRAOU

# భాగం-7: రాజ్యావతరణ సిద్ధాంతాలు - భారతీయ సిద్ధాంతాలు

విషయ సూచిక


7.0 లక్ష్యాలు

7.1 పరిచయం

7.2 భారతీయ రాజ్యావతరణ సిద్ధాంతాల స్వభావం

7.2.1 యుద్ధం మూలంగా రాజ్యావతరణ సిద్ధాంతం

7.2.2 ఎన్నిక ద్వారా రాజరిక వ్యవస్థ సిద్ధాంతం

7.2.3 దైవదత్తాధికార సిద్ధాంతం

7.2.4 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం (లౌకిక రాజ్యావతరణ సిద్ధాంతం)

7.2.5 పరిణామ సిద్ధాంతం

7.2.6 రాజ్యంపై కౌటిల్యుని భావాలు

7.2.7 ప్రాచీన భారతదేశంలో రాజ్య స్వభావం - విధులు

7.3 క్లుప్తంగా

7.4. చదవదగిన పుస్తకాలు

7.5 నమూనా ప్రశ్నలు


## 7.0 లక్ష్యాలు

B R A O U

ఈ భాగం చదివిన తరువాత మీరు

- భారతీయ రాజ్యావతరణ సిద్ధాంతాల స్వభావాన్ని వివరించగలరు.
- వివిధ ప్రాచీన భారతీయ రాజ్యావతరణ సిద్ధాంతాలను చర్చించగలరు.
- రాజ్యావతరణ, విధులుగురించి కౌటిల్యుని భావాలను అర్థం చేసుకొనగలరు.
- ప్రాచీన భారతదేశంలో రాజ్యం యొక్క స్వభావాన్ని, లక్ష్యాలను విశ్లేషించగలరు.

## 7.1 పరిచయం

రాజ్యం పుట్టు పూర్వోత్తరాలు, దాని స్వభావం, విధులు గురించి మన ప్రాచీనులకు తెలియదనుకోవడం సమంజసం కాదు. నిజానికి రాజ్యం గురించి మన ప్రాచీనులు అనేక సందార్భాల్లో వివరించి చర్చించారన్న

సంగతి చాలా మందికి ముఖ్యంగా పాశ్చాత్యులకు తెలియదు. గ్రీకు తత్త్వవేత్తలవలె మన ప్రాచీన రచయితలు రాజనీతి భావాలను ప్రత్యేక గ్రంథాలలో రాయలేదు. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, స్మృతులు, కౌటిల్యుని అర్థశాస్త్రం మొదలైన అనేక ప్రాచీన గ్రంథాలలో రాజనీతి భావాలు విస్తరించి ఉన్నాయి. ఇటువంటి గ్రంథాల నుండి మన ప్రాచీనులు రాజ్యం, రాజనీతి గురించి చెప్పిన విషయాలు సేకరించి అధ్యయనం చేయవచ్చు. ఈ భాగంలో ప్రాచీన భారతీయ రాజ్యావతరణ సిద్ధాంతాలను పరిశీలిద్దాం.

## 7.2 భారతీయ రాజ్యావతరణ సిద్ధాంతాలు - స్వభావం

ప్రాచీన భారతదేశంలో సమాజంలో శాంతి - భద్రతలను కాపాడి, సామాజిక నైతిక విలువలను, ప్రజల ఆర్థిక శ్రేయస్సును పెంపొందించడంలో రాజ్యానికి ప్రముఖ పాత్ర ఉండేది. శాసనానికి, సక్రమ పద్ధతికి - న్యాయానికి భద్రతకు రాజ్యం ప్రతీకగా ఉండేదని గోఖలే చెప్పాడు. భారతీయ తాత్త్విక చింతనలో రాజ్యానికి ప్రముఖ స్థాన ముండేదని తెలుస్తుంది.

రాజ్యావతరణ సిద్ధాంతాలను పరిశీలించే ముందు మనం ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. ప్రాచీన భారతదేశంలో రాజునే రాజ్యంగా పరిగణించేవారు. ఇందువలన రాజరికం పుట్టు పూర్వోత్తరాల సిద్ధాంతాలనే రాజ్యావతరణ సిద్ధాంతంగా గ్రహించాలి. ప్రాచీన భారతీయ సాహిత్యంలో రాజరికావతరణ సిద్ధాంతాలకే అధిక ప్రాధాన్యత లభించింది. రాజ్యావతరణ సిద్ధాంతాల ప్రస్తావన అంతగా కనిపించదు.

భారతీయ రాజ్యావతరణ సిద్ధాంతాలు ఎక్కువ ఊహాగానాల మీద ఆధారపడి ఉన్నాయి. వాటికి చారిత్రిక ఆధారాలు లేవు. అవి అనిశ్చితమైన పౌరాణిక కథలు, ఇతిహాసాల మీద ఆధారపడి ఉన్నాయి. అంతేకాకుండా ఒకే గ్రంథంలో పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాల ప్రస్తావన కూడా ఉంటుంది. ఉదాహరణకు మహాభారతంలోని శాంతిపర్వం పరస్పర విభిన్నమైన దైవదత్తాధికార, ఒడంబడిక సిద్ధాంతాలను పేర్కొంది.

### 7.2.1 యుద్ధం మూలంగా రాజ్యావతరణ సిద్ధాంతం

రాజ్యావతరణకు కారణం యుద్ధమని వేద వాఙ్మయం చెపుతుంది. యుద్ధంలో విజయాన్ని సాధించాలంటే సైన్యాలను నడిపించే నాయకుడు అవసరం. విజయాన్ని సాధించిన యుద్ధవీరుని అతని అనుచరులు రాజుగా ప్రకటించేవారు.

ఐతరేయ బ్రాహ్మణంలో కూడా యీ సిద్ధాంతం చెప్పబడింది. దీనిప్రకారం దేవ-దానవ యుద్ధాలలో తరచుగా దేవతలు (ప్రాచీన ఆర్యులు) ఓడిపోయేవారు. దీనికి కారణం దేవతలకు రాజు లేకపోవడం, దానవులకు రాజు ఉండడమేనని దేవతలు గ్రహించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న దేవతలు ఒక రాజుని ఎన్నుకోడానికి సమ్మతించారు.

"రాజరిక వ్యవస్థను ద్రావిడుల నుండి ఆర్యులు ఎరువు తెచ్చుకున్నారని ఈ సిద్ధాంతం వివరిస్తుందని" జయస్వాల్ వ్యాఖ్యానించాడు. ఆధునిక బలప్రయోగ సిద్ధాంతానికి ఈ భారతీయ సిద్ధాంతం ఒక రూపాంతరమేనని భావించవచ్చు.

BRAOU

### 7.2.2 ఎన్నిక ద్వారా రాజరిక వ్యవస్థ సిద్ధాంతం

ప్రజలు రాజును ఎన్నుకున్నట్టుగా ఋగ్వేదం ఒకచోట సూచించింది. కులీనులు, పలుకుబడిగల గొప్పవారు, రథాలను తయారు చేసేవారు, సూతులు, గ్రామపెద్దలు మొదలగువారు రాజును ఎన్నుకొనేవారని అథర్వణవేదం ఒకచోట చెప్పింది. రాజును ఎన్నుకునే ఆచారం ఉండేదని రామాయణ, మహాభారత ఇతిహాసాలలో కూడా చెప్పబడింది. సాగరుడనే రాజు మరణానంతరం ధర్మపరాయణుడైన అన్షుమంతుని రాజుగా ప్రజలు ఎన్నుకున్నారని రామాయణంలో చెప్పబడింది.

ప్రాచీన భారతదేశంలో రాజరికం ఎన్నికపై ఆధారపడి ఉండేదనే విషయంపై ఏకాభిప్రాయం లేదు. తొలివేదకాలంలో అసాధారణ పరిస్థితులలో మాత్రమే రాజుని ఎన్నుకొనేవారని ఎ.ఎస్. ఆల్టేకర్ చెప్పాడు. మలివేద కాలానికి పూర్వం నుండే రాజరికం వంశపారంపర్య వ్యవస్థగా ఉండేదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశాడు. ఎప్పుడైనా వారసులు లేకుండా రాజు మరణిస్తే అతని బంధువర్గంలో నుండి ఒకరిని రాజుగా మంత్రులు, కులీనులు ఎన్నుకొనేవారు. సాధారణ పరిస్థితులలో రాజును ఎన్నుకొనే ప్రసక్తే లేదు.

### 7.2.3 దైవదత్తాధికార సిద్ధాంతం

"ఎన్నో సంస్థలలాగే రాజ్యం కూడా దైవప్రేరణవలనే ఏర్పడిందని ప్రాచీన భారతీయులు భావించేవారని ఆల్టేకర్ చెప్పాడు. వేదాలు, ఇతిహాసాలు, పురాణాలు దైవదత్తాధికార సిద్ధాంతం గురించి ప్రస్తావించాయి. రాజును భగవంతుడు నియమించినట్లు ఋగ్వేదంలో వుంది. ఒక పురుషున్ని ఇంద్రుడు రాజుగా నియమించాడని దీనిలోని ఒక సూక్తం చెబుతుంది. ప్రజల కోరికపై మొట్టమొదటి రాజును బ్రహ్మదేవుడు నిర్ణయించినట్లు రామాయణంలో ఉంది.

మహాభారతంలోని శాంతిపర్వం ప్రకారం తొలి ఆదిమ దశలో రాజులేడు, రాజ్యమూ లేదు. ఆకాలంలో ప్రజలు సిరిసంపదలతో శాంతియుత జీవనాన్ని గడిపేవారు. కొంతకాలం తరువాత సమాజంలో నైతిక విలువలు దిగజారిపోయాయి. ప్రజలు దురాశాపరులుగా, స్వార్థపరులుగా మారారు. నానాటికీ దిగజారిపోతున్న అరాచక పరిస్థితిని చూసి దేవతలు భయాందోళనలు చెందారు. ఈ పరిస్థితిని ప్రజలు బ్రహ్మదేవుడికి విన్నవించారు. వారి విన్నపాన్ని విన్న తరువాత ప్రజలను ధర్మమార్గంలో నడిపించడానికి అవరసమగు శాసన స్మృతిని తయారు చేసి ఇచ్చాడు. తరువాత ప్రజలు విష్ణువు దగ్గరకు వెళ్ళారు. వారిలో మంచి బలవంతుడిని రాజుగా నియమించమని కోరారు. వారి కోరిక అనుసరించి విష్ణువు, వీరజాసుడనే వానిని సృష్టించి రాజుగా నియమించాడు. అతని ఆజ్ఞలను పాటించడానికి ప్రజలు సమ్మతించారు. ఈ వివరణనుబట్టి రాజు-రాజ్యం భగవంతుని సృష్టి అని, రాజుకు పాలనాధికారం భగవంతుని నుండి సంక్రమించిందని తెలుస్తుంది. ఈ ప్రపంచంలోని సర్వప్రాణకోటి రక్షణ కొరకు భగవంతుడు ఒక రాజుని సృష్టించాడని మను ధర్మశాస్త్రం కూడా చెపుతుంది. పురాణయుగంలో రాజుని ఒక దేవుని అవతారంగా భావించేవారు.

తొలి వేదకాలంలో రాజుల దైవత్వ సిద్ధాంతం అంతగా వ్యాప్తి చెందలేదని స్పెల్‌మాన్ అన్నాడు. కృతజ్ఞతగల కొద్దిమంది రాజ ఆస్థానికుల ఊహకు మాత్రమే రాజుల దైవత్వ సిద్ధాంతం పరిమితమై ఉండేదని ఆల్టేకర్ చెప్పాడు. ఐరోపాలో దైవ దత్తాధికార సిద్ధాంతం రాజుల దైవహక్కుల సిద్ధాంతంగా మారిందని మనం చదివాం. ఈ విధంగా ప్రాచీన భారతదేశంలో దైవ దత్తాధికార సిద్ధాంతం మార్పు చెందలేదు. ఇందుకుకారణం ప్రాచీన భారతదేశ రాజులు ఇంగ్లాండ్ దేశానికి చెందిన ఒకటవ జేమ్సులాంటి నిరంకుశ పాలకులుకారు.

ఆధునిక కాలంలో దైవ దత్తాధికార సిద్ధాంతాన్ని ఎవరూ అంగీకరించడం లేదు. రాజ్యం భగవంతుని సృష్టికాదు. మానవుడు తన అవసరాలను తీర్చుకొనుటకు రాజ్యాన్ని ఏర్పరచుకొన్నాడని మనకి తెలుసు. అది క్రమక్రమంగా అభివృద్ధి చెందింది. మానవ సమాజమెంత ప్రాచీనమైనదో రాజ్యం కూడా అంత ప్రాచీనమైనది. మానవునికి స్వభావ సిద్ధంగా ఉన్న సామాజిక, రాజకీయ గుణాలవల్ల రాజ్యం ఏర్పడింది.

### 7.2.4 సామాజిక ఒడంబడిక సిద్ధాంతం (లౌకిక రాజ్యావతరణ సిద్ధాంతం)

ప్రాచీన భారతదేశంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతం కూడా రాజనీతి చింతనను ఎక్కువ ప్రభావితం చేసింది. మనదేశంలో సూత్రకాలం నాటికే ఒడంబడిక సిద్ధాంతం గురించి తెలుసు. ఈ కాలంలో ప్రజలు వారి పంటలో ఆరవ భాగాన్ని రాజుకు రక్షణ కల్పించినందుకు ఇచ్చేవారని తెలుస్తుంది. మహాభారతంలోని శాంతి పర్వంలోను, బౌద్ధ వాఙ్మయంలోను ఒడంబడిక సిద్ధాంతం గురించి ప్రస్తావన ఉంది.

మహాభారతంలో శాంతి పర్వంలో సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని విపులంగా చెప్పబడింది. దీనిప్రకారం మానవ సమాజ ప్రారంభదశలో రాజన్నవాడులేడు. అరాచక పరిస్థితులలో ప్రజలు నివసించవలసి వచ్చింది. ఈ పరిస్థితులలో మత్స్యన్యాయరీత్యా బలవంతుడు బలహీనుణ్ణి పీడించేవాడు. ఇటువంటి దుర్భరమైన అరాచక పరిస్థితులను అంతమొందించడానికి ప్రజలు పరస్పరంగా ఒక ఒడంబడికను చేసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా మోసం, వ్యభిచారం మొదలగు అసాంఘిక చర్యలకు పాల్పడిన వారిని సమాజం నుండి బహిష్కరించాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. వారికి ఈ ఒప్పందం తరువాత కూడా సుఖజీవనం సాగలేదు. దీనికి కారణం ఒప్పందం షరతులను అమలు పరచడానికి రాజుగాని, ప్రభుత్వంగాని లేకపోవడమే. తరువాత ప్రజలు భగవంతుని దగ్గరకు వెళ్ళి ఒక సమర్థవంతుడైన రాజుని నియమించమని కోరారు. ప్రజలు కోరికననుసరించి 'మనువు'ని రాజుగా భగవంతుడు నియమించాడు.

కానీ పాపాత్ములైన ప్రజలను పాలించడానికి మనువు (Manu) నిరాకరించాడు. మోసగాళ్ళైన ప్రజలను పాలించడం చాలా కష్టమైన పని అని మనువు చెప్పాడు. దీనితో తాము శాసనాన్ని పాటిస్తామని ప్రజలు మనువుకు హామీయిచ్చారు. అంతే కాకుండా శాసన ఉల్లంఘన వల్ల సంక్రమించే పాపం శాసన ఉల్లంఘన చేసిన వారికే తప్ప రాజుకు చెందదని ప్రజలు చెప్పారు. రాజు విధించిన పన్నులను కూడా చెల్లిస్తామని ప్రజలు ఒప్పుకున్నారు. ఈ షరతుల ఆధారంగా మనువు రాజ్యపాలనకు ఒప్పుకున్నాడు.

సామాజిక ఒడంబడిక ద్వారా రాజరిక వ్యవస్థ ఏర్పడిందనే సిద్ధాంతాన్ని బౌద్ధ వాఙ్మయం కూలంకషంగా వివరించింది. రాజ్యావతరణకు మానవులే కారణమని దిఘనికాయ (Digha Nikaya) తెలిపింది. బౌద్ధులకు దేవునిలో నమ్మకం లేదు. అందువల్ల మొట్టమొదటి రాజును బ్రహ్మ సృష్టించాడంటే బౌద్ధులు అంగీకరించరు. దిఘనికాయ ప్రకారం ప్రాచీన కాలంలో ఒకప్పుడు స్వర్ణయుగం ఉండేది. ఆకాలంలో ప్రజలు సత్ప్రవర్తనతో సుఖంగా జీవించేవారు. ఏదో ఒక కారణంవల్ల అటువంటి స్వర్ణయుగ సుఖజీవనం క్షీణించింది. ఈ కారణంగా అరాచకం ప్రబలింది. ఆస్తి హక్కులను ఉల్లంఘించడం మొదలైంది. ఇటువంటి అరాచక పరిస్థితులను అంతం చేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. కాలక్రమేణ 'మహాజన సమ్మతుడ'నే వ్యక్తి రంగంలోకి వచ్చాడు. ఇతను తెలివిగలవాడు, సుగుణవంతుడు, సమర్థుడు. అతనిని రాజుగా ఉండమని, అరాచకాన్ని అంతం చేయమని ప్రజలు కోరారు. ప్రజల విజ్ఞప్తిని మహాజన సమ్మతుడు అంగీకరించాడు. అప్పుడు ప్రజలు అతనిని రాజుగా ఎన్నుకొని, వారి పంటలో కొంత భాగాన్ని అతని సేవకు ప్రతిఫలంగా అర్పించడానికి అంగీకరించారు.



BRAOU

మానవ సమాజ పరిణామంలో రాజరిక వ్యవస్థ ఒక సంఘటన మాత్రమేనని బౌద్ధ వాఙ్మయం చెపుతుంది. రాజ్యావతరణకు సంబంధించినంత వరకు భగవంతునికిగానీ, ఏ ఇతర అతీతశక్తులకుగానీ జోక్యం లేదని బౌద్ధుల వాదన. బౌద్ధుల కథనం ప్రజాసార్వభౌమాధికారాన్ని అంగీకరించింది. దీనిప్రకారం రాజు ప్రజలకు సేవకుడు మాత్రమే. అతని సేవకు ప్రతిఫలంగా పంటలో ఆరవవంతు ప్రజలు రాజుకు సమర్పిస్తారు.

బౌద్ధులు చెప్పిన రాజరిక వ్యవస్థ ధర్మశాస్త్రాలలో చెప్పిన రాజరిక వ్యవస్థ కంటే విభిన్నమైనది. బౌద్ధ వాఙ్మయంలో రాజు ప్రజాసేవకుడు మాత్రమే దీనికి భిన్నంగా ధర్మశాస్త్రాల ప్రకారం రాజు ఒక ఉన్నతమైన హోదా కలిగిన గంభీరమైన వ్యక్తి. శాంతి పర్వంలో చెప్పిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతానికి, బౌద్ధ వాఙ్మయంలో చెప్పిన సిద్ధాంతానికి భేదం ఉంది. భీష్ముడు చెప్పిన ప్రకారం రాజాధికారం భగవంతుని నుండి సంక్రమించింది. బుద్ధుడు చెప్పిన ప్రకారం రాజాధికారం క్రమక్రమంగా పరిణామం చెందింది. ఈ రెండు రకాల ఒడంబడిక సిద్ధాంతాలలో బుద్ధుడు చెప్పిన సిద్ధాంతమే లౌకిక సిద్ధాంతమని చెప్పవచ్చు. బౌద్ధ వాఙ్మయంలో చెప్పిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం చాలా విస్తృతమైనది. ఇది మిగిలిన సామాజిక ఒడంబడిక రాజ్యావతరణ సిద్ధాంతాలను, రాజత్వాలను, సామాజిక వ్యవస్థను తేటపరుస్తుందని ఆచార్య జె.పి. సూద చెప్పాడు. బౌద్ధ వాఙ్మయాన్ని అనుసరించి రాజును ప్రజలు ఎన్నుకునే ప్రజల నుండే లభిస్తుంది. ఒడంబడిక షరతులను నెరవేర్చినందుకు రాజుకు ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తారు. పాశ్చాత్య రచయితలు వివరించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతానికి దిఘనికాయలో వివరించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతానికి చాలా దగ్గర పోలికలు ఉన్నాయని స్పెల్‌మాన్ (Spellman) చెప్పాడు.

**విమర్శ**

ఒడంబడిక రాజ్యావతరణ సిద్ధాంతం చరిత్రకు, తర్కబుద్ధికి వ్యతిరేకమైనదని డా॥ అల్టేకర్ విమర్శించాడు. ప్రాకృతిక వ్యవస్థలో నివసిస్తున్న ప్రజలు ఒడంబడికను ఏవిధంగా చేసుకున్నారో ఒడంబడిక సిద్ధాంతం వివరించలేదు. ప్రజలు పరస్పరంగా హక్కులను, విధులను గౌరవించుకున్నప్పుడే ఒడంబడికలు సాధ్యపడతాయి. అటువంటి సమాజంలోనే ఒప్పందాలకు విలువ ఉంటుంది. అరాచక సమాజంలో ఒప్పందాలు అసాధ్యం. ప్రాచీన భారతీయ ఒడంబడిక సిద్ధాంతం రాజాధికారానికి అధిక ప్రాముఖ్యతనిచ్చింది.

పాశ్చాత్య ఒడంబడిక సిద్ధాంత కర్తలైన హాబ్స్, లాక్, రూసోలు సార్వభౌముని అధికార హద్దులను వివరించారు. అంతేకాక సార్వభౌముని అధికారాన్ని ఏ పరిస్థితుల్లో ప్రజలు ధిక్కరించవచ్చో వారు చెప్పారు. ఈ రెండు విషయాలను మన ప్రాచీన తత్త్వవేత్తలు వివరించలేదు. పాశ్చాత్య సిద్ధాంత కర్తలు ఒడంబడిక సిద్ధాంతాన్ని లౌకిక దృష్టితో పరిశీలించారు. ప్రాచీన భారతీయ తత్త్వవేత్తలు మత సామాజిక అంశాలను జోడించి ఈ సిద్ధాంతాన్ని చర్చించారు.

## 7.2.5. పరిణామ సిద్ధాంతం (Theory of Evolution)

ఇండో యూరోపియన్ పితృస్వామిక సమిష్టి కుటుంబ వ్యవస్థ నుండి రాజ్యం పరిణామం చెందిందని పరిణామ సిద్ధాంతం చెపుతుంది. తులనాత్మక భాషాధ్యయనం ఆధారంగా ఆర్యులు వారి జన్మస్థలంలో పెద్ద సమిష్టి కుటుంబాలలో నివసించే వారిని తెలుస్తుంది. ఇటువంటి పితృ స్వామిక కుటుంబాలలో కుటుంబ పెద్ద కుటుంబ సభ్యులపై ఎక్కువ అధికారాన్ని చెలాయించేవాడు. కుటుంబంలో అతని స్థానం

యించుమించు రాజ్యంలో రాజస్థానాన్ని పోలి ఉండేది. క్రమంగా కొన్ని కుటుంబాలు కలసి వంశంగాను, వంశాలు గ్రామంగాను, గ్రామాలు తెగగాను విస్తరించాయి. తెగను "జన" (Jana) అని కూడా అనేవారు. "జన" నాయకుని "జనపతి" అని పిలచేవారు. జనపతినే రాజు అని కూడా పిలిచేవారు. చరిత్రకు పూర్వకాలం నుండి సమిష్టి కుటుంబ వ్యవస్థ విస్తరణ ద్వారా రాజ్యం పరిణామం చెందిందని డా. అల్టేకర్ చెప్పాడు.

రాజ్యాలు విస్తరించడంతోపాటు రాజుల అధికారం కూడా పెరిగింది. రాజ్య అవతరణకు, దాని విస్తరణకు కుటుంబ వ్యవస్థ, ఆస్తివ్యవస్థ ప్రముఖ పాత్ర పోషించాయి. ఆస్తి హక్కును, భద్రతతో అనుభవించడానికి రాజ్యవ్యవస్థ అవసరం. ఈ సిద్ధాంతం రాజ్యావతరణ గురించి సంతృప్తికరమైన వివరణను ఇచ్చింది.

### 7.2.6 రాజ్యంపై కౌటిల్యుని భావాలు

కౌటిల్యుడు (క్రీ.పూ. 3వ శతాబ్దం) "అర్థశాస్త్రం"ను రచించాడు. ఇతనికి చాణక్యుడు, విష్ణుగుప్తుడు అని నామాంతరాలు ఉన్నాయి. చంద్రగుప్త మౌర్యునికి ప్రధాన మంత్రిగా ప్రశంసనీయమైన పాత్ర పోషించాడు. ఇతను రచించిన "అర్థశాస్త్రము" ముఖ్యంగా రాజనీతికి సంబంధించిన గ్రంథం. ప్రాచీనకాలంలోని లౌకిక వ్యవహారాలను, రాజ్యపరిపాలన విషయాలను విపులంగా తెలిపే గ్రంథం. ప్రభుత్వ పాలన యంత్రాంగం గురించి, శాంతి-యుద్ధ సమయాలలో ప్రభుత్వం నిర్వహించవలసిన విధులు గురించి ఈ గ్రంథం వివరిస్తుంది. రాజ్యాల స్థాపన, వాటిని పాలించే విధానం గురించి ఈ గ్రంథంలో కౌటిల్యుడు ముఖ్యంగా ప్రస్తావించాడు.

అర్థశాస్త్రంలో కౌటిల్యుడు రెండు ప్రధాన లక్ష్యాలను వ్యక్తం చేశాడు. (1) పాలకుడు తన రాజ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవాలి. (2) క్రొత్త రాజ్యాలను ఏవిధంగా సంపాదించాలి అనే విషయాన్ని అన్వేషించడం.

#### కౌటిల్యుని రాజ్యావతరణ సిద్ధాంతం

రాజ్యావతరణ గురించి అర్థశాస్త్రంలో కౌటిల్యుడు పరోక్షంగా వివరించాడు. సమాజంలో ఏర్పడిన అరాచక పరిస్థితిని రూపుమాపడానికి రాజ్యం ఏర్పడిందని కౌటిల్యుడు భావించాడు. ఇతను చెప్పిన రాజ్యావతరణ సిద్ధాంతం సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని పోలి ఉంది. ఒప్పందం ద్వారా ప్రజలు 'వైవస్వతమనువ'నే రాజును నియమించుకున్నారు. అతనికి వారి పంటలో ఆరవవంతు, వర్తక వాణిజ్యాల వస్తువులలో పదవవంతు చెల్లించడానికి ప్రజలు ఒప్పుకున్నారు. దీనికి ప్రతిఫలంగా రాజ్యంలో శాంతి భద్రతలను కాపాడే బాధ్యతను రాజు స్వీకరించాడు.

కౌటిల్యుని సిద్ధాంతం రాజుకు అపరిమిత అధికారాలను ఇచ్చింది. ఇటువంటి అధికారాలను రాజు ప్రజలకు చేసే సేవలను ఆధారంగా కౌటిల్యుడు సమర్థించాడు. సామాజిక ఒడంబడిక సిద్ధాంతానికి కౌటిల్యుని సిద్ధాంతం భారతీయ కథనంగా చరిత్రకారులు భావిస్తున్నారు.

#### రాజ్యలక్షణాలు (సప్తాంగ సిద్ధాంతం)

రాజ్యానికి ఏడు ముఖ్య లక్షణాలని (అంగాలు) కౌటిల్యుడు చెప్పాడు, వాటిని ఈక్రింది విధంగా వివరించవచ్చు.

(1) స్వామి (రాజు లేదా పాలకుడు)

(2) అమాత్య : ఇది మంత్రులను, ఉన్నతాధికారులను సూచిస్తుంది.

BRAOU

(3) జనపద : అంటే ప్రదేశం, ప్రజలు

(4) దుర్గం : అంటే కోట

(5) కోశం : ప్రభుత్వ ఖజానా

(6) దండం : సైన్యం

(7) మిత్రులు

పైన పేర్కొన్న సప్తాంగాలననుసరించి కౌటిల్యుడు రాజ్యాన్ని నిర్వచించాడు. ఈ నిర్వచనాన్ని కౌటిల్యుడు రాజనీతి సిద్ధాంతానికి చేసిన అతి ముఖ్యమైన సేవని చెప్పవచ్చు.

**పాలకుని విధులు**

ప్రజలపట్ల పాలకునికి కొన్ని ముఖ్యమైన విధులున్నాయని కౌటిల్యుడు చెప్పాడు. రాజధర్మాన్ని అనుసరించి రాజు తన విధులను నిర్వహించాలి. దీనివల్ల రాజు నిరంకుశుడుగా వ్యవహరించలేడు. కౌటిల్యుని ప్రకారం రాజు ఈ క్రింది ముఖ్య విధులను నిర్వహించాలని చెప్పాడు.

(1) ప్రకృతి విపత్తుల నుండి, అంతరంగిక విదేశ శత్రువుల నుండి ప్రజలను కాపాడడం

(2) దోషరహిత సమర్థవంతమైన పరిపాలనను సమకూర్చడం

(3) ప్రజాసంక్షేమానికి అవసరమైన నిధులను సమకూర్చడం

(4) శాంతి భద్రతలను కాపాడటం

ఎస్.ఆర్. మహేశ్వరి చెప్పినట్లు కౌటిల్యుడు వివరించిన రాజ్యం క్రియాశీలత కలిగిన రాజ్యం. వ్యవసాయ రంగాన్నీ, పశుసంపదను, వర్తక వాణిజ్యాలను పెంపొందించే బాధ్యత రాజ్యానిదని కౌటిల్యుడు చెప్పాడు.

BRAOU

### 7.2.7 ప్రాచీన భారతదేశంలో రాజ్యస్వభావం - విధులు

ఇంతకు ముందు చర్చించిన విషయాలను బట్టి ప్రాచీన భారతదేశంలో రాజ్యస్వభావం, విధులు విదితమౌతున్నాయి. రాజ్యాన్ని ఒక చెడుగా గానీ, అవసరమగు చెడుగా (Necessary Evil) మన ప్రాచీన తత్త్వవేత్తలు భావించలేదు. రాజ్యాన్ని ఒక ఉపకారమైన సంస్థని వారు భావించారు. ప్రాణానికి, ఆస్తిహక్కుకి, కుటుంబ వ్యవస్థకి రక్షణ కల్పించే లక్ష్యంతో చరిత్రకు పూర్వకాలం నుండే రాజ్యం పరిణామం చెందిందని వారు చెప్పారు. ప్రాచీన భారతదేశంలో రాజ్యం నిర్వహించే విధులను సంక్షిప్తంగా ఈ క్రింది విధంగా చెప్పవచ్చును.

(1) అంతరంగిక, సంఘ వ్యతిరేక శక్తుల నుండి - విదేశీ దండయాత్రల నుండి ప్రజల ప్రాణాలను, ఆస్తిపాస్తులను కాపాడటం

(2) ధర్మాన్నీ, రాజ్యభూభాగాన్ని కాపాడటం

(3) ప్రజల సుఖసంతోషాలను, సంక్షేమాన్ని పెంపొందింపజేయడం, బీదలకు, అనాధలకు, వృద్ధులకు ఆశ్రయం కల్పించడం

(4) ప్రాచీన ఆచార సంప్రదాయాలననుసరించి శాసనాలను కాపాడడం

(5) ధర్మార్థ కామ మోక్షాలైన చతుర్విధ పురుషార్థాలను రక్షించడం.

పైన వివరించిన విధులను నిర్వహించడానికి, ఆదర్శాలను పెంపొందించడానికి రాజ్యం ఆవిర్భవించిందని ప్రాచీన భారతీయ తత్త్వవేత్తలు చెప్పారు.

## 7.3 క్లుప్తంగా

రాజ్యావతరణకి, రాజరిక వ్యవస్థ అవతరణకి మధ్య తేడాలను మన ప్రాచీన తత్త్వవేత్తలు తెలుపలేదు. ఇతిహాస కథలను, పురాణాలను ఆధారం చేసుకొని రాజ్యావతరణ సిద్ధాంతాలను ప్రతిపాదించారు. రాజ్యం యుద్ధ ఫలితంగా ఏర్పడిందని ఒక సిద్ధాంతం చెబితే, ఎన్నిక ద్వారా రాజ్యం ఏర్పడిందని ఇంకొక సిద్ధాంతం వివరించింది. మహాభారతంలోని శాంతిపర్వం దైవదత్తాధికార సిద్ధాంతాన్ని, సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరించింది. ఈరెండు రాజ్యావతరణ సిద్ధాంతాలు పరస్పర విరుద్ధమైనవి. బౌద్ధ వాఙ్మయం కూడా సామాజిక ఒడంబడిక సిద్ధాంతాన్ని లౌకిక దృక్పథంతో సమర్థించింది. పితృస్వామిక సమిష్టి కుటుంబ వ్యవస్థ విస్తరణ ద్వారా క్రమేణా రాజ్యం పరిణామం చెందిందని పరిణామ సిద్ధాంతం చెప్పింది.

## 7.4 చదువదగిన పుస్తకాలు


Dr. A.S. Altekar : "State and Government in Ancient India"

Dr. Aradhana Parmar : "Techniques of State Crafta Study of Kautilya's Arthasastra"

L.N. Rangarajan (Ed.) : "Kautilya - The Arthasastra"


## 7.5 నమూనా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 30 పంక్తులలో జవాబులిమ్ము.**

(1) (ఎ) యుద్ధమూలంగా రాజ్యావతరణ సిద్ధాంతాన్ని (బి) దైవదత్తాధికార సిద్ధాంతాన్ని క్లుప్తంగా వర్ణించండి

(2) బౌద్ధ వాఙ్మయంలో వివరించిన ఒడంబడిక సిద్ధాంతాన్ని వివరించండి.

(3) రాజ్యావతరణ, దాని విధులు గురించి కౌటిల్యుని అభిప్రాయాలను తెలపండి

**II. ఈక్రింది వాటికి ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబు లిమ్ము**

(1) ఎన్నిక ద్వారా రాజరిక వ్యవస్థ అవతరణ సిద్ధాంతం

(2) సప్తాంగ సిద్ధాంతం

(3) పరిణామ సిద్ధాంతం

(4) మహాభారతంలో శాంతి పర్వంలో వివరించిన సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

(5) ప్రాచీన భారతదేశంలో రాజ్య విధులు

**రచయిత : ఎస్. పోలినాయుడు**



BRAOU

# భాగం-8: రాజ్య విధుల సిద్ధాంతాలు

విషయ సూచిక

8.0 లక్ష్యాలు

8.1 పరిచయం

8.2 రాజ్య విధుల సిద్ధాంతాలు

8.2.1 వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతం

8.2.2 ఆధునిక ఉదారవాదం

8.2.3 మార్క్సిస్టు సిద్ధాంతం

8.2.4 సమిష్టివాద సిద్ధాంతం

8.2.5 సంక్షేమరాజ్య సిద్ధాంతం

8.2.6 పారిశ్రామిక రాజ్యం (Virtual State)

8.3 క్లుప్తంగా

8.4 చదవదగిన పుస్తకాలు

8.5 నమూనా ప్రశ్నలు

## 8.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- రాజ్య విధులకు సంబంధించిన వివిధ సిద్ధాంతాలను వివరించగలరు.
- వివిధ సిద్ధాంతాల మధ్య బేధాలను అవగాహన చేసుకోగలరు.
- వివిధ సిద్ధాంతాల స్వభావాలను విమర్శనాత్మకంగా పరిశీలించగలరు.

## 8.1 పరిచయం

మన ప్రాచీన రాజనీతి తత్వవేత్తల అభిప్రాయాల ప్రకారం ప్రజా సంక్షేమాన్ని పెంపొందింపజేయడమే రాజ్యప్రధాన లక్ష్యం. ప్రజలకు ఉత్తమ జీవన పరిస్థితులను కల్పించడమే రాజ్య ముఖ్యధ్యేయమని రాజనీతి శాస్త్ర పితామహుడైన అరిస్టాటిల్ నొక్కి వక్కాణించాడు. ఉత్తమ జీవితాన్ని అందించడానికి రాజ్యం ఎటువంటి విధులను నిర్వహించాలన్నదే రాజనీతి సిద్ధాంతంలోని ముఖ్యప్రశ్న. కానీ ఈ ప్రశ్నపై రాజనీతి తత్వవేత్తలలో



BRAOU

ఏకాభిప్రాయం లేదు. అందువల్లనే రాజ్యవిధులకు సంబంధించి వివిధ సిద్ధాంతాలు వెలిశాయి. ఈ సిద్ధాంతాలలో ఎక్కువ వైరుధ్యముంది. ఒక చివరన వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతం, ఒక చివరన వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతముంటే, ఇంకొక చివరన సమిష్టివాద సిద్ధాంతం ఉంది. ఇప్పుడు వివిధ సిద్ధాంతాలను సంగ్రహంగా పరిశీలిద్దాం.

## 8.2 రాజ్యవిధుల సిద్ధాంతాలు

### 8.2.1 వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతం

**సిద్ధాంత స్వభావం - రాజ్యవిధులు :** వ్యక్తి స్వేచ్ఛావాదాన్ని సాంప్రదాయ ఉదారవాదమని కూడా అంటారు. ఈ సిద్ధాంత ప్రారంభాన్ని ఆంగ్ల రాజనీతి తత్త్వవేత్త అయిన జాన్‌లాక్ రచనలలో గుర్తించవచ్చు. తరువాత కాలంలో ఈ సిద్ధాంతాన్ని ఆడమ్ స్మిత్, జెరిమీ బెంథాం, జేమ్స్‌మిల్, జె.ఎస్. మిల్, హెర్బర్ట్ స్పెన్సర్ అభివృద్ధి చేశారు. 17వ, 18వ శతాబ్దాలలో వాణిజ్యవాదం (Mercantilism) పేరుతో వ్యక్తి ఆర్థిక, వర్తక, వాణిజ్య కార్యాకలాపాలలో రాజ్యం జోక్యం కలుగుజేసుకొని వాటిని క్రమబద్ధం చేసేది. ఈ విధానానికి నిరసనగా వ్యక్తివాద సిద్ధాంతం ఆవిర్భవించింది. ఇది 19వ శతాబ్దంలో పరాకాష్ట చెందింది.

వ్యక్తికి అధిక స్వేచ్ఛనిచ్చి, అతిముఖ్యమైన కార్యకలాపాలను నిర్వహించడానికి అవసరమగు పరిమితాధికారాన్ని మాత్రమే రాజ్యానికి ఉండాలని వ్యక్తి స్వేచ్ఛావాదం చెపుతుంది. పరిమిత ప్రభుత్వం ఉండాలనేది దీని వాదన. ఈ సిద్ధాంతాన్ని "లెజెఫేర్" (Laissez - faire) సిద్ధాంతమని కూడా అంటారు. "లెజెఫేర్" అనే ఫ్రెంచి పదానికి అర్థం "నన్ను నాదారిన వదలిపెట్టు" (let me alone)

రాజ్యాన్ని అవసరమైన చెడు (Necessary Evil) సంస్థగా వ్యక్తి స్వేచ్ఛావాదులు భావించారు. ఎందుకనగా రాజ్యం అనేక నియమ నిబంధనల ద్వారా వ్యక్తి స్వేచ్ఛను పరిమితం చేస్తుంది. కానీ రాజ్యరహిత సమాజంలో వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ ఉండదు. కాబట్టి అవసరమైన మేరకు మాత్రమే రాజ్యాధికారం ఉండాలి. జాన్‌లాక్ ప్రకారం ప్రాణహక్కును, స్వేచ్ఛాహక్కును, ఆస్తిహక్కును రక్షించడమే రాజ్యవిధి. ఈ విధి నిర్వహణకు అవసరమైనంత అధికారం మాత్రమే రాజ్యానికి ఉండాలి. ఇంతకు మించి అధికారాన్ని రాజ్యం చెలాయించినట్లైతే వ్యక్తి స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందని లాక్ చెప్పాడు.

"On Liberty" అనే గ్రంథంలో జె.ఎస్. మిల్ వ్యక్తి కార్యకలాపాలను రెండు రకాలుగా విభజించాడు. అవి (1) వ్యక్తిగత కార్యకలాపాలు (2) ఇతరులకు సంబంధించిన కార్యకలాపాలు. వ్యక్తిగత కార్యకలాపాల పరిధిలో వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలని మిల్ నొక్కి వక్కాణించాడు. ఇటువంటి కార్యకలాపాల వల్ల ఇతరులకు హాని కలగనంత వరకు వీటిలో ప్రభుత్వ జోక్యం ఉండరాదని మిల్ భావించాడు "తనపై, తన శరీరంపై, మనస్సుపై వ్యక్తి సార్వభౌముడు" అని మిల్ ఉద్ఘాటించాడు. ఇతరులకు సంబంధించిన కార్యకలాపాలలో హానిని నివారించడానికి మాత్రమే రాజ్యం జోక్యం చేసుకో వచ్చునని మిల్ సమర్థించాడు.

వ్యక్తి స్వేచ్ఛకు రాజ్యం ఆటంకమని వ్యక్తి స్వేచ్ఛావాదులు భావించారు. స్వార్థపరులైన అనాలోచిత వ్యక్తుల నుండి ప్రజలను కాపాడడమే రాజ్యవిధి, వ్యక్తి స్వేచ్ఛను సమాజశ్రేయస్సును పెంపొందించడం రాజ్యం విధికాదని వారి వాదన. సమాజ ప్రయోజనాల దృష్ట్యా కొన్ని సంవర్థకమైన కార్యకలాపాలను రాజ్యం

నిర్వహించవచ్చని కొంతమంది ఆధునిక స్వేచ్ఛావాదులు భావించారు. అటువంటి కార్యకలాపాలను సమర్థించవచ్చని వారు చెప్పారు.

సాంప్రదాయక రాజకీయ ఉదారవాద సిద్ధాంతంలో వ్యక్తి స్వేచ్ఛావాదం ఒక అంశం కాబట్టి వ్యక్తి స్వేచ్ఛకు, అతని ఆస్తి హక్కులు అతి ప్రధానమైనవి. ఆస్తిహక్కులకు ప్రాధాన్యత నిచ్చినందువల్ల వ్యక్తి కార్యకలాపాలలో రాజ్యం జోక్యం చేసుకోకూడదని ఈ సిద్ధాంతాన్ని సమర్థించిన వారి వాదన. వ్యక్తులు నిర్వహించే వర్తక, వాణిజ్య, పారిశ్రామిక కార్యకలాపాలలో రాజ్యం జోక్యం చేసుకోకూడదు. ఈ సిద్ధాంతం ప్రకారం అతి తక్కువ పాలన కార్యకలాపాలను నిర్వహించే ప్రభుత్వమే ఉత్తమమైన ప్రభుత్వం.

### వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతాన్ని అనుసరించి రాజ్యవిధులు

వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతం ప్రకారం రాజ్యవిధులను ఆచార్య గిల్‌క్రిస్ట్ ఈ క్రింది విధంగా క్లుప్తంగా వివరించాడు.

1. విదేశీ దండయాత్రలు, దురాక్రమణ నుండి రాజ్యాన్ని, ప్రజలను రక్షించడం.
2. వ్యక్తుల పరస్పర దూషణలు హాని చేసుకోకుండా చూడడం
3. వ్యక్తుల ఆస్తులను దొంగల బారి నుండి కాపాడడం, ఆస్తులకు నష్టం వాటిల్లకుండా చూడడం
4. మోసమైన ఒప్పందాలనుంచి ప్రజలకు రక్షణ కల్పించడం, ఒప్పందాల ఉల్లంఘన జరగకుండా చూడడం.
5. బలహీనులకు రక్షణ కల్పించడం
6. ప్లేగు, మలేరియా వంటి నివారించగల రోగాల నుండి ప్రజలకు రక్షణ కల్పించడం.

పైన వివరించిన విధులనుబట్టి ప్రభుత్వ కార్యకలాపాలు బహుపరిమితంగా ఉండాలని వ్యక్తి స్వేచ్ఛావాదులు భావించినట్లు విదితమౌతుంది. చివరకు చెప్పిన రెండు విధులపై వ్యక్తి స్వేచ్ఛావాదులలో ఏకాభిప్రాయం లేదు.

BRAOU

### వ్యక్తి స్వేచ్ఛావాదాన్ని బలపరిచే వాదాలు

వ్యక్తి స్వేచ్ఛావాదులు రాజ్యకార్యకలాపాలను సమర్థించడానికి ఈక్రింది వాదాలను పేర్కొన్నారు.

**1. నైతికవాదం :** ప్రతి వ్యక్తికి తన స్వప్రయోజనాల గురించి తనకే బాగ తెలుసు. కాబట్టి వ్యక్తికి సంపూర్ణమైన స్వేచ్ఛను ఇచ్చినట్లయితే అతను శక్తి యుక్తులను వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోగలడు. వ్యక్తి స్వంత విషయాలలో రాజ్యం జోక్యం చేసుకుంటే అతని స్వశక్తిని, చొరవను అదినాశనం చేసినట్లవుతుంది. అందువలన వ్యక్తి స్వ విషయాలలో రాజ్యం జోక్యం చేసుకుంటే అదినైతికంగా పొరపాటవుతుంది. ఈ దృక్పథాన్ని బలపర్చిన వారిలో కాంట్, జె.ఎస్.మిల్ ముఖ్యులు.

**2. ఆర్థికవాదం :** ఆర్థిక కార్యకలాపాలపై రాజ్య నియంత్రణ, అజమాయిషి లేనప్పుడు మాత్రమే పోటీతో కూడిన స్వేచ్ఛా వ్యాపార పరిశ్రమలు వృద్ధి చెందుతాయి. సంపూర్ణ పోటీ ఉండడం వలన ఉత్పత్తి పెరుగుతుంది, ధరలు తగ్గుతాయి. ఉత్పత్తిదారులకు లాభాలు లభిస్తాయి. జాతీయవాదం ఇనుమడిస్తుంది.

శ్రామికులకు న్యాయమైన వేతనాలు లభిస్తాయి. ఈవిధంగా సమాజానికంతటికి లాభం చేకూరుతుంది. ఆడంస్మిత్, రికార్డో, మాల్థాస్, మొదలైన వారు ఆర్థికవాదాన్ని సమర్థించారు.

**3. శాస్త్రీయవాదం :** జీవశాస్త్ర సూత్రాన్ని అనుసరించి జీవులలో నిరంతరం జీవన సంఘర్షణ జరుగుతుంటుంది. ఈ విషయాన్ని పరిణామ శాస్త్ర సూత్రాల ననుసరించి స్పెన్సర్ సాంఘిక జీవనానికి అన్వయించాడు. ఇటువంటి సంఘర్షణలో బలవంతులు గెలుస్తారు, బలహీనులు నశిస్తారు. బలహీనులు, అయోగ్యులు నశించి, శక్తివంతులు, ప్రతిభావంతులు మిగులుతారు. బలహీనులకు, అయోగ్యులకు రాజ్యం రక్షణ కల్పిస్తే సమాజాభివృద్ధి జరగదని ఈవాదన చెపుతుంది. సమాజాభివృద్ధి జరగాలంటే సరైన పోటీని రాజ్యం ప్రోత్సహించాలి.

**4. అనుభవవాదం :** మానవుల అనుభవాన్ని బట్టి ప్రైవేటు ఆర్థికరంగం ప్రభుత్వ ఆర్థికరంగం కంటే సమర్థవంతంగా పనిచేస్తుందని తెలుస్తుంది. మానవుడు వ్యక్తిగత ఆస్తికి ఇచ్చిన ప్రాధాన్యత సమిష్టి ఆస్తికి ఇవ్వడు. ఇందువల్ల ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రైవేటీకరణ ఊపునందుకుంటుంది.

### వ్యక్తివాద సిద్ధాంత విమర్శ

వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతాన్ని సమర్థించిన వాదనలు విమర్శనాత్మక పరిశీలనకు నిలవవు. ఈ సిద్ధాంతం తీవ్రమైన విమర్శలకు గురైంది. వాటిని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. వ్యక్తి తన ప్రయోజనాలను తానే నిర్ణయించుకోగలడు - అనేవాదన సరైందికాదు. ప్రతి వ్యక్తికీ తన ప్రయోజనాలను తానే తెలుసుకొనే తెలివితేటలు, అవసరాలను తీర్చుకునే సామర్థ్యం ఉండవు. కాబట్టి అటువంటి వారికి రాజ్య రక్షణ అవసరం. రాజ్యజోక్యం లేకపోతే సమాజం కేవలం స్వార్థపరుల నిలయంగా మారుతుంది. స్వార్థంతో పాటు ఈర్ష్య, పోటీ విలయతాండవం చేస్తాయి.

2. ఆర్థిక కార్యకలాపాలలో సంపూర్ణ స్వేచ్ఛా పోటీ ఎల్లప్పుడూ, సత్ఫలితాలనే ఇవ్వదు. స్వేచ్ఛా ఆర్థిక విధానం పెట్టుబడిదారీ విధానానికి దారి తీస్తుంది. తక్కువ వేతనాలు, ఎక్కువ పనికాలం, పరిశ్రమలలో ఏకస్వామ్యం, పారిశ్రామికీకరణ వల్ల వాతావరణ కాలుష్యం మొదలగు దుష్ఫలితాలకు పెట్టుబడిదారీ విధానం దారి తీస్తుంది. నిజానికి ఈ చెడు ఫలితాలు వలన రాజ్యం ప్రైవేటు వ్యాపార పరిశ్రమ రంగాలలో జోక్యం కలుగజేసుకోవలసి వచ్చింది.

3. స్పెన్సర్ చెప్పిన శాస్త్రపరమైన వాదన సమాజానికి ప్రమాదకరమైనది. సంఘర్షణలో బలవంతులు మిగులుతారు అని ఈవాదన చెపుతుంది. శారీరకమైన బలవంతులు బుద్ధిమంతులూ, యోగ్యులూ అవుతారనే నమ్మకం లేదు.

4. వ్యక్తి స్వేచ్ఛావాదులు భావించినట్లు రాజ్యం 'అవసరమైన చెడు' మాత్రం కాదు. సమాజశ్రేయస్సుకు రాజ్యం అవసరమైన ఒకమంచి సంస్థగా చరిత్ర రుజువు చేసింది. రాజ్యాధికారం, దాని కార్యకలాపాలు, వ్యక్తి స్వేచ్ఛకు ఆటంకాలు అనే వాదన సమంజసంగా లేదు. రాజ్యాధికారం వ్యక్తి స్వేచ్ఛకు అవసరమగు పరిస్థితులను కల్పించడానికి దోహదం చేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ పరిరక్షణకు రాజ్యాదికారం అవసరం. ప్రజాశ్రేయస్సును, బలహీన వర్గాల అభివృద్ధిని పెంపొందించడానికి రాజ్య నియంత్రణ, అజమాయిషి అవసరం. కాబట్టి విస్తృతమైన రాజ్య కార్యకలాపాలు అవసరం నేటి సమాజంలో ఎంతైనా ఉంది.

BRAOU

### 8.2.2 ఆధునిక ఉదారవాదం

నిర్దిష్టమైన చారిత్రక పరిస్థితులలో ఐరోపా దేశాలలో ఉదారవాదం ప్రారంభమైంది. శక్తివంతమైన రాజరికాలు, భూస్వామ్య వ్యవస్థ, కులీనవర్గాలు క్షీణించడం వల్ల ఉదారవాదం అభివృద్ధి చెందింది. 18వ శతాబ్దినాటికి ఉదారవాదానికి ఒక నిర్దిష్టమైన స్వరూపం ఏర్పడింది. మేధావి వర్గాల భావాలకు, ఫ్రెంచి విప్లవ ఆదర్శాలకు ఈ సిద్ధాంతానికి దగ్గర సంబంధం ఉంది. 20వ శతాబ్దం పూర్వార్థం నాటికి సాంప్రదాయక ఉదారవాద స్థానంలో ఆధునిక ఉదారవాదం ఆవిర్భవించింది.

జె.ఎస్. మిల్, టి.హెచ్. గ్రీన్ రచనలలో ఆధునిక ఉదారవాద భావాలు మనకు కనిపిస్తాయి. 20వ శతాబ్దంలో ఎల్.టి. హబ్‌హౌస్, హెచ్.జె. లాస్కీ, ఆర్.ఎం. మాకైవర్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన వారిలో ప్రముఖులు. బాగా పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలకు సాంప్రదాయక ఉదారవాదం సముచితమైనది కాదని వీరి భావన. మారినటువంటి సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణ్యంగా సాంప్రదాయక ఉదారవాదాన్ని మార్పు చేయవలసిన అవసరం ఏర్పడింది.

ఆధునిక ఉదారవాద సిద్ధాంతం ప్రకారం రాజ్యం ఒక క్రియాత్మక సంస్థ, వ్యక్తి వ్యక్తిత్వ వికాసానికి రాజ్యం తోడ్పడుతుంది. ప్రజా సంక్షేమం దృష్ట్యా రాజ్యం వ్యక్తి కార్యకాలాపాలలో జోక్యం చేసుకోవల్సిన అవసరం ఉంది. ప్రజలందరి వ్యక్తిత్వ వికాసానికి సమాన అవకాశాలను రాజ్యం కల్పించాలి. సంవర్థక స్వేచ్ఛను ప్రోత్సహించాలి. హక్కులను అనుభవించినప్పుడే స్వేచ్ఛ లభిస్తుంది. కాబట్టి పౌరుల రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కులకు ఆధునిక ఉదారవాదం ప్రాముఖ్యత నిచ్చింది.

ఆధునిక ఉదారవాదం క్రియాత్మకమైన శ్రేయోరాజ్యం. ముఖ్యమైన విధులతోపాటు అనేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విధులను ఆధునిక ఉదారరాజ్యం నిర్వహిస్తుంది. పాశ్చాత్య దేశాలలో ఆధునిక ఉదార రాజ్యాలు చేసిన సామాజిక ఆర్థిక శాసనాలు అయారంగాలలో అవి నిర్వహించే కార్యకలాపాల పరిధిని సూచిస్తున్నాయి. నిరక్షరాస్యత నిర్మూలన, సామాజిక భీమా పథకాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, పనిగంటలు - వేతనాలు నిర్ణయించడం, సంఘ వ్యతిరేక వ్యాపార కార్యకలాపాలను నియంత్రణ చేయడం మొదలగు ఎన్నో కార్యకలాపాలను ఆధునిక ఉదార రాజ్యాలు చేపట్టాయి. ప్రజాసంక్షేమాన్ని, ముఖ్యంగా బలహీన వర్గాల సంక్షేమాన్ని పెంపొందించాయి. సాంప్రదాయిక సిద్ధాంతానికి సామ్యవాద సిద్ధాంతానికి మధ్య స్థానంలో ఆధునిక ఉదారవాదం ఉందని చెప్పవచ్చు. మారుతున్న ప్రజల అవసరాలను అనుసరించి రాజ్యవిధులు మారాలన్నదే దీని ముఖ్యసూత్రం. కానీ సమాజంలో విప్లవాత్మకమైన మార్పులను ఈ సిద్ధాంతం వ్యతిరేకిస్తుంది. ఇది ఒక సరళమైన సిద్ధాంతమని చెప్పవచ్చు.

సాంప్రదాయక, ఆధునిక ఉదారవాద సిద్ధాంతాలు రెండూ పరిమిత ప్రభుత్వాన్నే సమర్థిస్తాయి. వ్యక్తి స్వేచ్ఛకు, హక్కులకు ఈ రెండు సిద్ధాంతాలు అధిక ప్రాధాన్యతను ఇస్తాయి. నిరంకుశ అధికారవాద రాజ్యాలను సమర్థించవు. ఈ రెండూ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని విశ్వశిస్తాయి.

### 8.2.3 మార్క్సిస్టు సిద్ధాంతం

కారల్ మార్క్స్ శాస్త్రీయ సామ్యవాదానికి పితామహుడు. శాస్త్రీయ సామ్యవాదాన్నే కమ్యూనిజం అని కూడా అంటారు. కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రకారం వర్గ పోరాట ఫలితంగా రాజ్యం ఏర్పడిందని మార్క్స్ భావించాడు. ఒక నిర్ణీత చారిత్రక దశలో మానవుడు రాజ్యాన్ని ఏర్పరచుకున్నాడు. ధనికులు, బీదవారు

BRAOU

అనే రెండు వ్యతిరేక వర్గాలుగా సమాజం ఎప్పుడైతే చీలిపోయిందో అప్పుడే రాజ్యం అవతరించిందని మార్క్స్ చెప్పాడు. అవతరించిన దగ్గరి నుండి పాలక వర్గ (ధనిక వర్గ) ప్రయోజనాలను కాపాడడమే దీని విధి. అంతేగాక బీద వర్గాన్ని అణచివేయడం ఇంకొక పని. రాజ్యం ప్రజాశ్రేయస్సును పెంపొందింప జేయడానికి ఆవిర్భవించిందనే ఉదారవాద సిద్ధాంతాన్ని మార్క్సిస్టు సిద్ధాంతం త్రోసి పుచ్చింది. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం ఒక వర్గం ఇంకొక వర్గాన్ని అణచివేయడానికి ఉపయోగపడే యంత్రమే రాజ్యం.

శ్రామిక వర్గ విప్లవం ద్వారా పెట్టుబడిదారీ, బూర్జువా రాజ్యాన్ని కూలదోసిన తరువాత సామ్యవాద రాజ్యం ఏర్పడుతుందని మార్క్స్ చెప్పాడు. విప్లవానంతరం రాజకీయాధికారం శ్రామిక వర్గ పరమవుతుంది. శ్రామికులు చెలాయించే రాజకీయాధికారాన్నే శ్రామిక నియంతృత్వమని మార్క్స్ చెప్పాడు. శ్రామిక నియంతృత్వం పెట్టుబడిదారీ విధానంలో ఉన్న బూర్జువా రాజ్యానికి, సంపూర్ణ కమ్యూనిస్టు రాజ్యానికి మధ్యస్తంగా ఉంటుంది. బూర్జువా వర్గాన్ని నాశనం చేయడం, సామ్యవాద విప్లవ ప్రయోజనాలను సుస్థిరపరచడం శ్రామిక నియంతృత్వం యొక్క ముఖ్య విధులు.

పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో ఉత్పత్తి, పంపిణీ చేసే సాధనాలను జాతీయం చేయడం సామ్యవాద రాజ్యం నిర్వహించే ఇంకొక ముఖ్యమైన విధి. సామ్యవాద రాజ్యంలో ఉత్పత్తి సాధనాలు, ప్రైయివేటు వ్యక్తుల చేతిలో ఉండడానికి వీలులేదు.

శ్రామికుల ఉత్పాదక శక్తిని పెంచడం కూడా సామ్యవాద రాజ్యం పని. ఇందుకోసం శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాజ్యం అభివృద్ధి చెయ్యాలి. అటువంటి పరిజ్ఞానాన్ని పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో ఉపయోగించాలి.

బూర్జువా సంస్కృతి స్థానంలో సామ్యవాద సంస్కృతిని రాజ్యం ప్రవేశపెట్టాలి. సామ్యవాద సంస్కృతిని ప్రజలకు అలవాటు చేయ్యాలి. ఇటువంటి మార్పును విద్యద్వారా రాజ్యం తీసుకురావాలి. పైలక్ష్యాలను సాధించిన తరువాత రాజ్యరహిత సమాజం ఏర్పడుతుంది. వర్గరహిత సమాజంలో రాజ్యం ఆవశ్యకత ఉండదు. రాజ్యం క్రమేణ అంతరించిపోతుంది.

20వ శతాబ్దంలో సోవియట్ యూనియన్, చెకోస్లొవేకియా, యుగోస్లేవియా దేశాలలో కమ్యూనిస్టు రాజ్యాలు పతనమైనాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మార్క్సిస్టు సిద్ధాంత ఔచిత్యం ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఈ దేశాలలో కమ్యూనిజం అంతరించలేదు. తప్ప మార్క్సిస్టు సిద్ధాంతం ప్రపంచంలో అంతరించలేదు. భవిష్యత్తులో కూడ అంతరించదు. మార్క్సిజం రాజ్య స్వభావం విధుల గురించి ఏకపక్షంగా వాదించింది.

### 8.2.4. సమిష్టివాద సిద్ధాంతం

**సమిష్టివాదం అర్థవివరణ** : సమిష్టివాదమనే భావన అస్పష్టమైనది. దీనికి కారణాలు, అనేకరకాలైన రాజ్యవిధులు, ఫేబియన్ సోషలిజం, ప్రజాస్వామ్య సామ్యవాదం వంటి అనేకరకాల సిద్ధాంతాలు ఇందులో ఇమిడి ఉన్నాయి. సమిష్టివాదాన్ని స్టేట్ సోషలిజం అనికూడా అంటారు.

సమిష్టివాద సిద్ధాంతం ప్రకారం ఉత్పత్తి, పంపిణీ, వినిమయ సాధనాలను జాతీయం చేయ్యాలి. దేశ ఆర్థిక వనరులను ప్రజాశ్రేయస్సుకు ఉపయోగించాలి. వాటిని ధనిక వర్గ ప్రయోజనాలకి ఉపయోగించరాదు. ఇవే సమిష్టివాద మూలసూత్రాలు.

BR AOU

తీవ్రరూపం దాల్చిన వ్యక్తి స్వేచ్ఛావాదం ఫలితంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానం యొక్క దుష్ఫలితాలు సమిష్టివాద సిద్ధాంతానికి దారి తీశాయి. సమిష్టివాద సిద్ధాంతం వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతానికి వ్యతిరేక సిద్ధాంతం. సమిష్టివాద సిద్ధాంతానికి మార్క్సిస్టు సిద్ధాంతానికి దగ్గర పోలికలున్నాయి. ఈ రెండు సిద్ధాంతాలు పెట్టుబడిదారీ విధానాన్ని, అసమానతలతో కూడిన పెట్టుబడిదారీ సమాజాన్ని ఖండించాయి. మిగిలిన విషయాలలో ఈ రెండు సిద్ధాంతాల మధ్య పోలిక లేదు.

ఇంగ్లాండులో 1884లో స్థాపించిన ఫేబియన్ సొసైటీ సమిష్టివాద సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేసింది. సిడ్నీ వెబ్, బియాట్రాస్ వెబ్, హెచ్.జి. వెల్స్, జి.బి. షా మొదలైన మేధావులు, లేబర్ పార్టీ రాజకీయ నాయకులు ఫేబియన్ సొసైటీ సభ్యులుగా ఉండేవారు. భారతదేశంలో నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆమోదించిన ప్రజాస్వామ్య సామ్యవాదం సమిష్టి వాదాన్ని పోలి ఉంది.

## సమిష్టివాద సిద్ధాంతం ప్రకారం రాజ్యవిధులు

వ్యక్తి స్వేచ్ఛావాదులు చెప్పినట్లు రాజ్యం ఒక చెడ్డ వ్యవస్థని సమిష్టి వాదులు భావించలేదు. సమిష్టి వాద సిద్ధాంతం ప్రకారం రాజ్యం ఒక సంవర్థక సంస్థ. సమాజ ప్రగతిని సాధించడానికి అవసరమైన నిర్మాణాత్మకమైన సంస్థ రాజ్యమని ఈ సిద్ధాంతం భావించింది. పెట్టుబడిదారీ వ్యవస్థను, సామ్యవాద వ్యవస్థకు సంస్కరణల ద్వారా క్రమేపీ రాజ్యం ద్వారా మార్చవచ్చని సమిష్టివాదుల నమ్మకం. ఉపయోగకరమైన శాసనాల ద్వారా ప్రజాశ్రేయస్సును వృద్ధి చేయవచ్చునని వీరు భావించారు. సమిష్టివాద సిద్ధాంతం ప్రకారం రాజ్యానికి అతి ముఖ్యమైన పాత్ర ఉంది.

సమిష్టివాద సిద్ధాంతం ప్రకారం సమాజంలో సాంఘిక ఆర్థిక అనర్థాలకు ఉత్పత్తి సాధనాలు ప్రయివేటు వ్యక్తుల చేతులలో ఉండడమే కారణం. ఇందువల్ల పెట్టుబడిదారీ విధానాన్ని రద్దుచేసి ముఖ్యమైన పరిశ్రమలను, సేవలను జాతీయం చేయడం రాజ్యం యొక్క ప్రథమ కర్తవ్యం. సమాజం అవసరాలను తీర్చడానికి రాజ్యం పరిశ్రమలను నిర్వహించాలి. ప్రయివేటు లాభాల స్థానంలో సమాజసేవకు స్థానం ఇవ్వాలి.

ఆర్థిక అసమానతలను, అన్నిరకాల దోపిడీ విధానాలను రాజ్యం నిర్మూలించాలి. నిరుద్యోగాన్ని నిర్మూలించాలి. రోగులకు, నిరుద్యోగులకు, ముసలివారికి సాంఘిక భద్రతను కల్పించాలి. వస్తువులు, సేవల ఉత్పత్తిని, పంపిణీ విధానాన్ని, సమాజ శ్రేయస్సుకొరకు రాజ్యం క్రమబద్ధం చేయాలి. సమాజశ్రేయస్సు కొరకు రాజ్యం ఒక స్థానం మాత్రమేనని సమిష్టి వాదులు భావించారు. వ్యక్తులు, వారి సంఘాలను నియంత్రణ చేసే హక్కు రాజ్యానికి ఉంది.

## సమిష్టివాద పద్ధతులు

పైన పేర్కొన్న సామ్యవాద లక్ష్యాలను శాంతియుతంగా రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా సాధించాలని సమిష్టివాదుల వాదన. హింసాత్మక, విప్లవాత్మక పద్ధతులలో సమిష్టివాదులకు నమ్మకం లేదు. అంతేకాకుండా పెట్టుబడిదారీ విధానం నుండి సామ్యవాద విధానానికి మార్పు హఠాత్తుగా రాకూడదు. అటువంటి మార్పు క్రమేణా రావాలి. సమిష్టివాద సిద్ధాంత భావాలను ప్రచారం చేసే పుస్తకాలు, ఉపన్యాసాల ద్వారా ఈ సిద్ధాంతాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలి. సామ్యవాద భావాలున్న వ్యక్తులను శాసన సభ్యులుగా ఎన్నుకోవాలి. ఈ విధంగా సామ్యవాద సమాజ స్థాపనకు వీలవుతుంది.

BRAOU

### విమర్శ

సమిష్టివాదం కొంత విమర్శకు గురైంది. ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుంది. ఇందువల్ల ప్రభుత్వ ఉద్యోగులు అధికారాన్ని దుర్వినియోగం చేసి వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించవచ్చును. ప్రైవేటు పెట్టుబడిదారీ వ్యవస్థకు బదులు ప్రభుత్వ పెట్టుబడిదారీ వ్యవస్థను సమిష్టివాద సిద్ధాంతం ప్రవేశపెడుతుందని విమర్శకుల భావన. ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన సరళీకృత ఆర్థిక సంస్కరణల కారణంగా సమిష్టివాద సిద్ధాంతానికి తిరోగమనం తప్పదు.

## 8.2.5 సంక్షేమ రాజ్య సిద్ధాంతం

### సంక్షేమ రాజ్యారంభం

అధునిక రాజ్యాన్ని సంక్షేమ రాజ్యమని వర్ణిస్తారు. "Citizen and Churchmen" (1941) అనే గ్రంథంలో ఆర్చిబిషప్ విలియం టెంపుల్ "సంక్షేమ రాజ్యము" అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించాడు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో వెలువడిన బేవరిడ్జ్ నివేదికలో (1942) సంక్షేమ రాజ్య సిద్ధాంతాన్ని గురించి మొదటిసారిగా వివరించడం జరిగింది. జీవనాధారం లేని నిరుద్యోగులకు, రోగులకు, వృద్ధులకు, ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని బ్రిటన్‌లో ఈ నివేదిక స్పష్టం చేసింది. రెండో ప్రపంచ యుద్ధం తరువాత అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రభుత్వం అనేక సాంఘిక, ఆర్థిక, సంక్షేమ పథకాలను అమలుపరచడంతో సంక్షేమ రాజ్య భావన కార్యరూపం దాల్చింది.

సంక్షేమ రాజ్యభావన ఇంగ్లాండులో విజయవంతంగా అమలు జరిగిన తరువాత అది నార్వే, స్వీడన్, డెన్మార్క్ దేశాలకు విస్తరించింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం భారతదేశంతో సహా అనేక దేశాలలో ప్రచారంలోకి వచ్చింది. మన రాజ్యాంగంలో నాల్గవ భాగంలో చేర్చిన ఆదేశ సూత్రాల లక్ష్యం దేశంలో సంక్షేమరాజ్యాన్ని స్థాపించడమే. ప్రజల సంక్షేమాన్ని పెంపొందింపచేయడానికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని చేకూర్చాలని ఆదేశసూత్రాలు రాజ్యాన్ని ఆదేశించాయి. సంక్షేమ రాజ్యాన్ని అమలుపరచడానికి మన ప్రభుత్వం అనేక కార్యకలాపాలను చేపట్టి అమలు చేసింది. ఉదాహరణకు పంచవర్ష ప్రణాళికలను అమలు చేయడం.

BRAOU

### సంక్షేమ రాజ్య నిర్వచనం

సంక్షేమ రాజ్యాన్ని వివిధ రచయితలు వివిధ రకాలుగా నిర్వచించారు. అందరికీ ఆమెదయోగ్యమైన నిర్వచనం ఏదీ లేదు. అయినప్పటికీ ఈ క్రింది నిర్వచనాన్ని పరిశీలిద్దాం.

"విస్తృతమైన సాంఘిక సేవలను పౌరులకు సమకూర్చే రాజ్యమే" సంక్షేమ రాజ్యమని టి.డబ్ల్యూ. కెంట్ నిర్వచించాడు. సంక్షేమరాజ్యమని టి.డబ్ల్యూ. కెంట్ నిర్వచించాడు. ప్రజలకు సేవలను చేసే ఒక రాజకీయ వ్యవస్థే సంక్షేమ రాజ్యం. దీనికి రాజకీయ సిద్ధాంతంతో సంబంధం లేదు. పెట్టుబడిదారీ రాజ్యాలు, సామ్యవాద రాజ్యాలు కూడా ప్రజల సంక్షేమానికి అనేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి పౌరునికి కనీసపు జీవన ప్రమాణాన్ని కల్పించడమే సంక్షేమ రాజ్య ముఖ్య లక్ష్యమని జి.డి.హెచ్. కోల్ చెప్పాడు. ప్రజలు తమంతట తాము నిర్వహించలేని కార్యక్రమాలను వారి సంక్షేమం దృష్ట్యా రాజ్యం నిర్వహిస్తుంది.

**సంక్షేమ రాజ్య ముఖ్యలక్షణాలు**

సంక్షేమ రాజ్య ముఖ్యలక్షణాలను ఈ క్రింది విధంగా సంక్షిప్తంగా వివరించవచ్చు.

1. సంక్షేమరాజ్యం క్రియాత్మక రాజ్యం. ఇది సంవర్థక రాజ్యం. ప్రజా సంక్షేమాన్ని పెంపొందించడానికి ఇది ఎన్నో ప్రజోపకరమైన కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

2. ఉదారవాదాన్ని, సామ్యవాదాన్ని సంక్షేమరాజ్యం సమన్వయ పరుస్తుంది. ఉదారవాదంవలే సంక్షేమ రాజ్యం వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యతనిస్తుంది. సామ్యవాదంవలె ఇది అధిక రాజ్య కార్యకలాపాలను ప్రోత్సహిస్తుంది.

3. సంక్షేమరాజ్యం ప్రజాస్వామ్య వ్యవస్థల పరిధిలో పనిచేస్తుంది. ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధి చేయడానికి పాటుపడుతుంది. వీలైనంత ఎక్కువగా ప్రజలందరికి స్వేచ్ఛ సమానత్వాలను కల్పిస్తుంది.

4. సంక్షేరాజ్యం వ్యక్తిగత ఆస్తిని అనుమతిస్తుంది. కానీ ప్రజాప్రయోజనాల దృష్ట్యా అటువంటి ఆస్తిని క్రమబద్ధం చేస్తుంది. సంక్షేమ రాజ్యంలో ఏ ఒకవర్గం ఇంకొక వర్గాన్ని దోపిడీ చేయడానికి అవకాశ ముండదు.

5. మిశ్రమ ఆర్థిక విధానాన్ని సంక్షేమ రాజ్యం ప్రోత్సహిస్తుంది. ఈ విధానం వల్ల పెట్టుబడిదారీ విధానంలో ఉన్న దుష్ఫలితాలను సంక్షేమ రాజ్యం తగ్గిస్తుంది.

**సంక్షేమ రాజ్యవిధులు**

సంక్షేమ రాజ్యం నిర్వహించవలసిన విధులను ముఖ్యంగా రెండు రకాలుగా విభజించవచ్చును. అవి 1. రక్షణ విధులు 2. సంక్షేమ విధులు

**1. రక్షణ విధులు :** దేశంలో శాంతి భద్రతలను కాపాడడం, సంక్షేమరాజ్యం ముఖ్యవిధి. వ్యక్తుల ప్రాణానికి, ఆస్తులకు రక్షణ కల్పించాలి. ప్రజాజీవనాన్ని క్రమబద్ధం చేయడానికి అవసరమగు శాసనాలను రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి. రాజ్య స్వాతంత్ర్యాన్ని కాపాడాలి. ఈ విధుల నిర్వహణ రాజ్యమనుగడకు అవసరం.

**2. సంక్షేమ విధులు :** సంక్షేమ విధులు ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక రంగాలకు సంబంధించినవి. దేశ సంపదను అభివృద్ధి చేయడానికి పారిశ్రామిక రంగాన్ని, వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలి. పరిశ్రమలు అభివృద్ధి చెందడానికి వాటికి అవసరమైన రుణాలు, రాయితీలు, సాంకేతిక సహాయాన్ని అందజేయాలి. ఆర్థిక అసమానతలను తగ్గించడానికి సంక్షేమ రాజ్యం కృషి చేస్తుంది. ఈ లక్ష్య సాధనకు సంపన్నులపై అధిక పన్నులను విధించడం, ప్రైవేటు ఆస్తులను పరిమితం చేయడం చేస్తుంది. ప్రతివ్యక్తికి కనీసపు జీవన ప్రమాణం ఉండేటట్లు సంక్షేమరాజ్యం ప్రయత్నిస్తుంది. బియ్యం నూనె, మొదలగు నిత్యావసరం వస్తువులను చౌకధరలకు బీద, బడుగువర్గాలకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. శ్రామికులకు రక్షణ కల్పిస్తుంది. బడుగువర్గాల వారికి ఎల్లవేళలా సహాయపడుతుంది. ప్రతివ్యక్తికి తిండి, బట్ట, గృహవసతి కల్పించడానికి రాజ్యం ప్రయత్నిస్తుంది. వ్యాపార, వాణిజ్య రుణసంస్థలను క్రమబద్ధం చేస్తుంది. నిరుద్యోగ నిర్మూలనకు ప్రయత్నిస్తుంది.

BRAOU

ఆధునిక నాగరిక జీవనంలో కీలకమైన రోడ్లు, రైల్వేలు, వంతెనలు మొదలగు రవాణా సౌకర్యాలు సంక్షేమ రాజ్యం కల్పిస్తుంది. తంతి, తపాలా మొదలగు వార్తా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ విధి. ప్రజారోగ్యాన్ని పెంపొందించడానికి వైద్య సదుపాయాలను ఏర్పరుస్తుంది. పారిశుద్యాన్ని మెరుగుపరుస్తుంది. నిరక్షరాస్యతను నిర్మూలించడానికి ప్రయత్నిస్తుంది. విద్యాసంస్థలను, గ్రంథాలయాలను నెలకొల్పి విద్యావ్యాప్తికి పాటుపడుతుంది.

పైన పేర్కొన్న రాజ్యవిధులు సంక్షేమ రాజ్య కార్యకలాపాలకు ఉదాహరణలు మాత్రమే.

**విమర్శ**

సంక్షేమ రాజ్యం కొన్ని విమర్శలకు గురైంది. వాటిని సంక్షిప్తంగా ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. వ్యక్తి చొరవని, స్వశక్తిని సంక్షేమ రాజ్యం నాశనం చేస్తుంది. ప్రతిచిన్న విషయానికీ ప్రభుత్వంపై ఆధారపడే అలవాటు ప్రజలకు ప్రభుత్వం నేర్పుతుంది.

2. సంక్షేమ రాజ్యంలో ప్రజల వ్యక్తిగత కార్యకలాపాలలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. ఉద్యోగుల సంఖ్య, అధికారం పెరుగుతాయి. ఈ కారణాలవల్ల సంక్షేమ రాజ్యంలో వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుంది.

3. సంక్షేమ పథకాలను అమలు పరచడానికి భారీ ఆర్థిక వనరులు అవసరం. ఇందువల్ల ప్రజలపై భరించరాని పన్నుల భారం పడుతుంది.

4. పెట్టుబడిదారీ విధానం వల్ల సంభవించిన అన్యాయాన్ని సరిదిద్దడానికి సంక్షేమ రాజ్యం ప్రయత్నిస్తుందే కాని, దాని మూలకారణాలను నిర్మూలించడానికి ప్రయత్నించదు.

పైన వివరించిన లోపాలున్నప్పటికీ, సంక్షేమ రాజ్యభావన నేడు చాలా దేశాలలో అమలులో ఉంది.

## 8.2.6 పారిశ్రామిక రాజ్యం (The Virtual State)

ఇటీవలి కాలంలో పారిశ్రామిక రాజ్యభావన The Concept of Virtual State) ఆవిర్భవించింది. ఇది వర్తక, వ్యాపార రాజ్యానికి వారసత్వంగా వచ్చింది. పారిశ్రామిక వ్యవస్థకు (Virtual Corporation) ఈతరహా రాజ్యాన్ని రాజకీయ ప్రత్యామ్నాయమని చెప్పవచ్చు. స్వదేశంలో ఆర్థిక వ్యవస్థ ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి, విదేశాలలో దాని స్తోమతను విస్తరింపజేసే రాజ్యాన్ని పారిశ్రామిక రాజ్యంగా (Virutal State) పేర్కొనవచ్చు. ఇదే ముఖ్యలక్షణం.

రాజ్యకార్యకలాపాలను పరిమితం చేయడం ద్వారా పాలన సామర్థ్యాన్ని పెంచవచ్చునని పారిశ్రామిక రాజ్యం భావిస్తుంది. పారిశ్రామిక రాజ్యానికి ఇదొక ముఖ్యలక్షణం.

స్వదేశ పరిశ్రమలు ఎక్కువ ఉత్పత్తిని విదేశాలలో చేస్తాయి. ఇందువల్ల స్వదేశంలో భూమి విలువ తగ్గుతుంది, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంది. ప్రత్యక్షంగా విదేశాలలో పెట్టుబడులు పెడుతుంది. స్వదేశ విదేశాలలో పనిచేస్తున్న దేశీయ వ్యాపార సంస్థలను శాసిస్తుంది.

విదేశ పెట్టుబడులను, కార్మికులను ప్రోత్సహిస్తుంది. పారిశ్రామిక రాజ్యం యొక్క ఆర్థిక వ్యవస్థ సంచార ఉత్పత్తికారకాల మీద ఆధారపడి ఉంటుంది. సాంకేతిక, పరిశోధన రంగాల్లో సేవలను



B R A O U

అందించడంలో నైపుణ్యతను సంపాదిస్తుంది. అధిక విలువగల ఉత్పత్తుల నుండే గాక, వస్తువులను డిజైన్ చేయడం, మార్కెటింగ్ పెట్టుబడుల ద్వారా కూడా పారిశ్రామిక రాజ్యం ఆదాయాన్ని పొందుతుంది. ఉత్పాదక సైజును తగ్గించడం ద్వారా సామర్థ్యాన్ని పెంపొందించడమే ఇటువంటి రాజ్య ఆర్థిక వ్యవస్థను సమర్థించే ముఖ్యాంశం. 21వ శతాబ్దంలో దేశ సంపదను పెంచుకొనే ఒకే ముఖ్యమైన మార్గం పోటీపడే శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవడమే.

## 8.3 క్లుప్తంగా

రాజ్య విధులకు సంబంధించి ఎన్నో సిద్ధాంతాలు ఉన్నాయి. ఒక్కొక్క సిద్ధాంతం రాజ్యవిధుల గురించి ఒక్కొక్క విధంగా చెపుతుంది. వ్యక్తి స్వేచ్ఛావాదాన్ని అనుసరించి రాజ్యం ఒక అవసరమైన చెడు. ఈ సిద్ధాంతం ప్రకారం సమాజ మనుగడకు అత్యవసర విధులను మాత్రమే రాజ్యం నిర్వహించాలి. వ్యక్తి ప్రాణరక్షణ, ఆస్తిరక్షణ, దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడటం దీని ముఖ్య విధులు. ఆధునిక ఉదారవాదం రాజ్యాన్ని ఒక సంవర్ధక వ్యవస్థగా వర్ణించింది. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అనుసరించి రాజ్యం ధనిక వర్గ ప్రయోజనాలను మాత్రమే కాపాడుతుంది. క్రమేణా రాజ్యం ద్వారా సామ్యవాదాన్ని అమలు పరచాలని సమిష్టివాదం చెపుతుంది. ఉదార సామ్యవాదాల మిశ్రమమే సంక్షేమ రాజ్యం. ఇది బడుగువర్గాల సంక్షేమానికి పాటుపడుతుంది.

## 8.4 చదవదగిన పుస్తకాలు


1. E. Ashirvadam, "Political Theory"
2. Richard Rosencrance, "The Rise of the Virtaual State", Foreign Affiars July-August, 1996.


## 8.5 నమూనా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులు ఇవ్వండి**

1. వ్యక్తి స్వేచ్ఛావాద సిద్ధాంతాన్ని అనుసరించి రాజ్యవిధులను విమర్శనాత్మకంగా పరిశీలించండి.
2. సంక్షేమ రాజ్యభావాన్ని వివరించి విమర్శించండి.
3. మార్క్సిస్టు సిద్ధాంతం ప్రకారం రాజ్య విధులను తెలపండి.

**II. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 10 పంక్తులలో జవాబు లివ్వండి**

1. ఆధునిక ఉదారవాద రాజ్యవిధుల సిద్ధాంతం
2. సాంప్రదాయక, ఆధునిక ఉదారవాదాల మధ్య తేడాలను తెల్పండి
3. సమిష్టివాద రాజ్య సిద్ధాంతం
4. సంక్షేమ రాజ్య సిద్ధాంతం

**రచయిత : ఎస్. పోలినాయుడు**

B R A O U

# ఖండం:III

## ప్రాథమిక భావాలు

B R A O U

Dr. BRAOU LIBRARY Acc. No. 114983
Class No. 320 RAJ

# భాగం-9 : శాసనం

## విషయ సూచిక

9.0 లక్ష్యాలు

9.1 పరిచయం

9.2 శాసనం - అర్ధం, నిర్వచనం

9.3 శాసనం - స్వభావం, లక్షణాలు

9.4 శాసనం - అభివృద్ధి

9.5 శాసనం - ఆధారాలు, రకాలు

9.6 శాసనం - నీతి

9.7 సమన్యాయ పాలన, అర్ధం - లక్షణాలు

9.8 క్లుప్తంగా

9.9 చదువవదగిన పుస్తకాలు

9.10 నమూన ప్రశ్నలు

## 9.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- శాసనం, అర్ధం, నిర్వచనాలను తెలుపగలరు
- శాసనం యొక్క ఆరంభం, అభివృద్ధిని గూర్చి జాడతీయగలరు
- శాసనం యొక్క లక్షణాలు మరియు వివిధ రకాలను గూర్చి అర్ధం చేసుకోగలరు.
- శాసనం మరియు నీతిల వ్యత్యాసము / భేదమును తెలుపగలరు
- సమ న్యాయపాలన భావమును అర్ధం చేసుకోగలరు.

## 9.1 పరిచయం

రాజనీతి సిద్ధాంత విద్యార్ధి, శాసనం, స్వేచ్ఛ, హక్కులు మొదలైన కొన్ని ప్రాథమిక భావాలను గూర్చి తప్పనిసరిగా తెలుసుకొనవలసియున్నది. వాటి అవగాహన లేక రాజనీతిశాస్త్రం లేక రాజనీతి అధ్యయనం గూర్చి తెలుసుకొనలేదు. అంటే యీ ప్రాథమిక భావాలు రాజనీతి (శాస్త్రం) అధ్యయనంలో అతి ముఖ్యభావాలు.



BRAOU

## 9.2 శాసనం - అర్ధం మరియు నిర్వచనము

రాజనీతి సిద్ధాంతంలో శాసనం భావన ప్రాముఖ్యమైన స్థానాన్ని ఏర్పరచుకున్నది. అందులోనూ, రాజ్యమనే భావనతో మిళితమై వున్నది. అందుకే, 'శాసనం లేని రాజ్యం అరాచకమైనది, రాజ్యంలేని శాసనం అర్ధరహితమైనది' అంటారు. కాకపోతే రాజ్యము అంటే, ఒక న్యాయ సంబంధముతో వ్యవస్థీకరించబడిన సమాజం కనుక, రాజ్యము, శాసనము - యీ రెండూ న్యాయ (Legal) సంబంధమైన విషయాలు.

శాసనం లేక ఆచారం అనేది రాజ్యములోని సభ్యులందరికీ ఒక ప్రవర్తన నియమావళి అని తెలుసు. అయితే శాసనం ప్రత్యేకత ఏమిటంటే, అది అందరి విధేయతను ఆజ్ఞాపిస్తుంది. శాసనధిక్కారం ఏదోరకమైన శిక్షార్హమైనది. అవిధంగా రాజ్యము సభ్యుల విధేతయను ఆజ్ఞాపిస్తుంది. మరోలా చెప్పాలంటే, రాజ్యమనగా శాసనం, శాసన మనగా రాజ్యం. రాజ్యము యొక్క స్థాయి శాసనములను నిర్వహించు తీరునుబట్టి ఉంటుంది. ఆధునిక కాలములో శాసనము గూర్చి అవగహన ఎంత ప్రాముఖ్యమైనదంటే, నిత్యజీవితంలో, వ్యక్తుల మధ్య, వ్యక్తి-రాజ్యముల మధ్య, వివిధ రాజ్యముల మధ్య శాసనము యొక్క అన్వయము ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. స్థానిక, జాతీయ అంతర్జాతీయ రాజకీయ పరిస్థితిలో శాసనం ముఖ్యంగా దాని రూపకల్పన మరియు అమలు పర్చటంలో గతిశీల రాజకీయ ప్రక్రియలో కీలకమైనది.

## 9.2 శాసనం - అర్ధము మరియు నిర్వచనం

వ్యుత్పత్తిరీత్యా 'Law' అనే పదం ప్రాచీన టుటోనిక్ పదమూలమైన Lag అనే పదము నుండి వచ్చింది. దాని అర్థం సమత్వమైన తీరులో నుంచడం లేక అమచర్చడం. మానవ ప్రవర్తనను ఒక దిశలోనూ, అదుపులోనూ పెట్టుటకు రూపొందిచబడినది. అవిధంగా శాసనం "రాజ్యము చేత తయారు చేయబడి, అమలు పర్చబడినది" అన్న నిర్వచనము సరియైనదనిపిస్తున్నది.

మరోరకంగా, Law అన్నపదం లాటిన్ పదం Jus తోనూ, బంధం, ముడి అనే అర్థం యిచ్చు, Jungere అన్నపదంతోనూ సంసర్గమైనదిగా (Associated) లేక సంబంధించినదిగా వున్నది. అవిధంగా రాజ్యములో సభ్యులపై వున్న కరణీయ అంశము (Element of Obligaltion) విశిష్టమైనది.

శాసనం యొక్క సాధారణ అర్థం 'మానవ ప్రవర్తన లేక చర్యకు మార్గదర్శి / నిర్దేశించునది'. అదిమానవ పరస్పర చర్య మరియు ప్రయత్న ఫలితం. మాన ప్రవర్తన నియమావళి / మార్గదర్శి వివిధ రకాలలో పెంపొందింపబడుతుంది. సాంఘిక జ్ఞానములో శాసనాలు నైతిక సూత్రాలు. రాజకీయ జ్ఞానములో అని న్యాయ / చట్టబద్ధమైన నిబంధనలు.

**కొన్ని నిర్వచనాలు**

"శాసనం, సార్వభౌమ రాజకీయ అధికారముచే అమలు చేయబడు, బాహ్యాచర్యకు సంబంధించిన ఒక సాధారన నిబంధన" Holland.

"న్యాయాన్ని పాలించటంలో, రాజ్యంచేత గుర్తింపబడి మరియు అమలు చేయబడిన సూత్రముల సముదాయం శాసనం" Salmond.

"రాజ్యము అమలు చేయు హక్కులు మరియు కరణీయముల వ్యవస్థ, శాసనం" T.H. Green.

"ఏభాగము ప్రతిష్టాపించబడిన ఆలోచన మరియు అలవాటు, ఏకరూపితమైన నిబంధనల రూపంలో ప్రభుత్వ అధికారము మరియు శక్తిచేత సమర్థింపబడి నిర్దిష్టత మరియు సాధారణ గుర్తింపు పొందుతుందో ఆభాగము శాసనం". Wudrow Wilson

## 9.3 శాసనం - లక్షణాలు మరియు స్వభావం

పై నుదహరించబడిన నిర్వచనములను బట్టి ఈ క్రింది లక్షణములను పేర్కొన్నవచ్చు.

1. రాజ్యము శాసనమును రూపొందించు మరియు అమలు పర్చు అధికారము. శాసన ధిక్కారము శిక్షార్హము.

2. వ్యక్తుల అంత:కరణ ఆలోచనలు, ప్రేరకములు కాక, బాహ్యప్రవర్తనను నియంత్రించుట లేక నియమబద్ధం చేయచూచును.

3. ఏవ్యక్తిగాని, సమూహంగాని శాసనము నుండి మినహాయింప (Exempt) బడని, సార్వత్రికమైనది, శాసనం

4. శాసనం నిర్దిష్టమైనది మరియు క్లుప్తమైనది.

5. మానవాళి సాధారణ సౌఖ్యము / క్షేమము కొరకు సాంఘిక క్రమమును నిశ్చయపరచుట శాసనం యొక్క ముఖ్యోద్దేశ్యము.

## 9.4 శాసనము యొక్క అభివృద్ధి

శాసనం క్రమేపీ వివిధ స్థాయిలలో అభివృద్ధి చెందింది. దాని మూలమును కనుగొనటం కష్టం. కానీ మొదట్లో దాని అతి సాధారణమైన రూపం, రాజకీయ సమూహంచే ఎన్నుకోబడిగానీ లేక నియమింపబడిగానీ ఆమోదీకరించబడ్డ 'అధికారము'చే రూపొందింపబడి మరియు అమలు చేయబడ్డది అయి ఉండొచ్చు. న్యాయ విషయం తర్వాత చేర్చబడినది. ఆవిధంగా చట్ట సంబంధిచిన మరియు న్యాయశాస్త్ర / విచారణ సంబంధించిన వ్యాఖ్యానాలు నేటి ఆధునిక శాసన రూపాన్ని తెచ్చిపెట్టాయి.

పశ్చిమ దేశాలలో ఆధునిక యూరపు శాసనం రోమన్ మరియు టుటోనిక్ భావాలనుండి అభివృద్ధి చెందింది. రాజ్యాన్ని ఒకటిగా చేయుటకు రోమన్ శాసనం, ప్రజల వైవిధ్యాన్ని రక్షించుటకు టుటోనిక్ శాసనం అభివృద్ధి చెందాయి. యూరోపు ఖండశాసనం, రోమన్ శాసనం నుండి, బ్రిటీష్ శాసనం టుటోనిక్ శాసనం నుండి ప్రేరణ పొందాయి.

**ఆధునిక శాసన సిద్ధాంతం ఈక్రింది భావన / దృక్పథం పై ఆధారపడ్డది.**

1. **విశ్లేషణ దృక్పథం :** (Analytical School) ఈ దృక్పథం ప్రకారం శాసనం రాజ్యముచేత రూపొందించబడుతుంది మరియు అమలు పర్చబడుతుంది. శాసనం అనేది న్యాయ లేక చట్టపరమైన స్వభావంతో వుంటుంది. ఈ దృక్పథం పెరుగుదలకు తోడ్పడిన వారిలో ప్రముఖులు మేకియావెల్లీ, ఆస్టిన్

BRAOU

మరియు హాబ్స్ శాసనాలు రాజ్యంలోని సభ్యుల ప్రయోజనం కొరకు రూపొందించబడినవి. కనుక దాని ధిక్కారము శిక్షార్హము.

**2. చారిత్రక దృక్పథం : శాసనాలు (వాటి) అభివృద్ధిలో** పరిణామ లేక చారిత్రక సంబంధమైనవని హెన్రీ మైన్ లాంటి మేధావులు చెబుతారు. **అనివార్యమైన** మరియు అగోచరత్వమైన వత్తిడులు/శక్తులు శాసనాల పెరుగుదలకు **కారణం.** అవిరాజ్యమనే సార్వభౌమాధికారిచేత అమలు పర్చబడవచ్చు. కానీ వస్తు భౌతిక పదార్థము (Material Substance) దృష్ట్యా అవి (శాసనాలు) విభిన్న కారకాల ఫలితం. కనుక శాసనాన్ని సాంఘిక, మత, **ఆర్థిక**, రాజకీయ, **భౌతిక మొదలైన వాటి** పర్యావరణం దృష్ట్యా, అర్థం చేసుకొనాలి. శాసనం గతిశీలమైనది (Dynamic), ఎందుకనగా **ప్రజల అవసరాలను** బట్టి విభిన్న కారకములు శాసన పెరుగుదలకు తోడ్పడతాయి.

**3. సామాజిక దృక్పథం : ఈ దృక్పథం దృష్ట్యా,** శాసనాలు ప్రాథమికంగా మానవ అనుభవము మరియు కృషి ఫలితం. **నైతిక భావనకు మరియు** సామూహిక చర్యకు విధేయతలు మానవ మేధస్సులోనే వేళ్ళూనుకుంటాయి. కస్టమరీ **శాసనం** (నైతిక ప్రాతిపదికపై ఆధారపబడ్డ / రూపొందింపబడ్డ ప్రవర్తనా నిబంధనలు అనగా, **ఆచారాలు, సాంప్రదాయాలు) చట్టబద్ధమైన** మరియు రాజకీయ శాసనాలకు ప్రాతిపదిక అవుతుంది. అధునిక మేధావి క్రాబ్ (Krab) యీ **దృష్టిని** సమర్థిస్తాడు. అధునిక తీవ్ర చర్చల ఫలితం శాసన రూపం అన్న ప్రాతిపదికపై, యీ దృక్పథం మెజారిటీ సూత్రాన్ని పరిగణలోకి తీసుకుంటుంది. స్థూలంగా అర్థం చేసుకుంటే మార్క్సిస్టు **దృక్పథం గూడ యీ కోవకు** చెందినదని కొందరు భావిస్తారు.

## 9.5 శాసనం - ఆధారాలు మరియు రకాలు

BRAOU

### శాసనం - ఆధారాలు

శాసనం అభివృద్ధి విభిన్న ఆధారాల నుండి వుంటుంది. కనుక శాసనం ఏ ఒక్కరి లేక కొంతమంది వ్యక్తుల ప్రత్యేక చర్యగా తీసుకొనబడదు. కొన్ని ప్రధాన ఆధారాలు ఇవ్వబడ్డాయి.

**1. ఆచారము : శాసనము మొట్టమొదటి ఆధారం** అచారముగా గుర్తింపబడింది. కుటుంబం లేక తెగ లేక వంశం (Clan) **చేత** పెంపొందింపబడిన **ఆచరణలు** (చర్యలు) సాధారణంగా ఆమోదీకరించబడ్డ ఆచారాలయ్యాయి. వాటి ప్రయోజనాలను బట్టి యిప్పటికీ కొన్ని ఆచారాలు చట్టబద్ధమైన శాసనములున్నంత మంచివిగా చూడబడుతున్నాయి. వాటి ధిక్కారమును సరిగా (ఖచ్చితంగా) పరిగణింపబడనప్పటికీ ఇంగ్లాండులో **ఆచార శాసనమును సాధారణ శాసనం** (Common Law) అంటారు. మరియు కొన్ని ఆచార శాసనములు హిందూ శాసననములుగా పరిగ**ణించబడ్డా**యి. అధునిక సమాజం, కొన్ని ఆచార శాసనములను పరిగణిస్తున్నప్పుడు ఆదిమ సమాజం **నుండే ప్రేరణను తీసుకుంటుంది.**

**2. మతము :** ఎక్కువ పురాతన సమాజాలలో, ఆచార శాసనాలు మత నమ్మకాలు మరియు ఆచరణలతో ముడిపడి / అతి దగ్గరగా వున్నాయి. సామాజిక చింతన / వుత్సాహం పెంపొందించుటకు మరియు కొన్ని సమస్యల పరిష్కారం కొరకు మతభావనలు మరియు ఆచరణలు వుపయోగింపబడ్డాయి. కొన్ని మత సంఘాలలో **మతగ్రంథ సంబంధ ఆంక్షలు** (Scriptural Sanctions) ను యింకా ఆచరిస్తారు. మత (సంబంధ) శాసనమునే వ్యక్తిగత (Personal) **శాసనం** అంటారు. మరి ఆవిధంగా హిందూ వ్యక్తిగత

శాసనం, ముస్లిం వ్యక్తిగత శాసనం, క్రిస్టియన్ వ్యక్తిగత శాసనం వగైరాలు వున్నాయి. మతము ఆవిధంగా ఆధునిక శాసనానికి ప్రధాన ఆధారాలలో ఒకటైనది.

3. న్యాయ నిర్ణయము (Adjudication): న్యాయ నిర్ణయాలు లేక మేధావులైన కొంతమంది శాస్త్రవేత్తల తీర్పులు శాసనమునకు మరొక ప్రముఖ ఆధారము. న్యాయమూర్తులను కమ్యూనిటీ యొక్క వివేకవంతులుగా పరిగణింపబడతారు. కొన్ని కేసులు సంబంధించి వారి వ్యాఖ్యానాలు ప్రస్తుత సమస్యకు మరియు భవిష్యత్తు పరిస్థితికి పరిష్కారమిస్తాయి. వారి తీర్పులు ఆవిధంగా శాసనాలవుతాయి. మరియు వాటికే న్యాయమూర్తులు తయారుచేసిన (Judgemade) లేక కేస్ (Case Laws) శాసనలు అంటారు. న్యాయమూర్తులు శాసనాన్ని అమలు పరుస్తారు. మరియు తయారు చేయాలి అని న్యాయమూర్తి హోమ్స్ (Holmes) అంటారు.

4. సమత (Equity) : ఇది కూడా న్యాయమూర్తులు తయారు చేసిన శాసనమే కానీ న్యాయ నిర్ణయంలో న్యాయమూర్తి శాసనాన్ని వ్యాఖ్యానిస్తారు. సమతలో న్యాయమూర్తి క్రొత్త శాసనాన్ని రూపొందిస్తారు / కలుపుతారు. ప్రస్తుతం అమలులోవున్న శాసనాలు ఏ సమస్యనైనా పరిష్కరించ లేనప్పుడు మారిన పరిస్థితి దృష్ట్యా యీ సమస్య పరిష్కారం కోసం, ఇంగిత జ్ఞానంతో గానీ లేక సహజ న్యాయ సూత్రములతోగానీ క్రొత్త శాసనాన్ని రూపొందిస్తారు. ఆవిధంగా సమత, సమంజసము (Fairness) లేక న్యాయము యొక్క సాధారణ సూత్రములను పెంపొందించినట్లు అవుతుంది. అవి (సమత), వున్న శాసనములు సమస్యని పరిష్కరించ లేనప్పుడు ఒకరకమైన వూరట కల్గిస్తాయి. రోములో సమతను అమలుపరుస్తారు. ఇంగ్లాండులో కూడా లార్డ్ ఛాన్సిలర్ సమత సూత్రాలను అమలుపరుస్తారు.

5. శాసనా నిర్మాణం : ఆధునిక సమాజాలలో శాసన నిర్మాణం శాసనములకు ఒక ప్రముఖ ఆధారమైనది. ఎన్నుకోబడని ప్రతినిధుల కర్తవ్యం శాసన నిర్మాణం అయినట్లు, శాసన సభ్యులు ఆమోదించిన శాసనాలు, ప్రజల ఇచ్ఛను ప్రతిబింబిస్తూ ప్రకటించబడిన రాజ్యఇచ్ఛ. బాగా పర్యాలోచన చేసిన తర్వాత రూపొందింపబడిన శాసనాలు, ప్రజాస్వామ్య స్పృహకు తగినట్లుంటాయి.

6. ప్రామాణిక వ్యాఖ్యానాలు (Standard Commentories) / శాస్త్రీయ చర్చలు : విద్యావేత్తల రచనలు మరియు అభిప్రాయాలు గూడ శాసనమునకు ఒక ప్రధాన ఆధారంగా పరిగణింపబడతాయి. ఇంగ్లాండ్‌లో కోక్ (Coke) మరియు బ్లాక్‌స్టన్ (Black Stone) ల అభిప్రాయాలు, అమెరికాలో Story మరియు Kent ల అభిప్రాయాలు, మరియు ఇండియాలో విజ్ఞానేశ్వర మరియు ఆపరార్కుల అభిప్రాయములు కొన్ని అత్యుత్తమ వుదాహరణలు. వారి అభిప్రాయములు / రచనలు, వాటంతట అవి శాసనములు కానేరవు. కాని శాసనాన్ని సరిగా వాఖ్యనించడానికి అవి ఉపయోగపడతాయి. "వ్యాఖ్యానించే వారు సేకరించి, పోల్చిచూసి మరియు న్యాయ సూత్రములను, ఆచారములను, శాసనములను తార్కికంగా క్రమపరుచట చేత, రాబోయే / సరియైన కేసులకు పరిష్కార సూత్రమును ఏర్పరచుతారు. వారు (వ్యాఖ్యానించేవారు) లోపములను చూపిస్తూ, (కేసులను) పరిష్కరించుటకు సూత్రాలను రూపొందిస్తారు". అని బాగా చెప్పబడింది.

శాసనమునకు ఆధారాలను సంగ్రహపరుస్తూ ఉడ్రోవిల్సన్ యిలా అంటాడు. "ఆచారము శాసమునకు అతి ప్రాచీన మూలము. మరియు మతము వర్తమానమైన, సమానముగ విస్తారమైన మరియు జాతీయాభివృద్ధికి వున్న అదే దశలలో, దాదాపు ఒక తదాత్మ్య ఆధారము / మూలము. న్యాయ నిర్ణయము అధికారము లాగానే తయారవుతుంది. మరియు పురాతన కాలము నుండి న్యాయ నిర్ణయము మరియు

BRAOU

సమత కలిసే పెరిగాయి. (కాకపోతే) శాసనము, చేతన మరియు ఉద్దేశ్య పూర్వక శాసన వ్యవస్థాపనము మరియు శాస్త్రీయ చర్చ, సూత్రముల వివేచనతో గూడిన అభివృద్ధి, శాసన నిర్మాణములో తమ ప్రభావమును నిర్ధిష్టార్థకమునకు (ధృడము చేసికొనుటకు), రాజ్యములో ఎదిగిన స్థాయికి చేరుటకు వేచియుండాలి"..

**శాసనము - రకాలు**

శాసనము యొక్క రకాలు ఒక ఖచ్చితమైన వర్గీకరణ ప్రకారం లేకపోయినప్పటికీ, యీక్రింది వర్గీకరణను సాధారణంగా అంగీకరించారు.

**1. సహజ మరియు సంవర్ధక (Possitive) శాసనము (లు) :** దేవుని దృష్టిలో మానవ అస్తిత్వ అంతిమ లక్ష్యం గూర్చి తెలుపు మానవ వివేచనంపై ఆధారపడ్డది సహజ న్యాయము. అతి భౌతిక శక్తికి గౌరవమిచ్చుట సహజన్యాయమును అర్థం చేసికొనుటకు ఒక మార్గము. సంవర్ధక శాసనం మానవ తయారీ మరియు చట్టబద్ధమైనది.

**2. జాతీయ మరియు అంతర్జాతీయ శాసనము (లు) :** ఒక నిర్ణీత భూభాగ పరిధిలో నివసించు ప్రజల కొరకు సార్వభౌమాధికారముచే రూపొందింపబడిన న్యాయము జాతీయ లేక మున్సిపల్ శాసనం అంటారు. అంతర్జాతీయ శాసనం రాజ్యాలను వాటి సంబంధాలను నియామకం చేస్తుంది.

**3. రాజ్యాంగ మరియు సాధారణ శాసనము (లు) :** ఈ రెండూ రాజ్యము యొక్క శాసనములు. రాజ్యాంగ శాసనము చట్టబద్ధమైనది - వీటిలో కొన్ని సాంప్రదాయక (Conventional) లేక అలిఖితమైనవి. వ్యక్తులకు సంబంధించినది సాధారణ శాసనం.

**4. ప్రైవేటు మరియు పబ్లిక్ శాసనము (లు) :** ప్రైవేటు శాసనం వ్యక్తుల మధ్య సంబంధాలను వినియామకం చేస్తుంది. పబ్లిక్ శాసనం రాజ్యము యొక్క వ్యవస్థీకరణ, ప్రభుత్వ విధులపై పరిమితులు, మరియు రాజ్యము దాని పౌరుల మధ్య సంబంధాలకు సంబంధించినది.

**5. పౌర (Civil) మరియు నేర (Criminal) శాసనము (లు) :** పౌరశాసనం వ్యక్తుల లేక వ్యక్తుల సమూహముల మధ్యగల ఒప్పందాల అతిక్రమణ / ధిక్కారమునకు సంబంధించినది. నేర (సంబంధ) శాసనం వ్యక్తుల నేరచర్యకు సంబంధించినవి. **పాలన / పాలక చట్టము (Administrative Law)** కూడా వున్నది. అది రాజ్యముతో ప్రభుత్వోద్యోగులకు గల సంబంధాలను గూర్చి నిర్ణయిస్తుంది. అది బాధ్యతను నిర్ణయిస్తుంది. పాలనాధికారుల సమర్థతను (Competence) నిర్ణయిస్తుంది. మరియు (సంబంధిత) వ్యక్తులకు, తమ తప్పులను సరిదిద్దుకునే పరిష్కారములను తెల్పుతుంది.

## 9.6 శాసనము మరియు నీతి

పైన చర్చించినట్లు రాజ్యమునకు శాసనము ఎలాంటిదో సమాజానికి నీతి అటువంటిది. రాజ్యము మరియు శాసనము చట్టబద్ధమైన విధేయతను కోరుతాయి. మరియు వత్తిడిని ఉపయోగించటం న్యాయ సమ్మతమైనది. ఒకవైపు రాజ్యము మరియు శాసనములు మధ్య వైశిష్ట్యము మరియు రెండోవైపు సమాజము, నీతిల మధ్య వైశిష్ట్యము చాలా వరకు సుపరిచితమే.

BRAOU

'అదర్శ' మరియు 'సంవర్ధక' శాసనముల మధ్య వైశిష్ట్యమును చూపారు. వ్యక్తి అంతరాత్మకు లేక ఒప్పు-తప్పు, లేక మంచి-చెడుల (తెలుసుకోగల్గిన) వ్యక్తి దృష్టికి తీసుకొని రావడం లేక తెల్పటం చేస్తుంది. ఆదర్శ శాసనం. 'వ్యక్తి అంతరాత్మ చాలా వరకు ఆచారాలు సాంఘిక శిక్షణ మరియు మత ప్రభావాల అభివ్యంజనము (Expression). అది వ్యక్తియొక్క 'స్వయం/స్వంత శాసనం' దానికి శాసనానికి గల సంబంధం ప్రస్ఫుటమైనది కాదు. కాని సంవర్ధక నీతి శాసనమునకు దగ్గరగా ఉంటుంది. ఎందువలననంటే అది, 'ఏ పరిస్థితిలోనైనా వ్యక్తి చెందియున్న సమాజపు (అమలులో వున్న) అభిప్రాయముచే సమర్థింపబడిన నిబంధన నియమావళి'.

విషయములోనూ, ఆంక్షలలోనూ, నిర్దిష్టతలోనూ శాసనం నీతి కన్న భిన్నంగా వుంటుంది. వ్యక్తుల బాహ్యాచర్యలకు సంబంధించినది శాసనం, నీతి అంతఃప్రేరకమునకు సంబంధించినది. మొదటిది వ్యక్తిని, నొప్పించకుండా, నేరము చేయకుండా, కాపాడుతుంది. రెండవది వ్యక్తిని పాపము నుండి కాపాడుతుంది. శాసనము సార్వత్రికమైనది. నీతి అలాకాకపోవచ్చు. శాసనం ప్రత్యేకము మరియు నిర్దిష్టము, నీతి సందిగ్ధము మరియు ఆత్మాశ్రయము - శాసనం ఆదేశిస్తుంది, నీతి సలహా / సూచనలనిస్తుంది.

అయినా శాసనం, నీతి చాలా దగ్గర సంబంధం కలిగి వున్నవి. శాసనం సహజ న్యాయంపై ఆధారపబడ్డది. నీతి మానవ జ్ఞానం నుండి బయటబడిన అలిఖిత శాసనాలు. చాలామంది రాజనీతి తత్త్వవేత్తలు యీ రెంటి మధ్యనున్న కలయికను బయలుపర్చారు. అధునిక సమాజములలో పరిస్థితుల క్లిష్టత వల్ల, అవసరాలు, కాలమునకు అనుగుణంగా, శాసనం నీతి నుండి ఒక్కొక్కప్పుడు విడిపోవాల్సి వస్తుంది. కానీ నీతి, శాస్త్రమునకు సంబంధిచినదిగా వుండలేదు. సాంఘిక సంక్షేమం, శాసనం సులభంగా అమలు పర్చబడుటకు సహాయపడు సంవర్ధక నీతిపై ఆధారపడి వుంటుంది. సాంఘిక అక్రమాలు / చెడులు తొలగింపబడుటకు మరియు సాంఘిక సంక్షేమం పెంపొందించుటకు, ప్రజాభిప్రాయాన్ని కదిలించడం కీలకమైనది, మరి(యిక్కడ) సంవర్ధక నీతి ముఖ్యపాత్ర వహిస్తుంది. కనుక ఏ సమాజములోనైనా సంఘ సంస్కర్తలు, చట్టబద్ధ నిబద్ధతకు దారి తీయుటకు నీతి పెంపుదలకు పిలుపునిస్తారు.

## 9.7 సమన్యాయపాలన (Rule of Law) - అర్ధము మరియు లక్షణములు

'సమన్యాయపాలన' అనే భావన బ్రిటీషు రాజ్యాంగం యొక్క మౌలిక లక్షణాలలో ఒకటి. 1855లో ప్రచురించబడ్డ 'Law of the Constitution' అను గ్రంథములో A.V. Dicey యీ భావనను పెంపొందించెను. డైసీ ప్రకారం సమన్యాయ పాలనకు మూడు అర్థములు కలవు.

1. శాసనము ద్వారా / చేత మాత్రమే పరిపాలన : దేశ సాధారణ న్యాయ స్థానముల ఎదుట నిర్దిష్టమైన శాసనోల్లంఘన, సాధారణ చట్టబద్ధరీతిలో ప్రతిష్ఠాపితమైనప్పుడు తప్ప ఏ వ్యక్తీ శిక్షార్హుడుకాడు. మరియు శారీరక లేక వస్తు సంబంధంగా చట్టరీత్యా బాధపడేటట్లు కాకూడదు. సమన్యాయపాలన, అన్నిరకాల ప్రభుత్వ లేక ప్రభుత్వోద్యోగుల స్వైర మరియు వైకల్పిక / వివేచనా శక్తులను తిరస్కరిస్తుంది.

2. శాసనము ఎదుట / దృష్టిలో సమానత్వము : శాసనం ఎదుట అందరూ సమానమే. తన స్థానము లేక హోదాలతో సంబంధం లేక, ప్రతివారు దేశ సాధారణ శాసనమునకు బద్ధుడు అన్న భావనలో ఏ ఒక్కరూ శాసనమునకు అతీతుడుకాడు.

3. రాజ్యాంగ శాసనము సాధారణ శాసనము నుండి వెలువడుతుంది. పౌరులు అన్ని ప్రాథమిక హక్కులు సాధారణ శాసనము నుండి వెలువడతాయి కాని, సాధారణ శాసనము నుండి రూపొందింపబడిన రాజ్యాంగ శాసనము నుండి కాదు.

ఆవిధంగా సమన్యాయపాలన అనేది శాసన సర్వోన్నతము, శాసనము ద్వారా మాత్రమే పాలన మరియు అందరిని శాసనము ఎదుట సమానము చేయుట. డైసీ వివరించిన సమన్యాయపాలన సూత్రము నిబిడీకృతమైన బ్రిటీషు రాజ్యాంగము U.K. (United Kingdom) లో క్రొత్త పోకడలను కనుగొనవలసి వచ్చినది. సంక్షేమ రాజ్యభావన పెరుగుదలతో మరియు రాజ్యపాత్ర విస్తరించి వచ్చినందువలన, ప్రభుత్వ మరియు యితర ప్రతినిధి (సంస్థ)లు న్యాయ నిర్ణయ అధికారములు ఇవ్వబడెను. పాలనా న్యాయము రాజనీతి పాలనలో ఒక ప్రముఖ స్థానాన్ని పొందడం మొదలిడింది. మరొక లక్షణమైన, 'దత్తశాసన నిర్మాణం' (Delegated Legislation) కూడా ప్రభుత్వోద్యోగుల వైకల్పిక / వివేచనాత్మక అధికారములను విస్తరించెను. ఆవిధంగా U.K. లో సమన్యాయ భావన వివిధ రూపాలను తీసికొన్నది.

## 9.8 కుప్తంగా

సాధారణంగా రాజనీతి శాస్త్రములోను, ప్రత్యేకించి రాజనీతి సిద్ధాంతములోను, శాసనము అనే భావన ప్రముఖమైనది. శాసనమనేది రాజ్యమనే సార్వభౌమాధికారిచే రూపొందించబడి మరియు అమలు పర్చబడు ఒక ప్రవర్తనా నిబంధనల నియమావళి. అయితే శాసన అభివృద్ధి వివిధ ఆధారముల / మూలముల పర్యవసానం. అన్ని ఆధారాలు శాసనం అమలు తేలిక చేయటానికి సహకరిస్తాయి. శాసనము మరియు నీతి పరస్పర ఆధారితములు మరియు పరస్పర సంబంధీయత / సంబద్ధమైనవి. సాధారణ శాసనం నుండి రూపొందింపబడిన సమన్యాయ పాలన వ్యక్తి స్వేచ్ఛకు రక్షణ యిస్తుంది.

## 9.9 చదవదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| E. Barker | : | Principles of Social and Political Theory |
| A. Appadorai | : | The Substance of Politics |
| J.C. Johari | : | Foundations of Political Science |
| J.C. Johari | : | Contemporary Political Theory |

BRAOU

## 9.10 నమూనా ప్రశ్నలు

I. ఈక్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులిమ్ము

1. శాసనమనగానేమి ? దాని అర్థము మరియు లక్షణములను చర్చింపుము
2. శాసనము గూర్చి గురుతర భావనలు ఏవి? అవి శాసనాన్ని ఎలా వ్యాఖానించును ?
3. శాసనము యొక్క వివిధ ఆధారము లేవి ?

**II. 10 పంక్తులలో జవాబులిమ్ము**

1. శాసనము మరియు నీతి మధ్య వ్యత్యాసము చూపుము

2. శాసన వర్గీకరణ ఏమి ?

3. సమన్యాయపాలన అనగానేమి ? దాని ప్రధాన సూత్రములేవి ?

**రచయిత : వి.ఎస్.ఆర్. ఆంజనేయులు**

BRAOU

# భాగం-10 : స్వేచ్ఛ మరియు సమానత్వము

విషయ సూచిక


10.0 లక్ష్యాలు

10.1 పరిచయం

10.2 స్వేచ్ఛ - నిర్వచనం

10.3 స్వేచ్ఛ - రకాలు

10.3.1 సహజ స్వేచ్ఛ

10.3.2 పౌర స్వేచ్ఛ

10.3.3 రాజకీయ స్వేచ్ఛ

10.3.4 ఆర్థిక స్వేచ్ఛ

10.3.5 జాతీయ స్వేచ్ఛ

10.3.6 నైతిక స్వేచ్ఛ

10.4 శాసనము మరియు స్వేచ్ఛ

10.5 సమానత్వం

10.6 సమానత్వం - రకాలు

10.6.1 న్యాయ లేక చట్టబద్ధ సమానత్వము

10.6.2 రాజకీయ సమానత్వము

10.6.3 ఆర్థిక సమానత్వము

10.7 స్వేచ్ఛ మరియు సమానత్వము

10.8 క్లుప్తంగా

10.9 చదువదగిన పుస్తకాలు

10.10 నమూనా ప్రశ్నలు


## 10.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- స్వేచ్ఛ మరియు సమానత్వము భావాలు అర్థం చేసుకోగలరు.
- వివిధరకాల స్వేచ్ఛ మరియు సమానత్వములను విశదీకరించగలరు.
- స్వేచ్ఛను శాసనము మరియు సమానత్వముతో సంబంధించగలరు.

BRAOU

## 10.1 పరిచయం

రాజనీతి సిద్ధాంతములో స్వేచ్ఛ మరియు సమానత్వము భావనలు ఎంత ప్రాముఖ్యం చెందినవంటే, చదువుకున్నవారు - సామాన్య మానవులు కూడా తమ రాజకీయ చర్చలలో ఈ భావనలను వాడుతుంటారు. వివరణ ఎంత సాంకేతికమైనప్పటికీ, యీ భావాల గూర్చి అవగాహన ఎంత అవశ్యకమంటే, రాజనీతి సిద్ధాంత విద్యార్థి మనస్సులో యీ భావాల అర్థాలు, వాటి మధ్యగల సంబంధాలు సుస్పష్టంగా వుండాలి. 18వ శతాబ్దం నుండి, ప్రత్యేకించి ఫ్రెంచి విప్లవ కాలం నుంచి యీ భావాలు అసలు రాజకీయ జీవితము యొక్క ప్రయోజనాన్ని తెలియజేస్తూ వచ్చాయి. ఫ్రెంచి విప్లవం పూర్తిగా ప్రజాస్వామ్య పోకడలలో జరగనప్పటికీ, దాని గమ్యము లేక ఉద్దేశ్యము మాత్రము ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపనయే. ఆ ఉద్దేశ్యంతోనే యిప్పటికి అన్నిరకాల ప్రజాస్వామ్య వ్యవస్థలలో యీ భావాలు ఉపయోగింపబడుతున్నాయి. అనగా ఏదో ఒకరకమైన లేక కొంతవరకైనా స్వేచ్ఛ మరియు సమానత్వాలను సాధించాలన్నదే ప్రజాస్వామ్య రాజ్యాల గమ్యము.

## 10.2 స్వేచ్ఛ - నిర్వచనం

Liberty మరియు Freedom అనేపదాలు దాదాపు ఒకే అర్థాన్నిస్తాయి. కాకపోతే కొందరు వాటి అర్థాల సూక్ష్మతను చూపుతూ, Liberty రాజకీయ, Freedom సామాజిక అర్థాలు కల్గియుంటాయి అంటారు. కాని చాలవరకు యీ రెండు పదాలు పర్యాయపదాలు. Liberty అనే పదం 'LIber' అనే లాటిన్ పదమూలము నుండి రూపొందించబడింది.

ప్రతి రాజనీతి తత్త్వవేత్త ఏదో ఒకరకంగా స్వేచ్ఛను నిర్వచించారు. వాటిలో చాలా నిర్వచనాలు చాలామంది నోటి నుండి వెలువడే పదాలుగానో లేక నినాదాలుగానో తయారయ్యాయి. ఈ భాగంలో నిర్వచనాలన్నింటినీ చర్చించము. ఈ భావనల గురుతర దృక్పథాల దృష్ట్యా కొన్ని ప్రధాన నిర్వచనాలను చర్చించటం మాత్రమే యీ భాగం ఉద్దేశ్యం.

స్వేచ్ఛ అనే పదం నిరపేక్ష స్వేచ్ఛ అనే అర్థాన్నిస్తున్నట్లు కన్పడుతుంది. కానీ అవిధంగా ఏరాజనీతి తత్త్వవేత్త చూడలేదు. స్వేచ్ఛ అనేది పరిమితులు లేని మరియు అనన్యతమైన స్వేచ్ఛ అని మాత్రమే కాదు. స్వేచ్ఛ అనేది లైసెన్సు (Licence) లాంటిది అసలే కాదు. ఈక్రింది స్వేచ్ఛ నిర్వచనాల్ని పరిశీలించుము.

"అతిగా ప్రవర్తిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకమైనది" (సీలే)

"ఏవైతే ఆధునిక నాగరికతలో వ్యక్తి సుఖానికి తప్పనిసరియైన హామీనిస్తాయో, అలాంటి సామాజిక పరిస్థితులపై ఆంక్షలు / పరిమితులు లేకపోవటం". (లాస్కీ)

ఈ రెండు నిర్వచనాలు స్వేచ్ఛ అర్థాన్ని, నిరపేక్ష మాటలలో కానప్పటికి, వ్యతిరేక / నిషేధాత్మక అర్థాన్ని యిస్తాయి. (ఎందువలన అంటే, 'ఆంక్ష/పరిమితి రహితం' అనేపదాలు వాడడం వలన). అలా వాడుటకు కారణం లేకపోలేదు. ఆంక్ష / పరిమితి అన్నవి సాధారణంగా రాజకీయ సంస్థలవల్ల, ప్రత్యేకించి ప్రభుత్వము వల్ల కల్గుతాయి.

BRAOU

ఈ క్రింది మరికొన్ని నిర్వచనాలు

"వ్యక్తులు తమ అత్యుత్తమాన్ని పొందుటకు / పెంపొందించుకొనుటకు కావల్సిన అవకాశం ఏదో, అలాంటి వాతావరణాన్ని త్వరితముగా అమలు పర్చటం". (Laski - Grammar of Politics)

"స్వేచ్ఛ అనేది అన్నిరకాల ఆంక్షలు / పరిమితులు లేకపోవటం కాదు. వివేచనా రహితమైన పరిమితుల స్థానములో వివేచనాత్మకమైన పరిమితుల నుంచడం". (M' Kenchnic)

ఈ సత్సంకల్పము దృష్ట్యానే స్వేచ్ఛ సరియైన స్వేచ్ఛ, అసత్సంకల్పముతో సాధించాలనుకున్నవి సాధించుటకే స్వేచ్ఛ ..... ఆస్వేచ్ఛ దేనినైనా లేక ప్రతిదానిని సాధించుటకు కాదు, సత్సంకల్పము తనకు వేటినైతే సాధించాలనుకుంటుందో, వాటిని సాధించుటకు మాత్రమే స్వేచ్ఛ" (T.H. Green)

ఈ నిర్వచనాలు స్వేచ్ఛ సంవర్థక అర్థానిచ్చేవి, ఎందుకనగా మానవులు తమ సామర్థ్యాలను పెంపొందించుకొనుటకు కావాల్సిన / అవసరమయ్యే అవకాశాలు స్వేచ్ఛకు అర్థాలు కనుక. జె.ఎస్. మిల్ రచించిన 'On Liberty' గ్రంథంలో స్వేచ్ఛకు ఉన్న యీ రెండు అర్థాలు కన్పిస్తాయి.

"ఒక వ్యక్తిగాగాని, సమూహముగా గాని, వారి సంబంధించిన వారి స్వేచ్ఛలో జోక్యం కల్పించుకోకుండా హామీ యొక్క ఒకే ఒక లక్ష్యం - స్వంత రక్షణ. ఒకరి ఇచ్ఛకు వ్యతిరేకంగా, కొంతమంది ఉన్న నాగరిక కమ్యూనిటీ పైననైనా, శక్తిని సరియైన పద్ధతిలో అమలు చేయటంలోని ఒకే ఒక ఉద్దేశ్యం - మరొకరికి హాని చేయకూడదు. భౌతికంగా, మానసికంగా (ప్రతి) వ్యక్తి తనపై తాను సార్వభౌమాధికారి".

అనగా మరొకరికి హాని చేయనంతవరకు ప్రతివానికి స్వేచ్ఛ వుంటుంది. దీనినే మిల్ 'తనకు సంబంధించినవి' (Self Regarding) విషయాలు అంటాడు. 'ఇతరులకు సంబంధిచిన విషయాలతో (Other Regarding) అనగా ఇతరుల లేక సమాజము యొక్క స్వేచ్ఛకు సంబంధించిన విషయాలలో, రాజ్యము కల్పించుకోవచ్చు మరియు వ్యక్తులకు మార్గము యివ్వవచ్చు / నిర్దేశించవచ్చు.

లాస్కీ గూడ యిలాగే వ్రాస్తాడు.

"పౌరుల మనస్సు క్రియాత్మకంగా వుండాలి. వారు ఆలోచించే అలవాటు యివ్వబడాలి. ఆలోచన ఆచరణలోకి రావటానికి తగిన మార్గములు (అవకాశాలు) వారు ఇవ్వబడాలి. వారు కనుక పౌరులుగా నడుచుకోవటానికి గల విధులకు జాగురూకతతో నుండదలచుకొంటే తమ ఇచ్ఛను, అంతరాత్మను పుపయోగించేవారుగా అలవాటుపడాలి. స్వేచ్ఛ అనేది, విధేయులైన వారి శిక్షణ యివ్వబడ్డ అంతరాత్మ మీద ఆధారపడిన ఇచ్ఛకు ఎక్కువ ప్రోత్సాహం ఇవ్వటంతో తప్ప మరి దేనిలోనూ లేదు .... మూర్తిమత్వ అభివృద్ధికి అవశ్యమని చరిత్ర చూపిన అవకాశాలే స్వేచ్ఛలు. మరియు స్వేచ్ఛలు హక్కుల నుండి అవిభాజ్యమైనవి (విడదీయరానివి), ఎందువలననంటే, అలాకాకపోతే, వాటి సిద్ధిత్వము (Realisation) వాటి గుణాన్ని నాశనము చేసే అనిశ్చితత్వముచేత చుట్టబడి / కంచె వేయబడి వుంటుంది".

లాస్కీ స్వేచ్ఛకు మూడు ప్రధాన హామీలు చూస్తాడు.

1. ప్రత్యేక హక్కుల ముందు స్వేచ్ఛ వుండలేదు..... అవకాశాన్ని ఉపయోగించుకోగల్గినా, లేకపోయినా, అందరు శక్తిని పొందగల సమాన దారి (అవకాశం) వుండాలి.

B R A O U

2. కొందరి హక్కులు మరికొందరి ఆనందంపై ఆధారపడినప్పుడు, అక్కడ స్వేచ్ఛ వుండదు. పౌరునిగా తనకున్న హక్కులను అనుభవించటంపై మరి ఏయితర సమూహము ఆక్రమించు / అతిక్రమించు పరిస్థితి వుండకూడదు.

3. రాజ్యచర్య పక్షపాతము లేనిదిగా సంభవించేదిగా ఉండాలి .... స్వేచ్ఛను కాపాడుటకు మనము మహా చేయగల్గినది ఏమిటంటే, పక్షపాతము సంభవించటం అతి తక్కువ స్థాయిలో నుంచగల వ్యవస్థను చూడగల్గటం.

జె.ఎస్. మిల్ కలిపిచూపిన సంవర్థక (Positive) మరియు నిషేదాత్మక (Negative) స్వేచ్ఛను విశదీకరిస్తూ సర్ ఇస్సయా బెర్లిన్ నిషేధాత్మక అర్థం "ప్రభుత్వం / రాజ్యం నుండి స్వేచ్ఛ" (Freedom from Governments / State) మరియు సంవర్ధకార్థం "స్వయం పాలన కొరకు స్వేచ్ఛ" (Freedom to Self-Rule) అనేవి ఉదార మరియు ప్రజాస్వామ్యమనే భిన్న రాజకీయ వ్యవస్థలకు దారి తీశాయి. స్వేచ్ఛ ప్రజాస్వామ్యాలలో కన్న ఉదార రాజ్యాలలోనే ఎక్కువ మనగల్గుతుంది అని బెర్లిన్ విశ్లేషణ ఎవరికైన తెలియజేస్తుంది. అనగా, నిషేధాత్మక స్వేచ్ఛయే (సంవర్థక స్వేచ్ఛ కన్న) వ్యక్తులకు ఎక్కువ ఉపయోగకరము, ఎందువలనంటే, నిషేధాత్మక స్వేచ్ఛవలననే ఎక్కువ మానవ వరణము (Human Choice) కల్గుతుంది. ఒక ప్రధాన విషయమేమిటంటే, బెర్లిన్ చెప్పినట్లు, ఉదార మరియు ప్రజాస్వామ్యాలైన రాజ్యాలుగా విభజించుట అంత తేలిక అయిన పని కాదు. కాకపోతే స్థూలమైన పొకడలను గుర్తించవచ్చు.

నిషేధాత్మక స్వేచ్ఛ అనే అర్థం వల్ల రాజ్యం మానవ విషయాలు కొన్నింటి నుంచి తాను దూరంగా వుండాలి అని తెల్పుతుంది. మరియు (అందువలననే) అన్ని ఆధునిక రాజ్యాలు, సూత్రప్రాయంగానైనా, వ్యక్తులకు కొన్ని ప్రాథమిక హక్కులకు హామీ ఇవ్వటం గుర్తిస్తాయి. స్వేచ్ఛ యొక్క సంవర్థకార్థం దృష్ట్యా రాజ్యం వెనుకబడిన వారి ప్రయోజనాలను కాపాడుటకు చొరవ తీసుకోవాలి. రాజ్యజోక్యము తప్పనిసరిగా కన్పిస్తుంది. సంక్షేమ రాజ్యభావన అభివృద్ధితో రాజ్యపాత్ర ఎక్కువయింది. మరియు ఆవిధంగా యీ అంశం ఒక క్లిష్ట పరిస్థితిగా పెరిగింది. ఈ రెండు అర్థాల మధ్యనున్న ఘర్షణ వాస్తవంలో కన్పిస్తుంది. మరియు సాంఘిక నియంత్రణ అన్న ప్రధాన సమస్య మరల (మరల) చర్చనీయాంశవుతుంది.

## 10.3 స్వేచ్ఛ - రకాలు

స్థూలంగా స్వేచ్ఛ మూడు రకాలు : (1) సహజ స్వేచ్ఛ (2) సాంఘిక / పౌర స్వేచ్ఛ మరియు (3) నైతిక స్వేచ్ఛ

**(1)** సహజ స్వేచ్ఛ : రాజ్యస్థాపనకు ముందు మనిషి కల్గియున్న స్వేచ్ఛని సహజ స్వేచ్ఛ అనే అభిప్రాయమున్నది. అదే ఒకరు (ప్రతివారు) తమ స్వేచ్ఛ యిష్టము ప్రకారము చేసేహక్కు. కాని అలాంటి స్వేచ్ఛ సరియైన స్వేచ్ఛకాదనే అభిప్రాయం కూడ వుంది. లాక్ (Lock) దృష్ట్యా సహజశాసనం / న్యాయం (Nature Law) సహజ స్వేచ్ఛను చుట్టి వుంటుంది కనుక సహజ స్వేచ్ఛ ఒక లైసెన్సు కాదు- 'సహజ స్వేచ్ఛలు (జీవితం, స్వేచ్ఛ మరియు ఆస్తి) (ప్రతి) మనిషి నుండి విడదీయలేనివి' - అని తెలియజేసే సహజ న్యాయం - యిదే సహజ స్వేచ్ఛ. ఆధునిక కాలములో సహజశాసనం (Nature Law) అనే భావన కన్న సహజ న్యాయం (Natural Justice) అన్న భావనే బాహుళ్యకరం.

B R A O U

**2. సాంఘిక / పౌరస్వేచ్ఛ :** శాసనముచేత గుర్తింపబడి, రాజ్యము యొక్క దండన విధించే ప్రతినిధిచే అమలుపర్చబడు / రక్షింపబడు హక్కుల మొత్తం పౌర స్వేచ్ఛ అంటారు. సభ్యులు / పౌరుల కొరకు రాజ్యం రూపొందించి, రక్షించు హక్కులు, ప్రత్యేక హక్కులు పౌరస్వేచ్ఛ క్రిందకు వస్తాయి. వీటిక్రిందకు వచ్చునవి కొన్ని స్వేచ్ఛలున్నాయి. అవి

**(1) వ్యక్తిగత స్వేచ్ఛ :** లాస్కీ దృష్ట్యా, వ్యక్తిగత లేక ప్రైవేటు స్వేచ్ఛ, విషయము తన స్వంతమును సంబంధించినది. తాను పూర్తిగా తానుగా వుండే అవకాశం. జీవిత సంబంధాలలో తాను పూర్తిగా ఉండే అవకాశం. అలాంటి సంబంధాల కొరకు రూపొందింపబడిన మార్గదర్శికాలను వాస్తవికంగా ఉపయోగించుకొనే అవకాశం, వ్యక్తి స్వేచ్ఛ. బ్లాక్‌స్టన్ (Black Stone) దృష్ట్యా వ్యక్తిగత స్వేచ్ఛలో మూడు ఉపప్రదేశాలు / అంశాలు. (ఎ) ఆరోగ్యము, జీవితమేకాక వ్యక్తికి గూడ భద్రతగల వ్యక్తిగత భద్రత (బి) కదలిక/గమనమునకు గల వ్యక్తి స్వేచ్ఛ మరియు (సి) వ్యక్తిగత ఆస్తి. అయితే యిక్కడ మరికొన్ని అంశాలు గూడ చేర్చబడ్డాయి. మతము మరియు విద్య అనే విషయాలలో వ్యక్తుల యిష్టముండట. వాక్ స్వాతంత్ర్యము, బహిరంగ సభ మరియు ముద్రణ, సంస్థ లేక సమూహముతో నుండే హక్కు, యివిగూడా వ్యక్తిగత స్వేచ్ఛ క్రిందకే వస్తాయి.

**2) రాజకీయ స్వేచ్ఛ :** రాజ్యమునకు సంబంధించిన కార్యకలాపాలలో ప్రజలు చురుకుగా పాల్గొనే హక్కు రాజకీయ హక్కు. అరిస్టాటిల్ ప్రకారం పాలించే మరియు పాలింపబడే సామర్థ్యము కలవాడే పౌరుడు. లాస్కీ దృష్ట్యా, శక్తి నుంచి దూరమైనవాడు / దూరము అంటే ముందుముందు శక్తియొక్క ప్రయోజనాల నుండి దూరమవటమే. రాజకీయ స్వేచ్ఛ (ఎ) ఓటు హక్కు (బి) ఎన్నికలలో పోటీ చేసే హక్కు (సి) ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు మొదలైనవి వుంటాయి.

**3) ఆర్థిక స్వేచ్ఛ :** ఆర్థిక విషయమైన కోరిక / లేమితనము లేక భద్రతారాహిత్యము నుండి స్వేచ్ఛయే ఆర్థిక స్వేచ్ఛ అంటే ఒప్పందాల, సంసర్గాల (Associations) వస్తు ఉత్పత్తి మరియు పంపిణీల స్వేచ్ఛ. ఆర్థిక స్వేచ్ఛ లేకపోతే రాజకీయ స్వేచ్ఛకు అర్థములేదు అని చెప్పబడుతుంది. ఏ సమాజంలోనైనా నిరుద్యోగము మరియు అసమృద్ధి అన్నవి కష్టాలను తెచ్చిపెట్టే కారకాలు (Factors). పరిశ్రమ(ల)లో ప్రజాస్వామ్యన్ని గూడ ఆర్థిక స్వేచ్ఛ అంటారు. పనిహక్కు, పరిమిత కాలములోనే పనిచేసే హక్కు, వేతన హక్కు, కార్మిక సంఘ స్థాపన హక్కు మొదలైన ఆర్థిక హక్కులను కార్మికులు తప్పనిసరిగా కల్గియుండాలి.

**4) జాతీయ స్వేచ్ఛ :** ఇది జాతీయ స్వాతంత్ర్యమే తప్ప మరేదికాదు. జాతీయ స్వాతంత్ర్య సమరాలు జాతీయంగా రాజకీయ స్వేచ్ఛను పొందుటకు జరుగుతాయి. జాతిని విముక్తి కావింపకపోతే ఆసమాజ ప్రజలకు యితర స్వేచ్ఛలుండవు. చాలా క్రొత్త రాజ్యాలు 'జాతీయ స్వయం నిర్ణయం' అన్న సార్వజనీన సూత్రంపై ఆధారపడి ఏర్పడినవే. సాధనము చేయబడ్డ జాతి లేక సమాజం, మొదటగా జాతి విముక్తి / స్వాతంత్ర్యమును మాత్రమే ధ్యేయంగా పెట్టుకోగలదు. ప్రతి రాజకీయ రాజ్యము తప్పని సరిగా సార్వభౌమ, స్వతంత్ర్యమైనదిగా వుంటుంది.

**5) అంతర్జాతీయ స్వేచ్ఛ :** యుద్ధాన్ని త్యజించటం, అయుధీకరణ, ఆయుధాల ఉత్పత్తిపై పరిమితులు, వత్తిడి మరియు కొన్ని మరణాయుధాల ఉపయోగించుటను వదలివేయుట మొదలైన పరిస్థితులు అంతర్జాతీయ పరిస్థితిలో వుండాలని ప్రతి జాతి / రాజ్యం కోరుకుంటుంది. రాజ్యాల సహజీవనం సాగించి పరిరక్షించుకోవటానికి, తగాదాలకు శాంతియుత పరిష్కారం తప్పనిసరి మార్గమవ్వాలి వత్తిడి ఉపయోగించటం అర్థంలేని ఉండేటంతగా ప్రపంచ స్వేచ్ఛాయుతమవ్వాలి. మరియు దురాక్రమణలో 'ఏదో ఒక రూపంలో (మరొక) జాతిని స్వాధీనపరుచుకునే ఉద్దేశ్యము తప్ప మరొకటి లేదు' అని చెప్పబడుచున్నది.

BRAOU

6) నైతిక స్వేచ్ఛ : ఈరకమైన స్వేచ్ఛ ఆదర్శ మేధావులైన రూసో, హెగెల్, గ్రీన్ మరియు కాంట్ లాంటివారి రచనలలో చూడవచ్చును. జనేచ్ఛ లేక రాజ్యము యొక్క లేక రాజకీయ సమూహము / సమాజపు శ్రేయస్సును పొందటానికి వ్యక్తి తన స్వేచ్ఛలను వాడాలి. అంతరాత్మ, మనస్సు మరియు శారీరకమైన (సమాజం) మొత్తాన్ని పెంపొందించేది వ్యక్తులే. ఈదృష్టిని నమ్మినవారిని మరియు ఆచరిస్తున వారిని సామూహ లేక సమాజ వాదులు (Communitarians) అంటారు. మరియు వారి స్వేచ్ఛ భావనను, నిషేధాత్మక (Negative) మరియు ఉదార స్వేచ్ఛా భావన నుండి విభేదించగల సంవర్ధక (Positive) స్వేచ్ఛ అంటారు.

## 10.4 శాసనము మరియు స్వేచ్ఛ

శాసనమునకు స్వేచ్ఛతోగల సంబంధ విషయం ప్రధానమైనది. ఎందువలనంటే, పైకి మాత్రము యీ రెండు ఒకదానితో ఒకటి విభేదిస్తున్నట్లు కన్పిస్తుంది. ఇక్కడ రెండు దృష్టిలు / అభిప్రాయములు

(1) ప్రతిశాసనము ఒక యదార్థ / వాస్తవ స్వేచ్ఛ. "శాసనమనేది, దాని అసలు రూపంలో తన అసలైన ప్రయోజనాల దృష్ట్యా ఒక స్వేచ్ఛాయుత మరియు తెలివైన వాని మార్గమైనంతగా కేవలం పరిమితి అనికాదు ... తప్పుగా భావించి నప్పటికి, (శాసనమనేది) స్వేచ్ఛను విస్తరించి, పరిరక్షించుకోటానికే గాని, రూపుమాపి లేక కట్టివేయటానికి కాదు, అని జాన్‌లాక్ చెప్పాడు. ఇది ఒకరకంగా ఆదర్శవాది రాజ్య మరియు శాసనం భావనే.

(2) "(శాసనం - స్వేచ్ఛ) వీటిలో ఏ ఒక్కటి ఎక్కువైనా రెండోది తక్కువయినట్లే." (డైసీ)

"శాసనం అతి హానికరమైన పోకడలు గల సంస్థ" (విలియం గాడ్విన్)

సాధారణంగా ఉదారవాదులు, ప్రత్యేకించి అరాచకవాదులు ఈ దృష్టిని కలిగి ఉంటారు.

ఈ విభిన్నమైన లేక తీవ్రమైన దృష్టి / అభిప్రాయాలను సమతుల్యత కలవిగా తయారు చేయ్యాలి.

శాసనమును స్వేచ్ఛ యొక్క ప్రధాన స్థితిగా చూడవచ్చు. దురాక్రమణ లేక దండయాత్ర పరిస్థితులలో శాసనం స్వేచ్ఛను కల్గి ఉంటుంది. అందువలననే క్రిమినల్ కోడ్ (Criminal Code) రూపొందించబడింది. శాసనము, విద్య, ఆరోగ్యము మొదలైన కొన్ని అత్యవసర పరిస్థితులను కల్పించి, పరోక్షంగా వ్యక్తులు తమ మానసిక మరియు భౌతిక (Material) సంక్షేమమును అభివృద్ధి చేసుకొనుటకు తద్వారా వారి స్వేచ్ఛను పెంపొందించుకొనుటకు సహాయపడుతుంది. భారతదేశం, అమెరికాలాంటి ఉదార మరియు ప్రజాస్వామ్య రాజ్యాలన్నింటిలోను, ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించటం, వ్యక్తుల స్వేచ్ఛలను రాజ్యాంగబద్ధంగా రక్షించుతుంది.

శాసనము ఎల్లప్పుడూ స్వేచ్ఛకు అనుకూలమైనది కాకపోవచ్చును. ప్రత్యేకంగా సామాజికవాద సమాజాలలో సంవర్ధక స్వేచ్ఛ క్రమంగా (వ్యక్తుల) యితర స్వేచ్ఛలను కబళించవచ్చు లేక కప్పివేయవచ్చు. ప్రజల పేరుతో, లేక సమానత్వపు పేరుతో లేక జనేచ్ఛలాంటి భావన పేరుతో సంపూర్ణాధికార రాజ్యాలు బయలుదేరాయి. మరియు ప్రపంచాన్ని అధ్వాన్న మరియు నాశనమునకు తీసుకొని వెళ్ళాయి.

కనుక ధ్యేయం ఎలా వుండాలంటే, "తన మూర్తిత్వాన్ని నిరంతరం బహిర్గతపరచే అవకాశం తనకుందనే స్పష్ట అభిప్రాయాన్ని కలుగుజేసేటట్లుగా, మనకుకావల్సిన స్వేచ్ఛ మరియు తప్పనిసరియైన అధికారములను కలుపుతూ సమావస్థని కలుగచేయుట."

BRAOU

## 10.5 సమానత్వము

రాజనీతి తత్త్వవేత్త విద్యార్థి అవగాహన చేసుకొనవల్సిన సమానత్వ భావన అతిప్రధాన భావనలలో ఒకటి. తరుచు సమానత్వ భావన స్వేచ్ఛ మరియు న్యాయము (Justice) భావనలతో బాటు (కలిసే) వుంటుంది. చాలా విధములైన జాతీయోద్యమాలకు ప్రధాన చేతనం, చాలా తరుచుగా, సమానత్వభావన. సమాజంలో మార్పులను తెచ్చుటకు మానవాళిని వుత్సాహ పరచి మరియు సమూహాలను కదిలించే రాజనీతి సిద్ధాంతాలలోని కేంద్ర (Central) భావన యీ సమానత్వ భావన. అతి ఉత్తమమైన ఉదాహరణలు 1776లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన (American Declaration of Independece, 1776) "అందరూ సమానమే అన్న స్వయం సిద్ధమైన యీ నిజాలు మేము కల్గియున్నాము"; ఫ్రెంచి విప్లవ సందర్భంగా ఫ్రెంచి నేషనల్ అసెంబ్లీ జారీచేసిన 1789 మానవ హక్కుల ప్రకటన (The Declaration of Rights of Man, 1789)

"మనుషులు సమానముగా జన్మించారు, మరియు వారి హక్కులకు సంబంధించి వారు ఎల్లప్పుడు, స్వేచ్ఛ మరియు సమానత్వం కోసం నిరంతరం పోరాటం సాగిస్తూనే ఉన్నారు.

"మానవుడు స్వేచ్ఛగా / తో పుట్టాడు మరియు ప్రతిచోట అతను సంకెళ్ళలో వున్నాడు", అన్న రూసో మాటలు రాజనీతి విచారం విద్యార్థి జ్ఞాపకంలో ఎల్లప్పుడూ తాజాగా మెదిలే మాటలు.

ఒక ఖచ్చితమైన నిర్వచనం యివ్వబడలేని క్లిష్టమైన / కష్టమైనది సమానత్వం భావన. అది బహుముఖమైన భావన, రాజనీతి శాస్త్ర విషయాలు / భాగాలలో నిర్వచించడానికి కష్టమైనది సమానత్వ భావన - అని లాస్కి అభిప్రాయం. "సమానత్వం (భావన) అనిశ్చయ / చపలమైన భావన; దాని స్వరూపాన్ని మార్చుతుంది. మరియు తయారైన సౌకర్యముతో (అతి తేలికగా) క్రొత్త రూపాలను తీసుకుంటుంది".- అని బార్కర్ వ్రాసాడు. సమానత్వం అన్నపదం మానవజీవిత పరిస్థితిలో ఏ అంశానికి చెందినదో చెప్పటం కష్టం. అది ఒకటి లేక అనేక లక్షణాలుగా వుండొచ్చు.

సమానత్వ భావనను దాని నిరపేక్ష (Absolute) అర్థంలో తీసుకొనలేము. మానవులు ఒకే విధముగా, ఒకే మూసలో పోల్చలేము. కోరికలు, సామర్థ్యములు, మోహావేశములు మరియు వాటికి సంబంధించిన చర్యలలోను మానవులు సమానము కాదు మరియు సారూప్యమైన వారు కాదు. కాని ప్రతివారు తమ అభివృద్ధి మరియు సంతోషము చూసుకొనటానికి తగిన పరిస్థితి ఉండాలని ఆశించటం మానవులందరిలోనూ ఉంటుంది. కాకపోతే తాను ఉండాలనుకున్నట్లు ఉండటానికి / అవటానికి అవకాశం ప్రతివారికి అందుబాటులో ఉండదు. తమ సామర్థ్యాలను ఉపయోగించుకోటానికి లేక తమను అభివృద్ధి చేసికోటానికి అవకాశం ఉండటమే అన్నింటికన్న కోరుకోదగ్గ విషయం. సమానత్వం అలాంటి అవకాశాలు గూర్చి చెబుతుంది. ఆర్.హెచ్. టానీ (R.H. Tawney) మాటలలో సమానత్వం అనేది :

"హక్కుల రూపంలో నాకు హామీయిస్తున్న పరిస్థితులు అదే విధంగా యితరులకు కూడా హామీ యివ్వాలి, మరియు యితరులకు యివ్వబడ్డ హక్కులు నాకు కూడా ఇవ్వబడాలి"

లాస్కి మాటలు గూడ యీ విధంగా నొక్కి చెప్తాయి :

"సమానత్వం అనగా (నేను) నాలోని అత్యుత్తమతనాన్ని పొందటం అన్నది, దాని తార్కిక ఫలితంగా, యితరులు తమలోని అత్యుత్తమతనాన్ని పొందటంగా చెయ్యాలి. అంటే అవిధంగా సంఘశక్తులను (So-

BRAOU

cial Forces) క్రమబద్ధం చేయటం, జీవిత కష్టాలలో లాభాలను గూడా పంచుకునే విధంగా సమావస్థని చేస్తుంది. దాని అర్థం - ఆ లాభంలోని నా పాలు/వంతు (నా) పౌరసత్వానికి సరిపోవాలి. దీని భావమేమిటంటే, మరొకరి మాటకన్న నామట తక్కువగా వున్నట్లు చూడబడినప్పటికీ, రూపొందించుకున్న నిర్ణయాలలో దానికి కొంత చోటు ఖుర్చాలి. (వాటిని పరిగణనలోకి తీసుకోవాలి). అంతిమంగా, సమానత్వము యొక్క అర్థం తప్పనిసరిగా ఒక నిజంలో వుంటుంది - మానవ స్వభావాలలోని వ్యత్యాసం, ప్రతివారికి తాను చెప్పినట్లుగా వారి యిచ్ఛలను బహిర్గత పరచుకునే అవకాశాన్ని యివ్వాలి లేక సర్దుబాటు చెయ్యాలి".

ఆవిధంగా సమానత్వము ప్రధానంగా తెలియజేసేవి (1) ప్రత్యేక హక్కులు లేక విచక్షణ ఏవిధముగనైన / ఏకారణ చేతనైన లేకుండా ఉండటం (అనగా ప్రత్యేక హక్కుల మరియు విచక్షణ రాహిత్యం) : మరియు (2) తమ మూర్తిత్వాన్ని నిలుపుకొనుటకు తగిన సమానావకాశాలుండడం. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయమేమిటంటే అలాంటి పరిస్థితిని నెలకొల్పాల్సింది ప్రభుత్వమే అయినప్పటికీ, సాంఘిక మార్పుల కొరకు పాటుబడటంలోని బాధ్యత, ఎక్కువ కాకపోయినప్పటికీ, సమానముగానైనా, పౌరులపై ఉంటుంది. ఇక్కడే (అలాంటప్పుడే) వ్యక్తుల అంతరాత్మ, వారి వివేచనత్వానికి పిలుపు, నైతిక పిలుపు వుంటుంది / చేయబడుతుంది. మరోమాటలో చెప్పాలంటే, సమానత్వము సూత్రము ప్రతి మానవునిలో వున్న మానవ వివేచనపై ఆధారపబడియున్నది. వివేచన ప్రతివారిలోను హఠాత్తుగా ఉదయించకపోవచ్చు. అయినప్పటికీ మానవ పరస్పర చర్య మరియు కృషి సమానత్వం కోసం పాటుపడేలా చేస్తాయి. సాధారణ మాటలలో చెప్పాలంటే వ్యక్తిగా గానీ, సమూహంగా గానీ, తమ ప్రయోజనాలు వ్యక్తపరచటం ముందు ముందు సంఘములోని వారందరికి ప్రయోజనముండేలా సంఘ వనరులను సర్దుబాటు చేసే పరిస్థితికి దారితీస్తుంది. అందరిలోనున్న మానవ విలువ, గాంభీర్యము మరియు మానవ మూర్తిత్వము అనెడి కొన్ని ప్రాథమిక లక్షణాల దృష్ట్యా మానవులందరు సమానముగా చూడబడాలి అని సమానత్వభావన అర్థం చేసుకోబడాలి. కాంట్ (Kant) యొక్క మాటలు యిక్కడ చాలా సబబు.

"నీలోను లేక మరే యితరులలోను, మానవత్వాన్ని, ప్రతి విషయంలోను, ఎప్పటికి ఒక సాధనంగా కాక, ఒక లక్ష్యంగా చూడు" ఒక హెచ్చరిక మాటకూడా వుంది.

"సమానత్వం, దాని అన్నిరూపాలలోనూ, సామర్థ్యాన్ని స్వేచ్ఛగా అభివృద్ధి చేసేదిలా ఎల్లప్పుడు ఒక సాధనంలా వుండాలి; కాని అది, ఒకేరూపం (ఏకరూపత) కోసం వత్తిడి చేయబడితే మరియు ఆ వత్తిడి సామర్థ్యాన్ని స్వేచ్ఛగా అభివృద్ధి చేయటాన్ని నిరోధిస్తే, సాధనం యజమాని అవుతుంది. మరియు ప్రపంచం తలక్రిందులౌతుంది" (బార్కర్)

కనుక 'మానవులందరూ సమాన" అన్న సూత్రం భావం, వారందరూ సామర్థ్యాలను సమానకొలతలో కలిగియుంటారని కాదు. మానవుల్లా (మానువుళకుండు), మానవ గాంభీర్యము మరియు విలువ అనే కొన్ని ప్రాథమిక లక్షణాల దృష్ట్యా, మానవులందరూ సమానము చూడబడాలి' - అన్నది. హ్యూగో బెడో (Hugo Bedau) దృష్ట్యా, సమానత్వవాదిగా ఆలోచించటమంటే, 'మానవుల మధ్య అసమానతలు ఏ మేరకు వున్నవో చూసి, వాటి (పూర్తి) నిర్మూలనకు గాని, కనీసం వాటిని తగ్గించటానికిగాని దారులు కనుగొనడం అని.

ఇజయా బెర్లిన్ ఒక హెచ్చరిక మాట:

"సమానత్వమును సాధించటం అన్నది, మిగిలిన మానవ లక్ష్యాలకు సంఘర్షణ వచ్చినప్పుడు, మిగిలిన విలువలను చిన్నచూపు చూసి, కేవలం సమానత్వం కోసం ఆ సంఘర్షణలను తప్పనిసరిగా తేల్చాలి, అన్నవారు అతి మూఢ సమానత్వపు వాది మాత్రమే".

## 10.6 సమానత్వము - రకాలు

సమానత్వము భావన ఒక బహుముఖమైనది కనుక, దాని వ్యాప్తి ఎంత విశాలమైనదంటే, ఆదర్శ పరిస్థితి నుంచి వాస్తవిక పరిస్థితి వరకు (మధ్య)గల అన్ని తేడాలను గుర్తింపబడగల్గును. క్లుప్తంగా సమానత్వములోని / యొక్కకొన్ని ప్రత్యేక రకాలు :

**(1) సహజ సమానత్వము :** సహజంగా / ప్రకృతిరీత్యా మానవులందరూ సమానము అన్న భావనలతో సహజ సమానత్వ సూత్రాన్ని సమర్థించినవారు ప్రాచీన గ్రీకు స్టాయిక్కు (Stoics) మరియు సిసిరో మరియు పోలిబియస్ లాంటి రోమన్ మేధావులు. అసమానతలు కృత్రిమమైనవి మరియు మానవ కల్పితము. 'దేవుని పితృభావము, మానవ సోదర భావము' అన్న సూత్రములో మధ్యయుగంలోని మత భావన కూడ యీ భావన / దృష్టికే తోడ్పడుతుంది. ఆధునిక యుగంలో, సహజ సమానత్వ అన్న సూత్రాన్ని పెంపొందించిన వారిలో మొదటివాడు రూసో. అతిని దృష్ట్యా మానవుని పరిగ్రహీతగా (Possessive) అవటానికి మరియు సమాజంలో అసమానతలను సృష్టించటానికి కారణం జ్ఞానమే (Knowledge), అమాయకత్వంకాదు. ఆతర్వాత, వర్గ సమాజమునకు మూలకారణమైన సొంత ఆస్తిని రద్దుచేస్తే వర్గరహిత సమాజాన్ని స్థాపించాలని చాటి చెప్పింది కారల్ మార్క్స్.

కోరిక మరియు వివక్షత నుండి స్వేచ్ఛ పొందాలి అన్న మానవ మనస్సులోని ఆకాంక్ష గుర్తింపు యీ సహజ లేక నైతిక సమానత్వ సూత్రమును పెంపొందిస్తుంది. ఆదర్శ తత్త్వవేత్తలు సాధారణంగా యీ దృష్టినే సమర్థిస్తారు.

**(2) సాంఘిక / పౌర సమానత్వము :** అందరూ సమాన హక్కులు మరియు అవకాశాలు పొందాలి / అనుభవించాలి అన్న సహజ సమానత్వమును వాస్తవిక పరిస్థితిలో చూడగల్గటం యీ సాంఘిక లేక పౌరసమానత్వము

"ఏవైతే లేకపోతే జీవితం అర్థరహిత మౌతుందో అవి అందరికి, ఏవిధమైన తేడా/వివక్షత లేకుండా అందుబాటులో వుండాలి...... కనుక మనము సూత్రప్రాయంగానైన వ్యత్యాసాలను / అసమానతలను సమర్థించలేము. (ఒకవేళ) అందరి ప్రాథమిక కోర్కెలు / హక్కులు పూర్తిగా అలా వుండే పరిస్థితి వస్తే తప్ప, ఆహక్కువలన, నా పొరుగు వానికి రొట్టెలేని తన మున్నప్పుడు, నాకు రొట్టె తినేహక్కు లేదు. సమానత్వమివ్వని ఎలాంటి సామాజిక వ్యవస్థ / సర్దుబాటు మానవుల మూర్తీత్వభావాన్ని లేకుండా చేసినట్లే / వ్యతిరేకించినట్లే' ', అని లాస్కి వ్రాశాడు.

వాస్తవిక పరిస్థితిలోను, మానవ సంబంధాలలోను మరియు సాంఘిక సంస్థలను మలచటంలోను ప్రతిబింబించాల్సింది మానవుని వాస్తవిక వివేచనం (Practical Reason).

**(3) రాజకీయ సమానత్వము :** ఈ సూత్రము యొక్క సారము, శక్తి మార్గములను అందరూ చేరుకోగల సమాన అవకాశము మరియు సంఘపరమైన విషయాల నిర్వహణలో అందరికి సమాన మాట (అభిప్రాయాన్ని తెల్పే సమాన అవకాశం). మనుషులకు ఓటుహక్కు, ఎన్నుకోబడే హక్కు, ప్రభుత్వ/సంఘపరమైన (Public) హోదాను కల్గియుండే హక్కు, ప్రభుత్వమును తప్పుచేసినప్పుడు విమర్శించే హక్కు మొదలైనవి రాజకీయ సమానత్వములోనివే. కార్ల్ ఫ్రెడ్రిక్ మాటలలో, "రాజకీయ సమానత్వం, రాజకీయ వ్యవస్థ / క్రమములో ఎంత వరకు ప్రజాస్వామ్య న్యాయ సమ్మతి (Legitimacy) చేర్చబడి వుంటుందో, అంత (రాజకీయ

సమానత్వం) పెరుగుతుంది. (అయితే) ఇది విధాయక సారాంశము (Normative Essence) లో చేర్చబడితే, అక్కడ మనస్సులో నుంచుకోవాల్సిన విషయం మరొకటుంది, అదేమిటంటే, నిర్వహించదగిన శక్తులలో పాల్గొనే అవకాశం. ఇది లేకుండా ప్రజాస్వామ్యం రాజ్యంలో అవకాశం, యిప్పుడేర్పరచిన, శ్రేష్ఠజనుల మార్పును త్వరితము చేయు స్వయం పోషక రాజకీయ సమానత్వ సూత్రాన్ని, తప్పక వదలి చేస్తుంది.

**(4) ఆర్థిక సమానత్వము :** ఆర్థిక సమానత్వం రాజకీయ సమానత్వంతో కలిసి ఉంటుంది. మరియు ఒకరకంగా రాజకీయ సమానత్వం అంటే ఆర్థిక సమానత్వమే. ఆర్థిక సమానత్వం లక్ష్యం జాతీయ శక్తిని తగు విధముగా పంపిణీ చేయటం. ఆ పంపిణీ తప్పనిసరిగా, సరిగ్గా సమానముగా నుండనక్కర లేదు, కాని అనుపాత సమానత్వం (Equality of Proportions) అన్న సూత్రంపై (ఆధారపడి) ఉండాలి. లాస్కీ మాటలలో :

"తక్కువ మంది ధనికులు, ఎక్కుమంది పేదవారుగా విభజింపబడ్డ సమాజం, ఎల్లప్పుడూ, వారి అస్తివలన వచ్చిన సౌకర్యాలను కాపాడుకొనటానికి, ధనికులచే మలచుకోబడే (Manipulated) ప్రభుత్వం తప్పక అభివృద్ధి చెందుతుంది. దానివల్ల తెల్సేదేమిటంటే, అలాంటి ధనికులుండడం వల్ల, వారు ప్రోగుచేయు సేవలు ఎక్కువ స్థాయిలో వుంటాయి అని నిరూపింపబడ వచ్చునన్నప్పుడు మాత్రం (అలాంటి) అసమానతలు సమర్థనీయము, అనే అర్థం వస్తుంది. సంఘం మొత్తంగా నాగరికత యొక్క అత్యల్ప పునాదిని పొందిన తర్వాత మాత్రమే సాంఘిక లేక ఆర్థిక అసమానతలను అంగీకరించవచ్చును. అలాంటి అత్యల్ప పునాది, నా మూర్తిత్వాన్ని నేను పొందటం అంగీకరించాలి. ఆస్థాయిపై నేను పొందిన ప్రయోజనాలు సంఘ మనుగడకు అవసరమైన ప్రయోజనాలు అవ్వాలి.

**5. చట్ట(బద్ధ) సమానత్వము :** ఈ సూత్రము దృష్ట్యా శాసనం ఎదుట అందరూ సమానమే లేక శాసనం అందర్నీ సమానంగా కాపాడుతుంది. కొన్ని ప్రాథమిక హక్కులు మరియు విధులు అందరికి సమానంగా అన్వయించటం యీ సూత్రము దృష్ట్యా సార్థకము. శారీరిక మరియు మానసిక రక్షణ మరియు అపరాధములకు దండన లేక శిక్ష అమలు చేయటం గూడ యీ సూత్రము క్రిందే వస్తుంది. 'శాసనము ఎదుట సమానంగా వున్నవారు, శాసనము చేత సమానముగా చూడబడాలి' అని ఎ.వి. డైసీ మాటలు చాలా సరియైనవి.

**6. అంతర్జాతీయ సమానత్వము :** ఈ సూత్రము క్రింద అన్ని జాతులు / దేశాలు వాటి జనాభా, భౌగోళిక, ఆర్థిక మరియు ఆవిధమైన విషయములతో సంబంధంలేక, సమానముగా చూడబడాలి. ఒక జాతిలోని ప్రజలందరి మాదిరి, జాతుల / దేశాల మధ్య ఎలాంటి విచక్షణగా కారకము వుండరాదు. మానవ, ఆర్థిక, రాజకీయ, శాస్త్రీయ మరియు సాంకేతిక, సంస్కృతి మొదలైన మానవ జీవిత ప్రధాన అంశాలలో, జాతులు / రాజ్యాలు ఒకదానితో మరొకటి సహకారము మరియు సహాయము యిచ్చేటట్లుండాలి. ఆవిధంగా అంతర్జాతీయ సమానత్వ సూత్రము దాని అవశ్యకత కల్గియున్నది.

తగినన్ని అవకాశాల సమానత్వము' అన్నది ఉదారదృష్టి సమానత్వము. ఈ రకమైన పరిస్థితి పూర్తి అర్థం J.H. Schaar మాటల నుండి తెలిసికొనవచ్చును :

"అవకాశ సమానత్వ సిద్ధాంతం, పోటీ మరియు తునకలైన / విభజింపబడ్డ సమాజపు - వాటి సమాజంలో వ్యక్తివాద Tocqueville దృష్ట్యా, నైతిక సూత్రపాలన చేస్తుందో, అలాంటి సమాజపు ఫలితం. అది ఉదార - బూర్జువా నమూనా సమాజపు క్లుప్త ప్రతీకాత్మక /సాంకేతిక (Symbolic) ప్రకటన (Expres-



B R A O U

sion), ఎందువలననంటే, అది మార్కెటు (స్థల) బుద్ధిని జీవితరంగాలన్నింటికి వ్యాప్తి చేస్తుంది. అది, ప్రతి మనిషి తన తోటివారితో కొరత వస్తువుల కొరకు పోటీపడుతున్నట్లు, జీవిత సంబంధాలన్నీ ఒకపోటీలాగ చూస్తుంది. ఆ పోటీ వారి వారి సామర్థ్యాలను బట్టి అందరూ వారి పరిస్థితులను పెంపొందించుకోవచ్చు అన్న ఆకర్షణీయ ధృఢ నిశ్చయము పై ఆధారపబడ్డ పోటీ .... ఆవిధంగా అది ఉదార భావన 'సంస్కరణ' యొక్క పూర్తి / సరియైన రూపం, సమాజపు ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రాథమిక రూపం పూర్తిగా మార్చబడుతుంది".

మార్క్సిస్టు భావన సమానత్వాన్ని ఎలా వివరిస్తుందంటే, 'వారి సామర్థ్యాలను బట్టి ప్రతివారు నుండి, వారి అవసరాలనుబట్టి ప్రతివారికి'అన్న సూత్రాలపై ఆధారపడ్డ సమానత్వం, వర్గరహిత సమాజంలో స్థాపించటం ఒక ప్రణాళికతో కూడిక కృషి. మొదటిదశ, శ్రామిక నియంతృత్వస్థాపన మరియు రెండవ దశ 'రాజ్యము తొలగి /వీగిపోవటం' మరియు కమ్యూన్ జీవిత స్థాపన. సమాజపు దశలను మార్చటంలో వాస్తవిక పద్ధతి(కి) (సంబంధించి) హింసాపూరిత తిరుగుబాటు ఒక సాధారణ పరిష్కారము. ఉదార రాజనీతి సిద్ధాంతంలో సామ్యవాద విషయాన్ని చొప్పిస్తూ జాన్‌రాల్స్ తన సమానత్వ భావనను యిలా తెల్పుతాడు "మొదటిది ప్రతివారు విస్తార ప్రాథమిక స్వేచ్ఛకు, సమాన స్వేచ్ఛను, యితరుల అదే మాదిరి స్వేచ్ఛతో సరిపోయేదిగా కల్గివుండాలి. రెండవది, సాంఘిక మరియు ఆర్థిక అసమానతలు (ఎ) ప్రతివారికి ఉపయోగపడేలా వుండాలని ఆశించేటట్లు మరియు (బి) అందరికీ సమానంగా తెరువబడ్డ హోదా మరియు ఆఫీసులు ఉండేటట్లుగా సర్దుబాటు చెయ్యబడాలి"

## 10.7 స్వేచ్ఛ మరియు సమానత్వము

ఆధునిక కాలములో స్వేచ్ఛ మరియు సమానత్వముల మధ్యనున్న సంబంధాలను గూర్చిన చర్చ చాలా కీలకమౌతున్నది. సాధారణంగా స్వేచ్ఛను సరిపడే పరిస్థితిగాను, సమానత్వం అవసరమైన పరిస్థితిగానూ చూడబడుచున్నది. అయితే ప్రస్తుతం స్వేచ్ఛను అవసర పరిస్థితిగా చూసే మేధావులున్నారు, కాకపోతే స్వేచ్ఛ మరియు సమానత్వం ఒకదానితొనొకటి చాలా దగ్గరగా ఉంటాయి.

కొంతమంది మేధావులు సమానత్వభావన ఒక అపవర్జన (Exclusive) భావన అని మరియు స్వేచ్ఛ భావనకు వ్యతిరేకమైనదని యిప్పటికీ భావిస్తారు. ఉదాహరణకు యీ క్రింది అభిప్రాయము చూడండి.

"సమానత్వము కొరకు వున్న అనుగమనం (Pursuit) ఆచరణలో అసమానతకు మరియు నిరంకుశత్వానికి దారితీసింది.... (అది) కేవలం (ఒక) ప్రమాదం కాదు (అనగా అప్రయత్నంగా జరిగింది కాదు). అది సమానత్వ భావనలోని అంతర్గత పరిస్థితుల ప్రత్యక్ష పర్యవసానం. సమానత్వవాదులు, వారి లక్ష్యాలను సాధించుటకు రాజ్య 'బలవంతమైన శక్తి'పై ఆధారపడతారు, (కారణం) వారు పనిచేయవలసిన మానవ పదార్థం (Material) స్వభావం. ఏ సమాజంలో, మానవ మనుగడకు కావల్సిన ప్రాథమికాల ఎంపికలు బలవంతంగా నిర్ణయింపబడతాయో, ఆసమాజం (ఒక) స్వేచ్ఛాసమాజం కాదు. దాన్నిబట్టి తప్పని సరియైనది, ఆపలేనిది ఏమిటంటే, సమానత్వవాదులు స్వేచ్ఛ - సమానత్వంల మధ్య దేన్నో ఒకదానిని ఎన్నుకోవాలి" - జోసఫ్ మరియు సంప్షన్ (Joseph and Sumption)

F.A. Hayek యిలా అంటాడు :

ప్రజలు భిన్నమైనవారు అన్ని నిజం నుండి తెలిసేదేమిటంటే, ఒకవేళ వారిని సమానంగా చూస్తే, వాళ్ళు వాస్తవిక స్థితిలో అసమానతలు పర్యవసానంగా ఉంటుందనియు, మరియు వారిని సమానస్థితిలో



BRAOU

నుంచటానికి వారిని అసమానంగా / వ్యత్యాసముగా చూడటం ఒక్కటే మార్గమని (తెలుస్తుంది) ..... స్వేచ్ఛకు కావల్సినది 'శాసనం ఎదుట సమానత్వం' కనుక సమానత్వాన్ని అన్వయిస్తే అది భౌతిక అసమానతలకు దారితీస్తుంది. ప్రజలను వారి పరిస్థితిలో ఒకే మాదిరిగా తయారు చేయ్యాలనే కోరిక, మరికొంత మరియు వివక్షతతో కూడిన బలవంతానికి, ఒక సమర్థనీయమైనదిగా స్వేచ్ఛా సమాజంలో అంగీకరింపబడగల్గలేదు.

కొంతమంది మేధావులు స్వేచ్ఛ మరియు సమానత్వమును ఒకదానికొకటి పూరకమైనదిగా (Complimentary) చూస్తారు. "సమానత్వం లేని స్వేచ్ఛ దుర్భరమైన ఫలితాలనిచ్చే గొప్పగా వినబడు మాట (మాత్రమే)" అని ఎల్.టి. హాబ్‌హౌస్ (L.T. Hobhouse) అంటాడు. "విస్తారమైన సమానత్వం స్వేచ్ఛకు, వ్యతిరేకము / అడ్డుగా కాక, అత్యవసరమైనది" అని R.H. Tawney అంటాడు. "సమానత్వ భావన ఒంటరియైనది కాదు అని చెప్పాలి. అది, స్వేచ్ఛ మరియు సౌభ్రాతృత్వము సూత్రముల ప్రక్కనే ఉంటుంది. దాన్ని, యీ రెంటింతోనూ, ప్రత్యేకించి స్వేచ్ఛ సూత్రముతోనూ సమాధాన పరచవలసి వుంటుంది", అని బార్కర్ గమనిస్తాడు.

'సమానత్వం యొక్క సరియైన అర్థం గూర్చి, తగిన మరియు సార్వత్రికముగ ఆమోదకరమైన వాఖ్యానం కొరకు వెదకటం మరియు స్వేచ్ఛతో దాన్ని సమన్వయీకరించడం అన్నది జరుగుతున్న ప్రక్రియ. ఆచరణీయమైన ప్రతిజ్ఞ (Proposition) స్థిరమైన పరిష్కారం కావచ్చు లేక కాకపోవచ్చు. కృషిలోని ఓటములు, ఆచరణీయ పరిష్కారాల కొరకు పట్టువదలకుండా వెదకటం నుంచి మన దృష్టిని మరల్చకూడదు: స్వేచ్ఛ మరియు సమానత్వ సమస్య రాజకీయ శక్తిని కావల్సిన సామర్థ్యాలలోనికి మలచుకోవటం చేత మాత్రమే పరిష్కరించుకోగలము. "అతిపెద్ద రాజకీయ దుష్టత, బోలిషీవికులు (Bolsheviks) నొక్కి చెప్పినట్లు సంపదలోని అసమానతలు కాదు, శక్తి (లోని) అసమానతలు", అని బెట్రాండ్ రస్సెల్ అంటాడు.

## 10.8 క్లుప్తంగా

స్వేచ్ఛ మరియు సమానత్వము భావనలు రాజకీయ చర్చలలోను మరియు ఆచరణలోను చాలా కీలకమైనవి. ఖచ్చితమైన నిర్వచనాలు లేకపోవచ్చు, కానీ ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో నుంచుకొని చర్చలు లోతుగా వెళ్ళినప్పుడు, (వాటి) విశేషకములు (Dimensions) మరియు వాటి ప్రత్యక్ష స్వరూపములు (Manifestations) స్పష్టముగా వుంటున్నవి. అన్ని సైద్ధాంతిక చర్చలలోనూ విలువలతోకూడిన తీర్పులు (Value Jedgements) ఆమోదకరం కాకపోవచ్చు. కానీ విలువలు మాత్రము పూర్తిగా అలక్ష్యం చేయబడలేవు. స్వేచ్ఛ మరియు సమానత్వం అన్నపదాలు, పాతపోకడల మాదిరి కాకపోయినప్పటికీ, వస్తువుల ఎంపిక మరియు మానవ విలువలను సిద్ధిపరుచుకోవటం (Realisation) లలో, ఆ పాత భావననే వాడబడుతున్నాయి.

## 10.9 చదవదగిన పుస్తకాలు


E. Barker : Principles of Social and Political Theory

A. Appadorai : The Substance of Politics

H.J. Laski : Grammar of Politics

J.C. Johari : Contemporary Political Theory


BRAOU

## 10.10 నమూనా ప్రశ్నలు

**I. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. స్వేచ్ఛను నిర్వచించి, మరియు ఆధునిక కాలములో దాని అవశ్యకతను పరీక్షించుము
2. స్వేచ్ఛ మరియు సమానత్వముల మధ్యవున్న సంబంధాన్ని చూపుము.
3. సమానత్వ మనగానేమి ? దాని రకాలు ఏవి ?

**II. 10 పంక్తులలో జవాబులిమ్ము**

1. రాజకీయ స్వేచ్ఛ మరియు పౌర స్వేచ్ఛల మధ్య భేదమును చూపుము.
2. శాసనము మరియు స్వేచ్ఛల మధ్యనున్న సంబంధమును పరీక్షింపుము.

**రచయిత : బి.ఎస్.ఆర్. ఆంజనేయులు**

BRAOU

# భాగం-11: వ్యక్తి శ్రేయోవాదుల, అధికారవాదుల, సామ్యవాదుల మరియు ఉదారవాదుల దృష్టిలో స్వేచ్ఛ

## విషయ సూచిక

11.0 లక్ష్యాలు

11.1 పరిచయం

11.2 స్వేచ్ఛ ప్రాముఖ్యత

11.3 స్వేచ్ఛ - అర్థము, పరిధి

11.4 వ్యక్తి శ్రేయోవాదుల దృష్టి

11.5 ఉదారవాద దృష్టి

11.6 అధికారవాద దృష్టి

11.7 సామ్యవాద దృష్టి

11.8 క్లుప్తంగా

11.9 చదువవదగిన పుస్తకాలు

11.10 నమూనా ప్రశ్నలు

## 11.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసికొనగలరు.
- స్వేచ్ఛ యొక్క అర్థము మరియు పరిధిని వివరించగలరు.
- వివిధ అభిప్రాయవాదుల దృష్టిలో స్వేచ్ఛ ఏమిటో విశ్లేషణాత్మకంగా పరీక్షించగలరు.

## 11.1 పరిచయం

మానవులకు అత్యంత ప్రీతియైన లక్ష్యాలలో స్వేచ్ఛ ఒకటి. స్వేచ్ఛ అంటే ఏమిటి, దాన్ని సాధించటం పోషించటం ఎలా అన్న విషయాల గూర్చి భిన్నాభిప్రాయాలున్నాయి. ఆవిధంగా స్వేచ్ఛ అనే పదానికి భిన్న అర్థాలు గూడ ఉన్నాయి. స్వేచ్ఛ భావనను అర్థం చేసికొనుటలో వున్న వ్యత్యాసాలు ఆభావన సమర్థన లేక తిరస్కరించటంలో వ్యత్యాసాలుగా వుంటాయి మరియు యీవ్యత్యాసాలు, సాధారణంగా వాదనలు మరియు ప్రయోజనాల మధ్య వ్యత్యాసాలుగా, వైరుధ్యాలుగా దారి తీస్తాయి. ఆవిధంగా, యీ భావనను సమర్థించడం లేక తిరస్కరించటం మీద ఆధారపడే, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో పెద్ద రాజకీయ గందరగోళము / ఆపదలు జరుగుతుంటాయి.



BRAOU

## 11.2 స్వేచ్ఛ - ప్రాముఖ్యత

మనకు, అన్ని సాధారణ పరిస్థితులలోనూ, ప్రత్యేకించి రాజనీతి సిద్ధాంత సందర్భంలోనూ తటస్థపడే ప్రాథమిక భావాలలో స్వేచ్ఛ భావన ఒకటి. వివిధ దేశాలు ఎలా తమ (రాజకీయ) స్వాతంత్ర్యము సంపాధించుకొనుటకు సమరములు జరిపినవో తెలుసుకొనడం వల్ల స్వేచ్ఛ యొక్క ప్రాముఖ్యత అతి తేలికగా తెలుస్తుంది. 1688లో రక్త రహిత విప్లవం (Bloodless / Glorious Revolution) ద్వారా ఇంగ్లాండులో చట్టబద్ధ రాజరికం వ్యవస్థాపన చేయటంతో, క్రొత్త యుగారంభానికి అది పెద్ద, మొదటి విప్లవమయినది. 1776లో అమెరికా విప్లవం, 1789లో ఫ్రెంచి విప్లవం, మానవ హక్కులు, పౌరసత్వముల గూర్చి ప్రముఖ సంఘటనలుగా గుర్తిస్తారు. 1917 రష్యన్ విప్లవం, 1949 చైనా విప్లవం, 1947 భారతదేశ స్వాతంత్ర్యము మరియు మొదలైన సమరాలన్నీ స్వేచ్ఛ కొరకు జరిపినవే. కేవలం రాజకీయ స్వాతంత్ర్యము కొరకేకాక అన్నిరకాల స్వాతంత్ర్యముల కొరకు వివిధ/అన్నిదేశాల్లో జరిగే పోరాటాలు, ప్రయత్నాలు పరిశీలిస్తే, రాజకీయ జీవితంలో అడుగడుగునా స్వేచ్ఛ భావన ప్రాముఖ్యత విశదమౌతుంది. రాజ్యరాజనీతి సూత్రాల దృష్ట్యా మరియు రాజకీయ జీవిత విధానమును అర్థం చేసుకునే దృష్ట్యానే కాక, రాజకీయ జీవితంలో అవసరమయ్యే మరికొన్ని భావనలు - హక్కులు, సమానత్వము మొదలైనవి - దృష్ట్యాగూడ యీ స్వేచ్ఛ భావన గూర్చి తెలిసికొనడం అవసరం.

## 11.3 స్వేచ్ఛ - అర్థము మరియు పరిధి

ఒకే అర్థముతో నున్నప్పటికీ Freedom అనేపదం సామాజిక సందర్భాలలో, Liberty అనేపదం రాజకీయ సందర్భాలలో వాడాలనే అభిప్రాయమున్నది. Liberty అనేపదం లాటిన్ పదమూలం 'Liber' (స్వేచ్ఛపరచు) నుండి రావటంవలన పై అభిప్రాయం కలిగి ఉండవచ్చు. కానీ సాధారణంగా ఈ రెండు పదాలు దాదాపు పర్యాయపదాలే. ప్రస్తుతం, యీ సందర్భంలో, స్వేచ్ఛ అన్నది జాతివిముక్తి కొరకు జరిపే స్వాతంత్ర్య సమరముల దృష్ట్యా కాక మిగిలిన అర్థముల దృష్ట్యా పరిశీలించబడుతుంది.

సాధారణంగా స్వేచ్ఛ అంటే 'ఎవరైన ఒక పనిని చేయతలచినపుడు, అది చెయ్యగల్గటం', అని అర్థం చేసుకుంటాము. ఒకరిపని మరొకరి పనులతో కల్పించుకోనంత వరకు సమస్య వుండదు. కానీ మనుషులు సమూహంలో వుంటారు. (అనగా సామూహిక జీవనం గడుపుతారు) వారి పరస్పర సంబంధాలలో యిష్టాయిష్టాలుంటాయి. కనుక వారి ప్రయోజనాలలో స్పర్థలు / వైరములు రావటానికి ఎక్కువ అవకాశం వుంటుంది. దీన్నిబట్టి, మనిషికి నిరపేక్ష (Absolute) స్వేచ్ఛ ఉండదని తెలుస్తుంది. పై పెచ్చు మానవజీవితం వ్యవస్థాపరమైన జీవితంగా ఉంటుంది. ప్రతివారు ఏదోఒక సంస్థకు చెందినవారుగా వుంటారు. ఆవిధంగా వ్యవస్థాపరమైన లక్ష్యసాధనకు ప్రతివారు తమ ప్రవర్తనను (నియంత్రణతో) మలచుకోవటాన్ని మర్చిపోలేరు / వదులుకోలేరు. అంతకుమించి, రాజకీయ జీవితం, నియంత్రణతోగూడిన / పరిమితమైన ప్రవర్తనను విధిస్తుంది.

ఇతరుల (వ్యక్తుల లేక ప్రభుత్వము లాంటి యితర సంస్థల) ప్రయోజన దృష్ట్యా వ్యక్తుల కోరికలు/ ప్రయోజనాలను మలచుకోవటంమెలా ? ప్రభుత్వం ఏ ప్రయోజనం కొరకు స్థాపించబడిందో, ఆపరిధిదాటి వెళ్ళగూడదు. అనగా ప్రభుత్వము పరిమితమైనది. అయితే విధి నిర్వహణలో ప్రభుత్వం ఎంతవరకు పరిమితమైనది ? ఇచటగూడ భిన్నాభిప్రాయాలున్నాయి.



BRAOU

వ్యక్తి శ్రేయోవాదుల విపరీత అంత్యముగా, అరాచకవాదులు ప్రజలు తమకునచ్చిన విధముగా వుండుటకు, రాజకీయ వ్యవస్థాపనము క్రమేపీ తొలగిపోవాలి అని నమ్ముతారు. ఏ సంస్థ అయినా ప్రత్యేకించి రాజకీయ సంస్థ మానవ మూర్తిత్వ (Personality) పెరుగుదలను అరికట్టగూడదు. అలా జరుగుటకు అడ్డుతగలకూడదు. అరాజకవాదుల దృష్టిలో ప్రతిసంస్థ వ్యక్తి పెరుగుదలకు అడ్డు నిలుస్తుంది. Bakunin, Kropotkin, Proudhon ప్రముఖులైన అరాచకవాదులు. అరాచకవాద సారాంశము / సారము - వ్యక్తి అన్ని సంస్థలకు మించి, అభివృద్ధి చెందాలి లేక ఉన్నతుడవ్వాలి.

కానీ అరాచకవాదం ఒక కాల్పనికమైనదిగా చూడవచ్చును. ఎందుకంటే, రాజ్యజోక్యము ఒకొక్కప్పుడు లేక తరచూ అవసరమనిపిస్తుంది. రాజ్యము ఆవశ్యక క్లేశము (Necessary Evil) దాని జోక్యము ఎంత తక్కువ వుంటే అంతమంచి, కానీ రక్షణ యివ్వటానికి రాజ్యమే (ప్రారంభ) చర్య తీసికోగలదు. ఈ సందర్భంలోనే స్వేచ్ఛను గూర్చి, వ్యక్తి శ్రేయోవాదుల, ఉదార, అధికార, సామ్యవాదుల దృష్టి విభిన్నరీతులలో నుండటం గమనిస్తాము.

## 11.4 స్వేచ్ఛ - వ్యక్తి శ్రేయోవాద దృష్టి

వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతము రాజకీయ వ్యవస్థాపన ఒకే ఒక్క లక్ష్యము / ప్రయోజనము 'వ్యక్తికి సాధ్యమైనంత స్వేచ్ఛ' అన్న ప్రాతిపదికపై ఆధారపడియున్నది. మానవుడు స్వతహాగా తనను తాను మంచిగా నుండునట్లు చూచుకోగలడు / ప్రవర్తించగలడు, యితరులపై సానుభూతి కల్గి ఉంటాడు. మరియు అనుగుణ్యముగా (Accommodative) ఉండగలడు. ఒకవేళ మానవుడు తప్పులు చేసినప్పటికి లేక ఒక్కసారి వివేచన రాహిత్యంతో వున్నప్పటికీ అనుభవం తనను వివేకవంతునిగా చేస్తుంది మరియు సంఘజీవిగా మలుస్తుంది. మరోమాటలో చెప్పాలంటే, మానవుడు ఉదారుడు మరియు హేతువాది. కనుక తాను వ్యవస్థాపన చేసిన ఏ ఏర్పాటైనా తను అభివృద్ధి చెందటానికి తోడ్పడేదిగా వుండాలి. రాజ్యాధికారము మానవుని వ్యక్తిమూర్తిత్వాన్ని రక్షించేదిగా వుండాలి. అయితే రాజ్యము కొన్ని సందర్భాలలో కొందరి సంరక్షణ కోసం ప్రక్కన నిలబడగల్గాలి (బలహీనుల ప్రక్కన) అలా ఎప్పుడు వీలుపడుతుందంటే, ప్రస్తుతం అమలులో ఉన్న వస్తు మరియు సేవల పంపిణీ విధానమువలన దెబ్బతిన్న వారి ప్రయోజనాలను కాపాడగల్గినప్పుడు. ఆవిధంగా రాజ్య జోక్యము గూడ అవసరమనిపిస్తుంది. రాజ్యము యొక్క పరిమిత పాత్ర మరియు కొందరి విషయంలో కొన్ని విషయాలగూర్చి రాజ్యజోక్యము - యీ రెంటి సమన్వయం సందిగ్ధముగాను, క్లిష్టముగాను వున్నప్పటికీ, ఉదారదృష్టి అనగా యీరెంటి సమన్వయపరచటంలో సమస్యను పరిష్కరించటానికి మంచి మార్గము. ఈ దృష్టినే వ్యక్తి శ్రేయోవాదము లేక ఉదారవాదమని గూడ అంటారు.

## 11.5 స్వేచ్ఛ - ఉదారవాద దృష్టి

ఉదారవాదము లాక్ రచనల నుండి పెంపొందింపబడి ఆధునిక యుగంలో ప్రాముఖ్యత వహించింది. లాక్ ఉదారవాదము, అన్ని రాజకీయ ఏర్పాటులకు ఒకే ఒక లక్ష్యం వ్యక్తి శ్రేయస్సు అన్న వ్యక్తి శ్రేయోవాదముపై ఆధారపబడ్డది. మానవుడు హేతువాది మరియు ఉదారవాది. మానవుడు అనుభవం ద్వారా అభివృద్ధి చెందుతూ ఉంటాడు. ఆస్తి, మానవమూర్తిత్వానికి విస్తరణ. తమజీవితం, స్వేచ్ఛ మరియు ఆస్తిని

రక్షించుకొనుటకు మానవుల కృషి ఫలితంగా ఏర్పడిందే రాజ్యము. రాజ్యము (లేక ప్రభుత్వం)ల ముఖ్యలక్ష్యం శాంతి భద్రతలను కాపాడటం, ఆవిధంగా రాజ్యము ప్రజల జీవితము, స్వేచ్ఛ, ఆస్తి విషయాలలో జోక్యం కల్గించుకోగూడదు. లాక్ ఉదార రాజనీతి, రాజ్యము యొక్క మితిమీరిన లేక వత్తిడితో గూడిన అధికారము నుండి వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యమని నొక్కి వక్కాణిస్తుంది.

ఆధునిక వ్యక్తి శ్రేయోవాదమును ప్రతిపాదించిన J.S. Mill మరి కొంచెము ఎక్కువ స్థాయిలో వ్యక్తి స్వేచ్ఛను సమర్థిస్తాడు. వ్యక్తి స్వేచ్ఛ రాజ్యము నుండే కాదు సమాజము నుండి గూడా వుండాలన్నదే Mill యొక్క గట్టి ప్రతిపాదన, ప్రతి వ్యక్తీ ఆలోచించటానికి, అభిప్రాయాలు కల్గి ఉండటానికి, వాటిని వ్యాప్తి చేయటానికి, మరియు మరొకరితో పంచుకోటానికి వ్యక్తికి స్వేచ్ఛ అవసరం. మరొకరి (వ్యక్తుల లేక సమూహాల) స్వేచ్ఛ, ప్రయోజనాలకు హాని కల్గించనంతవరకు ఒక వ్యక్తికి స్వేచ్ఛ ఉండాలి. ఇంతరవకు లాక్ లాగానే మిల్ కూడా ఉదారవాది. అయితే కమ్యూనిటీకి కొన్ని ప్రయోజనాలు ఆరోగ్యము, విద్యలాంటివి, వుంటవని మిల్ గుర్తిస్తాడు. స్త్రీలు మొదలగు కొన్ని వర్గాలను వివక్షత (Discrimination) లేక దోపిడీ (Exploitation) నుండి కాపాడవలసియున్నది. కనుక అలాంటి వర్గాలు అభివృద్ధి చెందుటకు రాజ్యము వారిని ఆదుకోవలసియున్నది. మరోమాటలలో చెప్పాలంటే, రాజ్యమునకు కేవలం శాంతి భద్రతలు కాపాడటమేకాక, మరొక ప్రత్యేక పాత్ర గూడ వున్నది. ఆవిధంగా మిల్ ప్రతిపాదించిన వ్యక్తి శ్రేయోవాదము వ్యక్తి స్వేచ్ఛకు, కమ్యూనిటీ / సమాజ ప్రయోజనాలకు / శ్రేయస్సుకు సమన్వయం కుదురుస్తుంది. ఫ్రెంచి ఫిజియోక్రాట్స్ - మాంటెస్క్యూ, బెన్థామ్ మరియు స్పెన్సర్ యిలాంటి వ్యక్తి శ్రేయోవాదమును లేక ఉదారవాదమును ప్రతిపాదించారు.

## 11.6 స్వేచ్ఛ - అధికారవాద దృష్టి

BRAOU

స్వేచ్ఛ అంటే ఏమిటి ? దాని కాపాడుకొనటం ఎలా అన్న విషయాన్ని వ్యాఖ్యానించటంలో అధికారవాదం మరొక దృష్టి / వాదం. అధికారవాదం, అక్షరాలా అర్థం చెప్పాలంటే - 'అధికార (ముచేత) పాలన' వ్యక్తి అధికారమో, పాలకుని అధికారమో లేక ప్రాముఖ్య గ్రంథ లేక సూత్ర అధికారముచేతనో లేక భావ సిద్ధాంత అధికారముచేతనో పాలించటం. రాజకీయ అధికారము యొక్క ముఖ్యవిధి, ప్రజలను నియంత్రిస్తూ మంచి పాలనను చేయటం. కాని నియంత్రణ వత్తిడితో గూడినదవ్వటం అధికార వాదములోని ప్రత్యేకత. అధికారము యొక్క మితిని ఒకవ్యక్తి, సూత్రము, గ్రంథము, భావ సిద్ధాంతము లాంటివి నిర్ణయిస్తాయి. ఫ్రెంచి లూయీ XIV, హాబ్స్ ప్రతిపాదించిన రాజ్యము అధికారవాద రాజ్యాలకు ఉదాహరణలు. అధికారమును రూపొందించుటలో వ్యక్తులకు పాత్రలేదు. కనుక అధికారమును ప్రశ్నించు హక్కుగూడ వారికి లేదు. అధికారము ఏమిచేసినప్పటికి అది ప్రజల శ్రేయస్సు దృష్ట్యా చేసినదనుకోవాలి. దైవదత్తాధికార సిద్ధాంతం యిలాంటి అధికార వాద సిద్ధాంతమును / పాలనను సమర్థిస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ అధికారము ప్రకటించినది / ఒప్పుకున్నది.

అధికారవాదమునకు మరియు సంపూర్ణాధికార వాదమునకు వ్యత్యాసమున్నది. అధికారవాదములో జీవితములోని కొన్ని అంశములు / విషయాలు మాత్రమే నియంత్రణలో ఉంటాయి. వత్తిడిగూడ కొన్ని విషయాలలోనే ఉంటుంది. కానీ సంపూర్ణాధికార వాదములో జీవిత విధానం మొత్తం రాజ్యము చేతిలో / నియంత్రణలో ఉంటుంది. అందువలననే ఫాసిస్టు మరియు నాజీ రాజ్యాలు, సంపూర్ణాధికార రాజ్యాలుగా

గుర్తిస్తారు. అధికారవాద పాలన క్రమేపీ క్షీణిస్తున్నప్పటికీ, యింకా కొన్ని మూడవ ప్రపంచ దేశాలలో కొన్నింటిలో అది యిప్పటికీ వుంటున్నది.

## 11.7 స్వేచ్ఛ - సామ్యవాద దృష్టి

రాజ్యము మరియు సమాజముల గూర్చి వున్న సిద్ధాంతాలలో ప్రముఖమైనది సామ్యవాద సిద్ధాంతము ఒకటి. సామ్యవాదములో అనేక రకాలు వున్నప్పటికీ, ప్రధాన విషయమొకటే - వస్తు మరియు సేవా ఉత్పత్తిల సాధనములన్నింటినీ సమాజపరం చేయటం. మానవ మరియు వస్తువనరులన్నింటినీ సమాజ నియంత్రణ క్రింద నుంచటం. సామ్యవాద సమాజపు ముందు దశలో సమాజం వర్గ విభజన మరియు అన్నిరకాల వ్యత్యాసాలపై ఆధారపడి వుంటుంది.

సామ్యవాదము సమాజమునకు గూర్చి భౌతిక సంబంధ వివరణ యిస్తుంది. ఆర్థిక చర్య(ల) విధానము సమాజపు స్వభావాన్ని నిర్ణయిస్తుంది. సాధారణంగా వస్తు, సేవా ఉత్పత్తి సాధనాలు ధనికుల, పెట్టుబడిదారుల అదుపులో వుండుటచే శ్రామికులు, తమను అభివృద్ధి పరచుకునే అవకాశాలు కోల్పోతారు. వారుకూడా మార్కెట్‌లోని వస్తువులా తయారవుతారు. దోపిడీ పరిస్థితి ఏమేరకు వెలుతుందంటే ఆదోపిడీ వ్యవస్థని ఎదిరించి తిరుగుబాటు చేయడం తప్ప శ్రామికులకు మరో అవకాశం / దారి వుండదు. రాజ్యము గూడ పెట్టుబడి వర్గానికి ఏజెంటులా వ్యవహరిస్తుంది. కనుక సామ్యవాద సమాజంలో రాజ్యము, ప్రజలను తమను తాము పాలించుకునే విధంగా తయారుచేస్తూ, క్రమేపీ అంతర్థానమౌతుంది. ఒక ముఖ్య విషయమేమిటంటే ప్రస్తుతమున్న (అమలులో ఉన్న) బూర్జువా మరియు పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు, అన్ని సామ్యవాద సిద్ధాంతాలలోను, రాజ్యాలలోను ఒకే విధంగా ఉండకపోవచ్చును. సాధారణంగా వత్తిడి (Force)తో గూడినదే, ప్రాముఖ్యత వహించిన 'శ్రామికుల నియంతృత్వ' మనే భావనలో గూడ యీ అర్థం స్ఫురిస్తుంది. మరియు అలాంటి పరిస్థితి ఎంతవరకు కొనసాగుతుందంటే, అన్నిరకాల వస్తు మరియు సేవా ఉత్పత్తి సాధనాలు సమాజపరం అయ్యేటంతటి వరకు అప్పుడు రాజ్యము తనస్థానమును, సమాజము / కమ్యూన్ జీవిత విధానానికి (చోటు) యిస్తుంది.

వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించి సామ్యవాద సిద్ధాంతం తన వివరణ యిస్తుంది. సామ్యవాదం దృష్ట్యా, వ్యక్తులు తాము వర్గ సమాజములో అనుభవిస్తున్న స్వేచ్ఛ, సరియైన స్వేచ్ఛకాదు. ఆ స్వేచ్ఛ అందరు, తమను అభివృద్ధి పరుచుకొనుటకు, సహాయపడేదికాదు. వర్గ సమాజములో కొందరు ఎక్కువ ప్రయోజనాలను పొందుతారు. మిగిలినవారు అలాలేక బాధపడతారు. స్వేచ్ఛ మరియు వ్యత్యాసాలు ఒక సమన్వయంలో ఉండవు. బూర్జువా రాజ్యము శ్రామికులను రక్షించదు. నీతి, చట్టము, పోలీసు, విద్య మొదలైన, సమాజాన్ని నియంత్రణ చేసే ప్రతి సాధనము / మార్గము ధనికులకు సహాయకారిగా వుంటుంది. అది తొలగించుటకే, స్వేచ్ఛను అందరికీ సమానంగా యిచ్చే సూత్రముపై సామ్యవాద విప్లవం అవసరమౌతుంది. సామ్యవాద సిద్ధాంతం ప్రకారం, ప్రతివారు తమను అభివృద్ధి పరుచుకునేటట్లు సమానత్వాన్నీ, అనగా సమాన అవకాశాలు ఇవ్వటం వల్లనే, సరియైన స్వేచ్ఛకు దారితీస్తుంది. సామ్యవాద రాజ్యములో వత్తిడినుపయోగించటం, సామ్యవాద రాజ్యమును వ్యవస్థాపన చేయుటవరకు సమర్థనీయము.

కాని, వాస్తవంలో కొన్ని సామ్యవాద రాజ్యాలు, తమ వాస్తవానుభవంతో, తిరోగమించటం లేక ఉదార విధానములను మరియు మార్కెట్టు యంత్రాంగాన్ని స్వీకరించటం జరిగింది. కొన్ని సామ్యవాద రాజ్యాలకు

'మార్కెట్టు సోషలిజం / మార్కెట్టు సామ్యవాదం' అన్నభావన ప్రాముఖ్యత వహించింది అనటంలో అతిశయోక్తి లేదు.

దీన్నిబట్టి సిద్ధాంతపరంగా, స్వేచ్ఛ బూర్జువా, ఆదర్శము / విలువ అని నిరసించినప్పటికి, ఏరకమైన సామ్యవాదానికైనా, 'మనిషి తనను అభివృద్ధి పరచుకోటానికి స్వేచ్ఛకావాలి' అన్నది లక్ష్యమవ్వాలని తెలుస్తున్నది. ఉదార సామ్యవాద రాజ్యములో రాజ్యము అనుకూలమైన (Positive) పాత్రను నిర్వహించాలి మరియు ఉత్పత్తి శక్తులన్నింటిని ఒక సమావస్థ (balanced) మరియు సమన్వపరచు (coordinating) పరిస్థితిని కల్పించాలి.

## 11.8 క్లుప్తంగా

రాజనీతి సిద్ధాంతంలో స్వేచ్ఛ భావన ప్రాముఖ్యత వహించింది. ఈపదం నిరపేక్ష (absolute) అర్థాన్నియివ్వదు. పైపెచ్చు యీ పదం, సమానత్వంలాంటి మరికొన్ని రాజకీయ శాస్త్రములోని, కీలక భావాలతో కలసి ఉంటుంది. స్వేచ్ఛకు చట్టము, సమానత్వము, న్యాయము మొదలైన మిగిలిన జీవిత అంశాలకు గల సంబంధం అన్నిరకాల రాజకీయ వ్యవస్థలలోనూ కీలకమౌతున్నది.

## 11.9 చదవదగిన పుస్తకాలు


A. Appadorai : The Substance of Politics

J.C. Johari : Contemporary Political Theory


## 11.10 నమూనా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులిమ్ము**

1. 'స్వేచ్ఛ' సామ్యవాదులచే ఎలా అర్థం చేసుకోబడింది. మరియు ఎలా వివరించబడింది ?
2. అధికారవాద దృష్టిలో స్వేచ్ఛ ఏది / ఏమి ?
3. స్వేచ్ఛ భావనలో వ్యక్తి శ్రేయోవాదము, ఉదారవాదము కన్న ఎలా భేదిస్తుంది.

**II. 10 పంక్తులలో జవాబులిమ్ము**

1. కమ్యూనిస్టుల స్వేచ్ఛ భావన
2. ఉదారవాద స్వేచ్ఛ భావన
3. సామ్యవాద స్వేచ్ఛ భావన

**రచయిత : బి.ఎస్.ఆర్. ఆంజనేయులు**

B R A O U

# భాగం-12 : వ్యక్తి హక్కుల సిద్ధాంతాలు మరియు హక్కుల రకాలు

**విషయ సూచిక**


12.0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 హక్కుల అర్థం

12.3 హక్కుల సిద్ధాంతాలు

12.4 హక్కుల రకాలు

12.5 విధులు

12.6 క్లుప్తంగా

12.7 చదువదగిన పుస్తకాలు

12.8 నమూనా ప్రశ్నలు


## 12.1 పరిచయం

రాజకీయ జీవితంలో హక్కుల గురించి జ్ఞాన ప్రాముఖ్యత విశేషమైనది. రాజకీయ సమాజపు స్వభావం ఎలా ఉన్నప్పటికీ, వ్యక్తులు తమ అభివృద్ధి కొరకు కోరుకునే కొన్ని పరిస్థితులకు మరియు రాజ్యము వాటిని అనుమతించటానికి మధ్య కొన్ని సంబంధాలు వుంటాయి. సిద్ధాంత పరంగా స్పష్టత లేకపోతే ఆరెండు వైపుల నుంచి వుండాల్సిన సంబంధాల సమన్వయం సాధ్యపడదు. అందువలననే రాజనీతి సిద్ధాంతములో హక్కుల భావన గూర్చి వివరించటం జరుగుతుంది. రాజనీతి సిద్ధాంతం ప్రామాణికమైనది (Normative) అయినప్పటికి, హక్కుల భావన గతిశీలమైనది (Dynamic). కనుక దాన్ని గురించి మారుతున్న కాలము మరియు అవసరాల దృష్ట్యా తెలుసుకోవల్సివున్నది.

BRAOU

## 12.2 హక్కుల అర్థం

ప్రతివ్యక్తికి తాను అభివృద్ధి చెందుటకు కొన్ని పరిస్థితులు అవసరం మరియు ఆవిధంగా అలాంటి పరిస్థితులపై తనకు స్వంత ప్రతిపాదనలు (Claims) ఉంటాయి. అయితే తన స్వత ప్రతిపాదనలు మరొకరి వాటితో ఘర్షణ రాకూడదు. కనుక వ్యక్తి స్వత ప్రతిపాదనలు వస్తుపరంగా (Objective) ఉండాలి. అంతేకాదు వ్యక్తుల స్వత ప్రతిపాదనలు సమాజం మొత్తానికి ఉపయోగకరంగా మరియు లాభదాయకంగా ఉండాలి. అందువలననే అలాంటి స్వత ప్రతిపాదనలను సమాజం అంగీకరించాల్సిన అవసరం కూడా ఉంది. హక్కులు అనేవి వ్యక్తి తన సమూహము మరియు సమాజం మొత్తం యొక్క స్వత ప్రతిపాదనలు మరియు సమాజపు లేక రాజ్య గుర్తింపు. అంటే సమాజం లేక రాజ్యం చేత గుర్తించబడ్డ వ్యక్తుల, సమూహముల స్వత ప్రతిపాదనలే హక్కులుగా చెలామణి అవుతాయి. లాస్కి యిలానే అంటాడు.

"కనుక హక్కుల వ్యవస్థ ముఖ్యంగా మూడు అంశాలతో ఉంటుంది. వీటినిబట్టి హక్కుల గూర్చి తెలుస్తుంది. ఎల్లప్పుడూ కనీసం ఆఖరిగానైనా, గుంపు నుండి విడదీయబడిన వ్యక్తిగా, తన స్వంత ప్రయోజనం ఉంటుంది. తన వ్యక్తీకరణ సమూహం ద్వారానే అవుతుంది కనుక, గుంపు సమూహపు ప్రయోజనం వుంటుంది. సాంఘిక శక్తులన్నింటిని కలుపు సమాజపు ప్రయోజనం ఉంటుంది."

"హక్కులు, నిజంగా ఏ పరిస్థితులు లేకపోతే వ్యక్తి తనను తాను పూర్తి మూర్తిత్వము పొందలేడో, సామాజిక జీవితములో ఆపరిస్థితులే హక్కులు. ఎందువలననంటే, వ్యక్తుల అభివృద్ధి రాజ్యలక్ష్యము కనుక అలాంటి పరిస్థితులను కల్పించినప్పుడే తన లక్ష్యము నెరవేరుతుంది." (లాస్కీ)

బార్కర్ మరియు గిల్‌క్రిస్ట్ కూడా యిలా అంటారు.

"హక్కులు, వ్యక్తిత్వ/వ్యక్తి మూర్తిత్వ సామర్థ్యాలు సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోటానికి అవసరమయ్యే బాహ్య పరిస్థితులు" (బార్కర్)

"కనుక సమాజపు సభ్యులుగా వ్యక్తుల నుండి, మరియు ప్రతివ్యక్తిలో వున్న శక్తులను అభివృద్ధి చేసికొనటం చేత(నే) సమాజం అత్యుత్తమ దశ చేరుకుంటుందని గుర్తించటంచేత, హక్కులు ఉదయిస్తాయి' ' (గిల్‌క్రిస్ట్)

హక్కులు రాజ్యముకన్న మునుపే వుంటాయి, కాకపోతే రాజ్యమే వాటిని అమలుపర్చాలి మరియు భద్రపరచాలి. స్వత ప్రతిపాదించటంలోనూ, అనుభవించటలోని ప్రారంభం, లక్ష్యం వ్యక్తే అయినప్పటికీ వాటిని నియమబద్ధం చేసి అంగీకరించాల్సింది సమాజం మరియు రాజ్యము. హక్కులుండటం మరియు వ్యక్తుల అభివృద్ధి, వ్యక్తుల మరియు సమాజం/రాజ్యంల మధ్యనున్న సమన్వయాన్నిబట్టి వుంటుంది. స్వతప్రతిపాదనలు మరియు రాజ్య గుర్తింపుల మధ్య సమన్వయం శాశ్వతరూపంలో ఉండకపోవచ్చు. వాటి మధ్యనున్న సంబంధాలు గతిశీలమైనవిగా గుర్తించాలి. అందువలననే, ఏ రాజకీయ వ్యవస్థలోనైనా, హక్కుల భావన గూర్చి తరచూ విచారణ జరుగుతుంది.

## 12.3 హక్కుల సిద్ధాంతాలు

హక్కుల పుట్టుక మరియు స్వభావాన్ని గూర్చి విభిన్న వివరణలుండుటచేత, హక్కుల సిద్ధాంతాలు భిన్నమైనవిగా వున్నాయి.

**1. సహజ హక్కుల సిద్ధాంతము :** ఈ సిద్ధాంతం ప్రకారం హక్కులు సార్వత్రిక మరియు హేతుబద్ధమైన మానవ జీవితమునకు సహజమైనవి. మానవులు ఏ స్థితిలోనైనా, ఎచ్చట నుండినను, స్వాభావికముగ హేతువాదులు. మానవ జీవన పరిస్థితులను పెంపొందించుటకు కొన్ని సార్వత్రిక పరిస్థితులను పెంపొందించుటకు ఎల్లప్పుడు ప్రయత్నిస్తారు. అన్ని పౌర మరియు రాజకీయ పరిస్థితులు సహజమైన మానవ జీవిత విధానము నుండే ఉద్భవిస్తాయి. ప్రతి రాజ్యము మరియు సమాజములో కొన్ని ప్రత్యేకతలు ఉన్నప్పటికీ, ఆ హేతుబద్ధ మరియు సార్వత్రిక పరిస్థితులకు సార్వత్రికత అందువలననే వచ్చింది. "పౌరచట్టము (Civil Law), సార్వత్రికమైన, హేతుబద్ధ, శాశ్వితమైన మరియు మారని సహజ న్యాయము (Law of Nature) నకు సమరూపతో నుండవలెను", అన్న సిసిరో మాటలు పై అర్థాన్ని స్పష్టం చేస్తాయి.

ఆధునిక రాజనీతి మేధావుల చేతగూడ సహజ న్యాయం రాజకీయ జీవితానికి పునాది చేశారు. బ్రిటిష్, అమెరికా మరియు ఫ్రెంచి విప్లవాలు స్వేచ్ఛ, సమానత్వాలకు సహజ హక్కులు మూలం అని నిర్ధారించాయి. ఐక్యరాజ్యసమితి యొక్క 'మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన' (Universal Declaration of Human Rights) 1948లో యీ సూత్రమును నొక్కి వక్కాణించింది.

**2. చట్టబద్ధ హక్కుల సిద్ధాంతం :** హక్కు చట్టములేకుండా రక్షింపబడదు. చట్టబద్ధత లేని హక్కులు మహా అయితే నైతిక హక్కులుగా మాత్రమే మిగిలిపోగలవు. కొన్ని హక్కులను పరిరక్షించుటకు కేవలం నైతిక బంధం (Moral Obligation) సమర్థవంతమైనది కాదు. అందువలననే, ప్రతిదేశ రాజ్యాంగములో కొన్ని హక్కులను పొందుపరచబడినవి, వాటినే 'ప్రాథమిక హక్కులు' అంటారు. సంఖ్య దృష్ట్యా అవి సార్వత్రికము కాకపోవచ్చు. కాని కొన్ని హక్కులకు చట్టబద్ధత కల్పించే అవకాశముండుటచే సమాజము / రాజ్యము ఆధునిక రాజ్యము/సమాజముగ వుండకలదు.

**3. చారిత్రక హక్కుల సిద్ధాంతం :** బర్క్ లాంటి మేధావులు కొందరు హక్కులను చారిత్రక పరిస్థితులలో వుద్భవించినట్లు భావిస్తారు. ఎప్పటి నుంచో వస్తున్న ఆచారాలు / స్వత ప్రతిపాదనలు కాలను గుణ్యముగ హక్కులుగా మార్చబడతాయి. అవి సూచించబడినవి మరియు గతి శీలార్థములో అవి ఉపయోగకరమైనవి. అందువలననే సంబంధ నియమము / ధర్మములను చట్టబద్ధ హక్కులుగా తయారు చేస్తారు. అనగా మంచి స్వత ప్రతిపాదనలు కాల పరీక్షకు నిలబడతాయి అని అర్థం.

**4. ఆదర్శ హక్కుల సిద్ధాంతము :** కాంట్ మరియు గ్రీన్ లాంటి కొందరు ఆదర్శ మేధావులు "హక్కులు, మానవుని అంతరాత్మలో ఉద్భవించు కొన్ని స్వతప్రతిపాదనలు" అని వక్కాణిస్తారు. మానవుడు హేతువాది మరియు తన యొక్క, మిగిలిన సమూహం యొక్క శ్రేయస్సునే కోరుకుంటాడు. ఒకవేళ మానవుడు ఉన్నట్లుండి విషయ నిష్ఠగ (Objective) ఉండగలడని నమ్మలేకపోయినప్పటికి, అనుభవరీత్యా క్రమేపీ మనిషి హేతువాదిగా, సంఘ జీవిగా, మరొకరిని, మన్నించేవానిగా తయారవగలడు. అలా సమాజపు 'నిజమైన ఇచ్ఛ' క్రమేపీ వ్యక్తులచే పెంపొందించబడిన నిజమైన ఇచ్ఛలవల్ల ఏర్పడుతుంది. మానవుడు ఆదర్శవాది అన్న భావాన్ని యిలా అర్థం చేసుకోవాలి.

**5. మార్క్సిస్టు హక్కుల సిద్ధాంతం :** సమాజపు లేక రాజ్యపు స్వభావం, అచట జరుగు ఆర్థిక చర్యలను బట్టి తెలుసుకోవచ్చునని మార్క్స్ వక్కాణించాడు. చారిత్రకంగా, ఉత్పత్తి సాధనములపై ఆధిపత్యము కల వర్గము, ఉత్పత్తి కారకాలలో అతి ముఖ్యమైన శ్రామిక శక్తికన్న, అన్నివిధాల అభివృద్ధి చెందింది. శ్రామికవర్గం, తాము అభివృద్ధి చెందటానికి అవసరమైన పరిస్థితులు కావల్సినప్పటికీ, కనీసం బ్రతుకును సాగించే వారి స్థితులు గూడ పొందలేక పోతాయి. ఉన్న పరిస్థితిని సమర్థించే అన్నిరకాల భావాలు, సిద్ధాంతాలు, ధనికులకు, పెట్టుబడిదారులకు సహాయ కారిగా వుంటాయి. హక్కులు గూడ వారికే సహాయకారిగా ఉంటాయి. మార్క్స్ వివరించినట్లు, యుగాలు గడచిన కొలదీ, పెరిగే సంఘర్షణలకు చరిత్ర సాక్ష్యం అందిస్తుంది. సామ్యవాద లేక కమ్యూనిస్టు విప్లవం, జీవిత హక్కు, స్వేచ్ఛ హక్కు మరియు సమానము హక్కులను మరియు వర్గరహిత సమాజమును పొందుటకు చెయ్యబడతాయి. 'వ్యక్తుల సామర్థ్యాలను సమాజపు అవసరాలకు కమ్యూనిస్టు / సామ్యవాద సమాజం ఏర్పరచిన సమన్వయం, అందరికి ఆమోదకరంగా ఉంటుంది' అన్న ప్రతిపాదనపై ఆధారపడ్డది మార్క్సిస్టు లేదా సామ్యవాద సిద్ధాంతం. ఈ మధ్యకాలంలో సామ్యవాద రాజ్యాలలో జరిగే వాస్తవిక మార్పుల వల్ల అలాంటి (అందరికి ఆమోదకరమైనవి) సమన్వయం యింకా స్థిరపడలేదని తెలుస్తుంది.

BRAOU

6. సాంఘిక క్షేమ / శ్రేయస్సు హక్కుల సిద్ధాంతం : మానవ శ్రేయస్సు దృష్ట్యా సంఘముచే రూపొందింపబడినవే హక్కులు అని లాస్కీ అంటాడు. అన్ని సమాజములకు అన్నియుగములలోను, 'మానవ శ్రేయస్సు, అన్నదానికి ఒకే అర్థము ఉండనక్కరలేదు, వుండదుకూడా. కాకపోతే అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకొనుటకు ప్రతియుగంలోనూ ఒక (రకమైన) సాధారణాభిప్రాయం ఉండటం మంచిది. కార్యసాధన (Expediency) గూడ, ప్రజలందరికి శ్రేయస్సు నివ్వటానికి, ఒక అవసరం లాంటిదే. అయితే అది అందరి శ్రేయస్సుకు అడ్డు తగలకూడదు.

## 12.4 హక్కులు - రకాలు

1. నైతిక హక్కులు : కొందరు వ్యక్తులు లేక గుంపులు, మరికొందరి సమూహ లేక సమూహముల నుండి కోరు స్వతప్రతిపాదనలు హక్కులు. కలుపుగోలుతనము, గౌరవము, దయ, సహకారము మొదలైన లక్షణాలు మానవ సంబంధాల్లో ప్రతిబింబించాలి. అలాగని అందరూ ఆశిస్తారు. ఇవి హక్కులు లాంటివే. వీటి తిరస్కారము / ధిక్కారము సమాజానికి వెంటనే హాని కలుగజేయనప్పటికీ, ముందు ముందు, అనగా రాబోవు కాలములో, సమాజపతనానికి, క్లిష్ట మరియు గందరగోళ పరిస్థితికి దారి తీస్తుంది. వ్యక్తుల మంచి / సరియైన అంతరాత్మ మాత్రమే యిలాంటి హక్కులను కాపాడగలదు, తద్వారా సమాజపు నైతిక హక్కులు పరిరక్షింపబడతాయి.

2. పౌర హక్కులు : ఈ హక్కులు లేక స్వత ప్రతిపాదనలు, వ్యక్తులు వారి ఆస్తులకు సంబంధించినవి. వాటిని పౌర లేక సామాజిక హక్కులు అని పిలవటానికి కారణం, అవి నాగరిక సామూహిక జీవనం గడపటానిక వసరమైనవి కనుక. జీవిత హక్కు (ప్రాణ హక్కు), వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తి ఆలోచన మరియు వ్యక్తపరచటం, ఆస్తి, మతము మొదలైనవన్నియు పౌరహక్కుల క్రిందకే వస్తాయి. ఇవి హక్కులు మరియు నేరములకు గూడ దగ్గర సంబంధం కల్గియున్నవి. ఉదాహరణకు, ప్రాణహక్కు ప్రాణమును రక్షించుకునే హక్కునిస్తుంది మరియు ఆత్మహత్య నేరము కనుక శిక్షార్హము. స్వేచ్ఛా హక్కు, స్వైర అరెస్టు (క్రమబద్ధము కానిది) లేక అదుపులోకి తీసికొనటం నుండి రక్షణ హక్కును కూడా యిస్తుంది.

3. రాజకీయ హక్కులు : ఈ హక్కులు మానవుల పబ్లిక్ జీవితంలో పాల్గొనే విషయానికి సంబంధించినవి. ఓటు హక్కు, ఎన్నికలలో పోటీ చేసే హక్కు, అధికార హోదాను పొందే హక్కు, ప్రభుత్వమును, దాని పనితీరును విషయగతంగా (Objective) విశ్లేషించే హక్కు మొదలైనవి రాజకీయ హక్కులు. ఈ హక్కుల విషయంలో లింగ, మత, కుల, వర్గ విచక్షణలు ఉండకూడదు / చూపరాదు. ఈ హక్కుల పరిరక్షణ వలన ప్రజలే సార్వభౌములు / ప్రజా సార్వభౌమత్వం అమలులో ఉన్నట్లు అవుతుంది.

4. ఆర్థిక హక్కులు : ఈ హక్కులు, మానవుల వృత్తి లేక తమ తిండి -బట్ట-నిలువనీడలాంటి కనీస అవసరాలను తీర్చుకొనుటకు ఉపయోగపడే ఉద్యోగము చేయుట మొదలైన వాటికి సంబంధిచినవి. కనీస అవసరాలను తీర్చుటకు జీవిత ప్రాథమిక సాధనాలను అందించగల్గాలి. మరియు రక్షింపగల్గాలి. ఆహక్కులు సార్వత్రికంగా ఒకే సంఖ్యలో ఉండకపోవచ్చు. పని హక్కు అన్ని దేశాలలోను ప్రాథమిక హక్కులలో ఒకటి కాకపోవచ్చు. కానీ విశ్రాంతి హక్కును ప్రైవేటు రంగంలో గూడ తిరస్కరింపబడగూడదు. ఆర్థిక సంబంధ సాధనాలు ఒక్కొక్క సమాజంలో ఒక్కోరకంగా ఉన్నప్పటికీ, ఏ సమాజం ఆర్థిక హక్కులను తిరస్కరించలేదు.



BRAOU

5. మానవ హక్కులు : సహజ మరియు పౌర హక్కులు చాలావరకు, ప్రత్యేకంగా 1948లోని ఐక్యరాజ్యసమితి మానవహక్కుల ప్రకటన తర్వాత నుంచి, మానవ హక్కులుగా పిలువబడుతున్నాయి. ఆప్రకటనలోని ప్రవేశిక (Preamble) యిలా చెబుతుంది.

"మానవ కుటుంబంలోని సభ్యులందరిలోని గాంభీర్యము (Dignity), సమానమైన మరియు అనన్య సంక్రమణం కాని (Inalienable) హక్కులు, ప్రపంచంలో స్వేచ్ఛ, న్యాయం మరియు శాంతికి పునాది అని గుర్తించి,

ప్రస్తుతం, యిప్పుడు

సాధారణ సభ (The General Assembly) యిలా ప్రకటిస్తున్నది, మానవ హక్కులు (ప్రకటన) మానవులందరి, దేశాలన్నీ సాధించాల్సిన సాధారణ ప్రమాణముగా ఉండేటట్లు, యీ ప్రకటనను ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకొని ప్రతివ్యక్తి యొక్క, సమాజములోని ప్రతిభాగము యొక్క ప్రయోజనం మేరకు, సమితి సభ్యదేశాల ప్రజల మధ్య, దాని పరిధిలోని ప్రదేశాల ప్రజల మధ్య, ప్రకటన సార్వత్రిక మరియు సత్ఫలిత గుర్తింపు, పరిశీలనకొరకు, జాతీయ-అంతర్జాతీయ స్థాయిలో అభ్యుదయ కృషిలచేత, బోధన మరియు విద్యద్వారా పాటుబడుటకు కృషి చేయవలెను".

తదుపరి, సమితి సభ్యదేశాలన్నిటింలో మానవ హక్కుల పరిరక్షణకోసం, పెక్కు అంతర్జాతీయ ఒప్పందాలు చేయబడ్డాయి. మానవ హక్కుల ముఖ్యమైన మూడు లక్షణాలు పేర్కొనబడ్డాయి.

1. వ్యక్తి చిత్తశుద్ధిని ధిక్కరించు ప్రభుత్వ చర్యల నుండి స్వేచ్ఛా హక్కు ఉండాలి. చిత్రహింస, క్రూరత్వం, అమానుషత్వం కించపరిచే లేక అవమానపరిచేదిగా చూడటం లేక శిక్ష - యివన్నీ ధిక్కారము క్రిందకే వస్తాయి. ఇంకా స్వచ్ఛమైన / స్వేచ్ఛతోగూడిన బహిరంగ / పబ్లిక్ విచారణ (Trial) మరియు గృహముపై దండయాత్రలు గూడ యీ కోవకే చెందుతాయి.

2. తిండి, నీడ (Shelter) ఆరోగ్య జాగ్రత్త మరియు విద్యలాంటి ప్రముఖ / కనీస అవసరాలు తీర్చబడే హక్కు ఉంటుంది. అవసరమున్న వర్గాలకు అందకుండా కొందరి / కొన్ని వర్గాలకే వనరులను మళ్ళించడం యీ హక్కుధిక్కారము క్రిందకే వస్తుంది.

3. పౌర మరియు రాజకీయ హక్కులను అనుభవించే హక్కు ఉండాలి / ఉంటుంది.

చాలా దేశాలు మానవ హక్కుల కమీషన్‌లను ఏర్పాటు చేశాయి. సమితి నియమించిన కమీషన్ జెనివాలో ఉంటుంది. ఈ హక్కుల పరిరక్షణకొరకు, చాలా స్వచ్ఛంద మరియు ప్రభుత్వేతర సంస్థలు, అంతర్జాతీయ సర్వక్షమ (Amnesty International) సంస్థలాంటివి పోరాడుతున్నవి. అయినప్పటికీ సంక్షోభవచ్చింది / ఏర్పడింది. ఒక విషవలయమైనది. ఒకవైపు మిలిటెంట్లు, టెర్రరిస్టులు, అమాయకులైన స్త్రీ, బాల, వృద్ధులను చంపుతున్నారు. మరొకవైపు కొన్ని ప్రభుత్వాలు సంత్రాసవాదిగా (మిలిటెన్సీ మరియు Terrorisms) భావించి / అనుమానించి క్రూరంగా చంపటం మరియు చిత్రహింసలు పెట్టి దారుణంగా చూడటం చేస్తున్నాయి. ప్రజలు సంత్రాసవాదము మరియు రాజ్యసంత్రాస వాదముల మధ్య నలిగిపోతున్నారు.

ప్రస్తుతం భారతదేశంలో నివశిస్తున్న టిబెట్ ఆధ్యాత్మిక నాయకుడు / గురువు మనకు మన (మానవ) ఉన్నత ఆదర్శాలను గుర్తుచేస్తారు.

BRAOU

"ఏ దేశం లేక ఏ ఖండం నుండి వచ్చినా, మనందరికీ అవసరాలున్నాయి (సమానంగా). మన జాతి, మత, లింగ లేక రాజకీయ స్థాయి / హోదాతో సంబంధం లేకుండా మనందరము సుఖాన్ని వెదుక్కుంటాము మరియు బాధలను తొలగింపచూస్తాము. సరిగా చెప్పాలంటే, మానవులకు సంతోషాన్ని వెతుక్కోటానికి మరియు శాంతి, స్వేచ్ఛలలో నివశించే హక్కు ఉంటుంది. స్వేచ్ఛా మానవులుగా, మనలను మరియు మన ప్రపంచాన్ని అర్థం చేసికొనుటకు మన విశిష్టమైన మేధస్సును ఉపయోగించాలి".

## 12.5 బాధ్యతలు / విధులు (Duties)

హక్కులు మరియు విధులు, ఒకదానితో మరొకటి దగ్గరి సంబంధం కల్గి ఉంటుంది. ప్రతి హక్కుతోనూ, ఏదోఒకటి చెయ్యాలి లేదా చేయ్యకూడదు అన్నబంధం (Obligation) ముడిపడి ఉంటుంది. ఈ బంధమే విధి లేక బాధ్యత. కలుపుగోలుతనము మరియు ఇరుగుపొరుగు తనము పెంపొందించుటకు, ప్రతివ్యక్తి మిగిలిన వారిని మనస్సులో నుంచుకొన్నట్లుగా ప్రవర్తించాలి. ప్రతివ్యక్తి తన స్వంత ప్రయోజనాలు సమాజపు మొత్తం ప్రయోజనాలకు భంగం కలుగకుండా మసలుకోవాలి.

హక్కులు మాదిరిగానే విధులుకూడా రెండు రకాలు : నైతికమైనవి మరియు చట్టబద్ధమైనవి. వ్యక్తులు తమ తల్లిదండ్రులకు, పెద్దలకు, గౌరవము, సహకారమివ్వడం మొదలైనవి నైతిక విధులు. నైతిక విధులు నైతిక బంధాన్ని తెల్పుతాము. నైతిక విధుల ధిక్కారము శిక్షార్హము కాదు. కాని సమాజపు స్థాయి/హోదాక్రమేపీ దిగజారి, సాంఘిక విలువలు అదృశ్యమౌతాయి. చట్టబద్ధ ప్రత్యేకతమైనవి, నిర్దిష్టమైనవి, వాటి ధిక్కారము శిక్షార్హము. పన్నులు చెల్లించుట, రాజ్యమునకు తన విధేయత / విశ్వాసమును తెల్పుతూ ప్రతివారూ పౌరునిలా తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చటం, చట్టబద్ధ హక్కుల కోవకే చెందుతాయి. స్టాలిన్ రాజ్యాంగం 1936లోనూ, భారతదేశ రాజ్యాంగం 1976లోనూ చెప్పినట్లు, ఒక్కొక్కప్పుడు, కొన్ని ప్రాథమిక విధులు రాజ్యాంగంలో పొందుపరచబడతాయి. ఎందుకంటే, ప్రాథమిక విధులు కూడా ప్రాథమిక హక్కులతోనే కలసి వుంటాయి.

కొన్నివిధులను నైతిక మరియు చట్టబద్ధ విధులుగా విభజించలేము. పోలీసుతో సహకరించటం లేక పోలీసులకు సహాయం చేయటం అనేది ఖచ్చితంగా ఏకోవకు చెందుతుందో చెప్పలేము. ఉదార రాజ్యాంగాలు చాలా వరకు ప్రాథమిక విధులకన్న ప్రాథమిక హక్కుల గూర్చి ప్రత్యేకంగా / నిర్దిష్టంగా ఉంటాయి.

హక్కుల మరియు విధులు నాణెమునకు రెండు ప్రక్కలులాంటివి. అందువలననే, 'హక్కును గూర్చి చెప్పినే మాట, మరొక రూపంలో విధిని గూర్చి చెప్పిన మాటే అవుతుందని' అంటారు. ఇంకా సరిగ్గా చెప్పాలంటే, ఎవరికి వారికి సంబంధించినది హక్కు, అదే మరొక దృష్ట్యా చెబితే విధి, L.T. Hobhouse యిలా వ్రాస్తాడు.

హక్కులు మరియు విధులు సాంఘిక సంక్షేమ పరిస్థితులు లేక సయోధ్య కొరకు గల పరిస్థితులు. యిలాంటి పరిస్థితిలో ప్రతి సమాజ సభ్యుడు రెండురకాల సంబంధాలతో ఉంటాడు. ఒకటి తన పాత్ర నిర్వహించటం, యిది తన హక్కుల మొత్తం. రెండోది (సమాజ సంక్షేమానికి) తనవంతు కృషిసల్పాలి, యిది తన విధుల మొత్తం. హక్కులు, మనం మరొకరి నుంచి, మరొకరు మననుంచి ఆశించేవి మరియు అన్నిసరియైన హక్కులు సాంఘిక సంక్షేమం కొరకుగల పరిస్థితులు".

పౌరసత్వము : ఏదేశములో పుట్టినవారు ఆదేశపు సమాజపౌరులు అనగా వారి పౌరసత్వము సహజమైనది, కనుక వారు పౌర మరియు రాజకీయ హక్కులను కల్గి వుంటారు. ఒకదేశంలో పుట్టి మరొక దేశంలో నివశించేవారిని 'విదేశీయులు' అంటారు. వారికి ఓటు హక్కు, ఎన్నికలలో పోటీచేయు హక్కు, పబ్లిక్ హోదాను కల్గివుండే హక్కు, మొదలైన రాజకీయ హక్కులుండవు. కానీ జీవించే హక్కు, వ్యక్తి స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, దేశంలో ఏ ప్రదేశంలోనైనా నివశించే హక్కు, నివాసం మార్చే హక్కు మొదలైన పౌరహక్కులను మాత్రం కల్గివుండవచ్చు. పౌరుడు తన దేశానికి విధేయత కల్గివుండాలి. మరియు యీ మేరకు ప్రతి పౌరుడు అన్నివిధాల కృషి చేయాలి. లాస్కీ చెప్పినట్లు, "పౌరుడు అంటే సంఘ శ్రేయస్సును గూర్చి తమ (ప్రతివారి) కృషిని గూర్చి వున్న అంతరాత్మ తీర్పు", పౌరసత్వమనగా ప్రతివ్యక్తి యొక్క పూర్తి, బాధ్యతతో గూడిన రాజ్య / సంఘ సభ్యత్వం.

ప్రస్తుతకాలంలో పౌరసత్వం యొక్క అంతర్భావము యిలా ఉంటుంది.

1. ఒక (ప్రతి) వ్యక్తికి, కుటుంబం, తెగ, కమ్యూనిటీ, అనేక సాంఘిక సమూహాలు / సంసర్గాలు, రాజ్యము, ప్రపంచము - వీటికి తన విధేయత ఉంటుంది. ప్రతివారు రాజకీయ కమ్యూనిటీకి ఉత్సాహవంతమైన, వివేకవంతుడైన సభ్యుడుగా తయారవుటకు ఆవిధేయతలను క్రమబద్ధం మరియు సర్దుబాటు చెయ్యటమే పౌరసత్వం కోరుతుంది.

2. పౌరసత్వమనేది, తన స్వంత మరియు సంఘపరమైన అభివృది, శ్రేయస్సు కొరకు వుత్సాహవంతమైన పాత్ర వహించటం / వుత్సాహంగా కార్యకలాపాల్లో పాల్గొనటం.

3. పౌరసత్వ భావన సంవర్ధకంగా (Positive) మరియు సమగ్రంగా (Comprehensive) తయారయినది. అది విస్తృతమౌతున్న స్వభావం కలదేశభక్తి. దానిలో మానవత మొత్తం శాంతి, ప్రగతి పొందుటకు ప్రతివారు, ప్రతిదినం పాటుపడుట అనేది వున్నది.

B R A O U

## 12.6 క్లుప్తంగా

ప్రస్తుతకాలపు ప్రపంచం, పౌరుల అనేక / భిన్నరకాల హక్కులను కాపాడుటకు ప్రయత్నిస్తుంది. ప్రజలకు మంచి పాలన యిచ్చుటలో, ప్రాథమిక హక్కులను, సాంఘిక, ఆర్థిక హక్కులను మరియు మానవ హక్కులను విస్తృతపరిచే పరిధి / అవకాశం ఉంది. ప్రజల హక్కులను కాపాడాలన్న అవసరాన్ని గుర్తించాల్సిన పరిస్థితి సామ్యవాద / కమ్యూనిస్టు దేశలకు కూడా కల్గినది. ఈ క్రొత్తపోకడ యొక్క ముఖ్య లక్షణమేమిటంటే, ప్రతి రాజ్యము, ఉదార లేక సామ్యవాద లేక మరే స్వభావంతో ఉన్నప్పటికీ మానవహక్కులను పరిరక్షించాల్సిన అవసరముంది. అవిధంగా అవసరమైన మార్పులను తీసికొనిరావటానికి, ప్రజాస్వామ్యాలను కార్యసాధకమైనవిగా తయారుచేసే, ప్రజాస్వామ్య సాంప్రదాయలను పటిష్ట పరచగల్గుతాయి.

## 12.7 చదవవదగిన పుస్తకాలు


| | | |
|---|---|---|
| A.C. Kapoor | : | Principles of Political Science |
| J.C. Johari | : | Foundations of Political Science |
| J.C. Johari | : | Contemporary Political Theory |

## 12.8 నమూనా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. హక్కులు అనగానేమి ? హక్కుల భిన్నరకాలు ఏవి ?
2. హక్కులు మరియు విధులు ఎలా అంతర్గత సంబంధాలు కల్గి ఉన్నవి ?

**II. 10 పంక్తులలో జవాబులిమ్ము.**

1. హక్కులు మరియు విధులు
2. మానవ హక్కులు

**రచయిత : బి.యస్.ఆర్. ఆంజనేయులు**

BRAOU

# ఖండం:IV

# ప్రభుత్వరకాలు

BRAOU

BRAOU

# భాగం-13 : రాజ్యాంగాలు - రకాలు - సవరణ పద్ధతులు

## విషయ సూచిక

13.0 లక్ష్యాలు
13.1 పరిచయం
13.2 రాజ్యాంగం - అర్థం, నిర్వచనం
13.4 ఉత్తమరాజ్యాంగం - ముఖ్యలక్షణాలు
13.5 రాజ్యాంగం - రకాలు
13.5.1 లిఖిత, అలిఖిత రాజ్యాంగాలు
13.5.2 దృఢ, సరళ రాజ్యాంగాలు
13.6 సవరణ పద్ధతులు
13.6.1 బ్రిటన్
13.6.2 అమెరికా
13.6.3 ఇండియా
13.6.4 స్విట్జర్లాండ్
13.7 క్లుప్తంగా
13.8 చదువదగినా పుస్తకాలు
13.9 నమూనా ప్రశ్నలు

BRAOU

## 13.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- రాజ్యాంగం యొక్క అర్థాన్ని, స్వభావాన్ని తెలుసుకోగలరు.
- రాజ్యాంగం అవసరాన్ని వివరించగలరు
- వివిధ రాజ్యాంగాల లక్షణాలను, ప్రయోజనాలను, లోపాలను విశదీకరించగలరు.
- వివిధ రాజ్యాంగాల సవరణ పద్ధతులను వివరించగలరు.

## 13.1 పరిచయం

ఆధునిక రాజ్యం యొక్క ముఖ్యలక్షణం ఒక రాజ్యాంగాన్ని అనుసరించటం, ప్రజాప్రతినిధులచే రూపొందింపబడిన రాజ్యాంగాన్ని ఆధారంగా చేసికొని ఒకదేశ ప్రభుత్వ నిర్వహణ జరుగవలెననే సూత్రం

ప్రజాస్వామ్య విప్లవాల ఫలితంగా రూపుదిద్దుకొన్నదని చెప్పవచ్చును. రాజ్యాంగతావాదం మొట్టమొదటిసారి అమెరికాలోని ఫిలిడెల్ఫియా రాజ్యాంగ సభద్వారా వ్యక్తీకరించబడింది. అమెరికాకు చెందిన ప్రాథమిక రాష్ట్రాల (Original States) ప్రతినిధులు ఒక రాజ్యాంగాన్ని రూపొందించటానికి యిచట సమావేశం కావటం జరిగింది. అవిధంగా ఒక లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించటం ద్వారా అమెరికా ఆధునిక రాజ్యాంగతా వాదానికి నాంది పలికిందని చెప్పవచ్చు. ఆతరువాత కాలంలో అనేక రాజ్యాలు అదేబాటలో లిఖిత రాజ్యాంగాలను రూపొందించకొని అనుసరించినాయి. ఫ్రెంచి విప్లవం కూడా రాజ్యాంగతావాదం అభివృద్ధి చెందటానికి దోహదపడింది. ఒకరాజ్య నిర్వహణలో రాజ్యాంగం యొక్క రాజకీయ ప్రాధాన్యతను ప్రజలు కూడా గుర్తించడం మొదలు పెట్టినారు. దానితో అన్ని ప్రజాస్వామిక దేశాలు రాజ్యాంగ సభలు రూపొందించే రాజ్యాంగాలను అనుసరించటం ఆరంభమైంది.

## 13.2 రాజ్యాంగం - అర్థం, నిర్వచనం

రాజ్యాంగాన్ని వివిధ రచయితలు వివిధ రకాలుగా నిర్వచించినారు. రాజనీతి శాస్త్ర పితామహుడు అరిస్టాటిల్ రాజ్యాంగముచే "రాజ్యం తన కోసం ఎన్నుకున్న జీవిత విధానం" అని నిర్వచించినారు. కె.సి. వేర్ అభిప్రాయంలో 'ప్రభుత్వాధికారాల లక్ష్యాలను క్రమబద్ధీకరించి, వాటిని సాధించటానికి అవసరమైన ప్రభుత్వాంగాలను నిర్దేశించే నియమాల సమూహాన్నే రాజ్యాంగమ"ని చెప్పవచ్చును. "ప్రభుత్వ వ్యవస్థీకరణను, ప్రభుత్వాంగాల మధ్యే అధికారాల పంపిణీని, అటువంటి అధికారాలను చెలాయించటానికి అవసరమైన నియామలను నిర్వయించినటువంటి లిఖిత లేదా అలిఖిత సూత్రాల సముదాయాన్నే రాజ్యాంగమ'ని గిల్‌క్రిస్తు అభిప్రాయపడినాడు. సి.ఎఫ్. స్ట్రాంగ్ మాటలలో "ప్రభుత్వాధికారాలను, పౌరుల హక్కులను ప్రభుత్వానికి, పౌరులకు మధ్యనున్న సంబంధాన్ని తెలియజేసే సూత్రాల సముదాయాన్నే రాజ్యాంగమ"న వచ్చును.

ఈ పై నిర్వచనాలను బట్టి రాజ్యాంగమనేది ఒక రాజ్యం యొక్క ప్రభుత్వ వ్యవస్థీకరణను నిర్ణయిస్తుంది. ప్రభుత్వాంగాల స్వరూప స్వభావాలను, వాటి అధికారాలను, వాటి మధ్యనున్న పరస్పర సంబంధాలను రాజ్యాంగం వివరిస్తుంది. రాజ్యం యొక్క కార్యకలాపాలను, ప్రభుత్వపాలనా యంత్రాంగాన్ని రాజ్యాంగం క్రమబద్ధీకరిస్తుంది. రాజ్యాధికారాలను, ప్రభుత్వానికి ప్రజలకు మధ్యనున్న సంబంధాన్ని - అంటే ప్రజల హక్కులు, బాధ్యతలను అది వివరిస్తుంది. ఆవిధంగా రాజ్యాంగమనేది ఒక రాజ్యం యొక్క మౌలిక శాసనంగా పరిగణింపబడుతుంది. రాజ్యాంగం కొన్ని సమయాలలో ఒకే లిఖిత పత్రంగా యుండవచ్చు లేదా అది కొన్ని పత్రాల సముదాయంగా కూడ యుండవచ్చు. అదేవిధంగా రాజ్యంగమనేది భారతరాజ్యాంగంవలె విపులంగా యుండవచ్చు లేదా అమెరికా రాజ్యాంగంవలె సంక్షిప్తంగా యుండవచ్చు. రాజ్యాంగ మౌలిక సూత్రాలు లిఖిత రూపంలో యుండవచ్చు లేదా రాజ్యాంగ సాంప్రదాయాలు, ఆచారాల పేరుతో అలిఖిత రూపంలో కూడ యుండవచ్చు.

BRAOU

## 13.3 రాజ్యాంగం - ఆవశ్యకత

19వ శతాబ్దంలో అన్ని ప్రజాస్వామ్య రాజ్యాలలో ప్రతిరాజ్యానికి ఒక రాజ్యాంగం అవసరమన్న వాదన బలపడింది. రాజ్యాంగంలో పొందుపరచబడిన మౌలిక సూత్రాలననుసరించే ప్రభుత్వ నిర్వహణ జరగాలి. రాజ్యాంగం లేని రాజ్యం అరాచకంపాలౌతుంది. క్రమబద్ధమైన సామాజిక , రాజకీయ జీవనం ఒక్క రాజ్యాంగం

ద్వారానే అభివృద్ధి చెందుతుంది. ఆవిధంగా రాజ్యాంగతావాదం ప్రజాస్వామ్యానికి పునాదిగా పరిగణింపబడింది. రాజ్యాంగం వలన ఈ క్రింది లాభాలుంటాయి.

1. రాజ్యాంగం ద్వారా ప్రభుత్వాధికారాలపై కొన్ని పరిమితులను విధించవచ్చు. పాలకులు, పాలితులపై రాజ్యాంగం కొన్ని పరిమితులను విధిస్తుంది. కాబట్టి రాజ్యాంగతావాదం అంటే పరిమిత ప్రభుత్వమని అర్థం.

2. రాజ్యాంగం ప్రభుత్వ వ్యవస్థీకరణను గురించి తెలియజేస్తుంది. ప్రభుత్వాంగాలు, వాటి అధికారాలను రాజ్యాంగం నిర్దేశిస్తుంది. అందువలన ప్రభుత్వ కార్యకలాపాలలో ప్రతిరూపణను (Duplication) అయోమయ పరిస్థితిని అది నివారిస్తుంది.

సి.ఎఫ్. స్ట్రాంగ్ అభిప్రాయంలో రాజ్యాంగం మూడు ముఖ్యమైన విషయాలను విశదీకరిస్తుంది. మొదటిది వివిధ సంస్థలు ఏవిధంగా వ్యవస్థీకరించబడ్డాయి. రెండవది ఆ సంస్థలకు ఎటువంటి అధికారాన్ని యివ్వాలి. మూడవది అటువంటి అధికారాలను ఏవిధంగా చెలాయించాలి.

## 13.4 ఉత్తమ రాజ్యాంగం - ముఖ్య లక్షణాలు

ఉత్తమ రాజ్యాంగానికి కొన్ని లక్షణాలుండాలి. అవి

1. రాజ్యాంగం స్పష్టంగాను, నిర్దిష్టంగాను యుండాలి. రాజ్యాంగంలో ఉపయోగించే భాష అస్పష్టంగా యుంటే, రాజ్యాంగానికి విభిన్న అర్థాలు చెప్పటం జరుగుతుంది. తద్వారా సంఘర్షణలకు, సందిగ్ధతకు అవకాశం యుంటుంది.

2. రాజ్యాంగం విపులంగా యుండాలి. ప్రభుత్వాధికారాలను చెలాయించే వివిధ సంస్థలను గురించి స్పష్టంగా వివరణయుండాలి.

3. మంచి రాజ్యాంగమనేది అనవసర విషయాల వివరణతో కూడి యుండరాదు. విపులరాజ్యాంగం ప్రభుత్వం మీద ప్రజల అపనమ్మకాన్ని సూచిస్తుంది. అటువంటి రాజ్యాంగం వివాదాలకు దారితీస్తుంది. మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులవలన రాజ్యాంగాన్ని తరుచుగా సవరించవలసి వస్తుంది. ఎక్కువ సవరణలవలన రాజ్యాంగం పవిత్రత దెబ్బతింటుంది.

4. ఉత్తమ రాజ్యాంగానికి స్థిరత్వంతోపాటు కొంత సరళత్వం కూడా యుండాలి. రాజ్యాంగం రాజ్యంలో స్థిరత్వాన్ని చేకూర్చుతూ, ఆదే సమయంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మార్పుచెందే స్వభావం కలిగియుండాలి. ఆవిధంగా యున్నప్పుడే అది ప్రజల మన్ననను పొందగలుగుతుంది.

5. ఉత్తమ రాజ్యాంగంలో దానిని సవరించటానికి అవసరమైన సవరణ పద్ధతిని కూడ పొందుపరచాలి. ఈ సవరణ పద్ధతి స్థిరత్వానికి, సరళత్వానికి మధ్యే మార్గంగా యుండాలి.

ఈ పై లక్షణాలను కలిగిన రాజ్యాంగం ఒకమంచి రాజ్యాంగంగా పరిగణింపబడుతుంది.

BRAOU

## 13.5 రాజ్యాంగం - రకాలు

### 13.5.1. లిఖిత, అలిఖిత రాజ్యాంగాలు

రాజ్యాంగాలను లిఖిత, అలిఖిత రాజ్యాంగాలుగా వర్గీకరిస్తారు. రాజ్యాంగం యొక్క మౌలిక సూత్రాలను ఒకటి లేదా రెండు, మూడు పత్రాలలో లిఖితరూపంలో పొందు పరిస్తే దానిని లిఖిత రాజ్యాంగమంటారు. అటువంటి రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్‌కాని లేదా రాజ్యాంగ నిర్మాణ సభకాని ఒక నిర్ణీత కాలపరిధిలో తయారు చేస్తుంది. ఉదాహరణకు ఇండియా, అమెరికా రాజ్యాంగాలు. కాని కొన్ని సమయాలలో రాజ్యాంగానికి సంబంధించిన పత్రాలు వివిధరకాలలో కూడ రూపొందింపబడవచ్చు. ఉదాహరణకు ఫ్రాన్సు, ఆస్ట్రియా రాజ్యాంగాలు. లిఖిత రాజ్యాంగమనేది ముఖ్యంగా మూడు లక్షణాలు కలిగియుండాలి. అవి. (1) పౌరుల ప్రాథమిక, పౌర, రాజకీయ హక్కులు రాజ్యాంగంలో పొందుపరచబడియుండాలి. 2) ప్రభుత్వ వ్యవస్థీకరణకు సంబంధించిన విషయాలు వివరించబడియుండాలి. 3) రాజ్యాంగ సవరణ పద్ధతి విశదీకరించబడి యుండాలి. లిఖిత రాజ్యాంగం దేశంలో అత్యున్నత శాసనంగా పరిగణించబడుతుంది.

అలిఖత రాజ్యాంగంలో, రాజ్యాంగం యొక్క మౌలిక సూత్రాలు ఒక పత్రంగాకాని లేక కొన్ని పత్రాల సముదాయంగాకాని లిఖిత రూపంలో వ్రాయబడియుండవు. రాజ్యాంగానికి సంబంధించిన ముఖ్యసూత్రాలు రాజ్యాంగ సాంప్రదాయాలు, ఆచారాలు, న్యాయనిర్ణయాలు, పార్లమెంటు రూపొందించిన ప్రాథమిక శాసనాల రూపంలో ఉంటాయి. అలిఖిత రాజ్యాంగమనేది చారిత్రక పరిణామం ఫలితంగా ఏర్పడుతుంది. ఒక నిర్ణీత కాలంలో రాజ్యాంగ నిర్మాణ సభ దీనిని తయారుచేయదు. బ్రిటిష్ రాజ్యాంగం అలిఖిత రాజ్యాంగానికి ఒకమంచి ఉదాహరణ. అలిఖిత రాజ్యాంగం యున్న రాజ్యంలో రాజ్యాంగ నిర్మాణ సభకు, శాసనసభకు తేడా యుండదు. శాసనసభే రాజ్యాంగాన్ని సాధారణ శాసనసభ సవరించిన విధంగా సవరించగలదు.

BRAOU

#### లిఖిత రాజ్యాంగం - ప్రయోజనాలు

లిఖిత రాజ్యాంగం వలన క్రింది ప్రయోజనాలను పొందవచ్చు. అవి :

1. లిఖిత రాజ్యాంగాన్ని జాగ్రత్తగా తయారుచేయవలెను. అది స్పష్టంగాను, నిర్దిష్టంగాను యుంటుంది.

2. లిఖిత రాజ్యాంగాన్ని ప్రజల ఆవేశకావేషాలను బట్టి సులువుగా మార్చటానిక వీలుపడదు. అంతేగాక లిఖిత రాజ్యాంగం శాసనసభ నియంతృత్వాన్ని తట్టుకొని నిలబడగలుగుతుంది. అధికారపార్టీ అభీష్టం మేరకు రాజ్యాంగాన్ని మార్చటానికి వీలుండదు.

3. లిఖిత రాజ్యాంగం స్థిరత్వాన్ని కలిగియుంటుంది. అది తరుచుగాను, తొందరపాటుతనంతోను సవరించటానికి వీలుకాదు.

4. లిఖిత రాజ్యాంగం పౌరుల ప్రాథమిక హక్కులను, స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. ప్రభుత్వం యొక్క నిరంకుశ అధికారాన్ని అది నిర్ధేశిస్తుంది.

5. అల్ప సంఖ్యాక వర్గాల వారి ప్రయోజనాలకు లిఖిత రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది.

6. లిఖిత రాజ్యాంగంలో వివిధ ప్రభుత్వాంగాల అధికారాలు స్పష్టంగా వివరించబడి ఉంటాయి. కాబట్టి వాటి మధ్య వివాదాలు ఏర్పడటానికి అవకాశం యుండదు.

7. లిఖిత రాజ్యాంగం ప్రజల యొక్క ఆశయాలను, ప్రయోజనాలను ప్రతిబింబిస్తుంది. అది రాజ్యాంగ నిర్మాతల యొక్క వివేకాన్ని ప్రాతిపదికగా చేసికొని రూపొందింపబడుతుంది.

**లిఖిత రాజ్యాంగం - లోపాలు**

లిఖిత రాజ్యాంగం వలన పైన పేర్కొన్న ప్రయోజనాలున్నప్పటికి, దీనిలో కొన్ని లోపాలు కూడ లేకపోలేదు. అవి :

1. ఒకజాతి ఆదర్శాలన్నింటిని ఒక పత్రంలో పొందుపరచటానికి లిఖిత రాజ్యాంగం ప్రయత్నిస్తుంది. ఇది గార్నర్ చెప్పినట్లు, ఒకవ్యక్తి భవిష్యత్ పెరుగుదలను, మార్పులను దృష్టిలో పెట్టుకోకుండా దుస్తులను తయారుచేసినట్లు ఉంటుంది.

2. లిఖిత రాజ్యాంగాన్ని సవరించటం చాలా కష్టంతో కూడుకుని యుంటుంది. కాబట్టి మారుతున్న జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చటం అంతసులభంకాదు. అందువలన అదికొన్ని సమయాలల్లో హింసాయుతమైన విప్లవాలకు దారితీయవచ్చు.

3. లిఖిత రాజ్యాంగమనేది కాలక్రమంలో, మారిన పరిస్థితులకు అనుగుణంగా లేని ఒక సనాతన పత్రంగా మిగిలిపోతుంది. రాజకీయ ప్రగతికి, అభివృద్ధికి అది ఒక అవరోధంగా పనిచేస్తుంది.

4. లిఖిత రాజ్యాంగం ప్రకారం శాసనసభ రూపొందించిన శాసనాలు రాజ్యాంగానికి అనుగుణంగా యున్నది. లేనిది నిర్ణయించే అధికారం న్యాయశాఖకు దఖలు చేయబడుతుంది. కాని సాధారణంగా న్యాయమూర్తులు సనాతన వాదులుగాను, సాంప్రదాయవాదులుగాను ఉంటారు. అందువలన వారు శాసనాలలో పొందుపరచబడిన అక్షరాలకు తప్ప శాసనాల యొక్క స్ఫూర్తికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వరు. కాబట్టి లాస్కీ అభిప్రాయపడినట్లు శాసనసభ అధికారాన్ని అధిగమించే అధికారం న్యాయమూర్తులకు యివ్వడమంటే రాజ్యంలో న్యాయమూర్తులను నిర్ణయాత్మక శక్తులుగా రూపొందించటమే.

**అలిఖిత రాజ్యాంగం - ప్రయోజనాలు**

అలిఖిత రాజ్యాంగం వలన ఈ క్రింది ప్రయోజనాలను పొందవచ్చును. అవి

1. అలిఖిత రాజ్యాంగం మారుతున్న సమాజం అవసరాలకు అనుగుణంగా మారుతూ యుంటుంది. ఇది సరళమైనది కాబట్టి, సంక్షోభ సమయాలలో చాలా అనువైనది. వేగవంతమైన సామాజిక మార్పులకు ఇది వీలు కల్పిస్తుంది.

2. అలిఖిత రాజ్యాంగం సర్దుకుపోయే తత్వాన్ని (Elasticity) కలిగియుంటుంది. అందువలన ప్రజాభిప్రాయానికి తగినట్లు మార్పులు, చేర్పులు చేయవచ్చు. కారణంగా రాజ్యాంగానికి వ్యతిరేకంగా విప్లవాలు, హింసాయుత ఉద్యమాలు రాకుండా ఇది నిరోధిస్తుంది.

BRAOU

3. ఒక నియమిత కాలంలో రాజ్యాంగాన్ని ఒక లిఖిత పత్రంగా రూపొందించే ప్రమాదం నుండి అలిఖిత రాజ్యాంగం తప్పిస్తుంది. అంటే కాలానుగుణంగా అభివృద్ధి చెందటానికి అలిఖిత రాజ్యాంగం అవకాశం యిస్తుందని అర్థం.

4. లార్డ్ బ్రైస్ అభిప్రాయంలో అలిఖిత రాజ్యాంగం అత్యవసర పరిస్థితులకు అనువైనది. అత్యవసర పరిస్థితులలో అది కొన్నిమార్పులకు లోనైనప్పటికి, అవి తొలగిపోగానే అలిఖిత రాజ్యాంగం తన సహజ రూపానికి తిరిగి రాగలుగుతుంది.

5. సాంప్రదాయ పద్ధతులకు, సనాతన భావాలకు ప్రాధాన్యమిచ్చే ప్రజలకు అలిఖిత రాజ్యాంగం చాలా అనువైనది.

**అలిఖిత రాజ్యాంగం - లోపాలు**

అలిఖిత రాజ్యాంగంలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి, అవి :

1. అలిఖిత రాజ్యాంగం యొక్క ముఖ్య లోపం అస్థిరత్వం రాజకీయ పార్టీలు మరియు వ్యక్తుల యొక్క ప్రయోజనాలకు అనుగుణంగా దీనిని మార్చటానికి అవకాశం యుంటుంది. ఈ కారణంగా అలిఖిత రాజ్యాంగం నీతి బాహ్యము, అత్యాశగల రాజకీయ నాయకుల చేతిలో తమ స్వప్రయోజనాలను తీర్చుకునే ఒక సాధనంగా మారిపోతుంది.

2. అలిఖిత రాజ్యాంగమనేది న్యాయస్థానాల చేతిలో ఒక ఆటవస్తువుగా మారిపోతుంది. అలిఖిత రాజ్యాంగానికి అర్థవివరణ చేయటం ద్వారా న్యాయస్థానాల ప్రాధ్యానం పెరుగుతుంది.

3. రాజ్యాంగ శాసనానికి, సాధారణ శాసనానికి మధ్యనున్న భిన్నత్వాన్ని అలిఖిత రాజ్యాంగం గుర్తించదు. రాజ్యాంగాన్ని కూడా సాధరణ శాసనాలవలె పార్లమెంటు సవరించగలుగుతుంది. కాబట్టి పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో పార్లమెంటులో మెజారిటి కలిగిన పాలకవర్గం తొందరపాటుతనంతో రాజ్యాంగంలో మార్పులు చేయటానికి అవకాశం కలుగుతుంది. ఫలితంగా పార్లమెంటు, న్యాయశాఖల మధ్య సంఘర్షణ తలెత్తే ప్రమాదముంది.

4. ఆధునిక ప్రజాస్వామ్యాలకు అలిఖిత రాజ్యాంగం అనువైదికాదు. కులీన వర్గాలతో కూడిన సమాజాలకే అది అనుకూలమైనది.

5. అలిఖిత రాజ్యాంగం సక్రమంగా పనిచేయ్యాలంటే ప్రజలలో రాజకీయ పరిజ్ఞానం, జాగరూకత ఉండాలి. అప్పుడే ప్రభుత్వము యొక్క అధికార దుర్వినియోగాన్ని ప్రజలు నిలువరించగలరు. అంతేగాక అలిఖిత స్థిరత్వాన్ని కలిగించగలదనే నమ్మకం కూడలేదు.

రాజ్యాంగాలను లిఖిత, అలిఖిత రాజ్యాంగాలుగా వర్గీకరించటం సమంజసం కాదని విమర్శకులు అభిప్రాయపడినారు. ఏ రాజ్యాంగము పూర్తిగ లిఖితమైందికాని, లేదా పూర్తిగా అలిఖమైనది కానికాదు. ప్రతి లిఖిత రాజ్యాంగంలో కొంతవరకు అలిఖిత రూపంలో యున్న రాజ్యాంగ సాంప్రదాయాలుంటాయి. అదేవిధంగా అలిఖిత రాజ్యాంలో కూడ కొంత వరకు లిఖిత రూపంలోయున్న అంశాలుంటాయి. కాబట్టి లిఖిత రాజ్యాంగానికి, అలిఖిత రాజ్యాంగానికి మధ్యనున్న తేడా పరిమాణానికే (Degree) తప్పరకానికి (Kind) సంబంధించనది కాదని చెప్పవచ్చు. ఉదాహరణకు అలిఖిత రాజ్యాంగమైన బ్రిటిష్ రాజ్యాంగంలో

BRAOU

మాగ్నాకార్టా (1215), హక్కుల విజ్ఞాపన పత్రం (1628) మరియు హక్కుల పత్రం (1689) వంటి లిఖిత పత్రాలు కూడ ఉన్నాయి. అదేవిధంగా లిఖిత రాజ్యాంగం పార్లమెంటులో మెజారిటి రాజకీయ పక్షానికి చెందిన నాయకున్ని ప్రధానమంత్రిగా నియమించటం, పార్లమెంటుకు మంత్రి మండలి బాధ్యత వహించటం వంటి రాజకీయ సాంప్రదాయాలను కలిగియుంటుంది. కాబట్టి రాజ్యాంగాలను లిఖిత, అలిఖిత రాజ్యాంగాలుగా వర్గీకరించటమనేది అశాస్త్రీయమైనదేగాక, సందేహాస్పదమైనదని చెప్పవచ్చును.

### 13.5.2. దృఢ, సరళ రాజ్యాంగాలు

లార్డ్‌బ్రైస్ రాజ్యాంగాలను దృఢ, సరళ (అదృఢ) రాజ్యాంగాలుగా విభజించినాడు. రాజ్యాంగశాసనానికి, సాధారణ చట్టానికి మధ్యేయున్న సంబంధం ఈ వర్గీకరణకు మూలాధారం. సాధారణ చట్టంవలె రాజ్యాంగ శాసనాన్ని రూపొందించటం, సవరించటం, రద్దు చేయటం జరిగితే అటువంటి దాని సరళరాజ్యాంగమంటారు. అటువంటి రాజ్యాంగంలో రాజ్యాంగ నిర్మాణసభకు, శాసనసభకు భేదముండదు. రాజ్యాంగశాసనాలను, సాధారణ చట్టాలను ఒకేవిధంగా, రూపొందిస్తారు. వాటిని సవరించే పద్ధతి కూడ ఒకేరకంగా యుంటుంది. ఇటువంటి రాజ్యాంగానికి మంచి ఉదాహరణ బ్రిటిష్ రాజ్యాంగము.

దృఢ రాజ్యాంగంలో రాజ్యాంగ శాసనానికి, సాధారణ శాసనానికి మధ్య తేడా యుంటుంది. ఈ రెండు రకాల శాసనాలను రూపొందించే పద్ధతి, వాటిని సవరించే పద్ధతి భిన్నంగా యుంటుంది. రాజ్యాంగ శాసనం సాధారణ శాసనం వంటి అత్యున్నతమైనదిగా పరిగణించబడుతుంది. ప్రొఫెసర్ డైసీ అభిప్రాయం ప్రకారం ఏ రాజ్యంగంలో అయితే రాజ్యాంగ శాసనం లేదా ప్రాథమిక శాసనాలను సాధారణ చట్టాలవలె మార్చటానికి అవకాశం యుండదో అటువంటి రాజ్యాంగాన్ని దృఢ రాజ్యాంగ మనవచ్చును. దృఢ రాజ్యాంగం అమలులో యున్న రాజ్యాలలో 1) రెండు రకాలైన శాసనాలు - రాజ్యాంగ శాసనం మరియు సాధారణ శాసనం ఉంటాయి. 2) జాతీయ శాసనసభ యొక్క అధికారం రాజ్యాంగ శాసనం ద్వారా పరిమితమై యుంటుంది. 3) స్వతంత్ర న్యాయ వ్యవస్థ యుంటుంది. శాసనసభ రాజ్యాంగానికి అనుగుణగానే శాసనాలను రూపొందించవలసి యుంటుంది. న్యాయస్థానాలకు న్యాయ సమీక్షాధికారం ఉంటుంది. కాబట్టి రాజ్యాంగానికి వ్యతిరేకంగా శాసన సభ శాసనాలను చేస్తే, అటువంటి వాటిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి వాటి అమలును నిలుపుచేసే అధికారం న్యాయవ్యవస్థకు యుంటుంది. ఆవిధంగా న్యాయవ్యవస్థ రాజ్యాంగ సంరక్షణ కర్తగా పనిచేస్తుంది. అమెరికా రాజ్యాంగం దృఢ రాజ్యాంగానికి ఒకమంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

BRAOU

### దృఢ రాజ్యాంగం - ప్రయోజనాలు

దృఢ రాజ్యాంగం ప్రయోజనాలను ఈ విధంగా పేర్కొనవచ్చు :

1. దృఢరాజ్యాంగం లిఖితరూపంలో యుంటుంది. కాబట్టి అది రచనా సామర్థ్యానికి, భాషా పాండిత్యానికి సమానంగా యుండుటేగాక, వివరణాత్మకంగా కూడ ఉంటుంది.

2. దృఢ రాజ్యాంగమనేది మేధావుల ఆలోచనల ఫలితంగా రూపొందింపబడినది. కాబట్టి అదిస్పష్టంగాను, సమగ్రంగాను యుంటుంది. ఈ కారణంగా అది భావితరాల విశ్వాసాన్ని కూడ పొందగలుగుతుంది.

3. దృఢ రాజ్యాంగాన్ని సవరించటం అంత సులభంకాదు. సవరణ ప్రక్రియ క్లిష్టంగా యుంటుంది. అందువలన సరళ రాజ్యాంగం కంటె ఎక్కువగా స్థిరత్వాన్ని చేకూరుస్తుంది.

4. శాసనసభ అతిక్రమణలను దృఢ రాజ్యాంగం నిరోధిస్తుంది. తొందరపాటుతో చేసిన మార్పులకు దృఢ రాజ్యాంగం అడ్డుగోడవలె నిలుస్తుంది.

5. పౌరుల ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో పొందుపరచటం ద్వారా, దృఢ రాజ్యాంగం పౌరుల స్వేచ్ఛలను పరిరక్షిస్తుంది. అదేవిధంగా అల్పసంఖ్యాక వర్గాల వారి హక్కులకు దృఢ రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది.

6. దృఢ రాజ్యాంగం లిఖిత రూపంలో ఒక ప్రతంగా యుంటుంది. కాబట్టి ప్రజలు దానిని పరిరక్షించటానికి సిద్ధపడతారు. అంతేగాక సాధారణ చట్టాలను రాజ్యాంగ శాసనంతో పోల్చి బేరీజు వేయటానికి అవకాశం యుంటుంది.

7. దృఢ రాజ్యాంగమనేది సమాఖ్య రాజ్యానికి అవశ్యకతమైనది. సమాఖ్య విధానంలో రాజ్యాంగానికి అత్యున్నత స్థానముంటుంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ రాజ్యాంగం ద్వారా జరుగుతుంది. ఆవిధమైన అధికారుల పంపిణీ ద్వారా రాజ్యాంగం రాష్ట్రాల హక్కులను కాపాడుతుంది.

**దృఢ రాజ్యాంగం - లోపాలు**

దృఢ రాజ్యాంగంవలన కొన్ని నష్టాలున్నాయి. అవి :

1. దృఢ రాజ్యాంగాన్ని సవరించటం కష్టం. కాబట్టి మారుతున్న పరిస్థితులకనుగుణంగా రాజ్యాంగాన్ని మార్చలేము. దీని ఫలితంగా ప్రజలకు రాజ్యాంగంపట్ల విశ్వాసంపోయి, విప్లవాలకు దారి తీయవచ్చు.

2. రాజ్యాంగ నిర్మాతలు ఎంతటి దూరదృష్టి కలవారైనప్పటికి భవిష్యత్తును గురించి పూర్తిగా ఊహించలేరు. కాబట్టి భవిష్యత్పరిణామాలను బట్టి రాజ్యాంగాన్ని సవరించవలసిన ఆవశ్యకతయున్నది కాని దృఢ రాజ్యాంగము అటువంటి సవరణలకు అనువైనదికాదు. అవిధంగా రాజ్యాంగము జాతీయాభివృద్ధిని, పురోగతిని నిరోధించవచ్చు.

3. దృఢ రాజ్యాంగము దేశంలో మారుతున్న సామాజిక, రాజకీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సులువుగా మార్చే స్వభావం కలదికాదు. లార్డ్‌మెకాలే చెప్పినట్లు రాజ్యాలు ముందుకు నడుస్తూయుంటే, వాటి (దృఢ) రాజ్యాంగాలు నిలకడగా నిలబడిపోతాయి. అత్యవసర పరిస్థితులను ఎదుర్కోటానికి దృఢ రాజ్యాంగాలు అనువైనవికావు.

4. దృఢ రాజ్యాంగంలో శాసనాలు రాజ్యాంగబద్ధమైనవా, కావా అనే విషయాన్ని నిర్ణయించేవి న్యాయస్థానాలు. సాధారణంగా న్యాయమూర్తులు సాంప్రదాయవాదులు. అందువలన ప్రజల ఆకాంక్షల మేరకు రాజ్యాంగాన్ని మార్చటానికి వీరు అడ్డుగా నిలుస్తారు.

**సరళ (అదృఢ) రాజ్యాంగం - ప్రయోజనాలు**

సరళ రాజ్యాంగం వలన కొన్ని ప్రయోజనాలున్నాయి అవి :

1. సరళరాజ్యాంగం యొక్క ముఖ్యమైన ప్రయోజనం దాని సరళత్వము మరియు పరిస్థితుల కనుగుణంగా మారే స్వభావము. సాధారణ చట్టంవలె సరళరాజ్యాంగాన్ని చాలా సులువుగా సవరించటానికి వీలుంటుంది. అందువలన సమాజంలో మారుతున్న పరిస్థితుల కనుగుణంగా సరళరాజ్యాంగం మార్పు చెందుతుంది.

2. సరళరాజ్యాంగం ఒక క్రమబద్ధమైన అభివృద్ధికి అవకాశం యిస్తుంది. అత్యవసర పరిస్థితులలో ఎదురయ్యే సమస్యలను సరళరాజ్యాంగం సులభంగా పరిష్కరించగలదు. సరళ రాజ్యాంగ విధానంలో రక్తపాతంతో కూడిన విప్లవాలకు తావుండదు.

**సరళ రాజ్యాంగం - లోపాలు**

సరళ రాజ్యాంగం వలన కొన్ని లోపాలు లేకపోలేదు, అవి

1. సరళ రాజ్యాంగాన్ని సవరించటం సులభతరమైనందున, దృఢ రాజ్యాంగానికున్న సుస్థిరత సరళరాజ్యాంగానికి యుండదు.

2. శాసనసభలో మెజారిటి సభ్యుల అభిప్రాయాన్నిబట్టి రాజ్యాంగాన్ని మార్చిటానికి అవకాశం యుంటుంది. అందువలన ప్రజల ఆవేశకావేషాలనుబట్టి రాజ్యాంగం మారిపోతుంది.

3. సరియైన రాజకీయ శిక్షణలేని ప్రజలకు సరళరాజ్యాంగం అనువైనదికాదు. రాజ్యాంగ అతిక్రమణలపట్ల, స్వేచ్ఛా హక్కులపట్ల ప్రజలు అప్రతమత్తంగా ఉన్నప్పుడే సరళరాజ్యాంగం విజయవంతమవుంతది.

4. సరళరాజ్యాంగాన్ని సులభంగా మార్చటానికి వీలున్నందున సమాజంలో అనిశ్చితిని కలిగించటం ద్వారా క్రమబద్ధమైన అభివృద్ధిన్ని ప్రభావితం చేయటానికి అవకాశం యుంటుంది.

## 13.6 సవరణ పద్ధతులు

ప్రతిలిఖిత రాజ్యాంగంలో దాని సవరణ పద్ధతి పొందుపరచబడి యుంటుంది. కాలానుగుణంగా మారుతున్న సమాజ అవసరాల మేరకు రాజ్యాంగం మారాలి. సవరణ ద్వారా అటువంటి మార్పు సాధ్యపడుతుంది. రాజ్యాంగం క్రమబద్ధంగా అభివృద్ధి చెందటానికి కూడ రాజ్యాంగ సవరణ తోడ్పడుతుంది. కాని రాజ్యాంగ సవరణపద్ధతి అన్నిదేశాలలో ఒకేవిధంగా యుండదు. కొన్ని రాజ్యాంగాలను సులభంగా సవరించవచ్చు. కొన్నిటిని సవరించటం కష్టం. ఈ సవరణ పద్ధతిని ఆధారంగా చేసికొనే రాజ్యాంగాలను దృఢ, అదృఢ (సరళ) రాజ్యాంగాలుగా వర్గీకరించటం జరిగింది. ఇపుడు కొన్ని దేశాలలో అనుసరించే సవరణ పద్ధతులను పరిశీలిద్దాం.

BRAOU

### 13.6.1 బ్రిటన్

బ్రిటిష్ రాజ్యాంగాన్ని బ్రిటిష్ పార్లమెంటు సాధారణ చట్టాన్ని సవరించిన విధంగానే సవరించగలదు. రాజ్యాంగ సవరణ కొరకు ఎటువంటి ప్రత్యేక పద్ధతిని రాజ్యాంగంతో పొందుపరచలేదు. బ్రిటన్‌లో రాజ్యాంగ శాసనానికి, సాధారణ చట్టానికి మధ్య ఎటువంటి తేడాలేదు. ఈరెండు శాసనాలను తయారుచేయటానికి, సవరించటానికి అనుసరించే పద్ధతి ఒకటే. కాబట్టి బ్రిటిష్ రాజ్యాంగం సరళమైనదని చెప్పవచ్చు.

### 13.6.2 అమెరికా సంయుక్త రాష్ట్రాలు (USA)

అమెరికా రాజ్యాంగ సవరణ అతిక్లిష్టమైనది. అందువలన ఇది ప్రపంచ రాజ్యాంగాలన్నిటిలోకి అతిదృఢమైనది. అమెరికా రాజ్యాంగాన్ని రెండు పద్ధతులు ద్వారా సవరించవచ్చు. అవి (1) అమెరికా జాతీయ

శాసన సభ అయిన కాంగ్రెసులోని ఉభయ సభలు విడివిడిగా 2/3 వంతు సభ్యుల మోజారిటితో రాజ్యాంగ సవరణను ప్రతిపాదించవచ్చు. అటువంటి ప్రతిపాదనను రాష్ట్రాలకు చెందిన 3/4వంతు రాష్ట్ర శాసనసభలుకాని, లేదా రాష్ట్రాలకు ఏర్పాటు చేసిన సదస్సులలో కాని ఆమోదించాలి. (2) రాజ్యాంగ వివరణ కొన్ని సమయాలల్లో రాష్ట్రాలే ప్రతిపాదించవచ్చు. రాష్ట్రాలకు చెందిన 2/3 వంతు రాష్ట్రాశాసనసభలు రాజ్యాంగ సవరణను కోరినట్లైతే అమెరికన్ కాంగ్రెసు రాజ్యాంగ సదస్సును ఏర్పాటు చేస్తుంది. అటువంటి రాష్ట్రాల శాసనసభలుకాని, రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన సదస్సులుకాని ఆమోదించవలె. సాధారణంగా అమెరికా రాజ్యాంగానికి మొదటి పద్ధతితోనే సవరణలు చేయటం జరుగుతుంది. ఈ సవరణ పద్ధతిని బట్టి అమెరికా రాజ్యాంగం అతిదృఢమైనదని తెలుస్తుంది. రాజ్యాంగ సవరణలో రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యం యివ్వటం జరిగింది.

### 13.6.3 భారతదేశం

భారతరాజ్యాంగం యొక్క 368వ ప్రకరణ రాజ్యాంగాన్ని సవరించటానికి పార్లమెంటుకున్న అధికారాన్ని గురించి సవరణ ప్రక్రియను గురించి వివరిస్తుంది. ఈ ప్రకరణను అనుసరించి రాజ్యాంగానికి సవరణలను ప్రతిపాదించే అధికారం ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉంది. ఇటువంటి హక్కు రాష్ట్రాలకు లేదు. సవరణ పద్ధతికి సంబంధించి భారత రాజ్యాంగం కొంతవరకు దృఢ రాజ్యాంగాన్ని, కొంతవరకు సరళరాజ్యాంగాన్ని పోలియుంటుంది. అదేవిధంగా ఒకేరకమైన సవరణ విధానాన్ని కాకుండా, మూడురకాలైన సవరణ పద్ధతులను ఈ రాజ్యాంగం సూచించటం జరిగింది. అవి (1) భారత రాజ్యాంగానికి చెందిన కొన్ని ప్రకరణాలను సవరించటానికి భారత పార్లమెంటుకు చెందిన ఉభయ సభలు సాధారణ మోజారిటితో ఆమోదిస్తే సరిపోతుంది. ఉదాహరణకు క్రొత్త రాష్ట్రాలను ఏర్పరచటానికి, రాష్ట్రాల సరిహద్దులను మార్చటానికి, రాష్ట్రాలలో ఎగువసభ అయిన విధానమండలిని ఏర్పాటు చేయటానికి లేదా రద్దు చేయటానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. దీనిని అదృఢ రాజ్యాంగం యొక్క లక్షణంగా పేర్కొనవచ్చు. 2) రెండవ పద్ధతి ప్రకారం పౌరసత్వం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మొదలైన అంశాలకు సంబందించిన ప్రకరణాలను సవరించాలంటే భారత పార్లమెంటుకు చెందిన ఉభయసభలకు హాజరైన పార్లమెంటు సభ్యులలో 2/3 వంతు మెజారిటీ, మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమోదించాలి. 3) రాష్ట్రపతి ఎన్నిక, కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికారుల ఎంపిక సుప్రీంకోర్టు, హైకోర్టులకు సంబంధిచిన అంశాలు మొదలైన వాటికి సవరణ చేయటం అంత సులభం కాదు. ఈవిషయాలకు సంబంధించిన రాజ్యాంగ నియమాలను మార్చాలంటే సవరణ బిల్లులను పార్లమెంటు ఉభయసభలకు హాజరై ఓటు చేసినవారిలో 2/3 వంతు, మొత్తం సభ్యులలో మెజారిటీ ఆమెదించాలి. వీరితోబాటు రాష్ట్రాలలో సగంకంటె ఎక్కువ రాష్ట్ర శాసనసభలు కూడ తమ ఆమోదం తెలియజేయాలి. అప్పుడే ఆరాజ్యాంగ సవరణ అమలులోకి వస్తుంది. ఇది దృఢ రాజ్యాంగ లక్షణమని చెప్పవచ్చు.

ఈవిధంగా భారతరాజ్యాంగానికి చెందిన వివిధ ప్రకరణాలను పైన వివరించిన మూడు పద్ధతులలో ఏదో ఒక దానిని అనుసరించట ద్వారా సవరించవచ్చును.

### 13.6.4 స్విట్జర్లాండ్

స్విస్ రాజ్యాంగ సవరణ రెండు పద్ధతులలో జరుగుతుంది. అదేవిధంగా రాజ్యాంగాన్ని సంపూర్ణంగాకాని, పాక్షికంగాకాని సవరించవచ్చు. సవరణలు చేయటానికి (1) స్విట్జర్లాండ్ శాసనసభ అయిన ఫెడరల్ అసెంబ్లీ



BRAOU

ప్రతిపాదన చేయవచ్చు లేదా (2) ప్రజలు ప్రతిపాదనలను రూపొందించవచ్చు. ప్రత్యేక ప్రజాస్వామ్యానికి నిలయమైన స్విట్జర్లాండ్‌లో ఏ పద్ధతిలో రాజ్యాంగ సవరణ చేయవలెనన్న, దానికి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ప్రజల ఆమోదం తప్పనిసరి.

రాజ్యాంగ సవరణకు సంబంధించి ఫెడరల్ అసెంబ్లీ ప్రతిపాదనలు రూపొందించినపుడు, సాధారణ చట్టాన్ని ఆమోదించే పద్ధతిలోనే ఫెడరల్ అసెంబ్లీ ఉభయసభలు దానిని ఆమోదించి ప్రజాభిప్రాయ సేకరణకు నివేదించటం జరుగుతుంది. నిర్బంధ ప్రజాభిప్రాయ సేకరణ (Campulsory Referendum) ద్వారా ప్రజలు తమ ఆమోదాన్ని తెలియజేసినపుడు ఆరాజ్యాంగ సవరణ అమలులోనికి వస్తుంది. రాజ్యాంగ సవరణకు సంబంధించి ప్రజలు కూడ ప్రతిపాదనలు చేయవచ్చు. రాజ్యాంగాన్ని పునస్సమీక్ష చెయ్యాలని ప్రజలు అభిప్రాయపడినపుడు, 50,000 మంది ఓటర్లు దానికి సంబంధించి ప్రతిపాదనలను రూపొందించి ఫెడరల్ అసెంబ్లీకి సమర్పించాలి. అటువంటి ప్రతిపాదనలను ఫెడరల్ అసెంబ్లీ ప్రజాభిప్రాయ సేకరణకు నివేదిస్తుంది. ఈ ప్రజాభిప్రాయ సేకరణతో మెజారిటీ కాంటన్(రాష్ట్రాలు) లకు చెందిన మెజారిటి ఓటర్లు తమ ఆమోదాన్ని తెలియజేస్తే, ఫెడరల్ అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలు జరిపిస్తారు. ఆ తరువాత క్రొత్తగా ఏర్పడైన ఫెడరల్ అసెంబ్లీ రాజ్యాంగాన్ని సమీక్షించి, తిరిగి ప్రజాభిప్రయా సేకరణకు నివేదిస్తారు. కొన్ని సమయాలలో పౌరులు పాక్షిక సవరణను కోరితే అటువంటి సవరణకు సంబంధిచి 50,000 మంది పౌరుల ప్రతిపాదనను రూపొందించి ఫెడరల్ అసెంబ్లీకి సమర్పించాలి. సవరణ అంశాలను ప్రజలే పూర్తిగా రూపొందిస్తే, అటువంటి సవరణను మొదట ఫెడరల్ అసెంబ్లీ ఆమోదించాలి. తరువాత ప్రజాభిప్రాయా సేకరణ ద్వారా దానిని ప్రజామోదానికి పంపుతారు సవరణ ప్రతిపాదన ముఖ్యాంశాలనే ప్రజామోదానికి పంపుతారు. సవరణ ప్రతిపాదన ముఖ్యాంశాలనే ప్రజలు సూచిస్తే, ఫెడరల్ అసెంబ్లీ దానిని ఆమోదించాలి. అతరువాత సవరణ బిల్లును సక్రమంగా రూపొందించి, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ప్రజలసమ్మతికి పంపుతారు.

ఆవిధంగా పైన వివరించిన ఏ పద్ధతిలోనైనా రాజ్యాంగ వివరణకు ప్రజల ఆమోదం తప్పనిసరి. ప్రజలు సమ్మతించకపోతే రాజ్యాంగ సవరణ అమలులోకి రాదు.

## 13.7 క్లుప్తంగా

సక్రమపాలనా విధానానికి రాజ్యాంగం అవసరం. రాజ్యాంగం అత్యున్నత మౌలికశాసనం. వివిధ ప్రభుత్వాంగాల పరిధిని, వాటి మధ్య ఉన్న సంబంధాన్ని రాజ్యాంగం వివరిస్తుంది. ఉత్తమ రాజ్యాంగం స్పష్టంగాను, సమగ్రంగాను యుండాలి. రాజ్యాంగాలను లిఖిత - అలిఖిత, దృఢ, అదృఢ రాజ్యాంగాలుగా వర్గీకరించవచ్చును. లిఖిత రాజ్యాంగంలో రాజ్యాంగానికి సబంధించిన అంశాలన్నీ ఒకపత్రంలో లిఖిత రూపంలో ఉంటాయి. అలిఖిత రాజ్యాంగం చారిత్రక పరిణామం ద్వారా ఏర్పడుతుంది. ఇది రాజ్యాంగ సంప్రదాయాలు, అచారాలు, న్యాయశాఖ తీర్పులతోకూడి యుంటుంది. రాజ్యాంగ శాసనాన్ని, సాధారణ చట్టాన్ని ఒకేపద్ధతిలో రూపొందించి, సవరించటానికి అవకాశంయుంటే దానిని సరళరాజ్యాంగమంటారు. అట్లాగాక రాజ్యాంగ శాసనాన్ని సవరించే పద్ధతి, సాధారణ చట్టాన్ని సవరించే పద్ధతికి భిన్నంగా యుంటే దానిని దృఢ రాజ్యాంగమంటారు.

B R A O U

## 13.8 చదవదగిన పుస్తకాలు

A.V. Dicey : The Law of Constitution

E. Asirvatham : Political Theory

K.R. Acharya (Ed.) : A Text book of Political Science

## 13.9 నమూనా ప్రశ్నలు

**I. ఈక్రింది ప్రశ్నలకు ఒక్కొక్కదానికి 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. లిఖిత, అలిఖిత రాజ్యాంగాల మధ్య తేడా పరిమాణానికే తప్ప, రకానికి సంబంధించినదికాదు, వివరించండి.

2. దృఢ, సరళరాజ్యాంగాల లాభ నష్టాలను చర్చించండి.

**II. 10 పంక్తులలో జవాబులిమ్ము.**

1. రాజ్యాంగమనగానేమి ? రాజ్యాంగం యొక్క అవసరమేమి ?
2. ఉత్తమ రాజ్యాంగం యొక్క ముఖ్య లక్షణాలను వివరించుము
3. అమెరికా రాజ్యాంగాన్ని సవరించే విదానమును వర్ణించుము
4. భారత రాజ్యాంగాన్ని సవరించే విధానమును వర్ణించుము
5. స్విస్ రాజ్యాంగాన్ని సవరించే విధానమును క్లుప్తంగా విశదీకరించుము.

B R A O U

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

# భాగం-14 : ప్రభుత్వరకాలు - రాజరిక, కులీన, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు

**విషయ సూచిక**

14.0 లక్ష్యాలు

14.1 పరిచయం

14.2 ప్రభుత్వాల వర్గీకరణ

14.2.1 అరిస్టాటిల్ యొక్క వర్గీకరణ

14.2.2 మేరియట్ యొక్క వర్గీకరణ

14.2.3 లీకాక్ యొక్క వర్గీకరణ

14.3 ప్రభుత్వం యొక్క వివిధ రూపాలు

14.3.1 రాజరికం

14.3.2 కులీనపాలన

14.3.3 ప్రజాస్వామ్యం

14.4 క్లుప్తంగా

14.5 చదవదగిన పుస్తకాలు

14.6 నమూనా ప్రశ్నలు

## 14.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ప్రభుత్వ వర్గీకరణకు సంబంధించి వివిధ రచయితల అభిప్రాయాలను తెలిసికోగలరు.
- రాజరికం, కులీనపాలన, ప్రజాస్వామ్యం గురించి వివరించగలరు
- వివిధ ప్రభుత్వాల ప్రయోజనాలను, లోపాలను గురించి చర్చింగలరు.

## 14.1 పరిచయం

ప్రభుత్వ వర్గీకరణకు సంబంధించి వివిధ రచయితల అభిప్రాయాలను, రాజరికం, కులీన పాలన, ప్రజాస్వామ్యం వంటి విభిన్న ప్రభుత్వ వ్యవస్థల ముఖ్యలక్షణాలను, వాటి ప్రయోజనాలను, లోపాలను గురించి ఈ భాగం వివరిస్తుంది.

B R A O U

## 14.1 ప్రభుత్వాల వర్గీకరణ

ప్రజా సంక్షేమాన్ని సాధించుటమే రాజ్యం యొక్క లక్ష్యం. ప్రభుత్వం అనే సాధనం ద్వారా రాజ్యం దాని లక్ష్యాలను సాధిస్తుంది. రాజ్యం యొక్క అభీష్టాన్ని వ్యక్తంచేసి, రూపొందించి, అమలు చేసేటువంటి యంత్రాంగమే ప్రభుత్వం. రాజ్యం అన్ని దేశాలలో ఒకేవిధంగా ఉన్నప్పటికి, ప్రభుత్వం యొక్క స్వరూపం దేశానికి, దేశానికి మధ్యమారుతూ యుంటుంది. ఆవిధంగా విభిన్న దేశాలలో విభిన్నమైన ప్రభుత్వ వ్యవస్థలు మనకు కన్పిస్తాయి. ఈ ప్రభుత్వ వ్యవస్థలను వివిధ రచయితలు వివిధ రకాలుగా వర్గీకరించినారు.

### 14.2.1 అరిస్టాటిల్ యొక్క వర్గీకరణ

ప్రభుత్వాల సాంప్రదాయక వర్గీకరణ అరిస్టాటిల్‌ను అనుసరించి రూపొందించబడిందని చెప్పవచ్చు. ఈ వర్గీకరణకు సంబంధించి అరిస్టాటిల్ ప్లేటోను, ప్లేటో సోక్రటీస్‌ను అనుకరించటం జరిగింది. అరిస్టాటిల్ తన వర్గీకరణను రెండు సూత్రాలపై ఆధారపడి చేసినాడు. అవి 1) రాజ్యాధికారాన్ని చెలాయించేవారి సంఖ్య. 2) అధికార వినియోగం లక్ష్యాలు. అరిస్టాటిల్ చెప్పిన ఆరు రకాల ప్రభుత్వాలలో మూడు మంచివైతే, మూడు చెడ్డవి వాటిని ఈ క్రిందివిధంగా చెప్పవచ్చు .

| అధికారాన్ని చెలాయించే వారి సంఖ్య | మంచి ప్రభుత్వాలు (ప్రజా సంక్షేమం కొరకు) | చెడ్డ ప్రభుత్వాలు (పాలకుల స్వార్థం కొరకు) |
|---|---|---|
| 1. ఏక వ్యక్తి పాలన | రాజరికం (Monarchy) | నియంతృత్వం (Tyranny) |
| 2. కొద్దిమంది పాలన | కులీన పాలన (Aristocracy) | అల్ప జనపాలన (Oligarchy) |
| 3. అనేకమందిపాలన | పాలిటి (Polity) | ప్రజాస్వామ్యం (Democracy) |

అధికారం ఒక వ్యక్తి చేతిలో ఉండి దానిని ప్రజలు క్షేమం కొరకు అతడు ఉపయోగిస్తే అది రాజరికం. రాజు స్వార్థంతో అధికారాన్ని తన స్వప్రయోజనానికి వినియోగిస్తే అది నియంతృత్వమవుతుంది. అధికారం కొద్దిమంది వ్యక్తుల చేతిలోయుండి దానిని వారు ప్రజల సంక్షేమం గురించి వినియోగిస్తే అది కులీన పాలన. అధికారాన్ని వినియోగించే ఆ కొద్దిమంది స్వార్థపరులై వారి స్వప్రయోజనం కొరకు అధికారాన్ని వినియోగిస్తే అది అల్పజనపాలన. అధికారం ఎక్కువమంది చేతిలో యుండి, వారు దానిని ప్రజలందరి క్షేమానికి వినియోగిస్తే అది పాలిటి. మెజారిటీ ప్రజలు స్వార్థంతో వారి స్వప్రయోజనాలకు అధికారాన్ని వినియోగిస్తే అది ప్రజాస్వామ్యమన బడుతుంది. ఆవిధంగా అరిస్టాటిల్ రాజరికం, కులీనపాలన, పాలిటీలను మంచి ప్రభుత్వాలుగాను, నియంతృత్వం, అల్పజనపాలన, ప్రజాస్వామ్యంలను చెడ్డ ప్రభుత్వాలుగాను భావించినారు. ప్రజాస్వామ్యం కూడ చెడ్డ ప్రభుత్వమని అరిస్టాటిల్ భావన. అరిస్టాటిల్ వివరించిన వర్గీకరణలో ప్రభుత్వాలు కాలక్రమంలో, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకదాని నుండి ఇంకొక దానికి గొలుసుక్రమంలో మార్పు చెందుతూ ఉంటాయి.

ఆధునిక రచయితలలో మాంటెస్క్యూ ప్రభుత్వాలను మూడురకాలుగా వర్గీకరించినాడు. అవి 1) గణతంత్ర ప్రభుత్వ వ్యవస్థ (Republic) (2) రాజరికం (3) నిరంకుశ ప్రభుత్వం గణతంత్ర ప్రభుత్వ వ్యవస్థలో ప్రజలు సార్వభౌమాధికారాన్ని కలిగియుంటారు. రాజరిక ప్రభుత్వ వ్యవస్థలో అధికారం ఒకవ్యక్తి చేతిలో

B R A O U

యుండి, అతడు ఆ అధికారాన్ని కొన్ని నియమాలకు కట్టుబడి చెలాయిస్తాడు. నిరంకుశ ప్రభుత్వవిధానంలో కూడ అధికారం ఒకే వ్యక్తి చేతిలో ఉంటుంది. కాని అతడు ఏ నియమాలకు కట్టుబడకుండా అధికారాన్ని చెలాయిస్తాడు. అతని ఇచ్చే శాసనంగా పరిగణింపబడుతుంది. రూసో ప్రభుత్వాలను రాజరిక, కులీన పాలన, ప్రజాస్వామ్యం అని మూడు రకాలుగా గుర్తించినాడు. కులీన పాలనను తిరిగి మూడు రకాలుగా రూసో వర్గీకరించిన్నాడు. అవి 1) సహజ కులీన పాలన 2) నియోజిత (Elective) కులీన పాలన 3) వారసత్వ కులీన పాలన. వీటిలో నియోజిత కులీన పాలన మంచిదని, వారసత్వ కులీన పాలన అధమమని రూసో భావించినాడు. మిశ్రమ ప్రభుత్వాలను గురించి కూడ రూసో చెప్పినాడు. బ్లంట్లీ అరిస్టాటిల్ వర్గీకరించిన రాజరికం, కులీన పాలన, ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థలను అంగీకరిస్తూనే వీటికి మత ప్రధాన రాజ్యవ్యవస్థను కూడ చేర్చినాడు. మతప్రదాన రాజ్యవ్యవస్థలో సర్వాధికారాలు భగవంతునికే ఆపాదించటం జరుగుతుంది. ఆచరణలో అటువంటి అధికారాలను భగవంతుని ప్రతినిధులు చెలాయిస్తారు. కానీ బ్లంట్లీ గుర్తించిన మత ప్రధాన రాజ్యవ్యవస్థ ప్రస్తుత కాలంలో సమర్ధనీయం కాదు. దానికి కారణం ఆధునిక రాజనీతిశాస్త్రం మతాన్ని రాజకీయాల నుండి వేరుచేయటమే.

### 14.2.2 మేరియెట్ యొక్క వర్గీకరణ

జె.ఎ.ఆర్. మేరియెట్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు అరిస్టాటిల్ యొక్క ప్రభుత్వాల వర్గీకరణను అంగీకరిస్తూనే అది ఆధునిక కాలానికి అనుగుణమైనది కాదని భావించినాడు. మేరియెట్ మూడు ప్రాతిపదికలను ఆధారంగా చేసికొని ప్రభుత్వాలను వర్గీకరించినాడు అవి 1) కేంద్రం - రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీని ప్రాతిపదికగా చేసికొని ప్రభుత్వాలను ఏక కేంద్ర - సమాఖ్య ప్రభుత్వాలుగా వర్గీకరించినాడు. ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో ప్రభుత్వ అధికారాలన్నీ ఒక్కకేంద్ర ప్రభుత్వం చేతిలోనే కేంద్రీకృతమై ఉంటాయి. సమాఖ్య ప్రభుత్వ విధానంలో ప్రభుత్వాధికారాలు కేంద్ర-రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య ఒక పరుషమైన లిఖిత రాజ్యాంగం ద్వారా విభజింపబడి ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపరిధిలో అవి స్వతంత్రంగా వ్యవహరిస్తాయి.

2) రాజ్యాంగాన్ని ప్రాతిపదికగా చేసికొని ప్రభుత్వాలను దృఢ, అదృఢ ప్రభుత్వాలుగా గుర్తించినాడు. దృఢ లేక పరుష రాజ్యాంగ వ్యవస్థలో రాజ్యాంగ శాసనాలను రూపొందించే ప్రక్రియ, వాటిని సవరించే విధానం సాధారణ శాసనాలకు భిన్నంగా యుంటుంది. అదే సరళ లేక అదృఢ రాజ్యాంగ వ్యవస్థలో రాజ్యాంగ శాసనాలకు, సాధారణ శాసనాలకు మధ్య ఎటువంటి భిన్నత్వం యుండదు.

3) శాసన నిర్మాణ, కార్యనిర్వహణ శాఖల మధ్య నున్న సంబంధాన్ని ప్రాతిపదికగా చేసికొని మూడు రకాలైన ప్రభుత్వాలను గుర్తించినాడు. ప్రభుత్వంలోని మిగిలిన రెండు అంశాల (శాసన నిర్మాణ, న్యాయశాఖలు) కంటె కార్య నిర్వహక శాఖ అత్యున్నత అధికారాలను చెలాయిస్తే దానిని నిరంకుశ (Despotic) ప్రభుత్వమంటారు. కార్యనిర్వాహక శాఖ శాసన సభ అధీనంలో యుంటే అటువంటి విధానాన్ని పార్లమెంటరీ ప్రభుత్వ విధానమనవచ్చు. దీనినే కేబినెట్ లేక బాధ్యతాయుత ప్రభుత్వ విధానమని కూడ అంటారు. కార్యనిర్వాహక శాఖకు, శాసనసభకు సమానాధికారాలు యుంటే దానిని అధ్యక్ష ప్రభుత్వ విధానమంటారు.

### 14.2.3 లీకాక్ యొక్క వర్గీకరణ

స్టీఫెన్ లీకాక్ అనే రాజనీతి శాస్త్రజ్ఞుడు ఆధునిక ప్రభుత్వాల వర్గీకరణను వివరించినాడు. లీకాక్ ప్రభుత్వాలను ముఖ్యంగా రెండు రకాలుగా వర్గీకరించినాడు. అవి నియంతృత్వ ప్రభుత్వాలు మరియు ప్రజాస్వామిక ప్రభుత్వాలు. నియంతృత్వ విధానంలో అధికారం మొత్తం ఒకే వ్యక్తిచేతిలో కేంద్రీకృతమై ఉంటుంది. దానిని అతను తన ఇష్టానుసారం వినియోగిస్తాడు. ప్రజాస్వామ్యంలో అధికారం మెజారిటీ ప్రజల చేతిలో ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని తిరిగి రెండు రకాలుగా వర్గీకరించినాడు. అవి 1) పరిమిత రాజరికం 2) గణతంత్ర రాజ్యం (Republic). పరిమిత రాజరికంలో రాజు యొక్క అధికారాలు పరిమితంగానే ఉంటాయి. గణతంత్ర రాజ్యంలో రాజ్యాధిపతి పరిమితి కాలానికి ఎన్నుకోబడతాడు. ఈ రెండింటిలో ఒక్కొక్క దానిని మరల ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాలుగా వర్గీకరించవచ్చు. ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాలను తిరిగి పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలుగా విభజించవచ్చు. లీకాక్ వివరించిన వర్గీకరణ ప్రస్తుత కాలానికి సన్నిహితంగా ఉంది.

అన్నికాలలకు తగినటువంటి ప్రభుత్వ వర్గీకరణను చెప్పటం సులభంకాదు. చారిత్రక, భౌగోళిక, సామాజిక, ఆర్థిక, మానసిక కారకాల మీద ప్రభుత్వాల వర్గీకరణ ఆధారపడి యుంటుంది. అధికారం ఎంతమంది చేతిలో ఉందనే అంశాన్ని ప్రాతిపదికగా చేసికొని చేస్తే ప్రభుత్వాల వర్గీకరణ ప్రస్తుతకాలానికి పనికిరాదు. కొద్దిమంది పాలనను, ఎక్కువమంది పాలన నుండి వేరుచేయటం ఆచరణలో కష్టం. అదే విధంగా ప్రజాస్వామిక ప్రభుత్వాలు కూడ ఒకదాని నుండి మరొకటి భిన్నంగా ఉంటున్నాయి. అందువలన సాంప్రదాయక ప్రభుత్వాల వర్గీకరణ సమకాలీన సమాజానికి సరిపడదు. ఉదాహరణకు బ్రిటన్ సిద్ధాంతపరంగా పరిమిత రాజరికాన్ని కలిగియున్నప్పటికి, ఆచరణలో దానిని ప్రజాస్వామ్యానికి నమునాగా పేర్కొనవచ్చును. అదేవిధంగా అమెరికా, కెనడా, ఇండియా రాజ్యాంగాలు సమాఖ్య ప్రభుత్వ విధానాలకు ప్రాతిపదికలైనప్పటకి, ఆచరణలో వాటిలో కూడ మనకు ఏకకేంద్ర ప్రభుత్వధోరణులు కన్పిస్తూ ఉంటాయి. భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నట్లు ఇండియా శాంతి సమయాలలో సమాఖ్య ప్రభుత్వంగాను, యుద్ధ సమయాలలో ఏక కేంద్ర ప్రభుత్వంగాను ఉంటుంది. ఆవిధంగా ఏ రెండు ప్రభుత్వాలు ఒకేరకంగా యుండవు. ఒకే ప్రభుత్వం సిద్ధాంతపరంగా ఒకవిధంగాను, ఆచరణలో దానికి భిన్నంగాను యుండవచ్చు. అంతేగాక సామ్యవాద సిద్ధాంతం, సంక్షేమ రాజ్య భావన కూడ ప్రభుత్వాల వర్గీకరణను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. ఇప్పుడు చారిత్రికంగా ప్రాముఖ్యం వహించిన రాజరికం, కులీన పాలనలను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

BRAOU

## 14.3 ప్రభుత్వం యొక్క వివిధ రూపాలు

### 14.3.1 రాజరికం

రాజరికం చాలా పురాతనమైన ప్రభుత్వ విధానం. రాజరికంలో రాజ్యాధికారం ఒకే వ్యక్తి చేతిలో ఉంటుంది. రాజాజ్ఞలే శాసనాలుగా పరిగణించబడతాయి. అతని అధికారం అత్యున్నతమైనది మరియు అవధులు లేనివి. శాసననిర్మాణ కార్యనిర్వహక, న్యాయ మరియు సైనిక అధికారాలన్నీ అతనితో కేంద్రీకృతమై ఉంటాయి. రాజరికంలో బలప్రయోగం ద్వారా కాని, లేదా ఎన్నికద్వారా లేదా వారసత్వం వల్ల పాలకుడు

అధికారంలోకి వస్తాడు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందటం వలన రాజరికం చాలా వరకు మరుగునపడింది. అయినప్పటికి నేటికి కూడ రాజరికం కొన్ని దేశాలలో ఆచరణలో ఉంది. ఉదాహరణకు బ్రిటన్, జోర్డాన్, నేపాల్, సౌదీ అరేబియా మొదలైన దేశాలలో రాజరికం ఈ నాటికి నెలకొనియున్నది.

రాజరికాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. 1) నిరపేక్ష రాజరికం 2) పరిమితి లేక రాజ్యాంగ బద్ధ రాజరికం. నిరపేక్ష రాజరికంలో రాజు అధికారానికి పరిమితులుండవు. రాజే శాసనాలు చేయటం, వాటిని అమలుచేయటం, వాటికి వివరణ యివ్వటం చేస్తాడు. రాజు రాజ్యానికి, ప్రభుత్వానికి అధినేతగా యుంటాడు. నిరపేక్ష రాజరికంలో రాజ్యానికి, ప్రభుత్వానికి మధ్య తేడా యుండదు. రాజు ప్రజలకు బాధ్యేత వహించక, భగవంతుని ప్రతినిధిగా భావించేవాడు. ప్రాచీన మధ్యయుగాలలో రాజరికం అన్నిదేశాలలో యుండేది. పధ్నాల్గవ లూయీ పాలనలో యున్న ఫ్రాన్సును నిరపేక్ష రాజరికానికి మంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు. "నేనే రాజ్యాన్ని" అని అతడు భావించేవాడు. పరమితలేక రాజ్యాంగ బద్ధ రాజరికంలో రాజు అధికారాలను రాజ్యాంగం పరిమితం చేస్తుంది. 'రాజ్యాంగానికి లోబడే రాజు తన అధికారాలను చెలాయించ వలసియుంటుంది. రాజు సాధరణంగా నామమాత్రపు రాజ్యాదికారిగానే యుంటాడు. ప్రభుత్వాధికారాలను శాసనసభకు బాధ్యత వహించే మంత్రులు చెలాయిస్తారు. పరిమిత రాజారికానికి ఇంగ్లండును మంచి ఉదాహరణగా చెప్పవచ్చు.

## నిరపేక్ష రాజరికం - ప్రయోజనాలు

నిరపేక్ష రాజరికం వలన అనేక ప్రయోజనాలున్నాయి అవి, 1) రాజరికంలో ప్రభుత్వ వ్యవస్థీకరణ క్లిష్టంగాయుండక, అజ్ఞ ఏకత్వంతో కూడి ఉంటుంది. అందువలన నిర్ణయాలను త్వరితగతినే తీసికొని అమలు చేయటానికి అవకాశం ఉంటుంది. అందువలననే రాజరికం పదిహేడవ శతాబ్దం వరకు చాలా మంచి ప్రభుత్వంగా గుర్తింపును పొందుతుంది.

2. రాజరికంలో విధానాలు క్షణక్షణానికి మారకుండా అవిచ్ఛిన్నంగా కొనసాగటానికి వీలుంటుంది. సమర్ధులైన అధికారుల నియమించటానకి పాలకులకు స్వేచ్ఛ యుంటుంది.

3. పాలకులు శాశ్వతంగా పదవిలో యుండటానికి అవకాశం యున్నందున వారు నిష్పక్షపాతంగా వ్యవహిరించటానికి వీలుంటుంది.

4. చారిత్రికంగా పరిశీలిస్తే ప్రజా సమస్యలతో మమేకమైన పాలకులు మనకు ఎందరో కనిపిస్తారు.

5. రాజరిక ప్రభుత్వ వ్యవస్థ అరాచకత్వానికి, అశాంతికి వ్యతిరేకంగా పనిచేస్తుంది. ప్రభుత్వ అధికారాలన్నీ ఒకే వ్యక్తితో కేంద్రీకరింపబడి యుండటవలన విధానాలలో ఏకత్వాన్ని, పాలనా పటిష్టతను సాధించవచ్చు. దేశ,.విదేశ వ్యవహారాలను స్థిరంగా కొనాసాగించవచ్చు.

6. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలకు భిన్నంగా రాజరిక ప్రభుత్వ వ్యవస్థలో పాలకులు అత్యుత్తమ సలహాలను, నిర్దేశికత్వాన్ని పొందటానికి వీలుంటుంది.

7. అనాగిరికమైన మానవులను అదుపులో పెట్టటానికి, క్రమశిక్షణలో యుంచటానికి రాజరిక ప్రభుత్వ వ్యవస్థకు మించిన ప్రత్యామ్నాయం లేదని గార్నరే అభిప్రాయపడినాడు. రాజకీయంగా వెనుకబడిన దేశాలకు రాజరికం ఎక్కువ ఉపయోగపడుతుంది.



BRAOU

### నిరపేక్ష రాజరికం - లోపాలు

పైన పేర్కొన్న ప్రయోజనాలున్నప్పటికి, నిరపేక్ష రాజరిక విధానంలో చాలా లోపాలున్నాయి, అవి. 1) రాజరిక ప్రభుత్వ వ్యవస్థలో అధికారం ఒక వ్యక్తిచేతిలో ఉంటుంది. కాబట్టి అతను అధికారాన్ని తన ఇష్టానుసారం ఉపయోగించవచ్చు.

2) రాజు సమర్థుడు, ప్రజాహితాన్ని కోరేవాడు అయినప్పుడు రాజరిక ప్రభుత్వ వ్యవస్థ చాలామంది ప్రభుత్వంగా గుర్తింపు పొందుతుంది. కాని ఎల్లవేళలా సమర్థులు, ప్రజాహితాన్ని కోరేవారే పాలకులౌతారని నమ్మకం లేదు.

3) రాజరిక విధానం వారసత్వ సూత్రం మీద ఆధారపడి ఉంది. లీకాక్ అభిప్రాయంలో ఇది చాలా అసంగతమైన విధానము. ఎందువలనంటే ఒకరాజు సమర్థుడు, ప్రాజ్ఞుడు అయినప్పటికి అతని వారసులందరు అదేవిధంగా ఉంటారన్న నమ్మకం లేదు.

4) చారిత్రకంగా చూస్తే రాజరిక వ్యవస్థలో సమర్థుడైన మంచి పాలకులకంటే, అసమర్థుడైన పాలకుడే మనకు ఎక్కువమంది కన్పిస్తారు. ఇటువంటి పాలకులు ప్రజలకు కష్టాలపాలు చేయ్యవచ్చు.

5. వారసత్వ యుద్ధాలు, ప్రజాసంక్షేమం పట్ల ఉదాసీనత, ప్రజాధనాన్ని స్వప్రయోజనాలకు దుర్వినియోగం చేయటం వంటి లక్షణాలు నిరపేక్ష రాజరికంలో కన్పిస్తాయి. అంతేగాక ఈ విధానంలో రాజుకు అపరిమిత అధికారాలుంటాయి. కాబట్టి అతను నియంతగా మారవచ్చు.

6. రాజరిక వ్యవస్థలో ప్రజలకు రాజకీయాలలో పాల్గొనే అవకాశం యుండదు. నియంతలు ఎంతమంచి పరిపాలనను అందించినప్పటికి ప్రజలు దానిని ఆస్వాదించజాలరు. మంచి పరిపాలన స్వపరిపాలనకు ప్రత్యామ్నాయం కాజాలదు.

7. ప్రజలలో దేశభక్తిని, సామాజిక ఐకమత్యాన్ని రాజరికం రేకెత్తించజాలదు. ఏనియంత ప్రజలలో స్వేచ్ఛా భావనలను, సామాజిక చైతన్యాన్ని సహించజాలదు.

నిరపేక్ష రాజరిక వ్యవస్థలో యున్న లోపాల కారణంగానే ప్రజలు నియంతలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి పరిమిత రాజరికాలను ఏర్పాటు చేసికొన్నారు. బ్రిటన్‌వంటి దేశాలలో రాజుల అపరిమతి అధికారాలను రాజ్యాంగం ద్వారా నియంత్రించి రాజ్యాంగ బద్ధమైన రాజరికాలను ఏర్పర్చినారు. ఇటువంటి నియమిత రాజరిక వ్యవస్థలలో వాస్తవిక అధికారాలను ప్రజాప్రతినిధులు ఎన్నుకొన్న మంత్రిమండలి చెలాయిస్తుంది.

BRAOU

## 14.3.2 కులీన పాలన

రాజ్యంలో ఉన్నత వర్గానికి చెందిన కొద్దిమంది ప్రభుత్వాన్ని నిర్వహిస్తే అటువంటి విధానాన్ని కులీన పాలన అనవచ్చు. ఈ వ్యవస్థలో యోధులకు, ఉన్నత వంశస్థులకు, పండిత విద్వాంసులకు, ధనవంతులకు అధికారముంటుంది. కులీన పాలనను ఆంగ్లంలో 'అరిస్టోక్రసీ' అంటారు. ఈపదం 'అరిస్టాస్' మరియు 'క్రషియ' అనే రెండు గ్రీకు పదాలనుండి వచ్చింది. 'అరిస్టాస్' అంటే ఉన్నతమైన అని, 'క్రషియ' అంటే అధికారమని అర్థం. కాబట్టి 'అరిస్టోక్రసి' అంటే ఉన్నత వర్గాలకు చెందిన వ్యక్తుల పాలన అని అర్థం.

కులీన పాలనలో పాలకుల సంఖ్యకు ప్రాధాన్యత లేదు. వారి శీలానికి ప్రాధ్యానం యుంటుంది. ఈ వ్యవస్థలో సమాన్య మానవులకు పాలనా విధానంలో ప్రాధ్యాన్యం యుండదు. సమాజంలో ఉన్నత సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు అధికారాన్ని చెలాయిస్తారు. కులీన పాలనలో మొదట ఉన్నత వంశస్థులకు ప్రాధాన్యం యుండేది. తరువాత వ్యక్తుల తెలివితేటలకు, వారి సామార్ధ్యానికి ప్రాధాన్యం లభించింది. రోమన్ సెనేటును కులీన పాలనకు మంచి ఉదాహరణగా పేర్కొనవచ్చు. కులీన పాలన రాజరికం వలె బహుళ ప్రాచుర్యాన్ని పొందలేదు. ప్రస్తుత కాలంలో కులీన పాలనకు ప్రాధాన్యం లేకుండా పోయింది. బ్రిటన్‌లో ప్రభువులసభ ఈ భావనమీదనే ఏర్పాటు అయిందని చెప్పవచ్చు.

రూసో కులీన పాలనను మూడురకాలుగా విభజించినారు. అవి 1) సహజ కులీన పాలన 2) నియోజిత (Elective) కులీన పాలన 3) వారసత్వ కులీన పాలన. సంపద, ఉన్నతవంశంలో పుట్టుక, తెలివితేటలు, సమర్ధత, విద్యమొదలైన అంశాలను ఆధారంగా చేసికొని పై కులీన పాలన రకాలను రూసో గుర్తించినాడు. సమాజ కులీన పాలనలో కొద్దిమంది వ్యక్తులు తమశక్తి, సామార్ధ్యాలను ఆధారంగా చేసికొని అధికారాన్ని చెలాయిస్తారు. దీనికి భిన్నంగా వారసత్వ కులీన పాలనలో కొద్దిమంది వ్యక్తులు తమ పుట్టుకను, వారసత్వాన్ని ఆధారంగా చేసికొని అధికారంలోకి వస్తారు. నియోజిత కులీన పాలనలో ప్రజలు ఎన్నుకొన్న కొద్దిమంది వ్యక్తులు అధికారాన్ని నిర్వహిస్తారు. వీరిని ప్రజలు ప్రత్యక్షంగాకాని, పరోక్షంగా కాని ఎన్నుకుంటారు. వీరు ఒక నిర్ణీత కాలానికి కాని లేదా మొత్తం జీవితకాలానికి కాని అధికారంతో యుంటారు.

**కులీన పాలన - ప్రయోజనాలు**

కులీన పాలన వలన కొన్ని ప్రయోజనాలున్నాయి. అవి 1. కులీన పాలన వ్యవస్థలో సుశిక్షితులైన కొద్దిమంది మేధావులు పరిపాలనను నిర్వహిస్తారు. ఆవిధంగా కులీనపాలన పరిమాణం కంటె, గుణానికి ఎక్కువ ప్రాధ్యానం యిస్తుంది. ఇది ప్రభుత్వ నిర్వహణలో ప్రతిభను ప్రోత్సాహిస్తుంది.

2. ప్రభుత్వ నిర్వాహణలో స్థిరత్వానికి, సామర్ధ్యానికి ఇది ఎక్కువ ప్రాధాన్యం యిస్తుంది.

3. ఈ విధానంలో పాలకులు తీవ్రమైన లేక అనాలోచితమైన మార్పులు చేయటానికి ఇష్టపడరు. మాంటె స్క్యూ పేర్కొన్నట్లు సంయమనం (Moderation) అనేది కులీన పాలన యొక్క ముఖ్య ప్రయోజనం. ప్రజలకు యిబ్బంది కలిగించే మార్పులను కులీన పాలన వ్యతిరేకిస్తుంది.

4. కులీన పాలనలో ప్రభుత్వ నిర్వహణ అనుభవజ్ఞులు చేతిలో ఉంటుంది. కులీన పాలనను రాజరికంతో జోడిస్తే నియంతృత్వాన్ని అరికడుతుంది. ప్రజాస్వామ్యంతో జోడిస్తే ప్రజాస్వామ్యంలో యున్న లోపాలను, అల్లరి మూకల అధిపత్యాన్ని (Mob-Rule) నిరోధిస్తుంది.

5. ఆధునిక కేబినెట్ ప్రభుత్వ విధానాన్ని బాధ్యతతో కూడిన కులీన పాలనగా అభివర్ణించవచ్చు. బ్రిటన్‌లోని ప్రభువుల సభా లేక ఇండియాలోని రాజ్యసభల ఏర్పాటువలె పార్లమెంటుకు చెందిన ఎగువసభల నిర్మాణంలో ప్రతిభకు, అనుభవానికి ప్రాధ్యానం యివ్వటం ద్వారా కులీనపాలన అంశాన్ని ఈ రోజుకు కొనసాగించవచ్చు. తద్వారా కులీన పాలనవలన చేకూరే ప్రయోజనాలను కొంతవరకు పొందటానికి అవకాశం యుంటుంది.

BRAOU

## కులీన పాలన - లోపాలు

కులీన పాలనవలన కొన్ని గుణాత్మకమైన ప్రయోజనాలున్నప్పటికి, అదికొంత విమర్శకు గురైంది.

1. వారసత్వ కులీన పాలన కొంత అపహాస్యానికి గురైంది. పుట్టుక ద్వారా ప్రతిభ చేకూరుతుందనే వాదన సమంజసంగా లేదు.

2. ఉత్తమ గుణాలను వంశపారం పర్యంగా బదిలీ చేయటానికి వీలుండదు. ఉత్తమవంశంలో పుట్టినంత మాత్రన వ్యక్తులకు పరిపాలనాదక్షత, సామర్థ్యం ఉంటుందనే నమ్మకం లేదు. అంతేగాక విజ్ఞానులైనంత మాత్రానవారికి శీలం, చిత్తశుద్ధి, ప్రజాసేవాతత్పరత ఉంటాయనే గ్యారంటీ లేదు.

3. కులీన పాలనలో కొద్దిమంది పాలకుల అధికార దుర్వినియోగాన్ని అరికట్టే అవకాశం లేదు. అధికార దుర్వినియోగం వలన కులీనపాలన అల్పజనపాలనగా దిగజారవచ్చు.

4. కులీనపాలనలో పాలకవర్గం ఆ వర్గ స్వభావాన్ని బట్టి సామాన్య ప్రజానీకం యొక్క రాజకీయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, వారిలో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించటానికి కృషి చేయరు.

5. కులీనపాలన సమాజంలో ఎంతోకాలంగా కొనసాగుతున్న ఆచారాలు, సంప్రదాయాల మీద ఆధారపడి మితవాదంలో కూడుకొని యుంటుంది. అందువలన ఇది మారిన పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన సామాజిక, ఆర్థిక మార్పులను తీసుకొని రావటానికి అనుకూలమైనదికాదు.

6. కులీనపాలన ఆడంబరాలకు, హోదావిలాసాలకు ఎక్కువ ప్రాధాన్యమిస్తుంది. అందువలన ఇది ఖర్చుతో కూడుకొన్న పాలనా వ్యవస్థగా పేర్కొనవచ్చు, అంతేగాక ఇది ఆధునిక అవసరాలకు అనుగుణమైనది కాదని విమర్శకుల భావన.

### 14.3.3. ప్రజాస్వామ్యం

ఆధునిక ప్రభుత్వ వర్గీకరణలో అత్యుత్తమమైన ప్రభుత్వ వ్యవస్థ ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్యాన్ని ఆంగ్లంలో 'డెమోక్రసీ' అని అంటారు. ఇది 'డెమోస్' మరియు 'క్రషియ' అనే రెండు గ్రీకుల పదాల నుండి ఆవిర్భవించింది. 'డెమోస్' అంటే ప్రజలు 'క్రషియ' అంటే 'పాలన' లేక అధికారం అని అర్థం. కాబట్టి డెమోక్రసి అంటే 'ప్రజాపాలన' అని చెప్పవచ్చు. ప్రజాస్వామ్యంలో పాలనాధికారం అసంఖ్యాకులైన ప్రజలచేతిలో ఉంటుంది. దీనిని ప్రజలు ప్రత్యక్షంగా కాని లేదా పరోక్షంగా అంటే మత ప్రతినిధుల ద్వారాకాని చెలాయిస్తారు. లార్డ్ బ్రైస్ అభిప్రాయంలో "పరిపాలనాధికారం ఒక ప్రత్యేక వర్గం లేదా వర్గాలతో చెందియుండక, సమాజంలోని వ్యక్తులందరికి శాసన బద్ధంగా చెందియుండే ప్రభుత్వవిధానమే ప్రజాస్వామ్యం". ప్రజాస్వామ్యంలో ప్రజలు అధికారాన్ని నిర్ణీతకాలానికి ఎన్నుకొన్న తమ ప్రతినిధుల ద్వారా నిర్వహిస్తారని జె.యస్. మిల్ భావించినాడు. ప్రొఫెసర్ సీలే ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి భాగముందన్నాడు. ఆవిధంగా ప్రజలు ప్రజాసామ్యంలో ప్రత్యక్షంగా కాని లేదా పరోక్షంగా అంటే నిర్ణీత కాలానికి ఎన్నుకొని తమ ప్రతినిధుల ద్వారా కాని ప్రభుతాన్ని నియంత్రిస్తూ పాలన నిర్వహిస్తారు.

ప్రభుత్వ నియంత్రణ ప్రజలచేతిలో యుండటమన్నది ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య లక్షణము. ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రత్యక్షంగా ప్రభుత్వ నిర్వహణలో పాలుపంచుకొంటారు. అదే పరోక్ష లేక

BRAOU

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో నిర్ణీత కాలానికి ఎన్నుకొన్న తమ ప్రతినిధుల ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహిస్తారు. పరోక్ష ప్రజాస్వామ్యంలో వయోజనులంతా ఓటుహక్కును కలిగి యుండి, నిర్ణీత కాలానికి జరిగే ఎన్నికల ద్వారా తమ అధికారాన్ని ప్రజాప్రతినిధులకు సంక్రమింపజేస్తారు. ప్రజాప్రతినిధులు ఈ అధికారాన్ని ప్రజల అభిమతానికి అనుగుణంగా చెలాయించటం ద్వారా వారి కప్పగించిన బాధ్యతలను నిర్వహించవలసియుంటుంది. అటులగాక ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తే అటువంటి వారిని ప్రజలు నిర్ణీత కాలవ్యవధి తరువాత జరిగే ఎన్నికలలో అధికారం నుంచి తొలగించి వేరే ప్రతినిధులను ఎన్నుకుంటారు. అంతేగాక ప్రజాస్వామ్య అనేపదం కేవలం ప్రభుత్వం రూపాన్ని మాత్రమే సూచించదు. అది ఒకరకమైన సామాజిక, ఆర్థిక జీవనాన్ని కూడ సూచిస్తుంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తుల వ్యక్తిత్వానికి, రూపొందించుకోవటానిక అవసరమైన స్వేచ్ఛా సమానత్వాలను కల్పించటం జరుగుతుంది. వ్యక్తులమధ్య పుట్టుక, సంపద, కులం, వర్గం, మతం అనే భేదాలను పాటించక ప్రజలందరికి సమానత్వం ప్రాతిపదికపై హక్కులు, ప్రభుత్వసేవలను అందించటం జరుగుతుంది. అదేవిధంగా ఆర్థికరంగంలో సముచితమైన సంపద పంపిణి, పనిహక్కు, విశ్రాంతి హక్కు, కనీస వేతన హక్కులను కల్పించటం ద్వారా వ్యక్తుల సుఖమయ జీవితానికి అవసరమైన పరిస్థితులను కల్పించటం జరుగుతుంది.

**ప్రజాస్వామ్యం - ప్రయోజనాలు**

ప్రజాస్వామ్యం వలన ఈ క్రింది ప్రయోజనాలు చేకూరుతాయి.

1. ప్రజాస్వామ్యంలో వ్యక్తి ఔన్నత్యానికి, జీవన విలువలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వ్యక్తి స్వేచ్ఛను, రాజ్యాధికారాన్ని ప్రజాస్వామ్యం సంధానపరుస్తుంది.

2. జె.ఎస్. మిల్ అభిప్రాయంలో ప్రజాస్వామ్యం మిగిలిన ప్రభుత్వ వ్యవస్థలకంటె రెండు కారణాల వలన ఉన్నతమైనది. అవి i) వ్యక్తి హక్కులను, ప్రయోజనాలను ప్రజాస్వామ్యం కాపాడినట్లుగ ఇంకే ప్రభుత్వం కాపాడలేదు. ii) ఉన్నతమైన జాతీయ సంపదను పెంపొందించటంలో వ్యక్తులకు శక్తి సామర్థ్యాలను ఏ ఇతర ప్రభుత్వం ప్రజాస్వామ్యంవలె నిర్దేశించజాలదు. ఉన్నతమైన జాతీయ ఔన్నత్యాన్ని కూడ ప్రజాస్వామ్యం అభివృద్ధి చేస్తుందని మిల్ భావన.

3. ఒక్కప్రజాస్వామ్యంలోనే వ్యక్తుల ప్రాధాన్యత పరిపూర్ణంగా గుర్తింపబడుతుంది. వ్యక్తుల వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ప్రాథమిక హక్కులు పరిరక్షింపబడతాయి.

4. ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రజాసమ్మతి మీద ఆధారపడి యుంటుంది. కాబట్టి దౌర్జన్యానికి, విప్లవాలకు ప్రజాస్వామ్యంలో తావుండదు. ప్రజాస్వామ్యాలు బుల్లెట్ల ద్వారా కాకుండా బాలెట్ పత్రాల ద్వారా నిర్వహించబడతాయి.

5. ప్రజాస్వామ్యం సమర్థవంతమైన బాధ్యతాయుత ప్రభుత్వంగా గుర్తింపును పొందింది. ఈ ప్రభుత్వ వ్యవస్థలో ప్రజాప్రతినిధులు నిరంకుశంగా వ్యవహరించటానికి వీలుకాదు. ప్రజాభీష్టానికి భిన్నంగా ప్రజాప్రతినిదులు వ్యవహరిస్తే, అటువంటి ప్రభుత్వాన్ని ఎన్నికల ద్వారా మార్చే అధికారం ప్రజలకుంటుంది. గార్నర్ పేర్కొన్నట్లు ప్రజాస్వామ్యంలో ప్రజా ఎన్నికలు, ప్రజానియంత్రణ, ప్రజాబాద్యత అనే ఆదర్శాలు ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంపొందించి, ప్రజా సంక్షేమానికి పాటుపడేటట్లు చేస్తాయి.



B R A O U

6. ప్రజాస్వామ్యం సమానత్వం మీద ఆధారపడింది ప్రజాస్వామ్య విధానంలో చట్టం ముందు అందరూ సమానమే. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రజాస్వామ్యం ప్రజలందరికి సమానమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హక్కులను కల్పించింది. కులమతాలను, ప్రాంతీయ భాషాభేదాలను, పుట్టుక, లింగభేదాలను ప్రాతిపదికగా చేసికొని వ్యక్తుల మధ్య ఎటువంటి విచక్షణా చూపకపోవటం ప్రజాస్వామ్యం యొక్క ముఖ్యమైన సుగుణంగా పేర్కొనవచ్చు.

7. ప్రజాస్వామ్యం ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని, దేశభక్తిని పెంపొందిస్తుంది. నిర్ణీత కాలవ్యవధిలో ఎన్నికలు జరిపించటం, రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు జరిపి నాయకులతో ఉపన్యాసాలు ఇప్పించటం, కరపత్రాలు పంచిపెట్టడం మొదలైన కార్యక్రమాలు ప్రజలలో రాజకీయ పరిజ్ఞానాన్ని, చైతన్యాన్ని పెంపొదించటానికి దోహదపడతాయి. అదే విధంగా ప్రజాస్వామ్యం దేశభక్తిని పురికొల్పుతుంది. ప్రజలకు కల్పించిన రాజకీయభావనతో దేశంపట్ల ప్రజల అభిమానాన్ని ప్రజాస్వామ్యం పెంపొదింస్తుందని జె.ఎస్. మిల్ అభిప్రాయపడినాడు.

8. ప్రజాస్వామ్యం ప్రజలకు స్వయంపాలనతో శిక్షణనిస్తుంది. ప్రజలు తమ సమస్యలను తాము పరిష్కరించుకోవటాన్ని అలవరచుకుంటారు. ఆవిధంగా ప్రజాస్వామ్యం ప్రజల యొక్క, 'ప్రజల కొరకు' మాత్రమే గాక 'ప్రజలచేత' నిర్వహించబడే ప్రభుత్వంగా రూపొందుతుంది.

**ప్రజాస్వామ్యం - లోపాలు**

ప్రజాస్వామ్యం ఎంతో మంచి ప్రభుత్వంగా కొనియాడబడినప్పటికి దానిలో కూడ కొన్ని లోపాలు ఉన్నాయి. కొన్ని :

1. ప్లేటో ప్రజాస్వామ్యాన్ని అసమర్థులు, అవివేకులు, అజ్ఞానుల పాలనగా విమర్శించినాడు. అదేపంథాలో అరిస్టాటిల్ ప్రజాస్వామ్యాన్ని పాలిటికి చెడు రూపంగా భావించినాడు. సామాన్య ప్రజలకు పరిమిత రాజకీయ పరిజ్ఞానం యుంటుంది. కాబట్టి వారు ప్రజాసమస్యలను సరిగా అవగాహన చేసికొనలేరు. అధికారం అసమర్థత, అవివేకుల చేతిలో ఉంటుంది. కాబట్టి పరిపాలన కూడ అసమర్థంగా యుంటుందని విమర్శకుల భావన.

B R A O U

2. ప్రజాస్వామ్యంలో పరిమాణానికి వచ్చినంత ప్రాధాన్యత గుణానికి యివ్వరు. ఓట్లను గణిస్తారే తప్పవాటికి విలువ యివ్వరు. అన్ని ఓట్లను ఒకేరకంగా గణించడం ద్వారా విద్యావేత్తలు, విజ్ఞానవంతులు తెలివైన వారికి ప్రజాస్వామ్యంతో సముచితమైన పాత్రయుండదు.

3. ప్రజాస్వామ్యం ఎక్కువ ఖర్చుతో కూడిన ప్రభుత్వమని విమర్శకులభావన. మిగిలిన ప్రభుత్వ వ్యవస్థలతో పోల్చిచూస్తే ప్రజాస్వామ్యంతో ప్రభుత్వ యంత్రాంగం చాలా సంక్లిష్టమైనదిగాను, విస్తృతమైనదిగాను ఉంటుంది. ప్రజాస్వామ్యంలో తరుచూ జరిగే ఎన్నికలకు ఎంతో దుబారా ఖర్చు అవుతుంది. ఈ కారణంగా ప్రజలపై పన్నుల భారం ఎక్కువగా యుంటుంది.

4. ప్రజాస్వామ్యం ప్రజల నైతిక విలువల పతనానికి దోహదం చేస్తుంది. రాజకీయ పక్షాలు, నాయకులు రాజ్యాంగ వ్యతిరేకమైన అనైతిక మార్గాల ద్వారా రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోవటానికి ప్రయత్నిస్తారు. ఎన్నికలలో ధనం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కులతత్వం, మతతత్వం, ప్రాంతీయ మరియు

భాషాదురభిమానాల వంటి సంకుచిత తత్వాలను రాజకీయ పక్షాలు, నాయకులు స్వార్థప్రయోజనాల కోసం రెచ్చకొట్టి దేశ సమైక్యతకే భంగం కలిగిస్తారు. తద్వారా సమాజంలోని నెలకొనియున్న శాంతియుత సహజీవనానికి భంగం కలిగిస్తారు.

5. ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక పార్టీ వ్యవస్థ. కాని ఆచరణలో రాజకీయ పక్షాలు జాతీయ ప్రయోజనాలను బలిగొంటున్నాయి. పార్టీవ్యవస్థ ధనవంతులు, అసమర్థులు అధికారంలోనికి రావటానికి దోహదం చేస్తున్నది. పార్టీ మూలంగా సమాజంలో అనైక్యత ఏర్పడుతుంది. సమర్థులు, వివేకవంతులు అయిన మేధావుల అవినీతికరమైన రాజకీయాలలో తలదూర్చటానికి అంగీకరించరు. ధనవంతులు, అవినీతిరులు అధికారంలో ఉంటారు కాబట్టి అవినీతికి ప్రోత్సాహం లభిస్తుందని విమర్శకులవాదన. అంతేగాక ఎన్నికల సమయాలలో పార్టీల ప్రచారం, ఎన్నికల నినాదాలు, బాధ్యతారహితమైన పత్రికల పాత్ర సామాన్య ప్రజలను చెడుగా ప్రభావితం చేస్తాయి. పార్టీల స్వప్రయోజనాలకు జాతీయ ప్రయోజనాలను బలిచేయటం జరుగుతుంది.

6. ప్రజాస్వామ్యం ఎప్పుడూ పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించి, వర్గపోరాటాన్ని ప్రేరేపిస్తుందని కమ్యూనిష్టుల విమర్శ. ఎన్నికలలో సాధారణంగా భూస్వాములు, ధనవంతులు మాత్రమే నిలబడి గెలుపొందుతారు. అధికారాన్ని హస్తగతంచేసికొని, తమ సంకుచిత వర్గప్రయోజనాలను సాధించుకొనేటట్లు శాసనాలను రూపొందించి అమలుపరుస్తారు. అది వర్గ ద్వేషాలను పురికొల్పి వర్గ పోరాటానికి దారి తీస్తుంది.

7. ప్రజాస్వామ్యం సామాజిక, ఆర్థిక రంగాలలో మౌలికమైన మార్పులను, ప్రగతిని ప్రతిఘటిస్తుంది. సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలకు ప్రాధాన్యం యుండదు. ఈ విషయం వివిధ ప్రజాస్వామిక దేశాలలో ప్రజల సామూహిక ప్రవర్తనను పరిశీలిస్తే అవగతమవుతుంది. ప్రజల ప్రవర్తన వ్యక్తులుగా ఒకరకంగాను, సమూహాలలో సభ్యులుగా దానికి భిన్నంగాను యుంటుంది. విచక్షణ జ్ఞానం కలిగిన వ్యక్తులు కూడ రాజకీయ సమూహాలలో సభ్యులుకాగానే ముఠా నాయకులుగా, స్వార్థపరులుగా సంకుచితంగా వ్యవహరించటం ఆధునిక ప్రజాస్వామ్యంలలో మనకు కన్పించే ఒక దృగ్విషయం.

8. ప్రజాస్వామ్యం ప్రజలందరూ సమానమనే తప్పుడు భావన మీద ఆధారపడిఉంది. కాని ఇది సమంజసమైన భావనకాదు. స్వభావ సిద్ధంగా మానవులలో అనేక తేడాలున్నాయి. అందరూ అన్నివిషయాలలో ఒకేరకంగా యుండరు. కాని ఈ విషయాన్ని ప్రజాస్వామ్యం గుర్తించదు. అందువలననే ప్రజాస్వామ్యం అహేతుకము, అసమంజసము అయిన ప్రభుత్వ విధానమని విమర్శకులు విమర్శించినారు.

9. ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానంలో నిర్ణయాలు శీఘ్రగతిన తీసికొనబడవు. ఎక్కువ కాలయాపన జరుగుతుంది. సమావేశాలకు, చర్చలకు, సంప్రదింపులకు కాలాన్ని వృధాచేయటం జరుగుతుంది.

10. లార్డ్ బ్రైస్ ప్రజాస్వామ్య వ్యవస్థ లోపాలను ఈ క్రింది విధంగా వివరించినారు. అవి i) పాలనాయంత్రాగాన్ని ధనం ప్రభావితం చేస్తుంది. ii) రాజకీయాలను లాభదాయక వృత్తిగా మార్చటం iii) రాజకీయ పక్షాల ప్రాబల్యం పెరుగుదల iv) పాలనా నిర్వహణలో దుబారా v) శాసనకర్తలు, రాజకీయ నాయకుల నైతిక పతనం vi) సమానత్వ సిద్ధాంతాన్ని దుర్వినియోగం చేయటం.

## 14.4 క్లుప్తంగా

ప్రభుత్వ యంత్రాంగం ద్వారా రాజ్యం పనిచేస్తుంది. ప్రాచీన రాజకీయ తత్త్వవేత్తలైన ప్లేటో, అరిస్టాటల్ దగ్గరి నుండి ఆధునిక రాజనీతి శాస్త్రజ్ఞులైన మెరియట్, లీకాక్ వరకు ప్రభుత్వాలను వివిధరకాలుగా వర్గీకరించినారు. సాంప్రదాయకంగా ప్రభుత్వాలు మూడురకాలు. అవి రాజరికం, కులీనపాలన మరియు ప్రజాస్వామ్యం. ఈ వర్గీకరణకు ప్రాతిపదిక రాజకీయ అధికారం ఎంతమందిచేతిలో ఉంది. దానిని వారు ఏ లక్ష్యసాధనకు ఉపయోగిస్తారు అనేది. రాజరికం, కులీన ఆధునిక కాలానికి సరిపడవు. సమకాలీన సమాజంలో ప్రజల ప్రభుత్వమైన ప్రజాస్వామ్యం బహుళ ప్రాచుర్యాన్ని పొందింది. వ్యక్తి ఔన్నత్యాన్ని, స్వేచ్ఛను ప్రజాస్వామ్యం గుర్తించింది. శాంతియుత మార్గాలైన చర్చలు, సంప్రదింపులుద్వారా సమస్యలను పరిష్కరించువచ్చునని ప్రజాస్వామ్యం ప్రచారం చేసింది. కాని ఆచరణలో ప్రజాస్వామ్యం అసమర్థుల పాలనగా మారే అవకాశముంది. ఎన్నికలకయ్యే ఖర్చు, రాజకీయ పార్టీల కుతంత్రాలు ఏహ్యమైనా రాజకీయ సమూహాల ప్రవర్తన మొదలైన విషయాలను దృష్టిలో ఉంచుకొని వివేకవంతులు రాజకీయాలలో తలదూర్చటానికి యిష్టపడరు. ప్రజాస్వామ్యంలో యిన్ని లోపాలున్నప్పటికీ ఆధునిక కాలంలో ప్రజాస్వామిక ప్రభుత్వాలు బహుళ ప్రాచుర్యాన్ని పొందాయి. ఇతర ప్రభుత్వవ్యవస్థలకు భిన్నంగా ప్రజాస్వామ్యంలో ప్రజా ఎన్నికలు, ప్రజానియంత్రణ, ప్రజాబాధ్యత అనే ఆదర్శాలు ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంపొందించి, ప్రజాసంక్షేమానికి పాటుపడేటట్లు చేస్తాయి.

## 14.5 చదువదగిన పుస్తకాలు

| | |
|---|---|
| E.D. Burus | : Democracy its defects and Advantages |
| K.R. Acharya (Ed) | : A Text-Book of Political Science |
| A.C. Kapoor | : Principles,of Political Science |
| Francis W. Coker | : Recent Political Thought |

BRAOU

## 14.6 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. రాజరికం ప్రయోజనాలను, లోపాలను వివరించుము
2. కులీనపాలన యొక్క ప్రయోజనాలు, లోపాలు ఏవి ?
3. ఆధునిక ప్రజాస్వామ్యం యొక్క ప్రయోజనాలను, లోపాలను సాపేక్షికంగా చర్చించుము

**II. ఒక్కొక్క ప్రశ్నకు 10 పంక్తులలో జవాబు లిమ్ము.**

1. వివిధ రకాల ప్రభుత్వాలను వర్గీకరించుము
2. అరిస్టాటిల్ యొక్క ప్రభుత్వాల వర్గీకరణను వివరించుము
3. మెరియేట్ యొక్క ప్రభుత్వాల వర్గీకరణను వర్ణించుము
4. లీకాక్ యొక్క ప్రభుత్వాల వర్గీకరణను విశదీకరించుము

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

BRAOU

# భాగం - 15 : ఆధునిక ప్రభుత్వరకాలు - సంపూర్ణ అధికారవాదం

విషయ సూచిక

15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 సంపూర్ణాధికారవాదం, అధికారవాదం - నిర్వచనం

15.3 సంపూర్ణాధికారవాదం, లక్షణాలు

15.4 సంపూర్ణాధికార వాదం - వివిధ రూపాలు

15.4.1 రష్యాలో సంపూర్ణాధికార వాదం

15.4.2 ఫాసిజం

15.4.3 నాజిజం

15.5 క్లుప్తంగా

15.6 చదవదగిన పుస్తకాలు

15.6 నమూనా ప్రశ్నలు

## 15.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- సంపూర్ణాదికార వాదం అర్థాన్ని, స్వభావాన్ని వివరించగలరు
- సంపూర్ణాధికార వాదం లక్షణాలను సమీకరించి చెప్పగలరు
- వివిధ సంపూర్ణాధికార వాద వ్యవస్థలను విశ్లేషించగలరు.

## 15.1 పరిచయం

సంపూర్ణాధికారం అర్థాన్ని, స్వభావాన్ని ఈ భాగం వివరిస్తుంది. అంతేగాక రెండు ప్రపంచ యుద్ధాల మధ్య అంతర్జాతీయ సమాజంలో నెలగొన్న వివిధ సంపూర్ణాధికారవాద వ్యవస్థలను తులనాత్మకరిగా అధ్యయనం చేయవచ్చు.

## 15.2 సంపూర్ణాధికారవాదం, అధికారవాదం - నిర్వచనం, స్వభావం

రెండు ప్రపంచ యుద్ధాలమధ్య అంతర్జాతీయ సమాజంలో నెలకొన్న ఒక ముఖ్యమైన దృగ్విషయం ఐరోపా ఖండంలో నెలకొన్న సంపూర్ణాధికారవాదం. ఇది రాజ్యం స్వభావాన్ని గురించి వివరించే ఒక భావన



BRAOU

మాత్రమేగాక పౌరజీవన విధానం గురించి చెప్పే ఒక క్రొత్త సిద్ధాంతం కూడ. ఇది ఉదార ప్రజాస్వామ్యవాదానికి వ్యతిరేకమైనది. ఉదారప్రజాస్వామ్యవాదం వ్యక్తికి ప్రాధాన్యం యిస్తే, సంపూర్ణాధికారవాదం రాజ్యానికి ప్రాధన్యమిస్తుంది. సంపూర్ణధికారవాదం రాజ్యానికి నిరపేక్షాధికారాలను సంక్రమింపచేస్తుంది. సంపూర్ణాధికారవాదం ప్రకారం రాజ్యం పౌరజీవన విధానాన్నంతటిని నియంత్రణ చేస్తుంది. వ్యక్తి రాజ్యానికి విధేయుడైనప్పుడే సంపూర్ణ వికాసాన్ని పొందగలడని సంపూర్ణధికార వాదులు భావించినారు. సంపూర్ణాధికారవాదాన్ని అతివాద అధికార వాదమని చెప్పవచ్చు. సంపూర్ణాధికారవాద రాజ్యంలో ఒక అధికారిక సిద్ధాంతముంటుంది.

ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలు కూడ సంపూర్ణాధికార వాద రాజ్యాలే. ఆకాలంలో రాజ్యం అనేక విధులను నిర్వహించేది. రాజ్యానికి, సంఘానికి మధ్య తేడాలేదు. ఆధునిక కాలంలో ఫ్రాన్సును పరిపాలించిన 14వ లూయి సంపూర్ణాధికారవాద పాలకుడు. అతడు "నేనేరాజ్యం" అని చెప్పాడు. తత్కాలికంగా రాజ్యం యొక్క ఔన్నత్యాన్ని అపరిమితంగా పెంపొదించినాడు. అతను చెప్పిన భావవాదన్ని ననుసరించి రాజ్యాధికారం నిరపేక్షమైనది. దివినుంచి భువికి దిగివచ్చిన భగవంతుని స్వరూపమే 'రాజ్యం' అని వెంగెకె భావించినాడు. ఆధునిక సంపూర్ణాధికారవాదం వ్యక్తిని రాజ్యానికి ఆధీనునిగా మార్చింది. వ్యక్తి జీవితం వ్యక్తికిచెందదు. అది రాజ్యానికి మాత్రమే చెందుతుంది. రాజ్యం తప్పుచేయదు రాజ్యప్రయోజనాల కోసం వ్యక్తిపాటుపడాలి రాజ్యానికి సేవచేయటం ద్వారా వ్యక్తికి ప్రాముఖ్యత లభిస్తుంది. ఆవిధంగా సంపూర్ణాధికారవాదం రాజ్యారాదనను బలపరుస్తుంది.

సంపూర్ణాధికారవాద రాజ్యానికి అపరిమిత అధికారాలుంటాయి. వ్యక్తి యొక్క మత, సామాజిక, సాంస్కృతిక, నైతిక, విద్యా, ఆర్థికాది తదితర జీవనరంగాలన్నిటిని రాజ్యం నియంత్రిస్తుంది. వ్యక్తులు రాజ్యానికి విధేయులై యుంటారు. వ్యక్తికి ప్రాథమిక స్వేచ్ఛలుండవు. విద్యాసంస్థలను, రేడియో, టి.వి. వంటి ప్రసార సాధనాలను, వార్తా పత్రికలను, మత సంస్థలను సంపూర్ణాధికారవాద రాజ్యం నియంత్రణచేస్తుంది. రాజ్యవిదేయునిగా ప్రతిపౌరుడినీ తయారుచేయటమే ఈ నియంత్రణ లక్ష్యం. రాజ్యానికి భిన్నంగా వ్యక్తుల వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేయటానికి సంపూర్ణాధికారవాద రాజ్యం నిరాకరిస్తుంది. బలప్రయోగం ద్వారా ప్రభుత్వ వ్యతిరేక శక్తులను అణచివేయటం జరుగుతుంది. ఇటువంటి రాజ్యంతో ఒకే రాజకీయ పార్టీ ఉంటుంది. రాజ్యాధికారమంతా ఆపార్టీ హస్తగతమై, ఏకపార్టీ ప్రభుత్వం ఏర్పాటువుతుంది. ఆపార్టీ ద్వారా నియంత రాజ్యాపాలన చేస్తాడు, ప్రజానమ్మతిని మరియు ప్రజా సహకారాన్ని పొందుతాడు. ఒకవిధంగా ఈ విధానాన్ని పార్టీ నియంతృత్వమనవచ్చు. సంపూర్ణాధికారవాదం పార్లమెంటరీ ప్రభుత్వవిధానానికి భిన్నంగా ప్రతి పక్ష రాజకీయ పార్టీలకు అవకాశం యివ్వదు. ప్రతిపక్ష పార్టీలవలన ఉపయోగంలేదని, అవి నిరర్థకమని దీని భావన. సమాజం యొక్క మొత్తం ఆర్థిక జీవనం రాజ్యం యొక్క నియంత్రణయుంటుంది. అతి జాతీయతా వాదానికి, సామ్రాజ్య వాదానికి సంపూర్ణా రాజ్యాధికారంవాదం ప్రాధన్యమిస్తుంది. యుద్ధోన్మాదానికి, సైనిక వాదానికి ప్రాముఖ్యం యుంటుంది.

సంపూర్ణధికారవాదం వివిధ దేశాలలో వివిద రూపాలను సంతరించుకుంది. ఇటలీలో ఫాసిజం, జర్మనిలో నాజిజం, రష్యాలో కమ్యూనిజం అను సంపూర్ణాధికారవాదం రూపాలుగా పేర్కొనవచ్చును. ఆంగ్లో-సాక్షన్ రాజ్యాలలో కూడ రాజ్యాధికారం దినదినాభివృద్ధి చెందుతున్నది. ఈదేశాలలో పెరుగుతున్న రాజ్యాధికారాన్ని ప్రజాస్వామ్య సంపూర్ణాధికారవాదం అని అంటారు. ఇక అధికారవాదం అనేది పరిపూర్ణమైన

BRAOU

సిద్ధాంతంకాదు. ఇది వాస్తవ ఉద్యమాలనుండి, పరిస్థితుల నుండి రూపొందింది. రాజకీయ సిద్ధాంతంగా అధికారవాదం సంపూర్ణాధికారవాదానికి చెందిన కొన్ని ధోరణులను కలిగియుంటుంది. సంపూర్ణాధికార వాదానికి చెందిన కొన్ని ధోరణులను కలిగియుంటుంది. సంపూర్ణాధికార వాదరాజ్యాలు అధికారవాదరాజ్యలే. కాని రెండింటి మద్యకొంత వ్యత్యాసం ఉంది. సంపూర్ణాధికారవాద రాజ్యంలో ఒకవ్యక్తి లేదా ఒక పార్టీని నియంతృత్వముంటుంది. దీనికి ఒక అధికార సిద్ధాంతముంటుంది. అధికారవాద రాజ్యంలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన నాయకుడు కూడా ఏకపక్షంగా అధికారాన్ని చెలాయిస్తాడు. ప్రభుత్వాంగాలు కూడ అధికారయుతమైన నాయకుడికి తొత్తులుగా మారిపోతాయి. అధికారం ద్వారా ప్రస్తుతింపబడిన నాయకుడు, పార్టీని తన ఆధీనంలోనికి తెచ్చుకొని వ్యక్తి ఆరాధనను ప్రోత్సహిస్తాడు. కొన్ని సమయాలల్లో అధ్యక్ష ప్రభుత్వావిధానంలోయున్న అధ్యక్షుడు అధికారవాదానికి ప్రతీకగా మారవచ్చు. అధికార వాదరాజ్యంలో ప్రజల జీవన విధానాన్ని నియంత్రణ చేసే సిద్ధాంతముండదు. స్పెయిన్‌లో ఫ్రాంక్, పాకిస్తాన్‌కు చెంది జియా-ఉల్-హక్, బంగ్లాదేశ్‌కు చెందిన ఎర్షాద్‌లను అధికారవాద పాలకులకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

## 15.3 సంపూర్ణాధికారవాదం - లక్షణాలు

**సంపూర్ణాధికారవాదం ఈక్రింది లక్షణాలను కలిగియుంటుంది. అవి :**

1. సంపూర్ణాధికారవాద రాజ్యం స్వభావరీత్యా నియంతృత్వరాజ్యం. ఇది ఉదారవాద ప్రజాస్వామ్యనికి, పార్లమెంటరీ ప్రభుత్వ విధానానికి విరుద్ధమైనది. సంపూర్ణాధికారవాద రాజ్యంలో అధికారమంతా ఒకవ్యక్తి చేతిలో కాని ఒక పార్టీచేతిలో కాని కేంద్రీకృతమై యుంటుంది. రష్యాలో పార్టీని నియంతృత్వం నెలకొనియుంటే, పాసిస్టు ఇటలీ, నాజీ జర్మనీలలో ఏకవ్యక్తి నియంతృత్వముండేది. రష్యాలోనే సంపూర్ణాధికారవాదం వామపక్షానికి చెందితే ఇటలీ, జర్మనీలలోని నియంతృత్వం మితవాదపక్షానికి చెందినది. ఇటలీ, జర్మనీలో నాయకులకు ప్రజలందరు దాసోహమయ్యారు. ఈ దేశాలలోని శాసన సభలను మాట్లాడే అంగడుల వంటివని నియంతలు భావించేవారు. అటువంటివి ప్రగతిని సాధించలేవని, యుద్ధ సమయాలలో నిష్ప్రయోజనమని వారి భావన. వారి దృష్టిలో ప్రజాస్వామ్యం కుళ్ళుతున్న కళేబరంవంటిది.

2. సంపూర్ణాధికారవాదానికి వ్యక్తి స్వేచ్ఛలో నమ్మకం లేదు. వ్యక్తి స్వేచ్ఛ బూర్జువా భావమని కమ్యూనిస్టులు భావించినారు. సంపూర్ణధికారవాద రాజ్యంలో ఒకే పార్టీ ప్రభుత్వముంటుంది. ప్రతిపక్షాలు ఉండటానికి వీలులేదు. ఏకపార్టీ పరిధిలోనే విమర్శను అనుమతిస్తారు. అదికూడ అమలులో ఉన్న రాజకీయ వ్యవస్థ మరింత సమర్థంగా పనిచేయటానికి అవసరమైన మార్గాలను సూచించటానికే తప్ప, సంపూర్ణాధికార వ్యవస్థను తొలగించమని చెప్పటానికి వీలుకాదు. భావ ప్రకటనా స్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం, సంఘాలు, సమావేశాలు ఏర్పాటు చేసికొనే స్వాతంత్ర్యం మొదలైనవి సంపూర్ణాధికారవాద రాజ్యంలో యుండవు. పత్రికలు, రేడియో, సినిమా, కళలు మొదలైన వాటిని ప్రభుత్వం నియంత్రణ చేస్తుంది. అన్నిరంగాలలోను సమ్మెలను నిషేధిస్తారు. విద్యాసంస్థలను రాజకీయ ప్రచార సాదనాలుగా ప్రభుత్వం వినియోగించుకుంటుంది. సైన్యంలోను, సివిల్ సర్వీసులలోను, న్యాయశాఖలలోను, విశ్వవిద్యాలయాలలోను దేశవ్యతిరేకశక్తులను ప్రభుత్వం నిర్మూలించటం జరుగుతుంది. ప్రజాభిప్రాయం ప్రభుత్వానికి అనుకూలంగా మలచటానికి వీలుగా సంపూర్ణాధికార వాదం ప్రచార సాథనాలకు ఎక్కువ ప్రాధాన్యం యిస్తుంది. దేశప్రజలంతా ఒకేరీతిలో ప్రభుత్వానికి అనుకూలంగా ఆలోచించేటట్లు ప్రచారం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతుంది.

3. సంపూర్ణాధికారవాదం హేతుబద్ధమైనదికాదు. ప్రజల సహజగుణాలను, ఉద్వేగాలను రెచ్చగొడుతుంది. ఇది మేధో విరుద్ధమైన సిద్ధాంతము. ఫాసిజం, నాజిజం ఈ రెండూ విజ్ఞాన వ్యతిరేక సిద్ధాంతాలు.

4. సంపూర్ణాధికారవాదం రాజ్యారాధనకు, రాజ్యాధికారానికి ఎక్కువ ప్రాముఖ్యమిస్తుంది. సంకుచిత జాతీయ భావం. జాతీయ దురభిమానం, యుద్ధ ప్రవృత్తి, సామ్రాజ్యకాంక్ష మొదలైనవి సంపూర్ణా రాజ్యాధికారవాద సిద్ధాంతాలైన ఫాసిజం, నాజిజంల లక్షణాలు. అంతర్జాతీయ శాంతి పిరికిపందల కలయని ఫాసిస్టుల భావన. ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడం ద్వారా వారిని యుద్ధోన్ముఖులుగా ఫాసిస్టు నియంతలు తయారుచేస్తారు. జాతి వికాసానికి యుద్ధం అవసరమని ముస్సోలిని, హిట్లరు వాదించినారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతం కూడా జాతీయతాభావాన్ని, సైనికవాదాన్ని అనుసరించటం ద్వారా బలప్రయోగాన్ని, హింసను ప్రస్తుతించటం జరిగింది.

5. సంపూర్ణాధికారవాదం ఉదారవాదాన్ని, మానవతావాదాన్ని విశ్వసించదు. జాతి దురభిమానాలను రెచ్చగొట్టి తమ జాతి ఉన్నతమైనదని ప్రచారం చేస్తారు. సంపూర్ణాధికార వాదాన్ననుసరించి రాజ్యం అన్నిరంగాలలో వీలైనంతవరకు స్వయం పోషకంగా ఉండాలి. అటువంటి రాజ్యాలలో తయారైన వస్తువులను అమ్మటానికి మార్కెట్టు కోసం విదేశీ వ్యాపారాన్ని సంపూర్ణాధికారవాద రాజ్యం నిర్వహిస్తుంది.

6. సంపూర్ణాధికారవాద రాజ్యం మతానికి వ్యతిరేకం. మతాన్ని రాజ్య స్వప్రయోజనాల గురించి ఉపయోగించటం జరుగుతుంది. నాజిజం, ఫాసిజం సంపూర్ణాధికారవాద రాజ్య స్థాపనకు మతాన్ని ఉపయోగిస్తే, కమ్యూనిజం మతాన్ని నిషేదించింది. మతం స్థానంలో తమ రాజ్యనియంతను, రాజ్యసిద్ధాంతాన్ని నెలకొల్పటానికి అటువంటి రాజ్యాంలో ప్రయత్నాలు జరుగుతాయి.

7. సంపూర్ణాధికారవాదం ఒకరకమైన ప్రజా ఉద్యమం. సంపూర్ణాధికారవాద రాజ్యంలోని నియంత ప్రజల మద్ధతను పొందటానిక ఎన్నోరకాలుగా ప్రయత్నిస్తాడు. ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడం, వారిలో దురభిమానాలను పెంపొందించటం, ప్రజలను బయపెట్టడం వంటి ప్రత్యక్షచర్యల ద్వారా ప్రజలమద్ధతును నియంతలు సంపాధిస్తారు. అనేకరకాల హామీలను నియంతలు ప్రజలకిస్తారు.

8. సంపూర్ణాధికార వాద రాజ్యంలో శిష్టులు క్రమశిక్షణతో మెలుగుతారు. పార్టీవ్యవస్థ ద్వారా, సిద్ధాంత రీత్యా వారంత కలిసికట్టుగా, సమైక్యంగా యుంటారు. ఒకే పార్టీ అధికారాన్నంతా హస్తగతం చేసికొంటుంది. ఇతర పార్టీలను నిషేధించటం జరుగుతుంది. ప్రచార సాధనాలుగా పార్లమెంటరీ సంస్థలు ఉన్నప్పటికి, వాటి అధికారాలు నామమాత్రమే. రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్షం, సమన్యాయపాలన, స్వతంత్ర్య న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత ఎన్నికలు, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు, ప్రచురణ హక్కు సంపూర్ణాధికారవాద రాజ్యాలలో యుండవు.

## 15.4 సంపూర్ణాధికారవాదం - వివిధరూపాలు

సంపూర్ణాధికారవాదం వివిధ దేశాలలో విభిన్న రూపాలను సంతరించుకొంది. ఆవిధంగా సోవియట్ రష్యాలో మార్క్సిజం లేదా కమ్యూనిజంగాను, జర్మనీలో నాజిజంగాను, ఇటలీలో ఫాసిజంగాను సంపూర్ణాధికారవాదం అమలులోనికి వచ్చింది. విభిన్న రాజ్యాలకు చెందిన ఈ సిద్ధాంతాల మధ్య కొన్ని

B R A O U

సారూప్యాలున్నప్పటికి వీటి మధ్య కొన్ని భేదాలు కూడా ఉన్నాయి. రష్యాలో పార్టీ నియంతృత్వం నెలకొంటే, ఫాసిస్టు ఇటలీ, నాజీ జర్మనీలలో ఏకవ్యక్తి నియంతృత్వం యుండేది. రష్యాలోని సంపూర్ణాధికారవాదం వామపక్షానికి చెందితే, ఇటలీ, జర్మనీలలో నియంతృత్వం మితవాద పక్షానికి చెందినవి. సోవియట్ రష్యాలోని నియంతృత్వ వ్యవస్థ ప్రైవేటు పెట్టుబడిని, వర్తక వ్యాపారాలను జాతీయంచేస్తే, ఇటలీ, జర్మనీలలోని నియంతృత్వ వ్యవస్థలు రాజ్యనియంత్రణలో ప్రైవేటు పెట్టుబడిని, వర్తక వ్యాపారాలను అనుమతించినాయి. నాజిజం పరిశుద్ధ నార్డిక్ జాతికి ప్రాధాన్యమిస్తే, కమ్యూనిజం ప్రపంచంలో శ్రామిక వర్గ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చింది. సామ్యవాద రష్యాజాతుల మధ్య సమానత్వాన్ని గుర్తిస్తే, నాజీ జర్మనీ ఫాసిస్టు ఇటలీలు తమతమ జాతి ప్రజలు మిగిలిన జాతులవారికంటే ఉన్నతమైనవారుగా ప్రచారం చేసినారు. తీవ్రవాద జాతీయతావాదం నాజీ జర్మనీ, ఫాసిస్టు ఇటలీల ముఖ్యలక్షణమైతే, సామ్యవాద రష్యా అంతర్జాతీయ దృక్పథాన్ని కనపర్చింది.

ఇపుడు వివిధ దేశాలలో నెలకొన్న సంపూర్ణాధికారవాద రాజ్యాల స్వరూప స్వభావాలను గురించి పరిశీలిద్దాం :

## 15.4.1 రష్యాలో సంపూర్ణాధికారవాదం

ఇటలీ, జర్మనీలలో స్థాపించిన ఫాసిస్టుల సంపూర్ణాధికార రాజ్యాలకంటె రష్యాలో స్థాపించిన కమ్యూనిస్టు సంపూర్ణాధికార రాజ్యం విభిన్నమైనది. ఫాసిస్టు సంపూర్ణాధికార వాదానికి సిద్ధాంత పరమైన ప్రాతిప్రదికలు లేవు. కాని రష్యాలో స్థాపించిన సంపూర్ణధికారవాద రాజ్యానికి 'కమ్యూనిజం' పేరుతో ఒక సిద్ధాంత ప్రాతిపదిక యున్నది. రష్యా 1917కు ముందు జార్ చక్రవర్తుల నియంతృత్వపాలనలో యుండేది. ఉదారవాద ఉద్యమాలు జార్ చక్రవర్తులు అణచివేసినారు. ప్రజలు ఎన్నో కష్టాలను అనుభవించినారు. ఆకలి బాధలకు లోనయ్యారు. మొదటి ప్రపంచయుద్ధంలో రష్యాపతనం చెందిన తరువాత లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ పార్టీ విజృంభించింది. బోల్షివిక్ పార్టీ 1917లో కార్మిక విప్లవాన్ని తీసికొని రావటం ద్వారా కార్మిక నియంతృత్వాన్ని స్థాపించింది. కార్మిక నియంతృత్వం వాస్తవానికి బోల్షివిక్ పార్టీ నియంతృత్వమే. బోల్షివికే పార్టీ ఆధ్వర్యంలో ధనిక భూస్వాములను, బూర్జువా వర్గాన్ని హింసాత్మక పద్ధతుల ద్వారా నిర్మూలించినారు. పరిశ్రమలను జాతీయంచేసి ప్రైవేటు వ్యాపారాన్ని నిషేధించినారు. ఒక కమ్యూనిస్టు పార్టీని తప్పించి యితర పార్టీలను నిషేధించడమైనది. ప్రజలు పౌరహక్కులను కోల్పోయారు. ప్రభుత్వవ్యతిరేక విమర్శలను నిర్దాక్షిణ్యంగా ప్రభుత్వం అణచివేసింది. కేంద్రీకృతమైన నాయకత్వం ఏర్పడింది. పార్టీ నాయకులకే నిర్ణయాలుచేసే అధికారముంటుంది. పార్టీ విధానాలను వ్యతిరేకించిన పార్టీ సభ్యులను పార్టీనుంచి తొలగించడమైనది హత్యలు, కఠినమైన లేబర్‌కేంపుల ద్వారా కమ్యూనిస్టు వ్యతిరేకశక్తులను నిర్మూలించింది. పెట్టుబడివారి విధానం నుండి కమ్యూనిజానికి మారే సంధికాలంలో హింసాత్మక చర్యలు, అణచివేత విధానాలు తప్పవని లెనిన్ వాదించినాడు. ఆదునిక ఉదరావాద ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక సంస్థలు కమ్యూనిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకమని భావించటం జరిగింది.

రష్యాలో ఏర్పాటైనది సైనికవాదం మీద ఆధారపడిన స్టాలిన్‌నిజమ్ తప్ప సామ్యవాదంకాని, కమ్యూనిజమ్‌కాని కాదని విమర్శకులు అభిప్రాయపడినారు. వ్యక్తి అవసరాలను బట్టి పంపిణి పద్ధతి ఇంతవరకు రష్యాలో లేదని వారి అభిప్రాయం. వర్గరహిత సమాజ స్థాపన కమ్యూనిస్టుల సహజ లక్ష్యంగా పేర్కొన్నప్పటికి, రష్యాలో అందరికి ఒకేరకమైన ఆదరణ లభించలేదు. రష్యాలో రాజ్యం అంతరించేపోయి

ఎక్కడా కన్పించడంలేదు. దీనికి భిన్నంగా రాజ్యాధికారం నానాటికి పెరిగిపోతూ వచ్చింది. పార్టీ సభ్యులు కఠినమైన క్రమశిక్షణకులోబడి ఉండాల్సి. పార్టీ అధినేతలకు ప్రత్యేకమైన హక్కులు కల్పించబడినాయి. సామ్యవాద రష్యా ప్రపంచ విప్లవ నినాదాన్ని విడిచిపెట్టేసింది. రష్యాలో జాతీయతావాదం, సైనికవాదం పెరిగినాయని చెప్పవచ్చు. ఈవిధంగా సోవియట్ రష్యాలో సంపూర్ణాధికారవాద రాజ్యలక్షణాలున్నప్పటికి పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో మంచి ప్రగతిని సాదించింది. సాంఘిక భద్రతను చేకూర్చడంలోను, విద్యావ్యాప్తిలోను, నిరుద్యోగాన్ని నిర్మూలించటంలోను రష్యా ఘనవిజాయాన్ని సాధించింది. ఈరకమైన ప్రగతిని ఆధారంగా చేసికొనే 1991 వరకు సోవియట్ రష్యాను అంతర్జాతీయ సమాజంలో ఒకసూపర్ పవర్‌గా పరిగణించినారు.

### 15.4.2 ఫాసిజం

ఇటలీలో సంపూర్ణాధికారవాదం బెనిటో ముస్సోలిని ఆధ్వర్యంలో ఫాసిజంగా ఆవిర్భవించింది. ఫాసిస్టు సిద్ధాంతం రాజ్యానికి అత్యున్నత స్థానాన్ని యిచ్చింది. వ్యక్తిని రాజ్యానికి అధీనుడుగా మార్చివేసింది. వ్యక్తి రాజ్యాన్ని కోరుకున్నాడు కానీ రాజ్యం వ్యక్తి కొరకు లేదని ఫాసిస్ట్ సిద్ధాంతం. రాజ్యంలోనే పౌరజీవితం ప్రారంభమవుతుంది. రాజ్యాల వెలుపల పౌరజీవితానికి ప్రాధాన్యం లేదు. ఫాసిస్ట్ సిద్ధాంతంలో రాజ్యాలపట్ల పౌరుడు నిర్వహించవలసిన విధులకు తప్ప పౌరహక్కులకు గుర్తింపులేదు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జరిగిన వర్సేల్స్ సంధిలోని లోపాలు, సోవియట్ రష్యాలో సామ్యవాదం ఆవిర్భావం వంటి మొదటి ప్రపంచ యుద్ధానంతర సంఘటనలు ఇటలీలో ఫాసిజం ఆవిర్భావానికి దోహదం చేసినాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఇటలీలో చోటుచేసికొన్న రాజకీయ అస్థిరత్వం, ఆర్థిక దుస్థితి, అది బలపడటానికి తోడ్పడినాయి. ముస్సోలిని ఇటలీని "మితవాదుల తిరోగమన వైఖరుల నుండి, అదే సమయంలో అతివాదుల విధ్వంసకర చర్యల నుండి" రక్షించటానికి 1915లో ఫాసిస్టు పార్టీని స్థాపించినాడు. ఫాసిస్టు విప్లవాన్ని ముస్సోలిని "పార్టీలకతీతమైన ఉద్యమంగా" అభివర్ణించినాడు.

'ఫాసిజమ్' అనేపదం 'ఫాసియో' అనే రోమన్ పదంనుండి వచ్చింది. 'ఫాసియా' అంటే కట్టెమోపు అని అర్థం. కట్టెలమోపు క్రమశిక్షణకు, ఐక్యతకు, బలానికి చిహ్నం. నల్లని దుస్తులను ధరించి ఫాసిస్టులు సైనికకవాతులు నిర్వహించేవారు. ఫాసిజమే ప్రజాస్వామ్య, ఉదారవాద, సామ్యవాద ఆదర్శాలను, పద్ధతులను నిరాకరించింది. కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఫాసిస్టులు తీసికొన్న చర్యలు, ఇటలీ నుండి అరాచకత్వాన్ని తొలగిస్తామన్న వాగ్దానం మితవాదులను బాగా ఆకర్షించింది. పరిస్థితిని గ్రహించిన ముస్సోలిని 1922లో ఫాసిస్టు విప్లవం తీసకొనిరావటం ద్వారా రాజకీయాధికారాన్ని చేజిక్కించుకున్నాడు. ఇటలీలో సమూలమైన మార్పులు తీసికొనివచ్చి ఇటలీని ఒక బలీయమైన రాజ్యాంగం రూపొందించినాడు.

**ఫాసిజం - ముఖ్యలక్షణాలు**

ఫాసిస్టు ప్రభుత్వం ఇటలీని సుమారు 21 సంవత్సరములు పరిపాలించినప్పటికి దానికి సమగ్రమైన ఒక రాజకీయ సిద్ధాంతప్రాతిపదిక అనేది లేదు. మొదటి ప్రపంచయుద్ధం తరువాత ఇటలీలో నెలకొన్న పరిస్థితులను ఆధారంగా చేసికొని రూపొందినది ఫాసిజం. దాని ముఖ్యలక్షణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు. అవి

BRAOU

1. ఫాసిజానికి ఒకరాజకీయ సిద్ధాంతమనేది లేదు. అది ఎక్కువగా అనుభవ పూర్వకమైనది. ఆచరణ యోగ్యమైనది. ఇది వాస్తవాలకు సన్నిహితమైంది. ఫాసిజం కార్యాచరణతో కూడినదని, దానికి మాటలతో పనిలేదని ముస్సోలిని ఒకసారి చెప్పినాడు. అయినప్పటికి ఫాసిజానికి కొంతవరకు సిద్ధాంతపరమైన సూత్రాలున్నాయి. ఇటలీ ప్రజల జీవితాన్ని పునర్వ్యవస్థీకరించి, ఇటలీ బలాన్ని, ఔన్నత్యాన్ని పునరుద్ధరించాలని ఫాసిజం ఆశయం. ఈ ఆశయసిద్ధికి కొంత సిద్ధాంతాన్ని, కొంతవాస్తవాన్ని ఫాసిజమే జోడించింది. ఫాసిస్టులు ఉపయోగించే పద్ధతుల సరళమైనప్పటికి, సహేతుకమైనవికావు.

2. ఫాసిజం వ్యక్తి శ్రేయోవాద సిద్ధాంతానికి వ్యతిరేకము. రాజ్యప్రయోజనాలు అన్నిరకాల ప్రయోజనాల కంటే అతీతమైనవి. ఫాసిజం రాజ్యానికి దైవత్వాన్ని ఆపాదించింది. రాజ్యంలేనిదే పౌరులు లేరు. రాజ్యానికి ఒక ప్రత్యేకమైన అభీష్టం, వ్యక్తిత్వం ఉంటాయి. వ్యక్తులు అశాశ్వతమైతే రాజ్యం శాశ్వతమైనది. ఫాసిస్టు సిద్ధాంతాన్ననుసరించి రాజ్యానికి, వ్యక్తులకు మధ్య ఒక క్రొత్తసంబంధం ఏర్పడింది. సమాజం అంటే జాతి అని, జాతి అంటే రాజ్యమని ఫాసిస్టులు భావించినారు. బలీయమైన జాతిని రూపొందిచంటమే రాజ్యం ధ్యేయం. వ్యక్తి సుఖాన్ని పెంపొందించటం రాజ్యం లక్ష్యం. కాబట్టి స్వేచ్ఛ, సమానత్వం, ఇతర హక్కులను వ్యక్తికి యివ్వటానికి ఫాసిజమే నిరాకరించింది. వీటి స్థానంలో విధులకు, క్రమశిక్షణకు, త్యాగబుద్ధికి ఫాసిజం ప్రాధన్యమిచ్చింది.

3. ఫాసిజం ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించింది. ప్రజాసార్వభౌమత్వాన్ని ఫాసిజం నిరసించింది. ఈ సిద్ధాంతం ప్రకారం సామాన్య ప్రజలకు పాలనాదక్షిత యుండదు. కాబట్టి శిష్టుల పాలన ఉండాలని ఫాసిస్టులు భావించినారు. కొద్దిమంది శ్రేష్ఠజనులకు మాత్రమే దేశభక్తి, విధి నిర్వహణా బాధ్యత ఉంటాయని ఫాసిస్టులు అభిప్రాయపడినారు. వీరే శాసనాలను రూపొందించగలిగే సామర్థ్యాన్ని కలిగియుంటారు. మిగిలిన సామాన్య ప్రజానీకం శ్రేష్ఠ జనుల ఆజ్ఞలను పాటించాలి.

4. ఫాసిజం సామ్యవాదాన్ని, ఉదారవాదాన్ని త్రోసిపుచ్చింది. ఒకవిధంగా ఇటలీలో ఫాసిజంను సామ్యవాద విప్లవం పట్ల పెట్టుబడిదారుల ప్రతిచర్యగా అభివర్ణించవచ్చు. అదేసమయంలో ఫాసిజం సిసలైన పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్యవాదాన్ని వ్యతిరేకించి రెంటికి మధ్యేమార్గాన్ని అనుసరించింది. దేశప్రగతికి శ్రామికులు, పెట్టుబడిదారులు అవసరమేనన్నది ఫాసిజం భావన. అందువలన ఈ రెండు వర్గాల ప్రయోజనాలను కాపాడటానికి ఫాసిస్టులు ప్రయత్నించినారు. వ్యక్తిగత ఆస్తి ఉండవచ్చునన్నారు. ఫ్యాకర్టీల మూసివేతను, సమ్మెలను నిషేధించినారు. వ్యక్తిగత ఆస్థి రాజ్యప్రయోజనాలను దెబ్బ తీయకుండా ప్రజల ఆర్థిక, సాంఘిక జీవన విధానాన్నంతటిని రాజ్యం నియంత్రణ చేయవచ్చునని వాదించినారు.

5. ఫాసిస్టు సిద్ధాంతంలో కార్పొరేటివ్ రాజ్యానికి అధిక ప్రధాన్యముంది. అటువంటి రాజ్యాంగలో శ్రామికులు, పారిశ్రామికవేత్తలు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించవచ్చునని ఫాసిస్టులు భావించినారు. ప్రైవేటు పారిశ్రామికవేత్తల చేతిలో పరిశ్రమలున్నప్పటికి ఆర్థిక ప్రణాళికలను రాజ్యమే రూపొందిస్తుంది. శ్రామిక సంఘాలకు ఫాసిస్టుల రాజ్యాంలో స్థానంలేదు. వాటికి బదులు వివిద కార్పొరేషన్లు ఉంటాయి. ఒక్కొక్క కార్పొరేషన్ ఒక్కొక్క పరిశ్రమను నియంత్రణ చేస్తుంది. అటువంటి కార్పొరేషన్లనన్నింటిని రాజ్యం నియంత్రణ చేస్తుంది. ఈ విధానంలో శ్రామికుల ప్రయోజనాలను, సంక్షేమాన్ని కాపాడటం జరుగుతుంది.

BRAOU

6. ఫాసిజం రాజ్యంలో ఏకపార్టీ ఆధిపత్యాన్ని సమర్థించింది. దేశప్రగతికి ఒకే రాజకీయ పార్టీ యుంటే మంచిదని ఫాసిస్టుల భావించినారు. రాజ్యాధికారమంతా ఒకే నియంతచేతిలో ఉండాలని కూడ వారు పేర్కొన్నారు.

7. హింసాయుత పద్ధతులద్వారా రాజ్యలక్ష్యాలను సాధించాలని ఫాసిస్టుల నమ్మకం. దౌర్జన్య పద్ధతులు వారిదృష్టిలో నైతికమైనదే. వీరి అభిప్రాయంలో రాజ్యాధినేత నిర్దాయుడైయుండాలి. ప్రభుత్వంపట్ల ప్రజలలో గౌరవాన్ని కలిగించటం, వారు ప్రభుత్వాజ్ఞలను పాటించేటట్లు చేయటం నిజమైన నాయకుని లక్షణం.

8. అంతర్జాతీయ శాంతిలో ఫాసిస్టులకు నమ్మకంలేదు. వారు శాంతికాముకతను నిరసించి, యుద్ధాన్ని ప్రస్తుతించినారు. 'అంతర్జాతీయ శాంతి అనేది పిరికివాల్ల కల్పన' అని ప్రకటించినారు. ఇటలీ రాజ్యాన్ని విస్తరించటం అనేది ఫాసిస్టుల లక్ష్యం. వారి అభిప్రాయంలో యుద్ధం చేయటమన్నది ప్రతిపౌరుడి విధి 'స్త్రీకి మాతృత్వం ఎటువంటిదో, జాతికి యుద్ధం అటువంటిది' అని ఫాసిస్టుల వాదించినారు.

9. ఫాసిస్టులు ఇటలీ జాతి ప్రపంచంలోని మిగిలిన జాతుల కంటె ఉన్నతమైనదని, ఉత్కృష్టమైనదని ప్రవచించినారు.

ముస్సోలిని స్థాపించిన ఫాసిస్టు నియంతృత్వం సమర్థవంతమైన పాలనను, అంతరంగిక భద్రతను, మెరుగైన ఆర్థిక విధానాన్ని, శ్రామికులకు, పెట్టుబడిదారులకు మధ్య సామరస్యమైన సంబంధాలను, ఇనుమడించిన జాతిగౌరవ ప్రతిష్ఠలను ఇటలీ దేశస్థులకు అందజేసింది. ఇటలీ దేశస్తులలో నూతనోత్తేజాన్ని, సంఘీభావాన్ని ఫాసిజం కలుగుజేసింది. ముస్సోలిని సాధించిన ఘనవిజయాలు నియంతలకు గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. కాని ఫాసిస్టులు ఉపయోగించిన పద్ధతులు, వాటి పరిణామాలు పరిశీలకుల విమర్శలకు గురైనాయి. కండబలం మీద ఆధారపడిన ప్రభుత్వాలు శాశ్వతము, సుస్థిరము అయిన ఫలితాలను సమాజంలో తీసికొని రాజాలవు. కేంద్రీకృత వ్యవస్థ మీద, బలప్రయోగం మీద ఆధారపడిన జాతిజీవనము, సాంస్కృతిక జీవన విధానము శాస్త్ర, లలితకళల అభివృద్ధిని నాశనం చేస్తుందని కోకర్ అభిప్రాయపడినాడు. ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే ఫాసిజం విజయాన్ని సాధించగలిగింది కాని అందరు ప్రజలకు అన్నికాలలో ఫాసిస్టుల నియంతృత్వం పనికిరాదు.

### 15.4.3 నాజీజం

నాజీజం కూడ ఫాసిజంవలె సంపూర్ణ అధికారవాదాన్ని ఆమోదించింది. మొదటి ప్రపంచయుద్ధంలో జర్మనీ ఓడిపోవటం, యుద్ధానంతర పరిణామాలు జర్మనీలో నాజీజం ఆవిర్భవించటానికి కారణమయ్యాయి. అవమానకరమైన వర్సైల్స్ సంధి షరతులు, ఈ సంధిషరుతుల ద్వారా జర్మనీ పోగొట్టుకున్న వలసలు, అధికమొత్తంలో నష్టపరిహార సమస్య, నానాటికి పెరిగిపోతున్న నిరుద్యోగ సమస్య, యుద్ధానంతరం జర్మనీలో చేటుచేసికొన్న రాజకీయ అల్లకల్లోల పరిస్థితులు జర్మనీలో జాతీయ ఉద్యమాలకు దారి తీసినాయి. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత వైమార్ రాజ్యాంగం (1919) ద్వారా ఏర్పాటైన వివిధ ప్రజాస్వామిక ప్రభుత్వాలు జర్మనీ ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించలేకపోయినారు. ఈ పరిస్థితులను ఆధారంగా చేసికొని అడాల్ఫ్ హిట్లర్ మరియు అతని నాజీ పార్టీ 1934లో హింసాత్మక పద్ధతుల ద్వారా అధికారాన్ని హస్తగతం చేసికొన్నది. అవిధంగా 1934 నాటికి హిట్లర్ ఆధ్వర్యంలో జర్మనీలో నాజీనియంతృత్వం స్థాపించబడింది.

ఫాసిజంవలె నాజీజంకు కూడా ఒక పరిపూర్ణమైన రాజకీయ సిద్ధాంతమనేది లేదు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత జర్మనీలో నెలకొన్న పరిస్థితులను ఆధారంగా చేసికొని నాజీజం ఒక ఉద్యమంగా జర్మనీలో రూపుదాల్చిందని చెప్పవచ్చు. ఆవిధంగా యుద్ధానంతర జర్మన్ ప్రజల ఆవేశకావేషాలు, భావజాలము నాజీజం సిద్ధాంతాలకు కొంతవరకు ప్రాతిపదికలైనాయి. హిట్లర్ వ్యక్తిత్వము, అతని మానసిక ప్రవృత్తి నాజీ విధానాలను చాలా ఎక్కువగా ప్రభావితం చేసినాయి. అందువలననే నాజీజంను పలువురు 'హిట్లరిజమ్'గా పేర్కొంటూ యుంటారు. జర్మనీ ఆదర్శవాదులైన కాంట్, ఫిచేట్, హెగెల్ రచనలు మరియు ఇటలీకి చెందిన ముస్సోలిని ఫాసిస్టు సిద్ధాంతం కూడా హిట్లర్ ప్రవచించిన నాజీ విధానాలపై చాలా ఎక్కువగా ప్రభావాన్ని ప్రసరించినాయి. ఇప్పుడు నాజీజం ముఖ్యలక్షణాలను పరిశీలిద్దాం :

1. నాజీజం అధికారవాదాన్ని మనస్ఫూర్తిగా అమోదించింది. ప్రజాస్వామ్యాన్ని , పార్లమెంటరీ విధానాన్ని నాజీజం త్రోసిపుచ్చింది. జర్మనీలో నాజీ నియంతృత్వం ప్రతిపక్షాలను నిషేధించింది. ప్రజలే ప్రభుత్వాధికారానికి మూలమనే ప్రజాస్వామిక వాదనను నాజీలు నిరాకరించినారు. అధికారంపై నుంచి క్రిందికి వస్తే, బాధ్యతలు క్రిందినుండి పైకి వెళతాయి. కాబట్టి ఏ పౌరుడు ప్రభుత్వంపై తిరుగుబాటు చేసినా, అతనిని ప్రభుత్వం అణచివేయవచ్చు. బలప్రయోగం విజయవంతం కావాలంటే, దానిని నిర్దాక్షిణ్యంగా ఉపయోగించాలని హిట్లర్ వాదించినాడు. ఫాసిజం, నాజీజం రెండూ అధికారవాద సిద్ధాంతాలైనప్పటికీ, వాటి లక్ష్యసాధనకు కొన్ని ప్రజాస్వామ్య సూత్రాలను అనుసరించాయి. సమర్థులే పరిపాలన చేయ్యాలని రెండు సిద్ధాంతాలు చెప్పాయి. వాటి మౌలిక విధానాలకు ప్రజాదరణ సంపాదించటానికి ఫాసిజం, నాజీజం ప్రయత్నించి సఫలీకృతమైనాయి. రెండూ ప్రజా ఉద్యమాలుగా గణతికెక్కినాయి.

2. నాజీ సిద్ధాంతం ప్రకారం రాజ్యానికి ముఖ్యలక్షణం బలప్రయోగం. నీతి, న్యాయం రాజ్య లక్ష్యంకాదు. వ్యక్తి జీవించాలంటే, అతను యుద్ధం చేయాలని హిట్లర్ ప్రబోధించినాడు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తును ప్రసాదించాలంటే తండ్రులు యుద్ధరంగానికి వెళ్ళాలి. పిల్లలను యుద్ధానికి పంపించటం కంటె గొప్పదైన పురస్కారం తల్లులకు లేదని హిట్లర్ ఉద్భోధించినాడు.

3. ఫాసిజంవలె నాజీ సిద్ధాంతంలో కూడా పార్టీకి అధిక ప్రాధ్యానం లభించింది. ప్రజలకు, రాజ్యానికి మధ్య పార్టీ సంధానకర్తగా పనిచేస్తుంది. ఒకేవ్యక్తి నాయకత్వంలో పనిచేసే సైనికులుగా ప్రజలను నాజీ పార్టీ మార్చింది. ఈలక్ష్యసాధనకు రాజ్యం సహకరించింది. కాబట్టి రాజ్యానికి, పార్టీకి మధ్య బేధం లేదు. పార్టీ వ్యవస్థీకరణ క్రమానుగత శ్రేణి సూత్రాలననుసరించి జరుగుతుంది. దీనిప్రకారం పైవారి ఆదేశాలను క్రిందివారు తూచా తప్పక ఆచరించాలి. పార్టీ వ్యవస్థలో అత్యున్నత స్థానం పార్టీ నాయకునికుంటుంది. నాజీ జర్మన్‌లో రాజ్యానికి, ప్రభుత్వానికి, సైన్యానికి అధినేత హిట్లర్. పార్టీ సభ్యులే ప్రభుత్వంలో కూడా అత్యున్నత స్థానాలను ఆక్రమించేవారు ప్రజలను పార్టీ ఎక్కువగా అదుపులో ఉంచేది. ప్రజాజీవితాన్ని నాజీ పార్టీ పెనవేసుకొనిపోయింది.

4. ఆర్యజాతి ప్రపంచ జాతులన్నింటిలోకి ఉత్తమ జాతి అని హిట్లర్ భావించినాడు. కాబట్టి ఆర్యజాతికి చెందిన జర్మనులు కలుషితం కాకుండా ఉండటానికి ఇతర జాతులను నాశనం చేయ్యాలని హిట్లర్ ప్రబోధించినాడు. ఆర్యులు కాని వారంతా అసంపూర్ణ మానవులని హిట్లర్ భావించినాడు. ఈభావనను

ఆధారంగా చేసికొని యూదులకు వ్యతిరేకంగా వ్యవహరించినాడు. యూదు జాతిని నాశనం చేయటానికి ప్రయత్నించినాడు. "జాతిదురహంకారం, సామ్యవాద రాజకీయాలు మరియు కమ్యూనిష్టు వ్యూహాల సమ్మేళనమే నాజీల కార్యక్రమమ"ని స్కపిరో (Scuapiro) అభిప్రాయపడినాడు.

5. రాజకీయ, ఆర్థిక విధానాలకు సంబంధించి నాజీజం కూడ ఫాసిజం అడుగుజాడల్లోనే వ్యవహరించింది. ఫాసిజంవలె నాజీజం కూడ జాతీయ సమగ్రతకు ఎక్కువ ప్రాధాన్యం యిచ్చింది. పెట్టుబడిదారీ విధానాన్ని, సామ్యవాదాన్ని నాజీజం నిరాకరించింది. పారిశ్రామికవేత్తలకు, కార్మికులకు మధ్య సంఘర్షణకు తావులేదని నాజీజం అభిప్రాయపడింది. భారీ పరిశ్రమలు, వర్తక వ్యాపారం, బ్యాంకులు, భీమాసంస్థలు, ప్రజోపయోగ సంస్థలను ప్రభుత్వమే నియంత్రణ చేస్తుంది. పనిచేసే ఉద్దేశం ఉన్నవారికి కనీసవేతనాలు యిప్పించటం, ఉద్యోగాలు చూపించటం రాజ్యవిధి అని నాజీలు వక్కాణించినారు.

6. అంతర్జాతీయ న్యాయసూత్రాలకు, నైతికవిలువలకు తిలోదకాలిస్తూ, అవసరమైతే యుద్ధం ద్వారానైనా జర్మనీని అంతర్జాతీయ సమాజంలో అగ్రరాజ్యాంగా రూపొందించటమే నాజీల లక్ష్యంగా పేర్కొన్నారు. వర్సెల్స్ సంధి వలన జరిగిన అన్యాయాన్ని ఎదుర్కొనటానికి జర్మనీ జాతినంతటిని హిట్లర్ సమైక్యపరచినాడు. కాబట్టి నాజీ ఉద్యమము జర్మనీ జాతి సమైక్యతా ఉద్యమంగా మారింది. ఈ ఉద్యమం వలన ఇరుగుపొరుగు రాజ్యాలకు ముప్పు ఏర్పడి ప్రపంచ శాంతికి భంగం కలిగించింది. నానా జాతి సమితిని, నాజీలు మిత్ర రాజ్యాలు "స్వప్నసౌధం" (Dreamy Discovery) గా నిరసించినారు.

నాజీ సిద్ధాంతాన్ని, నాజీ కార్యక్రమాలను రూపొందించి, అమలు చేయటంలో ఉన్నతమైన హిట్లర్ వ్యక్తిత్వం, బలీయమైన పార్టీ వ్యవస్థ, సమర్థమైన ప్రచార సాదనాలు చాల ప్రముఖపాత్ర వహించినాయి. ప్రపంచ విధాన నిర్ణేతగా హిట్లర్ తనను తాను భావించుకున్నాడు. తన లక్ష్యసాధనకు అబద్ధాలను, తప్పుడు ప్రచారాలను సాధనాలుగా వాడుకుని సామాన్య ప్రజానీకాన్ని తనకు అనుకూలంగా ఉన్మత్తులను చేసినాడు. ప్రచారం ప్రాముఖ్యాన్ని గురించి తన స్వీయా చరిత్ర 'మీన్‌కాంఫ్' (Meinkampf)లో హిట్లర్ సమగ్రంగా వివరించినాడు. ప్రచారానికి, సత్యానికి సంబందంలేదని హిట్లర్ ముఖ్య అనుచరుడు గోబెల్స్ భావించినాడు. అంతేగాక నాజీజం సామ్యవాద పద్ధతులను, సంస్థలను విరివిగా అనుసరించింది. కాని వాటిని సామాజిక న్యాయ్యాన్ని, సామ్యవాదాన్ని స్థాపించటానికి ఉపయోగించలేదు. వాటిని జర్మనీలో సంపూర్ణాధికార సైనిక రాజ్యాన్ని స్థాపించటానిక నాజీ నియంతలు ఉపయోగించినారు. చివరకు నాజీ జర్మన్ అనుసరించిన హేతువిరుద్ధమైన సైనికవాదం రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ పతనానికి దారి తీసింది.

## 15.5 క్లుప్తంగా

సంపూర్ణాధికార వాదం ప్రజాస్వామ్య ఉదారవాదానికి వ్యతిరేకమైనది. ప్రాచీన కాలంనుండి నేటివరకు ఇది ఏదో ఒకరూపంలో కనిపిస్తున్నది. ఫాసిజం, నాజీజం, కమ్యూనిజం ఈ మూడు సంపూర్ణాధికారవాదం రూపాలు. రాజ్యారాధన, హింసాత్మక పద్ధతులు, వ్యక్తి స్వేచ్ఛను అణచివేయటం, రాజ్యంలోయున్న వివిధ సంస్థలు, వ్యవస్థలను పార్టీకి, పార్టీ నాయకులకు లోబరచటం మొదలైనవి సంపూర్ణాధికారవాదం ముఖ్యలక్షణాలు. అధికారాన్ని హస్తగతం చేసికొని, దానిని పరిరక్షించటానికి యుద్ధ సన్నాహాలు, ఉధృత ప్రచారం, తీవ్ర జాతీయవాదం మొదలైన సాధనాలను సంపూర్ణాధికారవాదులు ఉపయెగిస్తారు. దేశాన్ని



BRAOU

ఆర్థికంగా పటిష్టం చేయ్యాలనే కోరిక, సామ్రాజ్యకాంక్ష సంపూర్ణాధికారవాదం అవతరణకు కారణాలుగా పేర్కొనవచ్చు. ఫాసిజం, నాజీజంలు ఇటలీ, జర్మనీలకు వినాశనాన్నికొని తెస్తే, కమ్యూనిజం కమ్యూనిస్ట్ రాజ్యాలను బలమైన ఆధునిక రాజ్యాలుగా రూపొందించింది.

## 15.6 చదువదగిన పుస్తకాలు

| | |
|---|---|
| Gilchrist | : Principles of Political Science |
| E. Asirvatham | : Political Theory |
| A.C. Kapur | : Principles of Political Science |
| Frances W. Coker | : Recent Political Thought |

## 15.7 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. సంపూర్ణాధికారవాదం ముఖ్య లక్షణాలను వర్ణించండి
2. వివిధరాకల సంపూర్ణాదికార వాదాల మద్య తేడాలను తెలియజేయండి
3. ఫాసిజం ముఖ్య లక్షణాలను తెలియజేయుము
4. నాజీజం ముఖ్య లక్షణాలను వివరింపుము

**II. ఒక్కొక్క ప్రశ్నకు 10 పంక్తులలో జవాబులిమ్ము.**

1. సంపూర్ణాధికారవాదంగా కమ్యూనిజం లక్షణాలను వివరించుము
2. 'Meinkampf" ను గురించి 10 పంక్తులలో వివరింపుము

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

BRAOU

# భాగం-16: ఆధునిక ప్రభుత్వ రూపాలు - ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యం

విషయ సూచిక


16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 ప్రజాస్వామ్యం - అర్థవివరణ

16.2.1 కొన్ని నిర్వచనాలు

16.3 ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యం

16.3.1 ప్రత్యక్ష ప్రజాస్వామ్యం - అర్థవివరణ

16.3.1.1 క్రీ.పూ. 5వ శతాబ్దంలో ఏథెన్స్‌లో ప్రజాస్వామ్యం

16.3.1.2 స్విట్జర్లాండ్‌లో పౌర శాసన సభలు (Lands Gemainden)

16.3.1.3 న్యూ ఇంగ్లండ్ టౌన్ మీటింగ్

16.3.1.4 ప్రత్యక్ష ప్రజాస్వామ్య లాభాలు

16.3.1.5 ప్రత్యక్ష ప్రజాస్వామ్య నష్టాలు

16.3.2. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం

16.3.2.1 పరోక్ష ప్రజాస్వామ్యం - అర్థవివరణ - ముఖ్యాంశాలు

16.3.2.2 ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం - అర్థవివరణ - ముఖ్యాంశాలు

16.3.2.3 పరోక్ష లేదా ప్రజాస్వామ్య లక్షణాలు

16.3.2.4 పరోక్ష లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లోపాలు

16.3.2.5 ప్రజాస్వామ్య సమర్థన

16.3.2.6 ప్రజాస్వామ్య విజయానికి అనుకూల పరిస్థితులు

16.4 ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనాలు (Direct Democratic Devices)

16.4.1 ప్రజాభిప్రాయ నివేదన (Initiative)

16.4.2 ప్రజాభిప్రాయ సేకరణ (Referendum)

16.4.3 ప్రజానిర్ణయం (Plebiscite)

16.4.4 పునరాయనం (Recall)

16.5 క్లుప్తంగా

16.6. చదవగిన పుస్తకాలు

16.7 నమూనా ప్రశ్నలు


BRAOU

## 16.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఒక ప్రభుత్వరూపంగా ప్రజాస్వామ్య అర్థాన్ని వివరిస్తుంది.
- ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్యాల మధ్య భేదాలను తెలియజేస్తుంది.
- ప్రత్యక్ష ప్రజాస్వామ్య లక్షణాలను ఉదాహరణ పూర్వకంగా వివరిస్తే, దాని లాభ నష్టాలను పరిశీలిస్తుంది. అంతేకాక ఆధునిక రాజ్యాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఎందుకు ఆచరణ యోగ్యం కాదో తెలియజేస్తుంది.
- ప్రాతినిధ్య ప్రజాస్వామ్య అర్థాన్ని లక్షణాలను పరిశీలిస్తుంది.
- ప్రజాస్వామ్య విజయానికి అవసరమైన పరిస్థితులను, లాభనష్టాలను వివరిస్తుంది.
- ఇతర ప్రభుత్వరకాల కంటే, ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏవిధంగా మెరుగైందో వివరిస్తుంది.

## 16.1 పరిచయం

ఆధునిక రాజనీతి భావాలలో ప్రజాస్వామ్యం అస్పష్టమైన దైనప్పటికీ, అతి ముఖ్యమైనది. దీనికి 2500 సంవత్సరాల చరిత్రకలదు. ప్రాచీన గ్రీకు చరిత్రకారులు, తత్వవేత్తలు, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కనుగొన్నారు. ఇంగ్లాండులో 17వ శతాబ్దంలో ప్యూరిటన్ ఉద్యమం ప్రజాసామ్య అభివృద్ధికి దోహదం చేసింది. 17,18 శతాబ్దాలలో సామాజిక ఒడంబడిక సిద్ధాంత కర్తలైన హాబ్స్, లాక్, రూసోల రచనలు దీని అభివృద్ధికి ఎక్కువ తోడ్పడ్డాయి. 1776లో సంభవించిన అమెరికా స్వాతంత్ర్య యుద్ధం, 1789లో సంభవించిన ఫ్రెంచి విప్లవం ప్రజాస్వామ్యాన్ని బహుళ ప్రచారంలోకి తెచ్చాయి. ప్రజాస్వామ్యం ఆదర్శవంతమైన ప్రభుత్వం కాబట్టి ప్రతిఒక్కడూ తాను ప్రజాస్వామ్యవాదినని చెప్పుకున్నాడు. విభిన్న రాజకీయ వ్యవస్థలకు చెందిన అమెరికా, ఆఫ్రికాలోని ఏకపార్టీ ప్రభుత్వాలు, చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం - యివన్నీ తమవి ప్రజాస్వామ్య ప్రభుత్వాలేనని చెప్పుకుంటున్నాయి. నిజానికి 20వ శతాబ్దం ప్రారంభం నుండి ప్రజాసామ్య వ్యతిరేక ఉద్యమాలు లేవు.

రాజనీతి శాస్త్ర పదజాలంలో ప్రజాస్వామ్యం అనే పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. ఉదాహరణకి ఉదార ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామ్యం, సంపూర్ణాధికార ప్రజాస్వామ్యం, పారిశ్రామిక ప్రజాస్వామ్యం మొదలుగునవి చెప్పకోవచ్చు. ఈ భాగంలో ప్రజాస్వామ్యాన్ని ఒక ప్రభుత్వ రూపంగా మనం పరిశీలిద్దాం.

## 16.2 ప్రజాస్వామ్యం - అర్థవివరణ

రాజనీతి శాస్త్రంలో ఎన్నోపదాలవలె ప్రజాస్వామ్యం అనేపదం కూడా ప్రాచీన గ్రీకుల నుండే సంక్రమించింది. "డిమాస్", 'క్రోతియా' అనే రెండు పదాల కలయిక వలన 'డెమొక్రసీ' అనే ఆంగ్లపదం

B.R.A.O.U

ఏర్పడింది. డీమోస్ అనగా ప్రజలు. క్రోతియా అనగా పాలన. కాబట్టి డెమోక్రసీ అనగా ప్రజాపాలన అని అర్థం. ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానంలో అధికారం ప్రజలచేతిలో ఉంటుంది.

ప్రజాస్వామ్యం ఒక ప్రభుత్వ విధానం. ఈవిధానంలో ప్రజలు ప్రత్యక్షంగా గానీ, ఎన్నుకున్న ప్రాతినిధ్య శాసన సభల ద్వారా పరోక్షంగా గానీ పరిపాలించుకుంటారు. ఈ రెండింటిలో ఏవిధానం ద్వారానైనా ప్రజలు రాజ్యవిధానాన్ని నిర్దేశిస్తారు.

### 16.2.1 కొన్ని నిర్వచనాలు

ప్రజాస్వామ్య భావనకు ఒక స్థిరమైన అర్థం లేదు, కాబట్టే పలువురు రచయితలు పలురకాలుగా ప్రజాస్వామ్యాన్ని నిర్వచించారు.

"ప్రజలందరూ భాగస్వాములైన ప్రభుత్వ విధానమే ప్రజాస్వామ్యమని" ఆచార్య సీలీ చెప్పాడు.

"ఓటు హక్కుద్వారా ప్రజలు వారి సార్వభౌమాధికారాన్ని వ్యక్తంచేసే పాలనా విధానమే ప్రజాస్వామ్యమని" జేమ్స్‌బ్రైస్ నిర్వచించాడు. ప్రజాస్వామ్యంలో అన్ని విషయాలు ప్రజాభీష్టం మేరకే అమలవుతాయి. పరిపాలనాధికారం చాలావరకు సమాజంలోని వ్యక్తులందరిలో ఉంటుంది. "ది అమెరికన్ కామన్ వెల్త్" (The Amercian Common Wealth - 1893) మోడ్రన్ డెమోక్రసీస్ (Modern Democracies) అనే గ్రంథాలలో బ్రైస్ ప్రజాస్వామ్యాన్ని ఒక ప్రభుత్వరూపంగా వివరించాడు.

"మొత్తం జాతి జనాభాలో అధికభాగం పాలకవర్గంగా ఏర్పడే ప్రభుత్వవిధానమే ప్రజాస్వామ్యం" అని ఎ.వి. డైసీ వివరించాడు. లా అండ్ ఒపీనియన్ ఇన్ ఇంగ్లాండ్ (Law and Opinion in England - 1905) అనే గ్రంథంలో 'శాసనాన్ని మెజారిటీ అభిప్రాయం నిర్ణయించే ప్రభుత్వ విధానాన్నే ప్రజాస్వామ్యం' అని డైసీ చెప్పాడు.

"ప్రజలయొక్క, ప్రజల వలన, ప్రజల కొరకు" ఉండే ప్రభుత్వం ప్రజాస్వామ్యం అని అబ్రహం లింకన్ నిర్వచించాడు. ఈ నిర్వచనంలో ప్రజల యొక్క ప్రభుత్వం అనగా ప్రజల తరుపున ప్రభుత్వం అని అర్థం. ప్రజల వలన ఏర్పడే ప్రభుత్వం అనగా ప్రాతినిధ్య ప్రభుత్వం అని అర్థం. ప్రజల కొరకు ఏర్పడే ప్రభుత్వం అనగా ప్రజల ప్రయోజనాల కొరకు ఉన్నతాశయాలుగల వ్యక్తులు నిర్వహించే ప్రభుత్వం అని అర్థం. పైన వివరించిన మూడు భావాలలో చివరిది అర్థవంతమైన ముఖ్యమైన భావన. ఎందుకనగా ప్రజాస్వామ్యంలో పాలకులు ప్రజాప్రయోజనాలను విస్మరించి ధనార్జనకు పాల్పడరాదు.

## 16.3 ప్రత్యక్ష - పరోక్ష ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యం రెండు రకాలు : ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, పరోక్ష ప్రజాస్వామ్యం. ఆధునిక రాజ్యాల క్లిష్టమైన ఏర్పాట్లను స్పష్టపర్చడానికి పై రెండురకాల ప్రజాస్వామ్యాల మధ్య తేడాలను కొంతమంది రచయితలు సూచించారు. ఈ రెండు రకాల ప్రజాస్వామ్యాల గురించి మనం ఈ భాగంలో తెలుసుకుందాం. వాటి లక్షణాలను, వాటి లాభ నష్టాలను, అవి విజయవంతంగా పని చేయడానికి అవసరమగు పరిస్థితులను ఇక్కడ చర్చిద్దాం.

BRAOU

### 16.3.1 ప్రత్యక్ష ప్రజాస్వామ్యం - అర్థవివరణ

నిర్ణయాలను తీసుకోవడంలోను, శాసనాలను రూపొందించడంలోను, పౌరులు ప్రత్యక్షంగా పాల్గొనే ప్రభుత్వమే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం. ఈవిధానంలో ప్రజాప్రతినిధులకు స్థానం లేదు. ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానాన్ని ప్రజా భాగస్వామ్య ప్రభుత్వ విధానం అంటారు.

ప్రాచీనగ్రీకు నగర రాజ్యాల వంటి చిన్న రాజ్యాలలో మాత్రమే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఆచరణ యోగ్యమవుతుంది. క్రీ.పూ. 5వ శతాబ్దంలో ఏథెన్స్ నగర రాజ్యంలో ఈ ప్రభుత్వ విధానం అమలులో ఉండేది. ఆధునిక కాలంలో స్విట్జర్లాండ్‌లో కొన్ని రాష్ట్రాలలోను, అమెరికాలో అనేక న్యూ ఇంగ్లాండ్ పట్టణాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానం ఆచరణలో వుంది. 18వ శతబ్దానికి చెందిన ఫ్రెంచి రాజనీతి తత్త్వవేత్త జె.జె. రూసో ప్రత్యక్ష ప్రజాస్వామ్యాన్ని సమర్థించిన ఆధునిక తత్త్వవేత్తలలో అతి ముఖ్యుడు.

#### 16.3.1.1 క్రీ.పూ. 5వ శతాబ్దంలో ఏథెన్స్‌లో ప్రజాస్వామ్యం

క్రీ.పూ. 5వ శతాబ్దంలో గ్రీసులోని ఏథెన్స్ నగర రాజ్యంలో ప్రత్యక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానం అమలులో ఉండేది. ఏథెన్స్‌లో వయోజనులైన పురుష పౌరులతో కూడిన ఒక సాధారణ సభ ఉండేది. శాసనాలు చెయ్యడం, ముఖ్యమైన ప్రభుత్వ ఉద్యోగులను ఎంపిక చెయ్యడం సాధారణ సభ యొక్క విధులుగా ఉండేవి. ఈవిధుల నిర్వహణకు సాధారణ సభ సంవత్సరంలో పదిసార్లు సమావేశమయ్యేది. సభలో నిర్ణయాలన్నీ సాధారణ మెజారిటీతో ఆమోదించేవారు. పౌరులందరికి ఓట్లు సమానంగా పరిగణింపబడేవి.

ప్రభుత్వోద్యోగులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేసేవారు. ఈ విధనం పట్ల ప్రతిపౌరునికి ఉద్యోగ అవకాశం వస్తుంది. ప్రతి ఉద్యోగి పదవీకాలం ఒక సంవత్సరం మాత్రమే. కాలంపూర్తయిన తరువాత వెంటనే మళ్ళీ ఎంపికకు అర్హుడు కాదు. ప్రభుత్వఉద్యోగులు తమ పదవీకాలంలో నిర్వహించే కార్యకలాపాలను సాధారణ సభ ముందు సమర్థించుకోవలసి ఉంటుంది.

ఏథెన్స్‌లో ఉన్న ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానంలో ప్రతిపౌరునికి ప్రభుత్వ విధానాలను నిర్ణయించడంలోను, ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టడంలోను భాగస్వామ్యం ఉంటుంది. ఏథెన్స్‌లోని ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానం దోషరహితమైనదని చెప్పలేము. ఇందులో స్త్రీలకు, బానిసలకు, రాజ్యంలో ఉన్న పరదేశీయులకు ప్రభుత్వ నిర్వహణలో భాగస్వామ్యం లేదు. కాబట్టి ఇది పరిమితమైన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం. అల్పసంఖ్యాక పౌరులచే నిర్వహింపబడే ప్రభుత్వమని చెప్పవచ్చు.

#### 16.3.1.2 స్విట్జర్లాండ్‌లో పౌరశాసన సభలు

ఆధునిక కాలంలో స్విట్జర్లాండ్‌లో కొన్ని సజాతీయ జనాభాగల చిన్న రాష్ట్రాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఆచరణలో ఉంది. నిర్ణీత కాలాలలో నిర్ణయాలు తీసుకోవడానికి పౌరశాసనసభలు సమావేశమవుతాయి. ఒకరాష్ట్రానికి సంబంధించిన పౌరులందరూ ఆరాష్ట్రప్రభుత్వ కార్యకలాపాలను చర్చించడానికి బహిరంగంగా సమావేశమౌతారు. ఈ సమావేశాలలో క్రొత్త శాసనాలను ఆమోదించడం, పాత శాసనాలను మార్చడం, పన్నులను విధించడం; బడ్జెట్‌లను ఆమోదించడం, ప్రభుత్వ ఉద్యోగులను ఎంపిక చేయడం వంటి కార్యకలాపాలను పౌరులు నిర్వహిస్తారు. ఇటువంటి ప్రత్యక్ష ప్రజాస్వామ్యం స్విట్జర్లాండ్ దేశమంతటా



BRAOU

అమలులో లేదు. ముందు పేర్కొన్నట్లు సజాతీయ జనాభాగల అతిచిన్న రాష్ట్రాలలో మాత్రమే ఇది ఆచరణలో పెట్టడానికి వీలవుతుంది.

#### 16.3.1.3 న్యూ ఇంగ్లండ్ టౌన్ మీటింగ్

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో న్యూ ఇంగ్లాండ్ టౌన్ మీటింగ్ కూడ ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ఒక ఉదాహరణ. స్విట్జర్లాండ్‌లోని పౌరశాసన సభలకు, అమెరికాలోని న్యూ ఇంగ్లాండ్ టౌన్ మీటింగ్‌లకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. న్యూ ఇంగ్లాండ్ టౌన్ మీటింగ్‌లో స్థానిక ఆర్థిక వ్యవహారాల దగ్గరనుండి స్థానిక కార్యనిర్వాహక సంఘ సభ్యుల ఎంపిక వరకు చర్చిస్తారు. రెండు టౌన్ మీటింగ్‌ల మధ్యకాలంలో ఎంపికైనా కార్యనిర్వహక సంఘం స్థానిక వ్యవహారాలను నియంత్రిస్తుంది. అతిచిన్న పట్టణాలలో సన్నిహిత సంబంధంగల ప్రజలు ఉన్నప్పుడే ఈ విధానం అమలు జరగుతుంది.

#### 16.3.1.4 ప్రత్యక్ష ప్రజాస్వామ్య లాభాలు

ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానంలో ఈ క్రింద పేర్కొన్న లాభాలు ఉన్నాయి.

(ఎ) ఈ విధానంలో రాజకీయ విషయాలను చర్చించడానికి పౌరులందరికీ అవకాశం కల్పిస్తుంది. కాబట్టి ప్రజాస్వామ్య పాలనా విధాన స్వభావాన్ని ఇది పటిష్టపరుస్తుంది.

(బి) ఇది ప్రభుత్వ నిర్వహణను సులభతరం చేస్తుంది.

(సి) ఈ విధానంలో పౌరులు రాజకీయ సమస్యలపై అధికమైన ఆసక్తిని కనపరుస్తారు.

(డి) రూసో చెప్పినట్లు ప్రత్యక్ష ప్రజాస్వామ్యం పౌరునికి నిజమైన స్వేచ్ఛను కల్పిస్తుంది.

#### 16.3.1.5 ప్రత్యక్ష ప్రజాస్వామ్య నష్టాలు

ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో ఈ క్రింది లోపాలు ఉన్నాయి.

(ఎ) ఈవిధానంలో రాజకీయ విశేషాధికారాలు కొద్దిమంది శిష్టుల సమూహానికి మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉంది.

(బి) ఇది ప్రజలలో అసమానతలకు దారితీయవచ్చు.

(సి) ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానం పట్ల నిరుత్సాహం ఏర్పడినప్పుడు దానిపై గౌరవం కొరవడినపుడు ఇది నిరంకుశత్వానికి దారి తీయవచ్చును.

(డి) సాంకేతిక పరిజ్ఞానం లేని చిన్న సమాజాలలో మాత్రమే ఇది ఆచరణ యోగ్యమవుతుంది.

### 16.3.2 పరోక్ష లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం

అమెరికా, ఇండియావంటి విభిన్న జాతులున్న అతిపెద్దజాతి రాజ్యాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఆచరణ యోగ్యంకాదు. దీనికారణంగా ఆధునిక కాలంలో పెద్దరాజ్యాలలో పరోక్ష లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఆచరణలోకి వచ్చింది.



BRAOU

ఉదాహరణకి ఇండియా, ప్రజాస్వామ్య రాజ్యం కానీ ఇది ప్రత్యక్ష ప్రజాస్వామ్య రాజ్యంకాదు. భారతదేశ పౌరులందరూ ఏఒక్క ప్రదేశంలోనూ బహిరంగంగా సమావేశమై ప్రభుత్వపాలన వ్యవహారాల గురించి నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం లేదు. ఇటువంటి నిర్ణయాలను తీసుకోవడానికి వారి ప్రతినిధులైన ఎం.పిలకు ప్రజలు అధికారాలను దత్తత చేస్తారు. ఎం.పిలను ప్రజాప్రతినిధులు అంటారు. అటువంటి ప్రతినిధుల ద్వారా నిర్వహించబడే ప్రభుత్వాన్ని ప్రాతినిధ్య ప్రభుత్వం అంటారు.

ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానానికి ఆచరణ యోగ్యమైన ప్రభుత్వమే ప్రాతినిధ్య ప్రభుత్వం.

**16.3.2.1 పరోక్ష ప్రజాస్వామ్యం - అర్థ వివరణ - ముఖ్యాంశాలు**

మెజారిటీ ఓటర్ల ద్వారా పరిపాలింపబడే విధానాన్ని, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమని చెప్పవచ్చును. ఈ విధానంలో ఓటర్లచే ఎన్నుకోబడిన కొద్దిమంది ప్రతినిధులు మాత్రమే రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. మెజారిటీ అభిప్రాయం మేరకు ప్రజాప్రతినిధులు ప్రజల తరుపున పరిపాలిస్తారు.

ముఖ్యాంశాలు : నేటి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి ఈ క్రింద చెప్పిన మూడు ముఖ్యాంశాలు ఉన్నాయి.

(1) నియోజకవర్గం: నియోజకవర్గం అనగా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి అర్హులైన ఓటర్లు అని అర్థం. ఓట్ల సంఖ్య చట్టం ద్వారా నిర్ణయింపబడును.

(2) శాసనసభలు: ప్రజాప్రతినిధులతో శాసన సభలు ఏర్పడతాయి. శాసనసభలు రాజకీయ నిర్ణయాలు తీసుకొని శాసనాలను రూపొందిస్తాయి. ప్రభుత్వపాలన వ్యవహారాలలో వీటిదే అత్యున్నత అధికారం.

(3) కార్యనిర్వాహక వర్గం: ఇది ప్రత్యేక వ్యక్తులతో కూడిన చిన్నవర్గం. ప్రజానిర్ణయాలను ఇది అమలు చేస్తుంది.

**16.3.2.2 ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లక్షణాలు**

ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లక్షణాలను క్రింది విధంగా పేర్కొనవచ్చును.

(1) నిర్ణీతకాల ఎన్నికలు : పరోక్ష ప్రజాస్వామ్యంలో ప్రతి నాలుగు లేక ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు నిర్వహింపబడును. ఈ ఎన్నికలలో అర్హులైన ఓటర్లు ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. అసమర్థంగా పనిచేసే అధికార పార్టీని పదవి నుండి తొలగించడానికి ఈ ఎన్నికలు ప్రజలకు అవకాశం కల్పిస్తాయి. శాసనసభలు ప్రజలకు బాధ్యత వహించి ఉండడానికి ఈ నిర్ణీతకాల ఎన్నికలు అవసరం. ప్రజాస్వామ్యంలో అధికారానికి మూలాధారం ప్రజలే.

(2) మెజారిటీ పాలన - అల్ప సంఖ్యాకుల హక్కుల రక్షణ

ఎన్నికల అనంతరం పార్లమెంట్‌లో (శాసనసభ) మెజారిటీ స్థానాలను పొందిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అల్పసంఖ్యాకుల హక్కులను, కోర్కెలను గౌరవిస్తే పరిపాలన కొనసాగిస్తుంది. అల్పసంఖ్యాకుల హక్కులు సాధారణంగా రాజ్యాంగంలో పొందుపర్చి ఉంటాయి. రాజ్యాంగంలో పొందుపర్చిన అల్పసంఖ్యాకుల హక్కులు పరిరక్షణ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం యొక్క ముఖ్యలక్షణంగా కొంతమంది రచయితలు అభిప్రాయపడుతున్నారు.

BRAOU

(3) ప్రజామద్ధతు : ప్రభుత్వ విధానాలకు, కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చే మద్ధతు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్య లక్షణం. ప్రజాస్వామ్యంలో విధాన నిర్ణయకర్తల యొక్క న్యాయబద్ధత మెజారిటీ ఓటర్ల మద్ధతుపై ఆధారపడి ఉంటుంది. అటువంటి మద్ధతును పొందడానికి ప్రజలకు విస్తృతమైన ప్రాతినిధ్యం కల్పించాలి. ఈవిధంగా ప్రజా ప్రభుత్వం ప్రజా మద్ధతుపై ఆధారపడి ఉంటుంది.

4. రాజకీయాధికారానికి పోటీ : ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ఒకటి కంటే ఎక్కువ పార్టీలు ఉంటాయి. ఆమెదయోగ్యమైన పద్ధతి ద్వారా పార్టీలు అధికారానికి పోటీపడతాయి. ఎన్నికలలో పార్టీలు రకరకాల విధానాలను, కార్యక్రమాలను ప్రజలు ముందు వుంచుతాయి. దీనివలన ప్రజలకు ఇష్టపడిన పార్టీ విధానాలను, కార్యక్రమాలను ఎంపిక చేసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

5. రాజకీయ సమానత్వం : ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాయుత ఎన్నికలలో వయోజన పౌరులు అందరకూ ఓటు హక్కు ఉంటుంది. ప్రతి ఒక్కొరి ఓటుకు సమాన విలువ ఉంటుంది. ప్రతి పౌరునికి ప్రభుత్వ పదవులకు పోటీపడే హక్కు ఉంటుంది. కుల, మత, లింగ, భాష, ప్రాంతీయ కారణాలపై ఏ పౌరుణ్ణీ ప్రభుత్వ పదవులకు అనర్హునిగా ప్రకటించడానికి వీలులేదు.

6. రాజ్యాంగ ఆధిక్యత : ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ బద్ధమైన, శాసనబద్ధమైన పరిపాలన ఉండాలి. చట్టబద్ధంగా అధికారం కోసం పోటీపడాలి. ప్రజాస్వామ్య రాజ్యానికి ఒక లిఖిత రాజ్యాంగం ఉండాలి. ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేయడమే ఈ రాజ్యాంగం యొక్క ముఖ్యోద్దేశ్యం.

రాజ్యాంగం నిర్ణయించిన హద్దులలో మాత్రమే ప్రభుత్వం తన అధికారాన్ని చెలాయించాలి. అధికారంలో వున్న ప్రభుత్వం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ సంప్రదాయాల్ని గౌరవించాలి.

7. పౌరహక్కులు : ఎన్నికలు, ఎన్నికలలో ఓటు హక్కును సద్వినియోగం చేసికోవాలంటే ప్రభుత్వం పౌరులకు కొన్ని పౌరహక్కులను తప్పనిసరిగా కల్పించాలి. భావప్రకటన స్వేచ్ఛ, పత్రికాస్వేచ్ఛ, మతస్వేచ్ఛ, సమావేశాల నిర్వహణ స్వేచ్ఛ, మొదలగునవి పౌరస్వేచ్ఛలకు ఉదాహరణలు. పౌరులు భావి పాలకులుగా అర్హత పొందాలంటే పైన చెప్పిన స్వేచ్ఛలను ప్రభుత్వం అమలు చేయ్యాలి. ఈ హక్కులను న్యాయ వ్యవస్థ ద్వారా రక్షించుకొనే హక్కులను పౌరునికి ప్రభుత్వం కల్పించాలి. పౌరహక్కులు ప్రజలకు చట్టం ముందు సమాన హోదాను కల్పిస్తాయి. ఈ హక్కులు ప్రభుత్వం యొక్క అధికార దుర్వినియోగాన్ని నిరోధిస్తాయి.

8. భిన్నాభిప్రాయ ప్రకటన హక్కు - అవిధేయత ప్రకటన హక్కు : ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రతిఘటించే హక్కు ప్రజలకు ఉంటుంది. ఈ హక్కును సమర్థించిన వారిలో ప్రముఖ వ్యక్తి మహాత్మాగాంధీ.

9. ప్రజా సంప్రదింపులు : ప్రజావసరాల మేరకు ప్రభుత్వ పాలనను నిర్వహించడమే సమర్ధవంతమైన పాలనని పాలకులు గుర్తించాలి. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ప్రజావసరాలను, కోర్కెలను తెలుసుకోవచ్చు. సమాచార సాధనాల ద్వారా కూడ ప్రజావసరాలను ప్రభుత్వం తెలుసుకోవచ్చు.

### 16.3.2.3. పరోక్ష లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లాభాలు :

ఇతర ప్రభుత్వ విధానాలతో పోలిస్తే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి అనేకమైన లాభాలున్నాయి. దీని ముఖ్యమైన లాభాలను ఈక్రంది విధంగా పేర్కొనవచ్చు.

BRAOU

(1) ప్రతి వ్యక్తికీ కొంత వ్యక్తిగత స్వేచ్ఛను, హక్కులను అనుభవించడంలో సమానత్వాన్ని ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కల్పిస్తుంది. ఈ విధానంలో పౌరులందరికీ సమాన రాజకీయ పౌరహక్కులుంటాయి. చట్టం దృష్టిలో అందరూ సమానులే. ఈవిధానంలో అందరికీ సమాన న్యాయం సంక్రమిస్తుంది.

(2) ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తన కార్యాకలాపాల నిర్వహణకు ప్రజలకు బాధ్యత వహిస్తుంది. అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా పాలకులను అదుపులో ఉంచుతుంది. ఎన్నికల సమయంలో అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడిన ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తారు.

(3) ప్రజాస్వామ్యం ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేస్తుంది. ప్రభుత్వ కార్యకలాపాలలో పాల్గొనడానికి ప్రజలకు అవకాశాలను కల్పిస్తుంది. దీనివలన వ్యక్తి వికాసం పెంపొందుతుంది. ప్రజల కొరకు ఇతరులతో కలసి పనిచేసే గుణాన్ని, భిన్నాభిప్రాయాలను గౌరవించే సహనశీలత మొదలగు సుగుణాలను ప్రజాస్వామ్యం వ్యక్తిలో అభివృద్ధి చేస్తుంది.

(4) ప్రజాస్వామ్యం స్వపరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుంది. అంతేగాకుండా పౌరత్వాన్ని పెంపొందించే శిక్షణాలయంగా పనిచేస్తుంది. స్థానిక సమస్యల నిర్వహణలో పౌరునికి ఆసక్తిని కల్పిస్తుంది. ఈ కార్యక్రమాల నిర్వహణ వలన పరిపాలన అనుభవం పౌరునికి కలుగుతుంది.

(5) మిగతా ప్రభుత్వాల కంటే ప్రజాస్వామ్య ప్రభుత్వం సుస్థిరమైనది. అసంతృప్తిగా పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నికల సమయంలో తొలగించే హక్కు ప్రజలకు ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రభుత్వాన్ని శాంతియుతంగా మార్చవచ్చు. విప్లవ పద్ధతులకు తావులేదు.

(6) ప్రజాస్వామ్యంలో మెజారిటీ అభిప్రాయాన్ని అనుసరించి నిర్ణయాలు తీసుకోబడును. ఈ పద్ధతిలో ఒకసారి తీసుకున్న నిర్ణయాలు అంతిమ నిర్ణయాలుకావు. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా వాటిని మార్చుకోవచ్చు.

(7) ప్రజాస్వామ్యం ప్రజలలో దేశభక్తిని పెంపొందింప జేస్తుంది. ఎందుకనగా ప్రభుత్వ ముఖ్య విధానాలను రూపొందించడంలో ప్రజలకు భాగస్వామ్యము ఉంటుంది. అటువంటి ప్రభుత్వ నిర్వహణకోసం కష్టపడి పనిచేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతారు.

8. ప్రజాస్వామ్య ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంది. స్వచ్ఛంద సంస్థల హక్కులను పరిరక్షిస్తుంది. ప్రజాస్వామ్యంలో మతం, తత్వశాస్త్రం, కళలు, వైజ్ఞానిక విషయాలు మొదలగువాటిని స్వేచ్ఛగా చర్చించే హక్కు ప్రజలకు ఉంటుంది.

BRAOU

### 16.3.2.4 పరోక్ష లేదా ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లోపాలు

ప్రజాస్వామ్యంలో వాక్ స్వాతంత్ర్యం ఉంటుంది. గనుక విమర్శకులు అధికంగా ఉంటారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య లోపాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. కులీనులు, నిరంకుశులు ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని అసమర్థ ప్రభుత్వంగా వర్ణించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉత్సాహవంతులైన సామాన్యులు నిర్వహించే ప్రభుత్వం. ఇది నిపుణులచే నిర్వహింపబడే ప్రభుత్వం కాదు. సరైన నాయకులను ఎన్నుకునే సమర్థత, మెజారిటీ ప్రజలకు ఉండదు. అటువంటి నాయకులకు

ఆధునిక క్లిష్ట సమస్యలను పరిష్కరించే పరిజ్ఞానం కొరవడుతుంది.

2. సంక్షోభ సమయాలలో ప్రజాస్వామ్య ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయాలు తీసుకోలేదు. దీనివలన సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరుగుతుంది. అంతేగాకుండా సంస్కరణలు ప్రవేశపెట్టడంలో కూడా ప్రజాస్వామ్య ప్రభుత్వం జాప్యానికి తావిస్తుంది.

3. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ధనిక వర్గపాలనకు దారితీస్తుంది. ఎన్నికలలో పోటీ చేసే స్తోమత ధనవంతులకు మాత్రమే కలుగుతుంది. దీని ఫలితంగా అధికారం స్వార్థపరులైన కొద్దిమంది ధనికుల హస్తగతమవుతుంది. దీనివలన ఎక్కువ మంది పౌరులు అధికారం చేపట్టే అర్హత కోల్పోతున్నారు.

4. ప్రజాస్వామ్యంలో అవినీతి, లంచగొండితనం, మోసం, అధిక వ్యయం మొదలగునవి చోటుచేసుకుంటాయి. ప్రజాస్వామ్యంలో సాధారణ ఎన్నికల నిర్వహణ అధిక వ్యయంతో కూడుకున్నది.

5. ప్రజాస్వామ్యాన్ని అసమర్థులపాలన అని విమర్శకులు అంటారు. ప్రజాస్వామ్యం మెజారిటీ నిరంకుశత్వానికి అవకాశం కల్పిస్తుంది. మెజారిటీ ప్రజల అభిప్రాయాలను, భావాలను అల్పసంఖ్యాకులపై రుద్దడానికి ప్రయత్నిస్తుంది. ఇటువంటి నిరంకుశత్వం, రాజరికపు, నిరంకుశత్వం కంటే భయంకరనమైనదని అలెక్స్ డి టాక్ వెల్లీ (Alex de Taquvelli) అన్నాడు.

6. ప్రజాస్వామ్యములో ఆంతరంగిక వ్యవహారాలలోగానీ, విదేశీ వ్యవహారాలలోగానీ ప్రభుత్వ విధానాలు అవిచ్ఛిన్నంగా కొనసాగవు.

7. లార్డ్‌బ్రైస్ ప్రపంచంలోని ఆరు పెద్ద ప్రజాస్వామ్యాలను పరిశీలించి ప్రజాస్వామ్యంలోని లోపాలను ఈ విధంగా సమీక్షించాడు.

(ఎ) శాసన విధానాన్ని పరిపాలనను ధనబలం వికృతం చేస్తుంది

(బి) రాజకీయాలు ఆదాయాన్నిచ్చే వృత్తిగా మారతాయి.

(సి) పరిపాలనలో దురాచారం పెరగుతుంది.

(డి) సమానత్వ సిద్ధాంతం దుర్వినియోగం అవుతుంది. ప్రజాస్వామ్యం ప్రత్యేక నైపుణ్యాన్ని గుర్తించదు.

(ఎఫ్) పార్టీలకు, పార్టీ యంత్రాంగానికి అనవసరంగా ఎక్కువ అధికారాలు లభించడంవల్ల పరిపాలనతో వాటి ప్రాబల్యం పెరుగుతుంది.

(6) శాసన నిర్మాతలు, ఇతర రాజకీయ అధికారులు ఓట్ల వేటలో పడి యుక్తాయుక్త విచక్షణ లేకుండా శాసనాలను రూపొందించడం, అధికారులు చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా అతి సాధారణ విషయం అవుతుంది.

### 16.3.2.5 ప్రజాస్వామ్య సమర్థన

పైచర్చను బట్టి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఆదర్శవంతమైన ప్రభుత్వంఅనిగానీ, సమాజంలోని సమస్యలన్నింటికీ పరిష్కార సాధనమనిగానీ చెప్పడానికి వీలులేదు. ఈ ప్రభుత్వ విధానంలో కొన్ని దోషాలు

BRAOU

ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ అధికారవాద ప్రభుత్వాలు, సంపూర్ణాధికార వాద ప్రభుత్వాలు, సైనిక నియంతృత్వ ప్రభుత్వాలలో ఉన్న దోషాలకంటె ప్రజాస్వామ్య ప్రభుత్వంలోని దోషాలు అతితక్కువేగాక సహించదగ్గవి. ప్రజాస్వామ్య ప్రభుత్వ ప్రక్రియ, నియంతృత్వ ప్రభుత్వ ప్రక్రియ కంటే ఉత్తమమైనది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మాత్రమే వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని గౌరవప్రదంగా పెంపొదించుకోగలడు. ప్రజాస్వామ్యం వ్యక్తి ప్రాధాన్యతను గౌరవిస్తుంది. ఆధునిక ప్రపంచంలో ప్రస్తుత పరిస్థితులలో ప్రజాస్వామ్యం అతి తక్కువ ఆక్షేపణగల ఆచరణ యోగ్యమైన ప్రభుత్వం. ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఇష్టపడనివారు దానిని ఖండించవచ్చు. కానీ దాని కంటె మెరుగైన ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఉందని చెప్పలేరు.

### 16.3.2.6 ప్రజాస్వామ్య విజాయానికి అనుకూల పరిస్థితులు

ప్రజాస్వామ్యం ఎటువంటి పరిస్థితులలో విజయవంతంగా పనిచేస్తుందనేది ముఖ్యప్రశ్న. ప్రజాస్వామ్యాన్ని ఒక పుష్పంతో పోల్చవచ్చు. పుష్పం వికసించడానికి ఎటువంటి అనుకూల పరిస్థితులు కావాలో, ప్రజాస్వామ్యం విజయవంతం అవడానికి కూడా కొన్ని అనుకూల పరిస్థితులు కావాలి. దాని విజయానికి ఈక్రింద పేర్కొన్న అనుకూల పరిస్థితలు అవసరం.

1. ప్రజాస్వామ్య ఆకాంక్ష భావన : ప్రజలలో ప్రజాస్వామిక భావన నెలకొని యుండాలి. అటువంటి కోరిక ప్రజలలో లేనట్లయితే ప్రజాస్వామ్యాన్ని ఏరాజ్యంగాని, చట్టంగాని రక్షించలేదు. ప్రజలలో ప్రజాస్వామ్య సంస్కృతి, సంప్రదాయం ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేస్తుంది.

2. ప్రజాస్వామ్య స్వభావం : ప్రజలలో సహనబుద్ధి, రాజీపడే స్వభావం అధికంగా ఉండాలి. సహనబుద్ధి వలన ఒక విషయంపై అనేక అభిప్రాయాలు వెల్లడి చేయడానికి అవకాశం ఉటుంది. మెజారిటీ అభిప్రాయాలు అల్పసంఖ్యాకులపై బలవంతంగా రుద్దరాదు. మెజారిటీ అభిప్రాయం ఆమోదయోగ్యంగా ఉన్నప్పుడు అల్పసంఖ్యాక వర్గాలు కూడా వాటిని సహజంగా ఆమోదిస్తారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుంది. ఈ పద్ధతిలో ప్రజాస్వామ్యంలో ముఖ్య విషయాలపై ప్రజలందరికీ ఏకాభిప్రాయం కుదురుతుంది.

3. ప్రాథమిక స్వేచ్ఛలు : ప్రజాస్వామ్యంలో ప్రజలకు కొన్ని ముఖ్యమైన స్వేచ్ఛలు ఉండాలి. వాటిలో ముఖ్యమైనవి వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, సమావేశపు స్వేచ్ఛ మొదలగునవి చెప్పవచ్చు. ఇటువంటి స్వేచ్ఛలను కాలరాయడానికి ప్రభుత్వం ప్రయత్నించకూడదు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు హక్కుకాదు. పైన పేర్కొన్న స్వేచ్ఛలు కూడా ముఖ్యమైనవి.

4. సంపద విస్తృత పంపిణీ : ప్రజాస్వామ్య విజయానికి జాతీయ సంపద వివిధ వర్గాల ప్రజల మధ్య విస్తృతంగా పంపిణీ అయివుండాలి. ఎక్కువ ఆర్థిక అసమానతలు ఉన్న సమాజంలో ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయదు. కాబట్టి ప్రజాస్వామ్యం సమర్థవంతంగా పని చేయాలంటే సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించాలి.

5. అభిజ్ఞ నియోజితులు (Well-Informed Electorate) : ముఖ్యమైన ప్రభుత్వ సమస్యలు, విధానాలపై ప్రజలకు సమాచారం చేరాలి. వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్ మొదలగు ప్రచార సాధనాల ద్వారా పై విషయాలను చర్చించడం వలన ప్రజలకు వాటిపైన సరైన అవగాహన కలుగుతుంది. ఇటువంటి సమాచారం - అవగాహన ప్రజాస్వామ్య విజయవంతానికి అవసరం.



BRAOU

6. విద్యావ్యాప్తి : ప్రజలలో విద్యావ్యాప్తి ద్వారా రాజ్యాంగ మౌలిక ఆశయాలను వ్యాప్తి చేయవచ్చు. సార్వజనీన ఓటు విస్తరణకు ముందు సార్వజనీన విద్యావ్యాప్తి ఉండాలని జె.ఎస్. మిల్ అంటాడు. విద్యావిధానం ద్వారా ప్రజలలో రాజకీయ పరిజ్ఞానాన్ని, ప్రజా సమస్యలపట్ల ఆసక్తిని, ప్రభుత్వంపై బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రజలలో కలిగించవచ్చును. ప్రజలు వారి హక్కులు, బాధ్యతలు గురించి తెలుసుకోవడం అవసరం.

7. బలమైన ప్రతిపక్షం : రెండు పార్టీల విధానంలో అధికారంలో లేని పార్టీని ప్రతిపక్షం అంటారు. అధికార పార్టీ బాధ్యతారహితంగా ప్రవర్తించకుండా, అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా ప్రతిపక్షం అడ్డుకుంటుంది. ప్రభుత్వం చేసే తప్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తుంది. ప్రతిపక్షాలు ప్రభుత్వం కార్యాకలాపాలపై నిఘా వేసి వుంచుతాయి.

8. రాజకీయ నాయకత్వం : మంచి రాజకీయ నాయకత్వం ప్రజాస్వామ్య విజయానికి అవసరం. ప్రజాస్వామ్యంలో నాయకులు శీలం, నిస్వార్థం, నీతి నిజాయితీ, విశాల దృక్పథం కలిగినవారై ఉండాలి. ప్రజాసేవా తత్పరతతో, ప్రజలకు బాధ్యులై మెలగాలి. ఇటువంటి నాయకత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను సంఘటిత పరచి, దానికి సుస్థిరతను చేకూరుస్తుంది.

9. రాజకీయ ఏకాభిప్రాయం : కుల, మత, జాతి, వర్గ విభేదాలు వున్న సమాజంలో పాలకులు అనుసరించే ఆదర్శాలు, పాలన ప్రమాణాలపట్ల ప్రజలలో ఏకాభిప్రాయం ఉండాలి. ప్రజలలో సామాజిక సహకార భావన ఉండడం అవసరం. ప్రజలలో జాతీయ భావం ప్రజాస్వామ్య విజాయానికి మరొక ప్రాతిపదిక.

10. స్వతంత్ర్య న్యాయవ్యవస్థ : రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజల హక్కులను, స్వేచ్ఛలను స్వంతత్ర న్యాయ వ్యవస్థ కాపాడాలి. ఇటువంటి న్యాయవ్యవస్థ సర్వస్వతంత్రంగా వ్యవహరించాలి.

11. ఆరోగ్యవంతమైన సమాజం : ప్రజాస్వామ్య విజయవంతానికి ఆరోగ్యవంతమైన సమాజం అవసరం ఇటువంటి సమాజంలో ప్రభుత్వపాలకులుగా ఉన్నతమైన వ్యక్తులు ఉండే అవకాశం ఉంటుంది. ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ సహేతుకమైన పరిపాలన విధానం. ఇటువంటి పరిపాలన విధానంపై ప్రజలకు విశ్వాసం ఉంటుంది. విజ్ఞానవంతుల తీర్పును ఓటర్లు గౌరవించాలి.

## 16.4 ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనాలు

విశాలమైన ఆధునిక జాతి రాజ్యాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్య ఆచరణ అసంభవం. ప్రభుత్వ నిర్ణయాలను తీసుకోవడంలో ప్రజలందరూ పాల్గొనే అవకాశం ఉండదు. ప్రజలకు దగ్గరగా ప్రభుతాన్ని తీసుకెళ్ళే ప్రయత్నంలో కొన్ని ఆధునిక రాజ్యాలు ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనాలను వినియోగించుకున్నారు. అవి

1. ప్రజాభిప్రాయ నివేదన (Initiative)
2. ప్రజాభిప్రాయ సేకరణ (Referendum)
3. ప్రజా నిర్ణయం (Plebiscite)
4. పునరాయనం లేదా వెనుకకు పిలుచుట (Recall)

BRAOU

పైన పేర్కొన్న ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనాలను సాంప్రదాయక ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయాలుగా పరిగణించవచ్చు. సిట్జర్లాండ్, అమెరికాలో కొన్ని రాష్ట్రాలు, ఫ్రాన్స్, ది ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ వంటి దేశాలలో ఈ ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనాలు వాడుకలో వున్నాయి. ఇప్పుడు సంక్షిప్తంగా వాటి గురించి తెలుసుకుందాం.

### 16.4.1 ప్రజాభిప్రాయ నివేదన (Initiative)

ప్రజలకు కావల్సిన అంశంపై ఒక బిల్లును ప్రతిపాదించి శాసనసభకు నివేదించడాన్ని ప్రజాభిప్రాయ నివేదన అంటారు. అటువంటి బిల్లును నిర్ణీత సంఖ్య ఓటర్లు ప్రతిపాదించాలి. ఈబిల్లు ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ప్రజలు ఆమోదిస్తే అదిచట్టంగా రూపొందుతుంది. క్రొత్త శాసనాన్ని రూపొందించడం కాని, ఉన్న శాసనాన్ని రద్దు చేయడం కానీ, రాజ్యాంగాన్ని సవరించడంగాని ఇటువంటి శాసన ప్రతిపాదన యొక్క లక్ష్యమై ఉంటుంది.

ప్రజాభీష్టం మేరకు శాసనసభ శాసనాలు చెయ్యనప్పుడు ప్రజలు వారికి కావలసిన శాసనాలను ప్రతిపాదించుకొనే అవకాశాన్ని ప్రజాభిప్రయా నివేదన కల్పిస్తుంది. ఈవిషయంలో నియోజితులు సర్వ స్వతంత్రంగా వ్యవహరించగలరు. ఒక ముఖ్యాంశంపై శాసన సభ ప్రజాభిప్రాయాన్ని ఉపేక్షించినపుడు దానిని సవరించడమే ప్రజాభిప్రాయం నివేదన ముఖ్యోద్దేశం. అయితే దీనిలో ఒక ముఖ్యలోపం కనిపిస్తుంది. ప్రజాభిప్రాయ నివేదన ద్వారా ప్రతిపాదించిన బిల్లు తప్పనిసరిగా ఎన్నికలలో పాల్గొన్న మెజారిటీ ఓటర్లు ఆమోదించవలసి ఉంటుంది.

### 16.4.2 ప్రజాభిప్రాయ సేకరణ (Referendum)

ప్రభుత్వ విధానానికి సంబంధించిన ఒక ముఖ్యవిషయంపై ప్రత్యక్షంగా నియోజితుల అభిప్రాయాన్ని తెలుసుకొనే విధానాన్నే ప్రజాభిప్రాయ సేకరణ అంటారు. దానిని నియోజితుల ఒక వర్గం కాని, శాసనసభకానీ ప్రతిపాదించవచ్చు. ఇటువంటి ప్రతిపాదనను మెజారిటీ ఓటర్లు ఆమోదిస్తే అది శాసనం అవుతుంది. ఆమోదించకపోతే ఆప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి. ఇంకోక విధంగా చెప్పాలంటే నియోజితుల ముందు ఉంచిన ప్రతిపాదనపై వారు అవునని కానీ కాదనికానీ చెప్పడమే ప్రజాభిప్రాయసేకరణ. స్విట్జర్లాండ్, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలను ఈ ప్రజాభిప్రాయ సేకరణ విధానం అమలులో ఉంది. ఆస్ట్రేలియా వంటి దేశాలలో రాజ్యాంగ విషయాలకు కూడా సంబంధించి ఉంది. కొన్ని సందర్భాలలో పై రెండు రకాల విషయాలకు ఇది వర్తిస్తుంది. ప్రజాభిప్రాయ సేకరణ రెండు విధాలుగా ఉంటుంది. వాటిని నిర్బంధ ప్రజాభిప్రాయ సేకరణ, ఐచ్ఛిక ప్రజాభిప్రాయ సేకరణ అంటారు.

ప్రజాభిప్రాయ సేకరణ వలన కొన్ని లాభాలు ఉన్నాయి.

1. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా శాసనసభ చేసిన శాసనాలను ఈ సాధనం ద్వారా అరికట్టవచ్చు.
2. నిర్ణయీకరణ ప్రక్రియలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొనడానికి అవకాశం కల్పిస్తుంది.
3. ప్రజాప్రతినిధులకు, నియోజకులకు మధ్య సంబంధాన్ని చేకూరుస్తుంది.
4. శాసనసభ యొక్క రెండు సభలలో ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించడానికి ఇది ఉపయోగపడుతుంది.

BRAOU

ప్రజాభిప్రాయ సేకరణ వల్ల కొన్ని నష్టాలు ఉన్నాయి.

1. సాంకేతికపరమైన విషయాలపై అభిప్రాయాన్ని తెలిపే సామర్థ్యం సామాన్య ఓటర్లకు ఉండదు.

2. సంపూర్ణ సమాచారం లేని విషయాలపై ఓటర్లు వివేకంతో కూడిన అభిప్రాయాన్ని వెలిబుచ్చలేరు.

3. చట్టబద్ధమైన ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా శాసన సభలు బాధ్యతను నియోజికులకు విడిచిపెడతాయి.

ప్రజాభిప్రాయ నివేదన, ప్రజాభిప్రాయ సేకరణ, రెండూ ప్రాతినిధ్య శాసనసభల పాత్రను బలహీన పరుస్తున్నాయి. ప్రజాభిప్రాయ సాధనాలు శాసనాలనుకాని, ప్రజలను కాని మెరుగుపర్చడం లేదని హెర్మన్ ఫైనర్ చెప్పాడు.

### 16.4.3 ప్రజా నిర్ణయం (Plebiscite)

ప్లెబిసైట్ అనే ఆంగ్ల పదానికి ప్రజా విజ్ఞప్తి అని అర్థం. (Decree of the People) ఒక ముఖ్యమైన ప్రజాసమస్యపై ఓటర్ల రాజకీయ అభిప్రాయాన్ని తెలుసుకొనే పద్ధతినే ప్రజా నిర్ణయం అంటారు. ఒక విషయంపై ఓటర్లు అవునని కానీ, కాదనికానీ చెప్పే పద్ధతే ప్రజా నిర్ణయం. దీనికి శాసనాలను రూపొందించడంతో సంబంధం లేదు. ముఖ్యంగా దీని ద్వారా ప్రభుత్వ విధాన నిర్వహణ గురించి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవచ్చు. ఇది విధాన నిర్ణయంలో సరైన మార్గదర్శకత్వాన్ని సమకూరుస్తుంది.

అంతర్జాతీయ ఎల్లలకు, సమాఖ్య రాజ్యంలో వివిధ రాష్ట్రాల సరిహద్దుల వివాదాలకు సంబంధించిన సమస్యలను జాతీయ అల్ప సంఖ్యాక వర్గాల కోర్కెలను సమస్యలను పరిష్కరించడానికి ప్రజానిర్ణయ సాధనాన్ని సాధారణంగా ఉపయోగిస్తారు.

### 16.4.4 పునరాయనం (Recall)

ప్రజాప్రతినిధి పదవీకాలం పూర్తికాకముందే అతనిని ప్రజలు ఓటు ద్వారా వెనుకకు రమ్మని నిర్ణయిస్తే అతను పదవిని వదులుకోవాలి. ఈ విధానాన్నే పునరాయన మంటారు. ఈ సాధనం ద్వారా బాధ్యతారహితులైన, అవినీతిపరులైన ప్రజాప్రతినిధులను పదవుల నుండి తొలగించవచ్చును. అమెరికాలో కొన్ని రాష్ట్రాలలో పునరాయనం ఆచరణలో వుంది. శాసన, కార్య నిర్వాహక శాఖలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులలో ఎవరైనా, అసంతృప్తికరంగా పనిచేసినట్లైతే వారిని ఈ పద్ధతి ద్వారా పదవి నుండి తొలగిస్తారు. పునరాయన సాధనాన్ని అతిజాగ్రత్తగా ఉపయోగించాలి. లేనట్లైతే శాసనసభ అవినీతి ఆరోపణలను తరుచుగా ఎదుర్కోవలసి ఉంటుంది. అంతేకాక కార్యనిర్వాహక శాఖ అధికారం బలహీనపడుతుంది.

## 16.5 క్లుప్తంగా

ఈ భాగం ముఖ్యాంశం ప్రత్యక్ష పరోక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాలను పరిశీలించడం, ప్రజాస్వామ్యమనగా ప్రజల వలన పాలింపబడే ప్రభుత్వం. ఇది ప్రజా సమ్మతి పైన ఆధారపడిన ప్రభుత్వం. ప్రజాస్వామ్యం రెండు రకాలు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, పరోక్ష ప్రజాస్వామ్యం. ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానంలో

BRAOU

వయోజనులైన పౌరులందరూ ప్రత్యక్షంగా శాసనాలను రూపొందించే కార్యకలాపాలలో పాల్గొంటారు. పాలనకు సంబంధించిన ముఖ్య విషయాలను నిర్ణయిస్తారు. ఇటువంటి ప్రభుత్వ విధానం ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలలో పరోక్ష (ప్రాతినిధ్య) ప్రజాస్వామ్య విధానం అచరణలో ఉంది. ఈవిధానంలో ప్రజాప్రతినిధుల ద్వారా పాలన నిర్వహణ జరుగుతుంది. నియతకాలిక ఎన్నికలు, మెజారిటీ పాలన, అల్ప సంఖ్యాకుల హక్కుల పరిరక్షణ, రాజకీయ సమానత్వం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్య ప్రభుత్వ ముఖ్యలక్షణాలని చెప్పవచ్చును. నియంతృత్వ ప్రభుత్వాలకంటె ప్రజాస్వామ్య ప్రభుత్వం విజయవంతంగా పనిచేయడానికి ప్రజలలో ప్రజాస్వామ్య సంస్కృతి, సాంప్రదాయాలు ఉండాలి. కొన్ని ఆధునిక రాజ్యాలలో ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయాలుగా ప్రజాభిప్రాయ నివేదన, ప్రజాభిప్రాయ సేకరణ, పునరాయనం మొదలగు ప్రత్యక్ష ప్రజాస్వామ్య సాధనాలు ఆచరణలో ఉన్నాయి. స్విట్జర్లాండ్, అమెరికాలో కొన్ని రాష్ట్రాలను వీటికి ఉదాహరణలుగా చెప్పవచ్చును.

## 16.6 చదువదగిన పుస్తకాలు


Norman P. Barry : "An Introduction to Modern Political Theory"

Peter B. Harris : "Foundations of Political Science"

O.P. Ganba : "An Introduction to Political Theory"

Dr R.L. Gupta : "Political Theory"

S.R. Maheshwari : "Comparative Government and Politics"


## 16.7 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని నిర్వచింపుము అది ఎటువంటి పరిస్థితులలో ఆచరణ యోగ్యమైనది.

2. పరోక్ష ప్రజాస్వామ్య లాభ నష్టాలను తెలపండి.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 10 పంక్తులలో జవాబులిమ్ము**

1. ప్రజాభిప్రాయ నివేదన, ప్రజాభిప్రాయ సేకరణ ఎంతవరకు విజయవంతమో వివరించండి.

2. ప్రత్యక్ష ప్రజాస్వామ్య లాభ నష్టాలను తెలపండి.

**రచయిత : ఎస్. పోలినాయుడు**

BRAOU

# భాగం-17: పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలు

విషయ సూచిక


17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 వర్గీకరణ ఆధారం

17.3 పార్లమెంటరీ ప్రభుత్వం

17.3.1 పార్లమెంటరీ ప్రభుత్వం - అర్థవివరణ

17.3.2 పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణాలు

17.3.3 పార్లమెంటరీ ప్రభుత్వ లాభాలు

17.3.4 పార్లమెంటరీ ప్రభుత్వ నష్టాలు

17.4 అధ్యక్ష ప్రభుత్వం

17.4.1 అధ్యక్ష ప్రభుత్వం - అర్థ వివరణ

17.4.2 అధ్యక్ష ప్రభుత్వ లక్షణాలు

17.4.3 అధ్యక్ష ప్రభుత్వ లాభాలు

17.4.4 అధ్యక్ష ప్రభుత్వ నష్టాలు

17.5 పార్లమెంటరీ అధ్యక్ష ప్రభుత్వ విధానాలలో భారతదేశానికి ఏది అనుకూలంగా ఉంటుంది ?

17.6 క్లుప్తంగా

17.7 చదవదగిన పుస్తకాలు

17.8 నమూనా ప్రశ్నలు


B R A O U

## 17.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- అధునిక ప్రజాస్వామ్యాలను పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలుగా వర్గీకరించగలరు.
- ఈ రెండు రకాల ప్రభుత్వాల యొక్క ప్రత్యేక లక్షణాలను వర్ణించగలరు.
- వాటియొక్క లాభ నష్టాలను పరిశీలించగలరు.
- ఈ రెండు రకాల ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను అర్థం చేసుకోగలరు.
- పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలు, రెండింటిలో ఏది మనదేశానికి అనుకూలమైందో పరిశీలించగలరు.

## 17.1 పరిచయం

ఆధునిక ప్రభుత్వ అంగాలు మూడు (1) శాసన నిర్మాణ శాఖ (2) కార్యనిర్వాహక శాఖ(3) న్యాయశాఖ. శాసనసభ శాసనాలను రూపొందిస్తుంది. ఆశాసనాలను కార్యనిర్వాహక శాఖ అమలు చేస్తుంది. శాసనాలను వర్తింపచేస్తూ వివాదాలను పరిష్కరిస్తుంది న్యాయశాఖ. ఈ మూడు ప్రభుత్వ అంగాల మధ్యనున్న సంబంధం ప్రభుత్వ స్వభావాన్ని నిర్ణయిస్తుంది. నియంతృత్వంలో ఈ మూడు అధికారాలు ఒకరిచేతిలోనే ఉంటాయి. అతనే చెలాయిస్తాడు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ఈక్రింది రెండు పద్ధతులలో ఏదో ఒకదానిని అనుసరించి ప్రభుత్వ అధికారాలు మూడు వేరు చేయబడతాయి. యుఎస్.ఎ (అమెరికా సంయుక్త రాష్ట్రాలు)లో ఈ మూడు అధికారాలు మూడు వ్యవస్థలలో ముగ్గురు వ్యక్తుల చేతులలో ఉన్నాయి. ఇటువంటి విధానాన్ని అధ్యక్ష విధానమని అంటాం. ఇటువంటి ప్రభుత్వం అధికారాల విభజనవాదం మీద ఆధారపడి ఉంటుంది. ఇది ఒక పద్ధతి. రెండో పద్ధతిననుసరించి శాసన నిర్మాణ శాఖ విధిని, కార్యనిర్వహణ విధిని శాసనసభ నిర్వహిస్తే అటువంటి విధానాన్ని పార్లమెంటరీ ప్రభుత్వ విధానమని చెప్పవచ్చును. పార్లమెంటరీ ప్రభుత్వ విధానానికి బ్రిటన్, ఇండియాలను ఉదాహరణలుగా చెప్పవచ్చును. పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వ విధానాలు రెండూ ప్రజాస్వామ్యాలే. అయినప్పటికీ ఈ రెండు ప్రభుత్వాల వ్యవస్థీకరణలో, అవిపనిచేసే తీరుతెన్నుల్లో చాలా భేదం కనపిస్తుంది. ఈభాగంలో వాటిని పరిశీలించిన తరువాత వాటి మధ్యనున్న భేదాల స్వభావం, మనకు తేటతెల్లమౌతుంది. చివరగా, ఈ రెండు రకాల ప్రభుత్వాలలో ఏది మనకు అనువైనదో మనం చెప్పగలం.

## 17.2 వర్గీకరణ ఆధారం

శాసనసభ, కార్య నిర్వాహక శాఖ మధ్యనున్న సంబంధాలను ఆధారం చేసుకొని ప్రభుత్వాలను రెండురకాలుగా విభజించవచ్చును. పార్లమెంటరీ ప్రభుత్వం, అధ్యక్ష ప్రభుత్వం. పార్లమెంటరీ ప్రభుత్వంలో కార్య నిర్వాహక శాఖకు శాసనసభకు మధ్య సన్నిహిత సంబంధం ఉంటుంది. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో ఈ రెండు శాఖలు స్వతంత్రంగా ఉంటాయి. ఇప్పుడు పార్లమెంటరీ అధ్యక్ష ప్రభుత్వ విధానాల గురించి వివరంగా తెలుసుకుందాం.

BRAOU

## 17.3 పార్లమెంటరీ ప్రభుత్వం

### 17.3.1 పార్లమెంటరీ ప్రభుత్వం - అర్థవివరణ

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో శాసన నిర్మాణ అధికారం, కార్యనిర్వహణాధికారం కలసి ఉంటాయి. ఈ విధానంలో రాజకీయ కార్యనిర్వాహక వర్గం శాసన సభ నుండి ఏర్పడుతుంది. ఉదాహరణకు బ్రిటన్, ఇండియా దేశాలలో ప్రధాన మంత్రి, మంత్రిమండలి సభ్యులు ఎన్నికైన పార్లమెంట్ సభ్యులై ఉండాలి. ప్రధాన మంత్రి అధ్యక్షతన ఏర్పడిన మంత్రిమండలి కార్యనిర్వాహణాధికారి నిర్వహిస్తుంది. దీని కార్యకలాపాలకు పార్లమెంట్‌కు బాధ్యత వహిస్తుంది. ఈ కారణంగా పార్లమెంటరీ ప్రభుత్వాన్ని బాధ్యతాయుత ప్రభుత్వమని అంటారు.

17, 18 శతాబ్దాలలో పార్లమెంటరీ ప్రభుత్వ విధానం మొట్టమొదట బ్రిటన్‌లో అభివృద్ధి చెందింది. ఇప్పుడు అనేక దేశాలలో ఈ ప్రభుత్వ విధానం ఆచరణలో ఉంది. బ్రిటన్, బ్రిటీష్ కామన్వెల్త్ రాజ్యాలు, ఆస్ట్రియా, జర్మనీ, డెన్మార్క్, ఇండియా, జపాన్‌దేశాలలో పార్లమెంటరీ ప్రభుత్వ విధానం ఆచరణలో ఉంది.

## 17.3.2 పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణాలు

పార్లమెంటరీ ప్రభుత్వ లక్షణాలను ఈక్రింది విధంగా వివరించవచ్చు

1. అధికారాలు వ్యవస్థలు - స్పష్టత కొరవడిన విభజన : పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో ప్రభుత్వ అధికారాలు, వ్యవస్థలు స్పష్టంగా ఏర్పాటు చేయబడవు. ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పడ్డ మంత్రిమండలి పార్లమెంట్‌లో ఒక భాగమని చెప్పవచ్చును. ఉదాహరణకు బ్రిటన్, ఇండియా దేశాలలో ప్రధానమంత్రి, ఇతర మంత్రులు అధికార పార్టీకి చెందిన, ఎన్నికైన పార్లమెంట్ సభ్యులై ఉంటారు. వీరిని రాజకీయ కార్యనిర్వాహక వర్గమని అంటాం. మంత్రులైన తరువాత కూడా పార్లమెంట్ సభ్యులుగా కొనసాగుతారు. ఒకే వ్యవస్థకు చెందిన రెండు భాగాలు. పార్లమెంటరీ విధానంలో శాసనాధికారాలు, కార్యనిర్వాహణాధికారాలు కలసి ఉంటాయి.

2. సాంప్రదాయక పార్లమెంట్ అధిక్యత : పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో పార్లమెంట్ సర్వాధికారి, కార్యనిర్వాహక శాఖ ఏజెన్సీలను ఆదేశించడానికి అవసరమగు అధికారాన్ని మంత్రులకు పార్లమెంట్ నుండి లభిస్తుంది. మంత్రిమండలిని పార్లమెంట్ సృష్టి అని చెప్పవచ్చు. అధికారంలో కొనసాగడానికి మంత్రిమండలి పార్లమెంట్ విశ్వాసాన్ని పొందాలి. అవిశ్వాస తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించినట్లైతే, మంత్రిమండలి రాజీనామా చేయ్యాలి. ప్రధానమంత్రి, ఇతర మంత్రులు పార్లమెంట్‌లో మెజారిటీ పార్టీ మద్ధతుపై ఆధారపడి ఉంటారు. అంటే రాజాకీయ కార్య నిర్వాహక వర్గాన్ని పార్లమెంటు అధికారంలో ఉంచగలదు. అధికారాం నుండి దించగలదు.

3. కార్యనిర్వాహక అధికారాలను రెండు భాగాలుగా విభజించడం : పార్లమెంటరీ ప్రభుత్వ విధానం కార్యనిర్వాహక అధికారాలను రెండు రకాలుగా విభజిస్తుంది. అవి (i) ప్రభుత్వాధినేత (ii) రాజ్యాధినేత. ప్రభుత్వానికి అధిపతి ప్రధానమంత్రి అధ్యక్షతనున్న మంత్రిమండలి. బ్రిటన్‌లో రాజ్యాధిపతి సార్వభౌముడైతే, ఇండియాలో దేశాధ్యక్షుడు. మన సమాఖ్య విధానంలో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వాధినేతని ముఖ్యమంత్రి అని, రాష్ట్రాధినేతని గవర్నర్ అని అంటాం.

రాజ్యాధినేత నామమాత్రపు కార్యనిర్వాహకుడు. అతనికి నామమాత్రపు అధికారాలు మాత్రమే ఉంటాయి. అతనికున్న పరిమిత అధికారాలను కూడా ప్రభుత్వాధినేత సలహాపైన నిర్వహిస్తాడు. ఉదాహరణకు మనదేశంలో ప్రధానమంత్రి నియామకంలో రాష్ట్రపతికి ఎటువంటి నిర్ణయాధికారం లేదు. ఆచరణలో పార్లమెంట్‌లో దిగువసభలో మెజారిటీ పార్టీ లేదా సంకీర్ణ పార్టీల నాయకుని మాత్రమే మంత్రివర్గాన్ని (ప్రభుత్వాన్ని) ఏర్పాటు చేయమని రాష్ట్రపతి ఆహ్వానించాలి. ప్రధానమంత్రి సలహాపై ఇతర మంత్రులను రాష్ట్రపతి నియమిస్తాడు. దేశప్రజల ప్రతినిధిగా రాజ్యాధినేత నిర్వహించే లాంఛనప్రాయమైన కార్యకలాపాలకు ప్రాముఖ్యత ఉంటుంది.

4. మంత్రివర్గ ప్రభుత్వం (Cabinet Government) : పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో మంత్రివర్గానికి ఆధిక్యత ఉంటుంది. ఈ కారణం వలన పార్లమెంటరీ ప్రభుత్వాన్ని మంత్రివర్గ ప్రభుత్వమని (Cabinet

BRAOU

Governemnt) పిలుస్తారు. ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పడిన మంత్రివర్గం వాస్తవ కార్యానిర్వాహణ అధికారి. పార్లమెంట్‌లో మెజారిటీ పార్టీకి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు మంత్రివర్గంలో ఉంటారు. మంత్రివర్గంలో సభ్యుల సంఖ్య 16 నుండి 20 వరకు ఉంటుంది. వీరు పరిపాలన శాఖలకు అధిపతులుగా ఉంటారు. మంత్రివర్గం పాలన బాధ్యతలను నిర్వహిస్తుంది.పార్టీ విధానాన్ని అనుసరించి ప్రభుత్వ విధానాన్ని మంత్రివర్గం నిర్ణయిస్తుంది. ప్రభుత్వ విధానాలను నిర్ధేశించే అధికారం మంత్రివర్గానికి ఉంటుంది.

5. మంత్రివర్గ సమిష్టి బాధ్యత : మంత్రివర్గం సమిష్టిగా దేశ పరిపాలనను నిర్వహిస్తుంది. మంత్రివర్గ సమావేశాలలో ప్రభుత్వ విధానాలను నిర్ణయిస్తారు. సిద్ధాంతరీత్యా మంత్రి వర్గ సభ్యులందరూ సమానులు. వారు తీసుకున్న నిర్ణయాలకు సమిష్టిగా కట్టుబడి ఉంటారు. మంత్రులు, మంత్రివర్గ నిర్ణయాలను బహిరంగంగా సమర్థిస్తారు. ఏమంత్రైనా మంత్రివర్గ నిర్ణయాలతో ఏకీభవించని పక్షంలో అతను మంత్రివర్గం నుండి రాజీనామా చేయ్యాలి. మంత్రివర్గం సమిష్టిగా పార్లమెంట్ విమర్శకు గురిచేసినా మొత్తం మంత్రివర్గాన్ని విమర్శించినట్లౌతుంది. హేరీ ఎక్ స్పీన్ చెప్పినట్లు "ఒక మంత్రి చర్య మొత్తం మంత్రివర్గం చర్యగా" భావించబడుతుంది. మంత్రివర్గ సభ్యులందరూ సమిష్టిగా పదవిలో కొనసాగడమో, పదవి నుండి వైదొలగడమో జరుగుతుంది.

పార్లమెంటు ప్రభుత్వాన్ని రద్దుచేయదలిస్తే మొత్తం మంత్రివర్గాన్ని పదవినుండి తొలగించాలి. మంత్రివర్గం నుండి కొద్దిమందినిగానీ, ఒక్కొక్కరినిగానీ తొలగించరాదు. అయినప్పటికీ, వ్యక్తిగత కారణాలవల్ల మంత్రులు మంత్రివర్గానికి రాజీనామా చేయవచ్చును.

6. ప్రధానమంత్రి స్థానం : ప్రధానమంత్రి మంత్రివర్గ సమానులలో ప్రథముడు మాత్రమే కాడు. ఇతను మంత్రివర్గ సౌధానికి మూల స్థంబం వంటివాడు. అతను మంత్రివర్గానికి అధ్యక్షుడు, నాయకుడు, మంత్రివర్గ సహచరులను అతను నియమిస్తాడు. వారికి బాధ్యతలను కేటాయిస్తాడు. ప్రధానమంత్రి మంత్రివర్గం నుండి ఏమంత్రినైనా తొలగించగలడు. అతని నిర్ణయాలతో ఏకీభవించని మంత్రి లేదా మంత్రులు మంత్రివర్గానికి రాజీనామా చేయ్యాలి. మంత్రివర్గ సమావేశాలకు ప్రధానమంత్రి అధ్యక్షత వహిస్తాడు. ఇటువంటి సమావేశాలలో విధానాలను నిర్ణయించడంలో ప్రదానమంత్రి ప్రముఖపాత్ర వహిస్తాడు.

BRAOU

పార్లమెంటు లోపలా, బయటా ప్రధానమంత్రి తన పార్టీకి నాయకుడు. తనపార్టీలో తిరుగులేని ప్రభావాన్ని, అధిపత్యాన్నీ, అనుచర వర్గాన్నీ కలిగి ఉంటాడు. పార్టీ భవిష్యత్ ప్రజాదరణ ప్రధాని గుణవిశేషాలపై ఆధారపడి ఉంటాయి. ప్రధానమంత్రి అధికారాలు నానాటికీ పెరగడం వల్ల పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని ప్రధాన మంత్రి ప్రభుత్వమని వాడుకలోకి వచ్చింది.

7. కమిటీ పద్ధతి : సాధారణంగా నిర్ణయాలను, విధానాలను రూపొందించే బాధ్యత మంత్రివర్గ కమిటీలు చేపడతాయి. ఇంచుమించు ముఖ్యమైన మంత్రివర్గ కమిటీలన్నింటిలో ప్రధానమంత్రి ఉంటాడు. అవితీసుకొన్న నిర్ణయాలను ఇతను అధికంగా ప్రభావితం చేస్తాడు. మంత్రివర్గంలో అతనికున్న ప్రాధాన్యతకు ఇదొక కారణమని చెప్పవచ్చును.

8. నిర్ణీత కాలపరిమితి ఉండదు : పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో ప్రభుత్వాధినేత అయిన ప్రధానికి, అతని మంత్రి వర్గానికి నిర్ణీత కాలపరిమితి లేదు. రాజకీయ ప్రధాన కార్య నిర్వాహకుని అధికారం, పదవీకాలం శాసనసభ, కార్యనిర్వాహక శాఖ మధ్యనున్న సంయోజనం మీద ఆధారపడి ఉంటుంది. ఈ రెండింటి

మధ్య వివాదాలు గానీ, భిన్నాభిప్రాయాలుగానీ ఏర్పడినప్పుడు పార్లమెంటుకు ఆమోదయోగ్యమైన కొత్త మంత్రివర్గం ఏర్పడం గానీ, లేదా పార్లమెంటు రద్దయి సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడంగాని సంభవిస్తాయి.

9. సార్వత్రిక ఎన్నికలు నియమిత కాలంలో జరగవు : పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో సార్వత్రిక ఎన్నికలు నిర్ణీత కాలంలో జరగవు. ఎన్నికలు ఎప్పుడైనా మధ్యంతరంగా రావచ్చు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పార్టీ నాయకులు తలచినప్పుడు ఎన్నికలు జరపవచ్చు. ఇటువంటి ఎన్నికల ముఖ్యోద్దేశాలు రెండు. ఒకటి, పార్లమెంటులో అధికారపార్టీ మెజారిటీని పెంచుకోవడం. రెండు, అధికార పార్టీ పదవీకాలన్ని పొడగించుకోవడం. అధికార పార్టీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ముఖ్యమైన బిల్లు ఓడిపోతే ప్రధాని పార్లమెంటును రద్దుచేసి సాధారణ ఎన్నికలను జరపవచ్చు. ఈ విధానంలో సాధారణ ఎన్నకలు నిర్ణీతకాలానికి జరగకపోగా చాలా తరుచుగా జరిగే అవకాశాలున్నాయి.

10. పార్టీ విధానం : పార్లమెంటరీ ప్రభుత్వవిధానం బాధ్యతాయుత పార్టీ ప్రభుత్వం. ఈ విధానంలో ఎన్నికలలో గెలిచిన పార్టీ నాయకత్వ బృందం రాజకీయ కార్యనిర్వాహక వర్గంగా ఏర్పడుతుంది. పార్లమెంటు సమర్థవంతంగా పనిచేసే రాజకీయ పార్టీల మీద పార్లమెంటరీ ప్రభుత్వ విధానం ఆధారపడి ఉంటుంది. డిజ్రేలి చెప్పినట్లు, రాజకీయ పార్టీలు లేకుండా పార్లమెంటరీ ప్రభుత్వం అసంభవం.

11. రాజకీయ కార్య నిర్వహణాధికారి శాసనసభకు జవాబుదారి : పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో రాజకీయ కార్యనిర్వహణాధికారి శాసనసభకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఈ ప్రభుత్వ విధానాలున్న బ్రిటన్, ఇండియాల్లో మంత్రులు పార్లమెంట్ సమావేశాలకు హాజరవుతారు. మంత్రులు పార్లమెంటుకు ప్రత్యక్షంగా బాధ్యులని ఈ పద్ధతి తెలియజేస్తుంది. ప్రశ్నోత్తర సమయంలో ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సంతృప్తికరమైన సమాధానాలు చెప్పాలి. ప్రభుత్వపాలనలో జరిగిన అవకతవకలను బయటపెట్టడమే ఈ ప్రశ్నోత్తర సమయం ముఖ్యోద్దేశం. కార్యనిర్వాహక శాఖ చేసే అధికార దుర్వినియోగాన్ని నిరోధిస్తుంది.

### 17.3.3 పార్లమెంటరీ ప్రభుత్వ లాభాలు

పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో కొన్ని లాభాలున్నాయి. వాటిని ఈ క్రిందివిధంగా వివరించవచ్చును.

1. పార్లమెంటరీ ప్రభుత్వం బాధ్యతాయుత ప్రభుత్వం రాజకీయ కార్యనిర్వహణ అధికారి (మంత్రివర్గం) ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభకు, తద్వారా ఓటర్లకు బాధ్యత వహిస్తాడు. ప్రజాభిమానాన్ని, మద్దతుని పోగొట్టుకున్న ప్రభుత్వం ఎక్కువకాలం అధికారంలో కొనసాగలేదు. ఈ విధానం ప్రభుత్వ నిరంకుశ ధోరణులను అదుపులో ఉంచుతుంది.

2. ఈ ప్రభుత్వ విధానం ప్రజాభీష్టాన్నీ, ప్రజాభిప్రాయాన్ని మన్నిస్తుంది. ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వ్యవహరిస్తుంది. ఈ ధోరణి శాసనసభలో కనిపిస్తుంది.

3. ఈ విధానంలో ... ంతమైన పరిపాలనకు అవకాశముంది. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కంటే పార్లమెంటరీ విధానంలో శాసన ... ప్రక్రియ సమర్థవంతంగా ఉంటుంది. పార్లమెంటుకు మంత్రివర్గానికి ఏకాభిప్రాయం కుదురనప్పుడు ఈ రెంటింటిలో ఒకటి తప్పనిసరిగా మారవలసి ఉంటుంది. అంతేకాకుండా సమర్థవంతమైన నాయకత్వాన్ని పార్లమెంట్‌కు మంత్రివర్గం అందిస్తుంది.

B R A O U

4. సాధారణంగా శాసన సభకు, కార్యనిర్వాహక శాఖకు మధ్య సామరస్య సహకారాలు ఉండడం వలన సమర్ధవంతమైన కార్యనిర్వహక శాఖ ఏర్పడుతుంది. అంతేకాకుండా ప్రభుత్వ నిర్వహణకూడా సాఫీగా సాగుతుంది. శాసన నిర్మాణ శాఖ, కార్యనిర్వహక శాఖల మధ్య సమన్వయం ఉండడం వల్ల ముఖ్య సమస్యలపై ప్రభుత్వం ప్రజామద్దతుతో చర్య తీసుకోగలదు.

5. పార్లమెంటరీ ప్రభుత్వ విధానం నాయకత్వ అభివృద్ధికి దోహదం చేస్తుంది. సామర్థ్యంగల యువ రాజకీయ నాయకులకు భవిష్యత్తులో మంత్రి పదవులను చేపట్టడానికి అవసరమగు శిక్షణనిస్తుంది. ఈ ప్రభుత్వ విధానం యువరాజకీయ వేత్తలకు శిక్షణా కేంద్రంగా పనిచేస్తుంది.

6. పార్లమెంటరీ ప్రభుత్వ విధానం క్రొత్త పరిస్థితులకు అనుగుణంగా సులభంగా మారగలదు. ఇటువంటి మార్పు ఒక ప్రభుత్వ నిర్ణీత కాలపరిమితి పూర్తికాకముందే సంభవించవచ్చును.

### 17.3.4 పార్లమెంటరీ ప్రభుత్వ నష్టాలు

పార్లమెంటరీ ప్రభుత్వ నష్టాలను ఈక్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. పార్లమెంటరీ ప్రభుత్వ విధానం అధికార వేర్పాటు సిద్ధాంతానికి వ్యతిరేకమైనది. ఈవిధానంలో శాసన కార్యనిర్వాహక వర్గాలు కలసి ఉన్నాయి. శాసనసభ విశ్వాసం ఉన్నంతకాలం మంత్రివర్గం నిరంకుశంగా పరిపాలించే అవకాశం ఉంది. అధికార దుర్వినియోగం అవుతుంది.

2. ఈ విధానంలో మంత్రివర్గం కొద్దిమంది వ్యక్తుల బృందం. కాబట్టి పాలన బాధ్యత వారి మధ్య పంపిణీ చేయడం జరుగుతుంది. బహుపార్టీ విధానమున్న ఇండియావంటి దేశాలలో బాధ్యతల పంపిణీ మరీ ఎక్కువగా ఉంటుంది.

3. పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో సుస్థిరత లోపిస్తుంది. దీనికి కారణం మంత్రివర్గం పార్లమెంటుకు బాధ్యత వహించి ఉండడమే. పార్లమెంటుకు, మంత్రివర్గానికి ఏకాభిప్రాయం లోపించినప్పుడు ఈ రెండింటిలో ఒకటి పదవి నుండి తొలగిపోవాలి. బహుపార్టీ విధానంలో సంకీర్ణ మంత్రివర్గం ఏర్పడినచోట అస్థిరత్వం చాలా ఎక్కువని చెప్పవచ్చును.

4. పార్లమెంటరీ ప్రభుత్వం సగటు మనుషుల ప్రభుత్వమని విమర్శకుల అభిప్రాయం. ఈవిధానంలో మంత్రుల నియామకం పార్లమెంటు సభ్యులకే పరిమిత మవుతుంది. సమర్థులైన ఇతరులను మంత్రులగా నియమించే అవకాశం ఈ ప్రభుత్వ విధానంలో ఉండదు.

5. పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో "మంత్రివర్గ నియంతృత్వం" (Cabinet Dictatorship) ఒకలోపం. దీనికి కారణం ఈ విధానంలో మంత్రివర్గానిదే పై చేయి. ఈ అభిప్రాయంతో కొంతమంది రచయితలు ఏకీభవించడంలేదు. వారి అభిప్రాయంలో మంత్రివర్గ నియంతృత్వాన్ని అరికట్టడానికి ప్రజలకు సంపూర్ణ రాజకీయ హక్కులు, స్వేచ్ఛ ఉంటాయి. అధికార దుర్వినియోగం చేసే ప్రభుత్వాన్ని ఎన్నికల సమయంలో ఓటు ద్వారా అధికారం నుండి తొలగిస్తారు. ఈ పరిస్థితి ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాన్ని కల్పిస్తుంది.

B R A O U

## 17.4 అధ్యక్ష ప్రభుత్వం

### 17.4.1 అధ్యక్ష ప్రభుత్వం - అర్థవివరణ

అధ్యక్ష ప్రభుత్వ విధానం అధికార విభజన సిద్ధాంతం మీద ఆదారపడి ఏర్పడుతుంది. ఈ విధానంలో అధ్యక్షుడే రాజ్యానికీ, ప్రభుత్వానికీ అధిపతి. అధ్యక్షుణ్ణి నిర్ణీత కాలానికి ప్రజలు ఎన్నుకొంటారు. అధ్యక్షుడు శాసనసభకు బాధ్యత వహించడు. అతని పదవీకాలం శాసనసభపై ఆధారపడి ఉండదు. ప్రభుత్వ విధాన నిర్ణయ ప్రక్రియలో అధ్యక్షుడికి సంపూర్ణాధికారం, అత్యున్నత పాత్ర ఉంటుంది. అధ్యక్ష ప్రభుత్వం విధానం అమెరికాలోను, కొన్ని లాటిన్ అమెరికా దేశాలలోను ఆచరణలో ఉంది.

### 17.4.2 అధ్యక్ష ప్రభుత్వ లక్షణాలు

అధ్యక్ష ప్రభుత్వ ముఖ్యలక్షణాలను ఈక్రింది విధంగా వివరించవచ్చు.

1. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల అధికారాలు, వ్యవస్థలు ఏర్పాటు చేయబడి ఉంటాయి. ఈవిధానంలో ప్రధాన కార్య నిర్వాహకుడు నిర్ణీతకాలానికి ప్రజలచేత ఎన్నుకోబడతాడు. అతనికి రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర్య ప్రతిపత్తి ఉంటుంది. ప్రధాన కార్యనిర్వాహకున్ని అధ్యక్షుడంటారు. అధ్యక్షుడు శాసనసభకు బాధ్యత వహించడు. ఈవిధానంలో శాసనసభకూడా ఒక నిర్ణీత కాలానికి ఎన్నుకోబడుతుంది. శాసనసభను రద్దుచేసే అధికారం అధ్యక్షునికి ఉండదు. స్వతంత్రంగా ఎన్నుకోబడిన రెండు ప్రత్యేక వ్యవస్థలలో కార్యానిర్వహణాధికారాలు, శాసనాధికారాలు ఉంటాయి. ప్రభుత్వం మూడు శాఖల మధ్య సంబంధాలను నిరోధ సమతౌల్య సిద్ధాంతం నిర్ణయిస్తుంది.

2. అధ్యక్ష, ప్రభుత్వ విధానంలో రాజ్యాదిపతి - ప్రభుత్వాధిపతి అధ్యక్షుడే. రాజ్యాధిపతిగా అధ్యక్షుడు లాంఛన ప్రాయమైన విధులను నిర్వహిస్తాడు. ఈ విధుల నిర్వహణలో దేశప్రజలకు ప్రతినిధిగా అధ్యక్షుడు వ్యవహరిస్తాడు.

ప్రభుత్వాధినేతగా విధానాలను నిర్ణయించి అమలు జరిపే బాధ్యత అధ్యక్షునిదే. మంత్రివర్గ సభ్యులను అధ్యక్షుడే నియమిస్తాడు. వారిని పదవి నుండి తొలగించే అధికారం అతనికే ఉంటుంది. ఈ ప్రభుత్వ విధానంలో నామమాత్రపు కార్యనిర్వహక వర్గానికి, వాస్తవకార్య నిర్వాహక వర్గానికి ఎటువంటి వ్యత్యాసం లేదు. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో రాజ్యధినేత పాత్ర ప్రభుత్వాధినేత పాత్ర రెండూ ఒకే ప్రధాన కార్యనిర్వాహకుని చేతిలో ఉంటాయి.

3. అధ్యక్ష, ప్రభుత్వ విధానంలో నిర్ణీతకాలానికే ఎన్నికలు జరుగుతాయి. శాసనసభ, కార్యనిర్వహక శాఖల మధ్య వున్న సంబంధాలతో నిర్ణీతకాలంలో జరిగే ఎన్నికలకు ఎటువంటి సంబంధం ఉండదు.

అమెరికాలో అధ్యక్ష ప్రభుత్వ లక్షణాలను ఈ సందర్భములో ఉదాహరణగా సంక్షిప్తంగా వివరిద్దాం అమెరికాలో కార్యనిర్వాహక వర్గాన్ని అధ్యక్ష ప్రభుత్వానికి మంచి ఉదాహరణగా చెప్పవచ్చును.

(1) అమెరికాలో అధ్యక్ష ప్రభుత్వ విధానం అధికార విభజన సిద్ధాంతంపై ఆధారపడి ఉంది. రాజ్యాంగాన్ని అనుసరించి అధ్యక్షుడు నాలుగు సంవత్సరాల పదవీకాలానికి పరోక్షంగా ఎన్నికఅవుతాడు. రాజ్యాంగంలో చెప్పిన ఒక్క నేరారోపణ మినహాయిస్తే అతని పదవీకాలం పూర్తయేలోగా అతనిని శాసనసభ

BRAOU

పదవి నుంచి తొలగించలేరు. కాంగ్రెస్ (శాసనసభ)ను కూడా నిర్ణీత కాలానికే ప్రజలు ఎన్నుకుంటారు. న్యాయాధికారాన్ని సమాఖ్య న్యాయవ్యవస్థ అయిన సుప్రీంకోర్టుకు రాజ్యాంగం ఇచ్చింది. రాజ్యాంగం ప్రకారం ఈ మూడు అధికారాలలో ఏరెండింటినైనా ఒకవ్యక్తి నిర్వహించడానికి వీలులేదు.

(2) నిరోధ సమతౌల్య సిద్ధాంతాన్ని అనుసరించి ప్రభుత్వ మూడు శాఖల మధ్య సంబంధాలుంటాయి. కాంగ్రెస్ ఆమోదించిన శాసనాలను అధ్యక్షునికి వీటో చేసే అధికారం ఉంటుంది. అధ్యక్షుడు రూపొందించిన కార్యక్రమాలను తిరస్కరించే అధికారం కాంగ్రెస్‌కుంది. రాజ్యాంగం పేర్కొన్న నేరారోపణపై అభిశంసన ద్వారా కాంగ్రెస్ అధ్యక్షుడిని పదవినుండి తొలగించవచ్చు. న్యాయ సమీక్షాధికారం ద్వారా సుప్రీంకోర్టు కాంగ్రెస్ అధికారాన్ని, అధ్యక్షుని అధికారాన్ని నిరోధించగలదు. న్యాయాధిపతులను నియమించే అధికారం ద్వారా అధ్యక్షుడు, న్యాయవ్యవస్థ స్థానాలను రద్దుచేసే అధికారం ద్వారా కాంగ్రెస్ సుప్రీంకోర్టు అధికారాన్ని నిరోధించవచ్చు.

(3) రాజ్యాధినేత, ప్రభుత్వాధినేత రెండూ అధ్యక్షుడే, రాజ్యంగంలో నిర్దిష్టంగా పేర్కొన్న అధికారాలను, విధులను మాత్రమే అధ్యక్షుడు చెలాయించాలి. అయినప్పటికీ, అధ్యక్షపదవి రాజ్యాంగం ఇచ్చిన అధికారాల కంటే ఆయన వ్యక్తిత్వంపై ఎక్కువ ఆధారపడి ఉంటుంది.

(4) అమెరికా అధ్యక్షుడు తన పార్టీకి నాయకుడు. కాంగ్రెస్‌లో ఉన్న తన పార్టీ సభ్యులు ద్వారా కాంగ్రెస్ కార్యకలాపాలను ప్రభావితం చేయగలడు.

(5) ప్రభుత్వంలో వివిధ శాఖలకు పరిపాలనాధిపతులైన కార్యవర్గసభ్యులను (కార్యదర్శులు) అధ్యక్షుడు నియమిస్తాడు. వారిని తన ఇష్టప్రకారం తొలగించవచ్చు. కార్యవర్గ (మంత్రిమండలి) సభ్యులు కేవలం అధ్యక్షుని సలహాదారులు మాత్రమే. ఈ విధానంలో అధ్యక్షుడు కాంగ్రెస్‌కు బాధ్యుడు కాడు. అతడు, అతని కార్యదర్శులు కాంగ్రెస్‌లో సభ్యులుకారు. సభాకార్యక్రమాల్లో పాల్గొనరు.

### 17.4.3 అధ్యక్ష ప్రభుత్వ లాభాలు

అధ్యక్ష ప్రభుత్వ ప్రయోజనాలను ఈ క్రింది విధంగా సంక్షిప్తంగా చెప్పవచ్చును.

1. అధ్యక్ష విధానంలో ప్రభుత్వానికి సుస్థిరత ఉంటుంది. దీనికి కారణం అధ్యక్షుడు ఒక నిర్ణీత కాలానికి పదవిలో ఉంటాడు.

2. ప్రభుత్వ విధానాలు అవిచ్ఛిన్నంగా కొనసాగుతాయి. అధ్యక్షుడు ప్రభుత్వ కార్యాకలాపాలపై పూర్తిగా ఏకాగ్రతతో వ్యవహరించవచ్చు. బాధ్యత ఒక అధ్యక్షునికే ఉండడంవల్ల ఇతరుల జోక్యం లేకుండా త్వరితంగా రాజకీయ నిర్ణయాలను తీసుకోగలడు. వాటిని సమర్థవంతంగా అమలు పరచగలడు.

3. కార్యనిర్వాహక, పరిపాలన బాధ్యతలు రెండూ అధ్యక్షునికే ఉంటాయి. అతని మంత్రివర్గ సభ్యులైన కార్యదర్శులు అతనికే బాధ్యులు.

4. ఈ విధానం సమర్థవంతమైన పాలనను దేశానికి అందిస్తుంది. రాజకీయాలతో ప్రమేయం లేకుండా సమర్థులైన వ్యక్తులకు మాత్రమే పాలన శాఖాధిపతులుగా అధ్యక్షుడు నియమిస్తాడు. అసమర్థులను తొలగిస్తాడు.

5. అత్యవసర పరిస్థితులలో అధ్యక్ష ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తుంది.



B R A O U

### 17.4.4 అధ్యక్ష ప్రభుత్వ నష్టాలు

అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కొన్ని నష్టాలున్నాయి. వాటిని ఈక్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక వర్గానికి శాసనసభకు మధ్య ఏకాభిప్రాయం కుదరని పరిస్థితి ఏర్పడితే, ప్రతిష్టంభనకు, సంఘర్షణకు దారితీస్తుంది. ఇది అసమర్థతకు దారి తీస్తుంది. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఇటువంటి పరిస్థితి దురదృష్టకరమని చెప్పవచ్చును.

2. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక అధికారమంతా ఒకరిచేతిలో కేంద్రీకృతమై ఉంటుంది. ఈ అధికారంపై శాసనసభ నియంత్రణ ఉండదు. కాబట్టి అధ్యక్ష ప్రభుత్వ విధానం అధికారవాద ప్రభుత్వ విధానంగా మారడానికి అవకాశం ఉంది. దీనివల్ల నిరంకుశత్వధోరణులు ఏర్పడే ప్రమాదం ఉంది.

3. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కార్యనిర్వాహక శాఖ, శాసనసభ అధికారాల మధ్య స్పష్టంగా గీతగీయడం సాధ్యపడదు. దీనివల్ల ఈ శాఖల మధ్య అధికారాల హద్దులు గురించి సంఘర్షణలు ఏర్పడతాయి.

4. అధ్యక్ష ప్రభుత్వ విధానం యొక్క సుస్థిరతే దాని యొక్క లోపమని కూడా చెప్పవచ్చును. దీనివల్ల ఈ విధానం దృఢంగాను, సాధారణ మార్పులకు అతీతంగాను ఉంటుంది. అధ్యక్షుని పదవీకాలం పూర్తికాకముందు నూతన పరిస్థితులకు అనుగుణ్యంగా నాయకత్వమార్పు అవసరమైనప్పుడు అటువంటి మార్పును చేయడం సాధ్యపడదు. అందువల్ల కొన్ని సందర్భాలలో ఈ విధానం వల్ల ప్రమాదం ఏర్పడవచ్చు.

## 17.5 పార్లమెంటరీ - అధ్యక్ష ప్రభుత్వ విధానాలలో భారతదేశానికి ఏది అనుకూలంగా ఉంటుంది?

B R A O U

ఈ రెండు ప్రభుత్వ విధానాలలో ఏది భారతదేశానికి అనుకూలమైనదని చర్చించే ముందు మనం ఒక విషయాన్ని గుర్తించుకోవాలి. మన రాజ్యాంగ నేతలు పార్లమెంటరీ ప్రభుత్వ విధానం మంచిదని నిర్ణయించారు. కానీ కాలక్రమేణా అధ్యక్ష తరహా ప్రభుత్వ విధానం మనదేశానికి మంచిదని వాదించడం మొదలుపెట్టారు.

మనదేశానికి అధ్యక్షతరహా ప్రభుత్వ విధానాన్ని సమర్థించినవారు అమలులో ఉన్న పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో ఉన్న రెండు ముఖ్యమైన లోపాలను చూపించారు. 1. ప్రభుత్వ అస్థిరత్వం (2) సగటు మనుషుల ప్రభుత్వ పాలన. అధ్యక్ష ప్రభుత్వ విధానంలో ఈ రెండు లోపాలకు స్థానం లేదు. అయినప్పటికీ అధ్యక్ష ప్రభుత్వ విధానం లోపరహితమైనదని చెప్పలేము. అధ్యక్ష విధానంలో కార్యనిర్వాహకశాఖకు శాసనసభకు మధ్యకొన్ని సందర్భాలలో ప్రతిష్టంభన ఏర్పడవచ్చు. ఈవిధానం విజయంతంగా పనిచేయడానికి ఒకరకమైన అనుకూలమైన రాజకీయ వాతావరణం అవసరం. ఇటువంటి వాతావరణం అమెరికాలో ఉంది. శక్తివంతమైన నాయకులపట్ల అపనమ్మకం ఏర్పడి రెండు పార్టీల విధానాన్ని అనుసరించి అధ్యక్ష విధానం అమెరికాలో పనిచేస్తుంది. ఇటువంటి వాతావరణం భారతదేశంలో లేదు.

ఇంతకు ముందు పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో రెండు లోపాలున్నాయని పేర్కొన్నాం. ఆరెండు లోపాలు మానవ లోపాలు తప్ప సంస్థాగత లోపాలుకావు. పార్లమెంటరీ విధానంలో సమర్థులైన వ్యక్తులను రాజ్యసభకు ఎన్నికచేసి వారిని మంత్రులుగా నియమించవచ్చును. ఇటువంటి ఆనవాయితీ నెహ్రూ కాలంలో

ఉండేది. గతంలో సి.డి. దేశ్‌ముఖ్, జాన్ మతాయ్, వి.కె.ఆర్.వి. రావు మొదలగు ప్రముఖ వ్యక్తులను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. రాజ్యాంగాన్ని తగురీతిలో సవరించి సమర్థులైన నిపుణులను మంత్రివర్గంలో చేర్చుకొనవచ్చును.

భారతదేశానికి పార్లమెంటరీ ప్రభుత్వ విధానమే తగినదని చెప్పవచ్చును. దీనికి అనేక కారణాలను చెప్పవచ్చును.

1. ప్రజాస్వామ్య కార్యనిర్వాహక వర్గానికి రెండు ముఖ్య లక్షణాలుండాలని డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పాడు. అవి (1) సుస్థిర కార్యనిర్వాహక వర్గం (2) బాధ్యతాయుత కార్యనిర్వహక వర్గం. అయితే ఈ రెండు లక్షణాలు అధ్యక్ష ప్రభుత్వ విధానంలోగాని, పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలోగానీ లేవు. సుస్థిరత అధ్యక్ష ప్రభుత్వ ముఖ్యలక్షణమైతే, బాధ్యతాయుత కార్యవర్గం పార్లమెంటరీ ప్రభుత్వముఖ్యలక్షణం. మన రాజ్యాంగ వేత్తలు ఈ రెండు లక్షణాలలో బాధ్యతాయుత ప్రభుత్వాన్నే ఎంచుకున్నారు.

2. చారిత్రకంగా చెప్పాలంటే భారత ప్రభుత్వ చట్టం (1935) అమలులోకి వచ్చిన దగ్గర నుండి మన రాజకీయ నాయకులకు పార్లమెంటరీ ప్రభుత్వ విధానంతో అనుభవముంది.

3. 1947 నుండి స్వతంత్ర భారతదేశం పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని విజయవంతంగా నిర్వహిస్తుంది. ఈ ప్రభుత్వ విధానానికి చెందిన ఆచార - సాంప్రదాయాలతో మన రాజకీయ నాయకులకు బాగా పరిచయముంది.

4. పార్లమెంటరీ ప్రభుత్వ విధానంలో ఉన్న లోపాలను సవరించుకోగల సరళత్వం దీనికి ఉంది.

పైన పేర్కొన్న కారణాలను బట్టి మనదేశానికి అనువైన ప్రభుత్వ విధానం పార్లమెంటరీ ప్రభుత్వ విధానమేనని చెప్పవచ్చును. ఎస్.ఆర్. మహేశ్వరి ప్రకారం, "మనదేశంలో ఆచరణలో ఉన్న పార్లమెంటరీ ప్రభుత్వ విధానానికి గౌరవింపదగిన ప్రత్యామ్నాయం పార్లమెంటరీ ప్రభుత్వ విధానమే .... ప్రస్తుత పార్లమెంటరీ ప్రభుత్వ విధానానికి అపఖ్యాతి తెచ్చిన వ్యక్తులు అధ్యక్ష ప్రభుత్వ విధానానికి కూడా అపఖ్యాతితేరని గ్యారంటీ ఏమిటీ .... భారతదేశానికి రెండవ రిపబ్లిక్ కావాలనే వాదన బలహీనమైనది.

BRAOU

## 17.6 క్లుప్తంగా

శాసన నిర్మాణశాఖ, కార్యనిర్వాహకశాఖల మధ్య ఉన్న సంబంధాలనుబట్టి ప్రభుత్వాలను పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలుగా వర్గీకరించవచ్చును. పార్లమెంటరీ విధానంలో కార్యనిర్వాహకశాఖకు శాసన నిర్మాణశాఖతో సన్నిహిత సంబంధం ఉంటుంటి. దీనికి భిన్నంగా విభజన సిద్ధాంతం నిరోధ సమతౌల్య సిద్ధాంతాల మీద ఆధారపడి ఏర్పడుతుంది.

పార్లమెంటరీ విధానంలో రాజ్యాధినేత నామమాత్రపు కార్యనిర్వహక అధికారమయితే, ప్రభుత్వాధికారి వాస్తవ కార్యనిర్వాహకాధికారి. రాజ్యాధినేత (ఉదాహరణకు భారత రాష్ట్రపతి) లాంఛన ప్రాయమైన రాజ్య కార్యకలాపాలను మాత్రమే నిర్వహిస్తాడు. ప్రభుత్వాధినేత అయిన ప్రధానమంత్రి - అతని మంత్రివర్గం సమిష్టిగా శాసనసభకు బాధ్యత వహిస్తారు. పార్లమెంట్ విశ్వాసం చూరగొన్నంతకాలం ప్రభుత్వం అధికారంలో

ఉంటుంది. సమర్థత, ప్రజాప్రతినిధులకు బాధ్యత వహించడం దీని ప్రధాన సుగుణాలు. అస్థిరత్వం, అధికార దుర్వినియోగం దీని ప్రధాన లోపాలు.

అధ్యక్ష ప్రభుత్వ విధానంలో ప్రధాన కార్యనిర్వహకుడు, శాసనసభలు వేరువేరుగా ప్రజలతో ఎన్నుకోబడతారు. ఈవిధానంలో అధ్యక్షుడే రాజ్యానికీ, ప్రభుత్వానికీ అధినేత. అంటే నామమాత్రపు అధికారి, వాస్తవ అధికారి అతనే. ఈ రెండింటి కార్యాకలాపాలను అధ్యక్షుడే నిర్వహిస్తాడు.

ప్రభుత్వ స్థిరత్వం, విధానాల అవిచ్ఛిన్నత దీని సుగుణాలు. శాసన, కార్యనిర్వాహక శాఖల మధ్య సంఘర్షణలు, ప్రతిష్టంభన ఈ విధానంలో ముఖ్యలోపాలు. మన రాజ్యాంగ వేత్తలు ఈ రెండు ప్రభుత్వ విధానాలలో పార్లమెంటరీ ప్రభుత్వ విధానమే మనదేశానికి అనుకూలమైనదని ఎంచుకున్నారు.

## 17.7 చదువదగిన పుస్తకాలు


S.R. Maheswari : "Comparative Government and Politics"

J.R. Thackrah : "Politics"

Austin Ranney : "Governing : An Introduction to Politcial Science"

B.K. Gokhale : "Political Science Theory and Governmental Machinery"


## 17.8 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వ విధానాల సుగుణాలను, దోషాలను తెలపండి
2. పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వ విధానాలలో ఏది భారతదేశానికి అనుకూలమైనది ? ఎందుకు ?

**II. ఒక్కొక్క ప్రశ్నకు 10 పంక్తులలో జవాబులిమ్ము.**

1. అధికార విభజన సిద్ధాంతం - నిరోధ సమతౌల్య సిద్ధాంతం
2. పార్లమెంటరీ ప్రభుత్వ విధాన ముఖ్య లక్షణాలు
3. అధ్యక్ష ప్రభుత్వ విధాన ముఖ్య లక్షణాలు
4. మంత్రివర్గ ప్రభుత్వం

**రచయిత : ఎస్. పోలినాయుడు**

BRAOU

# భాగం-18 : సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వాలు

విషయ సూచిక


18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 వర్గీకరణ ఆధారం

18.3 సమాఖ్యప్రభుత్వం

18.3.1 సమాఖ్య ప్రభుత్వం - అర్థవివరణ - నిర్వచనం

18.3.2 సమాఖ్య ఎందుకు ఏర్పడుతుంది ?

18.3.3 సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు

18.3.4 సమాఖ్య సమ్మేళన విధానాలు

18.3.4.1 పోలికలు - భేదాలు

18.3.5 సమాఖ్య ప్రభుత్వ ప్రయోజనాలు

18.3.6 సమాఖ్య ప్రభుత్వ నష్టాలు

18.3.7 సమాఖ్యాధికారం పెరుగుదల

18.3.8 సమాఖ్య ప్రభుత్వ భవిష్యత్తు

18.4 ఏక కేంద్ర ప్రభుత్వం

18.4.1 ఏకకేంద్ర ప్రభుత్వ - అర్థవిరణ

18.4.2 ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలు

18.4.3 ఏకకేంద్ర ప్రభుత్వ లాభాలు

18.4.4 ఏకకేంద్ర ప్రభుత్వ నష్టాలు

18.4.5 ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల మధ్య తేడాలు

18.5 క్లుప్తంగా

18.6 చదువగదిన పుస్తకాలు

18.7 నమూనా ప్రశ్నలు


## 18.0 లక్ష్యాలు

ఈ భాగం ముఖ్యలక్ష్యాలు

- ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల వర్గీకరణ ఆధారాన్ని వివరించడం
- ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల అర్థాలను వాటి ముఖ్య లక్షణాలను పరిశీలించడం

BRAOU

- ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల మధ్య తేడాలను చర్చించడం
- ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల భవిష్యత్తును తెలుసుకోవడం

## 18.1 పరిచయం

ఈభాగంలో ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల గురించి పరిశీలిద్దాం. ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే దానిని కేంద్ర, స్థానిక ప్రభుత్వ వ్యవస్థల విభజించడం మంచిది. భౌగోళిక అధికారాల కేటాయింపు ఆధారంగా ప్రభుత్వాలను ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాలుగా వర్గీకరించవచ్చు. ఈ వర్గీకరణ పరిధిలో సమ్మేళన ప్రభుత్వాన్ని కూడా పరిగణించవచ్చు. ఒక్కొక్కరకం ప్రభుత్వానికి ఒక్కో ప్రత్యేక చరిత్ర ఉంది. వీటి ముఖ్యలక్షణాలను విశ్లేషించడం ద్వారా వాటి గురించి సవివరంగా తెలుసుకోవచ్చు.

## 18.2 వర్గీకరణ ఆధారం

రెండు ముఖ్య సూత్రాలను ఆధారంగా చేసుకొని ప్రభుత్వాలను ఏక కేంద్ర, సమాఖ్య ప్రభుత్వాలుగా వర్గీకరించవచ్చు.

1. జాతీయ స్థానిక ప్రభుత్వాలమధ్య అధికారాల పంపిణీ
2. వాటిమధ్యనున్న సంబంధాల స్వభావం.

## 18.3 సమాఖ్య ప్రభుత్వం

### 18.3.1 సమాఖ్య ప్రభుత్వం - అర్థవివరణ నిర్వచనం

BRAOU

ఫెడరేషన్ (Federation) అనే ఆంగ్లపదం Foedus అనే లాటిన్ పదం నుండి ఏర్పడింది. Foedus అనగా ఒడంబడిక అని అర్థం. Federation అనగా సమాఖ్య అని అర్థం. సమాఖ్య అనగా రాజ్యాల సంఘం. సాధారణంగా సైనిక, వర్తక, వాణిజ్య ప్రయోజనాల కొరకు ఒకే భౌగోళిక ప్రదేశంలో ఉన్న చిన్నచిన్న రాజ్యాలు ఉద్దేశ్య పూర్వకంగా సమాఖ్య రాజ్యంగా ఏర్పడతాయి. సమాఖ్యలో చేరిన సభ్యరాజ్యాలు చాలా వరకు స్వతంత్రంగా వ్యవహరిస్తాయి.

"సమిష్టి ప్రయోజనాల కొరకు సమాన హోదాకల కొన్ని రాజ్యాలు సమాఖ్య రాజ్యంగా ఏకమౌతాయి" అని సి.ఎఫ్. స్ట్రాంగ్ చెప్పాడు.

"జాతీయ ప్రభుత్వం, ప్రాంతీయ ప్రభుత్వాలు వాటివాటి అధికార పరిధులలో స్వతంత్రంగా వ్యవహరించడానికి వీలైనట్లు ప్రభుత్వాధికారాలను సమాఖ్య రాజ్యాంగం విభజిస్తుంది", ఈ నిర్వచనంలో కె.సి. వేర్ సమాఖ్య సిద్ధాంతన్ని వివరించాడు. సాధారణంగా దేశానికంతటికి సంబంధించిన సమిష్టి వ్యవహారాలు కేంద్ర లేక జాతీయ ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. సమాఖ్య విధానంలో భాగస్వాములైన రాష్ట్రప్రభుత్వాలకు వాటి అంతరంగిక వ్యవహారాలపై నియంత్రణ ఉంటుంది. అంతేగాక వాటి పాలనాధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వాల కుంటుంది.

సమాఖ్య రెండు విధాలుగా ఏర్పడుతుంది.

1. చిన్న చిన్న స్వతంత్రరాజ్యాలు ఒక ఒప్పందం ద్వారా సమాఖ్య రాజ్యంగా ఏర్పడడం మొదటి పద్ధతి. ఈ పద్ధతిలో సమాఖ్య ఏకీకరణ శక్తుల వల్ల ఏర్పడుతుంది. అమెరికా సమాఖ్య విధానం దీనికి మంచి ఉదాహరణ. స్వతంత్రప్రతిపత్తిగల మొట్టమొదటి 13 కాలనీలు 1787లో ఒక సమాఖ్య రాజ్యంగా ఏర్పడడానికి నిర్ణయించుకున్నాయి.

2. వికేంద్రీకరణ శక్తుల ప్రభావం వల్ల ఒక ఏకకేంద్ర రాజ్యం సమాఖ్య రాజ్యంగా ఏర్పడవచ్చు. ఈవిధానంలో ఏక కేంద్ర రాజ్యంలోని ప్రాంతీయ విభాగాలకు స్వయంపాలన స్వాతంత్ర్యాన్ని ఇవ్వడం జరుగుతుంది. ఈ పద్ధతి ద్వారా భారతదేశ సమాఖ్య ఏర్పడింది.

### 18.3.2 సమాఖ్య ఎందుకు ఏర్పడుతుంది ?

సమాఖ్య ప్రభుత్వం ఏర్పడడానికి అనేక కారణాలను చెప్పవచ్చును.

1. చిన్నచిన్న బలహీన రాజ్యాలు ఒక సమాఖ్యగా ఏర్పడి బలమైన పెద్దరాజ్యాల ప్రమాదాల నుండి రక్షించుకోవాలనే ఆకాంక్ష.

2. సమాఖ్యగా ఏర్పడిన చిన్న రాజ్యాలు తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలనే కోరిక.

3. ఆర్థిక, వర్తక, వాణిజ్య ప్రయోజనాలను పొందాలనే కోరిక.

4. సమాఖ్యలో చేరే రాజ్యాలలో సమైఖ్యతా భావాలు ఉండాలి. సమాఖ్యలో చేరేముందు వాటిలో ఒకేరకమైన రాజకీయ వ్యవస్థలు, అనుభవాలు ఉండాలి.

పైన పేర్కొన్న కారణాలతోపాటు విశాల భూభాగం కూడా సమాఖ్య ప్రభుత్వాలు ఏర్పడడానికి ఒక కారణమని చెప్పవచ్చు. పెద్దరాజ్యాలలో ఒకే కేంద్రం నుండి రాజ్యాన్ని పాలించడం కష్టమైనపని. ఒకేరకమైన చారిత్రక అనుభవాలు, అభివృద్ధి, భౌగోళిక సామీప్యత గల చిన్నచిన్న రాజ్యాలు సమాఖ్యగా ఏర్పడతాయి. ఇటువంటి సమాఖ్యకి ఆస్ట్రేలియా సమాఖ్యను ఉదాహరణగా చెప్పవచ్చును.

BRAOU

### 18.3.3 సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు

సమాఖ్య ప్రభుత్వ ముఖ్య లక్షణాలను ఈక్రింది విధంగా చెప్పవచ్చును.

1. రాజ్యాంగపరమైన అధికారాల విభజన

2. ద్వివిధ ప్రభుత్వ విధానం

3. రాజ్యాంగ ఆధిక్యత

4. ద్విశాసన సభ

5. స్వతంత్ర న్యాయశాఖ

6. రాజ్యాంగ సవరణ పద్ధతులు

పైన పేర్కొన్న సమాఖ్య ప్రభుత్వ లక్షణాలను ఒక్కొక్క దానిని ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

1. రాజ్యాంగపరమైన అధికారాల విభజన : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన సమాఖ్య ప్రభుత్వ ప్రధాన లక్షణం. ఈ విభజనలో ఆర్థిక వనరుల విభజన కూడా ఉంటుంది. ఇటువంటి అధికారాల విభజన ఒక్కొక్క సమాఖ్యలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. అధికారాల విభజన అనుసరించి సమాఖ్య స్వభావం ఆధారపడి ఉంటుంది.

కెనాడా రాజ్యాంగం రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను పేర్కొని అవశేషాధికారాలను కేంద్ర ప్రభుత్వానికిచ్చింది. ఈ విధానానికి విభిన్నంగా అమెరికా రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వ అధికారాలను పేర్కొని అవశేషాధికారాలను రాష్ట్రాలకు వదిలేసింది. కెనడా సమాఖ్య విధానంలో బలమైన కేంద్ర ప్రభుత్వం ఏర్పడితే, అమెరికా సమాఖ్య విధానంలో బలమైన రాష్ట్రప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

భారత సమాఖ్య విధానం మూడవ రకం అధికారాల విభజనను అనుసరించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను మూడు జాబితాలలో వివరించింది. (ఎ) కేంద్ర జాబితా - ఇందులో 97 అంశాలున్నాయి. (బి) రాష్ట్ర జాబితా - ఇందులో 66 అంశాలున్నాయి (సి) ఉమ్మడి జాబితా - ఇందులో 47 అంశాలున్నాయి

కేంద్ర జాబితాలో పేర్కొన్న అంశాలు పై శాసనాధికారం ఒక్కకేంద్ర ప్రభుత్వానికే ఉంది. అదేవిధంగా రాష్ట్ర జాబితాలో పేర్కొన్న అంశాలపై శాసనాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకి మాత్రమే ఉంది. ఉమ్మడి జాబితాలో పేర్కొన్న అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికి శాసనాధికారాలు ఉన్నాయి. కానీ ఉమ్మడి జాబితాలో పేర్కోన్న ఏ అంశంపైనా కేంద్ర రాష్ట్ర శాసనాలకు సంఘర్షణ ఏర్పడితే కేంద్ర ప్రభుత్వానిదే పైచేయి.

అన్ని సమాఖ్య విధానాలలో సాధారణంగా దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, వార్తా సౌకర్యాలు (Communications) మొదలగు దేశానికంతటికి వర్తించిన అంశాలు కేంద్రప్రభుత్వానికి కేటాయించడం జరుగుతుంది. విద్య, ప్రజారోగ్యం, వ్యవసాయం, చేపలు పెంపకం, అడవులు మొదలగునవి రాష్ట్రాలకు కేటాయించడం జరుగుతుంది.

2. ద్వివిధ ప్రభుత్వవిధానం : సమాఖ్య ప్రభుత్వ విధానంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ఒక శాసన నిర్మాణ శాఖ, ఒకకార్యనిర్వాహక శాఖ ఉంటాయి. ఇదేవిధంగా ప్రతిరాష్ట్రానికి ఒక శాసన నిర్మాణ శాఖ, ఒక కార్యనిర్వాహక శాఖ ప్రత్యేకంగా ఉంటాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రత్యేకమైన పాలన వ్యవస్థలు ఉంటాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటివాటి పరిధులలో స్వతంత్రంగా వ్యవహరించే అధికారం వాటికి ఉంది. దీనికి కారణం వాటికి ప్రత్యక్షంగా రాజ్యాంగం నుండి అధికారాలు సంక్రమించడమే. జాతీయ ప్రభుత్వ వ్యవస్థకు, రాష్ట్రాల ప్రభుత్వ వ్యవస్థ అసలైన ప్రతిరూపంగా ఉంటుంది.

సమాఖ్య విధానంలో ప్రభుత్వాలు మూడు అంచెలలో ఉంటాయి. జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిలలో పనిచేస్తాయి. ఇది క్రమానుగతశ్రేణి ననుసరించి పిరమిడ్‌ను పోలి ఉంటుంది. స్థానిక స్థాయిలో ఎన్నో స్థానిక ప్రభుత్వాలు ఉంటాయి. వీటిపై రాష్ట్రస్థాయిలో రాష్ట్రప్రభుత్వాలు ఉంటాయి. జాతీయ స్థాయిలో ఒకేఒక కేంద్ర ప్రభుత్వం ఉంటుంది. కేంద్ర ప్రాంతీయ ప్రభుత్వాల మధ్య సంఘర్షణ ఏర్పడినట్లైతే కేంద్రప్రభుత్వానిదే పైచేయి అవుతుంది. కానీ సమర్థవంతమైన అధికారం వాస్తవానికి క్రిందిస్థాయి నుంచి పైస్థాయికి ప్రవహిస్తుంది.

BRAOU

3. రాజ్యాంగ అధికృత : సమాఖ్య రాజ్యంలో లిఖిత రాజ్యాంగం అత్యున్నత శాసనంగా పరిగణింపబడుతుంది. కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాల అధికారాలను, బాధ్యతలను రాజ్యంగం క్రోడీకరిస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల శాసనాలు, కార్యకలాపాలు రాజ్యాంగానికి అనుగుణంగా ఉండాలి. ఈ రెండు రకాలు ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని విస్మరించరాదు. అవి చేసే రాజ్యాంగ విరుద్ధ శాసనాలు అమలులోకిరావు.

4. ద్విశాసన సభ : ప్రతి సమాఖ్యలో కేంద్ర శాసనసభలో రెండు సభలుంటాయి. ఎగువ సభ, దిగువ సభ. దిగువసభలో ప్రజలు ఎనుకున్న ప్రజాప్రతినిధులుంటారు. అంటే దిగువసభ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉదాహరణకు మన లోక్‌సభ. ఎగువసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అమెరికాలో సెనేట్, ఇండియాలో రాజ్యసభ ఎగువ సభలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. అమెరికాలో సెనేట్ రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యాన్ని కల్పించింది. ప్రతిరాష్ట్రం ఇద్దరు సెనేటర్లను ఎన్నుకుంటుంది. భారతదేశ సమాఖ్యలో రాజ్యసభ రాష్ట్రాల జనాభా ననుసరించి ప్రాతినిధ్యం ఉండదు.

5. స్వతంత్ర వ్యాయశాఖ : రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించి, దాని అర్థ నిర్ణయం చేయడానికి అత్యున్నత స్వతంత్ర న్యాయశాఖ సమాఖ్య విధానంలో అవసరం. కేంద్ర రాష్ట్రాలు చేసిన శాసనాలు, వాటి కార్యనిర్వహక శాఖలు తీసుకున్న నిర్ణయాలు యొక్క రాజ్యాంగ బద్ధతను సుప్రీంకోర్టు నిర్ణయిస్తుంది. కేంద్ర ప్రభుత్వానికీ ఏదైనా ఒక రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యగానీ, వివిధ రాష్ట్రప్రభుత్వాల మధ్యగానీ వివాదాలు తలెత్తినప్పుడు వాటిని సుప్రీంకోర్టు పరిష్కరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలను అనుసరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేసేటట్లు సుప్రీంకోర్టు చూస్తుంది. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు లభించిన అధికారాలలో సమతుల్యాన్ని కల్పిస్తుంది.

6. రాజ్యాంగ సవరణ పద్ధతులు : సమాఖ్య లిఖిత రాజ్యాంగం సాధారణంగా దృఢ రాజ్యాంగమై ఉంటుంది. దీనిని సులభంగా ఒక్క కేంద్రంగానీ లేదా రాష్ట్రాలుగాని ఏకపక్షంగా సవరించడానికి వీలుండదు. ఒక్క కేంద్రంగానీ, రాష్ట్రాలుగానీ రాజ్యాంగంలో పేర్కొన్న అధికార విభజనను మార్చలేవు. రాజ్యాంగ సవరణ ప్రక్రియలో కేంద్రం, రాష్ట్రాలు రెండూ పాల్గొంటాయి. ఒక నిర్ణీత రాష్ట్రాల సంఖ్య అనుమతితో మాత్రమే సమాఖ్య రాజ్యాంగ సవరణ జరుగుతుంది. కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలలో మార్పులు రాజ్యాంగ సవరణల మీద ఆధారపడి యుంటుంది.

యు.ఎస్.ఎ (U.S.A.), ఇండియా, సోవియట్ రష్యా, కెనడా వంటి పెద్ద రాజ్యాలలో సమాఖ్యావిధానం ఆచరణలో ఉంటుంది.

B R A O U

## 18.3.4 సమాఖ్య సమ్మేళన విధానాలు

సమాఖ్య రాజ్యానికి, సమ్మేళన రాజ్యానికి మధ్య కొంత తేడాఉంది. సర్వ స్వతంత్రమైన రాజ్యాల కూటమిని సమ్మేళన రాజ్యమనవచ్చు. ఒక ఒప్పందం ద్వారా దేశరక్షణ, వర్తక వాణిజ్యరంగాల్లో పరస్పర ప్రయోజనాలను పొందడానికి ఒక సమ్మేళన రాజ్యంగా ఏర్పడతాయి. ఒప్పందంలో పేర్కొన్న కార్యకలాపాలకు సంబంధించినంతవరకు సభ్యరాజ్యాలు ఉమ్మడి ప్రభుత్వానికి అధికారాలను ఇస్తాయి. సభ్యరాజ్యాలు అంగీకరించినట్లైతే వాటికి సంబంధించిన అంశాలపై ఉమ్మడి కేంద్ర ప్రభుత్వం శాసనాలు చేస్తుంది. ప్రతి సభ్యరాజ్యానికి సార్వభౌమాధికారం ఉంటుంది. సమ్మేళన విధానంలో కేంద్ర ప్రభుత్వం బలహీనమైంది.

1835 నుండి 1866 వరకు జర్మనీలో, 1781 నుండి 1787 వరకు అమెరికాలో, 1848కి పూర్వం స్విట్జర్లాండ్‌లో సమ్మేళన రాజ్య విధానం (Confedration) ఉండేది. ప్రస్తుత కాలంలో సమ్మేళన రాజ్యం ఎక్కడా లేదు. ఐరోపా కామన్ మార్కెట్‌ని సమ్మేళన విధానానికి దగ్గరగా ఉందని చెప్పవచ్చును.

### 18.3.4.1 పోలికలు - భేదాలు

సమాఖ్య, సమ్మేళన రాజ్యాలమధ్య కొన్ని పోలికలు, భేదాలు ఉన్నాయి. ఈక్రింద చెప్పిన రెండు విషయాలలో వాటి మధ్య పోలికలున్నాయి. (ఎ) సమాఖ్య సమ్మేళన రాజ్యాలు సర్వ స్వతంత్ర రాజ్యాల ద్వారానే ఏర్పడతాయి. (బి) రెండు విధానాలలో ఒకే కేంద్ర ప్రభుత్వం ఉంటుంది. ఈ రెండు విధానాల మధ్య ఈక్రింది తేడాలున్నాయి.

1) సమాఖ్య విధానంలో సభ్యరాజ్యాల కలయిక వల్ల ఒకకొత్త రాజ్యం ఏర్పడుతుంది. సమ్మేళన విధానంలో కొత్తరాజ్యం ఏర్పడదు.

2) సమ్మేళన విధానంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు కేంద్రానిదే పైచేయి. సమ్మేళన విధానంలో సభ్యరాజ్యాలదే పైచేయి.

3) సమాఖ్య విధానంలో రాష్ట్రాలు విడిపోవడానికి వీలుండదు. సమ్మేళన విధానంలో సభ్యరాజ్యాలకు విడిపోయే హక్కుంది.

4) సమాఖ్య శాశ్వతమైనది. సమ్మేళన విధానం శాశ్వతమైనదికాదు.

కొన్ని సమయాలలో సమాఖ్య రాజ్యం ఏర్పడడానికి ముందు దశలో సమ్మేళన రాజ్యం ఏర్పడుతుంది. అమెరికాలో 1781 నుండి 1787 వరకు ఉన్న సమ్మేళన రాజ్యం సమాఖ్యగా ఏర్పడడానికి దారితీసిందని మనకు తెలుసు.

BRAOU

### 18.3.5 సమాఖ్య ప్రభుత్వ ప్రయోజనాలు

సమాఖ్య ప్రభుత్వ విధానంలో ఈక్రింది ప్రయోజనాలు ఉంటాయి.

1) రాజ్యంలో వివిధ ప్రాంతాల్ల అవసరాలను తీర్చడానికి సరిపడు శాసనాలను చేయడానికి సమాఖ్య విధానం వీలుకల్పిస్తుంది. ఇందుకు కారణం ఈ విధానంలో స్థానిక సమస్యలను రాష్ట్రాలకు వదలిపెట్టడమే.

2) సమాఖ్య విధానంలో కేంద్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై శ్రద్ధ చూపుతుంది. ఇందుకు కారణం ఈ విధానంలో కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సమస్యల భారం తగ్గుతుంది.

3) స్థానిక లేదా ప్రాంతీయ ప్రభుత్వాలు సమాఖ్య విధానంలో పాలనకు సంబంధించిన నూతన ప్రయోగాలు చేస్తాయి. అటువంటి ప్రయోగాలను దేశం అంతటా అంగీకరించి, ఆచరించవచ్చు లేదా ఆచరించకపోవచ్చును.

4) విభిన్న జాతులు, మతాలు, భాషలు, భౌగోళిక భేదాలు ఉన్న అతిపెద్ద దేశాలకు సమాఖ్య విధానం అనుకూలమైనది.

5) సమాఖ్య విధానం భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తుంది. రాష్ట్రాలకు స్వయంపాలనను కల్పిస్తుంది. దేశపాలన బరువు బాధ్యతలను మోయడానికి సరిపడేంత అధికారాన్ని కేంద్రానికి సమాఖ్య విధానం ఇస్తుంది. "జాతీయ ఏకత్వాన్ని రాష్ట్రాల హక్కుల కొనసాగింపుతో రాజీచేసే ఒక రాజకీయ సాధనమే సమాఖ్య విధానమని" డైసీ చెప్పాడు.

### 18.3.6 సమాఖ్య ప్రభుత్వ నష్టాలు

సమాఖ్య ప్రభుత్వ విధానంలో ఈ క్రింది నష్టాలు ఉన్నాయి. (ఎ) యుద్ధసమయాలలో అనైక్యత వల్ల సమాఖ్య ప్రభుత్వం కొన్ని ఇబ్బందులకు గురికావచ్చు. సమాఖ్య విధానంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, ఒక కేంద్ర ప్రభుత్వం ఉండడం వల్ల యుద్ధ సమయాలలో సమాఖ్య రాజ్యానికి కొంత ప్రతికూల ఎదురవుతుంది.

(బి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ జరుగుతుంది. దీనికి సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికే సమాఖ్య న్యాయస్థానం ఎక్కువ కాలాన్ని కేటాయించవలసి వస్తుంది.

(సి) సమాఖ్య ప్రభుత్వం అధిక వ్యయంతో కూడిన ప్రభుత్వం. దీనికి కారణం సమాఖ్యలో రెండు ప్రభుత్వ వ్యవస్థలు ఉండడమే.

(డి) సమాఖ్య రాజ్యాంగం దృఢరాజ్యాంగం. మారుతున్న దేశ కాలపరిస్థితులు, పెరుగుతున్న ప్రజల ఆశయాలకు అనుగుణంగా సమాఖ్య రాజ్యాంగాన్ని మార్చడం కష్టం. ఈవిధానంలో ప్రాంతీయతత్వం పెరుగుతుంది.

### 18.3.7 సమాఖ్యాధికారం పెరుగుదల

అన్నీ సమాఖ్య ప్రభుత్వాలలో జాతీయ కేంద్ర ప్రభుత్వాల అధికారం పెరుగుదల కనిపిస్తుంది. నేటి సమాఖ్య ప్రభుత్వాలలో అధికార కేంద్రీకృత ధోరణికి అనేక కారణాలున్నాయి.

([illegible] [illegible]ు ప్రభుత్వానికి అధిక ఆర్థిక వనరులు ఉండడం. కేంద్ర ప్రభుత్వమిచ్చిన గ్రాంట్లపై రాష్ట్రాల [illegible]ంగా ఆధారపడి ఉండడం.

(2) 20వ శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు ఫలితంగా సమాఖ్య విధానంలో కేంద్ర ప్రభుత్వ అధికారాలు పెరిగాయి.

(3) జాతీయ అత్యవసర పరిస్థితులు, ప్రకృతి-మానవకల్పిత విపత్తులు కూడా సమాఖ్యలో కేంద్ర ప్రభుత్వ అధికారాలను పెంచాయి.

(4) న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు, రాజ్యాంగానికి చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ అధికారాలు పెరగడానికి తోడ్పడ్డాయి.

(5) కొన్ని ప్రాంతీయ ప్రభుత్వాలలో వచ్చిన వేర్పాటుధోరణులు.

(6) ఆధునిక కాలంలో ఉన్న క్లిష్టమైన సమస్యలు కూడా ఒక కారణం. ఇండియా, కెనడావంటి సమాఖ్య రాజ్యాంగాలు ఏకకేంద్ర లక్షణాలు కలిగి ఉండడం ఇంకొక కారణం.

BRAOU

వివిధ సమాఖ్య రాజ్యాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యనున్న అధికార సమతౌల్యం ఒకేవిధంగా ఉండదు. ఒకే సమాఖ్య విధానంలో కూడ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అటువంటి సమతౌల్యం మారుతుంటుంది.

### 18.3.8 సమాఖ్య ప్రభుత్వ భవిష్యత్తు

ఇటీవలి కాలంలో సాంప్రదాయక సమాఖ్య విధానంలో మార్పు వస్తూంది. క్రమేణా సమాఖ్య ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ అధికారాలు అనేక కారణాలవల్ల పెరుగుతున్నాయి. అంతమాత్రాన సమాఖ్య ప్రభుత్వాలు ఏకకేంద్ర ప్రభుత్వం వైపు పురోగమిస్తాయని భావించరాదు. సమాఖ్యలో భాగస్వాములైన రాష్ట్ర ప్రభుత్వ విధులు కూడా పెరుగుతున్నాయి. ఈధోరణిని "క్రొత్త సమాఖ్య" (New Federalism) అనే భావన సూచిస్తుంది. కొంత అధికారాన్ని రాష్ట్రాలకు తిరిగి కేంద్ర ప్రభుత్వం బదిలీ చేయాలి. స్థానిక ప్రభుత్వాలను ప్రభుత్వ ప్రక్రియలో ఒక అంతర్భాగంగా చేయడానికి 'క్రొత్త సమాఖ్య' భావన ప్రయత్నిస్తుంది. "సహకార సమాఖ్య" విధానం గురించి కూడా ప్రస్తావన ఉంది. వివిధ స్థాయిలలో ప్రభుత్వాలు పరస్పరంగా ఆధారపడి సహకారంతో కార్యకలాపాలు నిర్వహించాలని ఈ భావన ఉద్ఘాటిస్తుంది. స్థానిక ప్రభుత్వ స్థాయిలో కూడా సమాఖ్య భావనను సమర్థించడం జరుగుతుంది. మనదేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థలు స్థానిక ప్రభుత్వ స్థాయిలో సమాఖ్య భావన విస్తరణగా పరిగణించవచ్చును.

ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయాలలో ఉన్నచెడును ప్రపంచ సమాఖ్యను ఏర్పాటు చేయడం ద్వారా పరిష్కరించ వచ్చునని చాలా మంది భావిస్తున్నారు. అంతర్జాతీయ రాజకీయాలు అరాచకం. ఎందుకంటే అవి ప్రపంచ ప్రభుత్వం లేని రాజకీయాలు. అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థ అవసరలకు అనుగుణంగా సమాఖ్య ప్రభుత్వ వ్యవస్థలను మలచుకోవడం ద్వారా అంతర్జాతీయ అరాచకత్వాన్ని తొలగించవచ్చును. ప్రపంచ సమాఖ్య ఏర్పడాలంటే జాతిరాజ్యాలు వాటి సార్వభౌమాధికారాన్ని కొంత వదులుకోవాలి. ముఖ్యంగా యుద్ధ ప్రకటన చేసే అధికారాన్ని ప్రపంచ సమ్మేళన ప్రభుత్వానికి రాజ్యాలు బదిలీ చేయాలి. ఈవిధంగా సమాఖ్య విధానానికి భవిష్యత్తుఉందని చెప్పవచ్చు.

## 18.4 ఏకకేంద్ర ప్రభుత్వం - అర్థవివరణ

ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో ప్రభుత్వ అధికారాలన్నీ ఒకే కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంటాయి. పరిపాలన సౌకర్యం కోసం దేశాన్ని భాగాలుగా విభజించినా, వాటికి స్వతంత్ర ప్రతిపత్తి ఉండదు. కేంద్రప్రభుత్వం దత్తంచేసిన అధికారాలు మాత్రమే వాటికి ఉంటాయి. అటువంటి అధికారాలను కేంద్ర ప్రభుత్వం అవసరమైతే తగ్గించవచ్చు. రద్దు చేయవచ్చు. ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో అధికారం పైనుండి క్రిందికి దత్తం చేయబడుతుంది.

సజాతీయ ప్రజలున్న చిన్న దేశాలలో ఏకకేంద్ర ప్రభుత్వ విధానం అమలులో ఉంటుంది. ఎన్నో ఆధునిక రాజ్యాలలో ఏకకేంద్ర ప్రభుత్వ విధానం అమలులో ఉంది. బ్రిటన్, ఫ్రాన్స్, స్వీడన్ ఏకకేంద్ర ప్రభుత్వ విధానినికి ఉదాహరణలుగా చెప్పవచ్చును.

BRAOU

### 18.4.2 ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలు

ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలను ఈక్రింది విధంగా పేర్కొనవచ్చు.

1) అధికారమంతా ఒకే కేంద్ర ప్రభుత్వంలో కేంద్రీకరింపబడుతుంది. విధాన నిర్ణయాధికారం ఒక్క కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. అన్ని శాసనాధికారాలు దీనికే ఉంటాయి.

2) శాసన సభ స్థానిక ప్రభుత్వాలను శాసనం ద్వారా ఏర్పరుస్తుంది. వాటి వ్యవస్థ నిర్మాణాన్ని, సరిహద్దులను, అధికారాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పుడైనా మార్చి వేయగలదు. ఉదాహరణకు 1972లో ఉత్తర ఐర్లాండ్ పార్లమెంట్‌ను బ్రిటీష్ ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. 1980వ దశాబ్దంలో మెట్రోపాలిటన్ కౌంటీలను, గ్రేటర్ లండన్ కౌన్సిల్‌ను పార్లమెంట్ రద్దు చేసింది.

3) స్థానిక ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ అధికంగా ఉంటుంది. స్థానిక ప్రభుత్వాలకు పరిమితాధికారం ఉంటుంది. స్థానిక విధానాలను కూడా కేంద్ర ప్రభుత్వమే ఆదేశిస్తుంది.

4) ఏక కేంద్ర ప్రభుత్వ విధానంలో ఒకే పాలన వ్యవస్థ ఉంటుంది. దాని పాలన అధికారులే జాతీయ స్థానిక వ్యవహారాలను నిర్వహిస్తుంటారు. ఒకే న్యాయ వ్యవస్థ విధానం ఉంటుంది. న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది.

5) ఏకకేంద్ర విధానంలో జాతీయ పోలీసు దళం ఉంటుంది. దీనికి స్థానిక పోలీసుదళంపై నియంత్రణ ఉంటుంది.

### 18.4.3. ఏకకేంద్ర ప్రభుత్వ లాభాలు

ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో కొన్ని ప్రయోజనాలున్నాయి. 1) ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో దేశానికంతటికి ఒకేరకమైన పాలన విధానం ఉంటుంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాలను మార్చగలగుతుంది.

2) ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో కేంద్ర స్థానిక ప్రభుత్వాల మధ్య అధికార పరిధులకు సంబంధించిన వివాదాలు ఉండవు. ఇటువంటి వివాదాలు సమాఖ్య విధానంలో చాలా తరచుగా ఉత్పన్నమౌతాయి.

3) దేశానికంతటికి ఒకేరకమైన శాసనాలు, పాలన విధానాలు వర్తిస్తాయి. ఒకే బలమైన కేంద్ర ప్రభుత్వ విధానాల ద్వారా జాతీయ సమైఖ్యతా భావాన్ని పెంపొందిస్తుంది. పరిపాలనలో ఎదురుయ్యే సమస్యలను కూడా సులభంగా అధిగమించగలదు.

4) సమాఖ్య విధానంతో పోల్చితే ఏకకేంద్ర విధానాన్ని తక్కువ ఖర్చుతో నిర్వహించవచ్చును. సమాఖ్యలో రెండు స్థాయిల్లో ప్రభుత్వాలుండడంవల్ల వ్యయం ఎక్కువ. ఏకకేంద్ర విధానంలో ఒకే శాసన నిర్మాణశాఖ, ఒకేపాలన వ్యవస్థ ఉండడం వల్ల ప్రభుత్వ నిర్వహణ తక్కువ ఖర్చుతో జరగుతుంది.

5) ఏక కేంద్ర ప్రభుత్వం ఆధునిక సమాజ సమస్యలను అతిసులభంగా ఎదుర్కొని సమర్థవంతంగా పరిష్కరించగలదు. ఏకకేంద్ర విధానంలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వనరులను సులభంగా సమీకరించి ప్రణాళికలను, అభివృద్ధి కార్యకలాపాలను, సమన్వయ పరచగలదు. దానికి ఉన్న విస్తృతమైన పన్నులు విధించే అధికారం వల్ల సాంఘిక సంక్షేమ కార్యకలాపాలను సులభంగా నిర్వహించగలదు.



BRAOU

### 18.4.4 ఏక కేంద్ర ప్రభుత్వ నష్టాలు

ఏక కేంద్ర ప్రభుత్వ విధానంలో ఈ క్రింద పేర్కొన్న నష్టాలున్నాయి. 1) ఏకకేంద్ర ప్రభుత్వంలో అధికారాలన్నీ కేంద్రీకృతం అవడంవల్ల నియంతృత్వానికి దారితీయవచ్చు.

2) అధికారమంతా కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉండడంవల్ల ప్రజలకు స్థానిక వ్యవహారాల్లో చొరవతగ్గి, వారికి వాటిలో పాల్గొనే ఆసక్తిపోతుంది.

3) ఏకకేంద్ర విధానంలో జాతీయ సమస్యల ప్రాబల్యం ఎక్కువగా ఉండడంవల్ల స్థానిక సమస్యలు, స్థానిక వ్యక్తులు మరుగునపడతాయి. కొన్ని సందర్భాలలో ఏకకేంద్ర విధానంలో స్థానిక సమస్యలంటూ ఉండవు.

4) స్థానిక సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థల కేంద్ర ప్రభుత్వం మీద ఆధారపడి ఉంటాయి. దీని కారణంగా ఉద్యోగస్వామ్య ప్రాబల్యం పెరిగి పాలనలో జాప్యానికి దారితీస్తుంది.

5) విభిన్న జాతులు, మతాలు, భాషలు, భౌగోళిక పరిస్థితులున్న పెద్ద దేశాలకు ఏకకేంద్ర ప్రభుత్వం ఆచరణ యోగ్యమైనదికాదు.

### 18.4.5 ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల మధ్యతేడాలు

ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను ఈక్రింది విధంగా చెప్పవచ్చును.

1) ఏకకేంద్ర విధానంలో ఒకేకేంద్ర ప్రభుత్వం ఉంటుంది. దీనికి భిన్నంగా సమాఖ్య విధానంలో రెండు స్థాయిల్లో - జాతీయ, ప్రాంతీయ - ప్రభుత్వాలుంటాయి.

2) ఏకకేంద్ర విధానంలో అధికరామంతా ఒకే కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంటుంది. దీనికి భిన్నంగా సమాఖ్య విధానంలో రాజ్యాంగం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ జరుగుతుంది.

3) ఏక కేంద్ర విధానంలో రాజ్యాంగం లిఖిత రూపంలో గాని, అలిఖిత రూపంలోగాని ఉండవచ్చు. రాజ్యాంగ ఆధిక్యత కూడా ఉండకపోవచ్చు. ఇందుకు ఉదాహరణ బ్రిటన్.

ఏకకేంద్ర సమాఖ్య ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలు వాస్తవాలు కంటే ఎక్కువ ఊహాత్మకమైనవని చెప్పవచ్చును. ఈరెండు రకాల ప్రభుత్వాలు వాటి జాతీయ సమగ్రతకు, స్వయం ప్రతిపత్తికి సంబంధించి బాహ్య సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. వాటి రాజ్యాంగాలను అనుసరించి, వాటి ముఖ్యలక్షణాలపై ఒక అభిప్రాయానికి రావడం తప్పుతోవ పట్టడమే అవుతుంది. ఈ రెండు రకాల ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి మధ్యనున్న రాజ్యాంగపరమైన వ్యత్యాసాలకు అవి నిర్వహించే విధులలో పోలికలను ప్రభావితం చేస్తాయి.

సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వాలు రెండూ ఆచరణలో ఉన్నాయి. సజాతీయ ప్రజలున్న చిన్న రాజ్యాలకే ఏకకేంద్ర ప్రభుత్వం అనుకూలమైనది. వివిధ జాతులు గల పెద్దరాజ్యాలకు సమాఖ్య ప్రభుత్వం అనుకూలమైనది. ఆచరణలో సంపూర్ణమైన ఏకకేంద్ర రాజ్యంగానీ, సంపూర్ణమైన సమాఖ్య రాజ్యంగానీ ఉండవు. ప్రస్తుతకాలంలో ఆసక్తికరమైన విషయమేమిటంటే ఏక కేంద్ర ప్రభుత్వం, సమాఖ్య ప్రభుత్వ దిశలోను, సమాఖ్య ప్రభుత్వం ఏకకేంద్ర దిశలోను పయనిస్తున్నాయి. ఏకకేంద్ర రాజ్యంలో వికేంద్రీకరణకు

BRAOU

ఒత్తిడి, సమాఖ్య విధానంలో కేంద్రీకరణకు ఒత్తిడి సమానంగా ఉన్నాయి. రాజ్యాలను ఏకకేంద్ర, సమాఖ్య రాజ్యాలుగా వర్గీకరించడం సమస్యకాదు. అవిఆచరణలో ఏవిధంగా పనిచేస్తున్నాయి - అనే విషయాన్ని పరిశీలించడమే ముఖ్యం.

## 18.5 క్లుప్తంగా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన ఆధారంగా ప్రభుత్వాలను ఏకకేంద్ర ప్రభుత్వాలని, సమాఖ్య ప్రభుత్వాలని వర్గీకరించవచ్చు. ఏకకేంద్ర విధానంలో అధికారమంతా కేంద్ర ప్రభుత్వములో ఉంటుంది. సమాఖ్య విధానంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన రాజ్యాంగం ద్వారా జరుగుతుంది. ఏకకేంద్ర విధానంలో అధికారం పైనుంచి క్రిందికి దత్తత చేయబడుతుంది. ఏకకేంద్ర విధానంలో దేశానికంతటికి ఒకే శాసన నిర్మాణ శాఖ, ఒకే పాలనయంత్రాంగం, ఒకే న్యాయవ్యవస్థ, ఒకే పోలీసు దళం ఉంటాయి. దీనికి భిన్నంగా ద్వివిధ ప్రభుత్వ విధానం, కేంద్రరాష్ట్రాల మధ్య రాజ్యాంగం ద్వారా అధికారాల విభజన, స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ ఆధిక్యత, సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు. రెండు రకాల ప్రభుత్వాలకు లాభాలు, నష్టాలు ఉన్నాయి. ఏకకేంద్ర ప్రభుత్వం సజాతీయతగల చిన్న రాజ్యాలకు ప్రయోజనకారిగా ఉంటుంది. వివిధ జాతులగల పెద్దరాజ్యాలకు సమాఖ్య విధానం యోగ్యమైనదని చెప్పవచ్చును.

## 18.6 చదువదగిన పుస్తకాలు

J.H. Price : "Comparative Government"
Robert L. Cord and others : "Political Science An Introduction" 2nd (Ed)
S.R. Maheswari : "Comparative Government and Politics"
A.C. Kapoor : "Principles of Political Science"

## 18.7 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. సమాఖ్యరాజ్య ముఖ్యలక్షణాలను చర్చించండి
2. ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల లాభ నష్టాలను చర్చించండి.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలను తెలపండి
2. ఈ క్రింది ప్రభుత్వాల మధ్య తేడాలను తెలపండి
   (ఎ) సమాఖ్య రాజ్యం - సమ్మేళన రాజ్యం
   (బి) ఏకకేంద్రరాజ్యం - సమాఖ్య రాజ్యం

రచయిత : ఎస్. పోలినాయుడు

BRAOU

# ఖండం:V

# ప్రభుత్వాంగాలు

B R A O U

BRAOU

# భాగం-19 : అధికార పృథక్కరణ సిద్ధాంతం

## విషయ సూచిక


19.0 లక్ష్యాలు

19.1 పరిచయం

19.2 అధికార పృథక్కరణ సిద్ధాంతం - చారిత్రక నేపద్యం

19.4 బ్రిటన్, అమెరికా, ఇండియా రాజ్యాంగాలకు మాంటెస్క్యూ సిద్ధాంతం వర్తింపు

  19.4.1 బ్రిటన్

  19.4.2 అమెరికా సంయుక్త రాష్ట్రాలు

  19.4.3. ఇండియా

19.5 విమర్శనాత్మక పరిశీలన

19.6 క్లుప్తంగా

19.7 చదువవదగిన పుస్తకాలు

19.8 నమూనా ప్రశ్నలు


## 19.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- అధికార పృథక్కరణ సిద్ధాంతం యొక్కచారిత్రక నేపథ్యాన్ని గురించి వర్ణించగలరు.
- మాంటెస్క్యూ సిద్ధాంతాన్ని గురించి వివరించగలరు
- ఆధునిక ప్రభుత్వాలకు ఈ సిద్ధాంతం ఎలా వర్తించేది చర్చించగలరు.
- ఈ సిద్ధాంతాన్ని గురించి విమర్శనాత్మకంగా పరిశీలించగలరు.

## 19.1 పరిచయం

ఖండికలో మీరు అధికార పృథక్కరణ సిద్ధాంతం యొక్క చారిత్రక నేపద్యాన్ని, దాని ప్రధాన లక్షణాలను ఆధునిక రాజ్యాంగాలలో దాని అమలు గురించి, ఈ సిద్ధాంతం యొక్క ప్రాముఖ్యాన్ని, లోపాలను గురించి తెలుసుకుంటారు.

రాజ్యసంకల్పాన్ని రూపొందించి, వ్యక్తీకరించి, అమలు చేసే యంత్రాంగమే ప్రభుత్వం. ఈ ప్రభుత్వ వ్యవస్థీకరణను ప్రాదేశికంగా, అంటే జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ లేక స్థానిక స్థాయిల్లో ప్రభుత్వంగా కాని లేక విధి నిర్వహణకు సంబంధించి, అంటే శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయశాఖల ద్వారా పనిచేసే



BRAOU

ప్రభుత్వంగా కాని చూడవచ్చు. అధికార పృథక్కరణ సిద్ధాంతం ప్రభుత్వం యొక్క అధికారాలు లేక విధుల పంపిణీకి సంబంధించిన సిద్ధాంతంగా పేర్కొనవచ్చును. ప్రభుత్వం యొక్క వివిధ అధికారాలు లేక విధులు ఒకే వ్యక్తిలో లేక వ్యక్తుల బృందంలో ఎంతవరకు కేంద్రీకృతం చేయబడాలి? లేక వీటిని పరస్పర సమన్వయం ఉన్న ఒకదాని నుండి మరొకటి స్వతంత్రంగా యుండే ఏజెన్సీలకు అప్పగించవలసి యుంటుందా ? అనే ప్రశ్నల సమాధానాల కోసం ఈ సిద్ధాంతం అన్వేషిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని రూపొందించటంలో ప్రధాన లక్ష్యం అధికార దుర్వినియోగాన్ని నిరోధించటం ద్వారా వ్యక్తుల రాజకీయ స్వేచ్ఛను పరిరక్షించటం.

## 19.2 అధికార పృథక్కరణ సిద్ధాంతం - చారిత్రక నేపథ్యం

అధికార పృథక్కరణ సిద్ధాంతానికి మూలం పాశ్చాత్య రాజనీతి తత్వశాస్త్రానికి పితామహుడైన అరిస్టాటిల్ రచనలలోనే ఉందని చెప్పవచ్చు. సమాలోచన (Deliberative), కార్యనిర్వాహక, న్యాయశాఖల అధికారాలను ఆయన వేరు చేసినాడు. అయితే ఆయన వివరాలలోనికి ఎక్కువగా వెళ్ళలేదు. పైశాఖల మధ్య వేర్పాటును సూచించకుండా కేవలం వాటి సిబ్బంది, వ్యవస్థీకరణ, విధులను గురించిన వర్ణనకు మాత్రమే ఆయన పరిమితమయ్యాడు. ప్రాచీన రోమన్ రిపబ్లిక్‌కు చెందిన పాలిబియస్ మరియు సిసిరోలు రోమన్ రాజ్యాంగంలో పొందుపరచిన నిరోధాలు - సమతుల్యాల (Checks and Balances) వ్యవస్థను కొనియాడినారు. రోమన్ గణతంత్ర రాజ్యంలో ప్రభుత్వానికి చెందిన అధికారాలు, విధులు వివిధ ప్రభుత్వాంగాల మధ్య సమతూకంగా పంపిణీ చేయబడ్డాయి.

ఆధునిక కాలానికి చెందిన బోడిన్ (1530-1596) కార్యనిర్వాహక, న్యాయాధికారాలను వేరు చేయవలసిన అవశ్యకతను ఉద్ఘాటించినాడు. రాజే స్వయంగా న్యాయ నిర్వహణను చేబట్టరాదని, ఆ అధికారాన్ని ఒక స్వతంత్ర్య ట్రిబ్యునల్‌కు అప్పగించాలని బోడిన్ గట్టిగా వాదించినాడు. అవిధంగా చేయకపోతే న్యాయం, దయాధర్మాలు, చట్టంపట్ల ఖచ్చితమైన విధేయత, చట్టాన్ని యధేచ్ఛగా ఉల్లంఘించటం ఇవన్నీ విచక్షణ లేకుండా కలగలసి పోతాయని అతడు హెచ్చరించినాడు. అధికార పృథక్కరణను గురించి జాన్‌లాక్ (1632-1704) కూడ తన "పౌరప్రభుత్వంపై రెండు రచనలు" (Two Treatrises on Civil Government) అనే గ్రంథంలో వివరించినాడు. శాసననిర్మాణ, కార్యనిర్వాహక, సమాఖ్యగత అధికారాలను ఆయన వేరుచేసినాడు. సమాఖ్యగత అధికారం విదేశ వ్యవహారాలకు సంబంధించినదని ఆయన పేర్కొన్నారు. సమాఖ్యగత, కార్యనిర్వాహక అధికారాల కలయికకు ఆయన అంగీకరించినాడు. కాని కార్యనిర్వాహక, శాసన నిర్మాణ అధికారాలు ఒకే ప్రభుత్వాంగంలో కేంద్రీకృతంకావటాన్ని ఆయన వ్యతిరేకించినాడు.

## 19.3 మాంటెస్క్యూ - అధికార పృథక్కరణ సిద్ధాంతం

అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని రాజనీతి శాస్త్రంలో ఒక ప్రాథమిక సూత్రంగా మొట్టమొదటగా రూపొందించింది. ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత మాంటెస్క్యూ (1689-1755). అతడు ఈ సిద్ధాంతాన్ని 'ది స్పిరిట్ ఆఫ్ లాస్' అనే సుప్రసిద్ధ గ్రంథంలో 1748లో వివరించినాడు. సిద్ధాంతాన్ని ప్రతిపాదించటంలో మాంటెస్క్యూ 18వ శతాబ్దంలో ఫ్రాన్స్, ఇంగ్లాండ్ దేశాలలో నెలకొన్న పరిస్థితుల వలన ఎంతగానో ప్రభావితుడైనాడు. అకాలంలో ఫ్రాన్స్ రాజు 14వ లూయీ (1661-1715). కార్యనిర్వాహక, శాసననిర్మాణ, న్యాయాధికారాలు మూడింటిని తానే కైవసం చేసికొని నిరపేక్షరాజ్యాధికారాలను చెలాయించేవాడు.



BRAOU

అటువంటి నిరంకుశ, అణచివేత ప్రభుత్వపాలనలో ప్రజలకు ఏరకమైన స్వేచ్ఛలు లేకుండా పోయినాయి. ఈ సమయంలోనే మాంటెస్క్యూ ఇంగ్లండును సందర్శించటం, అక్కడి ప్రజలు అనుభవించే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను చూసి ముగ్ధుడుకావటం జరిగింది. దానితో ఆయన బ్రిటిష్ ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్రత్యాలకు కారణాలేమిటో తెలిసికోవటానికి ప్రయత్నంచినాడు. ఆక్రమంలో బ్రిటిషు దేశస్థులు అధికార పృథక్కరణ సూత్రానికి కట్టుబడి ఉండటంవలననే ఇలాస్వేచ్ఛలు అనుభవించగలుగతున్నారని ఆయన ఒక అభిప్రాయానికి వచ్చినాడు. రాజ్యానికి సంబంధించిన శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయం నిర్ణాయక అంగాల మధ్య స్పష్టమైన విభజన ఉండటమే బ్రిటిషు ప్రభుత్వ వ్యవస్థలోని మౌలిక సూత్రమని ఆయన భావించినాడు. దానితో అధికారమనేది ఒకే ప్రభుత్వాంగంలో కేంద్రీకృతం కారాదని ఆయన బలంగా విశ్వసించినాడు. మాంటెస్క్యూ ప్రశంసించిన ప్రభుత్వాంగాల విభజన వాస్తవానికి ఇంగ్లాండ్‌లో అప్పుడు లేదు. కాలక్రమంలో అటువంటి విభజరేఖ మరీ అగోచరమై పోయింది కూడా. అయినా అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని ప్రకటించటానికి మాంటెస్క్యూకు ఉందనుకున్న అధికారాల విభజన అవసరమైన ప్రేరణను యిచ్చిందని చెప్పవచ్చు.

దుర్వినియోగమయ్యే స్వభావం అధికారానికి స్వతస్సిద్ధంగానే యుంటుందని, కనుక స్పష్టమైన పరిమితులు విధిస్తే తప్ప నిరంకుశపాలన అనివార్యమైతుందని మాంటెస్క్యూ గుర్తించినాడు. ప్రభుత్వ అధికారాన్ని చెలాయించటంలో సంయమనం అనేది మంచి ప్రభుత్వానికి ముఖ్యావసరమని ఆయన అభిప్రాయాపడినారు. ఇటువంటి సంయమనం సాధించటానికి ప్రతి అధికారం చెలాయింపుకు ఒకవేరే ప్రభుత్వాంగం ఉండాలని, ఏ ఒక్క అంగమూ సర్వశక్తివంతంగా రూపొందకుండా వివిధ ప్రభుత్వంగాల నడుమ విరోధాలు - సమతుల్యాల (Checks and Balances) వ్యవస్థ ఒకటి ఉండాలని ఆయన భావించినాడు. ఆయన సొంత మాటలలో "శాసన నిర్మాణ, కార్యనిర్వాహక అధికారాలు ఒకే వ్యక్తిలో కాని లేక ఒకే మేజిస్ట్రేట్ల వ్యవస్థలో కాని కేంద్రీకృతమైయుంటే, ఆ రాజు లేక సెనేట్ క్రూర, నిరంకుశ చట్టాలను చేసి, వాటిని క్రూర, నిరంకుశ పద్ధతులలో అమలుచేస్తారనే భయాందోళనలకు అస్కారం యుంటుంది. అటువంటి ప్రమాదం కూడ తలయెత్తవచ్చు. అలాంటప్పుడు స్వేచ్ఛ అనేది ఉండజాలదు. అలాగే శాసన నిర్మాణ, కార్యనిర్వాహక అధికారాల నుండి న్యాయ నిర్ణాయక అధికారాన్ని వేరుచేయక పోయినా స్వేచ్ఛ యుండజాలదు. న్యాయ నిర్ణయక అధికారాన్ని శాసన నిర్మాణాధికారంతో మిళితం చేస్తే న్యాయమూర్తి ఒక శాసన నిర్మాత అయిపోతాడు. ఫలితంగా పౌరులు ప్రాణాలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యధేచ్ఛపాలనకు లోనౌతాయి. లేక దానిని కార్యనిర్వాహక అధికారంతో మిళితం చేస్తే అప్పుడు న్యాయమూర్తి హింసా దౌర్జన్యాలను, అణచివేతధోరణిని అవలంబించే ప్రమాదం ఉంటుంది. ఇక శాసనాలు చేయటం, ప్రభుత్వ తీర్మానాలను అమలు చేయటం, వ్యక్తుల కేసుల్ని విచారించటం అనే ఈ మూడు అధికారాలను ప్రభువులకు చెందిన వారైనా లేక ప్రజలకు సంబంధించినవారైనా ఒకేవ్యక్తి లేక వ్యక్తుల బృందం చెలాయించే పక్షంలో సర్వనాశనమే పర్యవసానమువుతుంది. ఈవిధంగా అదుపులేని అధికారం ఎవరి చేతులలో ఉన్నా వారు దుర్వినియోగం చేస్తారని మాంటెస్క్యూ నిరూపించటానికి యత్నంచినాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ఏరెండు ప్రభుత్వాంగాలను కలగలిపినా వ్యక్తి స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుంది.

శాసన నిర్మాణం, కార్య నిర్వహక అధికారాలను సమ్మిళితం చేస్తే, శాసన నిర్మాతగా, అమలుదారుగా ఒకే ఏజెన్సీ పనిచేయటం వలన స్వేచ్ఛ ఉండజాలదు. అలాగే శాసన నిర్మాణం, న్యాయవిధుల్ని మిళితం చేసినా, శాసన నిర్మాతలే చట్టాలకు భాష్యకారులుగా, పరిపాలకులుగా రూపొందటంవలన ప్రజల స్వేచ్ఛా

స్వాతంత్ర్యాలు అపాయంలో పడిపోతాయి. మరి కార్యనిర్వాహక, న్యాయనిర్ణాయక అంగాలను జతపరిస్తే చట్టానికి సంబంధించి ఫిర్యాది, భాష్యకారి ఒకే ఏజెన్సీ అవుతుంది. కనుక స్వేచ్ఛ అడుగంటిపోతుంది. ఇక అధికారాలు మూడూ గనుక ఒకే చేతిలో కేంద్రీకృతమైతే అప్పుడు "సర్వనాశనమే" సంభవిస్తుంది.

అయితే ఈ అధికారాల పృథక్కరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మాంటెస్క్యూ, పై మూడు అధికారాల పూర్తి విభజనను ఉద్దేశించినాడా లేక పరిమిత విభజన గురించి యోచించినాడా అనే విషయంలో రాజనీతి శాస్త్రజ్ఞుల మధ్య కొంత వివాదం ఉంది. యదార్థం ఏమిటంటే ఈ మూడు విభాగాలు ఒకదాని కార్యకలాపాలపై మరొక దానికి ఎటువంటి అదుపాజ్ఞలు లేకుండా ఉండాలని మాత్రం ఆయన భావించలేదు. ఆయన సొంతమాటల్లో చెప్పాలంటే, "ఒక శాఖకు సంబంధించిన సమస్త అధికారాలు, వేరే ఇంకొక శాఖకు సంబంధించిన సమస్త అధికారాలు గల చేతుల్లోనే కేంద్రీకృతమైతే అప్పుడు స్వతంత్ర్య రాజ్యాంగానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలే తలక్రిందులై పోతాయి".

కనుక సరిగ్గా వివరిస్తే అధికార పృథక్కరణ సిద్ధాంతం అర్థం ఏమిటంటే ప్రభుత్వశాఖలు మూడింటిలో ప్రతిదానికి పాలించేందుకు ఒక ప్రత్యేక వ్యక్తుల బృందం ఉండాలని, ఈపాలక బృందాల్లో దేనికీ ఇతర బృందాలపై అదుపాజ్ఞలు ఉండరాదని మాత్రమే. వ్యక్తి స్వేచ్ఛను కాపాడటానికి, క్రూర నిరంకుశపాలనను నివారించటానికి ఇటువంటి విభజన అవశ్యకమవుతుంది.

## 19.4 బ్రిటన్, అమెరికా, ఇండియా రాజ్యాంగాలకు మాంటెస్క్యూ సిద్ధాంతం వర్తింపు

మాంటెస్క్యూ ప్రతిపాదించిన అధికార పృథక్కరణ సిద్ధాంతం ఎంతో ప్రభావాన్ని కనబర్చింది. ఆధునిక రాజ్యాలు రూపొందించుకున్న వివిధ రాజ్యాంగాలలో ఏదో ఒకరూపంలో ఈ సిద్ధాంతం చోటుచేసికొంది. అయితే వాస్తవంలో ఈ సిద్ధాంతాన్ని యథాతథంగా అమలు చేయటం ఆచరణ సాధ్యంకాదు. కనుక ఈ మూడు అధికార విభాగాలను పూర్తిగ, వేరుగా ప్రత్యేకంగా నిలిపి ఉంచిన ఉదాహరణ ఒక్కటైనా మనకు కన్పించదు. కాగా వివిధ రాజ్యాంగాలలో మనకు ఈ అధికార విభాగాలకు సంబంధించి కొంత ఏకత, కొంత వ్యత్యాసం గోచరిస్తుంది.

B R A O U

### 19.4.1 బ్రిటన్

పార్లమెంటరీ ప్రభుత్వ విధానం అమలులోనున్న బ్రిటన్‌లో ప్రభుత్వ వ్యవస్థ అధికారాల విభజనపై కాక వాటి సమ్మేళనపై ఆధారపడియున్నది. మంత్రివర్గం (కేబినెట్) అంటే ప్రభుత్వ కార్యనిర్వాహక విభాగం శాసననిర్మాణ అంగంనుంచి అంటే పార్లమెంటు నుండి ఎంపిక అవుతుంది. మంత్రులు పార్లమెంటు కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతారు. శాసనాలను ప్రవేశపెట్టగలగుతారు. శాసన బద్ధమైన ఉత్తర్వులను జారీ చేసే అధికారం వారికి ఉంటుంది. ఇంకా 5 సం॥ల సాధారణ గడువు పూర్తికాకమునుపే సామాన్యుల (కామన్స్) సభను రద్దు చేయవలసిందిగా సిఫారసు చేసే అధికారం కూడా మంత్రివర్గానికుంటుంది. ప్రభువుల సభలో ప్రభుస్థానాలను (Peers) సృష్టించవలసిందిగా కూడ అది (మంత్రివర్గం) సిఫారసు చేయవచ్చు. మరోవైపు మంత్రివర్గంపై విశ్వాసం కోల్పోయినపుడు దాని గడువును ముగింపజేసే అధికారం ప్రభుత్వశాసన నిర్మాణాంగానికి అంటే పార్లమెంటుకు ఉంది. ఇంకా న్యాయమూర్తుల్ని కార్యనిర్వాహకవర్గం నియమిస్తుంది. ఆ శాసనసభ అంటే పార్లమెంటు సమర్పించే 'సంబోధన' (Address) ఆధారంగా ప్రభువు (Crown)

న్యాయమూర్తుల్ని తొలగించవచ్చు. అంతేగాక, బ్రిటిష్ పార్లమెంటులో ఎగువసభ అయిన ప్రభువుల సభ బ్రిటన్‌లో అంతిమ అప్పీలు కోర్టు కూడ.

అయినా బ్రిటిషు రాజ్యాంగంలో కూడ ఒకరకమైన అధికారాల విభజన ఉంది. శాసన నిర్మాణాధికారం పార్లమెంటుకు ఉంటే కార్యానిర్వాహక అధికారం ప్రభువు (Crown) కు ఉంది. ప్రభువు నుండి కార్యనిర్వాహక అధికారాలను వేటినైనా హరించాలనికాని, లేదా తానే స్వయంగా పరిపాలన విధుల్ని చేపట్టాలనికాని పార్లమెంటు ఎన్నడూ ప్రయత్నించదు. అదేవిధంగా న్యాయ నిర్ణయశాఖ ప్రభుత్వానికి చెందిన ఒక సర్వస్వతంత్రమైన ప్రత్యేక విభాగంగా రూపొందింపబడింది. న్యాయమూర్తుల్ని నియమించేది కార్యనిర్వాహకవర్గమే కాని వారిని పదవి నుంచి తప్పించే అధికారం దానికి లేదు. వారి వేతనాలను, ఇతర భత్యాలను సమీకృతనిధి (Consoilidated Fund) నుంచి నేరుగా చెల్లిస్తారు. కనుక పార్లమెంటు ఆమోదానికి తీసుకొనవలసిన అవసరం వారికి ఉండదు.

## 19.4.2 అమెరికా సంయుక్త రాష్ట్రాలు

అధికార పృథక్కరణ సిద్ధాంతం అమెరికా రాజ్యాంగ నిర్మాతలపై చాలా ఎక్కువ ప్రభావాన్ని ప్రసరింపజేసింది. సూత్రరీత్యావారు సిద్ధాంతాన్ని ఆమోదించటయేగాక, దానిని కొద్ది మార్పులతో నిరోధాలు - సమతుల్యాల వ్యవస్థగా అమెరికా రాజ్యాంగంలో పొందుపరచినారు. అమెరికా రాజకీయ వ్యవస్థకు చెందిన మూడు అంగాలను స్వతంత్రంగా ఏర్పాటుచేసి, వాటి పరిధిలో వాటికి అత్యున్నత అధికారాలను అప్పగించటం జరిగింది. అదే సమయంలో నిరోధాలు - సమతుల్యాల ద్వారా వాటి మధ్య సమన్వయాన్ని కూడా ఏర్పాటు చేసినారు. ఏ ప్రభుత్వాంగము నియంతృత్వపోకడలను అనుసరించకుండా, ఒకదానిపై ఇంకొక దానికి అదుపు (Check) ను కల్పించటం ద్వారా ప్రభుత్వ వ్యవస్థీకరణలో సమతుల్యాన్ని పాటించటం జరిగింది.

అధికార పృథకర్రణ సిద్ధాంతం మనకు అమెరికా రాజ్యాంగపు వాక్య నిర్మాణంలోనే స్పష్టంగా కన్పిస్తుంది. శాసన నిర్మాణాధికారమంతా కాంగ్రెసుకే ఉంటుందని అమెరికా రాజ్యాంగంలోని 1వ అధికరణం పేర్కొంటే, కార్యనిర్వాహక అధికారం అంతా అధ్యక్షునకే ఉంటుందని 2వ అధికరణం స్పష్టం చేస్తుంది. 3వ అధికరణం ప్రకారం న్యాయ నిర్ణయాధికారం ఒక సుప్రీంకోర్టుకు, ఇంకా కాంగ్రెసు ఎప్పటికప్పుడు శాసించినెలకొల్పే ఆయా దిగువ న్యాయస్థానాలకూ ఉంటుంది. ఇంకా కాంగ్రెసు సభ్యులను, అధ్యక్షుడిని నిర్ణీత గడువుకు ప్రజలే నేరుగా ఎన్నుకుంటారు. అధ్యక్షుడు, ఆయన మంత్రివర్గ సహచరులు కాంగ్రెసు సమావేశాలలో కూర్చొనటం లేక శాసనాలు ప్రవేశపెట్టడం ఉండదు. అట్లాగే గడువు పూర్తికాక ముందే కాంగ్రెసును అధ్యక్షుడు రద్దుచేయలేడు. అంతేగాక, న్యాయమూర్తుల పదవీకాలం కూడ కార్యనిర్వాహకవర్గం ప్రమేయం లేకుండా స్థిరంగా నిర్ణయించబడింది.

అదే సమయంలో శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ నిర్ణాయక అంగాలమధ్య అనేక నిరోధాలు నెలకొల్పబడినాయి. అధ్యక్షుని చేతుల్లోయున్న కార్యనిర్వాహక అధికారాన్ని కాంగ్రెసు, సుప్రీంకోర్టులు అడ్డుకొనే ఆస్కారం ఉంది. ఉదాహరణకు, అధ్యక్షుడు చేసిన ముఖ్యమైన అధికారుల నియామకాలను, సంధులు, ఒడంబడికలను సెనెట్ ధృవీకరించవలసి యుంటుంది. అధ్యక్షుడు దుష్ప్రవర్తనకు పాల్పడితే లేక రాజ్యాంగాన్ని అతిక్రమిస్తే మహాభియోగ (Impeachment) ప్రక్రియ ద్వారా అతడ్ని తొలగించే అధికారం

కాంగ్రెసుకు ఉంది. ఇంకా అధ్యక్షుడు జారీ చేసిన కార్యనిర్వహక ఉత్తర్వులు న్యాయ సమీక్షాధికారానికిలోనై ఉంటాయి. అంతేగాక అధ్యక్షుడు పదవీ స్వీకారం చేసేటప్పుడు ప్రధానన్యాయమూర్తి సమక్షంలో రాజ్యాంగాన్ని సంరక్షిస్తానని ప్రమాణం చేస్తాడు. అంటే, ఇది అతని అధికారంపై మొదటి నుండి యుండే ఒక గొప్ప నైతిక అదుపును సూచిస్తుంది.

అదేవిధంగా, శాసన నిర్మాణాధికారం కాంగ్రెస్‌లో నిక్షిప్తమైయున్నా, దానిపై అధ్యక్షుడు, సుప్రీంకోర్టులు ఉభయులూ నిరోధక అధికారాలను కలిగి ఉన్నారు. కాంగ్రెసు ఆమోదించిన బిల్లులన్నింటిని అధ్యక్షుడు ఆమోదించవలసి యుంటుంది. ఒకవేళ అధ్యక్షుడు బిల్లును ఆమోదించకుండా తిరస్కరిస్తే అప్పుడు మూడింట రెండువంతులు మెజారిటీతో ఆ బిల్లును తిరిగి ఆమోదించటం ద్వారా మాత్రమే కాంగ్రెసు అధ్యక్షుడి వీటో అధికారాలను త్రోసిరాజనగలదు. అట్లాగే రాజ్యాంగానికి లేక సజావైన న్యాయక్రమానికి (Due Process of Law) విరుద్ధంగా యున్న పక్షంలో ఏ శాసనాన్నైనా సంపూర్ణంగాకాని, లేక పాక్షికంగాకాని రద్దుచేసే అధికారం సుప్రీంకోర్టుకు, దాని క్రింది ఫెడరల్ కోర్టులకు ఉంటుంది. చివరగా సుప్రీంకోర్టుపై అడ్డుకట్ట వేసే అధికారాలు అధ్యక్షునికి, కాంగ్రెసుకు యివ్వబడినాయి. అధ్యక్షుడు సెనేట్ ఆమోదంతో న్యాయమూర్తుల్ని నియమిస్తాడు. అట్లాగే అధ్యక్షుని సన్నిధిలో ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయటం అతనిపై యుండే గొప్ప నైతిక అదుపును సూచిస్తుంది. న్యాయమూర్తుల సంఖ్యను పెంచటానికి లేక న్యాయస్థానాల పరిధిని పెంచటానికి చట్టాలు చేసే అధికారం కాంగ్రెసుకు ఉంది. అంతేగాక తీవ్రమైన దుష్ప్రవర్తనకు పాల్పడినా లేక రాజ్యాంగాన్ని అతిక్రమించినా అలాంటి న్యాయామూర్తిని మహాభియోగ ప్రక్రియ ద్వారా తొలగించే అధికారం కాంగ్రెసుకు ఉంది.

ఆవిధంగా అమెరికాలో కూడ మనకు అధికార పృథక్కరణ సూత్రం పరిపూర్ణ రూపంలో అమలు కాదు. శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయనిర్ణాయక అంగాలపూర్తి విభజన ఏ ఆధునిక రాజ్యాంగంలోనైనా సాధ్యంకాదు. కనుక స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మనుగడకు ముఖ్యావసరమైన అధికారాల విభజనను, ఆయా అధికార విభాగాల మధ్య సహకారం అవసరమున్న గుర్తింపుతో మేళవించినప్పుడే సమర్థవంతమైన ప్రభుత్వపాలన సాధ్యమవుతుంది.

### 19.4.3 ఇండియా

భారత రాజ్యాంగ నిర్మాతలు అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని తిరస్కరించినారు. వారు కొన్ని చిన్నచిన్న మార్పులతో బ్రిటిషు పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని అనుకరించినారు. ఆవిధంగా భారతరాజ్యాంగంలో కూడ బ్రిటిషు రాజ్యాంగంలోవలె అధికారాల విభజననుకాక, అధికారాల సమ్మేళనాన్ని మనం చూడవచ్చు. భారత రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహకవర్గం దేశాధ్యక్షుడు మరియు ప్రధాన మంత్రి నాయకత్వంలోని మంత్రి మండలులతో కూడుకొని యుంటుంది. మంత్రిమండలి సభ్యులు పార్లమెంటులో సభ్యత్వాన్ని కలిగియుండి, దానికి సమిష్టిబాధ్యత వహిస్తారు. దేశాధ్యక్షుడు పార్లమెంటు అధినేతగా వ్యవహరిస్తాడు. ఆయన పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేయటం, వాయిదా వేయటం, రద్దు చేయటం చేయగలడు. అదేవిధంగా ఆయన అత్యవసరాదేశాల (Ordinances) ను జారీ చేయగలడు. అవి పరిమితి కాలానికి చెందిన శాసనాలుగా ఉండి, పార్లమెంటు శాసనాధికారాల పరిధికి అనువర్తింపబడి ఉంటాయి.

భారత పార్లమెంటుకు శాసనాధికారాలతో బాటు కొన్ని నిర్దిష్టమైన కార్యానిర్వాహక, న్యాయ నిర్ణయాధికారాలు కూడ యివ్వబడినాయి. అది కార్య నిర్వాహకశాఖపై నియంత్రణను కలిగి ఉంది.



B R A O U

పార్లమెంటు సభ్యులు మంత్రులను ప్రశ్నించటం ద్వారా, వాయిదా తీర్మానాలను చేయటం ద్వారా వారు విధి నిర్వహణలో జాగరూకతతో యుండేటట్లు చూస్తారు. పార్లమెంటు విశ్వాసాన్ని పొందినంత కాలమే మంత్రిమండలి సభ్యులు పదవిలో కొనసాగుతారు. అదేవిధంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై ఏదైనా నిర్దిష్టమైన ఆరోపణలు వచ్చినపుడు, వాటిని విచారించి, అవినక్రమమేనని భావించినపుడు వారిని తొలగించవలసినదిగా దేశాధ్యక్షుడిని తీర్మానం ద్వారా కోరతారు. న్యాయమూర్తుల జీతాలు, ఇతరభత్యాలను పెంచే అధికారం పార్లమెంటుకు ఉంది. అదేపంథాలో న్యాయనిర్ణయశాఖకు కొన్ని శాసన మరియు కార్యనిర్వాహక విధులు యివ్వబడినాయి. రాజ్యాంగానికి విరుద్ధంగా పార్లమెంటుకాని, కార్యనిర్వాహకశాఖ కాని శాసనాలను రూపొందించటం లేదా అమలు చేయుటం చేస్తే వాటిని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి, రద్దు చేసే అధికారం న్యాయశాఖకు ఉన్నది. దేశాధ్యక్షునిచే పదవీ స్వీకార ప్రమాణం, రహస్యాలను కాపాడుతాననే ప్రమాణం కూడ అది చేయిస్తుంది. కీలకమైన రాజ్యాంగ విషయాలపై కార్యనిర్వాహక శాఖ, పార్లమెంటులకు వాటి కోరికపై అవసరమైన సలహాలను న్యాయశాఖ యిస్తుంది.

అయితే న్యాయశాఖను రూపొందించంటలో మాత్రం రాజ్యాంగ నిర్మాతలు కొంతవరకు అధికార పృథక్కరణ సిద్ధాంతానికి విలువ నిచ్చారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సర్వీసు నియమాలను (Service Conditions) వారి పదవీకాలంలో మార్పులు, చేర్పులు చేసే అధికారం కార్యనిర్వాహకశాఖకు కాని, పార్లమెంటుకు కాని లేదు. న్యాయమూర్తుల జీతభత్యాలు, సుప్రీంకోర్టుకు సంబంధించిన సంస్థా వ్యయాలను సంచితనిధి (Consolidated Fund) నుండి చెల్లిస్తారు. అందువలన వాటిపై పార్లమెంటుకు ఓటుచేసే అవకాశం లేదు. అంతేగాక రాజ్యాంగానికి చెందిన ఆదేశిక సూత్రాలు "రాజ్యం న్యాయశాఖను, కార్యనిర్వాహక శాఖ నుండి వేరు చేయుటానికి అవసరమైన చర్యలను తీసికోవలసిందిగా సూచించటం జరిగింది. ఆవిధంగా న్యాయశాఖ స్వతంత్రతను కాపాడటానికి భారత రాజ్యాంగం కొన్ని రక్షణలను కల్పించటం జరిగింది.

## 19.5 విమర్శనాత్మక పరిశీలన

రాజ్యాధికారం విభజింపబడియుంటే తప్ప ప్రజలస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించుటం సాధ్యంకాదని మొట్టమొదటి సారిగా మాంటెస్క్యూ స్పష్టం చేసినాడు. అధికార పృథక్కరణ సిద్ధాంతం ప్రాముఖ్యమంతా ఈ వాస్తవంలోనే ఇమిడి ఉంది. వ్యక్తి స్వేచ్ఛకు సంరక్షణగా ఉండే స్వతంత్ర న్యాయవ్యవస్థ ప్రాముఖ్యాన్ని ఈ సిద్ధాంతం నొక్కి చెప్పింది. ప్రభుత్వం ఎప్పుడు కొన్ని వ్యవస్థాపిత చట్టాలు, నిబంధనల ప్రకారమే పాలించాల్సి ఉంటుందన్న మౌలిక సూత్రాన్ని ఈ సిద్ధాంతం రూపొందించింది. ప్రజలను క్రూరంగా అణచివేసే యథేచ్ఛాపాలన మంచి ప్రభుత్వానికి విరుద్ధమైనదని ప్రకటించింది. సమాజంలోని వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించేందుకు గాను, న్యాయనిర్ణాయక క్రమంలో కార్యానిర్వాహక, పరిపాలనా అంగాలు జోక్యం చేసికోకుండా ఉండటం అవసరమని ఈ సిద్ధాంతం వివరించింది.

అధికారపథ్యకరణ సిద్ధాంతానికి ఇంత ప్రాముఖ్యం ఉన్నా, దానిలో అనేక లోపాలు కూడా ఉన్నాయి. అవి :

1. అధికార పృథక్కరణ సిద్ధాంతం ప్రకారం వ్యక్తుల స్వేచ్ఛను పరిరక్షించటానికి వీలుగా ప్రభుత్వ అంగాలు మూడింటిని వేరుచేసి ఉంచవలసియుంటుంది. కాని వాస్తవానికి ప్రభుత్వం ఒక పరిపూర్ణమైన

BRAOU

వ్యవస్థ దానికి సంబంధించిన మూడు అంగాలు సమైక్యంగా మేళవించి ఉంటాయి. బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన పాలన సమకూర్చాలంటే వాటిని వేరుచేయటం మంచిదికాదు.

2. అధికార పృథక్కరణ సిద్ధాంతం ఉద్దేశించినట్లు శాసన నిర్మాణ, కార్యనిర్వహాక అంగాలను వేరుచేయటం సాధ్యంకాదు. కార్యనిర్వహక అంగం అమలు చేసే చట్టాలను చాలవరకు శాసనసభ రూపొందిస్తుంది. కాని శాసనాలు చేసేటప్పుడు కార్యనిర్వాహకవర్గపు మార్గదర్శకత్వాన్ని, సూచనలను శాసనసభ తీసికోవలసి యుంటుంది. ఎందువలనంటే శాసనాలకు ప్రాతిపదికగా యుండు సమాచారాన్ని, అవసరమైన అన్నివివరాలను అందజేసేది కార్యనిర్వాహక వర్గమే.

3. చారిత్రికంగా చూస్తే బ్రిటిష్ ప్రభుత్వ వ్యవస్థను అపార్థం చేసికొని, పొరపాటుగా వివరించటంపైనే మాంటెస్క్యూ ప్రతిపాదించిన అధికార పృథక్కరణ సిద్ధాంతం ఆధారపడియున్నది. ఈరోజున యున్నంత పరిపూర్ణంగా పరిణతి చెంది యుండకపోయినా, మంత్రివర్గ బాధ్యతా సూత్రం 18వ శతాబ్దంలోనైనా పూర్తిగా లేకుండా పోలేదు. మాంటెస్క్యూ ఇంగ్లాండ్‌ను సందర్శించినకాలంలో ఆదేశానికి చెందిన మంత్రులు పేరుకు రాజుకు అధీనమైయున్నా, పార్లమెంటు విశ్వాసాన్ని చూరగొనినంత కాలం మాత్రమే తాము పదవిలో కొనసాగలుగుతామనే విషయం వారికి తెలియనిదికాదు. కనుక అధికరాల విభజన గురించిన మాంటెస్క్యూ వివరణ "అప్పటి కాలానికి కూడా పొసగనది" మాత్రమేగాక, ఈ కాలానికి కూడ ఆచరణీయం కానిది అని చెప్పవచ్చు.

4. అధికారాల విభజనవల్ల సమాజంలో వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు గ్యారంటీ లభిస్తుందని మాంటెస్క్యూ భావించినాడు. కానివాస్తవానికి అధికారాల విభజన లేకపోయినప్పటికి వ్యక్తి స్వేచ్ఛను కాపాడవచ్చు. అధికారాల సమ్మేళనమే ప్రధానలక్షణంగా గల పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ నెలకొన్న బ్రిటన్‌లో మనకు ఈ పరిస్థితి స్పష్టంగా కన్పడుతుంది. నిజమైన స్వేచ్ఛ దేశంలోని రాజకీయ సంస్కృతి, సంస్థలపై, ప్రత్యేకించి చక్కని విషయం పరిజ్ఞానం, నిరంతర జాగరూకతగల ఓటర్లపై ఆధారపడి యుంటుంది.

5. రాజ్యానికి చెందిన మూడు అంగాలు సమానమేనని ఈ సిద్ధాంతం తప్పుగా వాదిస్తుంది. కాని వాస్తవానికి ప్రజాస్వామ్యం అభివృద్ధి చెంది, శ్రేయోరాజ్యభావన ప్రాచుర్యంలోనికి రావటంతో, కార్యానిర్వాహకశాఖ బాధ్యతలు రోజురోజుకు న్యాయనిర్ణాయక, శాసననిర్మాణ అంగాల బాధ్యతలను మించి పెరిగిపోతున్నాయి.

6. అధికార పృథక్కరణ సిద్ధాంతంలోని విలువైన రాజకీయ సూత్రాలు ఉన్నప్పటికి, ఏ ప్రభుత్వాన్ని శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయనిర్ణాయక విధుల పూర్తి విభజన ప్రాతిపదికపై వ్యవస్థీకరించటం సాధ్యంకాదు. ఆధునిక రాజ్యాలన్నింటిలోను ఈశాఖలు అంతో ఇంతో పరస్పర సంబంధితంగాను, పరస్పర ఆధారితంగాను ఉన్నాయి. ప్రతిశాఖ కొంతమేరకు ఇతరశాఖల అధికారాన్ని చెలాయిస్తుంది. ఉదాహరణకు, శాసనసభలు కోర్టులు అమలు చేసే చట్టాలను సృష్టించటం మాత్రమేగాక, అమెరికాలో మాదిరిగ మహాభియోగ విచారణ న్యాయస్థానాలుగా పనిచేసేటప్పుడు లేక బ్రిటన్‌లో మాదిరిగ అంతిమ అప్పీలు కోర్టులుగా పనిచేసేటప్పుడు అవి వాస్తవానికి న్యాయనిర్ణాయక వ్యవస్థకు చెందిన అధికారాలనే చెలాయిస్తున్నాయని చెప్పవచ్చు. అంతేగాక, కార్యనిర్వాహకవర్గం దత్తశాసన నిర్మాణాధికారాలను అనుభవించటమనేది రాజ్యపు శాసన నిర్మాణ విధుల పరిధిలోకి కార్యనిర్వాహక వర్గం చొచ్చుకురావటానికి ఒక స్పష్టమైన నిదర్శనం.

7. అధికారాల విభజనవల్ల తరచూ ప్రతిష్ఠంభనలు కూడా ఏర్పడుతాయి. ప్రతిశాఖ తన సొంత అధికారాలను కాపాడుకోవటానికి ఉపక్రమించటం ద్వారా "మరో శాఖకు ఎన్నడూ సహాయం చేయకపోవటం, పర్యావసానంగా శాఖల స్వతంత్ర ప్రతిపత్తివల్ల సంక్రమించే అవకాశమున్న అన్నిఅనుకూలతలనూ మించి పాలనా సామర్థ్యం దెబ్బతినటం జరుగుతుంది".

8. మాంటెస్క్యూ సిద్ధాంతాన్ని ఆధునిక సంక్షేమ రాజ్యాలకు అన్వయించటానికి వీలుకాదు. సంక్షేమ రాజ్యం, ప్రణాళికాభివృద్ధి వంటి భావనలు ఆవిర్భవించి, ప్రాచుర్యంలోనికి రావటంతో రాజ్యం యొక్క అధికారాలు, విధులు అపారంగా పెరిగిపోయినాయి. ఈ రాజ్యం, ఈ అధికారాలను, విధులను కార్యనిర్వాహక వర్గం ద్వారా అమలు చేస్తుంది. కాబట్టి కార్యనిర్వాహక వర్గం ప్రాధ్యానత కూడ పెరగటానికి దోహదమయింది. అంతేగాక రాజకీయ పార్టీల ఆవిర్భావం కూడ ఈ సిద్ధాంతం ప్రాధాన్యతను కోల్పోవటానికి దారి తీసింది.

పైన వివరించిన విధంగా తీవ్రరూపంలోని అధికార పృథక్కరణ సిద్ధాంతం, నిరోధాలు-సమతుల్యాల సిద్ధాంతం మంచి ప్రభుత్వానికి హానికరమని చెప్పవచ్చు. చట్టబద్ధంగా అభివ్యక్తమైన రాజ్యసంకల్పాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఐక్యతను, సమన్వయాన్ని తీవ్రరూపంలోని అధికారాల విభజన నిరోధిస్తుంది. తీవ్రరూపంలోని నిరోధాలు - సమతుల్యాల వలన ఘర్షణలు, ప్రతిష్ఠంభనలు తలయెత్తి సాఫీగా, సమర్థవంతంగా ప్రభుత్వం సాగడం అసాధ్యమవుతుంది. సక్రమంగా ఒక అంగానికి చెందే అధికారాలను ఇతర ఏ అంగమైనా పూర్తిగా లేక నేరుగా నిర్వహించరాదనే సాధారణ అర్థంలో మాత్రమే ఈ సిద్ధాంతం విలువైనదని గ్రహించాలి. అంతేగాక వివిధ అంశాలు వాటివాటి అధికారాలను చెలాయించేటప్పుడు ఏ ఇతర అంగమూ ప్రత్యక్షంగాకాని, పరోక్షంగాకాని మిగిలిన అంగాల సక్రమ అధికారాలను అతిక్రమించి, తన సొంత ప్రభావాన్ని వాటిపై చూపించరాదు.

## 19.6 క్లుప్తంగా

అధికార పృథక్కరణ సిద్ధాంతం ప్రధానంగా శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ నిర్ణయక అంగాలనే మూడు ప్రభుత్వ అంగాల మధ్య అధికారాలు - విధుల పంపిణీ గురించి వివరిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ మూడు అధికారాలు ఒకేవ్యక్తిలో లేక వ్యక్తుల బృందంలో కేంద్రీకృతమైతే అపుడది యధేచ్ఛా నిరంకుశపాలనకు దారితీస్తుంది. కనుక వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించేందుకు వీలుగా ఈ మూడు అధికారాలను మూడు వేర్వేరు ప్రభుత్వ శాఖలకు అప్పగించాలి.

అరిస్టాటిల్, బోడిన్, ఆతరువాత లాక్ ఈ సిద్ధాంతాన్ని గురించి ప్రస్తావించినారు. కాని దీనిని ఒక సమగ్రమైన సిద్ధాంతంగా రూపొందించి, వివరించిందిమాత్రం 18వ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత మాంటెస్క్యూయే. ఈ విషయంలో ఆయన ఫ్రాన్సు, బ్రిటన్ దేశాల సమకాలీన పరిస్థితుల వలన బాగా ప్రభావితం అయినాడు. శాసనసభ, కార్యనిర్వాహకవర్గం, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల పంపిణీని నెలకొల్పిన బ్రిటన్ ఆయనను ఈ సిద్ధాంతం ప్రతిపాదనకు ప్రేరిపించింది. అట్లాగే ఫ్రాన్సులో యున్న యధేచ్ఛా, నిరంకుశపాలనను చూసి, రాజ్యాధికారాలు మూడు స్వతంత్ర ప్రభుత్వ అంగాల పంపిణీ అయితే తప్ప, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించటం సాధ్యంకాదనే నిశ్చితాభిప్రాయానికి ఆయన వచ్చాడు.

మాంటె స్క్యూ ప్రతిపాదించిన అధికార పృథక్కరణ సిద్ధాంతం ఆ తరువాతి కాలంలో ఎంతో ప్రభావాన్ని కలుగుజేసింది. కొద్దిపాటి మార్పులతో ఈ సిద్ధాంతాన్ని అనేక రాజ్యాలు అనుకరించాయి. అమెరికాలో



BRAOU

దీనిని "నిరోధాలు - సమతుల్యాల వ్యవస్థ"గా రూపొందించినారు. శాసననిర్మాణాధికారాన్ని కాంగ్రెసులోను, కార్యనిర్వాహక అధికారాన్ని అధ్యక్షుని చేతుల్లోను, న్యాయనిర్ణాయక అధికారాన్ని సుప్రీంకోర్టులోను పొందుపరచారు. కానీ అదే సమయంలో శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయనిర్ణాయక అంగాల మధ్యే అనేక నిరోధాలను ఏర్పరచినారు. ఉదాహరణకు, అధ్యక్షుడు చేసే అన్ని ముఖ్య నియామకాలను, కుదుర్చుకునే అన్ని సంధులను, ఒడంబడికలను అమెరికన్ కాంగ్రెసు ఎగువసభ అయిన సెనేట్ ఆమోదించవలసి యుంటుంది. అదేవిధంగా కాంగ్రెసు ఆమోదించిన బిల్లులన్నింటిని అధ్యక్షుడు ఆమోదించాలి. అప్పుడు మాత్రమే అవి ప్రభుత్వ చట్టాలవుతాయి. సెనేట్ సమ్మతితో అధ్యక్షుడు న్యాయామూర్తులను నియమిస్తాడు. కాని అదే సమయంలో రాజ్యాంగానికి విరుద్ధంగా ఉండే శాసనాలను రద్దుచేసే అధికారం ఫెడరల్ కోర్టులకు ఉంది. ఈ విధంగా ఏ ఆధునిక ప్రభుత్వంలోనైనా శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయనిర్ణాయక విభాగాల మధ్యే పూర్తి విభజన ఆచరణ సాధ్యంకాదని గ్రహించాలి.

ఏమైనా అధికారపృథక్కరణ సిద్ధాంతానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదని చెప్పకతప్పదు. రాజ్యాధికారాన్ని వివిధ ప్రభుత్వంగాల మధ్య పంపిణీ చేస్తే తప్ప, ప్రజల స్వేచ్ఛ పరిరక్షింపబడదని చెప్పటం మాంటె స్క్యూ గొప్పతనము. ఒక స్వతంత్ర న్యాయవ్యవస్థ ప్రాముఖ్యాన్ని, వివిధ ప్రభుత్వాంగాల స్వయంప్రతిపత్తి ప్రాధానాన్ని నొక్కివక్కాణించటం సిద్ధాంతం యొక్క ప్రత్యేకత. ఇంతటి ప్రాధాన్యతను కలిగియున్నప్పటికి, ఈ సిద్ధాంతంపై కొన్ని విమర్శలు కూడ చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం సక్రమంగా పనిచేయాలంటే ప్రభుత్వశాఖల విభజనకాక, వాటి మధ్య సహకార, సమన్వయాలే ముఖ్యం. కనుక అధికారపథ్కరణ సిద్ధాంతాన్ని దాని పరిపూర్ణరూపంలో వర్తింప జేయజాలము. వాస్తవానికి దానిని కొన్ని మార్పులు, చేర్పులతో అనుసరించటం జరుగుతున్నది.

## 19.7 చదువదగిన పుస్తకాలు

F.W. Garner : Political Science and Government
E. Asirvatham : Political Theory
K.R. Acharya (Ed): Text Book of Political Science

## 19.8 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిలిమ్ము.**

1. అధికార పృథక్కరణ సిద్ధాంతానికి మాంటెస్క్యూ చేసిన కృషిని వివరించుము.
2. మాంటె స్క్యూ ప్రతిపాదించిన అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించుము.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. అధికార పృథక్కరణ సిద్ధాంతం అననేమి ? దాని ముఖ్యలక్షణాలను వివరించుము.
2. అధికార పృథక్కరణసిద్ధాంతం ఏవిధంగా అమెరికా రాజ్యాంగానికి ప్రాతిపదిక అయ్యింది.
3. 'నిరోధాలు-సమతుల్యల' సిద్ధాంతం అంటే ఏమిటి ?
   అమెరికన్ రాజకీయ వ్యవస్థలో దాని స్థానమేమి ?
4. భారతరాజ్యాంగానికి అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని ఏవిధంగా అన్వయించింది పరిశీలించుము.

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

B R A O U

# భాగం-20: శాసనసభ ప్రాతినిధ్య పద్ధతులు

విషయ సూచిక


20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 ప్రాతినిధ్య పద్ధతి - ఆవిర్భావం, అభివృద్ధి

20.3 ఓటర్లు మరియు ఎన్నికబృందం

20.4 ఎన్నికల పద్ధతులు

- 20.4.1 ప్రత్యక్ష ఎన్నిక
- 20.4.2 పరోక్ష ఎన్నిక

20.5 ఓటింగ్ పద్ధతులు

- 20.5.1 బాహాట మరియు రహస్య ఓటింగు
- 20.5.2 పోష్టల్ మరియు ప్రాక్సీ ఓటింగు
- 20.5.3 బహుళ మరియు హెచ్చుతూకపు ఓటింగు

20.6 సార్వత్రిక ఓటు హక్కు

20.7 వివిధ ప్రాతినిధ్య పద్ధతులు

- 20.7.1 భౌగోళిక లేక ప్రాదేశిక ప్రాతినిధ్యం
- 20.7.2 దామాషా ప్రాతినిధ్యం లేక నైష్పత్తిక ప్రాతినిధ్యం
- 20.7.3 రెండో బ్యాలట్ పద్ధతి
- 20.7.4 ప్రత్యామ్నాయ లేక ఆగంతుక ఓటు పద్ధతి
- 20.7.5 వృత్తి ప్రాతినిధ్యం
- 20.7.6 అల్పసంఖ్యాక ప్రాతినిధ్యం
- 20.7.7 ఆదేశిత ప్రాతినిధ్యం

20.8 క్లుప్తంగా

20.9 చదవగదిన పుస్తకాలు

20.10 నమూనా ప్రశ్నలు


BRAOU

## 20.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- ప్రాతినిధ్య పద్ధతి ఆవిర్భావం గురించి అభివృద్ధి గురించి తెలుపగలరు
- ఓటర్లను నిర్వచించగలుగుతారు
- వివిధ ఎన్నికల పద్ధతులను, ఓటింగ్ పద్ధతలును వివరించగలుగుతారు
- విభిన్న ప్రాతినిధ్య పద్ధతులను, ఆధునిక ప్రభుత్వాలలో ప్రజా ప్రాతినిధ్యం ప్రాముఖ్యతను గురించి విశదీకరించగలగుతారు.

## 20.1 పరిచయం

ఈ ఖండికలో మీరు శాసనసభలకు ఎన్నుకోబడే ప్రజాప్రతినిధులకు సంబంధించిన వివిధ ప్రాతినిధ్య పద్ధతులను గురించి తెలుసుకుంటారు.

ప్రజాస్వామ్యమంటే సార్వభౌమాధికారం కలిగిన ప్రజలు ప్రభుత్వాన్ని నిర్విహిస్తున్నారని అర్థం. అది రెండు రకాలుగా ఉంటుంది. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, పరోక్ష ప్రజాస్వామ్యం. ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో శాసనాలను రూపొందించటంతోను, ప్రభుత్వ పరిపాలనలోను పాల్గొనే అవకాశం ప్రజలందరికి ఉంటుంది. ఇటువంటి ప్రజాస్వామ్యం ప్రాచీన గ్రీకు నగర రాజ్యాలవంటి అతిచిన్న జన సముదాయాలలో సాధ్యమౌతుంది. కాని నేటి జాతీయ రాజ్యాలు విస్తృత భూభాగాలను, అపారజన సంఖ్యను కలిగియుండి విశాల రాజ్యాలుగా ఉంటున్నాయి. అందువలన శాసన సభలకు ప్రజాప్రతినిధులను నిర్ణీతకాలానికి ఎన్నుకొనే ఆచారం రూపొందింది. శాసనాలను రూపొందించి, ప్రభుత్వ పరిపాలనను పర్యవేక్షించే అధికారాన్ని ఈ శాసనసభలకు అప్పగించడమైనది. ఈవిధంగా ఆధునికకాలంలో పరోక్ష లేక ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం పలుదేశాలలో అమలులోనికి వచ్చింది.

BRAOU

## 20.2 ప్రాతినిధ్యపద్ధతి - ఆవిర్భావం, అభివృద్ధి

ఆధునిక ప్రజాస్వామ్యరాజ్యాల యొక్క ఒక ముఖ్యలక్షణము ప్రజాప్రాతినిధ్య పద్ధతి. కాని ఈ వ్యవస్థ ఎప్పుడు ఏవిధంగా పుట్టింది ఖచ్చితంగా చెప్పటం కష్టం. కొన్ని క్రైస్తవ మత సంస్థలలో వాడిన పద్ధతిగా ఇది మధ్యయుగాలలోనే ఆవిర్భవించిందని సాధారణంగా భావిస్తాయుంటారు. అదేవిధంగా విత్తసంబంధమైన వ్యవహారాలకు సంబంధించి రాజులు సమావేశపరచే సలహామండలులు నిర్మాణంలో కూడ ఈ పద్ధతి అమలులో యుండేది. ఈ సలహామండళ్లకు అధికారాలు, ప్రభావం అతిస్వల్పంగా యున్నప్పటికి 'సంప్రదించటం' అనే పద్ధతి అమలులో ఉండటమే ఆరోజులలో చాలా ముఖ్యమైన విషయంగా మనం పరిగణించవచ్చు. పదమూడో శతాబ్దం చివరి కాలంనుండి, పదునాల్గువ శతాబ్దం ఆరంభంనుండి ఇంగ్లండు లో పార్లమెంటు, ఫ్రాన్స్‌లో ఎస్టేట్స్ జనరల్, స్పెయిన్‌లో కోర్ట్స్, జర్మనీలో డయట్ మొదలైన ప్రజాప్రాతినిధ్య సంస్థలు ఆయాదేశాల జాతీయ వ్యవహారాల్లో అంతకంతకు ప్రముఖ పాత్ర వహించసాగాయి. అయితే ఏవిధంగా చూసినా ఈ వ్యవస్థలు ప్రియమైనవని (Popular) చెప్పలేము. సమాజంలోని కులీనులు, ఫ్యూడల్

ప్రభువులు, మతగురువులువంటి కొన్ని ఉన్నత వర్గాలకే అవిప్రాతినిధ్యం వహించేవి. మధ్యయుగాల అంతంలో అసెంబ్లీలు నిరంకుశరాజరికం చేతుల్లో దెబ్బతిని వెనుకంజవేసినాయి. డయట్, కోర్ట్స్, ఎస్టేట్స్ జనరల్‌ల ప్రాధాన్యం కాలక్రమేణా తగ్గిపోయి అస్థిత్వంలేని వ్యవస్థలుగా కుదించుకునిపోయాయి. ఒక్క బ్రిటిషు పార్లమెంటు మాత్రమే జాతీయ వ్యవహారాలపై తన నియంత్రణను చాలా వరకు నిలబెట్టుకోగలిగింది.

పంధోమ్మిదో శతాబ్దంలో ఓటుహక్కు క్రమేణా విస్తరిస్తూ వచ్చింది. భౌతిక పరిస్థితుల మెరుగుదల, సార్వజనిక విద్యలో వచ్చిన అభివృద్ధివల్ల ఇది సాధ్యమైంది. బ్రిటన్‌లో రూపొందించబడిన అనేక చట్టాలు - 1832, 1867, 1884, 1918 మరియు 1928 కారణంగా పార్లమెంటు, ప్రత్యేకించి సామాన్యుల సభ (Houseof Commons) ప్రజాప్రాతినిధ్య సంస్థగా రూపాంతరం చెందింది. ఇతర రాజ్యాలలో కూడ ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబించే విధంగా ప్రాతినిధ్యవ్యవస్థలను సృష్టించటమోలేక ఎన్నికల సంస్కరణలను తీసికొనిరావటమో జరిగింది. గార్నర్ అభిప్రాయంలో "సంకుచితం, తరచుగా అసమానతలలో కూడుకొని పరోక్ష ప్రాతినిధ్యవ్యవస్థగా నెలకొన్న ఓటుహక్కు సార్వత్రిక, ప్రత్యక్ష మరియు సమానత్వ ఓటుహక్కుగా పరిణామం చెందటమనేది ప్రజాస్వామ్య చరిత్రకు సంబంధించి గతశతాబ్దంలో చోటుచేసికొన్న ఒక మహత్తర దృగ్విషయం". అతికొద్ది ఆటంకాలను మినహాయించి, ప్రజాస్వామ్యభావన పురోగతితో మత, ఆర్థిక, జాతి, లింగపరమైన విచక్షణలు ఒకదాని తరువాత ఒకటి అంతర్థానంకావటం జరిగిందని ఆయన అభిప్రాయపడినారు.

## 20.3 ఓటర్లు మరియు ఎన్నిక బృందం

ప్రజాస్వామిక ప్రభుత్వానికి ప్రాతిపదిక ఓటర్లు. రాజ్యంలోని వ్యక్తులందరికి ఓటుహక్కు ఉండదు. ఓటుహక్కును కలిగియున్న వ్యక్తులు మొత్తం జనాభాలో కొద్దిమంది మాత్రమే యుంటారు. వీరినే ఆదేశపు ఓటర్లు అంటారు. ఓటు హక్కును కలిగియుండటానికి కొన్ని అర్హతలుండాలి. మైనర్లకు (యుక్తవయసురాని వారికి), మతిస్థిమితంలేని వారికి, విదేశీయులకు ఏదేశంలోను ఓటుహక్కులు ఉండవు. కొన్నిదేశాలలో స్త్రీలకు కూడ ఓటుహక్కు యుండదు. మరికొన్ని రాజ్యాలు ఓటుహక్కును పొందటానికి కొంత ఆస్థిని, కొన్ని విద్యార్హతలను నిర్దేశించవచ్చును. అయితే బాగా అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్యరాజ్యాలలో మాత్రం ఓటుహక్కు అందరికి అంటే వయోజనులందరికి ప్రసాదించారు. తమ ప్రతినిధులను ఎన్నుకొనేందుకు ఓటుహక్కు కలిగిన పౌరులను 'ఓటర్లు' లేక 'ఎన్నికదారులు' అంటారు. ఓటర్లు లేక ఎన్నికదారుల మొత్తం సమూహాన్ని 'ఎన్నికబృందం' (Electorate) అంటారు. ప్రభుత్వాన్ని నిర్వహించే ప్రజాప్రతినిధులను ఎన్నికల బృందం, అంటే ఓటర్లు ఎన్నుకొంటారు.

BRAOU

## 20.4 ఎన్నికల పద్ధతులు

ఆధునిక రాజ్యాలలో శాసనసభలకు ప్రజాప్రతినిధులను రెండు పద్ధతుల ద్వారా ఎన్నుకుంటారు. అవి. ప్రత్యక్ష ఎన్నిక పద్ధతి మరియు పరోక్ష ఎన్నిక పద్ధతి.

### 20.4.1 ప్రత్యక్ష ఎన్నిక

ప్రత్యక్ష ఎన్నికపద్ధతిలో ప్రజాప్రతినిధులను ఏదైనా నియోజకగణం (Electroral College) ద్వారా కాక ఓటర్లే నేరుగా ఎన్నుకొంటారు. ప్రజాస్వామిక భావన, సార్వత్రిక విద్యావ్యాప్తితో ఈ పద్ధతి బాగా ప్రాచుర్యంలోనికి

వచ్చింది. మనదేశంలో కేంద్రశాసన సభకు చెందిన లోక్‌సభ సభ్యుల్ని, రాష్ట్రాల శాసనసభ సభ్యుల్ని అలాగే ఇంగ్లండ్‌లో సామాన్యులసభ సభ్యుల్ని ఓటర్లే నేరుగా ఎన్నుకుంటారు.

ప్రభుత్వం ఏర్పాటులో ఓటర్లు నేరుగా పాల్గొనే అవకాశం యుంటుంది గనుక ప్రత్యక్ష ఎన్నికలు అత్యంత ప్రజాస్వామికమైనవని ఈ పద్ధతిని సమర్థించేవారు వాదిస్తూయుంటారు. అంతేగాక ప్రత్యక్ష ఎన్నికలు ప్రజలలో అత్యంత శ్రద్ధానశక్తులను రేకెత్తించటం ద్వారా, రాజకీయచైతన్యాన్ని పెంపొదించటానికి దోహదపడతాయి. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుటలో అప్రమత్తంగా యుండుటేగాక, చురుకుగా వ్యవహరించటానికి అవకాశం యుంటుంది. ఈకారణంగా ప్రజాప్రతినిధులు ప్రజాభిప్రాయంపట్ల ప్రతిస్పందన (Responsive) తోను, బాధ్యతాయుతంగాను వ్యవహరిస్తారు. ఆవిధంగా ప్రత్యక్ష ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని ఒక వాస్తవమైన, అర్థవంతమైన మరియు విజయవంతమైన వ్యవస్థగా రూపొందిస్తాయి.

కాని అదేసమయంలో ప్రత్యక్ష ఎన్నికలలో కొన్ని లోపాలుకూడ ఉన్నాయి. సామాన్య ఓటర్లు కొన్ని సమయాలలో సమర్థులను, నిజాయితీపరులను గుర్తించలేకపోవచ్చు. ఇటువంటివారు ఓటుహక్కును వినియోగించటంలో డబ్బు, ఆవేశకావేశాలువంటి మానవ బలహీనతలకు, ప్రలోభాలకు లోనుకావచ్చును. అదేవిధంగా వ్యక్తిగత ఆకర్షణ, వాక్చాతుర్యం వంటి ప్రత్యక్ష లక్షణాలు కలిగిన రాజకీయ నాయకులు ఓటర్లు యొక్క భావావేశాలను, మనోభావాలను రెచ్చగొట్టే అవకాశంయున్నది. అంతేగాక ప్రత్యక్ష ఎన్నికలలో ప్రచారానికి ఎంతో ఖర్చు అవుతుంది. కొన్ని సమయాలలో ప్రచారంగాడి తప్పి అభ్యర్థులను అపఖ్యాతి పాలుచేసే దిశలో సాగవచ్చును. అందువలన నిజాయితీపరులు, సున్నితమనస్కులు ఎన్నికలకు దూరంగా యుండే ప్రమాదం యున్నది. ఈకారణాల వలన సహేతుకమైన ఓటింగు సాధ్యంకాకపోవచ్చునని విమర్శకుల వాదన.

## 20.4.2 పరోక్ష ఎన్నిక

పరోక్ష ఎన్నికలో ఓటర్లు తమ ప్రతినిధుల ఎన్నికలో నేరుగా పాల్గొనరు. వారు నియోజకగణాల (Electoral college) సభ్యులను లేక మరేదైనా మధ్యస్థ సంస్థ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఈ నియోజక గణం లేక మధ్యస్థ సంస్థలు తిరిగి అంతిమ ప్రతినిధులుగా (Final Representatives) ఎన్నుకొంటాయి. మనదేశంలో కేంద్రశాసన సభకు చెందిన రాజ్యసభ సభ్యుల్ని రాష్ట్రాల శాసనమండలుల సభ్యుల్ని ఈవిధంగా పరోక్షంగా ఎన్నుకుంటారు.

సార్వజనిక ఓటు హక్కులోని లోపాలను అధిగమించడం కేవలం పరోక్ష ఎన్నికల ద్వారానే సాధ్యమని ఈ పద్ధతిని సమర్థించేవారి వాదన. సగటు ఓటరుకంటె నియోజకగణంలోని సభ్యులకు అధిక మేధస్సు, రాజకీయ పరిజ్ఞానం ఉంటాయని వీరిభావన. కనుక సరియైన అభ్యర్థుల్ని ఎన్నికోవటానికి పరోక్ష ఎన్నికల్లోనే ఎక్కువ అవకాశం యుంటుంది. అంతేగాక ప్రతినిధుల్ని పరోక్షంగా ఎన్నుకునేచోట, ప్రజల ఆవేశకావేశాలకు తావుండదు. అయితే యిన్ని ప్రయోజనాలున్నప్పటికి, పరోక్ష ఎన్నికపద్ధతి ఎక్కువ ప్రాచుర్యం లోనికిరాలేదు. ఇది అప్రజాస్వామికమని, రాజకీయంగా అవాంఛనీయమని విమర్శకుల భావన. రాజకీయ చైతన్యం కలిగిచటంలో ప్రత్యక్ష ఎన్నికలకున్న ప్రాధ్యాన్యత పరోక్ష ఎన్నికలకు లేదని వీరి అభిప్రాయం. అంతేగాక ప్రతినిధుల్ని అంతిమంగా కొద్దిమంది వక్తుల సమూహం ఎన్నుకోవటంవల్ల అనిచాలా సందర్భాలలో రాజకీయ అవినీతికి దోహదం చేస్తుందని వీరిభావన.

BRAOU

## 20.5 ఓటింగు పద్ధతులు

ఓటింగు విధానానికి సంబంధించి వివిధ పద్ధతులు అమలులో ఉన్నాయి. వీటిని ముఖ్యంగా మూడురకాలుగా వర్గీకరించవచ్చు. (1) బాహాట ఓటింగు మరియు రహస్య ఓటింగు (2) పోస్టల్ మరియు ప్రాతినిధ్యాధికార ఓటింగు (3) బహుళ మరియు హెచ్చుతూకపు ఓటింగు. వీటి గురించి సంక్షిప్తంగా తెలిసికుందాం.

### 20.5.1 బాహాట మరియు రహస్య ఓటింగు

ఓటింగును బాహాటంగాకాని, రహస్యంగాకాని జరిపించవచ్చును. ఒకప్పుడు రష్యా, డెన్మార్కు, సోవియట్ యూనియన్ మొదలైన దేశాలలో బాహాట ఓటింగు పద్ధతి వ్యాప్తిలో యుండేది. 19వ శతాబ్దంలో బ్రిటన్‌లో చాలాకాలం ఈ పద్ధతివాడకంలో యున్నది కాని ఆ తరువాతి కాలంలో వివిధకారణాల వలన ఈపద్ధతికి స్వస్తి పలకడం జరిగింది. మాంటె స్క్యూ, జాన్ స్టూవర్ట్‌మిల్ వంటి ప్రఖ్యాత రచయితలు ఈ పద్ధతిని సమర్థించినారు. ప్రజలను చైతన్యవంతులను చేయటానికి బాహాట ఓటింగు ఒక మంచి పద్ధతిగా మాంటెస్క్యూ భావించినాడు. కాని ఆచరణలో బాహాట ఓటింగు పద్ధతిలోని లోపాలు బయటపడినాయి. నియోజకగణం విస్తృతంగా యున్నపుడు ఈ పద్ధతి పూర్తిగా అయోగ్యమైనది. మీదు మిక్కిలి అది ఓటరును యిబ్బంది పెట్టడమేగాక, అతని ప్రాణాలకు ముప్పుకూడ తేవచ్చును. కాబట్టి ఓటరు స్వేచ్ఛగా తనకిష్టమైన విధంగా ఓటువేసే అవకాశం యుండదు.

బాహాట ఓటింగు పద్ధతిలోని లోపాలను సవరించి, ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవటానికి వీలుగా అనేక ప్రజాస్వామిక రాజ్యాలు రహస్య ఓటింగు పద్ధతిని ప్రవేశపెట్టినాయి. బ్యాలెట్ విధానం ద్వారా రహస్య ఓటింగు పద్ధతి అమలులోనికి వచ్చింది. ఈ పద్ధతిలో ప్రతిఓటరు తన కిష్టమైన అభ్యర్థిని బ్యాలెట్ పేపర్‌పై గుర్తించి రహస్య పద్ధతిలో నిర్ణీత పోలింగ్‌బూత్‌లోని బ్యాలెట్ బాక్స్‌లో వేయటం ద్వారా ఎన్నుకోవటం జరుగుతుంది. కాబట్టి ఓటరు ఏ అభ్యర్థికి ఓటువేసినది అతనికి తప్ప ఇతరులకు తెలిసే అవకాశం లేదు. అందువలన ఈ పద్ధతిలో ఓటర్లు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

BRAOU

### 20.5.2 పోస్టల్ మరియు ప్రాక్సీ ఓటింగు

పోస్టల్ మరియు ప్రాతినిధ్యాధికార ఓటింగు కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కల్పించబడుతుంది. సాధారణంగా ఎన్నికలలో ఓటర్లు పోలింగు కేంద్రానికి స్వయంగా వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి యుంటుంది. కాని కొన్ని సమయాలలో కొందరు ఓటర్లు తీవ్ర అనారోగ్యం కారణంగా కాని, అధికార విధుల నిర్వహణవలన కాని పోలింగు కేంద్రానికి రాలేని పరిస్థితి ఏర్పడవచ్చును. అటువంటి సమయాలలో ఆయా ఓటర్లు సంబంధిత పోలింగు అధికారి అనుమతి తీసికొని పోస్టల్ ద్వారాకాని, ప్రాక్సీ ద్వారా కాని తమ ఓటుహక్కును వినియోగించుకొనవచ్చును.

ఈపద్ధతిలో కొన్ని లోపాలు కారణంగా ఇది అంత సమర్థనీయంకాదు. బాగా అభివృద్ధి చెందిన ప్రజాస్వామిక రాజ్యాలలో దీనిని అమలుచేయవచ్చును. కాని ఈ పద్ధతిలో రహస్య ఓటింగుకు అవకాశం

ఉండదు. అదేవిధంగా కొన్ని సమయాలలో ఓటర్లు పంపించిన బ్యాలెట్ పత్రాలు సకాలంలో పోలింగ్ కేంద్రాలను చేరకపోవచ్చును.

### 20.5.3 బహుళ మరియు హెచ్చుతూకపు ఓటింగు

ప్రజాస్వామ్యంలో పౌరులందరికి ఒకేరకమైన హక్కులు, విశేషాధికారాలు ఉంటాయి. ప్రతివ్యక్తికి ఒక ఓటు మాత్రమే వేసే హక్కు యుంటుంది. కాని కొన్ని రాజ్యాలలో బహుళ లేక హెచ్చుతూకపు లేక తరతమ భావంగల ఓటింగు వ్యాప్తిలో ఉంది. బహుళ ఓటింగు పద్ధతి అంటే కొందరు వ్యక్తులకు ఒకటికంటె ఎక్కువ ఓట్లు ఉంటాయని అర్థం. ఉదాహరణకు 1893లో బెల్జియంలో బహుళ ఓటింగు పద్ధతి ప్రవేశపెట్టారు. ఆస్థి, విద్య, వృత్తి సంబంధమైన అర్హతలనుబట్టి ఓట్లు యిచ్చారు. ఉదాహరణకు కనీసం 2000 ఫ్రాంకుల భూ ఆస్థి ఉన్న వ్యక్తికి రెండుఓట్లు ఉంటాయి. అయితే ఏట్టిపరిస్థితులలోను ఒకే వ్యక్తికి మూడు ఓట్లకు మించి యుండరాదు. ప్రష్యా (నేటి జర్మనీ), బ్రిటన్ దేశాలల్లో కూడ ఈ బహుళ ఓటింగు పద్ధతి కొంతకాలం వాడుకలో యుండేది. కాని ఆతరువాత దానిని వదిలిపెట్టడం జరిగింది.

ప్రభుత్వాధికారాలు, ప్రతినిధుల ఎంపికలో ఎక్కువ అర్హతలుగల వ్యక్తులకు వారి ప్రతిభనుబట్టి హెచ్చుతూకం యివ్వాలని బహుళ ఓటింగు పద్ధతిని సమర్ధించే వారి వాదన. అంటే ఓట్లను 'తూయాలి' కాని 'లెక్కపెట్టకూడద'నేది వారి భావన. కాని ఆచరణలో ఓట్లను తూయటానికి ఒక న్యాయమైన, ఉచితమైన (Equitable) ప్రమాణాన్ని నిర్ధేశించటంలో ఎనలేని చిక్కులు ఎదురుకావటమే ఈ బహుళ ఓటింగు పద్ధతిలోని లోపంగా మనం పేర్కొనవచ్చు. ఉదాహరణకు ఆస్థిని ప్రమాణంగా తీసికొంటే రాజకీయహక్కులను సంపదతో ముడిపెట్టినట్లు అవుతుంది. అదిస్పష్టంగా ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అందువలననే అనేక రాజ్యాలలో ఈ బహుళ ఓటింగు పద్ధతి వేగంగా అదృశ్యమైపోతున్నది. నేడు దాదాపు అన్ని రాజ్యాలలో 'ఒక మనిషికి ఒక ఓటు' పద్ధతే వాడుకలో యున్నది.

## 20.6 సార్వత్రిక ఓటు హక్కు

BRAOU

వయోజన ఓటు హక్కు అనేది సార్వత్రిక న్యాయంగా మారటానికి చాలాకాలం పట్టింది. సహజహక్కులు, స్త్రీ పురుష సమానత్వం మరియు ప్రజాసార్వభౌమాధికారం వంటి భావనల ఫలితంగా 18వ శతాబ్దంలో సార్వత్రిక ఓటుహక్కును గురించి డిమాండ్ చేయటం జరిగింది. కాని ప్రారంభంలో ఓటుహక్కు అనేది సమాజంలోని కొద్దిమంది పౌరులకే పరిమితం కావటం జరిగింది. సమాజంలోని కులీనవర్గానికి, మతాధిపతులకు, ఆస్థిపరులకు, విద్యవంతులకు మాత్రమే ఓటుహక్కు యివ్వబడింది. కాని కాలక్రమంలో వచ్చిన వివిధ విప్లవాలు, ప్రజా ఉద్యమాలు కారణంగా సార్వత్రిక ఓటుహక్కు అనేది వివిధ రాజ్యాలకు వ్యాపించింది. ఈరోజున ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామిక దేశాలలో ఈ పద్ధతి అమలులో ఉంది. కుల,మత, వర్గ, లింగభేదం లేకుండా యుక్తవయస్సు చేరిన పౌరులందరికి తమ ప్రతినిధులను ఎన్నుకోవటానికి వీలుగా ఓటు హక్కు యివ్వబడింది. ఉదాహరణకు 1950లో భారత రాజ్యాంగం ప్రకారం 21 సం॥లు నిండిన భారత పౌరులందరికి ఓటుహక్కు కల్పించబడింది. ఆ తరువాతి కాలంలో ఈ వయోపరిమితిని 18 సం॥లకు తగ్గించినారు. తద్వారా ఈ రోజున 18 సం॥లు నిండిన భారత పౌరులందరు ఓటుహక్కును వినియోగించుకోవటం ద్వారా వివిధ పౌరసంస్థలకు సంబంధించిన ప్రతినిధులను ఎన్నుకో కలుగుతున్నారు.

సార్వత్రిక ఓటుహక్కుకు సంబంధించి రాజనీతి శాస్త్రవేత్తలు రెండురకాలైన భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించినారు. కొందరు సార్వత్రిక ఓటుహక్కును సమర్ధించగా, మరికొందరు వ్యతిరేకించినారు. హెరాల్డ్ జె. లాస్కీ వంటి రచయితలు సార్వత్రిక ఓటు హక్కును సమర్ధించినారు. వీరి అభిప్రాయంలో (1) ప్రజాస్వామ్యం ప్రజాసార్వభౌమాధికారాన్ని సూచిస్తుంది. కాబట్టి ఓటు హక్కు అనేది సార్వత్రికంగా యుండవలెను. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంలోనా, దానిని నియంత్రించటంలోను ప్రతివ్యక్తి పాలుపంచుకొన్నపుడే ప్రజాసార్వభౌమాధికారం వాస్తవమవుతుంది. (2) సార్వత్రిక ఓటుహక్కు అనేది వ్యక్తులు తమవ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవటానికి దోహదం చేస్తుంది. (3) సార్వత్రిక ఓటుహక్కు ద్వారా వ్యక్తులలో రాజకీయ చైతన్యం అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వ ఏర్పాటు లోపాలు పంచుకోవటం ద్వారా వారు చురుకుగాను, బాధ్యతాయుతంగాను, దేశభక్తితోను వ్యవహరించటానికి అవకాశం కలుగుతుంది. (4) ప్రజలహక్కులను, స్వేచ్ఛలను పరిరక్షించటానికి సార్వత్రిక ఓటుహక్కు ఒకసాధనంగా ఉపకరిస్తుంది. అధికారంలో యున్నవారు అధికార దుర్వినియోగానికి పాల్పడినపుడు కాని, ప్రజల స్వేచ్ఛా, హక్కులను హరించటానికి ప్రయత్నించినపుడు కాని తదుపరి ఎన్నికలలో వారిని ఓడించటం ద్వారా వారికి గుణపాఠం నేర్పటానికి సార్వత్రిక ఓటు హక్కు ఉపయోగపడుతుంది. (5) సార్వత్రిక ఓటుహక్కును ఆధారంగా చేసికొని ఆ దేశ పౌరుల నుండి విదేశీయులను ప్రత్యేకంగా గుర్తించటానికి వీలౌతుంది.

అయితే మెకాలే, లార్డ్‌బ్రైస్ వంటి రచయితలు సార్వత్రిక ఓటు హక్కును ఒక ప్రమాదకరమైన తెలివితక్కువ వ్యవస్థగా పరిగణించినారు. వారి అభిప్రాయంలో (1) సార్వత్రిక ఓటుహక్కు అజ్ఞానుల పాలనకు దారితీస్తుంది. విద్య, ఆస్థి, తెలివితేటలు వంటి అర్హతలను గుర్తించకుండా అందరికి ఓటుహక్కును కల్పిస్తే, అనర్హులు పాలకులుగా ఎన్నిక అయ్యే అవకాశం యుటుంది. (2) సార్వత్రిక ఓటు హక్కు ఒక దేశం యొక్క శాస్త్రీయ పురోగతిని నిరోధిస్తుంది. సర్ హెన్రీమెయిన్ అభిప్రాయంలో ముఖ్యమైన శాస్త్రీయ ఆవిష్కరణలు (Inventars) సార్వత్రిక ఓటుహక్కును అమలు చేయకముందే చోటుచేసికొన్నాయి. (4) విమర్శకుల అభిప్రాయంలో ఓటుహక్కు అనేది పౌరుల యొక్క స్వతస్సిద్ధమైన (inherent) హక్కుకాదు. అదిరాజ్యం ద్వారా పౌరులకివ్వబడిన ఒక విశేషాధికారం. కాబట్టి దానిని దుర్వినియోగం చేయకుండా, జాగ్రత్తగా వినియోగించవలసి యుటుంది. కాని వయోజనులందరికి ఓటహక్కును కల్పించినచో కొందరు తెలివైనవారు వానిని దుర్వినియోగం చేయవచ్చు. (4) సార్వత్రిక ఓటుహక్కు అనైతిక పద్ధతులకు అవకాశం కల్పిస్తుంది. ఓటర్లు తమ ఓట్లను అమ్ముకోవటానికి, అభ్యర్థులు ఆ ఓట్లను అమ్ముకొని అక్రమంగా ఎన్నికలలో ఎన్నికకావటానికి వీలుకలుగుతుంది. ఆవిధంగా సార్వత్రిక ఓటుహక్కు అధిక వ్యయంతో కూడుకొని యుంటుంది. (5) సార్వత్రిక ఓటుహక్కు అడవారికి కూడ సమానంగా ఓటుహక్కును కల్పిస్తుంది. కాని విమర్శకుల అభిప్రాయంలో స్త్రీలు సాధారణంగా సనాతనులు, నిరక్షరాస్యులై ఉంటారు. కాబట్టి వీరికి ఓటుహక్కును కల్పిస్తే దానిని దుర్వినియోగపరచి అసమర్థులను ఎన్నుకునే వీలుంది. అంతేగాక కుటుంబజీవనలో భిన్నాభిప్రాయాలు తలెత్తి, కుటుంబ జీవనం విచ్ఛిన్నం కావటానికి దారితీస్తుంది.

సార్వత్రిక ఓటు హక్కుపై ఎన్ని విమర్శలు తలెత్తినప్పటికి, సమకాలీన అంతర్జాతీయ సమాజంలో దీనిని రాజకీయ పరిణతికి ఒక చిహ్నంగా భావించటం జరుగుతున్నది. ఆధునిక రాజ్యాలలోని ప్రజాప్రాతినిధ్య సంస్థలకు జరిగిన ఎన్నికలలో చదువులేనివారు, నిరక్షరాస్యులు కూడ తమ ఓటు హక్కును చాలా జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా వినియోగిస్తున్నట్లు నిరూపితమైనది. తత్ఫలితంగా ఓటుహక్కును వినియోగించటానికి సార్వత్రిక ఓటుహక్కు అనేది చాలా మంచి పద్ధతిగా గుర్తింపును పొందింది.

BRAOU

## 20.7 వివిధ ప్రాతినిధ్య పద్ధతులు

ప్రాతినిధ్యాన్ని కల్పించటానికి వివిధ పద్ధతులు అమలులో ఉన్నాయి. అవి

### 20.7.1 భౌగోళిక లేక ప్రాదేశిక ప్రాతినిధ్యం

అత్యధిక రాజ్యాలలో విస్తృతంగా వ్యాప్తిలో యున్న పద్ధతి భౌగోళిక లేదా ప్రాదేశిక ప్రాతినిధ్యం. ఈ ప్రాదేశిక ప్రాతినిధ్య సూత్రం ప్రకారం మొత్తం దేశాన్ని కొన్ని ప్రాదేశిక విభాగాలుగా విభజిస్తారు. వీటిని నియోజకవర్గాలు అంటారు. ప్రతి నియోజవర్గం నుండి శాసనసభకు ఒకటి లేక అంతకు ఎక్కువ మంది ప్రతినిధుల్ని ఎన్నుకుంటారు. ప్రతిప్రాదేశిక విభాగం లేక నియోజకవర్గం సుమారు ఒకే జనాబా కలిగియుంటుంది. నియోజకవర్గం నుండి ఒకే ప్రతినిధి ఎన్నికైతే దానిని ఏక ప్రతినిధి నియోజకవర్గమని, ఒకటి కంటె ఎక్కువ మంది ప్రతినిధులు ఎన్నికైతే దానిని బహుప్రతినిధి నియోజకవర్గమని అంటారు. ఈ వ్యవస్థ సక్రమంగా, న్యాయంగా ఉండాలంటే ప్రతి జనాభా లెక్కల సేకరణ తరువాత ఈ నియోజవర్గాలకు తాజాగా సరిహద్దుల నిర్ణయం చేయాల్సి ఉంటుంది. అంతేగాక సరిహద్దులను తిరిగి నిర్ణయించే బాధ్యతలను భారతదేశంలో వలె ఒక నిష్పాక్షికమైన స్వతంత్ర సంస్థకు అప్పగించాల్సియుంటుంది.

భౌగోళిక లేక ప్రాదేశిక ప్రాతినిధ్యం సులభతరమైనది మరియు ఆచరణ సాధ్యమైనది. ఈ వ్యవస్థలో ఓటరు కేవలం ఒక నియోజకవర్గంలో ఒక ప్రతినిధిని ఎన్నుకోవటానికి ఒక ఓటు వేస్తే సరిపోతుంది. రెండవది, ఈ పద్ధతివలన శాసన సభలో ఏదో ఒకరాజకీయ పక్షానికి సుస్థిరమైన మెజారిటి రావటానికి వీలౌతుంది. తద్వారా శక్తివంతమైన, సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం సాధ్యమౌతుంది. మూడవది నియోజకవర్గం యొక్క భూభాగం పరిమితమై ఉండటంవల్ల ఓటర్లు తమ ప్రతినిధిని గురించి సన్నిహితంగా తెలుసుకోగలుగుతారు. అంతేగాక ప్రతినిధి కూడ నియోజకవర్గం సమస్యలతో నిరంతరం సాన్నిహిత్యాన్ని కలిగియుంటాడు.

ప్రాదేశిక ప్రాతినిధ్యం వలన కొన్ని ప్రయోజనాలున్నప్పటికి, ఈ పద్ధతిలో కొన్ని లోపాలు కూడ లేకపోలేదు. అవి (1) ఈ పద్ధతి వలన నియోజకవర్గంలోని అత్యధిక సంఖ్యాక ఓటర్లుకు సార్థక ప్రాతినిధ్యం లభించకపోవచ్చు. పోటీపడిన అభ్యర్థులు ఎందరైనా వారి జాబితాలో అగ్రస్థానం పొందిన వ్యక్తే ఎన్నికవుతాడు. ఇంకా పోటీచేసే పార్టీల సంఖ్య పెరిగిన కొలదీ ఒక పార్టీకి వచ్చే ఓట్లకు, సీట్లకు మధ్య అంతరం కూడ పెరిగిపోతూనే యుంటుంది. (2) ప్రాదేశిక ప్రాతినిధ్యం నియోజకవర్గం ప్రతినిధి కేవలం స్థానిక ప్రయోజనాల పరిరక్షణకే పరిమితమయ్యే ప్రమాదముంది. అందువలన విశాలమైన జాతీయ ప్రయోజనాలను పెంపొందించటానికి అతడు ఏమాత్రం శ్రద్ధ వహించక పోవచ్చును. (3) నియోజకవర్గంలో నివసించేవారు మాత్రమే పోటీ చేయాలనే షరతుకూడ ఉంటే ఈ పద్ధతివలన ఓటర్లు ఎన్నుకోటానికి లభించే అభ్యర్థుల సంఖ్యకూడ బాగా పరిమితమవుతుంది. అందువలన తరచు నాసిరకం నాయకులను శాసనసభలకు ఎన్నుకోవలసి యుంటుంది.

### 20.7.2 దామాషా ప్రాతినిధ్యం లేక నైష్పత్తిక ప్రాతినిధ్యం (Proportional Representation)

ఒక నియోజకవర్గంలోని వివిధ వర్గాలకు చెందిన ఓటర్లకు తగిన ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఏకప్రతినిధి నియోజక వర్గ వ్యవస్థలో లేదు. కనుక దానికి ప్రత్యామ్నాయంగా దామాషా ప్రాతినిధ్య పద్ధతిని



BRAOU

ప్రవేశపెట్టినారు. ఈ పద్ధతి ద్వారా ఒకరాజ్యంలోని విభిన్న అభిప్రాయాలకు, ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ఓటర్లకు వారి సంఖ్యాబలాన్ని బట్టి తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి వీలౌతుంది. దామాషా ప్రాతినిధ్యానికి సంబంధించి రెండు పద్ధతులు అమలులో ఉన్నాయి. (1) హేర్ పద్ధతి లేక ఒక ఓటును బదిలీ చేసే నైష్పత్తిక ప్రాతినిధ్యపద్ధతి (2) జాబితా పద్ధతి

1. హేర్ పద్ధతి లేక ఒక ఓటును బదిలీ చేసే నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి

హేర్ పద్ధతి ఒక ఓటును బదిలీ చేసే నైష్పత్తిక ప్రాతినిధ్యపద్ధతిని 1851లో థామస్ హేర్ అనే ఆంగ్ల రచయిత తన 'Election of Representatives' (ప్రతినిధుల ఎన్నిక) అనే గ్రంథంలో ప్రతిపాదించినాడు. ఈ పద్ధతిని మొట్టమొదటిసారిగా ఆండ్రే అనే మంత్రి 1855లో డెన్మార్క్‌లో ప్రవేశపెట్టినాడు. అందుచేత ఆ పద్ధతిని అతని పేరుమీద ఆండ్రే పద్ధతి అనికూడ అంటారు.

ఈ పద్ధతి ప్రకారం నియోజకవర్గాలు బహుప్రతినిధి నియోజకవర్గాలుగా ఉంటాయి. ప్రతి నియోజక వర్గానికి కనీసం ముగ్గురు ప్రతనిధులైనా ఉంటారు. ఓటరుకు సార్థకమైన ఓటు ఒకటే యుంటుంది. కాని పోటీలు యున్న అభ్యర్థులను ఎన్నుకోవటంలో తన ప్రాధాన్యతలను సూచించే అవకాశం అతనికి యుంటుంది. ఉదాహరణకు మూడు స్థానాలకు 6గురు అభ్యర్థులు పోటీలో యుంటే ఓటరు తనకిష్టమైన అభ్యర్థుల పేర్ల సరసన తన ప్రాధాన్యతలను సూచిస్తూ 1,2,3 అంకెలు వేయ్యాలి. బ్యాలెట్లను మొదటిసారి లెక్కించెటప్పుడు ఓటర్ల ప్రథమ ప్రాధాన్యతలను మాత్రమే పరిగణనలోనికి తీసికుంటారు. ఎన్నికవ్వాలంటే అభ్యర్థికి కొంత కోటా ఓట్లు రావాలి. ఈ కోటాను క్రింది విధంగా నిర్ణయిస్తారు.

$$\text{కోటా} = \frac{\text{పోలైన మొత్తం ఓట్లు}}{\text{స్థానాల సంఖ్య} + 1} + 1$$

ఈ ఫార్ములాను 'డ్రూప్ ఫార్ములా' అనికూడ అంటారు. ఓట్లను లెక్కించేటప్పుడు మొదట ప్రథమ ప్రాధాన్యత ఓట్లను మాత్రమే లెక్కిస్తారు. అప్పుడు అవసరమైన కోటావచ్చిన అభ్యర్థిని ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ప్రథమ ప్రాధాన్యతా ఓట్లను మాత్రమే లెక్కించే మొదటి లెక్కింపులో ఎవరికీ అవసరమైన కోటారాకపోతే అప్పుడు అందరికంటే తక్కువ ఓట్లువచ్చిన అభ్యర్థిని పోటీనుండి తప్పిస్తారు. అతని ఓట్లను రెండో ప్రాధాన్యతా సూచింపులనుబట్టి మిగతా అభ్యర్థులకు పంచుతారు. ఈక్రమం ఇలాగే అవసరమైన అందరు అభ్యర్థులూ ఎన్నికయ్యేంత వరకు కొనసాగుతుంది. ఓట్లను బదిలీ చేయటానికి మరోపద్ధతి కూడ ఉంది. ఎవరైనా అభ్యర్థికి కోటాను మించి ఓట్లువస్తే అదనపు ఓట్లను వాటిలో సూచించిన తరువాత (రెండవ) ప్రాధాన్యతను బట్టి మిగతా అభ్యర్థుల మధ్య పంచుతారు. ఇలా అదనపు ఓట్లను తరువాత ప్రాధాన్యత వారికి బదిలీ చేసే క్రమాన్ని అవసరమైనంత మంది అభ్యర్థుల ఎన్నికయ్యేంత వరకు కొనసాగిస్తూనేపోతారు.

ఈ దామాషా ప్రాతినిధ్య పద్ధతిని బ్రిటన్‌లో సామాన్యుల సభకు చెందిన నాలుగు విశ్వవిద్యాలయ నియోజక వర్గాలకు ప్రతినిధుల్ని ఎన్నుకోవటంలో ఉపయోగించారు. దక్షిణాఫ్రికాలో సెనెట్ ఎన్నికలలోను, కొన్ని పురపాలక ఎన్నికలలోను ఈ పద్ధతిని వాడతారు. భారతదేశంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ సభ్యులు మరియు రాష్ట్ర శాసనమండలుల సభ్యుల్ని ఈ పద్ధతి ప్రకారం ఎన్నుకుంటారు.

(2) జాబితా పద్ధతి (The List System)

దామాషా ప్రాతినిధ్యం లేక నైష్పత్తిక ప్రాతినిధ్యానికి సంబంధించిన మరొక పద్ధతి జాబితా పద్ధతి. ఇది రెండురకాలుగా యుంటుంది 1. కట్టడి జాబితా (Bound List), స్వేచ్ఛ జాబితా (Free List). ఏరకం



BRAOU

పద్ధతిలోనైనా ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి నియోజకవర్గానికి సంబంధించి ఒక అభ్యర్థుల జాబితాను తయారుచేస్తుంది. ఓటరు తన కిష్టమైన జాబితాకు ఓటు చేస్తాడు. ఆయా జాబితాలకు వచ్చిన ఓట్ల మొత్తాలకు తగినట్లు రాజకీయ పార్టీలకు ప్రతినిధి స్థానాలను పంచుతారు. కట్టడి జాబితా అయితే తమ జాబితాల్లో అభ్యర్థుల పేర్లు ఏ వరుసలో సమర్పించాలో ఆయా రాజకీయ పార్టీలే నిర్ణయించుకుంటాయి. పార్టీ జాబితాలో పేర్కొన్న అభ్యర్థులకు సంబంధించి తన ప్రాధాన్యతలను సూచించే అధికారం ఓటరుకు యుండదు. కాగా స్వేచ్ఛా జాబితా పద్ధతిలో తన ఓటు చేసే పార్టీ జాబితాలోని అభ్యర్థులకు సంబంధించి తన ప్రాధాన్యతలను కూడ ఓటరు సూచించవచ్చు. స్విట్జర్లాండ్ లాంటి కొన్ని దేశాల్లోనైతే ఓటర్లు జాబితాలో కాని వ్యక్తుల పేర్లను కూడ అదనపు అభ్యర్థులుగా పేర్కొనవచ్చును.

దామాషా ప్రాతినిధ్య పద్ధతిలోని సుగాణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తూనే ఉన్నాయి. ఓటింగు బలానికి తగినట్లు ప్రాతినిధ్యాన్ని అది కల్పిస్తుంది. అందువలన వివిధ అల్పసంఖ్యాక వర్గాలకు, గ్రూపులకు వాటివాటి ఓటింగు బలాన్ని బట్టి శాసనసభలో ప్రాతినిధ్యం ఖాయంగా లభిస్తుంది. దానితో అల్పసంఖ్యాక పార్టీలకు రాజకీయంగా ఒక సంతృప్తి, భద్రతాభావం కలుగుతాయి. ప్రాధాన్యతలను సూచించటంలోని అంతరార్థం ఎన్నికలకు సంబంధించిన సమస్యలను అవగాహన చేసికోవటానికి ఓటరు కొంత ఆలోచనచేయాలనే. అందువలన ఎన్నికలపట్ల పౌరులకు కొంత శ్రద్ధాసక్తులు పెంపొందుతాయి. అంతేగాక 'స్వార్థప్రయోజనాలతో నియోజకవర్గాల హద్దుల్ని అనుచితంగా మార్చివేయటాన్ని (జెర్రీమాండరింగ్‌ను) ఈ పద్ధతి అనుమతించదు. కాగా ఏకప్రతినిధి నియోజవర్గ పద్ధతిలో ఇటువంటి జెర్రీమాండరింగ్‌కు అవకాశం యుంటుందనే విషయం అందిరికి తెలిసినదే.

నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఇన్ని ప్రయోజనాలున్నప్పటికి ఈ పద్ధతిలో కొన్నిలోపాలు కూడా ఉన్నాయి. ఈ పద్ధతిలో క్లిష్టతరమైన ఓటింగు విధానాన్ని అర్థం చేసికోవటం సాధారణ ఓటరుకు అంతసులువుగా సాధ్యంకాదు. అక్షరాస్యత లేక అజ్ఞానంతో అలమటించే ప్రజలున్న దేశంలో ఈ పద్ధతిని ఆచరణలో విజయవంతంగా అమలు చేయటం చాలాకష్టం. ఈ పద్ధతి విచ్ఛిన్నకర శక్తుల్ని ప్రోత్సహిస్తుంది. ఓటర్లను, నాయకులను తమతమ వర్గప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వ్యవహరించేటట్లు ఈ పద్ధతి ప్రోత్సహిస్తుంది. జాతి సార్వత్రిక సంకల్పం ఏర్పాటుకు ఇది దోహదం చేయలేదు. అంతేగాక ప్రతిపార్టీకి తప్పనిసరిగా ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉండటంతో స్వార్థపరశక్తులు ఎప్పుడూ క్రొత్తక్రొత్త పార్టీలను సృష్టిస్తూంటాయి. దామాషా ప్రాతినిధ్య పద్ధతికి కనీసం మూడు స్థానాలైనా యుంటే బహుప్రతినిధి నియోజకవర్గాలు కావాలి. కనుక ఓటర్లకు, వారి ప్రతినిధులకు మధ్యవ్యక్తిగత సంబంధాలుండే అవకాశం చాలా తక్కువగా యుంటుంది. అంతేగాక ఏ ప్రజాస్వామ్యంలోనైనా ప్రజాభిప్రాయాన్ని కొలిచే కొలమానాల (Barometers) వంటివి ఉపఎన్నికలు. అటువంటి ఉపఎన్నికలకు ఈ దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో స్థానముండదు.

### 20.7.3 రెండో బ్యాలెట్ పద్ధతి

రెండ బ్యాలెట్ పద్ధతి కూడ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రాతినిధ్యం సమకూర్చటానికి అవకాశం కల్పిస్తుంది. ఒక స్థానానికి ఇద్దరు మాత్రమే పోటీచేసిన చోట సాధారణ మెజారిటి వచ్చిన ఎవరో ఒకరిని ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. కాని ఇద్దరికంటె ఎక్కువ మంది పోటీదారులుంటే ఈ పద్ధతి వలన పూర్తి మెజారిటి కంటె తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి ఎన్నికయ్యే వీలుంటుంది. ఈప్రత్యేక లోపాన్ని సవరించటానికి రూపొందింపబడినదే రెండో బ్యాలెట్ పద్ధతి.

B R A O U

రెండో బ్యాలెట్ పద్ధతిలో మొదటి ఎన్నిక తరువాత వెంటనే మరో రెండో ఎన్నిక జరగుతుంది. ఈక్రమంలో మొదటి ఎన్నికలో ఏ అభ్యర్థికి మెజారిటిరాని పక్షంలో అగ్రస్థానాల్లో యున్న ఇద్దరు అభ్యర్థులను మినహాయించి మిగతా అభ్యర్థులను పోటీ నుండి తప్పిస్తారు. ఆ తరువాత అగ్రస్థానాల్లోయున్న ఇద్దరు అభ్యర్థులనే యుంచి రెండోసారి ఎన్నికలు జరుపుతారు. ఈ రెండు ఎన్నికల్లో ఒక్కొక్క అభ్యర్థికి వచ్చిన ఓట్లను కూడిక చేసి ఇద్దరిలో ఎవరికి ఎక్కువ ఓట్లువస్తే వారినే ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. ఈ పద్ధతి ఫ్రాన్స్, జర్మనీలలో కొంతకాలం పాటు అమలులో ఉంది. కాని ఆ తరువాత అంతరించిపోయింది.

### 20.7.4 ప్రత్యామ్నాయ లేక ఆగంతుక ఓటు పద్ధతి (Alternative or Contingent Vote System)

ప్రత్యామ్నాయ లేక ప్రాధాన్యత సూచిక లేక ఆగంతుక ఓటింగ్ పద్ధతిలో ఒకే ఎన్నిక యుంటుంది. పోటీలో యున్న వివిధ అభ్యర్థుల పేర్ల ఎదుట తమ మొదటి, రెండవ, మూడవ ప్రాధాన్యతలను వరుసక్రమంలో సూచించే అవకాశం ప్రతిఓటరుకు యుంటుంది. ఏ అభ్యర్థికైనా మొదటి ప్రాధాన్యత ఓట్లలోనే పూర్తి మెజారిటి వస్తే అతడినే ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. అలాకాక మొదటి ప్రాధాన్యతల ప్రకారం ఏ అభ్యర్థికి పూర్తి మెజారిటి రాకపోతే అపుడు మొదటి ప్రాధాన్యతా ఓట్లలో అతి తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీనుండి తప్పించి అతని ఓట్లను వాటి రెండవ ప్రాధాన్యతల ప్రకారం మిగతా అభ్యర్థులకు పంచుతారు. ఇట్లా ఓట్లు పునఃపంపకం జరిగిన తరువాత ఏ అభ్యర్థికైతే పూర్తి మెజారిటి వస్తుందో ఆ అభ్యర్థినే ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. అప్పటికీ ఏ అభ్యర్థికి మెజారిటీ రాకపోయినట్లైతే ఇకక్రింది నుండి అభ్యర్థులను ఒకరినొకరిగా తప్పిస్తూ, వాళ్ళ ఓట్లను రెండో ప్రాధాన్యతల ప్రకారం ఇతర అభ్యర్థులకు పంచే క్రమాన్ని కొనసాగిస్తూపోతారు. ఎవరో ఒక అభ్యర్థికి పూర్తి మెజారిటి వచ్చేంతవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

### 20.7.5 వృత్తి ప్రాతినిధ్యం (Functional Representation)

ప్రాతినిధ్యం పద్ధతులలో ఇంకొకటి వృత్తి ప్రాతినిధ్యం. భౌగోళిక లేక ప్రాదేశిక ప్రాతినిధ్యంపట్ల నిరసనతో రూపొందిన ప్రత్యామ్నాయ పద్ధతిగా దీనిని పేర్కొనవచ్చు. ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో యుండే ప్రజలకు ఒకేరకమైన ప్రయోజనాలుంటాయనే భావన పై ప్రాదేశిక ప్రాతినిధ్యం అధారపడుతుంది. అయితే ప్రాదేశిక సముదాయాలకు కాక వృత్తిపరమైన లేక ఆర్థికపరమైన ప్రయోజనాలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పించటం సముచితమని వృత్తి ప్రాతినిధ్య పద్ధతిని సమర్థించేవారుగా భావిస్తారు. ప్రాతినిధ్యం 'వృత్తిపరంగా' యుండాలని, వృత్తిపరమైన లేక ఆర్థికపరమైన ప్రయోజనాలు ప్రాతిపదికపైనే వ్యక్తులకు మరింత ఖచ్చితంగా ప్రాతినిధ్యం కల్పించవచ్చని వీరివాదం. ఈ విధంగా చూస్తే వ్యవసాయదారులు, వర్తకులు, ఉపాధ్యాయులు, ఉత్పత్తిదారులు మొదలైన వారంతా తమ స్వీయ ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకునే, పెంపొందింప జూచుకొనే వివిధ వృత్తిపరమైన బృందాలకు చెందినవారు. ఇటువంటి విభిన్నమైన వృత్తిపర బృందాల విభిన్న ప్రయోజనాలను వెలుగులోకి తెచ్చి వాటికోసం గట్టిగా వాదించేందుకు వృత్తి ప్రాతినిధ్యం ప్రాతిపదికపై ఎన్నుకున్న శాసనసభే సముచితమైన వేదిక అవుతుంది.

సోవియట్ రష్యాలో వృత్తి ప్రాతినిధ్యం సోవియట్ వ్యవస్థల ద్వారా అభివ్యక్తమయింది. సోవియట్ యూనియన్‌లో శాసనసభ్యులు తమను ఎన్నుకున్న ఆయా జిల్లాలకు (ప్రాంతాలకు) కాక కొన్ని ప్రత్యేక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించేవారు. ఇటలీలో వృత్తి ప్రాతినిధ్య పద్ధతిని ముస్సోలిని ప్రవేశపెట్టినాడు. అక్కడ సెనెట్‌ను తదనుగుణంగా పునర్వ్యవస్థీకరించినాడు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ ఇండియాలో

B R A O U

భూస్వాములు, శ్రామికులు, ఉపాధ్యాయులు మొదలైన వృత్తిపరమైన బృందాలకు కొంతవరకు ప్రాతినిధ్యం కల్పించినారు.

అయితే వృత్తి ప్రాతినిధ్య పద్ధతిలో అనేక లోపాలు ఉన్నాయి 'వృత్తి ప్రాతినిధ్యం ఒక భ్రమ, ఒక తప్పుడు సూత్రం. అది సంఘర్షణలకు, గందరగోళానికి, చివరకు అరాచకానికి దారి తీస్తుంది' అని ఆచార్య ఎస్మీన్ విమర్శించినాడు. ఆచరణలో శాసనసభలో ప్రాతినిధ్యం కల్పించబడాల్సిన వృత్తులను గుర్తించటం ఎంతో కష్టం. ప్రాతినిధ్యకల్పనకు తగిన అవకాశం కల్పించలేని వృత్తులు ఈ సమాజంలో అనేకం ఉన్నాయి. పై పెచ్చు జాతీయ సార్వభౌమత్వ సూత్రానికి, వృత్తిప్రాతినిధ్యానికి అసలు పొసగదు. ప్రజలు తమ సంకుచిత వృత్తి ప్రయోజనాలకు ప్రాముఖ్యమిచ్చి జాతీయ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసేటట్లు చేస్తుంది. ఈ వృత్తి ప్రాతినిధ్య పద్ధతి. అంతేగాక అనేక వృత్తిపరమైన సమూహాలుండటంతో వాటికి అనుబంధంగా అసంఖ్యాకమైన రాజకీయ పార్టీలు ఆవిర్భవించి ప్రభుత్వ అస్థిరతకు దోహదం చేయవచ్చు.

ప్రధానంగా ఇన్నిలోపాలుండటం వలననే వృత్తి ప్రాతినిధ్య పద్ధతిని వదలిపెట్టడం జరిగింది. దానిస్థానంలో సామాన్య పౌరులుగా సమస్యలను గురించి ఓటర్లు యోచించేటట్లు చూసే ప్రాదేశిక ప్రాతినిధ్య పద్ధతినే ఎక్కువగా అనుసరించటం జరుగుతున్నది.

## 20.7.6 అల్పసంఖ్యాక ప్రాతినిధ్యం (Minority Representation)

ప్రజాస్వామ్యమంటే ప్రజలందరి పాలన అనే అర్థాన్ని సూచించినప్పటికి వాస్తవానికి అది అధిక సంఖ్యాకుల పాలన మాత్రమే. కనుకనే అధిక సంఖ్యాకుల అగడాలకు అల్పసంఖ్యాక వర్గం ప్రయోజనాలు దెబ్బతినకుండా కాపాడటానికిగాను శాసనసభల్లో అల్పసంఖ్యా వర్గాలకు తగినప్రాతినిధ్యం కల్పించవలసిన అవసరం ఉందని రాజనీతి శాస్త్రజ్ఞులు గుర్తించినారు. అల్పసంఖ్యాక వర్గాలు అనేక రకాలుగా రాజకీయ, జాతీయ , జాతిపర, భాషాపర, కుల, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలుగా యుండవచ్చు. ఇటువంటి అల్ప సంఖ్యాక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించటానికి అనేక పద్ధతులను రూపొందించారు. ఇంతకు పూర్వం మనం చర్చించిన దామాషా ప్రాతినిధ్య పద్ధతి వీటిలో ఒక ముఖ్యమైన పద్ధతి. ఇది కాక ఇంకా అనేక ఇతర పద్ధతులున్నాయి. వాటిలో కొన్ని :

BRAOU

**1. పరిమిత ఓటు పద్ధతి (The Limited Vote System)** : ఈ పద్ధతి ఏకప్రతినిధి నియోజక వర్గాలలో వీలుపడదు. దీనికి బహుప్రతినిధి నియోజకవర్గాలు అవసరం. దీని ప్రకారం ప్రతి ఓటరు అభ్యర్థులకు పరిమిత సంఖ్యలో మాత్రమే ఓటు వేయ్యాలి. అంటే ఎన్నుకోవాల్సిన ప్రతినిధుల స్థానాల సంఖ్యకంటె తక్కువ మందికి మాత్రమే ఓటువేయ్యాలి. ఉదాహరణకు, ఒక నియోజకవర్గంలో ఆరు స్థానాలుంటే ప్రతి ఓటరుకు కేవలం 5 లేక అంతకు తక్కువ ఓట్లు మాత్రమే ఉండవచ్చు. ఈ కారణంగా మైనారిటి పార్టీలకు ప్రతి నియోజకవర్గం నుండి కనీసం ఒకటి, రెండు స్థానాలైనా లభించే అవకాశం ఉంటుంది.

ఇటలీ, బ్రిటన్, పోర్చుగల్, జపాన్ దేశాలలో దిగువ సభలకు జరిగే ఎన్నికలలో ఈ పరిమిత ఓటు పద్ధతిని వివిధ సమయాలల్లో ఉపయోగించి చూశారు. అయితే ప్రస్తుతం దీనిని ఎక్కడా అనుసరించటం లేదు.

**2. సంచిత ఓటు పద్ధతి (The Cumulative Vote System)** : ఈ పద్ధతిలో కూడ బహుప్రతినిధి నియోజకవర్గాలే ఉంటాయి. నియోజకవర్గంలో ఎన్నిస్థానాలుంటే అన్ని ఓట్లు వేసే హక్కు ఓటరుకుంటుంది.

అయితే ఓటరు తన ఓట్లను పోటీలోయున్న వివిధ అభ్యర్థుల మధ్య పంచవచ్చు లేక ఒకే అభ్యర్థికి యివ్వవచ్చు. ఇందుమూలంగా అల్పసంఖ్యాక వర్గాలవారు తమ ప్రతినిధులకే అన్ని ఓట్లువేసి కొందరినైనా గెలిపించుకో గలుగుతారు. ఈ పద్ధతిని జనం వాడుకలో 'గుప్పించే పద్ధతి' (Plumping System) అనికూడ అనటం కద్దు. బ్రిటన్‌లో పాఠశాల నిర్వహణాధికారుల (స్కూల్ బోర్డుల) ఎన్నికలలోనూ, అమెరికాలో కొన్ని రాష్ట్రాలలో స్థానిక అధికారుల ఎన్నికలలోను ఈ పద్ధతిని వాడి చూశారు.

3. కుల,మత ప్రాతినిధ్యం (Communal Representation) : మనదేశంలో కులమత ప్రాతినిధ్యపద్ధతిని బ్రిటిష్ పాలనలో ప్రవేశపెట్టినారు. అది రెండు రకాలు (1) ప్రతిజన సముదాయపు ఓటర్లు అదే జన సముదాయపు అభ్యర్థులకు ఓటు చేసే ప్రత్యేక నియోజక గణాల పద్ధతి. అంటే హిందూ ఓటర్లు హిందూ అభ్యర్థికి, ముస్లీం ఓటర్లు ముస్లిం అభ్యర్థికి ఓటుచేస్తారు. (2) సంయుక్త నియోజకవర్గాలలో సీట్ల రిజర్వేషన్. అంటే సంయుక్త లేక సమిష్టి నియోజకవర్గాలలో కుల లేక మతపరమైన అల్పసంఖ్యాకవర్గాలకు కొన్ని స్థానాలను ప్రత్యేకంగా కేటాయించటం. ఉదాహరణకు భారతరాజ్యంగంలోని 330, 332 ప్రకరణాల ప్రకారం లోక్‌సభలోను, రాష్ట్ర శాసనసభలలోను షెడ్యూల్డ్ కులాలు, తెగలవారికి కొన్నిసీట్లు ప్రత్యేకంగా కేటియించబడుతున్నాయి.

కుల, మత ప్రాతినిధ్యానికి అనుకూలంగా ఎన్ని వాదనలున్నప్పటికి దానిలో కూడ కొన్ని లోపాలున్నాయి. అది దేశాన్ని పరస్పరం అనుమానిస్తూ, అసహ్యించుకుంటూ యుండే వివిధ కులమతవర్గాలుగా చేర్చివేస్తుంది. ప్రజలు జాతీయ ప్రయోజనాలను ప్రక్కనపెట్టి కుల, మత ప్రాతిపదికను ఆలోచించటానికి అలవాటుపడతాయి. ఇందుమూలంగా విచ్ఛిన్నకరధోరణులకు ప్రోత్సాహం లభిస్తుంది.

## 20.7.7 ఆదేశిత ప్రాతినిధ్యం (Instructed Representation)

ఆదేశిత ప్రాతినిధ్య పద్ధతని బెంథామె, జేమ్స్‌మిల్‌లు ప్రదిపాదించి, గట్టిగా సమర్ధించినారు. ఈపద్ధతి ప్రకారం శాసన సభ్యుడు (ప్రజాప్రతినిధి) ఓటర్ల ఉత్తర్వులనందుకొనే ఒక ప్రతినిధి మాత్రమే. అంటే ప్రజాప్రతినిధి ఓటర్లవాణిని వినిపించే ప్రతినిధిగా మాత్రమే యుంటాడు. ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు తమ నియోజకవర్గాల నుండి ఉత్తర్వులు పొందవలసి యుంటుంది. తమ ఓటర్లు యిచ్చిన ఆదేశాల ప్రకారమే వారు శాసనసభలో ప్రవర్తించాల్సి యుంటుంది. ఓటర్ల అభీష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ప్రజాప్రతినిధులను తిరిగి వెనక్కిపిలచే అధికారం ఓటర్లకు యుంటుంది.

అధునిక పార్టీ వ్యవస్థ ఆవిర్భావంతో ఆదేశిత ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత లేకుండా పోయిందని చెప్పవచ్చు. ఈ రోజుల్లో శాసనసభ్యులు అత్యధిక భాగం పార్టీల ప్రతినిధులుగా ఉంటున్నారు. వారివారి పార్టీలు నిర్ణయించే కార్యక్రమాలు, విధానాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అగత్యం వారికుంది. ఆవిధంగా ప్రజాప్రతినిధులకు చాలా తక్కువ స్వేచ్ఛను వదలిపెడుతూ ఆదేశిత ప్రాతినిధ్యం ఒక క్రొత్తరూపంలో అవతరించిందని చెప్పవచ్చు.

ప్రతి ప్రజాస్వామ్య దేశంలో ప్రతినిధుల ఎంపిక కోసం నిర్ణీత కాలాల్లో ఎన్నికలు జరుగుతాయి. ఎవరో ఒక ప్రత్యేకవ్యక్తి లేక వర్గంకాక ప్రజలందరూ కలసి ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నిర్వహిస్తారు. ఈవిధంగా ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా ప్రభుత్వ యంత్రాంగంలో పాల్గొనగలుగుతారు.

BRAOU

ఓటుహక్కు ఉన్న ప్రజలు నిర్ణీతకాలాలకు ప్రతినిధుల్ని ఎన్నుకుంటారు. ప్రతినిధుల్ని ఎన్నుకునే పద్ధతులు అనేకం ఉన్నాయి. అల్పసంఖ్యాక వర్గాలకు కూడ తగిన ప్రాతినిధ్యం కలిగించటానికి అనేక పద్ధతులను ప్రవేశపెట్టారు. ఫలితంగా అధిక సంఖ్యావర్గం ఆధిక్యంతో నిమిత్తం లేకుండా అల్పసంఖ్యాక వర్గాలవారు కూడ దేశపాలనలో 'తగువాటా' పొందగలగుతున్నారు. ప్రజాస్వామ్యమంటే కేవలం మెజారిటి ప్రభుత్వమని మాత్రమే అర్థంకాదు. సమాజంలోని ప్రజలందరి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని అది వ్యవహరించాలి. ఈ లక్ష్యసాధనకే వివిధ ప్రాతినిధ్యపద్ధతులను రూపొందించటం జరిగింది.

## 20.8 క్లుప్తంగా

నేడు అనేక దేశాల్లో వాడుకలోయున్న ప్రాతినిధ్య ప్రజాస్వామ్యపు ప్రధాన లక్షణం శాసనసభలకు నిర్ణీత కాలానికి ప్రతినిధులను ఎన్నుకోవటం. 20వ శతాబ్దానికి పూర్వం ప్రతినిధుల ఎన్నికలో పాల్గొనే హక్కును సమాజంలోని కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితం చేయటం జరిగింది. కాని 20వ శతాబ్ధంలో కుల, మత, వర్గ, లింగపరమైన భేదాలు లేకుండా పౌరులందరికి ఓటు హక్కును కల్పించినారు. తమ ప్రతినిధులను ఎన్నుకునే అధికారంగల పౌరుల్ని 'ఓటర్లు' లేక 'ఎన్నికదారులు' అని అంటారు. ఇటువంటి ఓటర్ల సమూహాన్ని 'ఎన్నిక బృందం' అంటారు. ఓటర్లు తమప్రతినిధుల్ని ప్రత్యక్షంగా కాని లేక పరోక్షంగా అంటే నియోజకగణం ద్వారాకాని ఎన్నుకుంటారు. ఓటరు బాహాటంగా కాని లేక రహస్య బ్యాలెట్ ద్వారా కాని ఓటు చేస్తాడు. ఓటు వేయటం ద్వారా ఓటరు తన ప్రతినిధిని శాసనసభకు ఎన్నుకుంటారు.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక ప్రాతినిధ్యం. ఇది అనేకరూపాల్లో యుంటుంది. అది ప్రాదేశిక లేక భౌగోళిక, దామాషా లేక వృత్తి ప్రాతినిధ్యం కావచ్చు. అంతేగాక రాజకీయ, జాతీయ, జాతిపరమైన, భాష, కుల, మతపరమైన అల్పసంఖ్యాక వర్గాలకు కూడ తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి అవకాశాలు కల్పించినారు. అల్పసంఖ్యాక వర్గాల ప్రాతినిధ్యానికి సంచిత ఓటు పద్ధతి, పరిమిత పద్ధతి, కులమత ప్రాతినిధ్యం వంటి విధానాలను రూపొందించారు. కొన్ని సమయాలల్లో ప్రాతినిధ్యం ఆదేశిత ప్రాతినిధ్యంగా కూడ యుండవచ్చు. అంటే ప్రజాప్రతినిధి సమయ సమయానికీ తన నియోజకవర్గం ఓటర్లు యిచ్చే ఆదేశాలను బట్టి వ్యవహరించాలని దీని అంతరార్థం. ఇటువంటి వివిధ పద్ధతుల ద్వారా ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఈ ప్రతినిధులు తమవంతుగా సమాజంలోని ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పరిపాలిస్తారు. ప్రజాస్వామ్యానికి ప్రాతిపదిక ప్రాతినిధ్యం. ప్రభుత్వం సమకూర్చే ప్రాతినిధ్య స్వభావంపై ప్రజాస్వామ్యం యొక్క స్వభావం ఆధారపడి యుంటుంది.

## 20.9 చదువదగిన పుస్తకాలు


K.R. Acharya (Ed.) : A Text Book of Political Science

A.C. Kapoor : Principles of Political Science


BRAOU

## 20.10 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము**

1. నేడు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సాధారణంగా అనుసరించే వివిధ ప్రాతినిధ్య పద్ధతులను గురించి వివరించుము.

2. 'దామాషా ప్రాతినిధ్య పద్ధతి' లేక 'నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి'అనగానేమి ? దానిమంచి, చెడులను విమర్శనాత్మకంగా పరిశీలించుము.

3. అల్పసంఖ్యాక ప్రాతినిధ్యానికి సంబంధించిన వివిధ పద్ధతులను వివరించుము. వాటి గుణగుణాలను విమర్శనాత్మకంగా పరిశీలించుము.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులివ్వండి.**

1. ఎన్నిక బృందం

2. భౌగోళిక (లేక) ప్రాదేశితప్రాతినిధ్యం

3. వృత్తి ప్రాతనిధ్యం

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

B R A O U

# భాగం-21 : శాసనసభ - ఏకశాసనసభ, ద్విశాసనసభ

## విషయ సూచిక


21.0 లక్ష్యాలు

21.1 పరిచయం

21.2 ఏకశాసనసభ, ద్విశాసనసభ - అర్థవివరణ

21.3 ద్విశాసనసభ వ్యవస్థ - చారిత్రక పరిణామం

21.4 ఏకశాసనసభ - లాభాలు

21.5 ఏకశాసనసభ - లోపాలు

21.6 ద్విశాసనసభ - లాభాలు

21.7 ద్విశాసనసభ - లోపాలు

21.8 ఎగువశాసనసభ అధికారాలు - ఇటీవల పరిణామాలు

21.9 రెండు శాసన సభల మధ్య సంబంధాలు

21.10 క్లుప్తంగా

21.11 చదవదగిన పుస్తకాలు

21.12 నమూనా ప్రశ్నలు


## 21.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- ఏక, ద్వి శాసనసభల అర్థాన్ని తెలుపగలరు
- ద్విశాసనసభల చారిత్రక పరిణామాన్ని వివరించగలరు
- ఏక, ద్విశాసనసభల లాభాలను, లోపాలను విశదీకరించగలరు
- రెండు సభలకు మధ్యగల సంబంధాన్ని గురించి చర్చించగలరు.

## 21.1 పరిచయం

ఈ భాగాన్ని అధ్యయనం చేయటం ద్వారా ఏక శాసనసభకు, ద్విశాసన సభకు మధ్యగల భేదాలను మీరు గుర్తించగలరు. అదేవిధంగా ఏకశాసనసభ, ద్విశాసనసభల వలన చేకూరే లాభాలను, వాటిలోని లోపాలను మీరు తెలిసికోగలరు.

B R A O U

## 21.2 ఏకశాసన సభ, ద్విశాసనసభ - అర్ధ వివరణ

'ఏకశాసనసభ' 'ద్విశాసనసభ' అనేభావనలు శాసనసభల నిర్మాణానికి, వ్యవస్థీకరణకు సంబంధించినవి. శాసన నిర్మాణానికి సంబంధించి ఒకే శాసనసభ యుంటే దానిని 'ఏకశాసనసభ'యని, రెండు శాసనసభలుంటే దానిని 'ద్విశాసనసభ'యని అంటారు. ఏకశాసన సభ వ్యవస్థ న్యూజిలాండ్, డెన్మార్క్, స్వీడన్, గ్రీసు, టర్కీ, యుగోస్లావియా, బల్గేరియా, కొన్ని కెనడా రాష్ట్రాలు, కొన్ని స్విస్ (స్విట్జర్లాండ్ దేశానికి చెందిన) కాంటన్లు మరియు భారతదేశానికి చెందిన కొన్ని రాష్ట్రాలలో ప్రాచుర్యంలో ఉండగా, ద్విశాసనసభ బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా, భారదేశాలలో వాడుకలో ఉంది.

ద్విశాషనసభలోని రెండు సభలను ఎగువసభ, దిగువసభ అని పిలుస్తారు. దిగువసభ ప్రజలు నేరుగా ఎన్నుకున్న ప్రతినిధులతో కూడియుంటుంది. సాధారణంగా రెండు సభలలోకి దిగువసభే శక్తివంతంగా యుంటుంది. సామాన్యంగా ప్రభుత్వ ఖర్చులను మంజూరు చేసే లేక పన్నులు విధించే అధికారాలు దిగువసభకే ఉంటాయి. పైగా పార్లమెంటరీ ప్రభుత్వ విధానం అమలులో ఉన్నదేశాలలో అది మంత్రుల చర్యలను, విధానాలను నియంత్రించే అధికారాన్ని కలిగి ఉంటుంది. ఇక ఎగువ సభలైతే సాధారణంగా ప్రత్యక్ష జనప్రియ ఎన్నికలు తప్పించి మరింకే ప్రాతిపదిక మీదనైనా ఏర్పడితాయి. ఈవిధంగా కొన్నింటికి పౌరసత్వంగా సభ్యత్వం యుంటే (బ్రిటన్‌లో ప్రభువుల సభ), మరికొన్నింటిలో సభ్యులను నామినేషన్ ద్వారా జీవిత కాలానికి నియమిస్తారు (కెనడాలో సెనేట్, ఫాసిజం యున్నప్పుడు, అంతకు పూర్వం ఇటలీలో వాడుక). కొన్నింటిని పరోక్షంగా ఎన్నుకుంటే (ఐర్లండ్, అయిదవ ఫ్రెంచి రిపబ్లిక్‌లలోని సెనేట్లు, 1913లో పదిహేడవ రాజ్యాంగ సవరణకు ముందు అమెరికా సంయుక్త రాష్ట్రాల సెనేట్) మరికొన్నింటిని ప్రజలుప్రత్యక్షంగా ఎన్నుకుంటారు (ఆస్ట్రేలియా మరియు 1913 తర్వాత అమెరికా సెనేట్‌లు). అంతేగాక ఎగువ సభ సభ్యుల వయోపరిమితి దిగువసభకు ఎన్నికయ్యే ప్రతినిధుల కంటే సాధారణంగా ఎక్కువగా ఉంటుంది. కొన్నిదేశాలలో (కెనడా) ఎగువసభ సభ్యులకు కొంత కనీస మొత్తంలో ఆస్థిపాస్తులు కూడా ఉండవలసియుంటుంది. లేదా నిర్దేశించబడిన కొన్ని వృత్తుల్లో దేనినో ఒకదానిని అవలంబించే వారుగా - ఉదాహరణకు పరిపాలనాధికారులుగా, మేధావులు, శాస్త్రజ్ఞులు లేక ప్రఖ్యాత సాహితీవేత్తలుగా గుర్తింపుపొంది కాని లేదా భారీ పన్ను చెల్లింపుదారులుగా కాని ఉండాల్సియుంటుంది. భారతదేశంలో రాష్ట్రపతి సాహిత్య, విజ్ఞాన, కళా, సంఘ సేవారంగాలలో ప్రత్యేక ప్రతిభ లేక వ్యవహారాలనుభవంగల పన్నెండెమంది సభ్యులను రాజ్యసభ (ఎగువసభ)కు నామినేషన్ ద్వారా నియమించవచ్చు.

## 21.3. ద్విశాసనసభా వ్యవస్థ - చారిత్రక పరిణామం

చారిత్రకంగా చూస్తే ఆధునిక కాలంలో ద్విశాసనసభావ్యవస్థ అభివృద్ధి చెందటానికి ప్రాతిపదికగా 'పార్లమెంటులకు తల్లి' గా పరిగణింపబడే బ్రిటిషు పార్లమెంటును పేర్కొనవచ్చు. అయితే బ్రిటన్‌లో ద్విశాసన సభా వ్యవస్థ ఒక పద్ధతి ప్రకారంకాక చారిత్రక పరిణామ క్రమంలో భాగంగా అవతరించిందని చెప్పవచ్చు.

ఇంగ్లండులో సాంప్రదాయకంగా ఒక వివేకవంతుల మండలి లేక మహామండలి అనేది ఉంటూవచ్చింది. క్రొత్త పన్నులు విధించటానికి రాజు ఈ మహామండలి అనుమతిని పొందవలసి యుండేది. ఈ మహామండలి నుండే ఆ తరువాత కాలంలో బ్రిటిషు పార్లమెంటు ఆవిర్భవించింది. మొదట్లో ఈ



BRAOU

మహామండలి ఒకేసభగా సమావేశమవుతూ ఉండేది. కాని కాలక్రమంలో అది సమాజంలో చోటు చేసికొన్న మూడు వర్గాలు లేక ఎస్టేట్లకు ప్రాతినిధ్యం వహించే మూడు బృందాలుగా ఏర్పాటు చేయబడింది. కులీన ప్రభువులు, మతగురువులు, సామాన్యులే ఈ మూడు వర్గాలవారు. అయితే కాలక్రమంలో క్రొత్త సమీకరణాలు చోటుచేసికొన్నాయి. అనేక ఉమ్మడి ప్రయోజనాలను కలిగి ఉండటం, మహామండలిలో కలసి పనిచేయటానికి అలవాటుపడటం మూలంగా ఉన్నత కులీన ప్రభువులు, మతగురువులు క్రమంగా ఒకేసభగా ప్రభువుల సభగా రూపొందారు. దిగువస్థాయి మతగురువులు ఎటూ ఇమడలేక కాలక్రమేణా అసలు పార్లమెంటుకు హాజరుకావటమే మానుకున్నారు. క్రింది స్థాయి ప్రభువులు తమకు యోధులు, పట్టణపౌరులతో ఒకేరకమైన ప్రయోజనాలున్నాయని గుర్తించి సామాన్యుల సభగా ఏర్పడ్డారు. ప్రభువుల సభ సభ్యులు వ్యక్తిగత తాఖీదులు అందినపుడు హాజరయ్యేవారు. ఈవిధంగా వారు వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించి భూస్వామ్య సూత్రాలకు ప్రతీకలుగా ఉండేవారు. కాగా సామాన్యుల సభ సభ్యులు ప్రాతినిధ్య హోదాలో హాజరయ్యేవారు. ఈవిధంగా వారు ప్రాంతాలవారీ ప్రాతినిధ్యానికి సంబంధించిన ఆధునిక సూత్రాల ఆవిర్భావానికి దోహదం చేసినారు. అయితే ఈ పద్ధతి ఖచ్చితంగా ఎప్పుడు, ఏవిధంగా అమలులోనికి వచ్చిందో చెప్పటం మాత్రం కష్టం. ఆయాకాలాల్లో ఇంగ్లండులో చోటుచేసికొన్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఫలితంగా రూపొందిన యాదృచ్ఛిక పరిణామంగా మనం పేర్కొనవచ్చు.

ద్విశాసనసభను ఏర్పాటు చేసికొన్న తర్వాత దేశం అమెరికా సంయుక్త రాష్ట్రాలు. సెనేట్, ప్రతినిధుల సభ అనే రెండు సభలుండే ఒక జాతీయ శాసనసభను సృష్టించుకోవాలనే విషయంలో ఫిలడెల్ఫియా సదస్సుకు హాజరయిన సభ్యులనడుమ పెద్దగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాలేదు. దీనికి ప్రధాన కారణం అప్పుడా సభ్యులమధ్య నెలకొనియున్న రాజీధోరణి. అదేలేకుంటే బహుశా అమెరికన్ వలస రాష్ట్రాల మధ్య సమైక్యతే సాధ్యంకాక పోయేదేమో. శాసనసభలోని ఏదో ఒకసభలో తమ పూర్వహోదాలకు భద్రత కల్పించి, రాజ్యాంగ బద్ధంగా తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తే తప్ప అంతవరకు స్వతంత్రంగా, సార్వభౌమాధికారంతో వ్యవహరించే రాష్ట్రాలు సమాఖ్యలో చేరటానికి అంగీకరించని పరిస్థితి అది. మరోవైపు, తమ సంఖ్యాబలానికి తగినట్లుగ ప్రాతినిధ్యం లభిస్తే తప్ప క్రొత్త రాజ్యాంగంలో భాగస్వాములు కావటానికి పెద్దరాష్ట్రాలు అంగీకరించలేదు. అంతేగాక కొన్ని ఆర్థిక కారణాలవలన కూడ అమెరికా రాజ్యాంగ నిర్మాతలు ద్విశాసనసభను ఏర్పాటు చేసికోవలసిన అవసరం కలిగింది. దేశంలో జనసాంద్రత ఎక్కువగా యున్న ఉత్తరాది ప్రాంతం ప్రధానంగా వాణిజ్యప్రయోజనాలను కలిగియుంటే, జనసాంద్రత బాగా తక్కువగా యున్న దక్షిణాది ప్రాంతం వ్యవసాయాధారంగా యుండేది. అందువలన సెనేట్‌ను ఏర్పాటు చేయటం ద్వారా ఆస్థిపరవర్గాలను, ప్రతికూల పరిస్థితులలో యున్నవారు తమస్వప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని దోపిడి చేయకుండా నివారించటానికి వీలౌతుందని ఆస్థిపరవర్గాలు భావించాయి. పైగా అత్యధికుల పాలన కొన్ని సమయాల్లో నిరంకుశత్వానికి దారి తీయవచ్చుననే భయాందోళనలు కూడ అమెరికా రాజ్యాంగ నిర్మాతలకు యుండేది. అందువలన వారు అటువంటి ప్రజాస్వామ్యకల్లోలానికి మితవాద అడ్డుకట్టుగా సెనేట్‌ను నెలకొల్పాలని భావించినారు.

అయితే అమెరికాలో ద్విశాసన సభ ఏర్పాటుతో ఇక ఆ వ్యవస్థ సార్వత్రికంగా వ్యాప్తిలోనికి రావటానికి రంగం సిద్ధమైందని భావించరాదు. 18వ శతాబ్దంలోను, 19వ శతాబ్దపు తొలిభాగంలోను ద్విశాసన సభా వ్యవస్థకంటె ఏక శాసనసభలపట్లే ఎక్కువ మొగ్గు చూపేవారు. అమెరికాలో సుప్రసిద్ధ రాజకీయ నాయకుడు బెంజిమిన్ ఫ్రాంక్లిన్ ఏకశాసన సభావ్యవస్థను బలంగా సమర్థించినాడు. ప్రధానంగా ఆయన ప్రభావంవల్లే

BRAOU

పెన్సిల్వేనియా రాష్ట్ర శాసనసభ దాని మొదటి రాజ్యాంగం ప్రకారం ఏకశాసనసభా సూత్రంపై ఏర్పాటయ్యింది. అదేసమయంలో ఇంగ్లాండ్‌లో బెంథామె ఏకసభా పార్లమెంటు కావాలని వాదించాడు. ఫ్రాన్సులో విప్లవ సమయంలో ఏకశాసన సభావ్యవస్థకు ఎక్కువమంది మద్ధతాదారులుండేవారు. అందువలననే 1791, 1793 సంవత్సరాల ఫ్రెంచి రాజ్యాంగాలు ఏకశాసనసభలనే ఏర్పాటు చేశాయి.

కాని ఆ తరువాత కాలంలో చోటు చేసికొన్న యదార్థ అనుభవాలు ఏకశాసన సభావాదానికి వ్యతిరేకంగా ఉన్నాయి. కనుక మొదట్లో ఏకశాసనసభ వ్యవస్థను అనుసరించిన దేశాలు కూడ తమ అనుభవాలను ఆధారంగా చేసికొని ద్విశాసన సభావ్యవస్థనే ఎంపిక చేసికున్నాయి. ద్విశాసన సభా వ్యవస్థవలె ఏకశాసన సభా వ్యవస్థ లోతుగా వేళ్లునుకొనలేకపోయింది. ఫ్రాన్సులో ద్విశాసన సభా వ్యవస్థ 1795లో ప్రారంభించబడి 1848 వరకు కొనసాగింది. ఆతర్వాత మరల కొంతకాలంపాటు ఏకశాసన సభా వ్యవస్థ నెలకొన్నది. పెన్సిల్వేనియా రాష్ట్రంలో కూడ ఏకశాసనసభా వ్యవస్థ 1800 దాకా కొనసాగింది. ఆ తరువాత అక్కడ కూడ ద్విశాసనసభా, వ్యవస్థ ప్రవేశ పెట్టబడింది. ఇతర దేశాలు కూడ ముఖ్యంగా స్పెయిన్, పోర్చుగల్, నేపల్స్, మెక్సికో మరి అనేక ఇతర దేశాలు కూడ కొంతకాలంపాటు ఏకశాసనసభ వ్యవస్థలను ప్రయత్నించి చూసిన తరువాత తిరిగి ద్విశాసన సభావ్యవస్థనే చేపట్టాయి. అయితే నార్వే, ఇజ్రాయిల్ వంటి కొన్ని దేశాలు నేటికి ఏకశాసనసభా వ్యవస్థలనే అనుసరిస్తున్నాయి.

ప్రభుత్వానికి సంబంధించిన శాసన నిర్మాణ అంగపువ్యవస్థీకరణలో ద్వంద్వత్వాన్ని అధిగమించి "ఏకత" ను సాధింస్తుందనేది ఏకశాసన సభావ్యవస్థకు అనుకూలంగా చేసే ప్రధానవాదం. రెండులేక మూడు సభలుంటే, రెండు లేక మూడు సార్వభౌమికశక్తులున్నట్లు అర్థమవుతుందని ఈవాదం భావన. పైగా ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో జనప్రియంగా ఎన్నికైన నిజమైన ప్రాతినిధ్య సభకు అప్రజాస్వామికంగా ఎన్నికైన నామినేషన్ ద్వారా నియమితమైన ఎగువసభ అడ్డుకట్టలు వేయటం, కాలయాపనా చర్యలు చేపట్టడం సమంజసం కాదని వీరివాదన. అంతేగాక రెండు సభల నడుమ ప్రతిష్టంభనలు ఏర్పడటం, ప్రత్యేకించి ఎగువసభ కులీనవర్గాలకు, సనాతనవాదులకు ప్రాతినిధ్యంవహించేటప్పుడు మరింత ఎక్కువగా ప్రతిష్టంభనలు చోటుచేసికోవటం సమర్థనీయంకాదని వీరివాదన. శాసన నిర్మాణ బాధ్యతలు విభజితం కావటం వలన శాసన నిర్మాణక్రమంలో ఎదురయ్యే వైఫల్యాలకు, కాలయాపనలకు ఈరెండు సభలూ ఒకదానినొకటి నిందించుకోవటం అలవాటై పోయింది.

## 21.4 ఏకశాసనసభ - లాభాలు

ఏకశాసన సభావ్యవస్థ వలన క్రింది లాభాలున్నాయని చెప్పవచ్చు.

(1) ఏకశాసన సభావ్యవస్థ తక్కువ ఖర్చుతో కూడుకొని యుంటుంది. ఒకే శాసనసభ యుండుట వలన దాని నిర్వాహణకు, శాసనసభ్యుల జీతభత్యాలకు అయ్యేఖర్చు తక్కువగా ఉంటుంది.

(2) ఏక శాసనసభ సరియైన చర్యలను సకాలంలో తీసికోవటానికి సహాయకారిగా యుంటుంది. ఆవిధంగా అది సత్వర చర్యలకు దోహదం చేస్తుంది.

(3) ఒకేశాసనసభ వలన శాసన నిర్మాణ ప్రక్రియలో అదేపనిని తిరిగి చేయటం, బాధ్యతల విషయంలో గందరగోళం బాగా తగ్గిపోతుంది.

BRAOU

(4) ఏకశాసనసభ అభ్యుదయకరమైన శాసన నిర్మాణానికి అనుకూలమైనది. ఏకశాసనసభ వ్యవస్థలో శాసన నిర్మాణ సభ ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఏర్పాటవుతుంది. ప్రజాప్రతినిధులు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తారు. కాబట్టివారు రూపొందించిన శాసనాలను ప్రజలు ఆమోదించటమేగాక వాటిని శిరసావహిస్తారు.

(5) కార్యనిర్వాహక శాఖ నియంతృత్వ ధోరణులను నిరోధించటానికి ఏకశాసనసభవ్యవస్థ చాలా సమర్థవంతమైనది. తులనాత్మకంగా బలహీనంగా యుండే రెండు సభలు గల శాసనసభ కంటే శక్తివంతమైన ఏకశాసనసభే కార్యనిర్వాహక వర్గానికి మరింత మెరుగైన సరితూకమవుతుంది.

## 21.5 ఏకశాసనసభ - లోపాలు

ఏకశాసనసభా వ్యవస్థలో ఈ క్రింది లోపాలు ఉన్నాయి.

(1) ఏకశాసనసభావ్యవస్థ తొందరపాటు శాసన నిర్మాణానికి అవకాశం యిస్తుంది. అభ్యుదయకర భావాలనే పేర ఆలోచన లేని, అపాయకరమైన శాసనాలను రూపొందించవచ్చు.

(2) శాసన నిర్మాణ బాధ్యత ఒకేసభకు అప్పగిస్తే శాసనాల రూపకల్పనకు అవసరమైన సంయమనం లోపిస్తుంది. వివాదాస్పదమైన శాసనాల నిర్మాణం విషయంలో పునరాలోచనకు అవకాశం లేకపోవచ్చు.

(3) ఏకశాసనసభ శాసన నియంతృత్వం పెరుగుదలకు దోహదం చేస్తుంది. ప్రత్యేకించి ఒకే రాజకీయ పార్టీకి అత్యధిక మెజారిటీ చేకూరినప్పుడు ఈ ప్రమాదం మరింత హెచ్చుగా ఉంటుంది.

(4) శాసనసభలో ఒకే సభయుంటే అది తాత్కాలిక ప్రలోభాలకు లోనయ్యే అవకాశం ఎంతైనా ఉంటుంది. సభ్యుల భావోద్వేగాలు, మనోద్వేగాలు లేక ఆవేశపూరిత ప్రసంగాలు ఏకశాసనసభను ప్రభావితం చేయవచ్చు. అంతేగాక ఒకోసారి అతిగా వ్యవహరించవచ్చు. లేక మరీ మితంగా వ్యవహరించవచ్చు.

## 21.6 ద్విశాసనసభ - లాభాలు

ద్విశాసనసభా వ్యవస్థ వలన ఈ క్రింది లాభాలు చేకూరుతాయి.

**(1) తొందరపాటు శాసన నిర్మాణానికి అడ్డుకట్ట** : తగిన ఆలోచన చేయకుండా, ముందువెనుక చూసుకోకుండా తొందరపాటుతో చేసే శాసననిర్మాణానికి అడ్డుగా నిలుస్తుంది. ద్విశాసన సభావ్యవస్థ. సాధారణంగా ఎగువ సభ సభ్యులు వయస్సులో, అనుభవంలో దిగువసభ సభ్యులకంటె పెద్దలుగా ఉంటారు. అందువలన దిగువ సభ నుండి పుట్టుకువచ్చే తొందరపాటు చర్యలపై ఆరోగ్యకరమైన అడ్డుకట్టలు వేయటం ఎగువసభకు సాధ్యమవుతుంది. అంతేగాక ఎగువసభ సభ్యులు సాపేక్షంగా మితవాదులుగా ఉంటారు. వారి పదవీ కాలం దిగువ సభసభ్యుల పదవీకాలాన్ని మించియుంటుంది. ఎగువసభ మితవాద వైఖరి అనివార్యంగా దిగువసభ తీవ్రవాదవైఖరిని కొంతమేరకు సవరిస్తుంది. ఇంకా ఒక శాసన పరిచర్య ప్రతిపాదనకు, అంతిమ ఆమోదానికి మధ్య కాలయాపనను కలిగించటం ద్వారా ద్విశాసన సభావ్యవస్థ పునరాలోచనకు, సంప్రదింపుకుల అవసరమైన సమయాన్ని సమకూరుస్తుంది. సాపేక్షంగా పరికిస్తే, ప్రత్యేకించి ఎగువసభ సభ్యత్వం వారసత్వంగా లేక నామినేషన్ ద్వారా సంక్రమించినపుడు దిగువసభ సభ్యులకంటె ఎగువసభ సభ్యులకే భావవ్యక్తీకరణ స్వేచ్ఛ అధికంగా ఉంటుంది.



BRAOU

2. ఏకసభా నిరంకుశత్వాన్ని నిరోధిస్తుంది : ఏకసభా నిరంకుశత్వానికి ప్రతిగా వ్యక్తికి సంరక్షణను కల్పిస్తుంది ద్విశాసనసభ ఈ విధంగా రెండవసభ ఉనికి స్వేచ్ఛకు గ్యారంటీగా, అట్లాగే కొంతవరకు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సంరక్షణను కల్పించేదిగా యుంటుంది. అధికారాన్ని తమ చేతుల్లో ప్రోగుచేసికోవటం, కార్యనిర్వహక వర్గం, న్యాయవ్యవస్థల అధికారాల్ని తామే కైవసం చేసికోవటం, క్లుప్తంగా చెప్పాలంటే రాజ్యానికి సంబంధించిన ప్రభుత్వ పాలనంతా తమ నియంత్రణలోనికి తెచ్చుకోవటం శాసనసభల సహజ ప్రవృత్తిఅని అంటూ ఉంటారు. ఇటువంటి అణచివేత ధోరణిని నిరోధించాలంటే శాసనసభ కార్యకలాపాలను రెండు సభల ద్వారా వేరు చేయటమే మార్గం. అందువలననే రెండవ సభ "స్వాతంత్ర్యానికి అతిముఖ్యమైన పూచీకత్తు"గా లార్డ్ ఎక్టనే అభివర్ణించినాడు.

3. విభిన్న ప్రయోజనాలకు ప్రాతినిధ్యం : సమాజంలోని విభిన్న సమూహాలకు, ప్రయోజనాలకు అంటే అల్పసంఖ్యాకవర్గాలు, వృత్తిపరమైన, వ్యాపారపరమైన ప్రయోజనాలకు ప్రాతినిధ్యం సమకూర్చటానికి ద్విశాసన సభ వ్యవస్థ అనుకూలమైన సాధనం. ఉదాహరణకు ఇండియాలో సాహిత్యం, కళలు, శాస్త్రవిజ్ఞానం, సంఘసేవలలో విశిష్టస్థానం సంపాదించిన పన్నెండుమంది ప్రముఖులను రాజ్యసభ సభ్యులుగా నియమించే అధికారం రాష్ట్రపతికి ఉన్నది. అలాగే రాష్ట్ర శాసన మండలాలకు నామినేట్ చేసేందుకు కూడ ఇలాంటి అవకాశమే ఉంది.

4. ప్రజాభిప్రాయాన్ని సూచించే సరియైన కొలబద్ధ : ద్విశాసనసభలో ఎగువసభ ప్రజాభిప్రాయాన్ని సూచించే కొలబద్ధగా యుంటుంది. ఈసభకు చెందిన సభ్యులు ఒకేసారిగాక, విభిన్న కాలవ్యవధులలో ఎన్నికౌతూయుంటారు. అందువలన ద్విశాసనసభలో కాలానుగుణంగా మారుతున్న ప్రజాభిప్రాయం నిరంతరం ప్రతిబింబించబడుతూ యుంటుంది. అదే పరిస్థితి, ఎన్నికలు నిర్ణీత కాలవ్యవధిలో ఒకేసారి నిర్వహించబడి, ఏర్పాటు చేయబడే ఏకశాసనసభలో వీలుకాదు. ఉదాహరణకు, ఇండియాలో లోకసభ ఎన్నికలు 5 సంవత్సరములకు ఒకసారి, రాజ్యసభ ఎన్నికలు 6 సంవత్సరములకు నిర్వహించబడతాయి. మూడవవంతు రాజ్యసభ సభ్యులు ప్రతి రెండు సంవత్సరములకు పదవీ విరమణ చేసి, అవే స్థానాలకు క్రొత్త సభ్యులు ఎన్నికౌతూ యుంటారు. ఆవిధంగా ఎగువ సభ అయిన రాజ్యసభ మారుతున్న ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించటానికి వీలుగా రూపొందించబడిందని చెప్పవచ్చు.

(5) దోషరహితము మరియు పటిష్టమైన శాసనాల రూపకల్పన : శాసనసభ్యులు దోష రహితము, పటిష్టము అయిన మంచి శాసనాలను రూపొందించటానికి ద్విశాసనసభ వీలు కల్పిస్తుంది. సాధారణంగా ఎగువసభ అనుభవజ్ఞులతోను, వివేకవంతులతోను కూడియుంటుంది. అందువలన వారు వివిధ శాసనాల మంచి, చెడులను ప్రశాంతంగాను, ఎటువంటి ఉద్వేగాలకు లోనుకాకుండాను చర్చించి ఆమోదిస్తారు. ఆవిధంగా ఎగువసభ దిగువసభ చేసిన పొరబాట్లను సరిదిద్దటానికి ఉపయోగపడుతుంది.

(6) దిగువసభపై ఒత్తిడి తగ్గించటం : దిగువసభ భారాన్ని తగ్గించటం ద్వారా ఎగువసభ ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంపొందించగలదు. ఆధునిక కాలంలో రాజ్యం విధులు పెరుగుతున్నకొలది శాసన నిర్మాణం కూడ సంఖ్యాపరంగా పెరిగి, సంక్లిష్టతను సంతరించుకొని, ప్రత్యేక పరిజ్ఞానం కావలసినదిగా రూపొందింది. కనుక శాసననిర్మాణానికి సంబంధించిన వివిధ విషయాలను చర్చించటానికి, ఆలోచన చేయటానికి, తగిన కాలవ్యవధిని కేటాయించటానికి ఒక సభయుంటే సరిపోదు. శాసనసభ నియామాలు కొన్ని కాలపరిమితులను

విధిస్తున్నందున ఒకే సభ అయితే ప్రతిబిల్లును తీరికగా, కూలంకషంగా చర్చింటం సాధ్యంకాదు. కనుక రెండు సభలుంటే, అవి దిగువ సభపై ఎక్కుభారం పడకుండా కొంత వరకు ఉపశమనం కలిగిస్తాయి.

**(7) సమాఖ్య రాజ్యవ్యవస్థకు అత్యావశ్యకమైనవి :** సమాఖ్య ప్రభుత్వ వ్యవస్థ కలిగిన రాజ్యాలకు ద్విశాసనసభ అనివార్యమైనది. సౌభాగ్యవంతము, శక్తివంతము అయిన ప్రాంతాలు లేదా విభాగాలు సమాఖ్యవలన తగిన లాభాలు పొంది తమపై ఆధిపత్యం చెలాయిస్తాయేమోనని చిన్న, బలహీన విభాగాలలో నెలకొనియుండే భయాందోళనలను ద్విశాసనసభ వ్యవస్థ తొలగించగలదు. సమాఖ్యలో ప్రతిసభకు దాని సొంత ఉపయోగాలున్నాయి. దిగువసభను జనాబా ప్రాతిపదికపై ఎన్నుకుంటారు. కనుక అది మొత్తం ప్రజలందరికి ఒక ప్రాతినిధ్య సభగా యుంటుంది. కాగా ఎగువసభ సమాఖ్యను ఏర్పరచిన విభాగాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అనేక రాజ్యాలలో ఈ సంవిధానవిభాగాలకు ఎగువసభలో సమాన ప్రాతినిధ్యం యిస్తారు. మరింత పెద్దవి, సౌభాగ్యవంతమైనవి అయిన విభాగాలు శాసనసభలో ఆధిపత్యం చెలాయించ కుండా ఈ సమాన ప్రాతినిధ్యం నివారిస్తుందని భావన. ఆవిధంగా ద్విశాసనసభా వ్యవస్థ, అమెరికాలో సాధించిన విధంగా భిన్న ప్రయోజనాల మధ్య రాజీ సాధిస్తుంది. ఈ రాజీభావనే లేకపోతే జాతీయ ఐక్యత అసాధ్యమైయుండేది.

## 21.7 ద్విశాసన సభ - లోపాలు

సాధారణంగా ఈ క్రింది లోపాలను ద్విశాసనసభా వ్యవస్థకు ఆపాదిస్తారు.

**(1) రెండవ సభ అవసరానికి మించినది :** లాస్కీవంటి అనేకమంది ఆధునిక రచయితలు ద్విశాసన సభావ్యవస్థను వ్యతిరేకించినారు. వారి అభిప్రాయంలో రెండవ సభ దిగువసభపై అడ్డుకట్టగా ఉపయోగపడజాలదు. దిగువసభ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రజాస్వామ్యంలో ప్రభాభీష్టాన్ని ఏశక్తి అడ్డుకొనజాలదు. అంతేగాక ఎగువసభ దిగువసభ నిర్ణయాలతో ఏకీభవించే పక్షంలో అది (ఎగువసభ) అవసరానికి మించినది (కాబట్టి అనవసరం) అని, లేక అట్లా ఏకీభవించక అసమ్మతిని వ్యక్తంచేసే పక్షంలో హానికరమైనదని వారి వాదన. ఎందుకంటే అటువంటప్పుడు (దిగువసభతో ఏకీభవించిన పక్షంలో) అది ప్రజల కోర్కెలను ప్రజాప్రతినిధులు నెరవేర్చకుండా అడ్డుతో చూస్తుంది కదా !

**(2) అది ఖర్చుతో కూడినది :** రెండు సభలకు చెందిన శాసన సభ్యుల జీతభత్యాలు, ఇతర ఉద్యోగాలకు అయ్యేవేతనాలు, ఇతర ఖర్చులవలన ద్విశాసనసభా వ్యవస్థ ఆర్థిక వ్యవస్థపై పెనుభారాన్ని మోపుతుంది.

**(3) విభక్త బాధ్యత :** ఏకశాసనసభా వ్యవస్థతో పోలిస్తే ద్విశాసన సభా వ్యవస్థ సంక్లిష్టమైనది. అందులో బాధ్యత విభక్తమై యుంటుంది. బాధ్యత విభజింపబడటం అంటే నిష్క్రియపరత్వం, తద్వారా ప్రజా సంకల్పాన్ని స్తంభింప చేయటమే అవుతుంది. రెండు సభలూ ఒకేరకమైన విధుల ను స్వతంత్రంగా నిర్వహించటంతో, ఒకేపనిని రెండు పర్యాయాలు చేసినట్లవుతుంది. అంతేగాక రెండు సభలు ప్రజల ద్వారా ఎన్నికై, సమాన అధికారాలను కలిగి ఉంటే చీలికలు, విభేదాలు అనివార్యంగా తలెత్తుతాయి.

**(4) అది స్వార్థపరశక్తుల నిలయమవుతుంది :** రెండవ సభలు (ఎగువసభలు) సాదారణంగా ఆస్థిపరవర్గాలు, ఇతర స్వార్థపరశక్తులకు చెందిన ప్రతినిధులను కలిగి ఉంటాయి. కనుకవారు అభ్యుదయకరమైన చర్యలన్నింటిని వ్యతిరేకిస్తారు.



BRAOU

(5) సమర్థనీయంకాని ఉనికి : అత్యధిక దేశాలలో రెండవ సభ ఎంతో బలహీనంగాను, దుర్బలంగాను మనుగడ కొనసాగిస్తున్నది. అందువలన అది దిగువ సభ చేబట్టే ఏ తొందరపాటు, తీవ్రవాద శాసనాలనైనా నిరోధించలేక పోతున్నది. ఇటువంటి సందర్భంలో అది కేవలం అనవసరభారం, ఖరీదైన విలాసమే అవుతుంది. కనుక దానిని రద్దుచేయటం రాజ్యశ్రేయస్సుకే దోహదం చేస్తుంది.

(6) రెండవ సభ అభివృద్ధి నిరోధకం, ప్రజాస్వామ్య విరుద్ధం : అనేక దేశాలలో రెండవ సభలు ప్రగతి శీలశక్తులను అడ్డుకునే అభివృద్ధి నిరోధకశక్తులకు పెట్టని కోటలుగా రుజువు చేసికున్నాయి. అంతేగాక అవి ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమైనవి. ప్రజలువాటిని ప్రత్యక్షంగా ఎన్నుకోలేదు. కనుక అవి ప్రజలకు బాధ్యత వహించజాలవు. కొన్ని సమయాలలో ప్రజల మద్దతులేని, ఎన్నికలలో ఓడిపోయిన వ్యక్తులుకూడ ఎగువసభలో సభ్యత్వాన్ని పొందగలుగుతున్నారు. అదేవిధంగా అధికారంలో యున్న పార్టీ ఎన్నికలలో ఓడిపోయిన తన పార్టీ అభ్యర్థులను, పార్టీ కార్యకర్తలను అధికారాన్ని దుర్వినియోగం చేయటం ద్వారా ఎగువసభ సభ్యులుగా నియమిస్తున్నది. ఆవిధంగా ఈ రెండవ సభ ఔన్నత్యాన్ని ఉపయోగాన్ని నీరుకార్చటం జరుగుతున్నది.

ఈ పైన పేర్కొన్న కారణలను దృష్టిలో యుంచుకొనే భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు తమ ఎగువసభలను రద్దు చేయటం జరిగింది.

## 21.8 ఎగువ శాసనసభ అధికారాలు - ఇటీవల పరిణామాలు

ఇటీవల కాలంలో ఎగువసభల అధికారాన్ని పరిమితం చేసి, వాటిని కేవలం సమీక్షకు, కాలయాపనకు ఉపయోగపడే సంస్థలుగా కుదించి వేసే ధోరణి చోటుచేసికున్నది. ఈ ఉద్యమం బ్రిటిష్ పార్లమెంటు చట్టం, 1911తో ప్రారంభమైందని చెప్పవచ్చు. ఈ చట్టంవలన సామాన్యుల సభ పాస్ చేసిన బిల్లుల్ని నిరాకరించే అధికారం ప్రభువుల సభకు దాదాపుగా లేకుండా పోయింది. పర్యవసానంగా దిగువసభలో ప్రతిపాదించిన శాసనాలను వ్యతిరేకించి, అవి చట్టాలుగా రూపొందటాన్ని జాప్యం చేయగల అధికారాలు మాత్రమే ప్రభువుల సభకు మిగిలిపోయాయి. అయితే అంతిమంగా దిగువసభ ప్రభువుల సభ తీర్మానాల్ని తిరస్కరించి తన సంకల్పాన్ని అమలు పరచుకోగలుగుతుంది. కనుక చాలవరకు బ్రిటిషు పార్లమెంటు అంటే సామాన్యుల సభేనని చెప్పవచ్చు. అదేవిధంగా మొదటి ప్రపంచ యుద్ధం తరువాత రూపొందించబడిన అనేక నూతన రాజ్యాంగాల ప్రకారం ఏదైనా శాసనాల రూపకల్పనలో ఎగువసభలు వ్యతిరేకించినప్పటికి, దిగువసభలు అసాధరణ మెజారిటి ద్వారా ఎగువసభల తీర్మాణాలను ప్రక్కనబెట్టి తమ సంకల్పాన్ని అమలు చేసుకొనే అవకాశం కలిగింది. మరోవిధంగా చెప్పాలంటే దిగువ సభలకు ఎగువసభలకంటె ఎక్కువ అధికారాలను యిచ్చి, తద్వారా ఎగువసభలు దిగువ సభల ఆజ్ఞాల్ని శిరసావహించవలసిన స్థితిని కల్పించటం జరిగింది.

## 21.9. రెండు సభల మధ్య సంబంధాలు

శాసన సభ వ్యవస్థీకరణకు ద్విశాసనసభావ్యవస్థను అవలంబించే రాజ్యాలలో రెండు సభల మధ్య సత్సంబంధాలను నెలకొల్పి కొనసాగించవలసిన అవసరం ఎంతైనా ఉంది. అవిపరస్పరం సహకరించుకొని ఒక ఆరోగ్యకరమైన సంబంధాన్ని నెలకొల్పుకోవలసి యుంటుంది. లేకుంటే శాసన నిర్మాణ క్రమంలో

BRAOU

రాజ్యాంగ సంక్షోభాలు తప్పవు. వాస్తవానికి ద్విశాసన సభావ్యవస్థ ఉద్దేశం ఏమిటంటే ఎగువసభ దిగువసభ అధికారాలతో పోటీపడకుండా, వాటిని అతిక్రమించకుండా యుంటూ దిగువ సభ తొందరపాటుగా చేసే శాసనాలను నిరోధించటం. కనుక ఎగువసభ దిగువ సభకు నకలుగా ఉండకూడదు.

ఇటీవలి కాలంలో దిగువ సభలతో ఎగువ సభలు ఘర్షణపడే అవకాశాలు బాగా తగ్గిపోయాయి. ఎగువసభలకు ఒకప్పుడున్న అధికారాలను బాగా పరిమితం చేయటమే దీనికి కారణం. ఒక ప్రజాస్వామిక రాజ్యంలో దిగువసభ తనకంటె ముఖ్యమైన పాత్ర వహించవలసిన ఒక జనప్రియ సభ అన్న విషయాన్ని ఎగువసభ గుర్తించి వ్యవహరించవలె. వీటిన్నింటివలన రెండు సభలను రూపొందిచేటపుడు ఈ క్రింది అంశాలను దృష్టిలో యుంచుకొనవలెను.

(1) వ్యవస్థాపరంగా విభిన్న సూత్రాలు : ద్విశాసన సభావ్యవస్థలో రెండు సభలను విభిన్నంగా వ్యవస్థీకరించవలె. లేకపోతే రెండు సభలు ఒకదానికొకటి నకలుగా ఉంటాయి. కనుక సభ్యుల అర్హతలు, ఎన్నికపద్ధతి, పదవీకాలం మొదలైన విషయాలలో రెండు సభల మధ్య తేడాలు ఉండవలెను.

(2) అధికారాలు, విధులలో అంతరాలు : రెండు సభలకు ఒకేరకమైన విధులు, అధికారాలు యుంటే ప్రతిష్ఠంభనలు తరుచు చోటుచేసుకుంటూ ఉంటాయి. కనుక దిగువసభకు సాపేక్షంగా విస్తృత అధికారాలు యివ్వాలి. ప్రత్యేకించి విత్తవ్యవహారాలో దిగువసభదే పైచేయిగా ఉండాలి.

(3) దిగువసభ ఒక అవరోధంగా యుండరాదు : తన విధి నిర్వహణ క్రమంలో ఎగువసభ, దిగువసభ అధికారాలు, విధుల పరిధిలోనికి చొచ్చుకొనిపోవటానికి, వాటిని అడ్డగించటానికి ప్రయత్నించరాదు. అదే సమయంలో దిగువ సభ మరీ వేగంగా పోతున్నప్పుడు సకాలంలో బ్రేకులు వేయవలసిన అవసరాన్ని అది (ఎగువసభ) గుర్తించాలి.

ఈరకమైన జాగ్రత్తలు తీసికున్నప్పటికి అప్పుడప్పుడు రెండు సభల మధ్య ప్రతిష్టంభనలు తలఎత్తే ప్రమాదం లేకపోలేదు. ఇటువంటి సందర్భాలలో రాజ్యాంగంలో పొందుపరచిన నియమనిబంధనలను సజావుగా అనుసరించటం ద్వారా, సహనభావం, పరస్పర అవగాహనాదృక్పధాలను ప్రదర్శించటం ద్వారా ఈ ప్రతిష్ఠంభనలను నివారించవచ్చు. సాధారణంగా ఎగువసభలు విత్తవ్యవహారాలలో కలగజేసికోవటం కాని, తద్వారా ప్రతిష్ఠంభనలకు దారితీయటం కాని యుండదు. ఎందుకంటే అవి ద్రవ్యబిల్లు (Money Bills) లను ప్రవేశపెట్టలేవు. లేదా ద్రవ్యవ్యవహారలపై ఏరకమైన అదుపు ఆజ్ఞలను కలిగియుండలేవు. ఇక విత్తేతర సమస్యలపై సభల మధ్య ఏ ఘర్షణ తలెత్తినా దానిని రెండు సభల సంయుక్త సమావేశం (భారతదేశంలోవలె) ద్వారా పరిష్కరించుకోవచ్చు. లేక ఒకప్రత్యేక పద్ధతి ప్రకారం (బ్రిటన్‌లోవలె) దిగువసభకు మాత్రమే శాసనాలు చేసే అధికారం యుండేట్లు చూడవచ్చు లేక (అమెరికాలోని కాన్ఫరెన్స్ కమిటీవలె) ఏదైనా ప్రత్యేక యంత్రాంగం ద్వారా దిగువసభకు శాసనాధికారం యిచ్చి ఘర్షణల్ని పరిష్కరించవచ్చు. ఈ విధంగా ప్రతిష్ఠంబనలు తలెత్తే అవకాశలను నివారించవచ్చు.

వివిధ లోపాలున్నా, సాధారణంగా ద్విశాసనసభా వ్యవస్తే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం యొక్క ముఖ్యలక్షణంగా ప్రసంశలనందుకొంది. ఎగువసభ కనుక సమీక్షకు, పునఃపరిశీలనకు పరిమితమై వ్యవహరిస్తే, అపుడు విధినిర్వహణలో ఏ ప్రభుత్వానికైనా అవసరమైన సమర్ధవంతమైన శాసనాలను రూపొందించటం సాధ్యమవుతుంది. అంతేగాక సమాజంలో వివిధవర్గాల, రాజకీయవ్యవస్థల ప్రయోజనాలకు



BRAOU

ప్రాతినిధ్యం చేకూర్చేందుకు ద్విశాసన సభావ్యవస్థే తగిన సాధనంగా యుంటున్నది. అందువలననే ఆధునిక కాలంలో అత్యధిక దేశాలు మత శాసనసభల రూపకల్పనకు ప్రాతిపదికగా ఏకశాసనసభా వ్యవస్థకన్న ద్విశాసనసభా వ్యవస్థ పట్లే ఎక్కువ మొగ్గు చూపిస్తున్నాయి.

## 21.10 క్లుప్తంగా

"ఏక శాసనసభావ్యవస్థ", ద్విశాసనసభావ్యవస్థ"లు శాసనసభ నిర్మాణానికి మరియు వ్యవస్థీకరణకు సంబంధించినవి. ఏకశాసనసభలో ఒకే సభయుండగా, ద్విశాసనసభలో రెండు సభలుంటాయి. ద్విశాసనసభ మొదట బ్రిటన్, అమెరికాలో అవిర్భవించింది. ఆతరువాత కాలంలో అది అనేక రాజ్యాలకు విస్తరించింది. ఏకశాసనసభావ్యవస్థ ప్రజాసార్వభౌమాధికారంపై ఆధారపడితే, ద్విశాసన సభా వ్యవస్థ జాగరూకతకు ఎక్కువ ప్రాముఖ్యమిచ్చి తొందరపాటు శాసన నిర్మాణానికి అడ్డుకట్టగా చేస్తుంది. అంతేగాక ఏ శాసనసభా వ్యవస్థకు భిన్నంగా, ద్విశాసనసభా వ్యవస్థ జనప్రియసభ నిరంకుశత్వాన్ని అడ్డుకొని విభిన్న సమూహాలు, రాజకీయవ్యవస్థల ప్రయోజనాలకు స్థానం కల్పిస్తుంది. ద్విశాసనసభ సమాఖ్యలకు అత్యుత్తమంగా సరిపడుతుంది. ఎందుకంటే ఎగువసభ రాష్ట్రాల ప్రయోజనాలకు సంరక్షణ కల్పిస్తే, దిగువసభ ప్రజల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

మరోవైపున ద్విశాసనసభా వ్యవస్థ వలన అదే పనిని తిరిగి చేయటం అధికవ్యయం అవుతుందని దానికి అభివృద్ధి నిరోధక, ప్రజాస్వామ్య వ్యతిరేక లక్షణాలున్నాయని విమర్శకులంటారు. ఎగుసభ అవసరానికి మించిందని, అనవసరమని కనుక దాని మనుగడ సమర్థనీయంకాదని వారి అభిప్రాయం. ద్విశాసనసభా వ్యవస్థలో శాసన నిర్మాణం క్లిష్టంగాను, గందరగోళంగాను తయారవుతుంది. అంతేగాక రెండు సభల మధ్య ఘర్షణలు, ప్రతిష్టంభనలు తలెత్తే ప్రమాదం కూడ యున్నదని వారు భయాందోళనలు వ్యక్తం చేసారు.

ఈ విమర్శలు కొంతవరకు సహేతుకమైనవి కూడ. అయిన దిగువసభ, ఎగువసభల వ్యవస్థీకరణకు విభిన్న సూత్రాలను అనుసరించటం, దిగువసభను సాపేక్షంగా మరింత శక్తివంతంగా రూపొందించటం మొదలైన కొన్ని చర్యలు తీసికొని అనేక రాజ్యాలు ఎగువసభలను అట్లాగే కొనసాగిస్తున్నాయి. అప్పటికి ప్రతిష్టంభనలు తప్పకపోతే దిగువ, ఎగువ సభల మధ్య ఘర్షణలను పరిష్కరించటానికి సంయుక్త సమావేశాలు లేక కాన్ఫరెన్స్ కమిటీలు మొదలైన ప్రత్యేక ఏర్పాట్లను కూడ ఈ రాజ్యాల్లో చేసుకుంటున్నారు.

BRAOU

## 21.11 చదువదగిన పుస్తకాలు

A.C. Kapoor : Principles of Political Science

K.R. Acharya (Ed.) : A Text Book of Political Science

## 21.12 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. "ఏకశాసనసభ" అంటే ఏమిటి ? ద్విశాసన సభకంటె ఏకశాసనసభ ఏవిధంగా మెరుగైనది

2. ద్విశాసనసభా వ్యవస్థ ప్రయోజనాలను విమర్శనాత్మకంగా పరిశీలించుము

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. "బ్రిటన్‌లో ద్విశాసన సభావ్యవస్థ చారిత్రక యాదృచ్ఛికతా ఫలితం" వివరించుము

2. ఇటీవలి కాలంలో ఎగువసభల అధికారాలను పరిమితం చేయటానికి తీసికుంటున్న వివిధ చర్యలను వివరించుము.

3. ఒక ప్రజాస్వామ్య దేశంలో ఎగువ, దిగువసభల మధ్య నెలకొనే ప్రతిష్ఠంబనలను తొలగించటానికి మీరు సూచించే పరిష్కార చర్యలేమిటి ?

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

BRAOU

# భాగం-22 : శాసనసభ - విధులు

విషయ సూచిక

22.0 లక్ష్యాలు

22.1 పరిచయం

22.2 ఆధునిక ప్రభుత్వాల్లో శాసనసభల పాత్ర - ప్రాముఖ్యత

22.3 శాసనసభల అధికారాలు - విధులు

22.3.1 శాసన నిర్మాణం

22.3.2 విత్తపరమైన విధులు

22.3.3 పరిపాలనపై అదుపు

22.3.4 ఎన్నికలపరమైన విధులు

22.3.5 రాజ్యాంగ విధులు

22.3.7 ఫిర్యాదుల పరిశీలన

22.3.8 ఇతర విధులు

22.4 కమిటి పద్ధతి

22.5 ఆధునిక కాలంలో శాసనసభల క్షీణతకు కారణాలు

22.6 క్లుప్తంగా

22.7 చదవదగిన పుస్తకాలు

22.8 నమూనా ప్రశ్నలు

## 22.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- ఆధునిక ప్రభుత్వాల్లో శాసనసభ పాత్రను, ప్రాముఖ్యాన్ని వివరించగలరు.
- శాసనసభ అధికారాలను, విధులను తెలియజేయగలరు.
- శాసనసభలో వివిధ కమిటీల పాత్రను చర్చించగలరు
- ప్రస్తుత కాలంలో శాసనసభల ప్రాధాన్యత తగ్గటానికి గల కారణాలను వివరించగలరు.

B R A O U

## 22.1 పరిచయం

ఆధునిక ప్రభుత్వ విధులను స్థూలంగా మూడు రకాలుగా - శాసననిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయసంబంధమైన విధులుగా వర్గీకరించవచ్చు. శాసననిర్మాణ విధి ప్రధానంగా శాసనాలను రూపొందించటానికి సంబంధించి యుంటుంది. ఈ శాసనాల అమలు లేక పాలనకు సంబంధించినది కార్యనిర్వాహక విధి. ఈ శాసనాల వివరణకు, చట్టాన్ని అతిక్రమించేవారిని శిక్షించేందుకు ఉద్దేశించినదే న్యాయసంబంధ విధి.

ఈవిధులకు అనుగుణంగా శాసనసభ, కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థ అనే మూడు వేర్వేరు ప్రభుత్వ అంగాలు ఉంటాయి. ప్రతి అంగమూ ఈ విధుల్లో ఏదో ఒక దానిని నిర్వహించవలసి యుంటుంది. శాసనసభ శాసనాలను రూపొందిస్తుంది. కార్యనిర్వాహకవర్గం శాసనాలను అమలు చేస్తుంది. ప్రజలందరూ చట్టాలకు విధేయులై ఉండేటట్లు చూస్తుంది. న్యాయవ్యవస్థ శాసనాలకు వివరణలు యిచ్చి, చట్టాలను అతిక్రమించేవారికి తగిన శిక్షలు విధిస్తుంది.

## 22.2 ఆధునిక ప్రభుత్వాల్లో శాసనసభల పాత్ర, ప్రాముఖ్యత

ప్రభుత్వానికి సంబంధించిన మూడు అంగాలలో శాసనసభదే అగ్రపీఠం. అది రాజ్యసంకల్పాన్ని రూపొందిస్తుంది. అది చేసే శాసనాలు ప్రజల సార్వభౌమాధికారానికి నిర్దిష్ట వ్యక్తీకరణలై ఉంటాయి. ప్రభుత్వ కార్యనిర్వాహక, న్యాయసంబంధ విభాగాల కార్యకలాపాలకు అది ప్రాతిపదిక ఏర్పరుస్తుంది. శాసనాలను చేస్తే తప్ప, వాటిని అమలు చేయటం లేక వివరించటమనే ప్రసక్తి తలయెత్తదు కదా ! ఈవిధంగా శాసనసభను ప్రభుత్వానికి సంబంధించిన అతి ముఖ్యమైన అంగంగా పరిగణించవచ్చు.

BRAOU

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, మొదట్లో శాసననిర్మాణం శాసనసభ అసలు విధికాదు. మనకు తెలిసిన మొట్టమొదటి శాసనసభ ఇంగ్లండు దేశపు అసెంబ్లీయే. అదికేవలం కొందరు వివేకవంతుల మండలిగా యుండేది. క్రొత్త పన్నులు విధించాలంటే ఈ మండలి సమ్మతి అవశ్యకమయ్యేది. ఆ రోజుల్లో శాసననిర్మాణం ప్రభుత్వానికి ఒక ముఖ్యవిధికాదు. శాసనాలు దైవనిర్మితమని, లేదా అనూచానంగా వస్తున్న అచారాలు, సంప్రదాయాలలో నిక్షిప్తమని భావించేవారు. ఈ శాసనాలకు వివరణయిచ్చి, వాటిని అమలుచేయవలసిన బాధ్యత రాజుదని తలచేవారు. ప్రభుత్వ విధులన్నీ రాజుచేతిలో కేంద్రీకృతమై యుండేవి. రాజుకు డబ్బు అవసరమైనప్పుడల్లా, ఆతడు అసెంబ్లీని సమావేశపరచి, తన అవసరాలు తీర్చుకొంటూయుండేవాడు. ఆ అసెంబ్లీయే క్రమక్రమంగా రాజ్యంయొక్క మహామండలిగాను, ఈ మహామండలియే అంతిమంగా మొదటి జాతీయ శాసనసభగాను రూపొందాయి.

ఇంగ్లండులో ప్రాతినిధ్య శాసనసభకు బీజాలు పదమూడవ శతాబ్దపు మధ్యభాగంలో పడ్డాయని చెప్పవచ్చు. తనకు ఇతోధిక ద్రవ్యాన్ని మంజూరు చేయటానికిగాను సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించవలసిన అవసరాన్ని రాజు గుర్తించినాడు. ఇది చివరకు బ్రిటిష్ శాసనసభలో అంటే పార్లమెంటులో ప్రభువుల సభ, సామాన్యుల సభలు ఏర్పడటానికి దారి తీసింది. ప్రభువుల సభలో కులీన ప్రభువులు, మతగురువులు ఉండేవారు. ఈవిధంగా అది భూస్వామ్యవర్గ ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించింది. సామాన్యుల సభలో వివిధ ప్రాంతాల ప్రతినిధులు ఉండేవారు. ఆర్థిక, సామాజిక పరిస్థితులు, ప్రయోజనాల తాకిడి ఫలితంగా క్రమక్రమంగా ఈ రెండు సభల శాసనసభా వ్యవస్థ రూపొందింది.

"శాసనసభ" అనేపదం ఆ సంస్థకుండే శాసననిర్మాణ విధిని అంతరార్థంగా సూచిస్తున్నదని చెప్పవచ్చు. అయితే అది దాని మొట్టమొదటి లేక అసలు విధి ఏమీకాదు. శాసన నిర్మాణాధికారం మెల్లమెల్లగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. మొదట్లో ప్రభుత్వానికి కావలసిన డబ్బును మంజూరు చేయటమే శాసనసభ విధిగా యుండేది. అప్పట్లో ఈ శాసనసభల సమావేశాలు కూడ ఒక క్రమమంటూ లేకుండాను, స్వల్పకాలికంగాను జరుగుతూ యుండేవి. కాని కాలక్రమంలో బ్రిటిషు పార్లమెంటు రాజుకు (ప్రభుత్వానికి) కావాల్సిన డబ్బును మంజూరు చేసే అధికారమేగాక, ఖర్చుల్ని మంజూరు చేసే అధికారాన్ని కూడ సంతరించుకోగలగింది. విత్తవ్యవహారాలపై ఇటువంటి అదుపు పార్లమెంటుకు ఒక కీలక సాధనమయింది. దానితో అది తన స్వీయస్థానాన్ని బలవత్తరం చేసికోనారంభించింది. తన స్థితిని మెరుగుపరచుకోవటానికి క్రొత్త చట్టాలు చేయాలని పార్లమెంటు డిమాండ్ చేయటం, రాజుదానికి తల ఒగ్గి స్థిరశాసనాలు (statutes) చేయటం జరిగేది. ఆ తరువాతికాలంలో పార్లమెంటు స్వయంగా స్థిరశాసనములు రూపొందించి, సమ్మతికోసం రాజువద్దకు పంపించటం మొదలయింది. ఇంకా ఆ తరువాతి కాలాల్లో పార్లమెంటు రూపొందించిన చట్టాలను తిరస్కరించే (వీటోచేసే) అధికారాన్ని కూడా రాజు కోల్పోయినాడు. ఈ పరిణమాల ఫలితంగా పన్ను విధింపు అధికారం, శాసన నిర్మాణాధికారం రెండూ జాతీయ శాసనసభకు సంక్రమించినాయి. ఈవిధంగా 19వ శతాబ్దం నాటికి పార్లమెంటు సర్వంసహాధికారాన్ని సంతరించుకోగలిగింది. తద్వారా ఇంగ్లండులో ప్రభుత్వానికి ప్రధాన అంగమైంది. చారిత్రక పరిణామక్రమంలో బ్రిటిషు పార్లమెంటు గడించిన స్థానాన్ని ఇతరదేశాలలో శాసనసభలు వాటివాటి లిఖిత రాజ్యాంగాల ద్వారా సాధించినాయి. ఆయాదేశాలు అవలంబించిన రాజ్యాంగ చట్రాలలో తేడాలు, వాటి చారిత్రక పరిస్థితులలో యున్న అంతరాలవలన ఈ వివిధ దేశాలలో శాసనసభల కుండే కొన్నికొన్ని విధుల ప్రాముఖ్యం విషయంలో కూడా తేడాలు తలెత్తాయి. అయితే ఇటువంటి చిన్నచిన్న తేడాలు ఏమున్నా, వివిధ దేశాలలోని శాసనసభల తమతమ ప్రభుత్వ వ్యవస్థలలో ఒకేరకమైన అధిక్యతాస్థానాన్ని అనుభవించగలుగుతున్నాయి.

## 22.3 శాసనసభ అధికారాలు - విధులు

శాసనసభ అధికారాలు, విధులు దేశదేశానికి వేరువేరుగా ఉంటాయి. అవిపూర్తిగ ప్రభుత్వ స్వరూపంపై ఆధారపడి ఉంటాయి. బ్రిటన్, భారతదేశాలలో వలె పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నెలకొని ఉన్నచోట్ల శాసనసభకు ఎంతో విస్తృత అధికారాలుంటాయి. అది కార్యనిర్వాహకవర్గం కంటె ఉన్నతస్థితిలో యుంటుంది. అది కార్యనిర్వాహకవర్గం అన్నికార్యకలాపాలలో శాసనసభకు బాధ్యత వహించవలసి యుంటుంది. శాసనసభ విశ్వాసాన్ని చూరగొన్నంతకాలమే మంత్రులు పదవిలో కొనసాగగలుగుతారు. బ్రిటన్‌లోనైతే పార్లమెంటుకు సార్వభౌమాధికారాలు కూడ ఉన్నాయి. అందువలన అది రాజ్యాంగ నిర్మాణ, శాసననిర్మాణ అధికారాలను రెంటినీ తనలో ఇముడ్చుకొన్నది. రాజ్యాంగాన్ని రూపొందించేందుకు లేక సవరించేందుకు, అదే సమయంలో మామూలు శాసనాలు చేసేందుకు తగిన అధికారాలు బ్రిటిష్ పార్లమెంటుకు ఉన్నాయి.

కాగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉన్న అధ్యక్షతరహా ప్రభుత్వ వ్యవస్థలోనైతే శాసనసభ అధికారాలు, కార్యనిర్వాహక వర్గం అధికారాల సరసనే కొనసాగుతాయి. అంతేగాక, కార్యనిర్వాహకవర్గం శాసనసభకు బాధ్యత వహించడమంటూ యుండదు. నిరంకుశత్వంలో లేక నియంతృత్వ ప్రభుత్వ వ్యవస్థలో శాసనసభ అంటూ ఉన్నా దానికి వాస్తవ అధికారాలు ఏమీ ఉండజాలవు. నిరంకుశపాలకుల అధికారాలకు అడ్డుకట్టుగా అది (శాసనసభ) పనిచేయలేదు. మరీ అయితే అది (శాసనసభ) ఒక సంప్రదింపుల సంఘంగా మాత్రమే ఉండగలదు.

ఈవిధంగా ప్రభుత్వ స్వభావాలను బట్టి దేశదేశానికి శాసనసభ విధులు వేరువేరుగా ఉంటాయి. అయితే ఏ ప్రజాస్వామిక వ్యవస్థలోనైనా శాసనసభలకు ఉండే ప్రధాన విధులను మాత్రం ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

### 22.3.1 శాసన నిర్మాణం

శాసనసభ యొక్క ముఖ్యమైన విధి దేశంలో మంచి ప్రభుత్వం కొరకు చట్టాలు లేక శాసనాలు చేయటం. ఆధునికకాలంలో శాసన నిర్మాణం న్యాయానికి, చట్టాలకు అత్యంత ముఖ్య ఆధారంగా ఉంటున్నది. క్రొత్త ప్రతిపాదనలనన్నింటిని బిల్లులరూపంలో శాసనసభలో ప్రవేశపెడతారు. శాసనసభ ఆ బిల్లులను ఆమోదిస్తే అప్పుడవి చట్టాలు అవుతాయి. ఆధునిక కాలంలో ప్రభుత్వాలు శ్రేయో రాజ్యభావనపై ఆధారపడుతుండటం వలన రాజ్యం విధులు, కార్యక్రమాలు అపారంగా పెరిగిపోయాయి. సమాజంలో సంభవించిన శాస్త్రీయా, సాంకేతిక అభివృద్ధివలన కూడ వాటి కనుగుణమైన సామాజిక సర్దుబాట్లు చేయవలసిన అవసరం కలుగుతున్నది. కనుక సమాజంలోని మారే పరిస్థితులకు అనువుగా, నూతన సామాజిక పరిసరాలకు అనుగుణంగా యుండే ఆయా చట్టాలను చేసేశక్తి సామర్థ్యాలు శాసనసభకు ఉండవలసివస్తున్నది. అంతేగాక కాలదోషం పట్టిపోయిన చట్టాలను రద్దుచేసి, వాటిస్థానే క్రొత్త చట్టాలను రూపొందించాల్సిన బాధ్యత కూడ ఉంటుంది. ఈవిధంగా చట్టాలు చేయటం, సవరించటం, కాలదోషం పట్టినపుడు వాటిని రద్దు చేయటం శాసనసభ కీలక విధులుగా ఉంటున్నాయి.

కేబినెట్ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం శాసన నిర్మాణంలో నేరుగా పాల్గొంటుంది. చట్టాలు చేసే అత్యున్నత అధికారం శాసనసభకే ఉన్నప్పటికీ, ప్రభుత్వ బిల్లులను శాసనసభలో కేబినెట్ మాత్రమే ప్రవేశపెడుతుంది. కాని అధ్యక్షతరహా పాలనలో కార్యనిర్వాహకవర్గం శాసన నిర్మాణ క్రమంలో నేరుగా పాల్గొనలేకపోవచ్చు. అయితే అధ్యక్షుని సందేశాల ద్వారా కాని లేక అధ్యక్షుని పార్టీకి చెందిన కాంగ్రెసు సభ్యుల ద్వారా కాని అది (కార్యనిర్వాహకవర్గం) తన పలుకుబడిని వినియోగించవచ్చు.

ఇక బ్రిటన్‌లోనైతే పార్లమెంటుకు అపరిమిత అధికారాలు ఉన్నాయి. దాని శాసననిర్మాణాధికారాన్ని ఏ శక్తీ, ఏ అధికారమూ అడ్డుకొనజాలవు. 'ఆడను మగగా, మగను ఆడగా మార్చటం' తప్పిస్తే మరేదైనా కానీ అది చేయగలదని అంటూ ఉంటారు. అయితే ఇతర దేశాల శాసనసభ్యులకు ఈరకమైన అపరిమిత అధికారాలుండవు. వాళ్ల అధికారాలను ఆయాదేశాల లిఖిత రాజ్యాంగాలు పరిమితం చేస్తాయి. కనుక రాజ్యాంగం నిర్దేశించిన పరిధుల్లోనే వాళ్ళు శాసనాలు చేయవలసి యుంటుంది. ఉదాహరణకు మనదేశంలో పార్లమెంటు కేంద్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయగలదు. కాని రాజ్యాంగం అనుమతించే కొన్నికొన్ని ప్రత్యేక పరిస్థితులలో తప్పితే వేరు సందర్భాలలో అది రాష్ట్రాల జాబితాలోని అంశాలపై చట్టాలు చేయలేదు.

### 22.3.2 విత్తపరమైన విధులు

శాసనసభకు సంబంధించిన మరొక ముఖ్యవిధి ప్రభుత్వంపై విత్తపరమైన నియంత్రణను కలిగి ఉండటం. అది రాజ్యానికి సంబంధించిన విత్తవ్యవహారాలో 'కాపలా కుక్క' (Watch Dog) వలె వ్యవహరిస్తుంది. 'ప్రాతినిధ్యం లేనిదే పన్నులులేవు' అన్న ప్రజాస్వామిక సూత్రం ఆదాయాన్ని పెంచటంలోను, ఖర్చును అనుమతించటంలోను శాసనసభకు ఉన్న అత్యున్నత అధికారాన్ని సూచిస్తుంది. ఈ సూత్రానికి అనుగుణంగానే శాసనసభకు ప్రభుత్వానికి సంబంధించిన బడ్జెటును పరిశీలించటానికి, చర్చించటానికి, ఆమోదించటానికి అధికారాన్ని యివ్వటం జరిగింది. సులభ సామాన్యంగా చెప్పాలంటే బడ్జెటు అంటే ఆదేశపు ప్రజా జమా



BRAOU

ఖర్చుల వార్షిక పద్దు అన్నమాట. అందులో విత్తవ్యయం గురించి అంచనాలు, అలాగే ఆశించే రాబడుల వివరాలు కూడ ఉంటాయి. బడ్జెట్‌ను ఆమోదించటం అంటే శాసనసభ అనుమతి లేకుండా ప్రజాస్వామిక ప్రభుత్వాలు డబ్బును పోగుచేయటం లేదా ఖర్చుపెట్టటం చేయకూడదన్న మాట. శాసనసభ సమ్మతితోనే ప్రభుత్వం పన్నులు విధిస్తుంది. విత్తసంబంధమైన సమస్యలను గురించి శాసనసభ సభ్యులు స్వేచ్ఛగా చర్చిస్తారు. శాసనసభ సమ్మతి ఉంటేనే ప్రభుత్వం విత్తరంగంలో ఏ చర్యలనైనా తీసికోగలదు. వివిధ ప్రభుత్వశాఖలు చేయవలసిన ఖర్చులు గురించి సమస్త వివరాలు శాసనసభ సమ్మతికోసం సమర్పిస్తారు. అదేవిధంగా వివిధ కార్యక్రమాలపై ప్రభుత్వం చేసే ఖర్చుకు సంబంధించి, వాటి ఔచిత్యాన్ని గురించి ప్రశ్నించే అధికారం కూడ శాసనసభకు ఉన్నది. ఏ కార్యక్రమాన్ని అయినా ప్రభుత్వం అమలు చేయాలంటే శాసనసభ ముందస్తు అనుమతి అవసరం. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సమర్పించు వార్షిక, నియమితకాలానికి సంబంధించిన నివేదికలను, పబ్లిక్ అక్కౌంట్సు కమిటి, అంచనాల కమిటి, ఫైనాన్స్ కమిషన్ వంటి వివిధ కమీటిలు, కమిషన్లు సమర్పించే నివేదికలను శాసనసభ పరిశీలించి చర్చిస్తుంది. ఆవిధంగా శాసనసభ ప్రభుత్వ ఖజానాను తన అదుపులో ఉంచుకొంటుంది.

విత్తవ్యవహారాలపై ఇటువంటి నియంత్రణ ద్వారానే శాసనసభ ప్రభుత్వ విధానాలపై, పాలనపై పర్యవేక్షణను, అదుపాజ్ఞలను చెలాయిస్తుంది. అంతేగాక ఈ అధికారాన్ని ఆధారంచేసికొనే శాసనసభ ప్రభుత్వ అంతరంగిక, విదేశీవిధానాలను ప్రభావితంచేసి, క్రమబద్ధం చేయగలగుతుంది. ఉదాహరణకు బ్రిటన్‌లో కార్యనిర్వాహకవర్గం యుద్ధాన్ని ప్రకటించే అధికారాన్ని కలిగి ఉంది. కాని యుద్ధానికి అయ్యేవ్యయాన్ని పార్లమెంటు ఆమోదించవలె. ఆదేవిధంగా అమెరికాలో యుద్ధ ప్రకటన చేయాలంటే కాంగ్రెసు యొక్క ముందస్తు అనుమతి తీసికోవలెను. ఈవిధంగా శాసనసభ అనుమతి తీసికోవటంలోని అంతరార్థం ఏమిటంటే యుద్ధం అనేది భారీవ్యయంతో కూడుకొన్నది. కాబట్టి దానికి ప్రజాప్రతినిధుల ఆమోదం తప్పనిసరి అని సూచించటమే.

### 22.3.3 పరిపాలనపై అదుపు

శాసనసభకు సంబంధించిన అత్యంత ముఖ్యవిధుల్లో ఒకటి పరిపాలనా సంబంధమైన అదుపాజ్ఞలను చెలాయించటం. ప్రజాస్వామ్య దేశంలో కార్యనిర్వాహకవర్గం యధేచ్ఛగా వ్యవహరించలేదు. అదిశాసనసభ అభిప్రాయాలకు అనుగుణంగా వ్యవహరించవలసి యుంటుంది. ఈవిధంగా శాసనసభ కార్యనిర్వాహకవర్గంపై ఒక ఆరోగ్యకరమైన, సమర్థవంతమైన నియంత్రణ చెలాయిస్తుంది. ప్రత్యేకించి, శాసనసభ విశ్వాసాన్ని చూరగొన్నంతవరకే కార్యనిర్వాహక వర్గం అధికారంలో కొనసాగే పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో ఇది మరింత యదార్థంగా ఉంటుంది. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో శాసనసభ విశ్వాసాన్ని ఎప్పుడు కోల్పోయినా, కార్యనిర్వాహక వర్గం వెంటనే పదవికి రాజీనామా చేయాల్సియుంటుంది. ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నలు వేయటం ద్వారా, వాయిదా తీర్మానాలు తీసుకురావటం ద్వారా శాసనసభ్యులు, మంత్రులను జవాబుదారీగా ఉండేటట్లు చేస్తారు. ఇటువంటి సందర్భాలలో కార్యనిర్వాహకవర్గం దాని విధానాలను వివరించి సమర్థించుకోగలిగి ఉండాలి.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలోవలె అధ్యక్షతరహా పాలన ఉన్నచోట్ల కూడ శాసనసభ అభీష్టాన్ని గౌరవించవలసి యుంటుంది. ఇందుకుగాను కాంగ్రెసులో ఎగువసభ అయిన సెనేట్‌కు కొన్ని పరిపాలనా సంబంధమైన అధికారాలను యిచ్చినారు. ఈ అధికారాల ద్వారా సెనేట్ అమెరికన్ అధ్యక్షుని అధికారాలకు నిజమైన కళ్లెం వేయగలగుతుంది. సమాఖ్య ప్రభుత్వానికి సంబంధించిన అన్ని నియామకాల విషయంలో

BRAOU

అమెరికన్ అధ్యక్షునితో బాటు సెనేట్‌కు కూడ అధికారాలుంటాయి. అమెరికన్ అధ్యక్షుడు సంప్రదింపులు జరిపి, కుదుర్చుకున్న ఒడంబడికలన్నీ సెనేట్ ఆమోదిస్తే ఖరారు అవుతాయి. ఇంకా వివిధ పరిపాలనాసంబంధమైన కుంభకోణాలను గురించి, అవినీతి ఫిర్యాదులను గురించి దర్యాప్తు జరిపే అధికారం కూడ సెనేట్‌కు ఉంది. తద్వారా పరిపాలనా విభాగంపై సవివరంగా పర్యవేక్షణ జరిపిదాన్ని అదుపుచేయటం శాసనసభకు వీలవుతుంది. అవినీతి ఫిర్యాదులు ఆధారంగా అధ్యక్షునిపై మహాభియోగ తీర్మానం (Impeach) నడిపే అధికారం కూడ కాంగ్రెసుకు ఉంది. ఈ విధంగా ఈ సాధనాలన్నింటి ద్వారా ఆధునిక ప్రభుత్వాలల్లో శాసనసభలు, కార్యనిర్వాహక వర్గాలపై సమర్థవంతమైన పరిపాలనా సంబంధమైన నియంత్రణను చెలాయించ గలుగుతున్నాయి.

## 22.3.4 ఎన్నికలపరమైన విధులు

అనేకదేశాల్లో శాసనసభలు తమతమ సభాధికారులనే కాక కార్యనిర్వాహకవర్గం సభ్యులను కూడా ఎన్నుకొంటూ వుంటాయి. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ ఉన్న దేశాలలో శాసనసభ్యులు, ప్రత్యేకించి జనప్రియనిలయానికి చెందిన (దిగువసభ) సభ్యులు ఒక నాయకుణ్ణి ఎన్నుకుంటార్థు. ఆనాయకుడే ప్రధానమంత్రై తనమంత్రి వర్గాన్ని ఏర్పాటు చేస్తాడు. ఇలాంటి దేశాల్లో నామమాత్రపు రాజ్యాధినేతను (Titular Head) సాధారణంగా శాసనసభల సభ్యులే ఎన్నుకుంటారు. భారతదేశంలో ప్రధానమంత్రిని లోక్‌సభ సభ్యులు ఎన్నుకుంటారు. కాగా రాష్ట్రపతి ఎన్నిక కోసం పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఎన్నికైన రాష్ట్ర శాసనసభల సభ్యులు ఒక నియోజక గణం (Electoral College) గా ఏర్పడతారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుల ఎన్నికలు మామూలుగా ప్రత్యక్ష జనప్రియ ఎన్నికల ప్రాతిపదికపై జరుగుతాయి. అయితే అందుమూలంగా పూర్తి మెజారిటి ఎవరికి రాని పక్షంలో అప్పుడు ఉపాధ్యక్షుని ఎన్నికను సెనేట్ (ఎగువసభ), అధ్యక్షుని ఎన్నికను ప్రతినిధుల సభ (దిగువసభ) నిర్ణయిస్తాయి. స్విట్జర్లాండులో కార్యనిర్వాహక వర్గ సభ్యులను శాసనసభ సభ్యులు ఎన్నుకుంటారు.

## 22.3.5 రాజ్యాంగ విధులు

శాసనసభలు కొన్ని రాజ్యాంగపరమైన విధులను కూడ నిర్వహించవలసి యుంటుంది. రాజ్యాంగానికి సంబంధించిన వివిధ ప్రకరణాలను సవరించటంలోను, రద్దు చేయటంలోను శాసనసభలు చాలా ప్రముఖపాత్ర వహిస్తాయి. అలిఖిత రాజ్యాంగం అమలులో యున్న రాజ్యాలలో రాజ్యాంగ శాసనాలను, సాధారణ శాసనాలను చేసే అధికారం శాసనసభలకుంటుంది. అటువంటి చోట రాజ్యాంగ శాసనానికి, సాధారణ శాసనానికి మధ్య ఎటువంటి తేడాయుండదు. కాని లిఖిత మరియు పరుష రాజ్యాంగాలు అమలులో యున్న రాజ్యాలలో శాసనసభలు రాజ్యాంగానికి కొన్ని నిర్దిష్టమైన పద్ధతుల ద్వారా సవరణలు చేసే అధికారం కలిగి ఉంటాయి. ఉదాహరణకు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 2/3వంతు కాంగ్రెసు సభ్యులు లేక 2/3 వంతు రాష్ట్రాల శాసనసభల కోరికపై కాంగ్రెసు సమావేశపరచిన జాతీయసదస్సు, రాజ్యాంగానికి సంబంధించిన సవరణలను ప్రతిపాదించవచ్చు. ఇండియాలో రాజ్యాంగాన్ని సవరించటానికి అవసరమైన ప్రతిపాదనను పార్లమెంటు ఉభయసభలో ఏసభయైనా చేయవచ్చు. కానిదానిని ప్రతిసభలోని మెజారిటి సభ్యులకు తగ్గకుండా, హాజరైన వారిలో 2/3 వంతు మంది సభ్యులు ఆమోదించవలసి యుంటుంది. కాని కొన్ని నిర్దిష్టమైన విషయాలలో ఆ ప్రతిపాదనలను సగానికి తగ్గకుండా రాష్ట్రశాసనసభలు కూడ ఆమోదించవలసి యుంటుంది.

BRAOU

### 22.3.6 న్యాయ సంబంధ విధులు

ప్రతిదేశంలోను శాసనసభకు కొన్ని న్యాయసంబంధమైన విధులు కూడ ఉంటాయి. ద్విశాసన సభావ్యవస్థలో సాధారణంగా ఎగువసభే ఇటువంటి విధులను నిర్వహిస్తూ ఉంటుంది. బ్రిటన్ ప్రభువుల సభ అత్యున్నత అప్పీలు న్యాయస్థానంగా పనిచేస్తుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అధ్యక్షుడిపైనకాని, ఉపాధ్యక్షుడిపైన కాని మహాభియోగ వ్యాజ్యాన్ని ప్రతినిధుల సభ ప్రవేశపెట్టినప్పుడు, వారిని విచారించే మహాభియోగ న్యాయస్థానంగా సెనేట్ పనిచేస్తుంది. భారతదేశంలో లోక్‌సభ అయినా, రాజ్యసభ అయినా రాష్ట్రపతికి వ్యతిరేకంగా మహాభియోగ ఆరోపణలు చేయవచ్చు. లోక్‌సభ అభియోగం మోపితే దానిని రాజ్యసభ విచారిస్తుంది. లేక రాజ్యసభే ఆరోపణలు చేస్తే వాటిని లోక్‌సభ పరిశోధిస్తుంది.

### 22.3.7 ఫిర్యాదుల పరిశీలన

ప్రజలబాధలు తెలియజెప్పుకోవటానికి ఒక వేదికగా ఉండటం, ఆలక్ష్యంతో పరిపాలనా విభాగం చర్యల్ని పరిశీలించటం శాసనసభకు చెందిన మరొక ముఖ్యవిధి. పార్లమెంటును 'దేశంలో ఫిర్యాదులు, బాధలు తెలియజెప్పుకొనే కమిటీగా, అభిప్రాయాలు వ్యక్తంచేసికొనే మహాసభ'గా భావించటంకద్దు. ఈవిధంగా ప్రజల ఆశలు, అభిలాషల్ని, ఫిర్యాధులు, బాధల్ని విధాన నిర్ణేతలకు తెలియజేయటం శాసనసభ్యునికి ఒక ముఖ్యవిధి అవుతుంది. అంతేగాక ఆసమస్యలు పరిష్కారమై, బాధలు తొలగిపోయేటట్లు, ప్రజల ఆశలు, అభిలాషలు నెరవేరేటట్లు చూడవలసిన బాధ్యత కూడ శాసనసభ్యునికి ఉంటాయి.

### 22.3.8 ఇతర విధులు

శాసనసభ కొన్ని ఇతర విధులను కూడ నిర్వహించవలసి యుంటుంది. వ్యవసాయం, పరిశ్రమలకు సంబంధించి విచారణ సంఘాలను నియమించటం లేదా సాంఘిక లేదా రాజకీయ అశాంతికి, హింసాకాండకు, అటువంటి ఇతర పరిణామాలకు కారణాలను అన్వేషించటానికి కమిషన్లు వేయటం శాసనసభ అధికారపరిధిలోకే వస్తుంది. ఈ విచారణ కమిషన్లు ఎంతో సమాచారాన్ని సేకరించి, ఇటువంటి సమస్యలకు నివృత్తి చర్యలను సూచించగలుగుతాయి.

భారతదేశంలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు చెందిన న్యాయమూర్తులెవరైనా దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు రుజువైతే అప్పుడు ఆకారణంగా వారిని తొలగించే అధికారం పార్లమెంటుకు ఉంది. అందుకుగాను ప్రతిసభలో మూడింట రెండువంతుల మెజారిటీతో ఆ మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించవలసి యుంటుంది. బ్రిటన్‌లో పార్లమెంటు ఉభయ సభలూ రాజమకుటానికి (Crown) సంయుక్త సంబోధన ద్వారా న్యాయమూర్తుల్ని తొలగించవచ్చు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోనైతే మహాభియోగం ద్వారా న్యాయమూర్తులను తొలగించవచ్చు.

ఈ విధంగా శాసనసభ, దాని సాంప్రదాయక విధి అయిన శాసన నిర్మాణ విధితోబాటు వివిధరకాలైన విధులను నిర్వహిస్తుంది. ఈ విధులను శాసనసభ్యులు స్వతంత్రంగాను, సంతృప్తికరంగాను నిర్వహించటానికి వీలుగా వారికి అనేకరకాలైన రాజ్యాంగ రక్షణలు కల్పించబడినవి. వారు శాసనసభ సమావేశాలలో వెలిబుచ్చిన అభిప్రాయాలకు న్యాయపరంగాను, శాసనపరంగాను పూర్తి స్వేచ్ఛ, భద్రత కల్పించబడినాయి. చర్చల సందర్భంగా వారు వెలబుచ్చిన విషయాలపై ఆసభ తప్పించి, ఎవరూ వారిని శిక్షించజాలరు. ఆయాసభాపతుల ముందుస్తు అనుమతి లేనిదే వారిని నిర్బంధించటానికిగాని, కట్టడి చేయటానికి కానివీలులేదు. శాసనసభ్యుల

BRAOU

విధినిర్వహణలో అడ్డువచ్చిన లేక యిబ్బంది పెట్టిన వ్యక్తులు, సంస్థలపై శాసనసభ సముచితమైన చర్య తీసికుంటుంది. ఈరకమైన చర్యలవలన శాసనసభ్యులు తమ విధులను సర్వస్వతంత్రంగా నిర్వహించటానికి, తద్వారా శాసనసభ ఔన్నత్యాన్ని పెంపొందించటానికి వీలవుతుంది.

## 22.4 కమిటి పద్ధతి

శాసనసభల పని విధానంలో కమిటీలు ముఖ్యపాత్ర వహిస్తాయి. ఆధునిక శాసనసభలు నిర్వర్తించవలసిన విధులు విభిన్నమైనవే గాక, పరిమాణాన్ని బట్టి వాటికున్న పరిమిత కాలంలో ఆ విధులను నిర్వహించటంకూడ చాల కష్టము. అందునా ఈరోజున శాసనసభలు 500 నుండి 600 వరకు సభ్యులను కలిగియుండి, శాసనసభ విధాన నియామాలను (Rules of Procedure) అనుసరిస్తూ, శాసనసభ ముందుకు వచ్చే వివిధ శాసన నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించటానికి సౌలభ్యం లేని రీతిలో ఉన్నాయి. అందువలన ఈ రోజున పార్లమెంటరీ ప్రభుత్వవిధానంలోకాని, అధ్యక్ష ప్రభుత్వ విధానంలో కాని శాసనసభలు చాలావరకు తమవ్యవహారాలను కమిటీల ద్వారానే నిర్వహిస్తున్నాయి.

శాసనసభ కమిటీలు సాంకేతికంగా చెప్పాలంటే శాసనసభ సభ్యులతో కూడిన కొంతమంది వ్యక్తుల సమూహాలు. ఏదైనా చర్చనీయాంశానికి సంబంధించి అవసరమైన సమాచారాన్ని సేకరించటం లేదా దర్యాప్తు జరపటం లేక మొత్తం సభా స్థూలంగా అంగీకరించిన విషయానికి సంబంధించిన వివరాలను సేకరించటం కమిటీల బాధ్యత. అవిధంగా కమిటీలు సర్వస్వతంత్రంగా ఉండవు. దాన్ని నియమించిన శాసనసభకు జవాబుదారీగా, బాధ్యత వహించేవిగా ఉండవలసివస్తుంది. అంతేగాక, శాసనసభ కమిటి సమీక్షించిన బిల్లును అదేరూపంలో ఆమోదించాల్సిన బాధ్యత సిద్ధాంతరీత్యా శాసనసభ మీదలేక పోయినప్పటికి, ఆచరణలో ఏదైనా బిల్లును అందుకు సంబంధించిన కమిటి తిరస్కరిస్తే దానిని ఎన్నడూ చట్టంగా చేయటం జరగదు.

శాసనసభ వ్యవహారలలో సహాయకారిగా కమిటీలను నియమించటం మనేది పార్లమెంటరీ ప్రభుత్వ విధానమంత పురాతనమైనది. 14వ శతాబ్దంలో బ్రిటిషు పార్లమెంటు చట్టాలను రూపొందించటానికి కమిటీలను ఏర్పాటు చేసే పద్ధతిని ప్రారంభించింది. అవిధంగా కమిటీ పద్ధతి అనేది బ్రిటన్‌లో చాలా పురాతన పద్ధతికాగా, అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కమిటీలు చాలా సమర్థవంతంగా పనిచేస్తూ అభివృద్ధి చెందాయి.

భారదేశంలో బాగా అభివృద్ధి చెందిన కమిటీ వ్యవస్థ నెలకొంది. ఇది చాలవరకు బ్రిటిషు పద్ధతిని పోలిఉంది. ఇండియాలో పార్లమెంటరీ కమిటీలు ఆయాసభల తీర్మానాల ద్వారా నియమించబడటం లేదా ఎన్నికకాబడటం కాని లేదా సభాధికారులు ద్వారా నియమించబడటం కాని జరుగుతుంది. ఈ కమిటీలను స్థూలంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి (1) సభ వ్యవస్థీకరణ, అధికారాలకు సంబంధించి సాధారణ స్వభావం కలిగిన కమిటీలు, ఉదాహరణకు నియమాలకు సంబంధించిన కమిటీ, హక్కుల కమిటీ, సభావ్యవహారాల సలహా కమిటీ మొదలైనవి. (2) శాసన నిర్మాణ విధిలో సభకు సహకరించే కమిటీలు. ఉదాహరణకు రెండు సభలకు చెందిన సెలెక్టు కమిటీలు, ముఖ్యమైన బిల్లులను పరిశీలించటానికి తాత్కాలికంగా నెలకొల్పబడిన జాయింటు సెలెక్టు కమిటీలు మొదలైనవి (3) కార్యనిర్వాహక వర్గాన్ని అదుపు చేయటానికి ఏర్పాటు చేయబడిన కమిటీలు. ఉదాహరణకు అధీన శాసన నిర్మాణంపై కమిటీ,

BRAOU

ప్రభుత్వ హామీల కమిటి, పబ్లిక్ ఎక్కౌంట్స్ కమిటి, అంచనాల కమిటి, ప్రభుత్వ సంస్థల కమిటి. ఈ చివరి మూడు కమిటిలు ప్రభుత్వ వ్యయాన్ని నియంత్రించటంలో చాలా ముఖ్యపాత్ర వహిస్తాయి.

**కమిటిపద్ధతి - అనుకూలవాదాలు :** శాసనసభలలో కమిటీలను నియమించటంలో ముఖ్యోద్దేశం శాసన వ్యవహారాలకు సంబంధించిన పనిని తొందరగాను, సమర్ధవంతంగాను నిర్వహించటమే. ఈ క్రింది కారణాల వలన ఇది సాధ్యమౌతుందని చెప్పవచ్చు.

1. ఒక పెద్ద సౌలభ్యం లేని సంస్థకన్నా ఒక చిన్న బృందమే మరింత తరుచుగా సమావేశం కాగలదు. మరింత సమర్ధవంతంగా సమాలోచనలు జరుపగలదు. కమిటీ పద్ధతివలన సమాలోచన పద్ధతి విశాల సభలోకన్న మరింత సరళంగా, ఇష్టాగోష్టి పూర్వకంగా యుంటుంది. చర్చపై పరిమితులేమీయుండవు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, సూటిగా వెల్లడించే అవకాశం సభ్యులకు ఉంటుంది.

2. ఇతరేతర పని ఒత్తిడులు, వాదప్రతివాదాలు, దురభిప్రాయాలు ఉండవు కనుక కమిటి మరింత సమర్ధవంతంగా పనిచేయగలదు. కమిటి సభ్యులు పరిశీలనలోని విషయాలపై ఇతోధిక సమయం వెచ్చించి, తద్వారా ఆచితూచి ఒక నిర్ణయానికి రాగలుగుతారు. అదే ఒక పెద్ద సమావేశంలో పరిమిత వ్యవధిలో ఇలాంటి ఒక నిర్ణయానికి రావటం సాధ్యంకాదు.

3. ప్రత్యేక విషయాలపై ప్రత్యేక పరిజ్ఞానం గల సభ్యుల్ని శాసనసభలో ఒక కమిటిగా ఏర్పాటు చేయవచ్చు. అంతేగాక శాసనసభలో సభ్యులు కాని మేధావుల నుండి సలహా, సంప్రదింపులను పొందటానికి కమిటి పద్ధతి అవకాశం యిస్తుంది. కనుక ఈరీత్యా కమిటి పద్ధతి ఎంతో ఉపయోగకరమైనది. ఈవిధంగా శాసనాలు చేయటంలో నిపుణల విజ్ఞాన సంపదను వినియోగించుకోవటం శాసనసభకు వీలౌతుంది.

4. ఎదైనా ప్రత్యేక విషయాలపై పరిశోధనలు జరపాలన్నా, విచారణ చేయాలన్నా అది మొత్తంగా ఒక విశాలసభలో కన్నా ఒక కమిటీలోనే ఎక్కువగా సాధ్యపడుతుంది. ఉదాహరణకు లోక్‌సభలోని ప్రభుత్వ హామీలకమిటీ సభలో మంత్రులు చేసిన వాగ్దానాలను ఎంతవరకు నెరవేర్చింది, ప్రభుత్వాన్ని విచారిస్తుంది, పరిశీలిస్తుంది. ఈ పనిచేయటానికి శాసనసభ్యుల వ్యక్తిగత హోదాలో కంటె, కమిటి ద్వారా సమర్ధవంతంగా నిర్వహించటానికి వీలుంటుంది.

5. కమిటీల పద్ధతి శాసనసభలో యున్న అన్ని రాజకీయ పక్షాలకు ప్రాతినిధ్యం కల్పించటానికి అనువుగా యుంటుంది. అంతేగాక కమిటీల పద్ధతి శాసనసభ్యులకు కొంత పనికూడ కల్పిస్తుంది. లేకుంటే సాధారణంగా వారు చేయవలసిన పని చాలా తక్కువగా యుంటుంది. నిజానికి శాసనసభలో ముఖ్యమైన పనులలో అత్యధిక భాగం నేడు కమిటిలే చేస్తున్నాయి.

ఈవిధంగా వివిధ కమిటీలను నెలకొల్పటంలో ప్రధానలక్ష్యం శాసన నిర్మాణం సత్వరంగా జరిగేటట్లు, బిల్లులపై చర్చ సమగ్రంగా జరిగేటట్లు చూడటమే. శాసనసభ్యులు కాని నిపుణుల నుండి సాక్ష్యం సేకరించటం, ప్రతిపాదనలో యున్న చట్టం ప్రభావానికి లోనయ్యే వివిధ ప్రయోజన బృందాలతో సంప్రదించటం కూడ కమిటీలకు సాధ్యం అవుతుంది.

**కమిటి పద్ధతి - ప్రతికూలవాదాలు :** కమిటిపద్ధతి వలన ఎన్నో లాభాలున్నా, అందులో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. అవి :

B R A O U

1. శాసన నిర్మాణంలో కుదిరికను, పొందికను కమిటి పద్ధతి తగ్గించి వేస్తుంది. ప్రతికమిటి తన సొంత బిల్లులకే పరిమితం కావటం వలన విభిన్న కమిటీలు ప్రతిపాదించే వివిధ బిల్లుల నడుమ కుదిరిక, పొందికకు అవకాశం తక్కువగా యుంటుంది. కనుక అంతిమంగా శాసనసభ రూపొందించే చట్టాల్లో కూడ కుదిరిక, పొందిక తగ్గిపోతాయి.

2. ఒక శాసన నిర్మాణ వ్యవస్థగా శాసన సభకున్న ఐక్యతను కమిటి పద్ధతి నాశనం చేస్తుంది. శాసనాలు రూపొందించే అసలు పనంతా కమిటీల్లోనే జరగటం వలన సభ్యుల శ్రద్ధాసక్తులన్నీ సభలో జరిగే సమాలోచనలపై కంటే కమిటీల చుట్టూనే కేంద్రీకృతమవుతాయి. ఈరకం దృక్పథం శాసన నిర్మాణంలో శాసనసభకున్న ప్రాముఖ్యాన్ని దెబ్బతీస్తుంది.

3. కమిటి పద్ధతి శాసనసభ అధికారాలను కమిటీలలో కేంద్రీకృతం చేస్తుంది. కొన్ని కమిటీలు, అందునా ముఖ్యంగా విత్తవ్యవహారాలకు సంబంధించిన కమిటీల సభ్యులు, వాటికున్న విస్తృత అధికారాలను ఆధారంగా చేసికొని ప్రభుత్వంలో ఒక ద్వితీయస్థాయి మంత్రివర్గంలాగా పనిచేస్తాయి. దానికితోడు, ఈ అధికారాలను చాలవరకు రహస్యంగా చెలాయించటం మూలంగా అవి బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవచ్చు.

4. కమిటీ పద్ధతివలన అవినీతి, లోపాయికారి వ్యవహారాలు వర్ధిల్లే అవకాశం ఉంటుంది. కమిటీల్లో మామూలుగా కొద్దిమంది సభ్యులే ఉంటారు కాబట్టి వారిని ప్రలోభాలకు లోనుచేయటం సులువు. అంతేగాక ఈ కమిటీలు సమాలోచనలన్నీ ఒకవేళ బహిరంగంగానే జరిగినప్పటికి, పత్రికల్లో ప్రచురించరు. కనుక వాటిని గురించి తెలిసికోవటం ప్రజాస్వామ్యానికి వీలుపడదు. అదేవిధంగా ఈ వ్యవహారమంతా త్వరత్వరగా జరిగిపోతుంది. అందువలన ఈ కమిటీలు కార్యకలాపాలను ప్రజలు గమనించే అవకాశం చాలా తక్కువగా యుంటుంది.

5. ఈ పద్ధతి శాసనసభలో చర్చను బాగా పరిమితం చేస్తుంది. ప్రతివిషయమూ కమిటీలలోనే పరిష్కారం అయిపోతుంది. కనుక శాసనసభ ఆసక్తితో చర్చించకుండానే బిల్లులను ఆమోదించటానికి మాత్రమే పరిమితమై పోతుంది.

## 22.5 ఆధునిక కాలంలో శాసనసభల క్షీణతకు కారణాలు

పందొమ్మిదవ శతాబ్దంలో శాసనసభలకు అపారమైన ప్రతిష్ఠ, ప్రాభవాలు ఉండేవి. కాని ఇటీవలికాలంలో వాటి ప్రాధాన్యత గణనీయంగా తగ్గిపోయింది. ప్రపంచమంతటా శాసనసభల ప్రతిష్ఠ, అధికారాలు ఇట్లా క్రమంగా క్షీణించిపోవటానికి అనేక కారణాలున్నాయి, అవి :

1. సంక్షేమ రాజ్యభావన : 'సంక్షేమరాజ్యం' లేదా 'సామాజిక సేవారాజ్యం' అనేది ఆధునిక రాజ్యం యొక్క ఒక ముఖ్యలక్షణంగా సంతరించుకోవటంతో ఇటీవలి కాలంలో శాసనసభకు, కార్యనిర్వాహక వర్గానికి మధ్య సాపేక్ష ప్రాధాన్యతలలో మార్పు వచ్చి శాసనసభ ప్రాముఖ్యం క్షీణించటానికి కారణమయింది. ఈరోజున ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. దాని ఫలితంగా ఆధునిక రాజ్యంలో శాసనసభల అధికారాలు, విధులు సాపేక్షంగా పరిమితమై కార్యనిర్వాహక వర్గం అధికారాలు, విధులు విపరీతంగా పెరిగిపోయాయి.

**2. దత్తశాసనాధికారం :** ప్రపంచంలో ప్రతిచోటా శాసనసభలపై శాసన నిర్మాణ కార్యక్రమాలభారం అధికమై అవి కేవలం అస్థిపంజర రూపంతోనే చట్టాలు చేయగలగుతున్నాయి. ఈ రేఖారూప చట్టాలకు ప్రాథమిక న్యాయసూత్రాల చట్రంలో సవివరంగా నియమనిబంధనలు సమకూర్చవలసిన విధి కార్యనిర్వాహక వర్గానిది. ఈవిధంగా శాసన నిర్మాణాధికారాలు కూడ కార్యనిర్వాహక వర్గానికే దత్తత చేయటం జరుగుతుండటంతో అది శాసనసభ ప్రాబల్యం క్షీణించటానికి దారి తీసింది.

**3. ప్రభుత్వ కార్యకలాపాల విస్తరణ :** ప్రభుత్వ కార్యకలాపాలు విస్తృతంకావటంతో పౌరులకు ఇదివరకెన్నడూ లేనంతగా పరిపాలనా విభాగాలతో సంపర్కం ఎక్కువవుతున్నది. అటువంటప్పుడు పెచ్చుపెరిగిపోతున్న ప్రజల ఫిర్యాదులు, బాధలను పరిష్కరించటం శాసనసభ్యులకు అలవికాని పని అవుతున్నది. కనుక తమ ఫిర్యాదుల, బాధల పరిష్కారానికి ప్రజలు నేరుగా కార్యనిర్వాహక వర్గంతోనే సంప్రదిస్తున్నారు. పర్యవసానంగా, శాసనసభల ప్రాధాన్యత సహజంగానే క్షీణించి పోతున్నది.

**4. శాసన కార్యక్రమాల క్లిష్టత, జటిలత్వం :** శాసనసభ వ్యవహారాలతో సహా ప్రభుత్వ వ్యవహారాలన్నీ ఎంత అపరిమితంగా, జటిలంగా రూపొందాయంటే శాసనసభలోని సామాన్య సభ్యులు వాటిని తగువిధంగా అవగాహన చేసికోవటం, వాటిపై చర్చించటం కష్టం అవుతున్నది. కనుక ఆధునిక ప్రభుత్వాలకు ఎదురయ్యే ఇలాంటి వైవిధ్యంగల వ్యవహారాలను చక్కబెట్టడానికి శాసనసభలు కార్యనిర్వాహక వర్గ నాయకత్వం పై ఆధారపడుతున్నాయి. ఇది సహజంగా శాసనసభలతో పోలిస్తే, న్యాయకోవిదులను, పరిపాలనాదక్షులను కలిగియుండే కార్యనిర్వాహక వర్గాల ప్రాముఖ్యం పెరగటానికి దోహదం చేసింది.

**5. ప్రణాళికా రచన :** ఆధునిక కాలంలో ప్రభుత్వ నిర్వహణలో ప్రణాళికా రచన అతిముఖ్యమైన కార్యక్రమం అయింది. కనుక ప్రణాళికలను రూపొందించటం, వాటిని అమలు చేయటానికి కార్యనిర్వాహక వర్గాలకు శాసనసభ ఇతోధికమైన అధికారాలను కట్టబెట్టక తప్పడం లేదు.

**6. రాజకీయ పక్షాలు :** బాగా వ్యవస్థీకృతమైన జాతీయ రాజకీయ పార్టీల ఆవిర్భావం కూడ శాసనసభల ప్రాముఖ్యం క్షీణించటానికి ఎంతో దోహదం చేసింది. శాసనసభలో అధికార రాజకీయ పక్షం సభ్యులు, ప్రతిపక్ష రాజకీయ పక్షాలకు చెందిన సభ్యులు తమతమ పార్టీ విప్‌ల ఆదేశాలనుబట్టి వ్యవహరిస్తారే తప్ప శాసనసభ అంశాలపై స్వతంత్రంగా నిష్పాక్షికంగా అభిప్రాయాలను వెలిబుచ్చరు. ఆవిధంగా వారు తమ తమ పార్టీల ఆదేశాలను బట్టి వ్యవహరిస్తున్నారే తప్ప, వివిధ శాసనాంశాల మంచి చెడులను బట్టి వారు వ్యవహరించరు. దాని ఫలితంగా శాసనసభ కార్యక్రమాలు ఒకఫార్సుగా మారిపోయాయి. ఆకారణంగా కూడ శాసనసభల ప్రాముఖ్యం చాలవరకు తగ్గిపోయిందని చెప్పవచ్చు.

**7. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థ :** పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో శాసనసభ పూర్తి మద్ధతును పొందిన కార్యనిర్వాహకవర్గం అపారమైన అధికారాలను, కొన్ని కొన్నిసార్లు నియంతృత్వ అధికారాలను సైతం చెలాయించగలగుతుంది. ఈ పరిణామం కూడ శాసనసభ ప్రాముఖ్యం తగ్గిపోవటానికి దారి తీసింది.

ఈవిధంగా ఇటీవలి కాలంలో శాసనసభ ప్రాముఖ్యం సాపేక్షంగా క్షీణించి పోయినప్పటికి, ప్రభుత్వ వ్యవస్థీకరణలో శాసనసభది యింకా ఒక ముఖ్యమైన స్థానమని అంగీకరించక తప్పదు. కార్యనిర్వాహక వర్గం యొక్క నియంతృత్వ వైఖరిని అదుపుచేయటంలో శాసనసభ ఒక సాధనంగా ఉపయోగపడుతున్నది. అది ఇప్పటికీ ప్రజల సమస్యల్ని స్వేచ్ఛగా చర్చించటానికి ఒక 'వేదిక'గానే భావించబడుచున్నది. ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు వెదికేది ఈ వేదికపైనే. శాసనసభ వ్యక్తం చేసే అభిప్రాయాలను కార్యనిర్వాహకవర్గం గౌరవించాలి. ఆవిధంగా కార్యనిర్వాహక వర్గం ప్రజల కోర్కెలపట్ల సముచితంగా ప్రతిస్పందించేటట్లు, బాధ్యతాయుతంగా వ్యవహరించేటట్లు శాసనసభ చూడగలుగుతుంది.

BRAOU

## 22.6 క్లుప్తంగా

శాసనసభ ఒక ముఖ్యమైన ప్రభుత్వ అంగం. శాసనసభ రూపొందించే శాసనాలు, చట్టాల ప్రాతిపదికపైనే మిగిలిన ప్రభుత్వాంగాలైన కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థలు తమ విధులను నిర్వహిస్తాయి. శాసననిర్మాణ, రాజ్యాంగ సవరణాధికారాలు, ప్రభుత్వ పరిపాలన విభాగాన్ని పర్యవేక్షించి అదుపుచేసే అధికారాలు శాసనసభకే ఉంటాయి. ఇంకా అది ప్రభుత్వంపై విత్తపరమైన అదుపును కూడ కలిగి ఉంది. దాని సమ్మతి లేకుండా ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వమైనా రాజ్యానికి కావలసిన ఆదాయం పోగు చేయటానికిగాని, లేకవచ్చిన ఆదాయాన్ని ఖర్చు చేయటానికి కాని కుదరదు. శాసనసభ నిర్దేశించిన సరళిలో మాత్రమే ప్రభుత్వం వ్యయం చేయవలసి యుంటుంది. ఆ అధికారం ద్వారా ప్రభుత్వ ఆంతరంగిక విధానాలనేగాక, విదేశీ విధానాన్ని కూడ శాసనసభ అదుపు చేయగలుగుతుంది. ఈవిధంగా ఒక ప్రజాస్వామిక ప్రభుత్వంలో ఇతర ప్రభుత్వ అంగాలతో పోలిస్తే శాసనసభకే ఉన్నత స్థానం ఉంటుంది.

పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గం శాసనసభకు దాదాపుగా దాసోహమన్నట్లుగానే యుంటుంది. శాసనసభా విశ్వాసాన్ని చూరగొన్నంత కాలమే అది పదవిలో కొనసాగుతుంది. కనుక కార్యనిర్వహక వర్గం శాసనసభకు బాధ్యత వహించేదిగా, ప్రతిస్పందనను చూపేదిగా ఉండాలి. శాసనసభ ద్వారా అది మొత్తం ప్రజలకు బాధ్యత వహించాలి, ప్రతిసంపదనను చూపాలి. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోవలె అధ్యక్ష తరహా పాలన యున్న దేశాలలో రాజ్యానికి చెందిన ఉన్నతాధికారాలు నియామకంలో శాసనసభకు కూడ కార్యనిర్వాహక వర్గంతో పాటుగా అధికారాలు ఉంటాయి. అంతేగాక అధ్యక్షుడు కుదర్చుకున్న ఒడంబడికలను శాసనసభ ధృవపరచవలసి ఉంటుంది కూడ. అనేక దేశాలలో కార్యనిర్వాహక వర్గం సభ్యుల్ని ఎన్నుకునే విశేషాధికారాలు కూడ శాసనసభకు ఉంటాయి. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో జనప్రియ నిలయం (దిగువసభ) నాయకుడే ప్రధానమంత్రి అవుతాడు. ఇటువంటి రాజ్యాలలో ఉండే నామమాత్ర రాజ్యాధినేతను (Titular Head) సాధారణంగా శాసనసభ్యులే ఎన్నుకుంటారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకుంటారు. కాని పూర్తి మెజారిటితో నిర్ణయంకాని పక్షంలో అధ్యక్షుని ఎన్నికను ప్రతినిధుల సభ (దిగువసభ), ఉపాధ్యక్షుని ఎన్నికను సెనేట్ (ఎగువసభ) అంతిమంగా నిర్ణయిస్తాయి. ఇంకా అవసరమైనపుడు కార్యనిర్వాహక వర్గ సభ్యులను తొలగించే అధికారం కూడ శాసనసభలకు ఉంటుంది. అమెరికా, భారతదేశంలో ఆయా రాజ్యాంగాలు నిర్దేశించిన విధంగా మహాభియోగ ప్రక్రియ ద్వారా అధ్యక్షుణ్ణి లేదా రాష్ట్రపతిని తొలగించవచ్చు. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో, దిగువసభ విశ్వాసాన్ని ఎప్పుడు కోల్పోతే అప్పుడు ప్రభుత్వాధినేత (ప్రధానమంత్రి)ని పదవినుండి తొలగించవచ్చు. ఈవిధంగా ఆధునిక ప్రభుత్వాలలో శాసనసభకు విస్తృతమైన అధికారాలు ఉన్నాయి.

అయితే అధికారాలన్నీ ఉన్నా, ఇటీవలి కాలంలో అనేక కారణాలవలన శాసనసభ ప్రాధాన్యత క్షీణించిపోతున్నదని చెప్పకతప్పదు. సంక్షేమ రాజ్యభావన ఆమోదం పొందటం, దత్త శాసనాధికారం, ప్రణాళికా రచన మొదలైన కారణాలవలన కార్యనిర్వాహక వర్గం ప్రాధాన్యత ఎక్కువగా పెరిగి, అదే స్థాయిలో శాసనసభల ప్రాధాన్యత తగ్గిపోయింది. కార్యనిర్వహక వర్గం ప్రాధాన్యత పెరగటంతోబాటు, రాజకీయ పక్షాలు, ప్రయోజన వర్గాలు వంటి రాజకీయం, రాజకీయేతరమైన వ్యవస్థల ఆవిర్భావం కూడ శాసనసభల ప్రాధాన్యత క్షీణించటానికి తమవంతు పాత్ర పోషిస్తున్నాయి.

## 22.7 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| A.C. Kapoor | : | Principles of Political Science |
| Amal Ray & Mohit Bhattacharya | : | Political Theory |

## 22.8 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. శాసనసభల అధికారాలు, విధులను వివరించుము
2. ఆధునిక కాలంలో శాసనసభల ప్రాధాన్యత క్షీణించటానికి కారణాలేమి ? చర్చించుము

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ఆధునిక కాలంలో శాసనసభ ఏవిధంగా శాసన నిర్మాణాధికారాన్ని సముపార్జించు కోగలిగింది?
2. 'శాసన నిర్మాణం శాసనసభ యొక్క ముఖ్యమైన విధి' చర్చించుము.
3. శాసనసభ్యులు తమ విధులను స్వతంత్రంగా నిర్వహించటానికి కల్పించబడిన రక్షణలను వివరించుము.
4. ప్రజాస్వామిక ప్రభుత్వంలో శాసనసభ యొక్క ఆదిక్య స్థానాన్ని ఏవిధంగా సమర్ధించవచ్చు ?

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

BRAOU

# భాగం-23: కార్యనిర్వాహక వర్గం

## విషయ సూచిక


23.0 లక్ష్యాలు

23.1 పరిచయం

23.2 కార్యనిర్వాహక వర్గం - అర్థం

23.3 కార్యనిర్వాహకవర్గం - రకాలు

23.3.1 వాస్తవ మరియు నామమాత్రపు కార్యనిర్వాహక వర్గం

23.3.2 ఏకవ్యక్తి మరియు బహుజన కార్యనిర్వాహక వర్గం

23.3.3 పార్లమెంటరీ మరియు అధ్యక్ష కార్యనిర్వాహక వర్గం

23.3.4 వారసత్వ, ఎన్నికకాబడిన మరియు నియోజిత కార్యనిర్వాహక వర్గం

23.3.5 రాజకీయ మరియు శాశ్వత కార్యనిర్వాహక వర్గం

23.4 ప్రధాన కార్యనిర్వాహకుడు - పదవీకాలం

23.5 కార్యనిర్వాహక వర్గం - అధికారాలు, విధులు

23.5.1 పరిపాలనావిధులు

23.5.2 దౌత్యవిధులు

23.5.3 సైనిక విధులు

23.5.4 శాసన నిర్మాణ విధులు

23.5.5 విత్తపరమైన విధులు

23.5.6 న్యాయవిధులు

23.5.7 ఇతర విధులు

23.6 దత్తశాసన నిర్మాణాధికారం - అర్థం ప్రాముఖ్యం

23.7 కార్యనిర్వాహక వర్గం - అధికారాల పెరుగుదల - కారణాలు

23.8 క్లుప్తంగా

23.9 చదవదగిన పుస్తకాలు

23.10 నమూనా ప్రశ్నలు


BRAOU

## 23.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- కార్యనిర్వాహక వర్గం అర్థాన్ని విశ్లేషించి, వాటిలో రకాలను తెలుపగలరు
- ప్రధాన కార్యనిర్వహకుడ్ని ఎన్నుకునే పద్ధతులను విశదీకరించగలరు
- కార్య నిర్వాహకవర్గం అధికారాలు, విధులను వివరించగలరు
- దత్తశాసనం అర్థాన్ని, ప్రాముఖ్యాన్ని చర్చించగలరు
- కార్యనిర్వాహక వర్గం అధికారాల పెంపుదలకు కారణాలను తెలుపగలరు.

## 23.1 పరిచయం

ఈ భాగంలో వివిధరకాల కార్యనిర్వహక వర్గాలను గురించి, కార్యనిర్వాహక వర్గం ప్రాముఖ్యతను సంతరించుకోవటానికి గల కారణాలను గురించి తెలిసికుంటారు.

కార్యనిర్వాహక వర్గం ప్రభుత్వంలో రెండవ ముఖ్యమైన అంగం. శాసనసభ ప్రజల సంకల్పానికి రూపుదిద్ది, చట్టాలు చేస్తే కార్యనిర్వాహక వర్గం వాటిని అమలుచేస్తుంది. వాస్తవానికి కార్యనిర్వాహకవర్గం శాసనాలను అమలు చేయటమే కాక మరెన్నో విధులను నిర్వహిస్తుంది. "ప్రభుత్వంతో తమవాటాలను పార్లమెంటు, న్యాయస్థానాలు తీసుకున్న తరువాత మిగిలిన వాటాలన్నింటిని భుక్తం చేసికొనే అవశిష్ట వారసత్వం". కార్యనిర్వాహక వర్గానిదని ఫైనర్ అభిప్రాయపడినాడు. కానీ నిర్వాహకవర్గానికుండే విస్తృత అధికారాలు, విధులనుబట్టి ప్రభుత్వమంటే శాసనసభ, న్యాయవ్యవస్థ కూడ చేరియున్నప్పటికి, సామాన్య ప్రజలు కార్యనిర్వాహక వర్గాన్నే ప్రభుత్వంగా చూస్తూ యుంటారు.

BRAOU

## 23.2 కార్యనిర్వహక వర్గం - అర్థం

"కార్యనిర్వాహక వర్గం" అనే పదాన్ని రెండు అర్థాలలో వాడుతారు. స్థూలమైన అర్థంలో కార్యనిర్వాహక వర్గం అంటే మొత్తం మంత్రులంతా, ప్రభుత్వోద్యోగాలు, పోలీసులు, చివరికి సాయుధ బలగాలు కూడానని చెప్పవచ్చు. ఈవిశాలార్థంలో కార్యనిర్వాహక వర్గం అంటే "చట్టరూపంలో రూపొందించబడి, ప్రకటితం అయిన రాజ్యసంకల్పాన్ని అమలుచేసేందుకు సంబంధించిన సమస్త సంస్థలు, విధి నిర్వాహకుల మొత్తమే" నని చెప్పవచ్చు. ఇక రెండవది ఈ పదాన్ని సంకుచిత అర్థంలో ప్రధాన కార్యనిర్వాహక రాజ్యాధినేతను, ఆయనసలహాదారులు, మంత్రులను సూచించటానికి మాత్రమే వాడడం నేడు సర్వసాధారణమై పోయింది. ఆ అర్థంలో భారత దేశానికి సంబంధించి కార్యనిర్వాహక వర్గం అంటే భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి నాయకత్వంలోని ఇతరమంత్రులందరూనని అర్థం వస్తుంది. ఆ సంకుచిత అర్థంలేని కార్యనిర్వాహక వర్గాన్ని "రాజకీయ కార్యనిర్వాహక వర్గం" అని కూడ అంటారు. ఈవిధంగా రాజకీయ కార్యనిర్వాహక వర్గంలో ఎన్నికల ద్వారా ప్రజల మద్ధతుతో అధికారంలోకి వచ్చే కొద్దిమంది వ్యక్తులే ఉంటారు. వారు తమ విధానాలకు మద్ధతు కోసం శాసనసభపై ఆధారపడవలసిన వారవుతారు. విధానాలను రూపొందించి, అవినక్రమంగా

విశ్వాసాన్ని కోల్పోయిన వెంటనే అది పదవినుండి తప్పుకొంటుంది. కాబట్టి ఇటువంటి కార్యనిర్వాహక వర్గాన్ని బాధ్యతాయుతమైన కార్య నిర్వాహకవర్గమని కూడ అంటారు. ఇటువంటి పార్లమెంటరీ కార్యనిర్వాహక వర్గం బ్రిటన్, ఇండియా, శ్రీలంక, ఆస్ట్రేలియాలో నెలకొని ఉంది. ఇటువంటి వ్యవస్థ బాధ్యతాయుతమైన, సమర్ధవంతమైన ప్రభుత్వాన్ని నెలకొల్పుతుంది. దేశాన్ని రాజ్యాంగ ప్రతిష్ఠంభనల నుండి పరిరక్షిస్తుంది. అంతేగాక, ఎటువంటి యిబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ప్రభుత్వాల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తుంది.

కార్యనిర్వాహక వర్గం శాసననిర్మాణ సభకు బాధ్యత వహించకుండా, స్వతంత్రంగాయున్నట్లైతే అటువంటి కార్యనిర్వాహక వర్గాన్ని అధ్యక్ష కార్యనిర్వాహక వర్గం అని చెప్పవచ్చు. ఈ వ్యవస్థలో వాస్తవ కార్యనిర్వాహణాధికారం అధ్యక్షుని చేతిలో యుంటుంది. అధ్యక్షుడు నిర్ణీత పదవీకాలానికి నియోజితగణం (Electoral college) వంటి ప్రత్యేక వ్యవస్థ ద్వారా ఎన్నికకాబడతాడు. అతనిని శాసన నిర్మాణసభ అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించలేదు. ఇటువంటి వ్యవస్థ అమెరికా, బ్రెజిల్ మరికొన్ని దక్షిణ అమెరికా దేశాలలో నెలకొనియున్నది.

## 23.3.4 వారసత్వ, ఎన్నిక కాబడిన మరియు నియోజిత కార్యనిర్వాహక వర్గం

అధికారాన్ని సంతరించుకున్న స్వభావాన్ని బట్టి కార్యనిర్వాహక వర్గాన్ని వారసత్వ లేక ఎన్నికకాబడిన లేక నియోజిత కార్యనిర్వాహక వర్గంగా వర్గీకరించవచ్చు. కార్యనిర్వాహక వర్గం వారసత్వంగా పదవిలోనికి వచ్చినట్లైయితే అటువంటి ధానిని వారసత్వ కార్యానిర్వాహక వర్గమనవచ్చు. ఇటువంటి కార్యనిర్వాహక వర్గం బ్రిటన్, జపాన్, నేపాల్, భూటాన్ మొదలైన దేశాలలో అమలులో ఉంది. ఇటువంటి వ్యవస్థలో, కార్యనిర్వాహక అధికారాలను సంతరించుకున్న వ్యక్తి అతని జీవితకాలం వాటిని చెలాయిస్తాడు. అతను చనిపోతే, అతని జ్యేష్ఠ కుమారుడు ఆ పదవిని అధిష్టిస్తాడు.

దీనికి భిన్నంగా ఎన్నికకాబడిన కార్యనిర్వాహక వర్గం ప్రజలచేత ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా కాని ఎన్నుకోబడతాడు. అతని పదవీకాలం ఒక నిర్ణీత కాలానికి పరిపరిమితమై యుంటుంది. ఇటువంటి కార్యనిర్వాహక వర్గం అమెరికా, ఇండియా, ఫ్రాన్సు, శ్రీలంకలలో మనకు కనబడుతుంది.

కొన్ని సమయాలలో కార్యనిర్వాహక వర్గం నియమితంకావచ్చు. బ్రిటిషువారి పాలనలో ఇండియాకు గవర్నర్ జనరల్‌లను బ్రిటిషు రాణి నియమించేవారు. ఈరోజుకూ కెనడా, ఆస్ట్రేలియాల గవర్నర్ - జనరల్‌లను బ్రిటిష్ రాణే నియమిస్తూ యుంటారు. అయితే వారిని ఆయాప్రభుత్వాలు సూచిస్తూ ఉంటాయి.

## 23.3.5 రాజీకయ మరియు శాశ్వత కార్యనిర్వాహక వర్గం

కార్యనిర్వాహక వర్గాన్ని రాజకీయ మరియు శాశ్వత కార్యనిర్వహక వర్గంగా వర్గీకరించవచ్చు. రాజకీయ కార్య నిర్వహక వర్గం ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులతో కూడియుండి, ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరిస్తారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గం పదవీకాలం సాపేక్షంగా తక్కువగా యుంటుంది. ప్రభుత్వ విధానాలను రూపొందించటానికి, వాటిని అమలు చేయటానికి అది బాధ్యత వహిస్తుంది. దీనికి భిన్నంగా శాశ్వత కార్యనిర్వాహక వర్గం లేక శాశ్వత పౌరసేవారంగం (Permanent Civil Services) యుంటుంది. ఇది రాజకీయాలతో సంబంధంలేని, శాశ్వత పదవీకాలన్ని కలిగియున్న, విస్తృతమైన అధికారాల బృందంతో కూడి యుంటుంది. వీరిని సాధారణంగా పోటీ పరక్షల ద్వారా అర్హతలు ఆధారంగా నియమిస్తారు. వీరుతమ విధి నిర్వహణలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తారు.

## 23.4 ప్రధాన కార్యనిర్వాహకుడు - పదవీకాలం

ప్రధాన కార్యనిర్వాహకుని పదవీకాలం వివిధ దేశాలలో విభిన్నంగా యుంటుంది. వారసత్వ కార్యనిర్వాహక వర్గం నెలకొనియున్న దేశాలలో ప్రధాన కార్యనిర్వాహకుడు అతని జీవితకాలం పదవిలో యుంటాడు. కాని ఎన్నికకాబడిన కార్యనిర్వాహకవర్గం యున్న దేశాలలో ఆతని పదవీకాలం ఒక సంవత్సరం నుండి, 7 సంవత్సరముల వరకు దేశాన్నిబట్టి భిన్నంగా యుంటుంది. ఉదాహరణకు ఇండియాలో అధ్యక్షుని పదవీకాలం అయిదు సంవత్సరాలుంటే, అమెరికా అధ్యక్షుని పదవీకాలం నాలుగు సంవత్సరములు మాత్రమే. స్విట్జర్లాండ్ ఫెడరల్ కౌన్సిల్ పదవీకాలం నాలుగు సంవత్సరాలుండి, ప్రతిసంవత్సరానికి అధ్యక్షుడు మారుతూ ఉంటాడు. నియోజిత గవర్నర్ - జనరల్‌లున్న కెనడా, ఆస్ట్రేలియాలలో వారి పదవీకాలం అయిదు సంవత్సరాలుండగా, ఇటలీ, ఫ్రాన్సు మరియు ఐర్లాండ్‌లలో అధ్యక్షులు ఏడు సంవత్సరాలకు ఎన్నికకాబడతారు. ఆవిధంగా వారి పదవీకాలం ఒకేవిధంగా యుండక, విభిన్నంగా యుంటుంది.

ప్రధాన కార్యనిర్వాహకుని పదవీకాలం మరీ ఎక్కువగా కాని, మరీ తక్కువగాకాని యుండరాదనేది సాధారణ అభిప్రాయం. పదవీకాలం మరీ ఎక్కువగా యుంటే కార్యనిర్వాహకుడు నియంతగా మారే అవకాశం ఉంటుంది. మరీ తక్కువగా యుంటే అతడు కొంత అనుభవాన్ని సంపాదించుకొనే సమయానికి పదవి నుండి తొలగిపోవలసి వస్తుంది. అందువలన అతని అనుభవం దేశానికి ఉపయోగకరంకాదు. మరియు ప్రభుత్వ విధానాలు అవిచ్ఛిన్నంగా కొనసాగటానికి వీలుకాదు. కాబట్టి ప్రధాన కార్యనిర్వాహకుని పదవీకాలం నాలుగు లేక అయిదు సంవత్సరాలుంటే బాగుంటుందనేది జనామోదం పొందింది. అంతేగాక ప్రధాన కార్యనిర్వాహకుడు రెండవసారి పదవిలో కొనసాగటానికి అవకాశం యివ్వటమనేది మంచిదని ఒక అభిప్రాయం. ఆవిధంగా చేయటం వలన అతడు శాసననిర్మాణ సభకు ప్రత్యక్షంగాను, ప్రజలకు పరోక్షంగాను ప్రతిస్పందిస్తూ, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాడు. ఈరకంగా రెండవసారి అవకాశం యివ్వటం అనేది ఇండియా, అమెరికావంటి అనేకదేశాలలో బహుళ ప్రాచుర్యాన్ని పొందింది.

## 23.5 కార్యనిర్వాహక వర్గం - అధికారాలు, విధులు

B R A O U

ఆధునిక రాజ్యాలన్నింటిలో కార్యనిర్వాహక వర్గం ప్రభుత్వం యొక్క ముఖ్యాంగంగా పరిణామం చెందింది. దాని ప్రాధాన్యత ఎటువంటిది అని అంటే ఈ రోజున ప్రభుత్వం అంటే కార్య నిర్వాహకవర్గంగానే భావించటం జరుగుతోంది. కొర్రి భావించినట్లుగ "ప్రభుత్వం యొక్క సారాంశం కార్యనిర్వాహక వర్గం. శాసననిర్మాణశాఖ, న్యాయ నిర్ణయశాఖ దానికి రాజ్యాంగ బద్ధతను కలుగజేసే సాధనాలు మాత్రమే". అయినప్పటికి కార్యనిర్వాహక శాఖ అధికారాలు, విధులు అన్ని రాజ్యాలలో ఒకే విధంగా లేవు. ప్రభుత్వం యొక్క స్వరూప స్వభావాలను బట్టి అవి మారుతూఉన్నాయి. అయినప్పటికి సాధారణంగా కార్య నిర్వాహకశాఖ నిర్వహించే ముఖ్యమైన విధులను ఈ క్రింది విధంగా గుర్తించవచ్చు.

### 23.5.1 పరిపాలనా విధులు

పరిపాలనావిధి అని అంటే చట్టాల అమలు మరియు ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాల నిర్వహణ అని అర్థం. సమాజంలో శాంతి భద్రతలను నెలకొల్పటం కార్యనిర్వాహక శాఖ ముఖ్యవిధి. రాజ్యంలో ఆంతరంగిక పరిపాలనకు అధిపతిగా యుండే కార్యనిర్వాహక వర్గం చట్టాల అమలును ఆదేశించి,

పర్యవేక్షిస్తుంది. ఇందుకుగాను కార్యానిర్వాహకాధిపతికి తనక్రింది అధికారులను నియమించటానికి, ఆదేశించటానికి, తొలగించేందుకు అధికారాలు ఉంటాయి. దీనికి అవసరమైన నియమనిబంధనలను రూపొందిస్తుంది. పెరుగుతున్న మరియు మారుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అది క్రొత్తశాఖలను, ఏజన్సీలను, సంస్థలను నెలకొల్పుతుంది. సమర్థవంతమైన, కట్టుదిట్టమైన పరిపాలనను అందించటానికి వీలుగా వివిధ శాఖల మధ్య పనులను కేటాయిస్తుంది. అంతేగాక ప్రజల ప్రయోజనాలను, సంక్షేమాన్ని అభివృద్ధి చేయటానికి వీలుగా అది ప్రభుత్వ విధానాలను రూపొందించి, వాటిని అమలు చేస్తుంది. సమాజంలోని ప్రజల సర్వతో ముఖాభివృద్ధికి అనుగుణమైన వాతావరణాన్ని కల్పించటానికి అవసరమైన చర్యలను చేపబడుతుంది.

### 23.5.2 దౌత్యవిధులు

కార్యనిర్వాహకవర్గం దౌత్యవిధులు ఇతరదేశాలతో సంబంధాలు సాగించటానికి సంబంధించినవి. ఆధునిక కాలంలో ఏరాజ్యము ఏకాకిగా మనుగడ సాధించలేదు. కాబట్టి అది ఇతర రాజ్యాలతో స్నేహ సంబంధాలను పెంపొందించుకోవలసిన అవసరంయున్నది. దీనికి అవసరమైన ఏర్పాట్లను కార్యనిర్వాహక వర్గం చేయవలసి యుంటుంది. విదేశాలతో ఒడంబడికలు, ఒప్పందాలు చేసికోవటం, దౌత్యప్రతినిధులను నియమించటం, విదేశీ ప్రతినిధులను ఆహ్వానంపలకటం, ఐక్యరాజ్యసమితిలో భాగస్వామ్యం, ఇటువంటి ఇతర అంతర్జాతీయ వేదికలు, సంస్థలలో పాల్గొనటం - ఇవన్నీ దౌత్యవిధులు క్రిందకు వస్తాయి. విదేశీ దౌత్యప్రతినిధుల్ని స్వీకరించే అధికారంలో సాధారణంగా విదేశీ రాజ్యాలు, వాటి ప్రభుత్వాలను గుర్తించే అధికారం లేక వాటి స్వతంత్ర అస్తిత్వాన్ని గుర్తించ నిరాకరించే అధికారం కూడ చేరి ఉంటాయి. అదేవిధంగా ఇతర దేశాల రాజ్యాధిపతులను లేక ప్రభుత్వాధినేతలను ఆహ్వానించి, వారికి సాదర సత్కార్యాలను ఏర్పాటు చేస్తారు. ఈవిధంగా కార్యనిర్వాహక వర్గం అమలు చేసే దౌత్యవిధులు ఇతర దేశాలతో స్నేహ సంబంధాలను నెలకొల్పి, వాటిని పెంపొందించేవిగా ఉంటాయి.

సాధారణంగా కార్యనిర్వాహక వర్గం ఒక్కటి మాత్రమే లేక కొన్ని సందర్భాలలో శాసనసభ అనుమతితో లేక శాసనసభలోని ఏదైనా ఒకసభ అనుమతితో కార్యనిర్వాహక వర్గం ఒడంబడికలు, ఇతర అంతర్జాతీయ ఒప్పందాలను కుదుర్చుకుంటుంది. రహస్యం కాపాడటానికి, సత్వర చర్యల్ని సాధ్యం చేయటానికి కనీసం తొలిదశల్లోనైనా ఇందుకు సంబంధించిన సంప్రదింపుల నుండి శాసనసభను దూరంగా ఉంచుతారు. బ్రిటన్‌లో నేటికి సంధిచేసికునేధికారం చాలవరకు కార్యనిర్వహక వర్గం చేతుల్లోనే ఉంది. కార్యనిర్వాహక వర్గం సంధులకై సంప్రదింపులు సాగించటం, వాటిని కుదుర్చుకోవటం రెండూ చేస్తుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో పరస్పర వాణిజ్య ఒప్పందాలవంటి కొన్నిరకాల అంతర్జాతీయ ఒప్పందాలను అధ్యక్షుడే స్వయంగా కుదర్చుకొనవచ్చు. అయితే ఇతరరకాల సంధులను, ఒడంబడికలను సెనేట్ ధృవపర్చాల్సి ఉంటుంది. స్విట్జర్లాండ్‌లోనైతే పదిహేను సంవత్సరాల అవధికిమించిన అన్ని ఒడంబడికలను ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ధృవపర్చవలసి యుంటుంది.

### 23.5.3 సైనిక విధులు

కార్యనిర్వహకాధినేత (రాజ్యాధినేత) సాధారణంగా రాజ్యపు సైనిక బలగాలకు సర్వసేనాధ్యక్షుడుగా ఉంటాడు. ఆహోదాలో ఆతడు అధికారులను నియమించటం, తొలగించటం, సాయుధబలాలను ఉపయోగించటం, యుద్ధకార్యక్రమాలు నడిపించటం చేస్తాడు. ఇంగ్లండ్‌లాంటి రాజరిక సంప్రదాయం

ఉన్న దేశాలతో కార్యనిర్వాహకవర్గ సైనిక అధికారాల్లో యుద్ధం ప్రకటించే అధికారం కూడ చేరి యుంటుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో యుద్ధాన్ని ప్రకటించే అధికారం కాంగ్రెసుకు మాత్రమే యున్నది. కాని విదేశీ వ్యవహారలపై అదుపాజ్ఞలున్న అధ్యక్షుడు యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితులను కల్పించవచ్చు. యుద్ధసమయాలలో కార్యనిర్వాహకవర్గం అపరిమితమైన అధికారాలను చెలాయిస్తుంది. రాజ్యాధినేత సైనిక శాసనాన్ని ప్రకటించే, పౌరుల రాజ్యాంగపరమైన హక్కుల్ని నిలుపుదలచేసే అవకాశం అప్పుడుంటుంది. సైనిక అవసరాల దృష్ట్యా ప్రభుత్వ అధికారాన్ని విస్తృతం చేసే అధికారం అతనికి ఉంటుంది.

## 23.5.4 శాసననిర్మాణ విధులు

దేశంలోయున్న ప్రభుత్వ వ్యవస్థనుబట్టి కార్యనిర్వాహక వర్గపు శాసననిర్మాణ విధులు మారుతూ ఉంటాయి. పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహకవర్గానికి శాసనసభా సమావేశాల్ని ఏర్పాటు చేసే, ఆవిష్కరించే,వాయిదావేసే, విఘటితం (ప్రొరోగ్) చేసే అధికారాలు ఉంటాయి. అయితే అధ్యక్ష తరహా పాలనలో కార్య నిర్వాహక వర్గానికి ఈ అధికారాలు పరిమితమై పోతాయి. అక్కడ శాసనసభా సమావేశాలు నిర్ణీతకాలాలల్లో వాటంతటవే జరుగుతాయి. అంతేగాక పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో కార్యనిర్వాహక వర్గానికి శాసనసభను రద్దుచేసి తాజాగా ఎన్నికలు జరిపించే అధికారం ఉంటుంది. అయితే అధ్యక్ష తరహాపాలనలో ఈ అధికారం కార్యనిర్వాహక వర్గానికి ఉండదు.

ప్రధాన కార్యనిర్వాహకుడు సమ్మతిస్తేనే శాసనసభ ఆమోదించే ఏ బిల్లులైనా చట్టాలు కాగలుగుతాయి. శాసనసభ ఆమోదించిన బిల్లులకు సమ్మతినివ్వటానికి లేదా వాటిని తిరస్కరించటానికి (వీటో చేయటానికి) కార్యనిర్వాహక అధినేతకు అధికారం యుంటుంది. అయితే పార్లమెంటరీ ప్రభుత్వ వ్యవస్థలో ఈ వీటో అధికారానికి కాలం చెల్లిపోయింది. ఉదాహరణకు, భారతదేశంలో రాష్ట్రపతికి ఏదైనా బిల్లుకు ఆమోదముద్ర వేయకుండా నిరాకరించే అధికారం ఉంది. కాని అటువంటప్పుడు ఆయన ఆ బిల్లును తన సందేశంతో బాటుగా పార్లమెంటు పునఃపరిశీలన కోసం వెనక్కు పంపించాల్సి ఉంటుంది. పార్లమెంటు తిరిగి అదేబిల్లును సవరణలతోగాని లేక సవరణలు లేకుండాగాని ఆమోదించిపంపితే ఇక అప్పుడు రాష్ట్రపతికి తన ఆమోద ముద్రవేయక తప్పదు. అమెరికా సంయుక్త రాష్ట్రాలోనైతే అధ్యక్షుని వీటోను కాంగ్రెసు మూడింట రెండువంతుల మెజారిటీతో మాత్రమే త్రోసి పుచ్చగలదు. అయితే కాంగ్రెసులో మూడింట రెండువంతుల మెజారిటి సాధించటం చాల కష్టం. కనుక వీటో అధికారం అధ్యక్షుని చేతిలో అతిశక్తివంతమైన సాధనంగా ఉంటుంది. అమెరికన్ అధ్యక్షుడు 'పాకెట్‌వీటో'ను కూడా చెలాయించగలడు.

ఇంకా, అత్యధిక ఆధునిక రాజ్యాలలో కార్యనిర్వాహకవర్గానికి నియుక్త లేక దత్తశాసన నిర్మాణాధికారం ఉంది. శాసననిర్మాణ సభపై శాసనాలను రూపొందించే పనిభారం ఎక్కువగా ఉండటంవల్ల అది చట్టాల స్థూల రేఖాచిత్రణలు మాత్రమే చేయగలుగుతుంది. వాటి వివరాలను శాసననిర్మాణ సభ తనకు అప్పగించిన అధికారాలకు అనుగుణంగా కార్యనిర్వాహక వర్గమే రూపొందించాల్సి యుంటుంది. ఈ దత్త శాసన నిర్మాణాధికారం వల్ల కార్యనిర్వాహకవర్గం చేతుల్లోకి శాసననిర్మాణరంగపు అధికారాలకు సంబంధించి కూడ విస్తృతమై వివేచనాత్మక అధికారాలు లభించినాయి.

## 23.5.5 విత్తపరమైన విధులు

కార్యనిర్వాహక వర్గానికి విత్తపరమైన విధులు కూడ ఉంటాయి. బడ్జెటును తయారుచేసి, దానిని శాసన నిర్మాణసభకు సమర్పిస్తుంది. శాసననిర్మాణసభ అనుమతితో ప్రజలమీద, సంస్థలమీద వివిధరకాలైన పన్నులను విధించి, వసూలు చేస్తుంది. అంతేగాక శాసననిర్మాణసభ అనుమతితో వివిధ శాఖలకు వనరులను



BRAOU

కేటాయించటం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రాధాన్యతలను నిర్ధారించటం చేస్తుంది. లెక్కల తనిఖీ (ఆడిట్) ద్వారా వివిధ శాఖల వ్యయాన్ని క్రమబద్ధంచేసి, అదుపులో ఉంచుతుంది. ప్రజాసంక్షేమ మరియు ప్రణాళికాబద్ధ కార్యక్రమాలను నిర్వహించటానికి ప్రభుత్వాలు అపారనిధులను వెచ్చించాల్సి యుంటుంది. కాబట్టి కొన్ని సమయాలలో, అవసరమైనపుడు కార్యనిర్వాహక శాఖ ప్రజలనుండి, విదేశాలనుండి ఋణాలను సమీకరిస్తుంది. ఈరకమైన కార్యక్రమాల ద్వారా కార్యనిర్వాహక శాఖ దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని, ఆర్థికాభివృద్ధిని సాధించటానికి కృషి చేస్తుంది.

### 23.5.6 న్యాయవిధులు

న్యాయమూర్తులను నియమించే అధికారమేకాక, సముచితమైన కారణాలపై నేరస్థుల్ని క్షమించి వదిలే లేక వారి శిక్షలను నిలుపుదల చేసే అధికారం కూడ కార్యనిర్వాహక వర్గానికి ఉంది. అంతేగాక విప్లవోద్యమాలలో పాల్గొన్న వ్యక్తులకు క్షమాభిక్ష ప్రసాదించే అధికారం కూడ కార్యనిర్వాహక వర్గానికి ఉంది. క్షమాభిక్ష ప్రసాదించే అధికారం ఇవ్వటంలో ఉద్దేశం న్యాయవైఫల్యం సంబంవించిందనే సహేతుకుమైన సందేహం ఉన్నప్పుడు కార్యనిర్వాహక వర్గానికి కరుణచూపే అవకాశం ఉండాలనే బ్రిటన్‌లో ఈ అధికారాన్ని హోమ్ సెక్రటరీ సలహాపై రాజమకుటం (Crown) చెలాయిస్తుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో శిక్షకు ముందుగాని, ఆతరువాత కాని క్షమాభిక్ష ప్రసాదించే అధికారం అధ్యక్షునికి ఉంటుంది. భారతదేశంలో రాష్ట్రపతికి క్షమాభిక్షలు, శిక్షనిలపుదలలు, శిక్షలో రాయితీలు ప్రకటించే అధికారం యున్నది.

### 23.5.7 ఇతర విధులు

పైన వివరించిన విధులను సాధారణంగా కార్యనిర్వహక వర్గపు ప్రధాన విధులుగా భావిస్తారు. ఇవిగాక, కార్యనిర్వహకవర్గం అనేక ఇతరవిధులను కూడ నిర్వహిస్తుంది. దేశ ఆర్థికాభివృద్ధిని దృష్టిలో పెట్టకొని స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందిస్తుంది. ప్రజలకు విద్యాసౌకర్యాలు సమకూర్చటం, రవాణా, సమాచార వసతులు విస్తృతంగావించటం, వ్యాపార వాణిజ్యాలను పెంపొందించటం, శాంతి భద్రతల పరిరక్షణవంటి అనేక సంక్షేమ విధులను కూడ కార్యనిర్వాహకవర్గం నిర్వహిస్తుంది. నిరుద్యోగం, దారిద్ర్యం, అత్యవసర వస్తువుల కొరత, ఆర్థిక అసమానతలు మొదలైన వాటిని సమాజం నుండి తొలగించటానికి అవసరమైన చర్యలను ఇది చేబడుతుంది. వివిధరంగాలలో ప్రశంసనీయమైన కృషి సల్పిన ఉన్నత వ్యక్తులను గౌరవబిరుదులతోను, పురుస్కారలతోను గౌరవిస్తుంది. వాస్తవానికి కార్యనిర్వాహక వర్గం విధులు ఇవీ అని ఖచ్చితంగా గిరిగీసి చెప్పటం సాధ్యమేకాదు. ఈవిధంగా కార్యనిర్వాహక వర్గం విధులు, ప్రాముఖ్యం వేగంగా పెరిగిపోతున్నవి. సమీప భవిష్యత్తులో కార్యనిర్వాహక వర్గపు, ప్రభుత్వ పరిపాలనాశాఖల అధికారాలు, విధులు మరింతగా విస్తరించే అవకాశం కూడ ఉన్నదని చెప్పవచ్చు.

## 23.6 దత్తశాసననిర్మాణాధికారం - అర్థం, ప్రాముఖ్యం

ఇటీవలి సంవత్సరాలలో నియుక్త లేక దత్త శాసన నిర్మాణాధికారం వల్ల కార్యనిర్వాహక వర్గం అధికారాలు, విధులు అపారంగా పెరిగిపోయాయి. కార్యనిర్వాహక వర్గానికి శాసననిర్మాణసభ ప్రసాదించే శాసన నిర్మాణాధికారాన్నే నియుక్త లేక దత్తశాసన నిర్మాణాధికారం అంటారు. అందువలనన దీనిని కార్యనిర్వాహక వర్గపు శాసన నిర్మాణం అనికూడ అంటారు. అంతేగాక ఈ శాసన నిర్మాణాధికారం స్వతహాగా

BRAOU

వచ్చిన మౌలిక అధికారం కాక ఒక ఉత్పన్న అధికారం కావటంవలన దీనిని 'ఉత్పన్న శాసన నిర్మానాధికార' (Derived Legislation) లేక 'అధీన శాసన నిర్మాణాధికారం' (Subordinate Legislation) అనికూడ అంటారు.

### 23.6.1 నియుక్త శాసన నిర్మాణం - అవసరం

ప్రభుత్వ విధానాలను సున్నితంగాను, సమర్ధవంతంగాను అమలుచేయటానికి నియుక్త శాసన నిర్మాణాధికారం అనివార్యమవుతుంది. నియుక్త శాసననిర్మాణాధికారం ఆవిర్భవించటానికి, అది ప్రాచుర్యంలోనికి రావటానికి హెర్మాన్ ఫైనర్ నాలుగు కారణాలను వివరించినాడు. అవి :

1. శాసనసభల పనిభారం మితిమీరిపోవటం
2. సమస్యల సాంకేతిక, జటిలస్వభావం
3. పరిపాలనా పరమైన సరళత్వం లేక వివేచనల అవశ్యకత
4. ఊహించని ఆకస్మిక సంఘటనలను ఎదుర్కొనవలసిన అవసరం.

ఆధునిక "శ్రేయోరాజ్య" భావన రాజ్యం విధులను అపారంగా పెంచివేసింది. అందువలన ప్రభుత్వం చేబట్టే వివిధ ఈ సంక్షేమ కార్యక్రమాలన్నింటికి సంబంధించి సవివరమైన చట్టాలు, నియామనిబంధనలు అన్నింటిని రూపొందించటం శాసననిర్మాణ సభకు అసాధ్యం అవుతున్నది. కనుక అది (శాసన నిర్మాణసభ) చట్టాలను చేసే అధికారాన్ని కార్యనిర్వహక వర్గానికి అప్పగించవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. శాసన నిర్మాణసభ చట్టాలు స్థూలరేఖా చిత్రాలను మాత్రమే రూపొందిస్తుంది. మిగిలిన వివరాలన్నింటిని కార్యనిర్వాహక వర్గమే నింపవలసి యుంటుంది. అయితే ఈ వివరాలు సుసంగతంగా, ఖచ్చితంగా శాసనసభ ఆమోదించిన స్థూలచిత్రం పరిధిలోనే ఇమిడి ఉండవలసి యుంటుంది.

### 23.6.2 నియుక్త శాసన నిర్మాణాధికారం - ప్రయోజనాలు

నియుక్త లేక దత్తశాసన నిర్మాణాధికారం వలన చేకూరే ప్రయోజనాలను క్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. నియుక్త శాసన నిర్మాణాధికారం వలన శాసన నిర్మాణసభ మొత్తం మీద బాధ్యత దెబ్బతినకుండానే, దాని సమయం మాత్రం వృధా కాకుండా పొదుపు అవుతుంది. శాసన నిర్మాణానికి సంబంధించిన సూక్ష్మవివరాల్లోకి పోవలసిన అవసరం శాసనసభకు లేనందువలన అది రాజ్యానికి సంబంధించిన ముఖ్య సమస్యలపై తన దృష్టిని కేంద్రీకరించగలగుతుంది.

2. అది సరళత్వానికి (Flexibility) దోహదకారిగా ఉంటుంది. చట్టాల వివరాలను నింపే బాధ్యతను కార్యనిర్వాహక వర్గానికి అప్పగించటం వలన అది (కార్యనిర్వాహక వర్గం) మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలలోని ఖాళీలను నింపగలుగుతుంది.

3. పరిస్థితులలో తలయెత్తే ఆకస్మిక పరిణామలకు అనుగుణంగా అవసరమైన నియమనిబంధనలను రూపొందించుకొని వ్యవహరించే వివేచనాత్మక అధికారాన్ని అది (దత్తశాసనాధికారం) అధికారులకు ప్రసాదిస్తుంది.

4. నిపుణుల పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకునే అవకాశాన్ని నియుక్త శాసనాధికారం కలుగజేస్తుంది. శాసనాలకు సంబంధించిన సూక్ష్మ వివరాలను నిర్ణయించే నిపుణ జ్ఞానంలేని సామాన్యులే

BRAOU

సాధారణంగా శాసనసభలలో యుంటారు. కనుక, అనుభవం వలన ఇలాంటి నిపుణ జ్ఞానాన్ని సంతరించుకున్న అధికారులకు శాసనసభ వదిలిన ఖాళీలను పూర్తిచేసే అధికారాలు ఉండవలసిందే.

### 23.6.3 నియుక్త శాసన నిర్మాణాధికారం - ప్రతికూలతలు

వివిధకారణాలవలన నియుక్త శాసనాధికారాన్ని విమర్శించటం జరగుతోంది. అవి

1. నియుక్త శాసనాధికారం వలన కార్యనిర్వాహక వర్గం చేతుల్లో మరీ ఎక్కువ అధికారాలు కేంద్రీకృతం అవుతాయి. అది వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాదకరం కావచ్చు.

2. విధాన నిర్ణయం శాసనసభ ప్రధాన బాధ్యత. కాని కొన్నికొన్నిసార్లు ఈ అధికారాన్ని కూడ నియుక్త శాసనాధికారం వలన కార్యనిర్వాహక వర్గానికి అప్పగించటం జరగవచ్చు. ఇది గర్హనీయం.

3. నియమ నిబంధనలను శాసననిర్మాణసభ తగు విధంగా తనిఖీ చేయకపోయినట్లైతే, అది కార్యనిర్వాహక వర్గ నిరంకుశత్వానికి దారితీయవచ్చు. ప్రజాస్వామ్య సూత్రాలప్రకారం శాసనసభ కార్యనిర్వాహక వర్గాన్ని అదుపు చేయాలి. కాని నియుక్త శాసన నిర్మాణాధికారం వలన శాసనసభను కార్యనిర్వాహకవర్గమే అదుపుచేసే పరిస్థితి తలయెత్తవచ్చు.

కనుక నియుక్త శాసనాధికారాన్ని అవసరమైన చెడుగా భావించవచ్చు. స్వయంగా శాసనసభే అన్నిరకాల విషయాలపై సవివరమైన చట్టాలను రూపొందించలేదు కాబట్టి, నియక్తు శాసనాధికారం అవసరము. అయితే కార్యనిర్వాహక వర్గానికి తగిన ప్రాముఖ్యమిస్తుంది. కాబట్టి, సజావైన సంరక్షణలు సరియైన జాగరూకత లేకుంటే అది దుర్వినియోగం కాగల ప్రమాదం కూడ ఉంది. కనుక అది (నియుక్త శాసనాధికారం) ఒక చెడుకూడ. ఏమైనా ఆధునిక ప్రభుత్వాలలో నియుక్త శాసనాధికారం పరిధిలో, పరిమాణంలో, ప్రాముఖ్యతలో అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నదని గమనించాలి.

## 23.7 కార్య నిర్వాహకవర్గం అధికారాల పెరుగుదల - కారణాలు

ఆధునిక కాలంలో కార్యనిర్వాహక వర్గం పరిధి, ప్రాముఖ్యం స్థిరంగా పెరుగుతూనే ఉన్నాయి. 19వ శతాబ్దంలో ప్రజలకు ప్రాతినిధ్య శాసనసభలపట్ల ఉన్న విశ్వాసం స్థానే నేడు కార్యనిర్వాహక వర్గం పట్ల విశ్వాసం చోటు చేసికుంటున్నది. జనాభా పెరుగుదల, ప్రజావసరాలు పెరగటం, జటిలమైన ప్రభుత్వ వ్యవస్థ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, సామ్యవాద - శ్రేయోరాజ్యభావనల ప్రాచుర్యం మొదలైనవి ఆధునిక కాలంలో కార్యనిర్వాహక వర్గం యొక్క ప్రాధాన్యత ఇతోధికంగా పెరగటానికి దోహదం చేస్తున్నాయి. వాటిలో ముఖ్యమైన వాటిని ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

1. **శ్రేయోరాజ్యభావన :** ఆధునిక కాలంలో శ్రేయోరాజ్యభావన కార్యనిర్వాహక వర్గానికి విస్తృతమైన అధికారాలను సంక్రమింపజేసింది. సాంఘిక సంక్షేమ భావనకు అంకితమైన రాజ్యాలలో సామాజిక, ఆర్థిక సంస్కరణలకు సంబంధించిన శాసనాలు కార్యనిర్వాహక వర్గాన్ని అపరిమితంగా శక్తివంతం చేసినాయి.

2. **నియుక్త శాసన నిర్మాణాధికారం :** నియుక్త శాసననిర్మాణాధికారం కూడ కార్యనిర్వాహక వర్గం ప్రాముఖ్యత పెరగటానికి ఎంతగానో దోహదం చేసింది. శాసన సభ చట్టాల స్థూల చట్రాన్ని రూపొందించి, మిగిలిన ఉపసూత్రాలు, నియమ నిబంధనలనెన్నింటినో సవివరంగా రూపొందించే అధికారాన్ని కార్యనిర్వాహక వర్గానికి వదిలివేస్తుంది.



BRAOU

**3. శాసనసభ పనిభారం మితిమీరటం :** దాదాపు ప్రతిదేశంలోను శాసనసభ పనిభారం ఎంతగా పెరిగిపోయిందంటే, అది కార్యనిర్వాహకవర్గంపై కేవలం నామమాత్రపు అదుపాజ్ఞలను మాత్రమే చెలాయించ గలగుతున్నది. తగిన సమయం, నిపుణపరిజ్ఞానం కొరవడటంవలన, శాసనసభలు పరిపాలనకు సంబంధించిన సూక్ష్మ వివరాలను చర్చించలేకపోతున్నాయి. ఫలితంగా కార్యనిర్వాహకవర్గం తన విధుల నిర్వహణలో అపారమైన వివేచనాత్మక అధికారాలను అనుభవించగలుగుతున్నది.

**4. రాజకీయ పార్టీలు :** విభిన్న రాజకీయ వ్యవస్థలుగల అన్నిదేశాలలోను సంఘటిత రాజకీయ పార్టీలు ఆవిర్భవించటం కూడ కార్యనిర్వాహకవర్గం అధికారాల పెరుగుదలకు దోహదం చేసింది. ఉదాహరణకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో మెజారిటి పార్టీ మద్దతు పొందగలగిన కార్యనిర్వాహకవర్గం నియంతృత్వ అధికారాలను చెలాయించగలుగుతుంది.

**5. ప్రణాళికా రచన :** నేడు దాదాపు ప్రతిరాజ్యం పెద్ద ఎత్తున ప్రణాళిక రచనకు పూనుకొంటున్నది. కార్యనిర్వహక వర్గమే ప్రణాళికలను రూపొందించి, వాటని అమలుచేయవలసి యుంటుంది. కనుక దానికి విస్తృత అధికారాలు ఉండవలసి వస్తున్నది.

ఈవిధంగా ఆధునిక ప్రభుత్వాలలో కార్యనిర్వహకవర్గం అపారమైన అధికారాలను, పలుకుబడిని కలిగి ఉంటున్నది. 19వ శతాబ్దంలో ప్రజలు శాసనసభ ఆధిక్యతను గురించి మాట్లాడుతూ యుండేవారు. కాగా నేడు వారు కార్యనిర్వాహకవర్గం యొక్క అధికారాల వల్ల విస్తరణపట్ల సుముఖంగా ఉన్నారు. నేటికి సిద్ధాంతపరంగా శాసనసభకే ఆధిక్యత యున్నప్పటికి, ఆచరణలో నిజానికి కార్యనిర్వాహక వర్గమే అన్నింటా ముఖ్యమైనదిగా ఉంటున్నది.

## 23.8 క్లుప్తంగా

కార్యనిర్వాహకశాఖ ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన అంగం. కార్యనిర్వాహకవర్గం లేకుండా ఏ రాజ్యమూమన లేదు. కార్యనిర్వాహకవర్గం అనే పదాన్ని రెండు విధాలుగా అర్థం చేసికోవచ్చు. స్థూలమైన అర్థంలో అది మంత్రులు, పెద్ద-చిన్న అధికారులందరిని, చట్టాల అమలుకు సంబంధించిన శాఖలన్నింటిని సూచిస్తుంది. కాని సంకుచిత అర్థంలో కార్యనిర్వాహక వర్గమంటే కేవలం ప్రధాన కార్యనిర్వాహకుడు మాత్రమే. 'కార్యనిర్వాహకవర్గం' అనే పదాన్ని ఈ రెండో అర్థంలో ఉపయోగించమే పరిపాటి అయింది.

వివిధరకాల కార్యనిర్వాహక వర్గాలున్నాయి. కొన్ని సందర్భాలలో కార్యనిర్వాహకవర్గం నామమాత్రపు అధికారాలను మాత్రమే కలిగి యుంటుంది. కాగా కొన్ని రాజ్యాలలో ప్రధాన కార్యనిర్వాహకుని వాస్తవ అధికారాలు ఉంటాయి. కొన్ని రాజ్యాలలో కార్యనిర్వాహక అధికారం ఒకేవ్యక్తిలో కేంద్రీకృతమై ఉంటే, మరికొన్ని రాజ్యాలలో అది అనేకమంది వ్యక్తుల నడుమ పంపకమై ఉండవచ్చు. అంతేగాక కార్యనిర్వహక వర్గాన్ని ఎంపిక చేసికొనే పద్ధతులు అనేకం ఉన్నాయి. వారసత్వసూత్రం, ప్రత్యక్ష జనప్రియ ఎన్నికలు, పరోక్ష ఎన్నికలు, శాసననిర్మాణ సభ ద్వారా ఎన్నికకావటం, చివరగా నామినేషన్ ద్వారా నియామకం ఇటువంటి పద్ధతులు.

కార్యనిర్వాహక వర్గం అధికారాలు, విధులు దేశదేశానికి ప్రభుత్వవ్యవస్థ తీరుతెన్నులను బట్టి మారుతూ ఉంటాయి. అయితే ప్రభుత్వ రూపంతో నిమిత్తం లేకుండా అన్ని రాజ్యాలలోను ప్రధాన కార్యనిర్వాహకుడు చట్టాల అమలుకు, శాంతిభద్రతల పరిరక్షణకు, విదేశాలతో సుహృద్భావ సంబంధాల వ్యవస్థాపనకు, వాటిని కొనసాగించటానికి, బడ్జెట్ తయారీకి ప్రధాన బాధ్యుడై ఉంటాడు. అంతేగాక మానవతావాద కారణాలరీత్య

BRAOU

శిక్షపడ్డ ఖైదీల శిక్షలు తగ్గించటానికి, లేకవారికి క్షమాభిక్ష ప్రసాదించటానికి తగిన అధికారాలు కూడ ప్రధాన కార్యనిర్వాహకునికి ఉంటాయి. ఈ విధులన్నింటివల్ల, నియుక్త శాసననిర్మాణాధికారాల వలన కార్యనిర్వాహకవర్గం ప్రాముఖ్యం అపారంగా పెరిగిపోయింది. కార్యనిర్వాహక వర్గం ప్రాముఖ్యత పెరిగిపోవటానికి శ్రేయోరాజ్యభావన, రాజకీయ పార్టీలు, ప్రణాళికా రచన కూడ తమవంతు దోహదం చేశాయి.

## 23.9 చదువదగిన పుస్తకాలు

| | | |
|---|---|---|
| A.C. Kapoor | : | Principles of Political Science |
| K.R. Acharya | : | A Text Book of Political Science |
| Arun Bhattacharya | : | An introduction to Political Science |

## 23.10 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. కార్యనిర్వాహకవర్గం అననేమి ? కార్యనిర్వాహకవర్గం వివిధరకాలు ఏమి ?
2. కార్యనిర్వాహకున్ని నియమించటానికున్న వివిధ పద్ధతులను వివరించుము ?
3. ఆధునిక ప్రభుత్వంలో కార్యనిర్వాహకవర్గం అధికారాలు విధులు ఏమి ?
4. నియుక్త (దత్త) శాసననిర్మాణాధికారం అంటే ఏమిటి ? నియుక్త శాసననిర్మాణాధికారం వలన ప్రయోజనాలు, ప్రతికూలతలను వివరించుము.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. కార్యనిర్వాహకవర్గం పరిపాలనా విధులు ఏమిటి ?
2. కార్యనిర్వాహక వర్గం ఏవిధంగా శాసననిర్మాణసభ అధికారాల పరిధిలోకి చొచ్చుకొని పోతున్నది?
3. ఆధునిక కాలంలో కార్యనిర్వాహకవర్గం ప్రాధాన్యతా పెరుగుదలకు దోహదం చేసిన వివిధ అంశాలు ఏమిటి ?

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

BRAOU

# భాగం-24 : న్యాయశాఖ - విధులు

విషయ సూచిక

24.0 లక్ష్యాలు

24.1 పరిచయం

24.2 న్యాయశాఖ - అర్థం, ప్రాధాన్యత

24.3 న్యాయశాఖ - వ్యవస్థీకరణ

24.4 న్యాయశాఖ - విధులు

24.4.1 శాసనాలకు వ్యాఖ్యానం చేయటం

24.4.2 పౌరహక్కుల పరిరక్షణ

24.4.3 రాజ్యాంగ సంరక్షణ

24.4.4 సమాఖ్య వ్యవస్థ పరిరక్షణ

24.4.5 శాసనరూప కల్పనా విధి

24.4.6 సలహాలనందించే విధి

24.4.7 రికార్డులను నిర్వహించు విధి

24.4.8 ఇతర విధులు

24.5 న్యాయవ్యవస్థ - స్వాతంత్ర్యం

24.5.1 న్యాయమూర్తుల నియామక పద్ధతి

24.5.2 న్యాయమూర్తుల తొలగింపు

24.5.3 పదవీకాలం

24.5.4 న్యాయమూర్తుల అర్హతలు

24.5.5 వేతనం, ఉద్యోగ పరిస్థితులు

24.5.6 న్యాయవిధులను వేరుచేయటం

24.6 న్యాయశాఖ - కార్యనిర్వాహకవర్గం

24.7 న్యాయశాఖ - శాసనసభ

24.8 న్యాయ సమీక్ష

24.9 క్లుప్తంగా

24.10 చదవదగిన పుస్తకాలు

24.11 నమూనా ప్రశ్నలు

B R A O U

## 24.0 లక్ష్యాలు

ఈ భాగం చదివిన తరువాత మీరు

- న్యాయశాఖ అర్థాన్ని, ప్రాధాన్యతను, విధులను వివరించగలరు.
- న్యాయవ్యవస్థకు స్వతంత్రత ఉండవలసిన అవశ్యకతను విశ్లేషించగలరు.
- న్యాయశాఖ, కార్యనిర్వాహకవర్గం, శాసనసభల సంబంధాలను విశదీకరించగలరు.
- న్యాయ సమీక్ష అర్థాన్ని వివరించి, దాని అవసరాన్ని అంచనా వేయగలరు.

## 24.1 పరిచయం

ప్రభుత్వ మూడవ విభాగం న్యాయశాఖ. ఈ భాగంలో మీరు న్యాయశాఖ అర్థాన్ని, విధులను, పాత్రను గురించి తెలుసుకుంటారు. న్యాయశాఖకు - కార్యనిర్వహకవర్గానికి, న్యాయశాఖకు - శాసనసభకు మధ్యగల సంబంధాలు ఇందులో వివరించబడినాయి.

## 24.2 న్యాయశాఖ - అర్థం, ప్రాధాన్యత

ప్రభుత్వం మూడవ ప్రధాన అంగం న్యాయశాఖ. నివేదించిన కేసులలో శాసనాలను అన్వయిస్తూ న్యాయశాఖ వివరణలను యిస్తూ ఉంటుంది. ప్రాచీన కాలంలో రాజు అత్యున్నత న్యాయాధిపతిగా పరిగణింపబడినాడు. రాజు వ్యక్తిత్వంలోనే ప్రభుత్వ విధులు నిర్వర్తించే మూడు శాఖలు మూర్తీభవించి ఉండేవి. కాని ఆ తరువాతి కాలంలో కార్యనిర్వాహక, న్యాయశాఖలు రెంటినీ ఒక్కరే నిర్వహించటంవల్ల ప్రజలకు న్యాయం జరగదని భావించారు. ప్రభుత్వపు మూడుశాఖల విధులను వేర్వేరు వ్యవస్థల అధీనంలో ఉంచితే ప్రజలు ఎక్కువ స్వేచ్ఛను అనుభవించగలరన్న విషయాన్ని మనం ఇంతకు పూర్వం తెలుసుకున్నాము.

వరుసక్రమంలో న్యాయశాఖ మూడవది అయినప్పటికీ, ప్రాధాన్యంలో మిగిలిన రెండు శాఖలకన్న తక్కువది కాదు. న్యాయశాఖ ప్రజలకు చేకూర్చే న్యాయంపై రాజ్యం నైతిక స్వభావం ఆధారపడి యుంటుంది. నిష్పాక్షికంగాను, త్వరితంగాను లభ్యమయ్యే న్యాయంపై ప్రజల శ్రేయస్సు ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వ శ్రేష్ఠతకు న్యాయశాఖ సామర్థ్యం కన్న మరొక పరీక్ష ఏదీలేదని లార్డ్ బ్రైస్ వ్యాఖ్యానించినాడు.

నివేదించిన కేసుల పరిష్కారంలో శాసనాలను అన్వయించి తీర్పు చెప్పే బాధ్యతగల అధికారుల బృందానికే న్యాయశాఖ అనిపేరు. రాజ్యం ప్రాథమిక బాధ్యతలలో వ్యక్తుల హక్కులను సంరక్షించే బాధ్యతే ప్రధానమైనది. అయితే వ్యక్తుల హక్కులను కేవలం ప్రకటించి రాజ్యాంగ రక్షణలు కల్పించటంతో సరిపోదు. ఇందుకు తోడుగా శాసనాల అర్థాన్ని నిర్ణయించి, వాటిని ఉల్లంఘించినపుడు, వాటికి రక్షణ కలిగించగలిగిన అధికారం గల వ్యవస్థ ఒకటి ఉండాలి. అలాంటి వ్యవస్థనే మనం న్యాయశాఖగా వ్యవహరిస్తున్నాము. వ్యక్తుల హక్కులకు న్యాయశాఖ సంరక్షకురాలిగా ఉంటూ ప్రభుత్వ వ్యవస్థ, ఇతరులు ఈ హక్కులను ఉల్లంఘించకుండా చూస్తుంది. శాసనబద్ధత విషయంలో అనుమానం కలిగినపుడు ఏ వ్యక్తి అయినా శాసన, కార్యనిర్వాహక శాఖల చర్యలను ప్రశ్నించవచ్చు. న్యాయశాఖ సమర్థతే వ్యక్తుల స్వాతంత్ర్యాలకు శ్రీరామ రక్ష. యదార్థానికి పౌరుల స్వాతంత్ర్యం, రాజకీయ వ్యవస్థ పరిధులను న్యాయశాఖ నిర్ణయిస్తుంది.

శాసనాలకు వ్యాఖ్యానం లేదా వివరణ చెప్పటమే న్యాయశాఖ ప్రాథమిక విధి. అది శాసనాలను ఆధారంగా చేసికొని వ్యక్తుల మధ్య, అదేవిధంగా వ్యక్తులకు - ప్రభుత్వానికి మధ్య తలయెత్తే వివాదాలను పరిష్కరిస్తుంది. వ్యక్తుల మధ్య, వ్యక్తుల సమూహాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను సివిల్ కేసులని పిలుస్తారు. అలాంటి కేసులలో శాసనం ప్రకారం వివాదంలో ఇరువర్గాల పరిస్థితిని నిర్ణయించి న్యాయశాఖ ఉచితమైన తీర్పును యిస్తుంది. ప్రభుత్వం వ్యక్తులకు వ్యతిరేకంగా చేసిన నేరారోపణలు క్రిమినల్ కేసులని పిలువబడతాయి. క్రిమినల్ కేసులలో న్యాయశాఖ నేరనిర్ధారణ చేసి, శాసనాన్ననుసరించి తగు శిక్ష విధిస్తుంది. ఈ విధంగా న్యాయశాఖ రెండు రకాలైన సివిల్, క్రిమినల్ కేసుల వివాదాలను పరిశీలించి పరిష్కరిస్తుంది.

న్యాయశాఖ దానంతటదే ఏవిధమైన చర్యలనూ చొరవతో ప్రారంభించదు. నష్టం పొందిన వారు కాని లేదా ప్రభుత్వం కాని న్యాయశాఖకు నివేదించు కోవలసియుంటుంది. న్యాయవ్యవస్థ సామాజిక సంస్కరణల విషయంలో చొరవ తీసికొనదు. కాని శాసనాలను అన్వయిస్తున్నపుడు న్యాయశాఖ, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపరిధిని తగ్గించటమో లేక విస్తృతపరచమో చేస్తుంది. రాజ్యంతో న్యాయశాఖ నిశ్చయాత్మకమైన, వ్యతిరేకాత్మకమైన పాత్రలను నిర్వహిస్తుంది. న్యాయశాఖ రాజ్యాంగ వ్యతిరేకమైన చర్యలను నిలుపుచేస్తుంది. సాంప్రదాయక భావాలను, మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా అన్వయించటం ద్వారా సామాజిక పరివర్తనకు న్యాయశాఖ సహాయపడుతుంది.

## 24.3 న్యాయశాఖ - వ్యవస్థీకరణ

శాసన, కార్యనిర్వాహక వర్గాలను వ్యవస్థీకరించిన విధంగా న్యాయశాఖను వ్యవస్థీకరించరు. అదేవిధంగా ఈ వ్యవస్థీకరణ అన్ని రాజ్యాలలోను ఒకేవిధంగా యుండదు. అయినప్పటికి, సాధారణంగా ప్రపంచంలోని అన్నిదేశాలలోను క్రింది కోర్టులనుండి పై కోర్టులకు అప్పీళ్ళు చేయగల ఆరోహణా క్రమంలో న్యాయశాఖ ఏర్పాటై ఉంటుంది. దేశంలోని అత్యున్నత న్యాయస్థానం వరకు, క్రింది న్యాయస్థానాల భౌగోళిక, అధికారిక పరిధులు ఆరోహణాక్రమంలో విస్తృత మవుతుంటాయి. దేశమంతటా శాసనాలను అన్వయించటంలోనూ, వ్యాఖ్యానం చెప్పటంలోను ఏకత్వం సాధించబడుతుంది. న్యాయస్థానాలన్నీ శాసనాలను ఒకేవిధంగా అన్వయించి, వ్యాఖ్యానించేటట్లుగా పర్యవేక్షించటమే అప్పీళ్ళు న్యాయస్థానాల ప్రధాన విధులు. రాజ్యాంగ సంబంధమైన వివాదాలను, శాసనాలకు సంబంధించిన ప్రధాన సమస్యలను దేశంలోని అత్యున్నత న్యాయస్థానం పరిష్కరిస్తుంది. ఉన్నత న్యాయ స్థానాలు ఇచ్చే తీర్పులు క్రమం తప్పకుండా ప్రకటించబడుతూ ఉంటాయి. వాటి నిర్ణయాలన్నీ శాసనాలకు ప్రధానమైన ఆధారాలవుతున్నాయి.

## 24.4 న్యాయశాఖ - విధులు

న్యాయశాఖ ప్రధానంగా న్యాయపాలనా విధులను నిర్వహిస్తుంది. ప్రజాస్వామిక రాజ్యాలలో న్యాయశాఖ రాజ్యం యొక్క ఒక స్వాతంత్ర వ్యవస్థగా పరిగణింపబడుతుంది. కాబట్టి అది అనేక ఇతర విధులను కూడ నిర్వహిస్తూ ఉంటుంది. వాటిని ఈక్రింది విధంగా వివరించవచ్చు.

BRAOU

### 24.4.1 శాసనాలకు వ్యాఖ్యానం చేయటం

న్యాయశాఖకు శాసనాలను వ్యాఖ్యానించి, వివాదాలనుబట్టి ఆయా శాసనాలను అన్వయించే అధికారం ఉంది. వివాదాల పరిష్కారంలో న్యాయమూర్తులు తమముందున్న కేసులను పరిశీలించి, శాసనాల యొక్క భాషను, స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకొని వాటి అర్థాన్ని నిర్ణయించి తమ తీర్పులను వెలువరించవలసి యుంటుంది. చట్టాలకు తగిన వివరణను యివ్వటంలో న్యాయమూర్తులు గతిశీలంగా ఉండవలిసిన అవసరం ఎంతైనా ఉంది. దానిని దృష్టిలో పెట్టుకొనే గెటిల్, "రాజ్యాంగము మరియు శాసనాలు ఎల్లప్పుడూ పరుషం(rigid)గా ఉంటాయి. న్యాయమూర్తులు వాటికి సరళత (Flexibility))ను ప్రసాదించవలసి యుంటుంది" అని అభిప్రాయపడినాడు. వారు న్యాయశాస్త్ర ప్రావీణ్యంతో, నిష్పాక్షికదృష్టితో మరియు హేతువాద దృక్పథంతో తమ తీర్పులను యివ్వవలసి యుంటుంది. వారు నేరస్థుల నుండి అమాయకులను, సచ్ఛీలురను రక్షించవలసి యుంటుంది. న్యాయమూర్తులు తమ తీర్పులను వెలువరించటంలో శాసనాల గుణాత్మకతను చర్చించరు. అమలులో యున్న శాసనాలను, కేసులోని యధార్థాలకు అన్వయించి తీర్పు చెబుతారు. శాసనాల అర్థాన్ని మాత్రమే వారు వివరిస్తారు.

### 24.4.2 పౌరహక్కుల పరిరక్షణ

ఆధునిక ప్రజాస్వామిక రాజ్యాలలో వివిధరకాలైన హక్కులను ఆయా రాజ్యాంగాలు ప్రజలకు కల్పించినాయి. అయితే రాజ్యాంగంలో ఈ హక్కులను పొందుపరచినంత మాత్రాన ప్రజలు వాటిని అనుభవించ లేరు. కాబట్టి సమాజంలోని ఇతరులు, అదేవిధంగా ప్రభుత్వం ప్రజల హక్కులను అతిక్రమించకుండా పరిరక్షించటానికి న్యాయవ్యవస్థ అవసరం ఎంతైనా ఉన్నది. దానికి అనుగుణంగా వ్యక్తుల హక్కుల పరిరక్షణకు అవసరమైన ఆజ్ఞలను లేదా తాఖీదుల (Writs) ను జారీ చేసే అధికారం న్యాయస్థానాలకు యివ్వబడింది. ఉదాహరణకు భారతరాజ్యాంగం ప్రకారం, హేబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, సెర్షియోరరి, కోవారంటో అనే అయిదురకాలైన తాఖీదులను ప్రజల హక్కుల పరిరక్షణకు జారీ చేసే అధికారం సుప్రీంకోర్టుకు, హైకోర్టులకు యివ్వబడింది.

### 24.4.3. రాజ్యాంగ సంరక్షణ

న్యాయశాఖ రాజ్యాంగ పవిత్రతను కాపాడే సాధనంగా వ్యవహరిస్తుంది. శాసనసభా రూపొందించే వివిధ శాసనాల రాజ్యాంగ బద్ధతను న్యాయమూర్తులు నిర్ణయిస్తారు. ముఖ్యంగా ఈ అధికారం న్యాయవ్యవస్థలోని అత్యున్నత న్యాయస్థానానికి చెందిన న్యాయమూర్తులకు ఉంటుంది. వారికి శాసనసబ రూపొందించిన లేదా కార్యనిర్వాహకశాఖ అమలు చేసిన ఏశాసనాన్నైనా లేక దానిలోని ఏ భాగాన్నైనా, అది రాజ్యాంగానికి విరుద్ధంగా యుంటే, అది చెల్లుబాటుకాదని ప్రకటించే అధికారం ఉన్నది. ఈవిధంగా శాసనోల్లంఘనాలను, హక్కుల అటకాయింపులను న్యాయస్థానాలు నిరోధించి, రాజ్యాంగం యొక్క ఔన్నత్యాన్ని సంరక్షిస్తాయి.

### 24.4.4. సమాఖ్య వ్యవస్థ పరిరక్షణ

న్యాయశాఖ సమాఖ్య వ్యవస్థకు సంరక్షణాధికారిగా కూడ వ్యవహరిస్తుంటుంది. సమాఖ్య రాజ్యాంగం లిఖిత రాజ్యంగా యుండి, వివిధ ప్రభుత్వశాఖల అధికార పరిధులను నిర్వచిస్తుంది. ప్రభుత్వాధికారాలు

BRAOU

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజించబడటం వలన వివిధ శాఖల మధ్య వివాదాలు ఉత్పన్నమయ్యే అవకాశాలున్నాయి. అందువలన వివిధ శాఖలు రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించాయా లేదా అన్న అంశాన్ని సమాఖ్యలో పరిశీలించటానికి ఒక స్వాతంత్రమైన వ్యవస్థ అవసరం. సమాఖ్యలో న్యాయశాఖ వివిధ ప్రభుత్వ శాఖల మధ్య, అదేవిధంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజ్యాంగబద్ధమైన సమతుల్యాన్ని సంరక్షించే బాధ్యతలను కూడ నిర్వహిస్తుంది.

## 24.4.5 శాసన రూపకల్పనా విధి

న్యాయశాఖ శాసనాలను వ్యాఖ్యానించటం లేక వివరించటం మాత్రమేగాక, కొన్ని సమయాలలో శాసనాలను రూపొందించటం కూడ జరుగుతుంది. న్యాయస్థానాలకు నివేదించిన కొన్ని కేసులలో అమలులో ఉన్న శాసనాలు అస్పష్టంగా ఉండి అన్వయించటం చాల కష్టమవుతుంది. లేక అమలులో ఉన్న శాసనాలు ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉండి ఏ శాసనాన్ని ఆ కేసులో అన్వయించాలో తెలియని సందిగ్ధ పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి సందర్భాల్లో న్యాయమూర్తులు అన్వయించదగిన శాసనాన్ని నిర్ణయించి, దాని పరిధిని, అర్థాన్ని వివరించే విధులను కూడ నిర్వహిస్తుంటారు. అటువంటి సూత్రాలనే న్యాయమూర్తుల శాసనాలని (Judge-made Laws) పిలుస్తుంటారు. న్యాయమూర్తులు కేసుల గుణయోగ్యతలను మూల్యాంకనం చేసి న్యాయం, సర్వసామాన్య జ్ఞానం, సమతాసూత్రాల ప్రాతిపదికగాతీర్పును నిర్ణయిస్తారు. శాసనాలు లేని శూన్యతను భర్తీ చేయటానికి సమత ఉద్దేశించబడినది. ఆవిధంగా రూపొందించిన శాసన సూత్రాలను తర్వాత నివేదితమయ్యే కేసులకు అన్వయించే సంప్రదాయం అనుసరించబడుతున్నది. శాసనాన్ని వ్యాఖ్యానిస్తున్నప్పుడు న్యాయమూర్తి అర్ధశాసనవర్గంగా వ్యవహరిస్తూ, నూతన శాసన సూత్రాలను రూపొందిస్తాడు. అదే న్యామూర్తుల శాసనాలుగా అమలులోనికి వస్తాయి. ఆవిధంగా శాసనసభచే ఆమోదించబడిన శాసనాలను వ్యాఖ్యానించటమేగాక నూతన శాసనాలను కూడ న్యాయస్థానాలు రూపొందిస్తూ ఉంటాయి. ప్రతిదేశపు న్యాయవ్యవస్థలోను న్యాయమూర్తుల శాసనాల పరిమాణం చాల ఎక్కువగానే ఉంటుంది.

BRAOU

## 24.4.6 సలహాలనందించే విధి

కొన్నిదేశాలలో న్యాయశాఖ ప్రభుత్వానికి సలహా యిచ్చే విధులను కూడ నిర్వహిస్తుంటుంది. అది శాసనాలను రూపొందించటంలో తలెత్తే క్లిష్ట సమస్యలకు సంబంధించి కార్యనిర్వాహక శాఖకు ముఖ్యమైన సలహాదారుగా వ్యవహరిస్తుంది. ఉదాహరణకు, తన దృష్టిలో అధిక ప్రజా ప్రయోజనంగల సమస్యను లేదా శాసనాన్ని సుప్రీంకోర్టు సలహా నిమిత్తం నివేదించే అధికారం భారత రాజ్యాంగంలో రాష్ట్రపతికి ఇవ్వబడింది. అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని కొన్ని రాష్ట్రాలలో శాసనప్రతిపాదనలపై సలహాయిచ్చే అధికారం న్యాయశాఖకు ఇవ్వబడింది.

## 24.4.7 రికార్డులను నిర్వహించు విధి

న్యాయశాఖ న్యాయమూర్తుల తీర్పులను భద్రపరచు న్యాయస్థానం (Court of Record) గా కూడ వ్యవహరిస్తుంది. అది వివిధ న్యాయమూర్తుల తీర్పులను, ఆ తీర్పులకు సంబంధించిన పత్రాలను తన గ్రంథాలయంలో భద్రపరుస్తుంది. అందువలన ఆ తరువాతి కాలంలో ఇదేరకమైన కేసులు న్యాయస్థానాల

ముందుకు వచ్చినపుడు, ఈ తీర్పులు, పత్రాలు న్యాయవాదులకు, ఆయా న్యాయమూర్తులకు సహాయకారిగా ఉపయోగపడతాయి.

### 24.4.8 ఇతర విధులు

పైన వివరించిన విధులుకాక న్యాయశాఖ సామాన్యంగా అనేక ఇతర విధులను కూడ నిర్వహిస్తూ ఉంటుంది. అయితే ఈవిధంగా నిర్వహించే విధులు న్యాయస్వభావాన్ని కలిగి ఉండవు. చాలా ప్రజాస్వామిక దేశాలలో ముఖ్యకార్యనిర్వాహక అధిపతులు పదవిని అధిష్ఠించే సమయంలో చేసే ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆయాదేశాల ప్రధానా న్యాయమూర్తులు నిర్వహిస్తారు. అంతేగాక కొన్నిదేశాలలో ప్రధాన న్యాయమూర్తులు తాత్కాలిక రాజ్యాధిపతులుగా వ్యహరిస్తారు. కొన్ని సమయాలలో న్యాయశాఖ మైనర్ల ఆస్థి సంరక్షణకు ట్రస్టీలు లేక సంరక్షకులను నియమిస్తుంది. ఆస్థి హక్కుల వివాదాల్లో తుది పరిష్కారం జరిగేవరకు న్యాయస్థానాలు ఆస్థులను నిర్వహించటానికి పాలకులను, రిసీవర్లను, ట్రస్టీలను నియమిస్తాయి.

ఈవిధంగా న్యాయశాఖ వివిధరకాలైన విధులను నిర్వహిస్తూ, దేశానికి సంబంధించిన న్యాయ, రాజకీయ మరియు పరిపాలనా వ్యవహారాలలో చాలా ప్రముఖమైన పాత్రలు నిర్వర్తిస్తున్నది. రెండవ ప్రపంచయుద్ధం తరువాత సమాజం పట్ల న్యాయశాఖ పాత్ర కొన్ని గుణాత్మకమైన మార్పులకు లోనుకావలసివస్తున్నది. రెండో ప్రపంచ యుద్ధాంతం నుండి సాంఘిక సంక్షేమ సూత్రం రాజ్యం మార్గదర్శక సూత్రంగా సర్వత్రా పరిగణించబడింది. సామాజిక అసమానతలను నిర్మూలించి సామాజిక న్యాయం నెలకొల్పటం సంక్షేమ రాజ్య ప్రథమకర్తవ్యంగా అంగీకరించబడింది. సామాజిక మార్పులకు దోహదం కల్పించే ప్రతిప్రయత్నంలోను ప్రయివేటు ఆస్థులుగల వర్గం అడ్డుపడుతున్నది. సామాజిక న్యాయసాధనకు న్యాయస్థానాలు ఆటంకం కలిగిస్తున్నవన్న విమర్శలు చేయబడుతున్నాయి. శాసనాన్ని ఉన్నదిఉన్నట్లుగా వ్యాఖ్యానించటమే న్యాయస్థానాల పని. న్యాయమూర్తులు శాసనస్వభావం గురించి ఆలోచించవలసిన అవసరంలేదు. నిష్పాక్షికతగల న్యాయమూర్తులనే నియమిస్తున్నప్పటికి న్యాయశాఖలో మానవస్వభావాన్ని వేరు చేయలేకపోతున్నాం. న్యాయమూర్తులు కూడ మానవులే కనుక వారు కొన్ని పరిమితులలో మానవ స్వభావసంబంధమైన బలహీనతలకు లోనవుతుంటారు. న్యాయశాఖా వ్యవస్థ హేతుబద్ధమైనదిగాను, యాంత్రికమైనదిగాను, శాసనబద్ధమైనదిగాను ఉంటుంది. కానీ న్యాయమూర్తుల వ్యక్తిత్వం శాసనాలకు చేసే వ్యాఖ్యానాలలో బహిర్గత మవుతుంటుంది. క్రొత్తగా సామాజిక, ఆర్థిక సమస్యలు ఉత్పన్నమైనప్పుడు న్యాయమూర్తులు శాసనాల వ్యాఖ్యానంలో కొంతసరళత్వాన్ని ప్రదర్శించవలసియుంటుంది. శాసన వ్యాఖ్యానాలపట్ల న్యాయమూర్తులు దృఢవైఖరి అనుసరించినట్లైతే క్రొత్తగా ఆవిర్భవించిన సామాజిక శక్తులు నిరాశచెంది, సామాజిక న్యాయం పొందటానికి క్రొత్త మార్గాలను అన్వేషిస్తాయి. కాబట్టి న్యాయమూర్తులు మారుతున్న సామాజిక ఆశయాలకు అనుగుణంగా శాసనాలను వ్యాఖ్యానించటానికి నూతన పంథాలను అవలంభించాల్సి ఉంటుంది. న్యాయమూర్తులు కేవలం సాంకేతిక పరమైన వ్యాఖ్యానాలనే చేపట్టరాదు. మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణమైన విశాల దృక్పథంతో వ్యాఖ్యానాలు చేయాలి. సామాజిక, ఆర్థిక సమస్యలపట్ల అనుసరిస్తున్న సంకుచిత దృక్పధంవలన ఇటీవలి కాలంలో న్యాయశాఖ తీవ్ర విమర్శలకు గురౌతున్నది. వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు న్యాయశాఖ పరిరక్షకురాలన్న విషయంలో భేధాభిప్రాయాలు లేవు. అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రజలు న్యాయశాఖ సామాజిక మార్పులు తెచ్చే సాధనంగా వ్యవహరించాలని ఆశిస్తున్నారు. న్యాయశాఖ సామాజిక మార్పులకు అనుగుణమైన సరళ వైఖరిని

BRAOU

అవలంబించాల్సిందిగా ప్రజలు అభిలాషిస్తున్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకునే భారతదేశంలోని న్యాయస్థానాలు భారతరాజకీయ వ్యవస్థలో చోటు చేసికుంటున్న లంచగొండితనం, అధికార దుర్వినియోగం, రాజకీయ విలువల పతనం, సామాజిక దురలవాట్లు మొదలైన వాటిపట్ల తమ తీర్పుల ద్వారా ఈ మధ్యకాలంలో కొంత క్రియాశీలత్వాన్ని (Judicial Activism) ప్రదర్శిస్తున్నాయి.

## 24.5 న్యాయవ్యవస్థ - స్వాతంత్ర్యం

న్యాయవ్యవస్థ నిర్వహించవలసిన వివిధరకాలైన విధులను దృష్టిలో పెట్టుకొని చూస్తే, న్యాయవ్యవస్థకు స్వాతంత్ర్యం ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని చెప్పకతప్పదు. న్యాయం, ధర్మం, నిజాయితీలతో కూడుకొని ఉన్న ఒక నిష్పాక్షిక అధికార వ్యవస్థ చట్టాలను అమలు చేసినప్పుడే పౌరులకు న్యాయం చేకూరగలదు. కనుక న్యాయమూర్తులు మేధావులుగా, సమగ్రవ్యక్తిత్వం, న్యాయశాస్త్ర పరిజ్ఞానం, స్వతంత్ర నిర్ణయా సామర్థ్యంగల వ్యక్తులుగా ఉండి తీరాలి. గార్నర్ పేర్కొన్నట్లు, నిర్ణయ స్వేచ్ఛను కాపాడుకున్నప్పుడే న్యాయవ్యవస్థ లక్ష్యం అత్యుత్తమంగా నెరవేరుతుంది. స్వాతంత్ర్యం, నిష్పాక్షికత ఇవి రెండూ న్యామూర్తులకు ఉండవలసిన అత్యంత ముఖ్యలక్షణాలు. ఈ రెండూ అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. న్యాయపాలనలో న్యాయమూర్తులు స్వేచ్ఛాయుతమైన విచక్షణాధికారాన్ని ఉపయోగించవలసి యుంటుంది. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పరిరక్షించే న్యాయపాలనా సంరక్షణకు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం, నిష్పాక్షికతల సంరక్షణ ఒక ప్రాథమిక అవసరం. ఏ ప్రభుత్వ శాఖ మితిమీరి ప్రవర్తించకుండా, ఏ అత్యధిక సంఖ్యాక వర్గమూ అల్ప సంఖ్యాకుల స్వాతంత్ర్యాన్ని నాశనం చేయకుండా కనిపెట్టి చూసే బాధ్యత న్యాయస్థానాలకు అప్పగించబడి ఉన్నది. శాసనసభలు రూపొందించిన క్రమబద్ధమైన శాసనాలను న్యాయవ్యవస్థ వివరించటం, అమలు చేయటం మాత్రమేగాక శాసనసభ, కార్యనిర్వాహక వర్గాలు తమతమ అధికార పరిధులకు లోబడి ప్రవర్తిస్తున్నాయా లేదా అవి కనిపెట్టి చూడివలసి ఉంటుంది కూడ. అంతేగాక అది దేశప్రాథమిక చట్టాన్ని అంటే రాజ్యాంగాన్ని కూడ అమలు చేయవలసి ఉంటుంది. ఈ పనులు చేసేటప్పుడు న్యాయమూర్తులు మొదట న్యాయపాలనలో నిష్పాక్షిత, పవిత్రత, ధర్మం నెలకొని ఉన్నాయని ప్రజలలో నమ్మకం కలిగించవలసి యుంటుంది. న్యాయ వ్యవస్థ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించి, అది నిర్భయంగా పనిచేసేటట్లు శక్తివంతం చేయటానికి ఈ దిగువ అంశాలు ముఖ్యంగా అవసరం.

BRAOU

### 24.5.1 న్యాయమూర్తుల నియామక పద్ధతి

అత్యున్నత ప్రతిభా సామర్థ్యాల, పరిపూర్ణ వ్యక్తిత్వంగల వ్యక్తుల్నే న్యాయమూర్తులుగా నియమించటం ఎంతో ముఖ్యం. నియామకాల్లో రాజకీయ కారణాలకు ఏమాత్రం తావు ఉండకూడదు. న్యాయమూర్తులను (ఎ) శాసనసభ ద్వారా ఎన్నిక (బి) ప్రజలచేత ఎన్నిక (సి) కార్యనిర్వాహక వర్గంచే నియామకం అనే మూడు పద్ధతుల ద్వారా నియమించవచ్చు. శాసనసభ ద్వారా న్యాయమూర్తులను ఎన్నుకునే పద్ధతి అధికార పృథక్కరణ సిద్ధాంతాన్ని ఉల్లంఘిస్తున్నందు వలన, దాని మూలంగా పార్టీల అభ్యర్థులు ఎన్నికయ్యే అవకాశం ఉన్నందువలన ఈ రోజుల్లో ఆ పద్ధతిని అనుసరించటంలేదు. ఇక న్యాయమూర్తులను ప్రజలు ఎన్నుకునే పద్ధతి స్విట్జర్లాండ్‌లోని కొన్ని కాంటన్లలో, అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని కొన్ని రాష్ట్రాలలో అమలులో ఉంది. అయితే అన్నిఎంపిక పద్ధతులలోను ప్రజలే న్యాయమూర్తుల్ని ఎంపిక చేసికొనే పద్ధతి అత్యంత అధ్వాన్నమని లాస్కీ అభిప్రాయపడినాడు. అట్లా ప్రజలు ఎన్నుకొన్న న్యాయమూర్తులు నిజాయితీగా,

నిష్పాక్షికంగా, ఆత్మగౌరవంతో వ్యవహరించటం కష్టం. ప్రజల మనోద్రేకాలకు, పార్టీ ఒత్తిళ్ళకు న్యాయమూర్తులు లొంగిపోవచ్చు. అటువంటప్పుడు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం ఇంచుమించు అసాధ్యమే అవుతుంది. ఇక కార్యనిర్వాహక వర్గం నామినేషన్ ద్వారా న్యాయమూర్తులను నియమించటమే నేడు అమలులో ఉన్న అత్యంత సాధారణ నియామక పద్ధతి. హెరాల్డ్ జె లాస్కీవంటి రాజనీతి శాస్త్రజ్ఞులు ఈ పద్ధతే మంచిదని ప్రశంసించినారు. ఒకన్యాయ పదవిని అధిష్టించటానికి తగిన అర్హతలున్న వ్యక్తిని నిర్ణయించటానికి కార్యనిర్వాహక వర్గమే తగిన సాధనమని వారు అభిప్రాయపడినారు. కార్యనిర్వాహకవర్గం ఎంపిక చేసిన న్యాయమూర్తులు జనసమూహాల ప్రభావానికి, రాజకీయ ఒత్తిడులకు దూరంగా మరింత స్వతంత్రంగా ఉండే అవకాశం ఉంటుంది. వృత్తి చేసికొనే న్యాయవాదుల నుండి ఆయా న్యాయమూర్తులను ఎంపిక చేసికొనే ఆచారాన్ని అత్యధిక దేశాలలో అనుసరిస్తున్నారు. న్యాయమూర్తుల నియామక పద్ధతిని స్వయంగా భారత రాజ్యాంగంలోనే పొందుపరచినారు. దిగువ కోర్టులకు భర్తీని పోటీపరీక్షల ద్వారా చేస్తారు.

### 24.5.2 న్యాయమూర్తుల తొలగింపు

అవినీతిపరులు, అసమర్థులు అయిన న్యాయమూర్తులను తొలగించే ఏర్పాట్లు అన్నిదేశాలలోను ఉంటాయి. అయితే దుర్వినియోగానికి అవకాశం లేకుండా ఈ పద్ధతి చాలా క్లిష్టంగా యుంటుంది. న్యాయమూర్తులను ఎవరైతే నియమిస్తారో వారికే ఆ న్యాయమూర్తులను తొలగించే అధికారం ఉంటే న్యాయమూర్తుల పదవీకాలం వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి యుంటుంది. కాబట్టి న్యాయమూర్తులు నిష్పాక్షికంగా, నిర్భయంగా తమ విధులను నిర్వహించలేరు. అందువలన అటువంటి అవాంఛనీయమైన పరిస్థితిని నిరోధించటానికి, న్యాయమూర్తులను తొలగించే విధానం ఎంతో జాగ్రత్తగా యోచన జరిగిన పిదపనే నిర్ణయించాలి. అంతేగాక ఈ తొలగింపు కార్యక్రమం అనేక వ్యక్తుల, ఏజన్సీల ద్వారా జరగాలి. ఉదాహరణకు, బ్రిటన్‌లో ఎవరైనా న్యాయమూర్తి అవినీతి, నైతికపతనానికి (Turpitude) లోనయ్యాడనే ఆరోపణను పార్లమెంటు ఉభయసభలు ప్రకటించి, రాజమకుటాని (Crown) కి నివేదిస్తే అపుడా రాజమకుటం ఆ న్యాయమూర్తిని తొలగించవచ్చు. అయితే అమెరికాలో ఫెడరల్ కోర్టు న్యామూర్తులను మహాభియోగ ప్రక్రియ ద్వారా మాత్రమే తొలగింప వీలవుతుంది. భారతదేశంలో పార్లమెంటులో ప్రతిసభ మొత్తం సభ్యత్వంలో సగానికి పైగా మెజారిటితో, హాజరైన వారిలో 2/3 వంతుకు తగ్గకుండా ఎవరైనా న్యాయమూర్తిని తొలగించాలని తీర్మానం చేస్తే, అప్పుడు రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆ న్యాయమూర్తిని తొలగించటం వీలవుతుంది. ఈ తొలగింపు క్రమం చాలా జటిలంగా ఉండటం వల్ల పదవీ భద్రత ఉంటుంది. పర్యవసానంగా న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం వర్ధిల్లుతుంది.

### 24.5.3 పదవీకాలం

న్యాయవ్యవస్థకు స్వాతంత్ర్యాన్ని సమకూర్చటానికి స్థిరమైన పదవీకాలం కూడ ఎంతో ముఖ్యం. స్థిరమైన వయోపరిమితి వద్ద పదవీ విరమణను నిర్దేశించటం సామాన్యంగా యుండే పద్ధతి. స్వల్పకాలికమైన పదవీకాలం, న్యాయమూర్తులను ప్రజలే ఎన్నుకోవటం ఉంటే న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం హరించుకు పోయే ప్రమాదం ఉన్నది. అదే దీర్ఘకాలిక పదవీకాలం ఉంటే స్వాతంత్ర్యం, నిష్పక్షపాతం నిశ్చితం అవుతాయి. చట్టాలను స్థిరంగా, నిష్పక్షపాతంగా, ధర్మచింతనతో అమలు చేయాలంటే సద్వర్తన ప్రాతిపదికపై న్యాయమూర్తులు పదవీకాలన్ని స్థిరపరచటమే ఏ ప్రభుత్వానికైనా అత్యుత్తమ ఉపాయం. చట్టాల స్వభావం,

BRAOU

అవిపనిచేసే తీరుతెన్నులు గురించి సంపూర్ణ పరిజ్ఞానం అలవరచుకోవటానికి, చైతన్యవంతమైన సమాజంలోని సామాజిక, ఆర్థిక మార్పుల గురించి ఒక అవగాహనకు రావటానికి న్యాయమూర్తులకు దీర్ఘకాలిక పదవీకాలం వల్ల వీలవుతుంది.

### 24.5.4 న్యాయమూర్తుల అర్హతలు

న్యాయవ్యవస్థ స్వతంత్రతను న్యాయమూర్తుల అర్హతలు కూడ ప్రభావితం చేస్తాయి. న్యాయమూర్తులుగా నియమితులయ్యే వ్యక్తులు తమవృత్తిలో నిపుణులు, ప్రతిభావంతులు, ఆరితేరిన న్యాయకోవిదులుగా ఉండాలి. అసమర్థుడైన న్యాయమూర్తి మొత్తం న్యాయవ్యవస్థకే మచ్చతేగలడు. అలాగే నిష్పక్షపాత, స్వతంత్ర ఆలోచనా పరుడనే ప్రతీతి కూడ న్యాయమూర్తికి ఎంతో ముఖ్యం. అతడు ఉద్దేశపూరితంగా రాజకీయాలకు దూరంగా ఉంటుండాలి. న్యాయవాదులు తమ జీవితమంతా న్యాయవాద వృత్తిలోనే గడుపుతూండడంవల్ల, చట్టాలను వివరించటంలో జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సంతరించుకోవటంవల్ల పై గుణాలలో అత్యధికం వారికే ఉంటాయి. యోగ్యతగల న్యాయమూర్తులు సామాన్య ప్రజానీకంలో విశ్వాసం కలిగించగలరు.

### 24.5.5 వేతనం, ఉద్యోగ పరిస్థితులు

స్థిరమైన, ఆకర్షణీయమైన, తగినంత వేతనం ఉంటే అది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి ఎంతో దోహదం చేయగలదు. వేతనం తగినంతగా ఉంటే న్యాయనిర్ణయాలు చేయటంలో న్యాయమూర్తి ధైర్యసాహసాలను, దృఢత్వాన్ని ప్రదర్శించగలగుతాడు. న్యాయమూర్తి హోదాకు తగ్గట్లుగా వేతనం ఉండాలి. తక్కువ వేతనాలు పొందే న్యాయమూర్తులు అవినీతికి లోనుకావటం తేలిక. న్యాయమూర్తులు పదవిలో ఉన్నకాలంలో వారి వేతనాలు, ఉద్యోగ పరిస్థితుల్ని వారికి ప్రతికూలంగా మార్చకూడదు. భారతదేశంలో న్యాయమూర్తుల వేతనాలను రాజ్యాంగంతోనే నిర్దేశించారు. వేతనాలుగాక, ఉద్యోగ పరిస్థితులు కూడ మెరుగ్గా ఉంటే అదికూడ న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి దోహదం చేస్తుంది. కార్యనిర్వాహక వర్గం చంచల స్వభావానికి, న్యాయమూర్తుల పదవీ నియామకాలు, బదిలీలు లోనుకాకూడదు. పదవీ విరమణ తరువాత మొత్తం ఫింఛనుకు, ఆకర్షణీయమైన మొత్తాలల్లో వివిధ భృతులకు (Allowances) ఇతర సాంఘిక భద్రతా పథకాలకు సంబంధించి నిర్దుష్టమైన నిబంధనలుండాలి. అప్పుడు న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం మరింతగా నిశ్చితమవుతుంది.

### 24.5.6 న్యాయవిధులను వేరుచేయటం

ఈపైన పేర్కొన్న చర్యలతోబాటు, న్యాయవ్యవస్థ స్వాంత్ర్యాన్ని పరిరక్షించటానికి న్యాయశాఖను మిగిలిన కార్యనిర్వాహక, శాసననిర్మాణాంగాల నుండి వేరుచేయవలెను. ముఖ్యంగా న్యాయశాఖను కార్యనిర్వాహక వర్గం నుండి వేరేచేయటం న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యానికి ఎంతో ముఖ్యం. న్యాయవిధుల్ని, కార్యనిర్వాహక విధుల్ని కలిపితే న్యాయపాలనే అసాధ్యమవుతుంది. అభియోగకర్త (Prosecutor) న్యాయమూర్తిస్థానాన్ని అధిష్ఠిస్తే అప్పుడా న్యాయాధికారం దుర్వినియోగంకావటం తప్పనిసరి. అందుకే న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని, నిష్పాక్షికతను కాపాడటానికి భారతరాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశిక సూత్రాలు న్యాయవ్యవస్థను, కార్యనిర్వాహక వర్గాన్ని వేరుచేసి ఉంచాలని స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి.

## 24.6 న్యాయశాఖ - కార్యనిర్వాహక వర్గం

న్యాయశాఖ, కార్యనిర్వాహక వర్గం ప్రభుత్వానికి చెందిన రెండు అంగాలు. కాని నిర్వర్తించే విధుల స్వభావాలలో తేడాలున్నాయి. అవిప్రభుత్వంలో అంతర్భాగాలైనందువలన వాటి మధ్య చాలా దగ్గరి సంబంధాలున్నాయి. న్యాయస్థానాల తీర్పులు, కార్యనిర్వహక వర్గం సహకారంతో అమలు చేయబడతాయి. న్యాయస్థానాల తీర్పులను అమలు చేయటానికి కార్యనిర్వహకవర్గం తిరస్కరించటం కోర్టుధిక్కార నేరంగా పరిగణించబడుతుంది. కోర్టుధిక్కారణ శిక్షార్హమైన నేరం. అటువంటి కేసులలో తీర్పులను అమలు చేయటానికి నిరాకరించిన కార్యనిర్వాహకవర్గం అధికారులపై న్యాయస్థానాలు చర్య తీసుకుంటాయి.

కార్యనిర్వాహకవర్గం న్యాయమూర్తులను నియమిస్తుంది. ఒకసారి నియామకం జరిగిన తరువాత న్యాయమూర్తులపై కార్యనిర్వాహక వర్గానికి ఎటువంటి నియంత్రణ యుండదు. క్రింది న్యాయస్థానాల న్యాయమూర్తులను ఆయా ఉన్నత న్యాయస్థానాల ఆజ్ఞల మేరకు పదవినుండి తొలగించవచ్చు. ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులను శాసనవర్గపు మహాభియోగం ప్రక్రియ ద్వారా మాత్రమే తొలగించవీలున్నది. న్యాయమూర్తులను కార్యనిర్వాహకవర్గం నియమిస్తుంది. కాబట్టి న్యాయశాఖ నిర్మాణం విషయంలో అధికారంలో యున్న పాలకపార్టీ ప్రభావం కొంతవరకు ఉండవచ్చు. భారతదేశంలో ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలను స్థిరపరచటంలో ప్రభుత్వం అవలంబించిన విధానాన్ని న్యాయస్థాన వ్యవహారాలలో జోక్యం కల్పించుకోవటంగా విమర్శలు వచ్చాయి. కార్యనిర్వహక వర్గం చేబట్టిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల బదిలీలు కూడ న్యాయస్థానాలను ప్రభావితం చేయటానికి ఉద్దేశింపబడినవిగా భావించబడినాయి. అదేవిధంగా మనదేశంలో తరచుగా ప్రస్తావించబడుతున్న నిబద్ధ న్యాయశాఖ (Committed Judiciary) భావన న్యాయశాఖ స్వతంత్రతను హరించే ప్రయత్నంగా విమర్శలకు గురి అవుతున్నది. న్యాయమూర్తుల ఖాళీలను నింపటంలో కార్యనిర్వాహక వర్గం చేస్తున్న కాలయాపనను కూడ న్యాయశాఖ స్వాతంత్ర్యాన్ని భంగపరచటానికి ,చేసే నిగూఢమైన చర్యగా భావించటం జరుగుతుంది. ఏమైనప్పటికి, ఈనాటికి కూడ కొన్ని న్యాయ సంబంధమైన విధులను కార్యనిర్వాహక వర్గమే నిర్వర్తిస్తున్నది. నేరస్థులకు క్షమాభిక్ష, శిక్ష వాయిదా, లేక రద్దు మొదలైన చర్యలను సర్వసాధారణంగా రాజ్యాధిపతియే నిర్వహిస్తుంటాడు. సైనిక న్యాయస్థానాల కార్యకలాపాలు, పరిపాలనా న్యాయం అమలు మొదలైన విషయాలను కార్యనిర్వాహక వర్గమే పర్యవేక్షిస్తుంది. న్యాయశాఖ కూడ కొన్ని కార్యనిర్వహక విధులను నిర్వర్తిస్తుంది. చాలాదేశాలలో కార్యనిర్వహక వర్గం న్యాయశాఖ పరిధికి లోబడి యుంటుంది. కాని సాధరణంగా రాజ్యాధిపతి న్యాయశాఖ పరిధినుండి మినహాయింపు కలగి ఉంటాడు. కార్యనిర్వాహకవర్గం తన అధికారాలను అధిగమించినపుడు న్యాయశాఖ వాటిని అధిగమించిన మేరకు రద్దుచేసే అధికారాన్ని కలిగి ఉంటుంది. న్యాయస్థానాల పాలనా కార్యనిర్వహణ విషయంలోను, గార్డియన్లు, ట్రస్టీల నియామకాల్లోను, అధికారిక రిసీవర్లను ఏర్పాటు చేయటంలోను న్యాయస్థానాలు కార్యనిర్వాహక విధులను నిర్వహిస్తుంటాయి.

## 24.7 న్యాయశాఖ - శాసనసభ

న్యాయశాఖ - కార్యనిర్వాహక వర్గంల మధ్యవలెనే, న్యాయశాఖ-శాసనసభల మధ్య కూడ సాన్నిహిత్యమనేది నెలకొని యుంటుంది. శాసనసభ - న్యాయశాఖల మధ్యనున్న సంబంధ మెటువంటిదంటే



BRAOU

శాసనాలకు ఒకరు రూపొందిస్తే, వాటికి వ్యాఖ్యానాలను మరొకరు చేయటమే. న్యాయశాఖ నిర్వహణకు అవసరమైన విధులను శాసనసభ మంజూరు చేస్తుంది. ఇండియా, అమెరికా వంటి దేశాలలో న్యాయమూర్తుల సంఖ్యను, వారి జీతభత్యాలను నిర్ణయించే అధికారం శాసనసభల కివ్వబడింది. క్రొత్తన్యాయ స్థానాలను నెలకొల్పే అధికారం కూడ శాసనసభలకుంది. చాలా దేశాలలో శాసనసభకు చెందిన ఎగువసభ అత్యున్నత న్యాయస్థానంగాను, అత్యున్నత విచారణ సంస్థగాను వ్యవహరిస్తుంది. ఉదాహరణకు, బ్రిటన్‌లో ప్రభువుల సభ అత్యున్నత న్యాయస్థానంగా పరిగణించబడుతున్నది. అమెరికాలో అమెరికా అధ్యక్షుడు, ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులను అభిసంశన చేయటానికి సెనేటు అభిసంశన న్యాయస్థానంగా వ్యవహరిస్తుంది. అంతేగాక కొన్ని సమయాలలో శాసనసభ న్యాయవిధులను నిర్వహిస్తున్నట్లుగా, న్యాయశాఖకూడ కొన్ని శాసన నిర్మాణ విధులను నిర్వహిస్తుంటుంది. లిఖిత రాజ్యాంగం అమలులో యున్న దేశాలలో రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే అధికారం న్యాయశాఖకు యివ్వబడుతున్నది. అటువంటి దేశాలలో శాసనసభ రూపొందించిన శాసనాలు, రాజ్యాంగానికి వ్యతిరేకంగా యుంటే అటువంటి శాసనాలను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే హక్కు న్యాయస్థానాలకు ఇవ్వబడింది. యిక న్యాయమూర్తుల శాసనాల (Judge made Laws) కు సంబంధించి, న్యాయమూర్తులు శాసనాలకు వ్యాఖ్యానాలు చేయటమేగాక, కొన్ని సమయాలలో నూతన శాసన సూత్రాలను కూడ రూపొందిస్తారు. ఇటీవలికాలంలో భారతదేశ న్యాయవ్యవస్థపై శాసనవర్గంలో తీవ్ర విమర్శలు చేయబడినాయి. పార్లమెంటు అధికారాలకు పరిమితి విధిస్తూ ఇవ్వబడిన ప్రఖ్యాత గోలక్‌నాథ్ కేసును పురస్కరించుకొని పార్లమెంటు సభ్యులు సుప్రీంకోర్టును తీవ్రంగా విమర్శించినారు. శాసనవర్గం, న్యాయవ్యవస్థ రెండూ రాజ్యాంగం నుండే తమ అధికారాలను పొందుతాయి. అందువలన రెండింటి మధ్య వివాదాలకు స్థానం ఉండరాదు. ఈ రెండు అంగాలు రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆశయాలను, సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించవలెను. ఈ లక్ష్యాలను సాధించటానికి రెండు అంగాలు ఒకదానిని మరొకటి అర్థం చేసుకొంటూ సమన్వయంతో కృషి చేయవలసి యుంటుంది. శాసనవర్గం, న్యాయవర్గం రెండూ రాజ్యాంగపు తత్త్వ విచారానికి కట్టుబడి ఉండాలి.

## 24.8 న్యాయ సమీక్ష

న్యాయసమీక్ష అనేది కొన్ని సమాఖ్య రాజ్యాలలో న్యాయవ్యవస్థ కలిగియున్న అత్యున్నతాధికారం. ఏశాసనమైనా, కార్యనిర్వహక ఆజ్ఞ లేక ఇతర అధికారిక చర్య అయినా ఆరాజ్యంలో అమలులో ఉన్న లిఖిత రాజ్యాంగానికి విరుద్ధంగా యుంటే అటువంటి శాసనాన్ని లేదా చర్యను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే న్యాయశాఖ అధికారాన్నే న్యాయసమీక్ష అని అంటారు. ఈ న్యాయ సమీక్ష అధికారం అనేది మొట్టమొదటి సారిగా అమెరికాలో 1803లో సుప్రసిద్ధమైన మార్బరీ వెర్సస్ మాడిసన్ కేసులో ఆవిర్భవించింది. ఈ కేసులో తీర్పునిస్తూ శాసనాల్ని వివరించి చెప్పే అధికారం న్యాయవ్యవస్థదనీ,' రాజ్యాంగ నిబంధనలను అతిక్రమిస్తున్నదని భావించే ఏ చట్టాన్నైనా న్యాయవ్యవస్థ అమలు కానీయరాదని ప్రధాన న్యాయమూర్తి జాన్‌మార్షల్ స్పష్టంగా ప్రకటించినాడు. జాన్‌మార్షల్ ప్రకటించిన ఈ న్యాయభావనే న్యాయ సమీక్ష సిద్ధాంతానికి మూలాధారం అయింది. న్యాయసమీక్షాధికారం వలన న్యాయస్థానాలు శాసననిర్మాణ, కార్యనిర్వహక అంగాల చర్యల్ని సమీక్షిస్తు అవి రాజ్యాంగ పరిధిలో వ్యవహరించేటట్లు చేయగలగుతాయి. అయితే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తునే న్యాయ వ్యవస్థ అదే సమయంలో ప్రజోపయోగ లక్ష్యాన్ని, సామాజిక ప్రయోజనాన్ని, వ్యక్తిగత సామాజిక వికాసాన్ని విస్మరించకుండా ఉండాలి. న్యాయస్థానాలు ధైర్యంగా చొరవ

BRAOU

తీసికొని ప్రాథమిక శాసనాన్ని మలచటంపై క్రియాశీల న్యాయమూర్తిత్వం (Judicial Activism) విశ్వసిస్తుంది. అట్లాగే దేశంలోని నైతిక విలువలను, ఆదర్శాల్ని స్పష్టపరచే నైతిక నాయకత్వాన్ని కూడ క్రియాశీల న్యాయమూర్తిత్వం సమకూర్చుతుంది. అంతేగాక లిఖిత రాజ్యాంగంలో, సహజ న్యాయంలో వివరించబడిన హక్కుల్ని, న్యాయాన్ని జనప్రియ కార్యకలాపాలు (Popular Action) అతిక్రమించకుండా కూడ క్రియాశీల న్యాయమూర్తిత్వం పరిరక్షిస్తుంది.

ఈ సందర్భంలో న్యాయ సమీక్షాధికారం ఏక కేంద్ర రాజ్యాలలో అమలులో యుండదని గ్రహించవలె. ఉదాహరణకు పార్లమెంటరీ అత్యున్నతాధికారం నెలకొనియున్న బ్రిటన్‌లో న్యాయశాఖకు ఈ న్యాయ సమీక్షాధికారం లేదు. అందువలన న్యాయ వ్యవస్థ శాసనాలను వ్యాఖ్యానించగలదే కాని పార్లమెంటు చేసిన శాసనాల రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించలేదు. అదేవిధంగా సమాఖ్యరాజ్యవ్యవస్థను కలిగియున్న స్విట్జర్లాండ్‌లో కూడ న్యాయవ్యవస్థకు ఈరకమైన అధికారం యివ్వబడలేదు. అచట రాజ్యాంగానికి సంబంధించిన అన్ని విషయాలను సమాఖ్య శాసనసభే (Federal Assembly) పరిశీలిస్తుంది. అంతేగాక ప్రభుత్వ పరిపాలనలోను, నిర్వహణలోను ప్రజలే ప్రత్యక్షంగా - ప్రజాభిప్రాయసేకరణ, ప్రజాభిప్రాయ నివేదన వంటి వివిధ ప్రత్యక్ష ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా - పాల్గొంటారు. అమెరికా రాజ్యాంగం కూడ న్యాయశాఖకు ఈ అధికారాన్ని ప్రసాదించలేదు. కాని మార్బరీ వెర్సస్ మాడిసన్ కేసు ద్వారా ప్రధానన్యాయమూర్తి మార్షల్ న్యాయస్థానాలకు ఈ అధికారం స్వాభావికంగా యుంటుందని, తద్వారా కాంగ్రెసు రూపొందించిన శాసనాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా యుంటే వాటిని చెల్లుబాటుకావని ప్రకటించే అధికారం న్యాయశాఖకుందని స్పష్టం చేసినాడు. అప్పటినుండి అమెరికాలో న్యాయమూర్తులు అదేవిధానాన్ని అనుసరిస్తూ అలవాటుపడినారు. ఈ అధికారాన్ని ఆధారంగా చేసికొనే వారు సమాఖ్య, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు, అధికారిక ఆజ్ఞల రాజ్యాంగ బద్ధతను నిర్ణయించి, ప్రకటిస్తున్నారు.

భారతదేశంలో కూడ సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని కలిగియున్నది. న్యాయమూర్తులు తమ పదవీ స్వీకార సమయంలోనే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని, కొనసాగిస్తామని, కాపాడుతామని ప్రమాణం చేస్తారు. దానికి అనుగుణంగా వారు వివిధ శాసనాల రాజ్యాంగ బద్ధతను నిర్ణయించటంలో జాగరూకతతో వ్యవహరిస్తారు. ఈ అధికారం ఆధారంగానే సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు భిన్నంగా రూపొందించిన అనేక శాసనాలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి, వాటి అమలును నిలుపుజేసింది. భూ సంస్కరణలు, పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టాలు, ముఖ్యమైన పరిశ్రమల జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ నిర్మూలన, రాజభరణాల రద్దువంటి విషయాలలో అది అనేక చారిత్రాత్మకమైన తీర్పులను వెలువరించింది. దాని ఫలితంగా ప్రభుత్వం ఆ తీర్పులను అధిగమించటానికి రాజ్యాంగ సవరణలు చేపట్టవలసి వచ్చింది. ఏమైనప్పటికి అమెరికా ఫెడరల్ కోర్టుతో పోల్చినపుడు, ఇండియాలోని సుప్రీం కోర్టుకు న్యాయ సమీక్షకు సంబంధించి పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయని చెప్పకతప్పదు. ఇండియాలో అది, రాజ్యాంగ ప్రకరణాలను అనుసరించి మాత్రమే శాసనాలను వ్యాఖ్యానించటం లేదా తీర్పులనివ్వటం చేయగలదు.

విమర్శ : న్యాయసమీక్ష సిద్ధాంతం అనేక విమర్శలకు లోనైనది.

1. అది న్యాయశాఖను 'అత్యున్నత శాసనసభ' (Super Legislative) గా హోదాను పెంచుతుంది. కారల్ ఫ్రెడరిక్ అభిప్రాయంలో న్యాయసమీక్ష ప్రజాప్రతినిధుల తీర్పును న్యాయమూర్తుల తీర్పుతో భర్తీ

చేస్తుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, న్యాయసమీక్ష బహుళ ప్రాచుర్యాన్ని పొందిన అమెరికాలో ప్రభుత్వ శాసనాలకు వ్యతిరేకంగా న్యాయవ్యవస్థ యిచ్చిన తీర్పులు చాలవరకు ఒక (న్యాయమూర్తి) ఓటు మెజారిటితోయిచ్చినవే. అదే సమయంలో ఈవిధంగా ప్రక్కన పెట్టబడిన శాసనాలు ఎన్నికైన ప్రజాప్రతినిధులు అత్యధిక మెజారిటితో ఆమోదించినవి.

2. హెరాల్డ్ జె. లాస్కీ అభిప్రాయంలో న్యాయ దృక్పథం యొక్క ఒక ముఖ్యలక్షణం సాంప్రదాయకత్వం. అందువలన న్యాయసమీక్ష అభ్యుదయకరమైన సామాజిక శాసనాల రూపకల్పనకు అడ్డుగోడగా నిలుస్తుంది.

3. న్యాయసమీక్ష వాస్తవంలో కార్యనిర్వాహకశాఖ, శాసన నిర్మాణశాఖలు మరియు న్యాయశాఖ మధ్య విభేదాలకు, తగాదాలకు దారితీస్తుంది.

4. న్యాయ సమీక్ష న్యాయస్థానాలకున్న సాంప్రదాయక వైఖరివలన సంకుచిత ప్రయోజనాలకు ఒక అనువైన మరియు సమర్థవంతమైన సాధనంగా మారిపోతుంది.

న్యాయ సమీక్షకు సంబంధించి ఇన్ని లోపాలు ఉన్నప్పటికి ఆచరణలో దానివలన కొన్ని ప్రయోజనాలున్నాయని చెప్పకతప్పదు. లిఖిత రాజ్యాంగం అమలులో యున్న రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాంగాలు రాజ్యాంగం నుండే అధికారాలను సంతరించుకుంటాయి. కాబట్టి రాజ్యాంగం నిర్దేశించిన పరిధిలో ఆయా ప్రభుత్వాంగాలు వ్యవహరించేటట్లు చూడటానికి ఒకమధ్యవర్తి (arbiter) ఉండవలె. అందువలన న్యాయ సమీక్షాధికారం కలిగిన న్యాయస్థానాలు వివిధాంగాల మధ్య సమతూకం నెలకొల్పే చట్రంగా ఉపయోగపడతాయి. అంతేగాక ప్రజాస్వామిక ప్రభుత్వ వ్యవస్థను పరిరక్షించటానికి న్యాయసమీక్ష న్యాయమూర్తుల చేతిలో ఒక సమర్థవంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. కార్యనిర్వాహకవర్గం, శాసన నిర్మాణ సభలు తమ అధికార పరిధిని అతిక్రమించి, నియంతృత్వ అధికారాలను సంతరించుకోకుండా యుండటానికి, తద్వారా పౌరహక్కులను స్వేచ్ఛలను భంగపరచకుండా సంరక్షించటానికి ఇది ఉపయోగపడు తుంది. ఈ కారణంగానే ప్రతి ప్రజాస్వామిక రాజ్యవ్యవస్థ న్యాయ సమీక్షాధికారాన్ని ఆయారాజ్యాంగాలలో పొందపరచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా యున్నదని చెప్పవచ్చు.

BRAOU

## 24.9 క్లుప్తంగా

ప్రభుత్వం మూడవ ప్రధాన అంగం న్యాయశాఖ. అది శాసనాలను వ్యాఖ్యానిస్తూ, నివేదించిన కేసులలో వాటిని అన్వయిస్తూ వివరణలను యిస్తూ ఉంటుంది. సమాజంలోని ప్రజల హక్కులను అది పరిరక్షిస్తుంది. సమాజంలోని ఇతరవ్యక్తులు, ప్రభుత్వము తన పరిధిని అతిక్రమించకుండా చూస్తూ వ్యక్తుల హక్కులను కాపాడుతుంది. ఆవిధంగా పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు శ్రేయస్సు ఆరాజ్యానికి చెందిన న్యాయవ్యవస్థ మీద ఆధారపడి ఉంటాయి.

న్యాయపాలనను నిర్వహించటం న్యాయశాఖ ముఖ్యవిధి. ప్రజాస్వామిక రాజ్యాలలో న్యాయశాఖ రాజ్యం యొక్క ఒక స్వతంత్ర వ్యవస్థగా పరిగణింపబడుతూ, అనేక ఇతర విధులను నిర్వహిస్తూయుంటుంది. శాసనాలకు వ్యాఖానం చేయటం, పౌరహక్కుల పరిరక్షణ, రాజ్యాంగ పవిత్రతను కాపాడటం, సమాఖ్య

వ్యవస్థలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించటం, ప్రధాన కార్యనిర్వాహకుడికి క్లిష్టసమస్యలకు సంబంధించి అవసరమైన సలహా సంప్రదింపులను అందివ్వటం, న్యాయమూర్తుల తీర్పులను భద్రపరచటం మొదలైనవి న్యాయశాఖ నిర్వహించు ముఖ్యమైన విధులు. న్యాయవ్యవస్థ నిర్వహించవలసిన విభిన్నమైన విధులను దృష్టిలో పెట్టుకొని చూస్తే న్యాయవ్యవస్థకు స్వాతంత్ర్యం ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని చెప్పకతప్పదు. న్యాయపాలనలో న్యాయమూర్తులు స్వేచ్ఛాయుతమైన విచక్షణాధికారాన్ని ఉపయోగించవలసి యుంటుంది. కాబట్టి న్యాయమూర్తుల స్వేచ్ఛను పరిరక్షిస్తే తప్పవారు ప్రభుత్వ నిరంకుశత్వానికి అడ్డుకట్ట వేయటం, రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మితిని, ప్రజల హక్కులను పరిరక్షించటం సాధ్యంకాదు. న్యాయవ్యవస్థ మరియు న్యాయమూర్తుల స్వాతంత్ర్యాన్ని పరిరక్షించి, వారు నిర్భయంగా పనిచేసేటట్లు వారిని శక్తివంతం చేయటానికి వారికి కొన్ని రక్షణలు కల్పించవలెను. స్థిరమైన పదవీకాలాన్ని న్యాయమూర్తులకు కల్పించటం, వారిని తొలగించే ప్రక్రియను క్లిష్టంగాను, జటిలంగాను రూపొందించటం, ఆకర్షణీయమైన జీతభత్యాలను నిర్ణయించటం, న్యాయశాఖను మిగిలిన కార్యనిర్వాహకవర్గం, శాసనసభలనుండి వేరుపరచటం వంటి రక్షణలను రాజ్యాంగంలో పొందుపరచటం ద్వారా ఈనాటి ప్రజాస్వామిక రాజ్యవ్యవస్థలు న్యాయమూర్తులు స్వతంత్రంగా వ్యవహరించేటట్లు చర్యలు తీసికొంటున్నాయి.

శ్రేయోరాజ్యంలో న్యాయశాఖకు ఒక ముఖ్యమైన పాత్ర ఉంది. సామాజిక, ఆర్థిక, రాజకీయపరమైన అసమానతలను తొలగించి, సామాజిక న్యాయాన్ని చేకూర్చటానికి అనువైన పరిస్థితులను కల్పించటం శ్రేయోరాజ్యం యొక్క ముఖ్యవిధి. ఈరకమైన శ్రేయోరాజ్య భావన కార్యనిర్వాహకవర్గం, శాసననిర్మాణశాఖల యొక్క అధికారాలను, విధులను అపరిమితంగా పెంచివేసింది. కాబట్టి కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణశాఖల అధికారాలను అదుపుచేసి, ప్రజలహక్కులను పరిరక్షించటానికి, అవి రెండూ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించేటట్లు చూడటానికి ఒక స్వతంత్రమైన, నిష్పాక్షికంగా వ్యవహరించే న్యాయవ్యవస్థ చాలా అవసరము. న్యాయవ్యవస్థ న్యాయ సమీక్షాధికారం ద్వారా కార్యనిర్వాహక శాఖ, శాసనసభ రాజ్యాంగబద్ధంగా వ్యవరించేటట్లు చూస్తుంది. ఈ అధికారాన్ని ఉపయోగించి న్యాయశాఖ, రాజ్యాంగానికి భిన్నంగా శాసనసభ రూపొందించిన శాసనాలను రాజ్యాంగ విరుద్ధమని, తద్వారా అవి చెల్లుబాటుకావని ప్రకటిస్తుంది. ఈ న్యాయ సమీక్షాధికారం కొన్ని విమర్శలకు లోనైనప్పటికి, ఈనాటి సమాజంలో న్యాయశాఖ నిశ్చియాత్మకమైన, వ్యతిరేకాత్మకమైన పాత్రను నిర్వహించాల్సి ఉంది. రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను నిరోధిస్తూ, ప్రగతిశీల దృక్పథంతో రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించటం ద్వారా న్యాయశాఖ న్యాయమైన సామాజిక వ్యవస్థ ఏర్పాటుకు ఎంతో సహాయకారిగా ఉండగలదు.

## 24.10 చదువదగిన పుస్తకాలు


K.R. Acharya (Ed.) : A Text Book of Political Science

Amal Ray & Mohit Bhattacharaya : Political Theory

J.C. Johari : Camparative Politics


BRAOU

## 24.11 నమూనా ప్రశ్నలు

**I. ఒక్కొక్క ప్రశ్నకు 30 పంక్తులలో జవాబులిమ్ము.**

1. ఆధునిక రాజ్యంలో న్యాయశాఖ పాత్రను, విధులను సంక్షిప్తంగా చర్చించుము ?

2. ఆధునిక శ్రేయో రాజ్యంలో న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని ఏవిధంగా సాధించవచ్చును ?

3. ఆధునిక శ్రేయో రాజ్యాలలో న్యాయసమీక్ష అర్థాన్ని, ప్రాముఖ్యాన్ని గురించి విమర్శనాత్మకంగా పరిశీలించుము.

**II. ఒక్కొక్క ప్రశ్నకు 15 పంక్తులలో జవాబులిమ్ము.**

1. న్యాయశాఖ వ్యవస్థీకరణను గురించి క్లుప్తంగా వివరించుము

2. న్యాయవ్యవస్థకు స్వాతంత్ర్యం అవసరం ఏమిటో వివరించండి

3. న్యాయశాఖకు - కార్యనిర్వాహక వర్గానికి మధ్యనున్న సంబంధాలను విమర్శనాత్మకంగా వివరించుము

4. సమాఖ్య రాజ్యాంగానికి సంరక్షకురాలిగా న్యాయశాఖపాత్రను వివరించుము

5. ఇండియాలో న్యాయశాఖపాత్రను గురించి క్లుప్తంగా వివరించుము.

**రచయిత : డా॥ ఐ. దోసగిరిరావు**

B R A O U

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగము

## UNDER GRADUATE PROGRAMME

## రాజనీతి శాస్త్రం

## 1. రాజనీతి సిద్ధాంతం - భావాలు

## బి.ఎ., ద్వితీయ సంవత్సర పాఠ్యప్రణాళిక

**ఖండం I మౌళికాంశాలు**

భాగం-1 రాజనీతి శాస్త్రం - నిర్వచనం పరిధి

భాగం-2 రాజనీతి అధ్యయనం దృక్పథాలు - సాంప్రదాయ - ఆధునిక దృక్పథాలు

**ఖండం II రాజ్యం మరియు సమాజం**

భాగం-3 సమాజం మరియు రాజ్యం

భాగం-4 సార్వభౌమాధికారం-రాజ్యలక్షణం-సార్వభౌమాధికారానికి సవాళ్ళు - ఏకత్వ, బహుత్వవాద సిద్ధాంతాలు

భాగం-5 రాజ్యావతరణ సిద్ధాంతాలు - చారిత్రక, దైవదత్తాధికార, బలప్రయోగ, మాతృస్వామిక, పితృస్వామిక సిద్ధాంతాలు

భాగం-6 రాజ్యావతరణ సిద్ధాంతాలు - సామాజిక ఒడంబడిక సిద్ధాంతం

భాగం-7 రాజ్యావతరణ సిద్ధాంతాలు - భారతీయ సిద్ధాంతాలు

భాగం-8 రాజ్యవిధుల సిద్ధాంతాలు

**ఖండం III ప్రాథమిక భావాలు**

భాగం-9 శాశనం

భాగం-10 స్వేచ్ఛ మరియు సమానత్వం

భాగం-11 వ్యక్తి శ్రేయోవాదుల, అధికారవాదుల, సామ్యవాదుల మరియు ఉదారవాదుల దృష్టిలో స్వేచ్ఛ

భాగం-12 వ్యక్తి హక్కుల సిద్ధాంతాలు మరియు హక్కుల రకాలు

BRAOU

**ఖండం IV ప్రభుత్వ రకాలు**

భాగం-13 రాజ్యాంగాలు-రకాలు-సవరణ పద్ధతులు

భాగం-14 ప్రభుత్వ రకాలు - రాజరిక, కులీన, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు

భాగం-15 ఆధునిక ప్రభుత్వ రకాలు - సంపూర్ణ అధికారవాదం

భాగం-16 ఆధునిక ప్రభుత్వరూపాలు - ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామం

భాగం-17 పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వాలు

భాగం-18 సమాఖ్య, ఏకకేంద్ర ప్రభుత్వాలు

**ఖండం V ప్రభుత్వాంగాలు**

భాగం-19 అధికార పృథక్కరణ సిద్ధాంతం

భాగం-20 శాశనసభ ప్రాతినిధ్య పద్ధతులు

భాగం-21 ఏకశాశన సభ, ద్విశాసనసభ

భాగం-22 శాసనసభ - విధులు

భాగం-23 కార్యనిర్వాహక వర్గం

భాగం-24 న్యాయశాఖ-విధులు

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగము

## SECOND YEAR (3 YEAR DEGREE COURSE) EXAMINATION

### నమూనా ప్రశ్నాపత్రం

### రాజనీతి శాస్త్రం

### రాజనీతి సిద్ధాంతం - భావాలు

Time : 3 Hours

Max. Marks 100
Min. Marks 35

**SECTION - A**

**ఈ క్రింది వాటిలో ఏవేని నాలుగు ప్రశ్నలకు 30 పంక్తులలో జవాబులు రాయండి.**

1. రాజనీతి శాస్త్ర స్వభావం, పరిధిని వివరించుము.
2. సార్వభౌమాధికారాన్ని నిర్వచించి, దాని లక్షణాలను వివరించుము.
3. రాజ్యావతరణ సిద్ధాంతాలలో వివిధ భారతీయ సిద్ధాంతాలను చర్చింపుము.
4. వివిధ రకాల హక్కుల గురించి సంక్షిప్తంగా వివరించండి.
5. చట్టం యొక్క మూలాధారాలను వివరించుము.
6. ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయుటకు కావల్సిన పరిస్థితులను వివరించుము.
7. మాంటిస్క్యూ ప్రతిపాదించిన అధికారాల విభజన సిద్ధాంత భావనను వర్ణించండి.
8. ఆధునిక రాజ్యంలో న్యాయశాఖ పాత్రను, విధులను సంక్షిప్తంగా చర్చింపుము.

**SECTION - B**

**ఈ క్రింది వాటిలో ఏవేని ఐదు ప్రశ్నలకు 15 పంక్తులలో జవాబులు రాయండి.**

1. సంక్షేమ రాజ్యం
2. జనేచ్ఛ
3. సమన్యాయపాలన
4. రాజరికం
5. దృఢరాజ్యాంగం
6. వైష్పత్తిక ప్రాతినిధ్యం
7. దత్తశాసనం
8. పరివర్తనావాదమేమి
9. కార్యనిర్వాహకవర్గం పరిపాలనా విధులు ఏమిటి ?
10. "బ్రిటన్‌లో ద్విశాసన సభావ్యవస్థ చారిత్రక యాదృచ్ఛికతా ఫలితం" వివరించుము.

B R A O U

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగము

## UNDER GRADUATE PROGRAMME

## రాజనీతి శాస్త్రం

## 1. రాజనీతి సిద్ధాంతం - భావాలు

### ASSIGNMENT - 1

1. మీ జవాబును పాఠ్యగ్రంథం నుండి కాపీ చేయవద్దు.
2. సాధ్యమైనంత వరకు మీ స్వంత వాక్యాలలోనే జవాబు రాయండి.
3. రిఫరెన్సుకోసం అవసరమైనప్పుడు ఉల్లేఖించండి.
4. మూల్యాంకన కర్తకొరకు వీలైన మార్జిన్ వదలండి.
5. అసైన్‌మెంట్‌లు రాయడం కోసం మీరు స్వంత తెల్లకాగితాలను వాడండి.
6. అసైన్‌మెంట్‌లు పూర్తికావడానికి రెండు గంటలకన్నా మించి సమయం తీసుకోరాదు.

---

**I. క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. రాజనీతి శాస్త్రమును నిర్వచింపుము మరియు దాని పరిధిని పేర్కొనుము.
2. బహుత్వ సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని వివరించండి.
3. రాజ్యావతరణ, దాని విధులు గురించి కౌటిల్యుని అభిప్రాయాలను తెలపండి.

**II. క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. రాజ్యము మరియు సమాజముల మధ్య వ్యత్యాసమును పేర్కొనుము.
2. దైవదత్తాధికార సిద్ధాంతాన్ని పరిశీలింపుము.
3. లాక్ సహజహక్కుల సిద్ధాంతం.

BRAOU

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగము

## UNDER GRADUATE PROGRAMME

## రాజనీతి శాస్త్రం

### 1. రాజనీతి సిద్ధాంతం - భావాలు

### ASSIGNMENT - 2

1. మీ జవాబును పాఠ్యగ్రంథం నుండి కాపీ చేయవద్దు.
2. సాధ్యమైనంత వరకు మీ స్వంత వాక్యాలలోనే జవాబు రాయండి.
3. రిఫరెన్సుకోసం అవసరమైనప్పుడు ఉల్లేఖించండి.
4. మూల్యాంకన కర్తకొరకు వీలైన మార్జిన్ వదలండి.
5. అసైన్‌మెంట్‌లు రాయడం కోసం మీరు స్వంత తెల్లకాగితాలను వాడండి.
6. అసైన్‌మెంట్‌లు పూర్తికావడానికి రెండు గంటలకన్నా మించి సమయం తీసుకోరాదు.

---

**I. క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. శాసనము గూర్చి గురుతర భావనలు ఏవి ? అవి శాసనాన్ని ఎలా వ్యాఖ్యానించును ?
2. లిఖిత, అలిఖిత రాజ్యాంగాల మధ్య తేడా పరిమాణానికే తప్ప, రకానికి సంబంధించినది కాదు, వివరించండి.
3. పరోక్ష ప్రజాస్వామ్య లాభనష్టాలను తెలపండి.

B R A O U

**II. క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. రాజకీయ స్వేచ్ఛ మరియు పౌరస్వేచ్ఛల మధ్య భేదమును చూపుము.
2. కులీనపాలన యొక్క ప్రయోజనాలు లోపాలు ఏవి ?
3. సంపూర్ణాధికారవాదంగా కమ్యూనిజం లక్షణాలను వివరించుము.

BRAOU

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగము

## UNDER GRADUATE PROGRAMME

## రాజనీతి శాస్త్రం

## 1. రాజనీతి సిద్ధాంతం - భావాలు

### ASSIGNMENT - 3

1. మీ జవాబును పాఠ్యగ్రంథం నుండి కాపీ చేయవద్దు.
2. సాధ్యమైనంత వరకు మీ స్వంత వాక్యాలలోనే జవాబు రాయండి.
3. రిఫరెన్సుకోసం అవసరమైనప్పుడు ఉల్లేఖించండి.
4. మూల్యాంకన కర్తకొరకు వీలైన మార్జిన్ వదలండి.
5. అసైన్‌మెంట్‌లు రాయడం కోసం మీరు స్వంత తెల్లకాగితాలను వాడండి.
6. అసైన్‌మెంట్‌లు పూర్తికావడానికి రెండు గంటలకన్నా మించి సమయం తీసుకోరాదు.

---

**I. క్రింది ప్రశ్నలకు సుమారు 30 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. పార్లమెంటరీ, అధ్యక్ష ప్రభుత్వ విధానాల సుగుణాలను, దోషాలను తెలపండి.
2. శాసనసభల అధికారాలు, విధులను వివరించుము.
3. ఆధునిక ప్రభుత్వంలో కార్యనిర్వాహకవర్గం అధికారాలు, విధుల ఏమి ?

**II. క్రింది ప్రశ్నలకు సుమారు 15 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. అధికార పృథక్కరణ సిద్ధాంతం అనగానేమి ? దాని ముఖ్యలక్షణాలను వివరించుము ?
2. "బ్రిటన్‌లో ద్విశాసన సభావ్యవస్థ చారిత్రక యాదృచ్ఛికతా ఫలితం" వివరించుము.
3. ఇండియాలో న్యాయశాఖపాత్రను గురించి క్లుప్తంగా వివరించుము.

B R A O U